
పాఠం 1


# పటాల అధ్యయనం - విశ్లేషణ



*చిత్రం 1.1 : ఆఫ్రికా, యూరప్, అమెరికాలను చూపే చిత్రం*

KXQS77

ఆరవ తరగతిలో మీరు పటాలను తయారు చేయడం నేర్చుకున్నారు, ఎత్తులు చూపించే పటాల గురించి తెలుసుకున్నారు. వివిధ ప్రదేశాలకు సంబంధించి ఎన్నో పటాలను మీరు ఇదివరకే చూసి ఉంటారు. ఒక ప్రాంతాన్ని ఆకాశం నుంచి తీసిన చిత్రానికీ, ఆ ప్రాంతం పటానికీ మధ్య తేడాలు ఏమిటో చెప్పండి. ఉదాహరణకు చిత్రం 1.1లోని చిత్రాన్ని, పటం1ని చూడండి. ఈ రెండింటి మధ్య పోలికలను, తేడాలను పేర్కొనండి.



*పటం 1 : ఆఫ్రికా, యూరప్, అమెరికాలు*

చిత్రం వలె పటం నిజమైన అంశాలను చూపించదు. ముఖ్యమని భావించే అంశాలను చూపించటానికి భౌగోళిక శాస్త్రజ్ఞులు పటాలను ఉపయోగిస్తారు. ఉదాహరణకు వాటిలో వర్షపాతం, నేల రకాలు, జనాభా, ప్రజలు మాట్లాడే భాష, పంటలు, మార్కెట్లు, పాఠశాలలు మొదలైనవి ఉండవచ్చు. చిత్రంలో కనిపించే ఇళ్లు, చెట్లు వంటి వాటిని పటాలు తయారుచేసే వాళ్లు వదిలిపెట్టవచ్చు. పటం తయారుచేసేవాళ్లు ముఖ్యమనుకునే వాటిని చూపించే నమూనాగా పటాన్ని భావించవచ్చు. ఒక ప్రాంతంలో ఎంత వర్షం పడుతుంది, ఎంత వేడిగా ఉంటుంది, అక్కడ ప్రజలు ఏ భాష మాట్లాడతారు వంటి వాటిని చిత్రం చూపించలేదు. కానీ వీటిని పటంపై చూపించవచ్చు. అందుకే వివిధ అవసరాల కోసం వివిధ రకాల పటాలు తయారుచేస్తారు. గతంలో చేసిన కొన్ని పటాలను ఇప్పుడు చూద్దాం. దేనికోసం చేశారు అన్నదాన్ని బట్టి పటాలు అనేక రకాలుగా ఎలా ఉంటాయో తెలుసుకుందాం.

## వివిధ కాలాల్లో పటాలు

పటాలకు ఎంతో చరిత్ర ఉంది. ఇప్పటికీ అందుబాటులో ఉన్న అతి పురాతనమైన పటాలు నాలుగు వేల సంవత్సరాలనాటివి. వీటిని సుమేరియన్లు (ప్రస్తుత ఇరాక్) తయారు చేశారు. వీటిని

KXH1JX



*చిత్రం : 1.2 సుమేరియన్ మట్టి పలక*

మట్టి పలకల మీద చేశారు. సుమేరియన్ల దేవాలయాలకు చాలా భూములు ఉండేవి. ఈ భూముల నుంచి వచ్చే ఆదాయ లెక్కల కోసం భూముల వివరాలను పటాల రూపంలో భద్రపరిచేవారు.

మొదట కొన్ని ప్రపంచపటాలను బాబిలోనియన్లు (ప్రస్తుత ఇరాక్ వాసులు) తయారు చేశారు. అప్పటికీ వారికి తెలిసిన ప్రపంచం అదే. 2600 సంవత్సరాల క్రితం మట్టి పలకపై గీసిన చిత్రాన్ని కింద చూడండి. ప్రపంచం గుండ్రటి పళ్లెం మాదిరి ఉందని వాళ్లు ఊహించుకున్నారు. లోపలి వలయంలో వాళ్లకు తెలిసిన అన్ని పట్టణాలు (చిన్న వలయాలు), గ్రామాలు, నదులు, చిత్తడి భూములు, కొండలు ఉన్నాయి. బాబిలోన్ పట్టణాన్ని మధ్యలో చూపారు. లోపలి వలయం బయట 'చేదు నది' లేదా ఉప్పునీటి సముద్రం ఉంది, దాంట్లో త్రికోణాకారంలో ఏడు దీవులు ఉన్నాయి.



*చిత్రం : 1.3 బాబిలోనియన్ మట్టి పలక*

అదే సమయంలో గ్రీకు భౌగోళిక శాస్త్రజ్ఞుడైన అనాక్సిమాండర్, మిలెటస్‌కు (ప్రస్తుతం టర్కీలో ఉంది) చెందిన హెకేటియస్‌లు కూడా వివిధ ప్రదేశాలను తూర్పునుంచి పడమరకు, ఉత్తరం నుంచి దక్షిణానికి చూపిస్తూ ప్రపంచ పటాలను తయారు చేశారు. బాబిలోనియన్ల వలెనే వీరు కూడా భూమి గుండ్రంగా ఉందని, దాని చుట్టూ సముద్రం ఉందని భావించారు. వీళ్లు చాలా ప్రదేశాలు ప్రయాణించి




*పటం 2 : హెకేటియస్ ఆధారంగా గీసిన ప్రపంచ పటం*

తాము చూసిన, విన్న ప్రదేశాల గురించి, ప్రజల చరిత్ర గురించి రాశారు. ఈ యాత్రలు, వివరణల ఆధారంగా వాళ్లు పటాలు తయారు చేశారు. వీళ్లు తయారు చేసిన పటాలు ఇప్పుడు అందుబాటులో లేవు. అయితే వాళ్ల వివరణల ఆధారంగా ఆ పటాలను చరిత్రకారులు తిరిగి తయారుచేశారు. ఇలాంటి ఒక పటం పైన (పటం 2) ఉంది.

ఈ పటంలో గ్రీసు మధ్యలో ఉండటం మీరు చూసి ఉంటారు. ప్రపంచాన్ని యూరపు, లిబియా, (ఆఫ్రికా), ఆసియా అని మూడు ఖండాలుగా విభజించారు. ఈ ఖండాలను మధ్యధరా సముద్రం వేరు చేస్తోంది. దగ్గర, దూర ప్రాంతాల గురించి తెలుసుకోవడం, వాటి పటాలు తయారు చేయటం పట్ల గ్రీకులు, ఆ తరవాత రోమన్లు ఆసక్తి చూపించారు. ప్రపంచాన్ని జయించాలని, దూర ప్రాంతాలలో వలసలు ఏర్పాటు చేసుకుని, వాటితో వ్యాపారం చేయాలని వాళ్లు భావించారు. 2300 సంవత్సరాల క్రితం ప్రపంచాన్ని జయించాలని భారతదేశం వరకు వచ్చిన గ్రీకు రాజు అలెగ్జాండరు గురించి మీరు వినే ఉంటారు. అదేవిధంగా రోమన్ వ్యాపారస్తులు ఓడలమీద భారత తీరాన్ని చేరుకుని వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీళ్లందరికీ పటాలు ఎంతో ఉపయోగపడ్డాయి.

నావికులకు ఉపయోగపడే పటాలు చాలా ఖచ్చితత్వాన్ని కలిగి ఉండాలి. అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా పటాలను ఖచ్చితంగా తయారు చేయటానికి గ్రీకులు ప్రయత్నించారు. ఇది ఎలా చేశారో చూద్దాం. ఒకే సమయంలో మిట్టమధ్యాహ్నం అయ్యే కొన్ని ప్రదేశాలను గుర్తించటానికి ప్రయత్నించారు. వాటిని కలుపుతూ ఉత్తరం నుంచి దక్షిణానికి ఒక గీత గీశారు. దీనిని 'మెరిడియన్' (మధ్యాహ్న రేఖ) లేదా రేఖాంశం అంటారు. మధ్యాహ్న సమయంలో సమాన పొడవు గల నీడలు ఉన్న ప్రదేశాలను కలుపుతూ అక్షాంశాలను గీయటానికి ప్రయత్నించారు. ఈ రెండు రకాల గీతలతో పటం మీద గళ్లు (గ్రిడ్) గీశారు. అన్ని ప్రదేశాలను ఈ గీతల మీద తూర్పు నుంచి పడమరకు, ఉత్తరం నుంచి దక్షిణానికి గుర్తించారు. ఈ గీతలను ఖచ్చితంగా గీయడం అంత తేలికైన పనికాదు. అక్షాంశాలు, రేఖాంశాలను సరిగా గీయడానికి 2000 సంవత్సరాలు పట్టింది. అయితే ఈ గీతల ఆధారంగా పటాల మీద ప్రదేశాలను గుర్తించటంతో యాత్రికులకు, నావికులకు తమ గమ్యస్థానాన్ని బట్టి దిశను మార్చుకుంటూ అక్కడికి చేరుకోవటం తేలిక అయ్యింది. నావికులు తాము సందర్శించిన ప్రదేశాల గురించి పటాలు తయారు చేసేవాళ్లకి చెప్పి సహకరించారు.

ప్రాచీన కాలంలో ప్రఖ్యాత భౌగోళిక శాస్త్రజ్ఞులలో ఒకరైన టాలమీ ఈ గీతలను ఉపయోగించి సవివరమైన పటాలు తయారు చేశాడు. వాటిని తయారుచేసి చాలా కాలమైనందున అవి అందుబాటులో లేవు.

అయితే ఈ పటాలు యూరపు, దాని చుట్టుపక్కల దేశాలకు సంబంధించిన వాటికి సరైన సమాచారం ఇచ్చాయని మీరు గమనించి ఉంటారు. పటం మధ్యలో సాధారణంగా గ్రీసు కానీ, రోము కానీ ఉంటాయి. వ్యాపారస్తులు, నావికులు సందర్శించిన వివిధ దేశాల తీరప్రాంతాల గురించి సరైన వివరాలనే ఈ పటాలు ఇచ్చాయి. కానీ వాటి లోపలి ప్రదేశాల గురించి అంతగా తెలియజేయలేదు. ఉదాహరణకు శ్రీలంక గురించి

నావికులకు బాగా తెలుసు కాబట్టి ఆసియా పటంలో శ్రీలంక కంటే భారతదేశం చాలా చిన్నగా చూపించారు.

పటాలు తయారు చేయటానికి అరబ్బు పండితులు, నావికులు టాలమీ పుస్తకాలను ఉపయోగించుకున్నారు. పటాలు తయారుచేసిన ప్రముఖులలో అల్ ఇద్రిసి ఒకడు. ఇతడు తన రాజు కోసం 1154లో ఒక ప్రపంచ పటం తయారు చేశాడు. ఈ పటంలో వివరాలు అరబిక్ భాషలో ఉన్నాయి. ఈ పటం యూరేసియా ఖండాన్ని పూర్తిగా చూపించింది, అయితే ఆఫ్రికా ఖండంలో ఉత్తర భాగాన్నే చూపించింది. ఆఫ్రికా దక్షిణ భాగం, ఆగ్నేయాసియా భాగాల వివరాలు చూపించలేదు.




*పటం 3 : అల్ఇద్రిసి గీసిన పటం (1154)*

ఈ పటం 3లో ఆసక్తిగొలిపే అనేక అంశాలు ఉన్నాయి. ఇది దక్షిణాన్ని పటంలో పై భాగంలోను, ఉత్తరాన్ని కింద భాగంలోనూ చూపిస్తుంది. ఇది అరేబియాను పటం మధ్యలో ప్రముఖంగా చూపించింది.

- అలా ఎందుకు ఉందో ఊహించండి. ఈ పటంలో శ్రీలంకను, భారతదేశాన్ని గుర్తించండి. (దీంట్లో కూడా శ్రీలంకను ఉన్నదానికంటే పెద్దదిగా చూపించారు.)

అదే సమయంలో చక్రవర్తులకు తమ పాలనలోని గ్రామాలు, పట్టణాల గురించి తెలుసుకోవాలని ఉండటంతో చైనాలో కూడా పటాలు తయారు చేయడం మొదలుపెట్టారు. పటం 4లో చైనాను మధ్యలో చూపించారు. యూరప్ చాలా చిన్నగా, సన్నగా పటం అంచున ఉంది. హిందూ మహాసముద్ర కోణం నుండి ఆఫ్రికాను కూడా పటంలో చూపించారు. ఆ తరవాత చాలా కాలానికి యూరోపియన్లు కనుగొన్న గుడ్‌హోప్ అగ్రాన్ని కూడా చైనీయులు చూపించారు.




*పటం 4 : చైనాకు చెందిన డామింగ్ హన్ యి తు గీసిన పటం (1389)*

1389లో చైనా చక్రవర్తి కోసం 17 చదరపు మీటర్ల పట్టు గుడ్డమీద డా మింగ్ హన్ యి తు గీసిన పటాన్ని చూడండి.

- ఈ పటంలో భారతదేశం, అరేబియా, ఆఫ్రికాలను గుర్తించండి. (పటం 4)

టాలమీ పుస్తకాలు లభించక ముందు యూరపులో పటాలు తయారు చేసేవాళ్లు. బైబిల్‌లోని మత భావనలతో బాగా ప్రభావితులయ్యారు, అందులోని భావనలకు అనుగుణంగా ప్రపంచాన్ని చిత్రీకరించారు. ఆ కాలంలో చేసిన ప్రపంచ పటాన్ని కింద చూడండి.



*పటం 5 : బైబిల్ ప్రకారం ప్రపంచం నమూనా*

ఈ పటం బైబిల్ వర్ణించే ప్రపంచానికి ఒక నమూనాలాగా ఉంది. ఇది సముద్రాలతో ఆవరించి ఉండి ఆసియా, యూరపు, ఆఫ్రికాలనే మూడు ఖండాలుగా విభజించి ఉంది. వీటిల్లో ఏసుక్రీస్తు జన్మస్థలమైన జెరూసలెం ఉన్న ఆసియా ఖండం అన్నిటికంటే పెద్దదని, ముఖ్యమైనదని భావించారు. అందుకే దానిని పైన చూపించారు. యూరపు, ఆఫ్రికా ఖండాలు చిన్నగా, కింది భాగంలో ఉన్నాయి.

1480ల ప్రాంతంలో టాలమీ పుస్తకాలను యూరోపియన్లు తిరిగి కనుగొన్నారు (కానీ అతను గీసిన పటాలు దొరకలేదు). వివిధ ప్రదేశాలను టాలమీ సరిగా గుర్తించటం చూసి వాళ్లు ఆశ్చర్యపోయారు. టాలమీ వివరణల ఆధారంగా కొత్తగా పటాలు తయారు చేశారు.



*పటం 6 : టాలమీ పుస్తకాలను చదివి గణితశాస్త్ర కొలతలకు అనుగుణంగా గీసిన పటం*


ఇంతకు ముందు చూపిన పటం మాదిరి కాకుండా దూరాలు, దిశల ఖచ్చితమైన కొలతల ఆధారంగా ఈ పటం గీశారు.

KXZN8U

15వ శతాబ్దంలో అరబ్బేతర ప్రపంచంలో కొత్త ప్రేరణలకు టాలమీ ఊపిరి ఊదాడు. ఫలితంగా ఇటాలియన్, ఫ్రెంచి, ఇంగ్లీష్, జర్మన్ వంటి సంప్రదాయాలు రూపుదిద్దుకున్నాయి. నూతన ప్రదేశాల అన్వేషణ, ఆవిష్కరణల యుగం కావడంతో పటాలు ప్రాముఖ్యతను, జనాదరణను పొందాయి. మధ్యధరా సముద్రం మీదగా భారతదేశానికి వ్యాపార మార్గాన్ని అరబ్బులు మూసివేశారు. దాంతో భారతదేశానికి సముద్ర మార్గాన్ని కనుగొనటానికి పశ్చిమ యూరపు (స్పెయిన్, పోర్చుగల్, హాలండ్, ఇంగ్లాండ్ వంటి దేశాల) వ్యాపారస్తులు బయలుదేరారు. ఆ విధంగా కొలంబస్ పశ్చిమ దిశగా ప్రయాణించి అమెరికాను కనుగొన్నాడు, ఆఫ్రికాను చుట్టుముట్టి వచ్చిన వాస్కోడిగామా భారతదేశం చేరుకున్నాడు. భూమి బల్లపరుపుగా లేదని, బంతిమాదిరి గోళమని

నిరూపించటానికి ఇవి కూడా తోడ్పడ్డాయి.

16వ శతాబ్దంలో హాలండ్ ప్రముఖ వర్తక శక్తిగా ఎదిగింది. సముద్రయానం, వ్యాపారాలలో హాలండ్ ఆధిపత్యం సాధించటంతో ఆ దేశపు పటాలు తయారు చేసేవాళ్లు తమ పనిలో గణనీయమైన ప్రగతి సాధించారు. డచ్ దేశ పటాల తయారీదారుల పితామహుడైన గెరార్డస్ మెర్కేటర్ (1512–94) గత ప్రయత్నాలను పరిశీలించి, పటాలలో మౌలిక కృషి చేశారు. పటాలను అతడు చిత్రించిన విధానం అతడి పేరుమీద 'మెర్కేటర్ ప్రక్షేపణం' అని ఖ్యాతి గాంచింది. మనం ఉపయోగిస్తున్న అనేక ప్రపంచ పటాలు దీని ఆధారంగానే రూపొందించబడ్డాయి.




*పటం 7 : గెరార్డస్ మెర్కేటర్ (16వ శతాబ్దం) గీసిన ప్రపంచ పటం*

### ప్రక్షేపణం


ప్రపంచం బంతిలాగా గుండ్రంగా ఉందని మీకు తెలుసు. అయితే దీనిని కాగితంమీద గీసేటప్పుడు ఒంపుని చూపించలేం కాబట్టి బల్లపరుపుగానే చూపించాలి. దీని వల్ల అనివార్యంగా ఖండాల రూపంలోకానీ, దూరాలలో కానీ కొన్ని వక్రీకరణలు జరుగుతాయి లేదా ప్రదేశాలు తప్పు దిశలో చూపించబడతాయి. కీలక ప్రదేశాలను గుర్తించటానికి నావికులకు సరైన ఆకారాలు, దిశలు అవసరం. ఖండాల పరిమాణం, దూరాలలో వక్రీకరణలు ఉన్నప్పటికీ ఖండాల ఆకారం, దిశలు సరిగా చూపించే విధానాన్ని మెర్కేటర్ రూపొందించాడు. ఈ పద్ధతిని మెర్కేటర్ ప్రక్షేపణం అని అంటారు. ప్రపంచాన్ని చూపించటానికి నేటికీ ఈ పద్ధతిని వాడుతున్నారు.

- ప్రాచీన కాలంలో పటాల తయారీని నావికులు ఏవిధంగా ప్రభావితం చేశారు?
- పటాలను తయారు చేసేవాళ్లు తమ దేశాన్ని పటం మధ్యలో ఎందుకు ఉంచారు?

## వలసల ఏర్పాటు, అన్వేషణలు, సైనిక వినియోగం – పటాల తయారీ

ఉత్తర, దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఆసియా వంటి ఖండాలను ఐరోపా దేశాలు తమ వలసలుగా మార్చుకోవటంతో ఆ ప్రదేశాల గురించి, అక్కడి వాతావరణం, పంటలు, ఖనిజ వనరుల గురించి, ప్రజల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వీళ్లు పటాలు తయారు చేసేవారిని బృందాలుగా వివిధ ప్రాంతాలకు పంపించి, శాస్త్రీయంగా అధ్యయనం చేయించి పటాలను తయారు చేయమని కోరారు. ఈ బృందాలు కొండలు, ఎడారులు, నదులను దాటి, స్థానిక ప్రజలను ప్రతిఘటించి దేశాల మారుమూల ప్రాంతాలకు చేరుకుని తమకు కావలసిన సమాచారాన్ని సేకరించాయి. ఈ సమాచారం, పటాల ఆధారంగా వలస పాలకులు ఆయా ప్రాంతాలపై తమ పాలనను పటిష్టపరచుకొని అక్కడి వనరులను దోచుకున్నారు.

బ్రిటిష్ పాలకులు భారతదేశాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్న తరవాత దేశ మారుమూల ప్రాంతాలలోని అన్ని వివరాలు చూపించే పటాలు తయారు చేయటం మొదలుపెట్టారు. దేశం అంతటినీ సర్వేక్షణ చేసి పటాలు తయారు చేయటానికి 'భారతదేశ సర్వేక్షణ'




*పటం 8 : బ్రిటిష్ కాలంలో తయారు చేసిన భారతదేశ పటం*

శాఖను ఏర్పాటు చేశారు, జేమ్స్ రెన్నెల్‌ను 'సర్వేయర్ జనరల్'గా నియమించారు. సర్వే ఆధారంగా తయారైన భారతదేశపు మొట్టమొదటి పటాలను అతడు తయారుచేశాడు. పటం 8 ను చూడండి. బ్రిటీష్ కాలంలో తయారు చేసిన భారతదేశ పటంతో, నేటి భారతదేశ పటాన్ని పోల్చండి.

ప్రపంచంలోనే అత్యంత ముఖ్యమైన భౌగోళిక సర్వేక్షణను 1802లో విలియం లాంబ్టన్ ఆరంభించాడు. దక్షిణంలో చెన్నై దగ్గర మొదలుపెట్టి ఉత్తరాదిన హిమాలయాల వరకు రేఖాంశాల పొడవును నిర్ణయించి, వివిధ ప్రదేశాల ఎత్తులను నిర్ధారించాడు. ఈ సర్వేక్షణను సర్ జార్జ్ ఎవరెస్ట్ పూర్తి చేశాడు. ఈ సర్వేక్షణ ఆధారంగానే ఎవరెస్టు పర్వతం ప్రపంచంలోకెల్లా ఎత్తైన పర్వతమని నిరూపితమయింది (మొదటిసారిగా శాస్త్రీయ పద్ధతులు ఉపయోగించి దాని ఎత్తును కొలిసిన జార్జి ఎవరెస్టు పేరునే ఈ పర్వతానికి పెట్టారు). అన్ని ఎత్తులను సముద్ర మట్టం ఆధారంగా కొలుస్తారు కాబట్టి ఈ సర్వేచేయడం సముద్ర తీరమైన చెన్నైలో మొదలయింది.

KY5HLK

సైనికులకు, వైమానిక దళాలకు యుద్ధ సమయాల్లో పటాల అవసరం ఎక్కువ అయింది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల సమయంలో అన్ని వివరాలతో కూడిన ఈ పటాలను శత్రువుల చేతుల్లో పడకుండా అనేక ప్రభుత్వాలు వీటిని రహస్యంగా ఉంచటానికి ప్రయత్నించాయి. అయితే నేటి కాలంలో ఉపగ్రహ ఛాయాచిత్రాలు పటాల తయారీని పూర్తిగా మార్చివేశాయి. పూర్తి వివరాలతో, ఎంతో ఖచ్చితమైన

పటాలు ఇప్పుడు తయారు అవుతున్నాయి. అంతేకాక వీటిని రహస్యంగా ఉంచటం ఇప్పుడు ప్రభుత్వాలకు సాధ్యం కావడం లేదు. అధ్యయనం చేయటానికి, ఉపయోగించుకోటానికి ఈ సమాచారం అందరికీ అందుబాటులో ఉంది.

- పటాలు ఈ విధంగా అందరికీ అందుబాటులో ఉండటం మంచిదేనా? ఎందుకు?
- అన్ని వివరాలతో కూడిన పటాలను తయారు చేయటానికి వలస పాలకులు పెద్ద ఎత్తున నిధులు ఎందుకు వెచ్చించారు?
- డేవిడ్ లివింగ్‌స్టన్, స్టాన్లీ, అముడ్సన్ వంటి ప్రముఖ అన్వేషకుల జీవితాల గురించి తెలుసుకోండి. వారి అన్వేషణలకు అయ్యే ఖర్చును ఎవరు భరించారు? ఎందుకు?

### మన కాలంలో పటాల వినియోగం

KY9JAH

వ్యాపారం, నౌకాయానం, యుద్ధాలు, వలస ప్రాంతాలను ఏర్పరచుకోవటం వంటి వాటికోసం పటాలు తయారుచేసి ఉపయోగించారని మనం తెలుసుకున్నాం. నేటి కాలంలో దేశ అభివృద్ధికి, ప్రణాళికలు తయారు చేయటానికి పటాలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఒక ప్రాంతంలోని వనరులు, ఆ ప్రాంతం ఎదుర్కొంటున్న సమస్యలు వంటివి ప్రణాళికలు తయారు చేసేవాళ్లకు తెలియాలి. పటాల ద్వారా ఈ విషయాలు తెలుస్తాయి. ఉదాహరణకు తాగునీటి సమస్య ఉన్న ప్రదేశాలను చూపించే పటాన్ని తయారు చేయవచ్చు. ఈ పటాన్ని నీటి వనరులైన వర్షపాతం, భూ గర్భజలాలు, నదుల పటాలతో పోల్చవచ్చు. ఈ పోలికల ఆధారంగా ఆ ప్రాంతం ప్రజలందరికీ తాగునీరు అందించటానికి బోరుబావులు తవ్వటం, నదులకు అడ్డంగా ఆనకట్టలు కట్టడం, చెరువులు తవ్వటం లేదా దూర ప్రాంతం నుంచి పైపుల ద్వారా నీటిని చేరవేయడం – వీటిలో ఏది ఉత్తమమైన విధానమో నిర్ణయించవచ్చు. అదే విధంగా పటాల సహాయంతో వ్యవసాయ అభివృద్ధికీ, కొత్తగా పరిశ్రమలు నెలకొల్పటానికీ, రోడ్లు వెయ్యటానికీ, ఆసుపత్రులు, పాఠశాలల నిర్మాణానికి ప్రణాళికలు తయారు చెయ్యవచ్చు.

- కొత్త పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పటానికి పటాలను ఎలా ఉపయోగించవచ్చో చెప్పండి. దీనికోసం ఏఏ పటాలను అధ్యయనం చేయవలసి ఉంటుంది?

తమ వ్యాపార కార్యకలాపాలు రూపొందించుకోటానికి కూడా కంపెనీలు పటాలను ఉపయోగిస్తాయి. ఉదాహరణకు ఒక ప్రాంతంలో తమ కార్యకలాపాలను విస్తరించాలనుకునే మొబైల్ ఫోన్ కంపెనీకి గ్రామాలు, పట్టణాలను చూపించే పటం, అలాగే మైక్రోవేవ్ టవర్ల నిర్మాణానికి కొండలు, అడవులను చూపించే పటం అవసరమవుతాయి.

- ఆసుపత్రి నెలకొల్పటానికి అనువైన ప్రాంతాన్ని ఎంచుకోవాలనుకుంటున్న వ్యక్తికి ఏఏ పటాలు అవసరమవుతాయి? జాబితా తయారు చేయండి.
- యుద్ధ సమయంలో సైన్యానికి పటాలు ఏ విధంగా ఉపయోగపడతాయి?

### వివిధ విషయ నిర్దేశిత (థీమాటిక్) పటాలను చదవటం

పటాలు ప్రదేశాల పేర్లను, వాటి మధ్య దూరాలను మాత్రమే ఇవ్వవని పైన చూశాం. ఒక ప్రాంత నైసర్గిక రూపం (కొండలుగా ఉందా, సమతలంగా ఉందా), ప్రజల ఆర్థిక కార్యకలాపాలు, మాట్లాడే భాషలు, అక్షరాస్యత వంటివి చూపించటానికి కూడా పటాలను ఉపయోగించవచ్చు. సాధారణంగా ఒక పటం ఒక విషయం/ అంశంపైనే కేంద్రీకరిస్తుంది. ఇటువంటి పటాలను విషయ నిర్దేశిత (థీమాటిక్) పటాలు అంటారు. ఉదాహరణకు మండలాలు/ తాలూకాలు, జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలు, రాజధానులు వంటి వాటిని తెలియచేసే రాజకీయ పటాలు ఉన్నాయి. కొండలు, నదులు, పీఠభూములు వంటివి చూపించే కొన్ని భౌతిక

పటాలు ఉన్నాయి. ప్రజలు భూమిని ఉపయోగించుకుంటున్న విధానాన్ని తెలియచేసే 'భూ వినియోగ పటాలు' కొన్ని ఉన్నాయి. ఉదాహరణకు ఒక గ్రామంలో వివిధ ప్రాంతాలను పశువులను మేపటానికి, ఆహార పంటలు సాగు చేయటానికి, పత్తివంటి వాణిజ్య పంటలు పండించటానికి, నివాసం, పాఠశాలలు, ప్రార్థనా స్థలాలు, దుకాణాలకు ఉపయోగిస్తారు. కొన్ని ప్రాంతాలను చెరువుల నిర్మాణానికి కేటాయిస్తారు, లేదా తాత్కాలికంగా సాగు చేయకుండా, బంజరుగా వదిలేస్తారు. ఒక గ్రామ పటం తయారు చేసేటప్పుడు వీటన్నిటినీ విడిగా చూపించటానికి వేరువేరు రంగులు, సంకేతాలను ఉపయోగించాలి. పటంలో వివిధ ఆచ్ఛాదన, భూ వినియోగాన్ని తెలియచేసే రంగుల వివరాలు ఇలా ఉంటాయి.

KYB5ZB

| రంగు | భూ ఆచ్ఛాదన/ భూ వినియోగం |
|---|---|
| ముదురు ఆకుపచ్చ | అడవి |
| లేత ఆకుపచ్చ | గడ్డి భూములు |
| గోధుమ/ మట్టిరంగు | వ్యవసాయానికి అనువైన భూములు |
| పసుపు పచ్చరంగు (నైసర్గిక పటాలు) | పంటలు సాగవుతున్న ప్రాంతం |
| ముదురు ఊదా | పర్వతాలు |
| లేత ఊదా | గుట్టలు |
| పసుపు పచ్చ | పీఠ భూములు, చిత్తడి భూములు |
| లేత ఎరుపు | బంజరు భూములు |
| లేత నీలం | చెరువులు, నదులు, కాలవలు, బావులు వంటివి |
| ముదురు నీలం | సముద్రాలు, మహాసముద్రాలు |
| తెలుపు | ఖనిజాలు లభ్యమయ్యే ప్రదేశాలు |
| నలుపు | సరిహద్దులు |

వివిధ సామాజిక ఆర్థిక అంశాలను చూపించటానికి పటంలో చుక్కలు, గీతలు, సంకేతాలు వంటివి ఉపయోగించవచ్చు. గణాంక వివరాలను చూపటానికి చుక్క పద్ధతి, వృత్తాలు, రేఖాపటం (గ్రాఫ్), చార్టులను ఉపయోగించవచ్చు. అధికారిక విషయ నిర్దేశిత పటాలలో రంగులలో ముదురు నుంచి లేత రంగు వరకు (ఛాయా క్రమశ్రేణిని) ఉపయోగించవచ్చు.

### జనాభా పటాన్ని తయారు చేయండి!

ఉదాహరణకు వివిధ తరగతి గదులను చూపిస్తూ మీ పాఠశాల చిత్తు పటాన్ని తయారు చేయండి. తరగతిలో ప్రతి అయిదుగురు విద్యార్థులకు ఒక చిన్నగీత ( ı ) పెట్టండి. ఇది మీ పాఠశాల జనాభా పటం! విషయ సూచికలో ఒక్కొక్క గీత ఎంతమంది విద్యార్థులను సూచిస్తుందో పేర్కొనండి.

జనాభాను పటంలో రంగులు పూరించడం ద్వారా కూడా చూపవచ్చు. వీటిని జనసాంద్రత పటాలు అంటారు. ముందుగా ఒక ప్రదేశంలో నివసిస్తున్న జనాభాని లెక్కగట్టాలి. ఆ తరవాత ఆ ప్రదేశం వైశాల్యాన్ని లెక్కగట్టాలి. ఆ ప్రాంత జనాభాను వైశాల్యంతో భాగించాలి. ఉదాహరణకు ఒక గ్రామ వైశాల్యం పది చదరపు కిలోమీటర్లు ఉండి, అందులో వెయ్యిమంది ప్రజలు ఉంటే ఆ గ్రామ జనసాంద్రత ప్రతి చదరపు కిలోమీటరుకి వంద. ఈ పద్ధతిని ఉపయోగించి రాష్ట్రాల జనసాంద్రతను లెక్కించవచ్చు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల జనసాంద్రతను తెలిపే ఈ పట్టికను చూడండి.


### జనసాంద్రత - 2011, జనాభా గణన

| రాష్ట్రం | జనసాంద్రత | రాష్ట్రం | జనసాంద్రత | రాష్ట్రం | జనసాంద్రత |
|---|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ } తెలంగాణ | 308 | జమ్మూకాశ్మీర్ | 56 | ఒడిషా | 269 |
| | | జార్ఖండ్ | 414 | పంజాబ్ | 550 |
| అరుణాచల్ ప్రదేశ్ | 17 | కర్నాటక | 319 | రాజస్థాన్ | 201 |
| అస్సాం | 397 | కేరళ | 859 | సిక్కిం | 86 |
| బీహార్ | 1102 | మధ్యప్రదేశ్ | 236 | తమిళనాడు | 555 |
| ఛత్తీస్‌ఘడ్ | 189 | మహారాష్ట్ర | 365 | తెలంగాణ | 310 |
| గోవా | 394 | మణిపూర్ | 122 | త్రిపుర | 350 |
| గుజరాత్ | 308 | మేఘాలయ | 132 | ఉత్తరాఖండ్ | 189 |
| హర్యానా | 573 | మిజోరాం | 52 | ఉత్తర ప్రదేశ్ | 828 |
| హిమాచల్ ప్రదేశ్ | 123 | నాగాలాండ్ | 119 | పశ్చిమ బెంగాల్ | 1030 |

దిగువ పటంలో జనసాంద్రతను బట్టి సూచికలో ఇచ్చిన రంగులు నింపండి.

**సూచిక**

- 0 - 250
- 251 - 500
- 501 - 750
- 751 - 1000
- 1000 పైన





*పటం 9 : భారతదేశం*

KYESN8


## పటాలలో సంప్రదాయంగా వాడే సంకేతాలు


పటాలు తయారు చేసేవారిలో కొంతమంది తమ సొంత సంకేతాలు వాడతారు, అయితే చాలామంది సంప్రదాయ సంకేతాలను వాడతారు. భారతదేశ సర్వేక్షణ శాఖ ఉపయోగించే సంకేతాలను మన దేశంలో సాధారణంగా ఉపయోగిస్తారు. ఉదాహరణకు భారతదేశ సర్వేక్షణ శాఖ జారీ చేసే 'టోపోషీట్ల'లో ఉండే సంప్రదాయ సంకేతాలను కింద చూడవచ్చు.

పట్టణాలు లేదా గ్రామాలు: జనావాసాలు: నిర్జన కోట ..........................
గుడిసెలు: శాశ్వత: తాత్కాలిక. శిఖరం. ప్రాచీనమైన ..........................
గుడి. ఛాత్రి. చర్చి. మసీదు. ఈద్గా. గోరీ. సమాధులు ..........................
దీప స్తంభం. దీపపు ఓడ. తెప్పలు: కాంతితో: కాంతిలేని లంగరువేసే స్థలం ....
గని, పందిరి మీది తీగ, గడ్డి, పొదలు ..........................
తాటిచెట్లు: ఇతర అరటి చెట్లు: కోనిఫర్ వెదురు, ఇతర చెట్లు ..........................
సరిహద్దు: అంతర్జాతీయ ..........................
సరిహద్దు: రాష్ట్ర: గుర్తించిన: గుర్తించని ..........................
సరిహద్దు: జిల్లా: ఉప మండలం: తహశీల్ లేదా తాలూకా అడవులు ..............
సరిహద్దు స్తంభాలు: సర్వే చేసిన: గుర్తించని: గ్రామ త్రికూటమి ..................
ఎత్తులు, నిర్ధారించిన: స్టేషన్: పాయింట్, సుమారు ..........................
బెంచ్‌మార్క్: జియోడేటిక్: ఉపరితల: కాలువ ..........................
తపాలా కార్యాలయం, తంతి కార్యాలయం మిళిత కార్యాలయం, రక్షకభట నిలయం....
బంగళాలు: డాక్ లేదా యాత్రికుల, తనిఖీ, విశ్రాంతి గృహం ..........................
వలయ గృహాలు. స్థావర మైదానం, అడవి: రిజర్వుడు, రక్షిత ..........................
ఎడంతో పేర్లు: పరిపాలన: గిరిజన అయితే లోకాకుట్ ..........................




రహదారులు, తారు: ప్రాముఖ్యతను బట్టి: దూరాన్నిచూపే రాళ్లు ..........................
రహదారులు, మట్టి: ప్రాముఖ్యతను బట్టి: వంతెన ..........................
బళ్ల దారి పశువుల బాట, మార్గం. వంతెనతో కాలిబాట ..........................
వంతెనలు: స్తంభాలతో: లేకుండా. కాజ్‌వే. ఫోర్డ్ లేదా ఫెర్రీ ..........................
వాగులు: మధ్యలో దారితో: అనిర్ధారిత. కాలువ ..........................
ఆనకట్టలు: సిమెంటు లేదా రాతితో: మట్టికట్ట తూములు ..........................
నదీ తీరాలు: అంచులు: తీవ్ర వాలు. 3–6 మీటర్లు, 6 మీటర్లపైన ..........................
నదీ తీరాలు: నీటికాలువతో ఎండిన: దీవి, రాళ్లతో సముద్ర అలల నది ..........................
నీటమునిగిన రాళ్లు షోల్ చిత్తడి రెల్ల ..........................
బావులు: తాపడంతో: లేకుండా బోరు బావి ఊట. చెరువులు: బహువార్షిక; ఎండిన...
చెరువు కట్టలు: రోడ్డు లేదా చెరువు కంచె, చెరువు బీటలువారిన నేల ..........................
రైలు మార్గాలు, బ్రాడ్‌గేజి: రెండు పట్టాలు, ఒక పట్టా స్టేషనుతో: నిర్మాణంలో ........
రైలు మార్గాలు, ఇతర గేజీలు: రెండు పట్టాలు: ఒక పట్టా దూరపు రాయి నిర్మాణంలో .......
ఖనిజ మార్గం లేదా ట్రామ్ వే తంతి తీగలు. సొరంగ ఛేదం ..........................
సమతల గీతలు ఉప అంశాలతో. రాళ్లతోకూడిన వాలులు. కొండచరియలు ............
ఇసుక రీతులు: (1) చదును (2) ఇసుక తిన్నెలు, గుట్టలు (సర్వేచేసిన), (3) మారుతున్న గుట్టలు ...







చిత్రం 1.4 : ఇంకా నయం! వీటికి కూడా గుర్తులు కేటాయించలేదు


ఉంటాయి. పటాలు బల్లపరుపుగా ఉంటాయి కాబట్టి వాటిలో ఎత్తు పల్లాలను చూపించలేం. అందుకని వీటిని చూపించటానికి కాంటూరు రేఖలు అనే ప్రత్యేక సంకేతాలను ఉపయోగిస్తాం. వీటి గురించి మీరు ఏడవ తరగతిలో చదివారు. సముద్ర మట్టం నుంచి ఒకే ఎత్తులో ఉన్న ప్రదేశాలన్నిటినీ కలిపే వాటిని

## పటాలలో ఎత్తు, పల్లాలను చూపడం


భూమిపై ఎత్తులు, పల్లాలు అంటే కొండలు, లోయలు, పీఠభూములు, మైదానాలు, నదీ పరీవాహక ప్రాంతాలు, రాళ్లు, ఇసుకతో కూడిన ప్రదేశాలు





చిత్రం 1.6 : కొండలు





చిత్రం 1.5 : హెచ్చు తగ్గుల ఆకృతిని చూపుట (ఐసోప్లెత్)




చిత్రం 1.7 : 'V' ఆకారపు లోయలు




*చిత్రం 1.8 : ఏటవాలు*




*చిత్రం 1.9 : నిట్రవాలు*




పీఠభూమి

*చిత్రం 1.10 : కాంటూరు రేఖలు*

కాంటూరు రేఖలు అంటారు. ఇంకోరకంగా చెప్పాలంటే ఒక కాంటూరు రేఖ మీద ఉన్న ప్రదేశాలన్నీ సముద్ర మట్టం నుంచి ఒకే ఎత్తులో ఉంటాయి. కాంటూరు రేఖలను ఐసోలైన్స్ అని కూడా అంటారు.

కాంటూరు రేఖలను నిర్ధారిత ఎత్తుల అంతరాలతో (ఉదాహరణకు 20 మీటర్లు, 50 మీటర్లు, 100 మీటర్లు తేడాలతో) గీస్తారు. కాంటూరు రేఖలు దూరం దూరంగా ఉంటే తక్కువ వాలుతో ఉందని అర్థం. అదే కాంటూరు రేఖలు బాగా దగ్గరగా ఉంటే తీవ్రమైన వాలు ఉందని అర్థం. సమ దూరంలో రేఖలు ఉంటే వాలు ఒకే రకంగా ఉందని సూచిస్తాయి.


- ఈ పుస్తకంలో భౌతిక, నదీ వ్యవస్థ (పేజి 14), వార్షిక సగటు వర్షపాతం (పేజి 15), మృత్తికలు (పేజి 16), అడవులు (పేజి 55), ఖనిజాలు (పేజి 65) వంటి వివిధ అంశాలను తెలియజేసే పటాలు ఉన్నాయి. ఈ పటాలను పరిశీలించి మీ జిల్లాకు సంబంధించిన వివిధ రకాల సమాచారాన్ని గుర్తించి పట్టిక రూపంలో పొందుపరచండి.

## అట్లాస్

KYK21Y

పటాల సంకలనాన్ని అట్లాస్ అంటారు. సాధారణంగా ఇవి వివిధ అంశాల క్రమంలో ఉంటాయి. పటాల ఆధారంగా వివిధ ప్రదేశాల గురించి ఎంతో సమాచారాన్ని పొందవచ్చు. వీటి ఆధారంగా అక్కడ నివసించే వివిధ ప్రజల జీవన విధానాల గురించి ఊహించుకోండి. అరుణాచల్ ప్రదేశ్‌కి సంబంధించి పైన పేర్కొన్న అంశాల గురించి అట్లాస్ ద్వారా తెలుసుకుని అక్కడి ప్రజల జీవన విధానాన్ని ఊహించండి.

# భౌగోళిక స్వరూపం- నదీ వ్యవస్థ





సాధారణ భౌగోళిక ఉన్నతి
(సముద్ర మట్టం నుంచి)


సూచిక

- 0-150 మీటర్లు
- 150-300 మీటర్లు
- 300-600 మీటర్లు
- 600-1200 మీటర్లు
- 1200 మీటర్లు ఎగువ

Designed and Compiled By Kaarto India, Hyderabad
FOOT NOTE:- The details shown in this map are based on Survey of India & AP state Maps. All administrative boundaries are only informative, unauthorised and approximate.
The responsibility of the details in the map is with the publisher only.


సాంవత్సరిక
సగటు వర్షపాతం
ఒడిషా
తెలంగాణ
శ్రీకాకుళం
విశాఖపట్నం
కాకినాడ
యానాం (పాండిచ్చేరి)
రాజమండ్రి
ఏలూరు
విజయవాడ
గుంటూరు
తెనాలి
మచిలీపట్నం
కర్నూలు
ఒంగోలు
ఆంధ్రప్రదేశ్
అనంతపురం
కడప
నెల్లూరు
చిత్తూరు
కర్ణాటక
తమిళనాడు
బంగాళాఖాతం
సాంవత్సరిక సగటు వర్షపాతం
సెం.మీ. లలో
అధిక వర్షపాతం:
100 సెం.మీ. కన్నా ఎక్కువ
సాధారణ వర్షపాతం:
70 సెం.మీ. - 100 సెం.మీ.
తక్కువ వర్షపాతం
70 సెం.మీ. కన్నా తక్కువ
స్కేలు
1:26,84,500 appx
1Cm = 26.8 Km
Designed and Compiled By Kaarto India, Hyderabad
FOOT NOTE:- The details shown in this map are based on Survey of India & AP state Maps. All administrative bounderies are only informative, unauthorised and approximate.
The responsibility of the details in the map is with the publisher only.

# మృత్తికలు




ముఖ్యమైన మృత్తికలు-రకాలు

- ఎర్ర మృత్తికలు
- నల్ల రేగడి మృత్తికలు
- తీర ప్రాంతపు ఇసుక మృత్తికలు
- కొండ ప్రాంతపు రాతి మృత్తికలు

Designed and Compiled By Kaarto India, Hyderabad

FOOT NOTE:- The details shown in this map are based on Survey of India & AP state Maps. All administrative boundaries are only informative, unauthorised and approximate.
The responsibility of the details in the map is with the publisher only.

## కీలక పదాలు

1. ప్రక్షేపణ 2. సంకేతాలు 3. భూగోళ శాస్త్రవేత్త

KYNNPV

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. మీ పాఠశాలలోని అట్లాస్‌లో వివిధ విషయ నిర్దేశిత పటాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయండి. $AS_2$
2. ప్రాచీన గ్రీకుల కాలంనాటికి, నేటికి పటాల వినియోగంలో మార్పులు వచ్చాయని భావిస్తున్నారా? పోలికలు, తేడాలు కింది పట్టికలో పొందుపరచండి. $AS_1$

| విషయం | ప్రాచీన గ్రీకుల కాలంలో | ప్రస్తుతం |
|---|---|---|
| పోలికలు | | |
| తేడాలు | | |

3. వలసపాలకులు తుపాకుల ద్వారా కంటే పటాలు తయారు చేయడం ద్వారా ఆ ప్రాంతాలను బాగా దోచుకోగలిగారని, అదుపులో ఉంచగలిగారని చాలామంది భావిస్తారు. మీరు దీంతో ఏకీభవిస్తారా? కారణాలను తెలపండి. $AS_1$
4. టాలమీ లేదా ఇద్రిసీ తయారుచేసిన పటాలకు బ్రిటిష్‌వాళ్లు తయారుచేసిన పటాలకు గల తేడాలు ఏమిటి? $AS_5$
5. ఎనిమిదవ పేజిలోని "మన కాలంలో పటాల వినియోగం" అనే అంశం చదివి ప్రశ్నకు జవాబు రాయండి. ప్రస్తుతం పటాలను వివిధ ఉద్దేశాలతో ఉపయోగిస్తున్నారు. అవి ఏవి? $AS_1$
6. వివిధ రకాల పటాలను గురించి తెలుసుకోవడానికి కొన్ని ప్రశ్నలను తయారుచేయండి. $AS_5$

పాఠం 2

# సూర్యుడు - శక్తి వనరు

KYSBDS

మనం నివసిస్తున్న భూమిపై ఎంతో వైవిధ్యత ఉంది. గత తరగతుల్లో మనం ఈ వైవిధ్యత లోని కొన్ని అంశాలైన- సముద్రాలు, ఖండాలు, పర్వతాలు, పీఠభూములు, మైదానప్రాంతాలు, అధిక, తక్కువ వర్షపాతం గల ప్రాంతాలు, మొదలైనవి చూశాం. ఈ పాఠంలో మనం మరొక రకం వైవిధ్యత గురించి తెలుసుకుందాం. అయితే మనం దీనిని చూడలేం కాని అనుభూతి చెందగలం. ఇది ఉష్ణోగ్రతలలో వైవిధ్యత. ఉదయం చల్లగా ఉండి, రోజుగడుస్తున్న కొద్దీ వేడెక్కటం, రాత్రికి తిరిగి చల్లబడటం మీరు గమనించి ఉంటారు. అదేవిధంగా సంవత్సరంలో కొన్ని నెలలు చాలా వేడిగానూ, మరికొన్ని నెలల్లో చల్లగానూ ఉండటం కూడా మీరు గమనించి ఉంటారు. ఒక ప్రదేశంలోని ఉష్ణోగ్రతలలో తేడా ఉంటుంది. భూమి మీద ఒక ప్రదేశానికి, మరో ప్రదేశానికి కూడా ఉష్ణోగ్రతలలో తేడా ఉంటుంది. కొన్ని ప్రాంతాలు వేడిగా ఉంటే, కొన్ని ప్రాంతాలు చాలా చలిగా ఉండి సంవత్సరమంతా మంచుతో కప్పబడి ఉంటాయి. సంవత్సరం పొడవునా వేడిగా ఉండే భూమధ్యరేఖా ప్రాంతాల గురించి మీరు చదివారు. చాలా చలిగా ఉండే ధృవప్రాంతాల గురించి మీరు తరవాత పాఠాలలో చదువుతారు.

రెండు ప్రదేశాల మధ్య గల ఉష్ణోగ్రతలలోని తేడాలు గాలులను, వానలను ప్రభావితం చేస్తాయి. ఒక ప్రదేశంలో పడే వర్షపాతం కొంతవరకు రెండు ప్రదేశాల మధ్య గల ఉష్ణోగ్రతల తేడాలపై ఆధారపడి ఉంటుంది.

ఉష్ణోగ్రత, వర్షపాతం జీవితాలను ఎంతగానో ప్రభావితం చేస్తాయి. సూర్యరశ్మి, నీటిపై ఆధారపడి చెట్లు, జంతువులు బతుకుతాయి. చాలా కొద్ది రకాల చెట్లు మాత్రమే వేడిగా ఉండే ప్రాంతాలలో పెరుగుతాయి, చలిగా ఉండే ప్రాంతాలలో మరికొన్ని రకాల చెట్లు పెరుగుతాయి, బాగా చలిగా ఉండే ప్రాంతాలలో ఏ చెట్లూ పెరగవు. ఈ విధంగా వృక్ష, జంతు జాలాలలో వైవిధ్యత ఉంటుంది. ఈ అధ్యాయంలో ప్రపంచంలోని వివిధ ప్రదేశాలలో ఉష్ణోగ్రతలలో గల తేడాల గురించి తెలుసుకుందాం.

- మీరు నివసించే ప్రాంతం కంటే భిన్నమైన వాతావరణం ఉండే ప్రదేశానికి ఎప్పుడైనా వెళ్లారా? తరగతి గదిలో వివరించండి.
- భూమి మీద వేడిమికి సూర్యుడు కారణమని మీకు తెలుసు. అయితే ఈ వేడిమి ఉదయం నుంచి సాయంత్రానికి, కాలాలను బట్టి, ప్రదేశాలను బట్టి మారటానికి కారణం ఏమిటి? ఇక్కడ ఉష్ణోగ్రతలలో కొన్ని తేడాలను ఇచ్చాం. వీటికి కారణాలను ఊహించి, తరగతి గదిలో చర్చించిన తరవాత ముందుకు వెళ్లండి.

1. ఉదయంపూట చల్లగానూ, మధ్యాహ్నం వేడిగానూ ఉంటుంది
2. వేసవిలో వేడిగానూ, శీతాకాలంలో చలిగానూ ఉంటుంది
3. కొండలపై చల్లగానూ, మైదాన ప్రాంతంలో వేడిగానూ ఉంటుంది
4. భూమధ్యరేఖా ప్రాంతంలో వేడిగానూ, ధృవ ప్రాంతంలో చలిగానూ ఉంటుంది.

## సూర్యుని కిరణాలు, సౌరశక్తి

భూగోళంపై శక్తికి సూర్యుడు మూల వనరు. సూర్యుడు ఒక పెద్ద శక్తి కేంద్రం. కాంతి, వేడిమి

### హరిత గృహాలు

మొక్కలకు అనువైన వాతావరణాన్ని కృత్రిమంగా కల్పించటం ద్వారా అన్నిచోట్లా పంటలు పండించటానికి మానవులు ప్రయత్నించటం ఆసక్తికరంగా ఉంటుంది. బాగా చలిగా ఉండే ప్రదేశాలలో హరిత గృహాలు నిర్మించి కూరగాయలు, పళ్లు పండిస్తున్నారు. హరిత గృహాల గోడలు పారదర్శకంగా ఉండి ఎండను లోపలికి రానిస్తాయి కానీ బయటకు వెళ్లనివ్వవు. వరికి అనువుగా మడులు కట్టి సాగునీరు ఇచ్చి నీటిని నిల్వ కడతారు.

KYTX3L



*చిత్రం 2.1 : మొక్కల కోసం కృత్రిమ పరిసరాల ఏర్పాటు*

రూపంలో అది శక్తిని విడుదల చేస్తూ ఉంటుంది. సూర్యుడి నుంచి నిరంతరాయంగా వెలువడే ఈ శక్తిని సౌర వికిరణం అంటారు. ఏదైనా ఒక కాంతి జనకం శక్తిని వెలువరించటాన్ని వికిరణం అంటారు. సూర్యుడినుంచి మనకు శక్తి సూర్య కిరణాల రూపంలో వస్తుంది. ఈ శక్తిలో కొంత భాగాన్ని మనం కాంతి, వేడిమి రూపంలో చూడగలం, లేదా అనుభూతి చెందగలం. అయితే అతినీలలోహిత కిరణాలు, రేడియో తరంగాలు, ఎక్స్ కిరణాలు వంటి రూపాలలో కూడా సూర్యుడినుంచి మనకు శక్తి వస్తూ ఉంటుంది. దీనిని మనం చూడలేం, అనుభూతి చెందలేం.


సంవత్సరం పొడవునా, అలాగే ప్రతి సంవత్సరమూ సూర్యుడి నుంచి వెలువడే శక్తి దాదాపు ఒకే మోతాదులో ఉంటుంది. మరి భూమి మీద ఉష్ణోగ్రతలలో తేడాలకు కారణాలు ఏమిటి? భూమి ఉపరితలానికి చేరుకునే సౌర వికిరణాన్ని సౌరపుటం (ఇన్సోలేషన్) అంటారు. భూమి వాతావరణంలోకి ప్రవేశించే సౌరశక్తిలో చాలా తక్కువ మాత్రమే భూమి ఉపరితలాన్ని చేరుకుంటుంది. ఎందుకనగా సౌరశక్తిలో మూడవ వంతు భూ వాతావరణం వల్ల పరావర్తనం (కాంతిని అద్దం పరావర్తనం చేసినట్లు) చెందుతుంది. మరికొంత శక్తి వాతావరణపు పై పొరలలో చెల్లాచెదురవుతుంది, గ్రహింపబడుతుంది. సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల వంటి ప్రమాదకరమైన కిరణాలు నేలను చేరుకోవు. ఈ కారణం వల్లనే భూమిపై జీవనం సాధ్యమయింది. సౌరశక్తిలో కొంత భాగాన్ని వాతావరణంలోని మబ్బులు, పొగ, ధూళి పరావర్తనం చేస్తాయి, లేదా గ్రహిస్తాయి. మబ్బుగా ఉన్న రోజుల్లో అంత వేడిగా ఉండకపోవడం మీరు గమనించి ఉంటారు.

KYXJRI

- సౌరవికిరణం (రేడియేషన్), సూర్యపుటం (ఇన్సోలేషన్) మధ్య తేడాలను పేర్కొనండి.
- పొగ, ధూళితో వాతావరణం మరింత కలుషితమైతే ఏమవుతుంది?

## సూర్యుని కిరణాలు, భూమి ఉపరితలం

సూర్యకిరణాలు భూమిని చేరుకున్న తరవాత కూడా ఉపరితలమంతటా ఒకే రకంగా వేడి కలిగించవు. భూమి ఉపరితలం ఒంపుగా ఉండటమే దీనికి కారణం. దీనిని అర్థం చేసుకోటానికి ఇక్కడ ఇచ్చిన రెండు చిత్రాలను చూడండి.




చిత్రం 2.2 : సూర్యపుటం – భూవికిరణం

ఈ చిత్రాలను చూస్తే భూమి ఉపరితలం ఒంపు కారణంగా భూమధ్యరేఖా ప్రాంతంలో తక్కువ విస్తీర్ణంలో పడేటంత సౌరశక్తి, భూమధ్యరేఖ నుంచి ఉత్తరానికి లేదా దక్షిణానికి వెళుతుంటే ఎక్కువ విస్తీర్ణంలో పడుతుంది. అందుకే ధృవాల దగ్గర కంటే భూమధ్యరేఖ వద్ద వేడిగా ఉంటుంది.


భూమధ్యరేఖ వద్ద సూర్యుని కిరణాలు లంబ ($90^0$) కోణంలో పడుతుండగా ధృవాలవైపు వెళుతున్న కొద్దీ ఏటవాలుగా పడుతుండటం మీరు గమనించి ఉంటారు. భూమి ఉపరితలాన్ని సూర్యుని కిరణాలు తాకే కోణాన్ని 'పతన కోణం' (యాంగిల్ ఆఫ్ ఇన్సిడెన్స్) అంటారు. భూమి ఉపరితలం పైకి వచ్చే సౌరశక్తిని 'పతన కోణం' ఎలా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోటానికి దిగువ పట్టిక చూడండి:

| భూమధ్యరేఖ (0 డిగ్రీలు) వద్ద 100 యూనిట్ల సూర్యపుటం చేరినట్లయితే | | |
|---|---|---|
| $45^0$ వద్ద | (ఉత్తర జపాన్) | 75 యూనిట్లు అందుతుంది |
| $66\frac{1}{2}^0$ వద్ద | (ధృవ మండలం) | 50 యూనిట్లు అందుతుంది |
| $90^0$ వద్ద | (ఉత్తర, దక్షిణ ధృవాలు) | 40 యూనిట్లు అందుతుంది |

- సూర్యకిరణాలు ఎక్కడ ఎక్కువ ఏటవాలుగా పడతాయి – జపాన్‌లోనా, ఉత్తర ధృవం వద్దా?

- సూర్యకిరణాల సాంద్రత ఎక్కడ ఎక్కువగా ఉంటుంది – ఆంధ్రప్రదేశ్‌లోనా, రాజస్థాన్‌లోనా?
- భూమి గుండ్రంగా కాకుండా బల్లపరుపుగా ఉంటే జపాన్ ఎక్కువ వేడి ఎక్కుతుందా, భూమధ్యరేఖా ప్రాంతమా? లేక రెండూ సమంగా వేడి ఎక్కుతాయా?
- గ్లోబును చూసి ఏ ప్రదేశాలు ఎక్కువ వేడిగా ఉంటాయో, ఏ దేశాలు చల్లగా ఉంటాయో చెప్పండి.

చిత్రం 2.3 : సూర్యకిరణాల పతన కోణం




భూమధ్యరేఖా ప్రాంతం వద్ద సూర్య కిరణాలు ఎక్కువ సాంద్రత/ తీవ్రతలో పడినా సాధారణంగా

అక్కడ మధ్యాహ్నం నుంచి మబ్బుగా ఉండి నేలమీదకి తక్కువ సూర్య కిరణాలు పడతాయి. కాబట్టి భూమధ్యరేఖా ప్రాంతం కంటే దానికి ఉత్తర, దక్షిణ ప్రాంతం వేడిగా ఉంటుంది.

అయితే ఇంతటితో అయిపోలేదు. సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతున్న సంవత్సర కాలంలో 'పతన కోణాలు' నిరంతరం మారుతూ ఉంటాయి. దీని కారణంగా ఉత్తర భాగంలో నవంబరు-డిసెంబరు నెలల్లో పతన కోణం పెరుగుతుంది, మే-జూన్ నెలల్లో తగ్గుతుంది. తరవాత పాఠంలో దీని గురించి మరింత తెలుసుకుంటాం.

### భూమి, నీటి ఉపరితలంపై తేడాలు

భూమి మీద, సముద్రాల మీద ఉష్ణోగ్రతలలో చాలా తేడా ఉంటుంది. సముద్రాల మీద, ఖండాల మీద ఉష్ణోగ్రతలు కొలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. భూమి వేడిమిని బాగా ప్రసరింప చేస్తుంది, కానీ నీరు అలా కాదు. భూమి చాలా త్వరగా వేడెక్కి, త్వరగా చల్లబడుతుంది. ఇందుకు విరుద్ధంగా సముద్రాలు వేడెక్కటానికి, చల్లబడటానికి చాలా సమయం తీసుకుంటాయి.

- భూమి, సముద్రం వేడెక్కటంలో తేడా ఎందుకు ఉంది?

పేజి 22లో చూపిన పటంలో ముదురు గోధుమ రంగు ఉన్న ప్రాంతాలు చాలా ఎక్కువ వేడిని, నీలం రంగు ఉన్నవి చాలా తక్కువ వేడినీ గ్రహిస్తాయి.

### వాతావరణం వేడెక్కటం

మన చుట్టూ ఉన్న వాతావరణం లేదా గాలి సూర్యకిరణాల వల్ల నేరుగా వేడెక్కదంటే మీకు ఆశ్చర్యం కలగవచ్చు. కిరణాల వల్ల వేడెక్కకుండా వాతావరణం వాటిని వెళ్లనిస్తుంది. సూర్య కిరణాలు ముందుగా భూమిని వేడెక్కిస్తాయి. ఆ తరవాత భూమినుంచి వేడి వికిరణం చెందుతూ మన చుట్టూ ఉన్న గాలి వేడెక్కుతుంది. అందుకే భూమికి దగ్గర ఎక్కువ వేడిగా ఉండి వాతావరణంలో పైకి వెళుతున్న కొద్దీ చల్లగా ఉంటుంది.


### ఉష్ణ సమతుల్యత

సూర్యుడి నుంచి భూమి పొందే వేడి వివిధ పద్ధతుల్లో తిరిగి వికిరణం చెందుతుంది. మూడవ వంతు వేడి వెంటనే తిరిగి ఆకాశంలోకి పరావర్తనం చెందుతుంది. మిగిలినది ముందుగా భూమిని వేడెక్కించి, తరవాత వాతావరణాన్ని వేడెక్కించటం ద్వారా తిరిగి ఆకాశంలోకి వెళ్లిపోతుంది. సూర్యుడి నుంచి వికిరణమయ్యే ఈ మొత్తం వేడిమి ముఖ్యమైనదని గుర్తుంచుకోవాలి. ఈ మొత్తం వేడిమి తిరిగి పూర్తిగా వికిరణం చెందకపోతే భూమి మీద ఉండిపోయే వేడిమి రోజురోజుకీ పెరుగుతూ భూగోళం మరింత వేడెక్కుతూ ఉంటుంది. ఇందుకు విరుద్ధంగా భూమి పొందుతున్న వేడిమి కంటే ఎక్కువ వికిరణం జరిగితే అది రానురాను చల్లగా మారిపోతుంది.

కనుచూపుమేరకు చదునుగా ఉండే ప్రాంతాన్ని ఎక్కడైనా చూశారా? ప్రతిచోటా భూమి ఎత్తుపల్లాలతో, వాలులతో కనపడుతుంది. ఈ కారణంవల్ల భూమికి అందే సౌరశక్తిలో తేడా ఉంటుంది. చదును భూమి ఎక్కువ వేడెక్కుతుందా, లేక వాలుగా ఉన్న భూమా? పర్వతం ముఖానికి ఉన్న రెండు వాలులు ఒకే మోతాదులో సూర్యకిరణాలను పొందుతాయా? దానికి కారణాలు ఏమిటి?

బొగ్గుపులుసు వాయువు (కార్బన్‌డైఆక్సైడ్) వంటి కొన్ని వాయువులు భూవికిరణాన్ని అడ్డుకుంటాయి. డీజిల్, పెట్రోలు వంటి వాటి వినియోగం పెరగటం, అడవులు నరికివేయటం వంటి వాటివల్ల వాతావరణంలో బొగ్గుపులుసు వాయువు పెరుగుతుంది. వాతావరణంలో బొగ్గుపులుసు వాయువు శాతం పెరిగితే భూవికిరణం తగ్గి ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. దీనినే 'భూగోళం వేడెక్కడం' అంటారు.

# ప్రపంచ సగటు వార్షిక ఉష్ణోగ్రత




| | | | | | |
|---|---|---|---|---|---|
| 2.5 | 3.8 | 5.1 | 6.3 | 7.6 | 8.8 |

చదరపు మీటరుకు ఒక నిమిషంలో సెల్సియస్ ఉష్ణోగ్రత

0 1,500 3,000 మైళ్ళు

0 1,500 3,000 కిలోమీటర్లు

రాబిన్‌సన్ ప్రక్షేపణం


Designed and Complied By Kaarto India, Hyderabad

FOOT NOTE:- The details shown in this map are based on Survey of India & AP state Maps. All administrative boundaries are only informative, unauthorised and approximate. The responsibility of the details in the map is with the publisher only.

Note: The above can be expalained as "1 Sq.Meter of space in that region receives 2.5 celsius heat on an average per minute through out the year."

## వాతావరణ ఉష్ణోగ్రత

తరగతి గదికి సెల్సియస్ ఉష్ణమాపకం (థర్మామీటర్) తీసుకురండి. ఉష్ణమాపకం ఎంత ఉష్ణోగ్రత చూపిస్తోందో రాసుకోండి. ఇది మీ తరగతి గదిలోని వాతావరణ ఉష్ణోగ్రత.



ఉష్ణమాపకం

- వేర్వేరు ఉష్ణోగ్రతలు తెలుసుకోడానికి ఈ కింద పేర్కొన్న వాటి ఉష్ణోగ్రతలు కొలవండి. కొలవటానికి ముందు వాటి ఉష్ణోగ్రత ఎంత ఉంటుందో ఊహించి అంచనా వేయండి.

| వస్తువు | ఉష్ణోగ్రత | |
|---|---|---|
| | అంచనా | కొలత |
| బక్కెట్టులో నీళ్లు | | |
| ఇసుగడ్డ | | |
| గ్లాసులోని చల్లటి నీళ్లు | | |
| స్నానానికి పెట్టుకున్న వేడినీళ్లు | | |

- $10^0$C నుంచి $110^0$C వరకు కొలవగల ఉష్ణమాపకం ఉపయోగించటం మంచిది. ఇటువంటి ఉష్ణమాపకం ఉపయోగించి మరుగుతున్న నీళ్లు, వేడిగా ఉన్న టీ ఉష్ణోగ్రతలను కొలవండి.

ప్రతి నెలలో ఒక వారంరోజులపాటు ఉష్ణోగ్రతలు కొలిస్తే వేసవి, శీతాకాలం, వానకాలాల్లో జరిగే ఉష్ణోగ్రతల మార్పులు తెలుసుకోవచ్చు.

- రాబోయే వారం రోజులపాటు ప్రతిరోజూ ఒకే ప్రదేశం, ఒకే సమయంలో వాతావరణ ఉష్ణోగ్రతలు తీసుకోండి (ఇందుకు నీడలో ఉండే ప్రాంతాన్ని ఎన్నుకోండి). ప్రతి రోజూ ఉష్ణోగ్రత కొలవటానికి ముందు దానిని ఊహించి అంచనా వేయండి. వీటిని ఒక పుస్తకంలో నమోదు చేయండి.

ప్రదేశం ..............................

సమయం ..............................

నెల ..............................

| తేదీ | వాతావరణ ఉష్ణోగ్రతలు | |
|---|---|---|
| | అంచనా | కొలత |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |


- ఇలా వారం రోజులపాటు వేర్వేరు నెలల్లో ఉష్ణోగ్రతలు నమోదు చేయండి.
- మీరు నమోదు చేసిన వారం రోజుల ఉష్ణోగ్రతల సగటును కనుక్కోండి.
- వివిధ వారాల ఉష్ణోగ్రతలలో తేడాల గురించి చర్చించండి.

### అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలు

భూమిపై నమోదైన అత్యంత ఎక్కువ, అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలను శాస్త్రజ్ఞులు నమోదు చేశారు. 1992 జులైలో లిబియా (ఆఫ్రికా) లోని అజీజియాలో అత్యధిక ఉష్ణోగ్రత అయిన $57.8^0$C నమోదు చేశారు.

అదేవిధంగా అంటార్కిటికాలోని వోస్టాక్ కేంద్రంలో 1983 జులైలో అత్యంత తక్కువగా $-89.2^{0}$ సెల్సియస్ ఉష్ణోగ్రతను నమోదు చేశారు.

ఉష్ణోగ్రత $-5^{0}$C లేదా $-89^{0}$C ఉండటమంటే ఏమిటో మీకు తెలుసా? నీళ్లు $100^{0}$Cకి చేరితే మరుగుతాయనీ, $0^{0}$C కి చేరితే గడ్డకట్టు కుంటాయనీ మీకు తెలిసి ఉండాలి. సున్నా కంటే తక్కువ ఉష్ణోగ్రతలలో $-273.16^{0}$C అత్యల్పమైనది. ఉష్ణోగ్రత ఇంతకంటే తగ్గదు. ఉష్ణోగ్రతలు సున్నాకంటే తగ్గితే ఇన్ని డిగ్రీల మైనస్ అంటారు. కింద ఉన్న సంఖ్యారేఖను చూడండి: ఈ సంఖ్యారేఖపై గుర్తించిన ధన, రుణ సంఖ్యలను గమనించండి. వీటి ఆధారంగా దిగువ ప్రశ్నలకు సమాధానాలు రాయండి.




- ఏ ఉష్ణోగ్రత ఎక్కువ: $5^{0}$C, లేక $-5^{0}$C?
- ఈ రెండు ఉష్ణోగ్రతలలో దేని దగ్గర మనకు ఎక్కువ చలిగా అనిపిస్తుంది?
- $-5^{0}$C నుండి $5^{0}$C వరకు ఎన్ని డిగ్రీల తేడా ఉంది?


- కింద పేర్కొన్న ఉష్ణోగ్రతలను క్లుప్తంగా రాయండి:

  సున్నాకి దిగువన $88^{0}$C,

  నీరు గడ్డ కట్టుకోవటానికి $38^{0}$C ఎగువన,

  నీరు గడ్డకట్టుకోటానికి $32^{0}$C దిగువన.
- ఈ రోజున మీ తరగతి గదిలో ఉష్ణోగ్రతని కొలిచారా? సున్నాకి దిగువున $88^{0}$C అంటే మీరు కొలిచిన ఉష్ణోగ్రత కంటే ఎంత తక్కువ?
- మనిషి శరీర ఉష్ణోగ్రత సాధారణంగా $37^{0}$C ఉంటుంది. ఉష్ణోగ్రత $50^{0}$C ఉంటే మనిషి సాధారణ ఉష్ణోగ్రత కంటే ఎంత ఎక్కువ ఉన్నట్టు?
- ఉష్ణోగ్రత $-5^{0}$C ఉంటే మనిషి సాధారణ ఉష్ణోగ్రత కంటే ఎంత తక్కువ ఉన్నట్టు?
- ఈ ఉష్ణోగ్రతలను ఎక్కువ నుంచి తక్కువకు క్రమంలో రాయండి:

  $12^{0}$C, $-16^{0}$C, $29^{0}$C, $0^{0}$C, $-4^{0}$C.
- పైన ఇచ్చిన ఉష్ణోగ్రతలలో దేని దగ్గర అన్నిటికంటే ఎక్కువ వేడిగా ఉంటుంది?
- పైన ఇచ్చిన ఉష్ణోగ్రతలలో దేని దగ్గర అన్నిటికంటే ఎక్కువ చలిగా ఉంటుంది?




*చిత్రం 2.4 : ఉష్ణోగ్రతను ప్రభావితం చేసే కారకాలు*

## ఉష్ణోగ్రతలను నమోదు చేయటం

సిక్స్ గరిష్ఠ, కనిష్ఠ మాపకం ఉపయోగించి ఒకరోజులో అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలను నమోదు చేయండి. ఒక రోజున అత్యధిక, అతి తక్కువ ఉష్ణోగ్రతలు ఎప్పుడు నమోదయ్యాయో చూడండి. ఇలా నెల రోజులు చేసిన తరవాత గరిష్ఠ ఉష్ణోగ్రతలను రాసి ఆ ప్రదేశానికి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత ఎంతో తెలుసుకోండి (గరిష్ఠ ఉష్ణోగ్రతలన్నింటినీ కూడి నెలలోని రోజులతో భాగించాలి). ఈ విధంగా ఆ ప్రాంతానికి ఒక నెలలో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత, సగటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు తెలుసుకోవచ్చు.

*గ్రాఫ్ 1 (అనంతపురము నెలసరి సగటు ఉష్ణోగ్రతలు)*




*పట్టిక 1 : అనంతపురము నెలసరి సగటు ఉష్ణోగ్రతలు*

| నెల | గరిష్ఠ $^0$C | కనిష్ఠ $^0$C |
|---|---|---|
| జనవరి | 30 | 17 |
| ఫిబ్రవరి | 33 | 19 |
| మార్చి | 37 | 22 |
| ఏప్రిల్ | 39 | 26 |
| మే | 39 | 26 |
| జూన్ | 35 | 25 |
| జులై | 33 | 24 |
| ఆగష్టు | 33 | 24 |
| సెప్టెంబరు | 33 | 23 |
| అక్టోబరు | 32 | 23 |
| నవంబరు | 30 | 20 |
| డిసెంబరు | 29 | 18 |

పట్టిక 1లోని వివరాలను ఉపయోగించుకుని అదే గ్రాఫ్‌లోనే అనంతపురముకు నెలవారీగా సగటు కనిష్ఠ ఉష్ణోగ్రతల రేఖను గీయండి. మొదటి రెండు నెలలకు చేసిన గ్రాఫ్ పైన ఉంది.

పైన ఇచ్చిన గ్రాఫ్, పట్టిక 1 పరిశీలించి అనంతపురముకు సంబంధించి కింది ప్రశ్నలకు జవాబులు ఇవ్వండి:

- అనంతపురములో నవంబరులో ఎంత చలిగా ఉంటుంది?
- అనంతపురములో ఏ నెలలో గరిష్ఠ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుంది?
- సంవత్సరంలో అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రత, అతి తక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతకి మధ్య తేడా ఎంత?
- అనంతపురములో బాగా వేడిగా ఉండే మూడు నెలలు ఏవి?
- బాగా చలిగా ఉండే మూడు నెలలు ఏవి?

- అనంతపురములో జనవరిలో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత ఎంత?
- జూన్ నుండి డిసెంబరు వరకు అనంతపురములో సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత తగ్గుతూ ఉంది. సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత కూడా తగ్గుతూ ఉందా?
- మే నెలలో గరిష్ఠ, కనిష్ఠ సగటు ఉష్ణోగ్రతలలో తేడా ఎంత?
- ఆగష్టు నెలలో గరిష్ఠ, కనిష్ఠ సగటు ఉష్ణోగ్రత లలో తేడా ఎంత?
- పై రెండు ప్రశ్నలకు మీ సమాధానాల ఆధారంగా గరిష్ఠ, కనిష్ఠ సగటు ఉష్ణోగ్రతల తేడా అనంతపురములో వేసవిలో ఎక్కువగా ఉందా లేక వానాకాలంలో ఎక్కువగా ఉందా?

## వివిధ ప్రాంతాల ఉష్ణోగ్రతలలో తేడాలు ఉంటాయి

KZ7FT6

వేరు వేరు ప్రాంతాల ఉష్ణోగ్రతలలో తేడాలు ఉంటాయని మీకు తెలుసు. ఈ విధంగా ఉష్ణోగ్రతలలో తేడాలు ఎందుకు ఉంటాయో మీకు తెలుసా? దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ఇప్పుడు మనం కొన్ని కారణాలను పరిశీలిద్దాం.

సముద్రానికి దగ్గరగా, దూరంగా ఉన్న ప్రాంతాల మధ్య సాధారణంగా ఉష్ణోగ్రతలలో తేడాలు ఉంటాయి.

కొండపైన, కొండ కింద ఉష్ణోగ్రతలలో తేడాలు ఉంటాయి. భూమధ్యరేఖ నుంచి ఉత్తరానికి, లేదా దక్షిణానికి ప్రయాణం చేస్తుంటే ఉష్ణోగ్రతలు తగ్గుతాయని మీకు తెలుసు.

## సముద్రానికి దగ్గరగా, దూరంగా ఉన్న ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు తేడాగా ఉంటాయి

మనం అనంతపురము సగటు ఉష్ణోగ్రతలను చూశాం. అనంతపురము సముద్రానికి చాలా దూరంలో ఉంది. సముద్రానికి దగ్గరగా ఉన్న విశాఖపట్టణం ఉష్ణోగ్రతలను ఇప్పుడు పరిశీలిద్దాం.


*పట్టిక 2 : (విశాఖపట్టణం నెలసరి సగటు ఉష్ణోగ్రత)*

| నెల | గరిష్ఠ, $^{0}$C | కనిష్ఠ, $^{0}$C |
|---|---|---|
| జనవరి | 32 | 19 |
| ఫిబ్రవరి | 32 | 21 |
| మార్చి | 32 | 23 |
| ఏప్రిల్ | 33 | 25 |
| మే | 33 | 26 |
| జూన్ | 30 | 24 |
| జులై | 29 | 24 |
| ఆగష్టు | 28 | 24 |
| సెప్టెంబరు | 29 | 24 |
| అక్టోబరు | 32 | 24 |
| నవంబరు | 33 | 22 |
| డిసెంబరు | 32 | 21 |

గ్రాఫ్ 2లో విశాఖపట్టణం సగటు గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలను గుర్తించారు.

- విశాఖలో ఏ నెలలో కనిష్ఠ ఉష్ణోగ్రత అతి తక్కువగా ఉంది? అది ఎంత?
- విశాఖలో చాలా వేడిగా ఉండే నెల ఏది? ఆ నెలలో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత ఎంత?

*గ్రాఫ్ 2 (విశాఖ నెలసరి సగటు ఉష్ణోగ్రతలు)*



అనంతపురము, విశాఖల ఉష్ణోగ్రతలను పోల్చి కింది ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి:

- జనవరిలో ఏ ప్రదేశంలో ఎక్కువ చలిగా ఉంటుంది?
- జూన్‌లో ఏ ప్రదేశంలో ఎక్కువ వేడిగా ఉంటుంది?
- ఏ ప్రదేశంలో సంవత్సరం పొడవునా ఉష్ణోగ్రత ఇంచుమించు ఒకే రకంగా ఉంటుంది?

## సముద్ర ప్రభావిత, ఖండాంతర్గత శీతోష్ణస్థితులు

పనాజిలో సంవత్సరమంతా ఉష్ణోగ్రతలలో తేడా అంత ఎక్కువగా ఎందుకు లేదు? అది సముద్రతీరాన ఉంది కాబట్టి! సముద్రాన్ని వేడెక్కించటం సూర్యుడికి అంత తేలిక కాదు, సముద్రం మరీ వేడెక్కదు, మరీ చల్లబడదు కాబట్టి దానిమీద గాలి కూడా మరీ వేడెక్కదు, మరీ చల్లబడదు. కాబట్టి సముద్ర తీరాన ఉండే ప్రదేశాలలో సాధారణంగా సంవత్సరమంతా శీతోష్ణస్థితులు ఒకే రకంగా ఉంటాయి. దీనినే సముద్ర ప్రభావిత శీతోష్ణస్థితి అంటారు.


ఇందుకు భిన్నంగా అనంతపురము సముద్రానికి చాలా దూరంగా ఉంది. అనంతపురములో శీతోష్ణస్థితులు మరీ మారకుండా చేసే సముద్ర ప్రభావం లేదు. వేసవిలో నేల బాగా వేడెక్కిన కారణంగా గాలి కూడా బాగా వేడెక్కుతుంది. శీతాకాలంలో నేల ఉష్ణోగ్రతలు తగ్గటం వల్ల గాలి కూడా బాగా చల్లగా ఉంటుంది. ఇలా గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలలో చాలా తేడా ఉండటాన్ని ఖండాతర్గత శీతోష్ణస్థితి అంటారు.

## ఎత్తు – ఉష్ణోగ్రత


మండు వేసవిలో మైదాన ప్రాంతాలలోని కొంతమంది ఎండల నుంచి తప్పించుకోటానికి ఊటీ, సిమ్లా వంటి పర్వతప్రాంత ప్రదేశాలకు వెళుతుంటారు. ఎత్తుగా ఉండే పర్వతాలలో వేసవి నెలల్లో కూడా ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. పర్వతాలలో ఎత్తైన ప్రాంతాలలో అతి తక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయి. ఎత్తు ప్రదేశాలకు వెళుతున్న కొద్దీ ఉష్ణోగ్రతలు తగ్గుతుంటాయి.

ఢిల్లీ, సిమ్లాల నెలవారీ సగటు ఉష్ణోగ్రతలను చూపించే గ్రాఫ్ (3, 4) లను చూడండి. ప్రతి నెలలోనూ ఢిల్లీలో కంటే సిమ్లాలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నాయని స్పష్టమవుతోంది.

*గ్రాఫ్ 3 (ఢిల్లీ నెలవారీ సగటు ఉష్ణోగ్రతలు)*




*గ్రాఫ్ 4 (సిమ్లా నెలవారీ సగటు ఉష్ణోగ్రతలు)*



సముద్ర మట్టంనుంచి ఢిల్లీ 200 మీటర్ల ఎత్తులో ఉంది, అదే సిమ్లా 2200 మీటర్ల ఎత్తులో ఉంది. సాధారణంగా సముద్ర మట్టం నుంచి పైకి వెళ్ళేటప్పుడు ప్రతి వెయ్యి మీటర్లకు ఉష్ణోగ్రతలు $6^0C$ మేర తగ్గుతాయి. ఎత్తైన కొండలు, పర్వతాలలో తక్కువ ఉష్ణోగ్రతల వల్ల అక్కడ పెరిగే చెట్లు, మొక్కలలో కూడా తేడా ఉంటుంది.

## ఉష్ణవిలోమనం

కొన్నిసార్లు, భూమి ఉపరితలంపైన ప్రత్యేకించి శీతాకాలం ఉదయాలలో నేల దగ్గర చాలా తక్కువ ఉష్ణోగ్రత నమోదవుతుంది. భూమి పైన గడ్డి, మొక్కల మీద మంచు బిందువులు (ద్రవీభవనం-కన్డెన్సేషన్) ఏర్పడుతుంటాయి. పగటి కాలం తక్కువగా ఉన్నందున సూర్యపుటం తక్కువగా ఉంటుంది. రాత్రి సమయం ఎక్కువగా ఉన్నందున వికిరణం తక్కువగా ఉన్నందువల్ల భూమి ఉపరితలానికి ఉష్ణోగ్రత చాలా తక్కువగా ఉంటుంది. దీనినే ఉష్ణవిలోమనం (inversion) అంటారు.

KZB3H3

- ఉష్ణోగ్రత ఇలా ఉండటానికి గల ఇతర కారణాలను ఊహించండి.
- విలోమనం జరిగితే ఏమవుతుంది?
- ఢిల్లీ కంటే సిమ్లా ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
- సముద్ర మట్టం నుంచి రెండు ప్రదేశాల ఎత్తులో గల తేడాల ఆధారంగా ఆ రెండింటి ఉష్ణోగ్రతలలో ఎంత తేడా ఉంటుందో లెక్క కట్టండి.
- సిమ్లాలో ఏ నెలలో గరిష్ఠ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంది? అది ఎంత?
- ఢిల్లీలో ఏ నెలలో గరిష్ఠ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంది? అది ఎంత?
- సెప్టెంబరులో సిమ్లాలో సగటు ఉష్ణోగ్రత .....$^0C$ కాగా ఢిల్లీలో .....$^0C$.
- ఏది ఎక్కువ చలిగా ఉంటుంది: జనవరిలో ఢిల్లీనా లేక జులైలో సిమ్లానా?

## భూమధ్యరేఖకు దగ్గరగా, దూరంగా ఉన్న ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు

ఏడవ తరగతిలో భూమధ్యరేఖ దగ్గర ఉన్న నైజీరియా గురించి, ఉత్తరంగా పైకి ఉన్న ఫ్రాన్స్ గురించి కూడా చదివాం. ఉత్తరంగా ఇంకా పైకి ఉన్న ఆర్కిటిక్ టండ్రా గురించి తరవాత పాఠాలలో చదువుతాం. ఇండోనేషియా వంటి భూమధ్యరేఖా ప్రాంతంలో సంవత్సరమంతా వేడిగా ఉంటుందనీ, అక్కడ శీతాకాలం ఉండదనీ తెలుసుకున్నాం. భూమధ్యరేఖ నుంచి ఉత్తరంగా కానీ, దక్షిణంగా కానీ వెళితే అక్కడ బాగా చలిగా ఉంటుంది. వేసవి, చలి కాలాలంటూ వేరుగా ఉంటాయి. భూమధ్య రేఖకు దగ్గరగా, దూరంగా ఉన్న ప్రాంతాల ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే ఈ విషయం బాగా అర్థమవుతుంది.




- పై చిత్రంలో సింగపూర్, షాంఘై, వ్లాడివోస్టోక్‌లను గుర్తించండి.

కింద ఉన్న గ్రాఫ్ 5లో సింగపూర్, షాంఘై, వ్లాడివోస్టోక్‌ల సగటు, గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. సూచికలో ఆ ప్రాంతాల సగటు వార్షిక

ఉష్ణోగ్రతలు కూడా ఉన్నాయి. ప్రతి నెలా గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలన్నింటినీ కూడి ఆ నెలలోని రోజుల సంఖ్యతో భాగించటం ద్వారా ఒక రోజు సగటు ఉష్ణోగ్రత లెక్కగట్టవచ్చు. "సింగపూర్ సగటున షాంఘై కంటే వెచ్చగా ఉంటుందా?" వంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వటానికి ఇటువంటి సమాచారం ఉపయోగపడుతుంది.

భూమధ్యరేఖకి దగ్గరగా ఉన్న ప్రాంతాలు సాధారణంగా ఎక్కువ వేడెక్కుతాయి. భూమధ్యరేఖకి దూరంగా ఉండే ప్రాంతాలలో వార్షిక సగటు ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి.

*గ్రాఫ్ 5 (సింగపూర్, షాంఘై, వ్లాడివోస్టాక్‌ల నెలవారీ సగటు, గరిష్ఠ ఉష్ణోగ్రతలు)*




**సూచిక**

| నగరం | వార్షిక సగటు ఉష్ణోగ్రత |
|---|---|
| వ్లాడివోస్టాక్ | $3.9^{0}$C |
| షాంఘై | $15.3^{0}$C |
| సింగపూర్ | $27.8^{0}$C |

- రేఖా చిత్రపటంలో ఇచ్చిన మూడు ప్రదేశాలలో భూమధ్య రేఖకు దగ్గరగా ఏది ఉంది?
- ఆ ప్రదేశంలో సగటు వార్షిక ఉష్ణోగ్రత ఎంత?

- అక్కడ శీతాకాలంలో కంటే వేసవికాలంలో సాధారణంగా చాలా వేడిగా ఉంటుందా?
- సింగపూర్‌లో చలికాలంలో ఉన్నంత వేడిగా వ్లాడివోస్టోక్‌లో వేసవిలో ఉంటుందా?
- జులైలో సాధారణంగా సింగపూర్‌లో ఎక్కువ వేడిగా ఉంటుందా, లేక షాంఘైలోనా?
- రేఖాచిత్ర పటంలో చూపించిన మూడు ప్రదేశాలలో తీవ్ర ఉష్ణోగ్రతలు ఎక్కడ నమోదైనాయి?
- షాంఘైలో అత్యంత వేడిగా ఉండే నెల ఏది?
- అక్కడ సగటు వార్షిక ఉష్ణోగ్రత ఎంత?
- ఈ ప్రదేశంలో సగటు వార్షిక ఉష్ణోగ్రత అతి తక్కువగా ఉన్న నెల ఏది?

## ఉష్ణోగ్రత పటాలు

భారతదేశం చాలా విశాలమైన దేశం, వివిధ ప్రాంతాల ఉష్ణోగ్రతలలో చాలా తేడాలు ఉంటాయి. ఏ ప్రదేశాలు వేడిగా ఉంటాయో, ఏవి చలిగా ఉంటాయో తెలుసుకోటానికి ఉష్ణోగ్రత పటాన్ని ఉపయోగించవచ్చు.

మీ అట్లాస్‌లో జనవరి నెలలో సగటు ఉష్ణోగ్రతలు చూపించే భారతదేశ పటాన్ని చూడండి.

ఆ నెల గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతల సగటు లెక్కకట్టడం ద్వారా సగటు ఉష్ణోగ్రత వస్తుంది. ఈ పటంలో భారతదేశాన్ని వివిధ భాగాలుగా విభజించారు, ఒక్కొక్క భాగానికి వేరువేరు రంగు ఇచ్చారు. సూచికను చూడటం ద్వారా ఈ భాగాలలో జనవరిలో సగటు ఉష్ణోగ్రత ఎంతో తెలుసుకోవచ్చు.

- అట్లాస్‌లోని పటాల ద్వారా ఈ ప్రదేశాల అక్షాంశాలు, జనవరిలో సగటు ఉష్ణోగ్రతలు తెలుసుకోండి: మొదటిది నింపి ఉంది.

| ప్రదేశం | అక్షాంశం | ఉష్ణోగ్రత జనవరిలో |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్, విజయవాడ | $16.5^0$ఉ.అ. | $22^0$C – $25^0$C మధ్య |
| ఆగ్రా, ఉత్తరప్రదేశ్ | | |
| మదురై, తమిళనాడు | | |
| నాగపూర్, మహారాష్ట్ర | | |

అట్లాస్‌లోని పటం ప్రకారం భారతదేశంలో జనవరి నెలలో $30^0$C సగటు ఉష్ణోగ్రత కంటే ఎక్కువ ఉన్న ప్రదేశాలు ఏవీ లేవు. (ఇది సగటు అన్న విషయం గుర్తుంచుకోండి. కొన్ని ప్రదేశాలలో, జనవరి నెలలో $30^0$C కంటే వేడెక్కే రోజులు కొన్ని ఉండే ఉంటాయి.)

పటం చూసి (జనవరి నెలలో) సాధారణంగా సగటు ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే ప్రదేశాలు ఏవో చెప్పండి.

ఈ ప్రదేశాలకు ఉత్తరంగా వెళితే జనవరి నెలలో సగటు ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుందా, తక్కువగా ఉంటుందా?

## ఉత్తర ప్రాంతంలో శీతాకాలంలో బాగా చలిగా ఎందుకు ఉంటుంది?

కింద ఉన్న పట్టికలో భారతదేశంలోని కొన్ని పట్టణాలలో జనవరి 10న సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలు ఉన్నాయి. వీటి ఆధారంగా పట్టిక కింద ఉన్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వండి.

KZCP6H

| ప్రదేశం | సూర్యోదయం | సూర్యాస్తమయం |
|---|---|---|
| హైదరాబాదు, తెలంగాణ | 6 : 49 | 5 : 58 |
| ఆగ్రా, ఉత్తరప్రదేశ్ | 7 : 09 | 5 : 42 |
| మదురై, తమిళనాడు | 6 : 37 | 6 : 12 |
| నాగపూర్, మహారాష్ట్ర | 6 : 53 | 5 : 48 |
| విశాఖపట్టణం, ఆం.ప్ర. | 6 : 29 | 5 : 38 |
| కోహిమా, నాగాలాండ్ | 6 : 02 | 4 : 40 |

- పైన ఉన్న ఆరు పట్టణాలలో ముందుగా సూర్యోదయం ఎక్కడ అవుతుంది?
- ఏ పట్టణంలో అన్నిటికంటే చివర సూర్యాస్తమయం అవుతుంది?
- ఈ ఆరు పట్టణాలలో పగటికాలం ఎంత? (సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం మధ్య ఉన్న కాలం పగటి కాలం అవుతుంది.)
- ఉత్తరాన ఉన్న పట్టణాలలో పగటికాలం, దక్షిణాది పట్టణాల కన్న, ఎక్కువా? తక్కువా? ఎందుకు?
- పై సమాధానం ఆధారంగా శీతాకాలంలో భారతదేశంలో దక్షిణాదికంటే ఉత్తరాన ఎందుకు చల్లగా ఉంటుందని కారణం చెప్పగలవా?

### కీలక పదాలు

1. వాతావరణం
2. భూమధ్యరేఖా ప్రాంతం
3. ఘనీభవనం
4. సౌర వికిరణం
5. సూర్యపుటం
6. పతన కోణం
7. ఉష్ణ సమతుల్యం
8. గరిష్ఠ ఉష్ణోగ్రత
9. కనిష్ఠ ఉష్ణోగ్రత
10. ఉష్ణ విలోమనం
11. భూగోళం వేడెక్కటం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. తప్పు వాక్యాలను సరి చేయండి - $AS_1$

అ) ఒక ప్రదేశం సముద్రానికి దగ్గరగా ఉంటే, భూమధ్యరేఖ నుంచి ఎంత దూరంలో ఉంది అన్నదానితో సంబంధం లేకుండా ఎప్పుడూ చల్లగా ఉంటుంది.

ఆ) భూమి నుంచి పైకి వెళుతున్న కొద్దీ సూర్యుడికి దగ్గరగా వెళతారు కాబట్టి బాగా వేడిగా ఉంటుంది.

ఇ) సూర్యుడు ముందుగా గాలిని వేడిచేసి, తరవాత భూమిని వేడి చేస్తాడు.

ఈ) భూగోళం వేడెక్కటానికి ప్రాణవాయువు (ఆక్సిజన్)తో సంబంధం ఉంది.

2. పట్టిక 2లో అత్యధిక ఉష్ణోగ్రతకు, పట్టిక 1లో అతి తక్కువ ఉష్ణోగ్రతకు ఎంత తేడా ఉంది? $AS_3$

3. డిసెంబరు 6న ఉదయం 10 గంటలకు మాస్కోలో ఉష్ణోగ్రత $-8^0C$ అనుకుందాం. ఇరవైనాలుగు గంటల తరవాత ఉష్ణోగ్రత $12^0C$ ఎక్కువ ఉంది. డిసెంబరు 7న ఉదయం 10 గంటలకు అక్కడ ఉష్ణోగ్రత ఎంత? $AS_5$

4. ఢిల్లీ, ముంబయి మైదాన ప్రాంతంలో ఉన్నాయి, సముద్ర మట్టం నుంచి వాటి ఎత్తు 300 మీటర్ల లోపు ఉంటుంది. వాటి నెలసరి సగటు ఉష్ణోగ్రతలలో అంత తేడా ఎందుకు ఉంది? ఈ రెండు నగరాలలో ఏ నెలల్లో సగటు ఉష్ణోగ్రతలు దాదాపు ఒకటిగా ఉంటాయి? వాటికి కారణాలు వివరించండి. $AS_1$

5. జోధ్‌పూర్ (రాజస్థాన్)లో నెలసరి సగటు గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు కింద పట్టికలో ఉన్నాయి. వాటితో రేఖాచిత్ర పటం (గ్రాఫ్) గీయండి. సంవత్సరంలో చాలా వేడిగా, చాలా చలిగా ఉండే నెలలు ఏవి? $AS_3$

**జోధ్‌పూర్‌లో నెలసరి సగటు గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు ($^0C$)**

| నెల | జన | ఫిబ్ర | మార్చి | ఏప్రి | మే | జూన్ | జులై | ఆగస్టు | సెప్టె | అక్టో | నవ | డిసె |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| కనిష్ఠ | 9 | 12 | 17 | 22 | 27 | 29 | 27 | 25 | 24 | 20 | 14 | 11 |
| గరిష్ఠ | 25 | 28 | 33 | 38 | 42 | 40 | 36 | 33 | 35 | 36 | 31 | 27 |


6. ఎ, బి, సి అనే మూడు ప్రదేశాల సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు కింద పట్టికలో ఉన్నాయి. వాటి రేఖా చిత్రపటం (గ్రాఫ్) తయారు చేయండి. పట్టిక, రేఖా చిత్రపటాలు చూసి ఆ ప్రదేశాల గురించి మీరు ఏమి ఊహిస్తారు. $AS_3$

| నెల | జన | ఫిబ్ర | మార్చి | ఏప్రి | మే | జూన్ | జులై | ఆగ | సెప్టె | అక్టో | నవ | డిసె |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎ | 23 | 26 | 33 | 38 | 41 | 39 | 34 | 33 | 33 | 33 | 29 | 25 |
| బి | -3 | 1 | 6 | 12 | 17 | 25 | 25 | 24 | 21 | 14 | 8 | 2 |
| సి | 31 | 32 | 33 | 32 | 32 | 29 | 29 | 29 | 30 | 30 | 30 | 31 |

7. జనవరిలో సిమ్లా, తిరువనంతపురం సగటు ఉష్ణోగ్రతలలో తేడాలకు మూడు కారణాలను ఇవ్వండి. (అట్లాస్ చూడండి.) $AS_3$

8. భోపాల్, ఢిల్లీ, ముంబయి, సిమ్లాలలో ఏ రెండు ప్రదేశాలు ఒకే రకమైన ఉష్ణోగ్రత తీరును కలిగి ఉంటాయి? ఈ రెండు ప్రదేశాల మధ్య పోలికలకు కారణాలు వివరించండి. $AS_1$

9. కింద ఉన్న రేఖా చిత్రపటం (గ్రాఫ్) చూసి కింది ప్రశ్నలకు సమాధానం ఇవ్వండి: $AS_3$




అ) జులైలో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత ఎంత?

ఆ) డిసెంబరు నెలలో సాధారణంగా ఎంత వేడిగా ఉంటుంది?

ఇ) జూన్ నెలలో సాధారణంగా ఎంత చలిగా ఉంటుంది?

ఈ) పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో తేడా మే నెలలో ఎక్కువగా ఉంటుందా లేక ఆగస్టులోనా?

ఉ) వేసవి నెలలు ఏవి?

10. నితిన్ థర్మల్ విద్యుత్తు మంచిదని అంటున్నాడు. కాని పద్మజ సౌర విద్యుత్తు మంచిదని అంటున్నది. వీరిలో ఎవరిని సమర్థిస్తారు? ఎందుకు? $AS_4$

11. పేజి నెం. 27లోని 'ఎత్తు – ఉష్ణోగ్రత' అంశాన్ని చదివి వ్యాఖ్యానించండి. $AS_2$

పాఠం 3

# భూ చలనాలు - రుతువులు

## మారుతున్న కాలాలు

అనేక చెట్లు, జంతువులతో కలిసి మనుషులు సహజీవనం చేస్తున్నారు. కాలం గడుస్తున్న క్రమంలో మన పరిసరాల్లో నిరంతరం మార్పులు గమనిస్తూ ఉంటాం. మొక్కలు, చెట్లు పూలు పూస్తాయి, కాయలు కాస్తాయి, జంతువుల ప్రవర్తనలో మార్పు ఉంటుంది. నెలలు గడుస్తున్న కొద్దీ చెట్లు ఆకులను రాల్చటం గమనించి ఉంటారు. కొంతకాలం బోసిగా ఉండి చెట్లు కొత్త చిగుళ్ల తొడుగుతాయి. మళ్లీ పూలు పూస్తాయి, కాయలు కాస్తాయి. అదేవిధంగా సంవత్సరంలోని వివిధ కాలాల్లో వేరు వేరు రకాల పళ్లు, కూర గాయలు రావటం గమనించి ఉంటారు. కొన్ని నెలల్లో చాలా వేడిగా ఉంటుంది, మరి కొన్ని నెలల్లో చాలా చలిగా లేదా వానలు పడుతూ ఉంటుంది.

KZGBUT

- మీరు గమనించిన ముఖ్యమైన కాలాలు, సంబంధాలు పోల్చండి.

- ప్రతి కాలంలో ఏం జరుగుతుందో వివరించండి - ఎంత వేడెక్కుతుంది, ఎంత వాన పడుతుంది, మొక్కలు, చెట్లు, పశువులకు ఏమవుతుంది, తినటానికి ఏమి ఆహారం దొరుకుతుంది.
- కాలాలు భిన్నంగా ఉండే దూరప్రాంతాల నుంచి వచ్చినవారు ఎవరైనా మీ తరగతిలో ఉన్నారా? అక్కడ ఏం జరుగుతుందో వాళ్లను వివరించమనండి.

కింద ఇచ్చిన చిత్రం (3.1)ను జాగ్రత్తగా గమనించండి.

- చిత్రాల్లో ఉంది ఒకే చెట్టా, లేక వేరు వేరు చెట్లా?
- ఈ చెట్లలో ఏమి తేడాలు గమనించారు?

మొదటి చిత్రంలో చెట్టు, పరిసరాలు మంచుతో కప్పి ఉన్నాయి. మూడవ చిత్రంలో మంచులేదు, అదే

*చిత్రం 3.1 : వివిధ కాలాల్లో లాన్‌సెస్టర్ (అమెరికా సంయుక్త రాష్ట్రాలు) లోని ఒక చెట్టు*



చెట్టు కొత్త చిగురులు తొడుగుతోంది. రెండవ చిత్రంలో అదే చెట్టు పూర్తిగా పెరిగిన ఆకులతో ఉంది. చివరి చిత్రంలో కూడా అదే చెట్టు ఉంది – దాని ఆకులు ఎర్రగా పండి, రాలుతున్నాయి. ఈ మార్పులు ఎందుకు జరుగుతున్నాయో మీకు తెలుసా? అవును, కాలాల వల్లనే ఈ మార్పులు సంభవిస్తున్నాయి.

మీ పరిసరాలు మంచుతో కప్పి ఉండటం ఎప్పుడైనా చూశారా? నీళ్లతో నిండి ఉండటం చూసి ఉంటారు కానీ మంచుతో కప్పి ఉండటం చూసి ఉండరు. మన భూమిపై కొంత ప్రాంతంలో బాగా చలిగా ఉండి వానకు బదులు మంచు కురుస్తుంది. మీరు చూసిన చెట్టు చిత్రం అమెరికాలోని ఓహియో లోనిది. ఉత్తర ప్రాంతపు దేశాలలో శీతాకాలంలో మంచు బాగా కురుస్తుంది అక్కడ వేసవిలో మరీ చల్లగా ఉండదు కానీ మన రాష్ట్రంలో కంటే చల్లగానే ఉంటుంది. అయితే తమాషా అయిన విషయం ఏమిటంటే ఆ దేశాలలో పగటి సమయం చాలా ఎక్కువగా ఉంటుంది – ఎంత ఎక్కువ అంటే అర్ధరాత్రి సమయంలో కూడా సూర్యుడు కనపడతాడు!

'అర్ధరాత్రి సూర్యుడు ఉదయించే దేశం' అని ఏ దేశాన్ని అంటారో తెలుసుకుని దానిని గ్లోబు మీద గుర్తించండి. దాని రేఖాంశం తెలుసుకుని ఆంధ్రప్రదేశ్ రేఖాంశంతో పోల్చండి.

గ్లోబు మీద ఆస్ట్రేలియా, దక్షిణ ఆఫ్రికా, చిలీ దేశాలను గుర్తించండి. ఇవి భూమధ్యరేఖకు దక్షిణాన ఉంటాయి కాబట్టి వీటిని దక్షిణాది ఖండాలలోని దేశాలంటారు. ఈ దేశాలలో కాలాల చక్రం భిన్నంగా ఉంటుంది. మనకు వేసవి ఉన్నప్పుడు వాళ్లకు చలికాలం, మనకు చలికాలం ఉన్నప్పుడు వాళ్లకు వేసవికాలం ఉంటుంది! భూమధ్యరేఖకు దక్షిణాన ఉన్న అన్ని ప్రాంతాలలోనూ ఇలాగే ఉంటుంది.

- గ్లోబును చూసి భూమధ్యరేఖకు దక్షిణాన ఉన్న దేశాలను గుర్తించండి.

ఆసియా : ....................................

ఆఫ్రికా: ....................................

యూరపు: ....................................

ఉత్తర అమెరికా: ...............................

దక్షిణ అమెరికా: ...............................

ఆస్ట్రేలియా: ..................................

- భూమధ్యరేఖకు మొత్తం ఉత్తరాన ఉన్న ఖండం ఏదైనా మీకు కనిపించిందా?
- భూమధ్యరేఖకు మొత్తం దక్షిణాన ఉన్న ఖండం ఏదైనా మీకు కనిపించిందా?
- భూమధ్యరేఖకు ఉత్తరాన, దక్షిణాన విస్తరించిన ఖండం ఏదైనా మీకు కనిపించిందా?
- కాలాల మాయాజాలానికి సంబంధించి ప్రతి ఒక్కరూ మూడు ప్రశ్నలు రాయండి. వాటికి సమాధానాలు కనుక్కోటానికి ప్రయత్నిద్దాం.

ఇటువంటి ప్రశ్నలు ఉన్నది మీ ఒక్కరికే కాదు. వేలాది సంవత్సరాలుగా మనుషులు ఈ విషయాలపై పరిశీలనలు చేసి క్రమేపీ సమాధానాలు కనుక్కున్నారు. కాలాలు ఎలా సంభవిస్తున్నాయో, కొన్ని ప్రాంతాలు వెచ్చగానూ, కొన్ని ప్రాంతాలు చలిగానూ ఎందుకు ఉంటున్నాయో, ఉత్తర, దక్షిణార్ధ గోళాలలో కాలాలు వ్యతిరేకంగా ఎందుకు ఉంటాయో అర్థం చేసుకోటానికి ప్రయత్నిద్దాం.

## కాలాల క్రమాన్ని ప్రభావితం చేసే అంశాలు

వీటిని అర్థం చేసుకోటానికి అనేక అంశాల మధ్య ఉండే సంక్లిష్ట సంబంధాలను అర్థం చేసుకోవాలి. ఇవి:

1) భూమి బంతిలాగా గోళాకారంలో ఉండటం, దాని ఉపరితలం ఒంపు తిరిగి ఉండటం
2) భూమి తన అక్షం మీద రోజుకు ఒకసారి తన చుట్టూ తాను తిరగటం (భూభ్రమణం)
3) సూర్యుడి చుట్టూ భూమి తిరిగే తలంతో పోలిస్తే తన చుట్టూ తాను తిరిగే అక్షం ఒంపు కలిగి ఉండటం
4) సంవత్సరకాలంలో సూర్యుని చుట్టూ భూమి తిరగటం (పరిభ్రమణం).

### 1. భూమి ఉపరితలం ఒంపుగా ఉండటం

భూమి గోళాకారంలో ఉన్నందువల్ల వేరు వేరు ప్రాంతాలు వేడెక్కటంలో తేడాలు ఉన్నాయని మీరు ఇంతకుముందు పాఠంలో తెలుసుకున్నారు. ధృవాలతో పోలిస్తే భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న ప్రాంతాలు బాగా వేడెక్కుతాయని మీరు తెలుసుకున్నారు.


### 2. భూమి అక్షంమీద తన చుట్టూ తాను తిరగటం

బొంగరం తిరిగినట్టే భూమి కూడా తన చుట్టూ తాను గిరగిరా తిరుగుతోంది. అది అలా దేనిమీద తిరుగుతోంది? ఉత్తర, దక్షిణ ధృవాలను కలిపే ఒక ఊహాజనిత రేఖ మీద తిరుగుతోంది. ఈ రేఖనే అక్షం అని అంటారు. భూమిమీద అన్ని ప్రాంతాలు ఈ రేఖగుండా రోజుకు ఒకసారి ప్రయాణిస్తాయి. ఇంకో మాటల్లో చెప్పాలంటే తన అక్షం మీద తాను ఒకసారి తిరిగి రావటానికి భూమికి 24 గంటలు పడుతుంది. అది పడమర నుంచి తూర్పుకి తిరుగుతోంది. మీ ముందు గ్లోబు ఉంచుకుని ఎడమవైపునుంచి కుడివైపుకు తిప్పితే ఎలా ఉంటుందో భూమి అలా తిరుగుతుంటుంది. గ్లోబులో పశ్చిమ భాగం తూర్పు వైపుకు తిరగటం మీకు కనపడుతుంది.

భూమి తన చుట్టూ తాను తిరుగుతున్నప్పుడు దానితోపాటు దానిపైన ఉన్న గాలి, మబ్బులు, పక్షులు అన్నీ తిరుగుతాయి. అందుకే మనం బస్సులోనో, రైలులోనో ప్రయాణిస్తున్నప్పుడు కలిగిన అనుభూతి భూమి తన చుట్టూ తాను తిరుగుతున్నప్పుడు కలగదు.

భూమి పడమర వైపు నుంచి తూర్పుకి తిరుగుతున్నందు వల్లనే మనకు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు తూర్పున ఉదయించి, పశ్చిమాన అస్తమిస్తున్నాయన్న భ్రమ కలుగుతోంది.

భూమి తన చుట్టూ తాను తిరుగుతుండటం వల్ల పగళ్లు, రాత్రులు సంభవిస్తున్నాయి – సూర్యునికి ఎదురుగా ఉన్న భూ భాగంలో పగలు అవుతుంది. సూర్యునికి ఎదురుగా ఉండే ప్రాంతం మారుతూ ఉండటం వల్ల స్థానిక ఉష్ణోగ్రతలు, గాలుల కదలికలు ఎంతో ప్రభావితమవుతాయి.



చిత్రం 3.2 : భూ భ్రమణం (పడమర నుండి తూర్పుకి)

**కృత్యం**

గ్లోబు తీసుకుని కొంత దూరం నుంచి దాని మీదకు టార్చిలైటు కాంతి ప్రసరింపచేయండి. టార్చ్ కాంతి వల్ల గ్లోబు మీద సగభాగం ప్రకాశవంతం అవుతుంది. ఈ కాంతి ముందు గ్లోబుని తిప్పుతూ ఉన్నా సగభాగమే ప్రకాశవంతంగా ఉంటుంది.

ఇదేవిధంగా సూర్యుడు కూడా ఎల్లవేళలా భూమిలో సగభాగాన్ని ప్రకాశవంతం చేస్తుంటాడు. సూర్యుడు ప్రకాశవంతం చేసే గోళాకార అంచును ప్రకాశ వృత్తం అంటారు. భూమిని వెలుతురులో ఉండే సగం, చీకటిలో ఉండే సగంగా ఈ మహావృత్తం విభజిస్తుంది.

KZJYIQ

భూమి తన అక్షం మీద తన చుట్టూ తాను తిరగకపోతే ఏమవుతుంది? భూమి వైపుకి ఉన్న భాగానికే ఎల్లప్పుడూ సూర్యుని కాంతి, వేడిమి లభిస్తుంటాయి, మిగిలిన భాగం చీకటిలో, చలిగా ఉండిపోతుంది. ఫలితంగా రెండు ప్రాంతాలూ జీవనానికి అనువుగా ఉండవు– సూర్యుడివైపు ఉన్న భాగం చాలా వేడెక్కిపోతుంది, చీకటిలో ఉన్న భాగం చాలా చల్లగా అయిపోతుంది. భూ భ్రమణం వల్ల భూమి అంతటికీ ప్రతి రోజూ కాంతి, వేడిమి అందుతుంటాయి.

## 3. భూమి 'వంగి' ఉండటం, సూర్యుడి చుట్టూ పరిభ్రమణం


భూమి తన చుట్టూ తాను తిరుగుతూనే సూర్యుడి చుట్టూ కూడా తిరుగుతోంది. అంటే అది బొంగరం మాదిరి గుండ్రంగా తిరుగుతూనే ముందుకు కదులుతూ సూర్యుడి చుట్టూ ప్రదక్షిణం చేస్తోంది. సూర్యుడి చుట్టూ భూమి తిరగటాన్ని 'పరిభ్రమణం' అంటారని తెలుసుకున్నాం. ఒక పరిభ్రమణానికి 365 రోజులా 5.56 గంటలు పడుతుంది. ఈ కాలాన్నే భూమి మీద ఒక సంవత్సరం అంటారు. ఇది భూమి మీద కాలాలను ఎలా కలిగిస్తుంది?

భూమి కేవలం సూర్యుడి చుట్టూ తిరుగుతుంటే ఆయా ప్రాంతాలలో సంవత్సరమంతా ఒకే కాలం ఉండేది. ఎక్కువ ఎండ వచ్చే ప్రాంతానికి సంవత్సరమంతా ఎక్కువ ఎండ వస్తూ ఉండేది, అలాగే చలిగా ఉండే ప్రాంతాలు చలిగా ఉండేవి. కానీ ఇలా జరగటం లేదు, భూమి అక్షం వంగి (వాలుగా) ఉంది, ఇది సంవత్సరమంతా ఒకే వైపుకి ఉంటుంది. 'వంగి ఉన్న అక్షం' అంటే ఏమిటి?

సూర్యుడి చుట్టూ భూమి ఒకే తలంలో, ఒకే దారిలో తిరుగుతుంటుంది దీనినే కక్ష్య అంటారు. ఈ తలాన్ని కక్ష్యతలం అంటారు. భూమి అక్షం ఈ తలం మీద నిటారుగా ఉండదు (అంటే $90^0$ కోణం ఏర్పడదు), అది వంగి ఉండి $66.5^0$ కోణం కలిగి ఉంటుంది. వేరే మాటల్లో చెప్పాలంటే అది $23.5^0$ మేర వంగి ఉంటుంది ($90^0$–$66.5^0$=$23.5^0$). ఈ భావనను అర్థం చేసుకోవటానికి కింది చిత్రాలను చూడండి.

సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతూ ఉన్నప్పుడు సంవత్సరమంతా దాని అక్షం ఒకేవైపుకి వంగి ఉంటుంది. అది ధృవ నక్షత్రం వైపు చూపిస్తూ ఉంటుంది (రాత్రివేళల్లో ఉత్తరాన ధృవనక్షత్రాన్ని చూడవచ్చు). దీనిని అక్ష ధృవత్వం (పోలారిటీ ఆఫ్ ఆక్సిస్) అంటారు.

ఈ విధంగా సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతుంటే ఏమవుతుందో కింది చిత్రాలలో చూడవచ్చు. కొన్ని నెలల్లో (జూన్) ఉత్తరార్ధ గోళం సూర్యుడివైపుకి వంగి ఉంటే మరికొన్ని నెలల్లో దక్షిణార్ధగోళం సూర్యుడివైపుకి వంగి ఉంటుంది. ఈ కారణంగా ఉత్తరార్ధగోళంలో వేసవి ఉన్నప్పుడు, దక్షిణార్ధగోళంలో శీతాకాలం అవుతుంది. ఆరు నెలల తరవాత (డిసెంబరులో) పరిస్థితి మారుతుంది.




*చిత్రం 3.3 : ఉత్తర – దక్షిణార్ధ గోళాల్లో ఋతువులు*

వాస్తవానికి ఆకాశం నుంచి భూమిని చూసినప్పుడు మనకి అక్షంగానీ, వంపుగానీ కనపడవు. మనకు సూర్యుడు, చంద్రుడు కనపడినట్లే భూమి కూడా గుండ్రటి పళ్లెంలాగా కనపడుతుంది. ఈ వంగి ఉండటం అన్నది ఊహాజనితమైన అక్ష రేఖనుంచి ఉంది కాబట్టి అది మనకు కనపడదు.



చిత్రం 3.4 : చంద్రుడి నుంచి భూమి ఛాయా చిత్రం

ఉత్తరార్ధగోళంలో శీతాకాలం, దక్షిణార్ధ గోళంలో వేసవికాలం అవుతాయి. మార్చి, సెప్టెంబరు వంటి కొన్ని నెలల్లో సూర్యుడికి నేరుగా భూమధ్యరేఖ ఉన్నప్పుడు ఉత్తరార్ధ, దక్షిణార్ధ గోళాలకు ఒకే మోతాదులో సూర్యుడి నుంచి వేడిమి లభిస్తుంది.

- సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతోంది కానీ అక్షం వంగి లేదని ఊహించుకోండి. ఆంధ్రప్రదేశ్‌లో కాలాల్లో మార్పులను అది ఏ రకంగా ప్రభావితం చేస్తుంది?
- ఇది ఈ పాఠం ప్రారంభంలో చూసిన చిత్రాల ఉత్తర ప్రాంతంలో కాలాల మార్పులను ఏ రకంగా ప్రభావితం చేస్తుంది?

## భూమి మీద ఉష్ణోగ్రత మేఖలలు

KZLK8J

భూమి అక్షం వంగి ఉండటం, గోళాకారంలో ఉండటం కలిసి భూమి మీద సూర్యుడి ఉష్ణోగ్రత విస్తరణను ఎలా ప్రభావితం చేస్తుందో చూద్దాం. సూర్యుని కిరణాలు భూమి ఉపరితలాన్ని తాకినప్పుడు సూర్యుడికి నేరుగా ఉన్న ప్రాంతంలో నిటారుగానూ మిగిలిన ప్రాంతాలలో కోణంలోనూ పడతాయని ఇంతకు ముందు తెలుసుకున్నాం. రెండు ధృవాల వైపుకి వెళుతున్నకొద్దీ ఈ కోణం పెరుగుతుంది. సూర్యుడి కిరణాలు నిటారుగా పడే ప్రాంతంలో వేడిగానూ, కోణంలో పడే ప్రాంతంలో తక్కువ వేడిగానూ ఉంటుంది.

అక్షం మీద భూమి వంగి ఉండటం వల్ల సూర్యుడికి నేరుగా ఉండే ప్రాంతం సంవత్సరమంతా మారుతుంటుంది. మార్చినెలలో సూర్యుడి కిరణాలు భూమధ్యరేఖమీద నిటారుగా పడుతుంటాయి, జూన్‌లో ఉత్తరార్ధగోళంలో కర్కటరేఖ మీద నిటారుగా పడుతుంటాయి. సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతూ ఉన్న క్రమంలో సెప్టెంబరు నెలలో తిరిగి భూమధ్యరేఖ మీద సూర్యుడి కిరణాలు నిటారుగా పడుతుంటాయి, డిసెంబరులో దక్షిణార్ధగోళంలో మకరరేఖ మీద నిటారుగా పడుతుంటాయి. అంటే సంవత్సరంలో ఏదో ఒక సమయంలో సూర్యుని కిరణాలు నిటారుగా పడే ఒక ప్రాంతం ఉంటుంది. కర్కటరేఖనుంచి, మకర రేఖ వరకు ఉన్న ఈ ప్రాంతాన్ని ఉష్ణమండలం అంటారు. ఈ మండలం సూర్యుడి నుంచి చాలా ఎక్కువ వేడిమిని పొందుతుంది.

జూన్ 21 – కర్కటకరేఖ మీద సూర్యుడు
మార్చి 21 – సెప్టెంబరు 23 – భూమధ్యరేఖ మీద సూర్యుడు
డిసెంబరు 22 – మకర రేఖ మీద సూర్యుడు

మార్చి 21, సెప్టెంబరు 23న ప్రపంచ వ్యాప్తంగా పగలు, రాత్రి సమానంగా ఉంటాయి. ఈ రెండు రోజులను విషువత్తులు (equinoxes) అంటారు.

ఈ ఉష్ణ మండలం నుంచి ఉత్తరానికి లేక దక్షిణానికి ప్రయాణిస్తే వేసవిలో వేడిగా ఉండే, శీతాకాలంలో చాలా చలిగా ఉండే ప్రాంతం వస్తుంది. ఇది సమశీతోష్ణ మండలం. ఈ మండలపు ఉత్తర భాగాలలో శీతాకాలంలో మంచు పడుతుంది.

- ఆంధ్రప్రదేశ్ ఉష్ణమండలంలో ఉందో, సమశీతోష్ణ మండలంలో ఉందో తెలుసుకోండి.
- ఏ నెలలోనైనా సూర్యుడి కిరణాలు ఆంధ్రప్రదేశ్‌లో నిటారుగా పడతాయా? పడితే, ఏ నెలలో?
- ఢిల్లీ ఏ మండలంలో ఉందో తెలుసుకుని, శీతాకాలంలో అక్కడ మంచు కురుస్తుందేమో తెలుసుకోండి.

సమశీతోష్ణ మండలాలనుంచి ఇంకా ఉత్తరంగా లేక దక్షిణంగా ప్రయాణం చేస్తే ధృవప్రాంతాలను చేరుకుంటారు. ఇక్కడ కాలాలు చాలా వింతగా ఉంటాయి. శీతాకాలపు నెలల్లో ఈ ప్రాంతాలు సూర్యుడికి అవతలివైపున ఉంటాయి – అప్పుడు పగలు కూడా సూర్యుడు ఉండడు! అంటే ధృవాల దగ్గర ఆరు నెలలపాటు సూర్యుడు కనపడడు. ఆ తరవాత ఈ ప్రాంతాలు ఆరు నెలలు 24 గంటలపాటు సూర్యుడికి అభిముఖంగానే ఉంటాయి – అంటే రాత్రి, చీకటి ఉండవు! ఆరు నెలలపాటు పగలు, ఆరు నెలలపాటు రాత్రి ఉండే ప్రాంతం! 'పగలు' ఉన్న సమయంలో కూడా సూర్యుని కిరణాలు చాలా ఏటవాలుగా పడతాయి. సూర్యుడు ఆకాశంలో పైకి ఎక్కడు, సూర్యోదయం అయ్యే ప్రదేశానికి (దీనినే క్షితిజ రేఖ లేక దిగ్మండలం అంటారు) కొంచెం ఎత్తులోనే ఉంటుంది. అందుకే అక్కడ అంతగా వేడెక్కదు. మిగిలిన ఆరు నెలలు అక్కడ తీవ్రమైన చలి – ఎంత చలి అంటే ఆర్కిటిక్ సముద్రం సంవత్సరమంతా గడ్డ కట్టుకునే ఉంటుంది. ఆ చలికి మట్టి కూడా రాయిలాగా గడ్డ కట్టుకుని చెట్ల వేళ్లు కూడా చొచ్చుకుని పోలేవు. కాబట్టి ఈ ప్రాంతంలో అసలు చెట్లు పెరగవు. ఆరు నెలలపాటు సూర్యుడు ఉన్నప్పుడు మంచు కరుగుతుంది, సముద్రం కూడా కొంత కరుగుతుంది.

KZQ7HG

నాచువంటి మొక్కలు, కొన్ని పూలజాతి మొక్కలు మాత్రమే పెరుగుతాయి.



*చిత్రం 3.5:* ఉత్తరాది వెలుగులు – దిగ్మండలంపై సూర్యోదయం కాని సమయం/ రుతువులో ఉత్తర ధృవ ప్రాంతంలో ఇలా కనిపిస్తుంది

## కీలక పదాలు

1. కాలాలు
2. భూమి ఉపరితలం వంపు తిరిగి ఉండటం
3. భూమి అక్షం వంగి ఉండటం
4. మంచు కురవటం
5. ఉష్ణోగ్రతా మండలాలు
6. దిగ్మండలం

KZTUKD

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. మీ ప్రాంతంలో పండించే పంటలకు, కాలాలకు మధ్య సంబంధం ఏదైనా ఉందా? పెద్దవాళ్లతోటి, మిత్రులతోటి చర్చించి దీనిమీద చిన్న వ్యాసం రాయండి. $AS_4$
2. శీతాకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో మంచు కురవకపోవటానికి కారణం ఏమిటి? $AS_1$
3. మనకు వానాకాలం ఉంది. భూమి పరిభ్రమణానికీ, సూర్యునికిరణాలు పడే తీరుకీ – వానాకాలానికీ మధ్య సంబంధం ఏమిటి? వానలు వేసవిలో పడతాయా, లేక శీతాకాలంలోనా, లేక రెండింటికీ మధ్యలోనా? $AS_1$
4. మీ ప్రాంతంలో వివిధ నెలల్లో సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాల సమాచారం సేకరించండి (స్థానిక దినపత్రికల ద్వారా ఈ విషయం తెలుస్తుంది). ప్రతి రోజూ పగటికాలం, రాత్రికాలం ఎంతో అన్ని నెలలకూ లెక్క కట్టండి. దీంట్లో ఏమైనా ఒక పద్ధతి కనపడుతోందా? $AS_3$
5. భూ భ్రమణం గురించి మీ తల్లిదండ్రులకు లేదా తమ్ముడు, చెల్లెలికి వివరించండి. వాళ్లకు వచ్చిన అనుమానాలు, ప్రశ్నలు రాసుకోండి. $AS_4$
6. భూమి తన చుట్టూ తాను తిరగకుండా ఒక సంవత్సర కాలంలో సూర్యుడి చుట్టూ తిరుగుతోందని ఊహించుకోండి. దీని వల్ల వేరు వేరు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు, కాలాల్లో ఎటువంటి మార్పు ఉంటుంది? $AS_4$
7. ఉత్తరార్ధ, దక్షిణార్ధ గోళాల్లోని సమశీతోష్ణ మండలంలో ఒక్కొక్క దేశాన్ని గుర్తించండి. ఆ దేశాలలోని కాలాలను మీ ప్రాంతపు కాలాలతో పోల్చండి. మే-జూన్ నెలల్లో ఏ ప్రాంతం వేడిగా ఉంటుంది, డిసెంబరు-జనవరి నెలల్లో లేదా మార్చి, సెప్టెంబరు నెలలో ఏ ప్రాంతం చలిగా ఉంటుంది? $AS_5$
8. భారతదేశంలోని ఆరు రుతువులు ఏమిటి? $AS_1$
9. ఈ పాఠంలోని మొదటి పేరాగ్రాఫ్ చదివి కింది ప్రశ్నకు జవాబు రాయండి. $AS_2$

   మానవ జీవితాన్ని రుతువులు ఎలా ప్రభావితం చేస్తాయి?


పాఠం 4

# ధృవ ప్రాంతాలు

ఆరవ, ఏడవ తరగతుల్లో ఇప్పటివరకు చూసిన దానికంటే పూర్తిగా భిన్నమైన ప్రాంతం గురించి మీరు ఈ అధ్యాయంలో తెలుసుకోబోతున్నారు. ఈ ప్రాంతంలో అనేక నెలలపాటు వరుసగా పగళ్లు, రాత్రుళ్లు ఉంటాయి. మన దేశంలో మాదిరి రోజూ సూర్యోదయం, సూర్యాస్తమయాలు ఉండవు. ఇటువంటి ప్రదేశం మీరు ఊహించగలరా? ఈ ప్రదేశం చాలా చలిగా ఉంటుంది. ఎంత చలిగా ఉంటుందంటే ఎక్కడ చూసినా మంచు, మంచుగడ్డలే – భూమి మీద మంచు, వాగుల్లో మంచు, నదుల్లో మంచు, చివరికి సముద్రం కూడా గడ్డకట్టుకుపోతుంది (6వ తరగతిలో చదివిన 2వ పాఠం గుర్తుకుతెచ్చుకోండి).



*పటం 1 : ప్రపంచ పటంలో ధృవ ప్రాంతం*




*పటం 2 : మరింత దగ్గరనుంచి ధృవ ప్రాంతం*

## ధృవ ప్రాంతం ఎక్కడ ఉంది?

గ్లోబుమీద ఉత్తర ధృవం, దక్షిణ ధృవాలను చూశారు. ధృవాల దగ్గర ఉండే ప్రాంతాన్ని 'ధృవ ప్రాంతం' అంటారు. ఈ అధ్యాయంలో మీరు ఉత్తర ధృవ ప్రాంతం గురించి తెలుసుకుంటారు. పటం 1 చూడండి. ఇది ఉత్తర ధృవం, దాని చుట్టుపక్కల ప్రాంతాన్ని చూపిస్తుంది. ధృవప్రాంతం వేరే రంగులో చూపబడి ఉంది. ఈ ప్రాంత సరిహద్దును గమనించండి. దీనిని 'ఆర్కిటిక్ వృత్తం' అంటారు.

- ఈ ప్రాంతంలో ఏ ఏ ఖండాల భాగాలు ఉన్నాయి?

ధృవ ప్రాంతంలో ఉన్న ఖండాల ఉత్తర భాగాలను టండ్రా ప్రాంతం అంటారు. టండ్రా అంటే చాలా చలిగా ఉండే ప్రాంతం అని అర్థం. టండ్రా ప్రాంతంలో చాలా తక్కువ సూర్యకాంతి పడుతుంది కాబట్టి ఇక్కడ ప్రత్యేకమైన మొక్కల రకాలు ఉంటాయి, వీటిని 'టండ్రా వృక్షజాలం' అంటారు.

- భూమధ్యరేఖ నుంచి దూరంగా వెళుతున్న కొద్దీ ఏమవుతుందో గుర్తుకు తెచ్చుకోండి.





*చిత్రం 4.1, 4.2 : రెండు చిత్రాల్ని చూడండి. ఏది చలికాలాన్ని చూపిస్తోంది? దేంట్లో మొక్కలు ఉన్నాయి?*

## టండ్రాలో కాలాలు

టండ్రా ప్రాంతంలో చాలా చలిగా ఉంటుంది. అక్కడ ఎంత చలిగా ఉంటుందో ఊహించుకోవటం కూడా కష్టం. మన దేశంలో సూర్యుడు రోజూ ఉదయిస్తాడు, అస్తమిస్తాడు. కానీ టండ్రా ప్రాంతంలో ఇలా జరగదు. నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో సూర్యుడు అసలు ఉదయించడు కాబట్టి చాలా చీకటిగా ఉంటుంది. టండ్రాలో ఇది చలికాలం, ఈ నెలల్లో చలి చాలా తీవ్రంగా ఉంటుంది. చాలా చలిగా ఉన్నప్పుడు నీళ్లు గడ్డకట్టి మంచుగా మారతాయని మీకు తెలుసు. ఈ తీవ్రమైన చలికి నదులు, చెరువులు, సముద్రాలలోని నీళ్లు గడ్డ కడతాయి. బలమైన చల్లటిగాలులు వీస్తాయి, మంచు కురుస్తుంది.

KZZ3Y4

తీవ్రమైన చలి, చీకటి, నీళ్లు గడ్డ కట్టడం వంటి కారణాల వల్ల మొక్కలన్నీ చనిపోతాయి. పక్షులు, జంతువులు కూడా ఈ ప్రాంతాన్ని వదిలిపెట్టి వేరే ప్రాంతాలకు వలస వెళతాయి. ఈ ప్రాంతమంతా చీకటిగా, నిర్జనంగా, నిర్మానుష్యంగా మారిపోతుంది.

### వేసవి

టండ్రా ప్రాంతంలో ఫిబ్రవరి–మార్చి నెలల్లో సూర్యుడు ప్రకాశించటం మొదలుపెడతాడు. మొదట్లో సూర్యుడు గంటన్నర సేపు మాత్రమే ఉండి అస్తమిస్తాడు. సూర్యుడు ఉండే సమయం క్రమేపి 2 గంటలకు, 6 గంటలకు, 8 గంటలకు, 16 గంటలకు పెరిగి చివరికి 24 గంటలసేపు, అంటే రోజంతా సూర్యుడు ప్రకాశిస్తూనే ఉంటాడు! మే నుంచి జులై వరకు మూడు నెలలపాటు సూర్యుడు అస్సలు అస్తమించడు. కాని సూర్యుడు ఎప్పుడూ నడినెత్తికి రాడు. క్షితిజం (భూమి, ఆకాశం కలిసినట్టు అనిపించే ప్రదేశాన్ని క్షితిజం లేదా దిగ్మండలం అంటారు) దగ్గరే ఉంటాడు. సూర్యుడు ఆకాశంలో పైకి రానందు వలన ఈ ప్రాంతం వేడెక్కదు.

వేసవి ఉండే మూడు నెలల్లో కూడా ఇక్కడ చలిగానే ఉంటుంది. అయితే శీతాకాలంతో పోలిస్తే చలి కొంచెం తక్కువగా ఉంటుంది. వాతావరణం కొద్దిగా వెచ్చబడటం వల్ల మంచు కరుగుతుంది. శీతాకాలంలో గడ్డకట్టిన నదులు కరిగి, ప్రవహించటం మొదలు పెడతాయి. చెరువులు నీటితో నిండుతాయి.

పెద్ద పెద్ద మంచుగడ్డలు విడిపోతాయి. ఇవి నీటిలో తేలుతూ సముద్రంలోకి ప్రవేశిస్తాయి. వీటిని 'ఐస్‌బెర్గ్స్' అంటారు.

L13QH1

శీతాకాలంలో నీరు గడ్డకట్టి, నిర్జనంగా మారిన ప్రదేశం వేసవిలో రంగులు అలుముకుని సజీవంగా మారుతుంది. వేసవి రావటంతో అంతటా రంగురంగుల మొక్కలు, నాచు, గడ్డి, పొదలు పెరుగుతాయి. వీటి పూలు, పళ్లు అనేక రంగుల్లో ఉంటాయి. వీటిని తినటానికి అనేక పక్షులు, జంతువులు వస్తాయి.

## వృక్షజాలం

- పక్క పేజీలో ఉన్న చిత్రాలలో మీకు ఏమైనా చెట్లు కనపడ్డాయా?

చలి కారణంగా ఈ ప్రాంతంలోని నేల పై పొర సంవత్సరం పొడవునా రాయిలాగా గడ్డకట్టుకుని ఉంటుంది. దీనిని 'పర్మాఫ్రాస్ట్' – (శాశ్వతంగా గడ్డకట్టుకు) పోవటం అంటారు. చాలా తక్కువ మట్టి ఉంటుంది కాబట్టి కొన్ని చిన్న మొక్కలు మాత్రమే పెరగ గలుగుతాయి. నేల గట్టిగా ఉండటం వల్ల పెద్ద చెట్లు పెరగటం కష్టం. ఒకవేళ పెరిగినా ఇక్కడి బలమైన గాలులు, తుఫానుల వల్ల అవి పెకిలించబడి దెబ్బతింటాయి. కాబట్టి టండ్రాలో అధిక భాగం ఎటువంటి చెట్లూ లేకుండానే ఉంటుంది.

- టండ్రాలోని వేసవి గురించి అయిదు విషయాలు చెప్పండి.
- ఖాళీలను పూరించండి:

  సూర్యుడు______, నెలల్లో కనిపించడు.

  ఈ సమయంలో ______

  నీరు ______ చెట్లు ______
- టండ్రా ప్రాంతంలోని ప్రజలకు చలికాలంలో కాంతి ఎలా లభిస్తుంది?

## టండ్రా ప్రాంతపు ప్రజలు : ఎస్కిమోలు

విశాలమైన చెట్లులేని మైదానాలతో, గడ్డకట్టిన సముద్రాలతో, బీడు, రాళ్లమయమైన దీవులతో ఆర్కిటిక్ ప్రాంతం ఉంటుంది. ఈ అత్యంత చలి ప్రదేశం ఎస్కిమోల నివాసప్రాంతం. గ్రీన్‌లాండ్, కెనడా, అలాస్కా, సైబీరియాలో చెల్లాచెదురుగా, చిన్న చిన్న నివాస ప్రాంతాలలో వీళ్లు ఉంటారు. వేలాది సంవత్సరాలపాటు ఎస్కిమోలు ఇతరులతో సంబంధం లేకుండా జీవించారు. చేపలు పట్టడం, వేటాడటం ద్వారా వాళ్లు ఆహారాన్ని పొందుతారు. తమ ప్రాంతానికి అనువైన జీవన విధానాన్ని వాళ్లు రూపొందించుకున్నారు.

ధృవ ప్రాంతపు విపరీతపు పరిస్థితులను తట్టుకునేలాగా ఎస్కిమోల సాంప్రదాయ జీవితం ఉంటుంది. ఇటీవలి కాలం వరకు ఎస్కిమోలు అనుసరించిన ఈ జీవన విధానం గురించి ఇక్కడ తెలుసుకుంటాం.

'ఎస్కిమో' అన్న పదానికి ఎక్కువ మంది అంగీకరించే అర్థం 'మంచు బూట్ల వ్యక్తి'. ఎస్కిమోలుగా పిలవబడే వారిలో రెండు ప్రధాన బృందాలు ఉన్నాయి. అవి ఇన్యుయిట్, యూపిక్. వాళ్ల భాషలో ఇన్యుయిట్



*చిత్రం 4.3 : ధృవ ప్రాంతపు ప్రజల ఫోటో (1930)*



చిత్రం 4.4 : వాల్‌రస్ అనే జంతు దంతాలతో సైబీరియన్ యుపిక్ మహిళ, చాలా పురాతనమైన ఫోటో

2,000, అలాస్కాలో 30,000, కెనడాలో 22,500, గ్రీన్‌లాండ్‌లో 43,000 ఎస్కిమోలు ఉన్నారు. ఉత్తరాన అడవుల అంచుల్లో కొన్ని ఎస్కిమో బృందాలు ఉన్నాయి. కానీ చాలా మంది అడవులకు ఉత్తరాన ఉన్న చెట్లులేని టండ్రా ప్రాంతంలో, ఆర్కిటిక్ మైదానాల్లో ఉన్నారు.

L15CBU

అంటే స్థానిక 'ప్రజలు' లేదా మూలవాసులు అని అర్థం. సైబీరియా (ప్రస్తుతం ఉత్తర ఆసియాలోని రష్యాలో ఉంది) నుంచి వచ్చిన వాళ్ల వారసులను ఎస్కిమోలు అంటారు.

ఎస్కిమో భాషను వేల సంవత్సరాలుగా మాట్లాడుతున్నారు. కానీ దీనికి ఇటీవలి కాలం వరకు లిపి ఏర్పడలేదు. ఇందులో ప్రధానంగా మూడు భాషలు ఉన్నాయి – అల్యుయిట్, యుపిక్, ఇన్యుపిక్. ఉత్తర అలాస్కా నుంచి గ్రీన్‌లాండ్ వరకు ఇన్యుపిక్ మాట్లాడతారు. ఈ భాష మాట్లాడేవాళ్లే ఎక్కువమంది ఉన్నారు. అయితే ఎస్కిమోలలో కొంచెం, కొంచెం తేడాలతో ఇన్యుపిక్‌లో అనేక యాసలు ఉన్నాయి. యుపిక్‌లోని యాసలు నైరుతి అలాస్కాలో, సైబీరియాలో మాట్లాడతారు.

అయిదు వేల సంవత్సరాల క్రితం ఆసియా నుంచి బేరింగ్ జలసంధి దాటి ఎస్కిమోలు మొదటిసారిగా ఉత్తర అమెరికాలో ప్రవేశించారు. వాళ్లు అనతి కాలంలోనే ఉత్తర కెనడాకి, గ్రీన్‌లాండ్‌కి విస్తరించారు. కొన్ని ఎస్కిమో బృందాలు తిరిగి పశ్చిమవైపుకి ప్రయాణించి బేరింగ్ సముద్ర ప్రాంతంలో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఎస్కిమో జనాభా అంత ఎక్కువగా లేదు కానీ అది వృద్ధి చెందుతూ ఉంది. సైబీరియాలో

- టండ్రా ప్రాంతంలో అన్ని కాలాలలో మనుషులు నివసించక పోవటానికి కారణం ఏమిటి?

## సామూహిక జీవనం)

ఎస్కిమోలు చాలా చిన్న బృందాలలో నివసిస్తారు. 500 కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాలు ఉత్తర అలాస్కా తీరంలో ఉన్నాయి. తూర్పు ప్రాంతంలో (గ్రీన్‌లాండ్, బాఫిన్ దీవి, లాబ్రాడార్‌లలో) సాధారణంగా ఒక బృందంలో 25-45 మంది ఉంటారు. ఈ తూర్పు బృందాలు కాలానుగుణ కార్యక్రమాలతో ముడిపడి సంవత్సరమంతా ఒక చోటు నుంచి మరో చోటుకి వెళుతూ సంచార జీవనం గడుపుతుంటాయి. శీతాకాలంలో తీరం దగ్గర ఉండి సముద్రపు సీల్ జంతువులను, చేపలను పడతారు. వేసవిలో సముద్రం నుంచి లోపలి ప్రాంతాలలో (దుప్పిలాంటి) కారిబో అనే జంతువులను వేటాడుతూ, పళ్లు సేకరిస్తూ గడుపుతారు. ఈ విధంగా



చిత్రం 4.5: హార్పూన్ ఆయుధం

వాళ్లు తమ సంచార జీవనంలో 1100 కిలోమీటర్లు తిరుగుతారు. కుక్కలు లాగే మంచు బళ్లను (స్లెడ్జ్) రవాణాకు ఉపయోగిస్తారు. నీటిలో ఉమియాక్స్ అనే పడవలను ఉపయోగిస్తారు.

అనుకూలంగా లేని ఇటువంటి వాతావరణంలో మనుగడ సాగించటానికి ఎస్కిమోలు బృందంగా కలిసి పనిచెయ్యాలి. వేట వంటి పనులలో బృంద సభ్యులంతా కలిసి పని చేస్తారు. ఉదాహరణకు తూర్పు బృందాలలో శీతాకాలంలో గడ్డకట్టిన సముద్రాలలో సీల్ జంతువులు ఊపిరి తీసుకునే రంధ్రాల వద్ద వాటిని వేటాడటానికి 10-12 మంది వేటగాళ్లు కలిసి పనిచేయటం అవసరం. కారిబో వంటి జంతువులను, తిమింగలం వంటి సముద్రపు పెద్ద క్షీరదాలను వేటాడటానికి వంద మంది దాకా ఉండే పెద్ద బృందాలు అవసరం. వలలతో చేపలు పట్టటం, పళ్లు సేకరించటం, ఎలుగుబంటి జాడ కనుక్కోవటం వంటి పనులను ఒక్కరు లేదా కుటుంబ సభ్యులు చేస్తారు.

## వేట, చేపలు పట్టటం

వేట, చేపలు పట్టటం మీద ఎస్కిమోలు ఆధారపడి ఉన్నారు కాబట్టి ఈ పనులలో వారికి ఎంతో నైపుణ్యం ఉంటుంది. కారిబో జంతువులను దాదాపు అన్నీ ఎస్కిమో బృందాలు వేటాడతాయి. వేసవి కాలంలోనూ, వసంతకాలం ఆరంభంలోనూ కారిబోలను వేటాడతారు. కొన్ని ప్రదేశాలలో ఎస్కిమోలు వరసగా నిలబడి కారిబోలు చెరువులోకి లేదా సన్నగా ఉండే వాగులోకి వెళ్లేలా చేసి వాటిపై బల్లాలు, బాణాలు, హార్పూన్లతో దాడి చేస్తారు. కొన్నిసార్లు ఎస్కిమోలు రాళ్లకుప్పలను చాలా పెద్ద వరసలో పేరుస్తారు. ఈ రాళ్లకుప్పలు దూరం నుంచి కారిబోలకు మనుషుల్లాగా కనపడతాయి. దాంతో అవి వెనక్కి తిరిగి పట్టుబడతాయి.



చిత్రం 4.6 : కారిబో

కొన్ని బృందాలకు చేపలు పట్టడంతోపాటు వేట కూడా అంతే ముఖ్యం. లోతుగా ఉండే బురద నీళ్లల్లోగానీ, మంచులో ఉండే రంధ్రాలలోంచిగానీ చేపలను పట్టుకుంటారు. నీటికి అడ్డంగా రాళ్లతో చిన్న ఆనకట్టలు కట్టి వాటి వెనక స్వచ్ఛమైన నీటిలోని చేపలను బరిసెలతో పొడిచి పట్టుకుంటారు. వాగులలో నడుస్తూ ఈ ఆనకట్టల వెనకకి చేపలు చేరేలా చేస్తారు.



చిత్రం 4.7 : రష్యాలోని కేప్ షిమిడిలో వంట చేస్తున్న మహిళ

మూడు పళ్లు ఉండే బరిసెతో నిపుణులైన వేటగాళ్లు ఈ చేపలను పట్టుకుంటారు. చేపలను పట్టుకోటానికి ముల్లులేని ఎముకను కొక్కెంగా వాడతారు. దీనిని చిన్న దారానికి కట్టి శీతాకాలంలో మంచులో ఉండే రంధ్రాల దగ్గర, వసంతంలో వాగు ఒడ్డుల దగ్గర చేపలను పట్టడానికి ఉపయోగిస్తారు. హార్పూన్ అనే పరికరాన్ని విసిరి సీల్ జంతువులను పట్టుకుంటారు. నీటి మీద తేలే మంచు గడ్డలమీద నుంచి, లేదా కయాక్ (చెక్క చట్రం మీద జంతువుల చర్మంతో చేసిన ఒక రకమైన పడవ) మీద నుంచి ఈ హార్పూన్లను విసురుతారు.

### ఆహారం

ఎస్కిమోల ఆహారంలో ప్రధానంగా మాంసం, చేపలు, కొవ్వు పదార్థం ఉంటాయి. కూరగాయలు చాలా అరుదు. వాళ్లు ఆహారాన్ని ఏమాత్రం వృథా చేయరు. వేటాడటం, చేపలు పట్టడం మీద ఎస్కిమోలు ఆధారపడి ఉన్నారు కాబట్టి చేపలు, జంతువులు తగినంతగా దొరకనప్పుడు ఆకలితో ఉండటం వాళ్లకు పరిపాటి. నేలను శాశ్వతంగా గడ్డకట్టినంత వరకు మంచును తవ్వి వేసవిలో పట్టుకున్న చేపలు, జంతువులను పాతిపెట్టడం ద్వారా నిల్వ ఉంచుతారు. వాటిపైన రాళ్లు పెట్టడం ద్వారా ఇతర జంతువులు తినకుండా కాపాడుకుంటారు.

ఎస్కిమోలు నివసించే ప్రాంతంలో మాంసం వండటానికి లేదా కాల్చడానికి కట్టెపుల్లల కొరత ఉంటుంది. దానివల్ల చేపల్ని, మాంసాన్ని పచ్చిగానే తింటారు. పచ్చిమాంసం, చేపలు గడ్డకట్టుకునేలా చేసి సన్న ముక్కలుగా కోసి సీల్ లేదా తిమింగలం నూనెలో ముంచుతారు. కొన్ని రకాల మాంసం, ప్రత్యేకించి సముద్రపు పెద్ద పెద్ద క్షీరదాల మాంసం కొద్దిగా కుళ్లిన తరవాత తింటారు (దీని వల్ల గట్టిగా ఉండే మాంసం కొంచెం మెత్తబడి తేలికగా జీర్ణమవుతుంది). ఆహారాన్ని వండటం అంటే సాధారణంగా ఉడకపెట్టడమే అవుతుంది. నూనెదీపాలతో ఆహారాన్ని ఉడకబెడతారు.

### ఆవాసం

'ఇగ్లూ' అన్న ఎస్కిమో పదానికి ఆశ్రయం (shelter) అని అర్థం. ఇగ్లూ అంటే మంచుతో చేసిన గుండ్రటి ఇళ్లని మనం అనుకుంటాం. కానీ ఏ రకమైన ఇంటినైనా ఇగ్లూ అనే అంటారు.

వేసవిలో చాలామంది ఎస్కిమోలు జంతు చర్మాలతో చేసిన గుడారాలలో నివసిస్తారు. చెక్క చట్రాల మీద బరువుగా ఉండే వాల్‌రస్ చర్మాన్ని కప్పడం ద్వారా పశ్చిమ అలాస్కాలో శీతాకాలానికి



*చిత్రం 4.8 : అలస్కాలోని క్వావ్లిక్ ఇన్యూయిట్ ప్రజలు (1999)*

పెద్దపెద్ద గుడారాలను తయారు చేస్తారు. అలాస్కా ఉత్తర తీరంలో దుంగలు, తిమింగలపు పక్కటెముకలతో గుండ్రటి ఇళ్లు కడతారు. నేలలో చిన్న గొయ్యి తవ్వి, దానిపైన గుండ్రటి కప్పు వేసి గడ్డకట్టిన మట్టితో కప్పుతారు. గ్రీన్‌లాండ్‌లో రాతి పలకలతో ఇళ్లు కడతారు.

తూర్పు, మధ్య ప్రాంతాల్లో మాత్రమే మంచు ఇళ్లను ఉపయోగిస్తారు. మంచును దట్టించి (మంచు గడ్డలు కాదు) ఇటుకల మాదిరి చేసి గుండ్రటి పైకప్పు కడతారు. ప్రయాణాలు చేసే సమయంలో చిన్నపాటి సొరంగంలాంటి ప్రవేశంతో చిన్న మంచు ఇళ్లను కట్టుకుంటారు. శీతాకాలంలో ఉండటానికి పెద్ద మంచు ఇళ్లను కట్టుకుంటారు. ఈ పెద్ద ఇళ్లకు ఉండే పెద్ద సొరంగం వంటి ప్రవేశాలు సరుకుల నిల్వకు కూడా ఉపయోగపడతాయి. ఈ ప్రవేశం ఇంటిలో నేలమట్టం కంటే కిందికి ఉంటుంది.

ఇంటి వెనక సగభాగంలో, తలుపుకి రెండు వైపులా ఒక మీటరు ఎత్తు ఉండే మంచుబల్లలు ఉంటాయి. వెనకకి ఉండే మంచుబల్ల జంతు చర్మంతో కప్పి ఉండి పడుకోటానికి ఉపయోగిస్తారు. పక్కలకి ఉండే బల్లలు అరలు కలిగి ఉండి ఆహార నిల్వలు ఉంచుకోవటానికి, బట్టలు ఆరబెట్టుకోవటానికి ఉపయోగిస్తారు. కాంతినీ, వేడిమినీ ఇచ్చే నూనె దీపాలు కూడా ఇక్కడే ఉంటాయి. ఒక్కొక్కసారి రెండు

పెద్ద మంచు ఇళ్లను సొరంగం ద్వారా కలుపుతారు. సీల్ జంతు చర్మాలను కలిపి కుట్టి కొన్ని మంచు ఇళ్లపైనుంచి వేసి వాటిని కప్పుతారు.

- వాళ్ల పరిసరాల్లో దొరికే వనరులను ఇళ్లు కట్టుకోవటానికి ఎలా ఉపయోగించుకుంటారు?
- వాళ్ల ఇళ్ల నిర్మాణాన్ని వాతావరణం ఎలా ప్రభావితం చేస్తోంది?



చిత్రం 4.9 : అలస్కాలోని ఇన్యుయిట్ ప్రజలు (1912)

## బట్టలు, కళలు

ఎస్కిమోలు ముక్‌లుక్‌లనే బూట్లు, ప్యాంట్లు, తలను కప్పే టోపీ ఉండే కోట్లు (వీటిని పర్కాలు అంటారు) వేసుకుంటారు. వీటన్నింటినీ జంతు చర్మాలతో చేస్తారు. ఆడవాళ్లు, మగవాళ్లు వేసుకునే బట్టలలో కొంచెం తేడాలుంటాయి. మగవాళ్లు వేసుకునే పర్కాలకు ముందు, వెనక వేలాడే పెద్ద పెద్ద గుడ్డ అంచులుంటాయి. చలికాలంలో ఎస్కిమోలు రెండు పొరల్లో బట్టలు వేసుకుంటారు. కారిబో పిల్ల చర్మం మెత్తగా, వెచ్చగా ఉంటుంది కాబట్టి చలికాలంలో దానిని ఇష్టపడతారు. తీరవాస బృందాలు వేసవి, వసంతకాలం చివర్లో సీల్ చర్మాన్ని ఇష్టపడతారు. అది నీటికి తడవదు కానీ గట్టిగా ఉండటం వల్ల ఇబ్బందికరంగా ఉంటుంది. బట్టలు సాధారణంగా ఎంబ్రాయిడరీ చేసి ఉంటాయి, అంచులు అందంగా కుట్టి ఉంటాయి. రకరకాల రంగుల జంతు చర్మాలను కత్తిరించి కలిపి కుట్టటం ద్వారా పర్కాల మీద డిజైన్లు చేస్తారు.

L18YZR

రోజువారీ ఉపయోగించే వస్తువులు, పరికరాలను ఎస్కిమోలు అలంకరిస్తారు. ఈ అలంకరణల వల్ల ప్రతి వ్యక్తి వస్తువులు ఒక ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఎముక, దంతం, కొయ్య, సోప్‌స్టోన్ అనే మెత్తటి రాయితో జంతువుల, మనుషుల చిన్న చిన్న బొమ్మలే కాకుండా ఆయుధాలు, పరికరాలు కూడా తయారు చేస్తారు. పరికరాలను ఉపయోగించే వ్యక్తి చేతికి అమిరేటట్టుగా వాటిని జాగ్రత్తగా చెక్కుతారు. పసిఫిక్, సుదూర పశ్చిమ ప్రాంతాలలో చెక్కతో ముఖాల తొడుగులను చెక్కి, రంగులు వేసి, ఈకలు, జంతు చర్మాలతో అలంకరిస్తారు.

## మతపరమైన నమ్మకాలు

జీవితం, ఆరోగ్యం, రోగాలు, ఆకలి, మరణాల పట్ల ఎస్కిమోల మతం ప్రత్యేక ఆసక్తి చూపిస్తుంది. వీటన్నింటినీ ఆత్మలు నియంత్రిస్తాయని ఎస్కిమోలు నమ్ముతారు. అన్ని ఎస్కిమో బృందాలు శిల అనే అతీత శక్తిని, ఆత్మలను (జీవనం, ఆరోగ్యం, ఆహార దేవత అయిన సెడ్నా వంటి దేవతలు) నమ్ముతాయి. మనుషులు, జంతువుల ఆత్మలు చనిపోయిన తరవాత కూడా జీవించి ఉంటాయని వాళ్లు నమ్ముతారు. అయితే ప్రతి బృందానికీ తమదైన నమ్మకాలు, సంప్రదాయాలు ఉంటాయి. ప్రతి వ్యక్తి, కుటుంబం, లేదా బృందానికి ఒక 'నిషిద్ధమైనది' (టాబూ) ఉంటుంది. దీని ప్రకారం వాళ్లు ఫలానా ఆహారం తినకూడదు వంటి ఆచారాలు ఉంటాయి. జననం, మరణాల సమయంలో లేదా వేట బాగా దొరికినప్పుడు, లేదా అస్సలు దొరకనప్పుడు ప్రతి బృందం పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటాయి. ఈ ఆచారాలను నిర్వహించే వారిని షమాన్లు అంటారు. ఆత్మల ప్రపంచంతో అనుసంధానానికి ఈ షమాన్లు సహాయం చేస్తారని నమ్ముతారు. తమ ఆచారాలలో మాయాజాలాన్ని, నాటకీయతను, అచేతనను షమాన్లు ఉపయోగిస్తారు.

## వినోదం

కుస్తీ, పరుగు, హార్పూన్ విసరటం వంటివాటిల్లో పోటీలు, ఇతర ఆటలు, కార్యక్రమాలు చాలా జనాదరణ కలిగి ఉంటాయి. కథలు చెప్పటం, పాడటం, డప్పులు వాయించటం, ఆడటం వంటివి మతపర ఆచారాలలో భాగమైనట్లు నైపుణ్యం గల ఆటలు కూడా అప్పుడప్పుడు వీటిల్లో భాగమవుతాయి. బృందాలు ఒకదానినొకటి కలిసినప్పుడు, సంబరాలు జరుపుకునేటప్పుడు మాంసం, కొవ్వు పదార్థాలతో పెద్ద ఎత్తున విందు చేస్తారు.

## బయటి ప్రపంచంతో సంబంధాలు

ఎస్కిమోలు మొట్టమొదట చూసిన బయటి వాళ్లు ఐస్‌లాండ్ నుంచి వచ్చి గ్రీన్‌లాండ్‌లో నివాసం ఏర్పరచుకున్న వైకింగ్‌లు. ఐస్‌లాండ్ వాసులతో ఎస్కిమోల సంబంధాలు 1200 ప్రాంతంలో మొదలయ్యి 1400 సంవత్సరం వరకు కొనసాగాయి.

1576-78 కాలంలో బాఫిన్ దీవులను బ్రిటిషు సముద్ర యాత్రికుడు మార్టిన్ ఫ్రాన్‌బిషర్ సందర్శించిన తరవాత ఇతర ఐరోపావాసులు ఎస్కిమో ప్రాంతంలో మరింత లోపలకు అన్వేషణలు చేపట్టారు. డేనిష్, నార్వేజియన్, ఇంగ్లిష్ అన్వేషకులు సముద్రాల మీద ఉత్తర ప్రాంతాల చివరికంటా వెళ్లి చైనాకు ప్రఖ్యాతిగాంచిన వాయవ్య మార్గాన్ని కనుగొన్నారు. 1728 నాటికి రష్యన్లు సైబీరియా, ఉత్తర అలాస్కాలకు చేరుకున్నారు. పసిఫిక్ సముద్రం, ఆర్కిటిక్ సముద్రం నుంచి వాయవ్య మార్గాన్ని కనుగొనటానికి అన్వేషకులు చేసిన ప్రయత్నాల వల్ల యూరోపియన్లు ఎస్కిమోలకు ఎక్కువగా తారసపడసాగారు. అయితే 1800ల చివరి వరకు ఉత్తర ఆర్కిటిక్ దీవులలో ఉంటున్న ఎస్కిమోబృందాలకు బయటి వాళ్లతో ఎటువంటి సంబంధాలు లేవు.

1850ల తరవాత అమెరికా, యూరపు దేశాల నుంచి తిమింగిలాల వేటగాళ్లు, జంతుచర్మ వ్యాపారస్తుల రాకతో ఎస్కిమోలలో చాలా మార్పులు వచ్చాయి. తిమింగలాలను వేటాడే వాళ్లకోసం ఎస్కిమోలు పనిచేయసాగారు, వాళ్లకి జంతువుల చర్మాలు అమ్మసాగారు. బయటివాళ్లు ఎస్కిమోలకు తుపాకులు, ఇతర పరికరాలు సరఫరా చేసేవాళ్లు. కొత్త ఆయుధాలు, పరికరాల వల్ల, జంతు చర్మానికి పెరిగిన గిరాకీ వల్ల జంతువులను పెద్ద సంఖ్యలో చంపసాగారు. కొన్ని ప్రాంతాలలో అయితే ఈ విపరీత వేటవల్ల కారిబో, సీల్ జంతువులు అంతరించే దశకు చేరుకున్నాయి.

బయటివాళ్లు రావడం వల్ల ఎస్కిమోలకు నిరోధక శక్తి లేదా సహజ నివారణ లేని కొత్త రోగాలు వచ్చాయి. ఈ రోగాలలో మశూచి, క్షయ, జలుబు, కోరింతదగ్గు, అమ్మవారు వంటి ప్రమాదకరమైనవి కూడా ఉన్నాయి. 1800ల తరవాత ఆర్కిటిక్ ప్రాంతంలో సంవత్సరం పొడవునా యూరోపియన్లు నివసించసాగారు. దాంతో ఈ రోగాలు చాలా ప్రమాదకరంగా మారాయి.

ఎస్కిమోలు, బయటివాళ్ల మధ్య సంబంధాన్ని 'వృద్ధి, పతనం' అంటారు. అలలు, అలలుగా బయటనుంచి వచ్చిన వాళ్ల వల్ల కొంతకాలంపాటు సంపద, విద్య, ఉపాధి సమకూరాయి. ఆ తరవాత పేదరికం, ఎస్కిమోలు చెల్లాచెదురు కావడం వంటి విపత్తులు



*చిత్రం 4.10 : చుకోటాలో వాల్‌రస్‌ల వేట*

సంభవించాయి. వృద్ధి దశలు: తిమింగిలాల వేట (1859–1910), జంతువుల చర్మాల ఆధునిక వ్యాపారం (1925–1950), రక్షణకై సైనిక శిబిరాల నిర్మాణం (1950ల మధ్యకాలం), పట్టణాల నిర్మాణం (1960ల మధ్యకాలం), చమురు అన్వేషణ, అభివృద్ధి (1970లు).

పైన పేర్కొన్న ఒకొక్కదాని వల్ల ఎస్కిమోలకు భిన్న సామాజిక, ఆర్థిక శక్తులతో సంబంధాలు ఏర్పడ్డాయి. ఒకప్పుడు ఎవరూ వెళ్లటానికి వీలులేకుండా ఉన్న ఉత్తర ప్రాంతాలు ఇప్పుడు విమానయానం, జాతీయ రహదారులు, శక్తిమంతమైన ఓడలు, శాటిలైట్ ప్రసారాల కారణంగా అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఈ మార్పుల ఫలితంగా ఎస్కిమోల జీవన విధానంపై తీవ్రమైన వత్తిడి ఏర్పడింది.

- బయట వాళ్లతో ఏర్పడిన సంబంధాల కారణంగా టండ్రా ప్రాంత వాసుల జీవితాలు మెరుగయ్యాయా, పాడయ్యాయా? మీ సమాధానానికి కారణాలు పేర్కొనండి.
- ఈ పాఠంలోని చిత్రాలను చూడండి. ఎస్కిమోల బట్టలలో, వేటాడే విధానాలలో ఎటువంటి మార్పులు వచ్చాయి?

## కీలక పదాలు

| | | |
|---|---|---|
| 1. ఆర్కిటిక్ మండలం | 2. టండ్రా వృక్షజాలం | 3. ఐస్‌బర్గ్స్ |
| 4. ఎస్కిమోలు | 5. కయాక్ | 6. ఇగ్లూ |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

L1CLNN

1. తప్పుగా ఉన్న వాక్యాలను సరైన వాస్తవాలతో తిరిగి రాయండి: $AS_1$
   అ) జంతువుల శరీర భాగాలను కేవలం బట్టలకే ఉపయోగించేవారు.
   ఆ) ఆహారంలో ప్రధాన భాగం కూరగాయలు.
   ఇ) టండ్రా ప్రాంత ప్రజల ఆదరణ పొందిన ఆటలకు వారి రోజువారీ జీవితాలతో సంబంధం ఉంది.
   ఈ) బయటివాళ్లతో సంబంధాలు వాళ్ల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసింది.
2. ఏడవ తరగతిలో మీరు భూమధ్యరేఖా ప్రాంతం గురించి చదివిన దాన్నిబట్టి ధృవ ప్రాంతంలో తేడాలు ఏమిటో చెప్పండి. $AS_1$
3. టండ్రా ప్రాంత ప్రజల జీవితం అక్కడి వాతావరణం మీద ఎలా ఆధారపడి ఉంది? దిగువ అంశాలలో దీనిని వివరించండి: $AS_1$

| ఆహారం | బట్టలు | ప్రయాణాలు | ఆవాసం |
|---|---|---|---|
| | | | |
| | | | |

4. మీరు నివసిస్తున్న ప్రాంతానికీ, ఈ పాఠంలో మీరు చదివిన ప్రాంతానికీ మధ్య చాలా తేడాలు ఉన్నాయి. ఈ అధ్యాయంలోని శీర్షికల వారీగా తేడాలన్నింటినీ పేర్కొనండి. ఇప్పుడు మీ ప్రాంతంలోని, టండ్రా ప్రాంతంలోని వివరాలు, చిత్రాలతో ఒక గోడపత్రిక తయారు చేయండి. $AS_6$
5. ఒక రోజు అంతా సూర్యుడు ఉండడనీ, మరొక రోజంతా సూర్యుడు అస్తమించడనీ ఊహించుకోండి. మీ రోజువారీ జీవితంలో ఎటువంటి మార్పులు చేస్తారు? వాటి గురించి క్లుప్తంగా రాయండి. $AS_4$
6. మీ వద్దగల అట్లాస్ సహాయంతో ఎస్కిమోకు చెందిన ఏదైన ఐదు ప్రాంతాలను ప్రపంచ పటంలో గుర్తించండి. $AS_5$

పాఠం 5

# అడవులు - వినియోగం, సంరక్షణ

- మీలో కొంతమందికి దగ్గరలోని అడవి తెలిసే ఉంటుంది– అక్కడి చెట్లు, మొక్కలు, జంతువులు, రాళ్లు, వంకలు, పక్షులు, పురుగులు చూసి ఉంటారు. ఇవి తెలిసిన వాళ్లు వాటి గురించి వివరించండి. అక్కడ ఏం చేస్తారో చెప్పండి.
- కట్టెపుల్లలు, ఆకులు, పళ్లు లేదా దుంపలు సేకరించటానికి మీరు ఎప్పుడైనా అడవికి వెళ్లారా? దాని గురించి తరగతిలో వివరించండి. మీ ప్రాంతంలో అడవినుంచి ప్రజలు సేకరించే వస్తువుల జాబితా తయారు చేయండి. అలా సేకరించిన వాటిని ఏమి చేస్తారు?
- గత తరగతులలో మీరు అడవుల గురించి, అక్కడ నివసిస్తున్న ప్రజల గురించి చదివారు. అవి గుర్తు తెచ్చుకుని అటవీ ప్రజల గురించి మాట్లాడండి.
- తరగతిలో ప్రతి ఒక్కరూ అడవి చిత్రం గీసి వాటిని పోల్చండి.
- మన జానపద కథలు, పురాణాలు పలుమార్లు అడవులను పేర్కొంటాయి. అటువంటి కథ ఏదైనా తరగతిలో చెప్పండి.
- అనేక అడవులను ప్రజలు పవిత్రంగా భావించి పూజిస్తారు. దేవుళ్లు, దేవతలు నివసించే ప్రాంతాలుగా కొన్ని అడవులు ప్రఖ్యాతిగాంచాయి. వాటి గురించి తెలుసుకుని తరగతి గదిలో చెప్పండి.

## అడవి అంటే ఏమిటి?

L1E8DH

అడవి అంటే ఒక్కొక్కరికీ ఒక్కొక్క భావం తడుతుంది. అడవుల్లో అటవీ జంతువులు, పాములు, పురుగులు, లోతైన వాగులు, కొండచరియలు, రాళ్లు ఉంటాయన్న అభిప్రాయంతో కొంతమంది అడవి అంటే భయపడతారు. కొంతమందికి ఎటువంటి భయాలు లేక తమ ఇంటిలో మాదిరిగానే అడవిలో తిరుగుతూ ఆడుకుంటారు. కొంత మందికి అడవులంటే పవిత్ర స్థలాలు, అక్కడి దేవతలను కొలుస్తారు. మరికొంత మందికి అది కలప, వెదురు, బీడి ఆకులు వంటి వనరులు దొరికే ప్రదేశం, జంతువులను వేటాడే ప్రదేశం. వీటిని మార్కెట్లో అమ్ముతారు.

అదేవిధంగా వేర్వేరు ప్రజలు అడవులను వేరువేరుగా ఉపయోగించుకుంటారు. కొంతమంది అడవుల్లో చిన్న, చిన్న ఇళ్లల్లో ఉంటూ తమ ఇంటిచుట్టూ కొన్ని కూరగాయలు సాగు చేస్తారు, పళ్లు, దుంపలు సేకరిస్తారు, చిన్న జంతువులను వేటాడతారు. కొంతమంది తమ గొర్రెలు, మేకలు, ఆవులు, బర్రెలు వంటి పశువులను అడవులలో మేపుతారు. కొంతమంది అడవిలో కొంత ప్రదేశం నరికి పోడు వ్యవసాయం చేస్తారు. ఆరవ తరగతిలో కూనవరం కొండలలో నివసించే ప్రజల గురించి చదివారు. కొంతమంది అడవులలో చెట్లను, వెదురును నరికి కాగితపు మిల్లులకు, పట్టణాలలో వస్తువులు తయారు చేసేవాళ్లకు అమ్ముతారు. అడవులను పొలాలుగా, సందర్శక ప్రదేశాలుగా, ఆనకట్టలు కట్టి నీటి నిల్వకు రిజర్వాయర్లుగా మార్చవచ్చని కొంతమంది అనుకుంటారు.

అడవులను ఉపయోగించుకునేది మనుషులొక్కరే కాదన్నది మనం గుర్తుంచుకోవాలి. చెట్లు, మొక్కలు, గడ్డిజాతులు, పక్షులు, పురుగులు, జంతువులు, చేపలు వంటి అసంఖ్యాక జీవులు అడవులలో ఉంటూ వాటిని ఉపయోగించుకుంటాయి. కాబట్టి మనం అడవుల

గురించి ఆలోచించేటప్పుడు వాటి గురించి కూడా ఆలోచించాలి.

- అడవి అంటే ఏమిటి? అడవిని అనేక రకాలుగా నిర్వచించవచ్చు. అడవికి నిర్వచనం రాయండి.
- వీటిని తరగతిలో చర్చించి అధిక శాతం విద్యార్థులకు సరైనవిగా అనిపించే అంశాలను రాయండి.

మనం అడవిని ఎలా చూస్తామన్న దాన్నిబట్టి దాని నిర్వచనం ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు 'చెట్లతో ఉన్న విశాలమైన భూభాగం' అన్నది ఒక తేలికైన నిర్వచనం. ఇది ఉపయోగకరంగా ఉండే నిర్వచనమే అయినప్పటికీ దీనికి అనేక పరిమితులు ఉన్నాయి – ఉదాహరణకు ఎంత విశాలమైనది అన్న ప్రశ్న వస్తుంది. చెట్లతో ఉన్న అంటే ఏమిటి? చెట్లు ఎంత దట్టంగా ఉండాలి? పండ్ల తోటల వంటి వాటిల్లో కూడా చెట్లు ఉంటాయి, వీటికీ అడవులకూ తేడా చూపించాలా, వద్దా? చెట్ల కింద పెరిగే పొదలు, జంతువులు, పక్షులు, పురుగులు లేకుండా దానిని అడవి అనవచ్చా? మనమిచ్చే ఏ నిర్వచనానికైనా ఇటువంటివే అనేక ప్రశ్నలు ఉండవచ్చు.

అయినప్పటికీ అడవి అంటే ఒక ఉమ్మడి అవగాహన ఏర్పరచుకోవాల్సిన అవసరం ఉంది. చాలా అడవులలో కింద పేర్కొన్న అంశాలు ఉండవచ్చు:


1. విశాలమైన భూభాగం – పొడవు, వెడల్పులలో అనేక కిలోమీటర్లు ఉండాలి.

2. చెట్లు, దానికింద పెరిగే పొదలు, మొక్కలు, గడ్డి జాతులు, తీగలు. ఇవి పెరగటానికి మానవులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉండదు.

3. గణనీయమైన జీవ వైవిధ్యత – అనేక రకాల చెట్లు, జంతువులు సహజంగా జీవిస్తూ, ఎటువంటి జోక్యం లేకుండా వృద్ధి చెందుతాయి.

4. భారతదేశంలో చాలా అడవులలో ప్రజలు నివసిస్తుంటారు. అడవులను నాశనం చెయ్యకుండా, వాటికి అనుగుణంగా తమ జీవితాలను మలుచుకుని వీళ్లు అక్కడ నివసిస్తున్నారు.

అడవుల చుట్టుపక్కల ఉండే ప్రజలు వాటిని ఆహారం, ఇళ్లు కట్టుకోటానికి, వ్యవసాయ పనిముట్లకు కలప, వంట చెరకు, పశువులను మేపటానికి, పూజలు చేయటానికి, ఏకాంతంగా సమయం గడపటం వంటి అనేక అవసరాలకు ఉపయోగించుకుంటారు. అడవులకు దూరంగా ఉంటున్న వాళ్లు కూడా బజారులో కలప, వనమూలికలు కొనటం ద్వారా అడవులను ఉపయోగించుకుంటున్నారు. అటవీ ఉత్పత్తులను సేకరించి, అమ్మటం ద్వారా అనేకమంది జీవనోపాధి పొందుతున్నారు. అడవుల వలు ప్రయోజనాల మధ్య ఘర్షణలు ఎలా ఏర్పడుతున్నాయో, వీటిని ఎలా పరిష్కరిస్తున్నారో తర్వాత చూద్దాం.



*చిత్రం 5.1 : అడవి నేపథ్యంలో పై చిత్రానికి ఒక వ్యాఖ్యానం రాయండి*

- అడవులు ఉండటం ముఖ్యమా? అడవులన్నింటినీ నరికివేసి వ్యవసాయానికి, గనుల తవ్వకానికి, కర్మాగారాల నిర్మాణానికి, మనుషుల నివాసానికి ఉపయోగిస్తే ఏమవుతుంది? అడవులు లేకుండా మనం జీవించలేమా? మీ తరగతిలో చర్చించండి.

## అడవుల రకాలు, అవి ఉండే ప్రాంతాలు

L1LHQB

అడవులు ఎక్కడ పెరుగుతాయి? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పటం కష్టం. ఎందుకంటే కొన్ని వేల సంవత్సరాల క్రితం మట్టి, సూర్యరశ్మి, వర్షపాతం ఉన్న ప్రతి చోటా అడవులు పెరిగేవి. ఆర్కిటిక్ ప్రాంతాల్లో, మంచుతో కప్పి ఉండే హిమాలయాల్లో, ఇసుక, రాళ్లతో ఉండే ఎడారులలో, ఇసుకతో కూడిన తీర ప్రాంతాల్లో మాత్రమే అడవులు లేవు. ఈ ప్రాంతాలు తప్పించి మిగిలిన అన్ని చోట్లా అడవులు పెరిగేవి. అయితే మనుషులు వ్యవసాయం చేపట్టి, ఊళ్లు, పట్టణాల్లో నివసించటం మొదలుపెట్టిన తరవాత వ్యవసాయం, గనులు, పండ్లతోటలు, పరిశ్రమలు వంటి వాటికోసం అడవులను నరికివేయటం మొదలుపెట్టారు. 20వ శతాబ్దపు ఆరంభం నాటికి వ్యవసాయానికి అనువుకాని ప్రాంతాలలో మాత్రమే అడవులు మిగిలాయి. గుట్టలు, కొండలు ఉన్న ప్రాంతాలు, చిత్తడి భూములు, చాలా చలిగా ఉండే ప్రాంతాలు, లేదా జనావాసాలకి దూరంగా ఉండే ప్రాంతాలలో మాత్రమే అడవులు మిగిలాయి.

- మీ ఊరికి, పట్టణానికి దగ్గరలో ఉన్న అటవీ ప్రాంతం ఏది? ఈ ప్రాంతం వ్యవసాయ భూమిగా, గనులుగా, నివాసప్రాంతంగా మారకుండా ఇంకా చెట్లతో ఎందుకు ఉందో తెలుసుకోండి.

రకరకాల సూచికల ఆధారంగా అడవులను వర్గీకరించవచ్చు. ఉదాహరణకు చెట్ల సాంద్రతను బట్టి అడవులను వర్గీకరించవచ్చు: చాలా దట్టమైన, పొదలతో కూడిన, క్షీణతకు గురైన అడవులుగా వీటిని వర్గీకరించవచ్చు. ఈ వర్గీకరణ వల్ల అడవులు ఎక్కడ దట్టంగా ఉన్నాయో, ఎక్కడ క్షీణతకు గురయ్యాయో తెలుసుకోవచ్చు. అడవులలో ఏ రకమైన చెట్లు పెరుగుతున్నాయి అన్నదానిని బట్టి కూడా వాటిని వర్గీకరించవచ్చు. వర్షపాతం, ఉష్ణోగ్రతలబట్టి, పొడిగా, తడిగా ఉండే నేలల బట్టి ఏర్పడే ప్రత్యేక వాతావరణ పరిస్థితుల్లో వేరు వేరు ప్రదేశాల్లో వేరు వేరు చెట్ల రకాలు పెరుగుతాయి. ఉదాహరణకు బాగా చలిగా ఉండి, మంచు కూడా కురిసే ప్రాంతాలలో మాత్రమే కోనిఫెరస్ జాతికి చెందిన దేవదారు చెట్లు పెరుగుతాయి. వేడిగా ఉండి, ఓమాదిరి వర్షాలు పడే ప్రాంతంలో టేకు వంటి కొన్ని రకాల చెట్లు పెరుగుతాయి. చెట్ల సాంద్రత కూడా వర్షపాతం, ఉష్ణోగ్రతల మీద ఆధారపడి ఉంటుంది.

కొన్ని రకాల ప్రధాన అడవుల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

**1. సతత హరిత అడవులు:** చాలా ఎక్కువ వర్షపాతంతో పాటు అధిక ఉష్ణోగ్రతలు ఉండే భూమధ్యరేఖా ప్రాంతాలు, కేరళ, అండమాన్‌లలో సతత హరిత (ఎల్లప్పుడూ పచ్చగా ఉండే చెట్ల) అడవులు ఉంటాయి. చెట్లు ఆకులు రాల్చటానికీ, తిరిగి చిగుళ్లు తొడగటానికీ మధ్య చాలా తక్కువ వ్యవధి ఉంటుంది కాబట్టి అవి ఎప్పుడూ పచ్చగా ఉంటాయి. నిరంతరం ఎదగటానికి తేమ, వేడిమి అందుతూ ఉంటాయి కాబట్టి ఇలా జరుగుతుంది. అదేవిధంగా ఒక రకం చెట్లు ఆకులు రాల్చినప్పుడు, మరొక రకం చెట్లు ఆకులతో పచ్చగా ఉంటాయి. కదంబం, వెదురు, నేరేడు వంటి చెట్లు ఈ అడవులలో ఉంటాయి. ఇటువంటి అడవులు మన రాష్ట్రంలో లేవు.

హిమాలయాల్లో వేరే రకపు సతత హరిత అడవులు ఉన్నాయి. ఇవి సంవత్సరమంతా పచ్చగా ఉండే దేవదారు చెట్ల అడవులు. అయితే వీటి ఆకులు సన్నగా సూదుల మాదిరి ఉంటాయి. ఈ చెట్లు పూలు పూయవు, శంకువుల వంటి పునరుత్పత్తి భాగాలు ఉంటాయి. ఈ చెట్లు మంచు కురిసే ప్రాంతంలో పెరుగుతాయి కాబట్టి ఆకుల మీద మంచు నిలవకుండా అవి



*చిత్రం 5.2 : (పైన) పశ్చిమ కనుమలలోని అనైముడిలోని సతత హరిత అడవులు, (కింద) హిమాలయాలలోని గుల్‌మార్గ్‌లో మంచుతో నిండిన దేవదారు చెట్ల అడవి*

సూదులలాగా సన్నగా ఉంటాయి. చెట్టు కూడా పెంకుటిల్లు కప్పు మాదిరి మధ్యలో ఎత్తుగా ఉండి మంచు నిలవకుండా రెండు వైపులా కిందికి ఉంటుంది.

**2. ఆకురాల్చే అడవులు:** కొన్ని నెలలపాటే వర్షాలు పడి, సంవత్సరంలో అధిక భాగం పొడిగా, వెచ్చగా ఉండే ప్రాంతాలలో ఈ రకమైన అడవులు పెరుగుతాయి. బాగా వేడిగా ఉండే నెలల్లో ఈ చెట్లు ఆకులను రాలుస్తాయి. చెట్ల ఆకుల ద్వారా తేమ నష్టమవుతుంది కాబట్టి వేడిగా ఉండే నెలల్లో ఆకులను రాల్చటం ద్వారా తేమ నష్టం కాకుండా చేసుకుంటాయి. చెట్లు తమ ఆహారం తయారు చేసుకునేలా వానాకాలం నాటికి అవి కొత్త ఆకులు వేస్తాయి. మన రాష్ట్రంలో తక్కువ వానలు, అదీ కొద్ది నెలలు మాత్రమే పడతాయి, సంవత్సరంలో ఎక్కువకాలం వేడిగా ఉండటం వల్ల ఎక్కువగా ఆకులు రాల్చే అడవులే ఉన్నాయి.

మన రాష్ట్రంలో ఆకులు రాల్చే అడవులు రెండు రకాలు ఉన్నాయి – ఒక రకంలో ఎక్కువ వర్షం, మరొక రకంలో తక్కువ వర్షం పడుతుంది. ఎక్కువ

వానలుపడే ప్రాంత ఆకులు రాల్చే అడవులలో వేగి, ఏగిస, మద్ది (అర్జున), బండారు, జిట్టెగి వంటి చెట్లు ఉంటాయి. ఈ అడవులు మన రాష్ట్రంలో శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాల్లోనూ, తూర్పుగోదావరి ఏజెన్సీ ప్రాంతంలోనూ ఉన్నాయి.

తక్కువ వర్షపాతం ఉండే ప్రాంతంలో మద్ది, టేకు, వెలగ, ఏగిస, ఏపి, చిగురు, బిల్లు, వేప, దిరిశన, బూరుగ, మోదుగ వంటి చెట్లు ఉంటాయి. ఈ రకమైన అడవులు మన రాష్ట్రంలో వైఎస్ఆర్ కడప, కర్నూలు, జిల్లాల్లో విస్తృతంగా ఉన్నాయి.

**3. ముళ్ల అడవులు:** చాలా తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు ఉండే పొడి ప్రాంతాలలో ఈ రకమైన అడవులు పెరుగుతాయి. తుమ్మ, బులుసు, రేగు, చందనం, వేప వంటి చెట్లు ఇక్కడ పెరుగుతాయి. ఇటువంటి అడవులు వైఎస్ఆర్ కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఉన్నాయి. ఈ జిల్లాల్లో వర్షపాతం చాలా తక్కువగా ఉండి, ఎడారిలాంటి పరిస్థితులు ఉన్నాయని మీకు గుర్తుండే ఉంటుంది.



*చిత్రం 5.3 : (పైన) వేసవిలో టేకు అడవులు (చత్తీస్‌గఢ్), (కింద) పొద అడవులు (రాయలసీమ)*

ఈ రకమైన చెట్లకు చాలా చిన్న ఆకులు, ముళ్లు ఉండి నీటి నష్టాన్ని తగ్గిస్తాయి. ఈ రకమైన అడవులు అంత దట్టంగా ఉండవు: తక్కువ చెట్లు, పొదలు, ఎక్కువ ఖాళీ ప్రదేశాలు ఉంటాయి.



*చిత్రం 5.4: ముళ్ళ పొదలు*

**4. సముద్ర తీరపు చిత్తడి అడవులు:** ఈ అడవులు ఎక్కువగా సముద్ర తీరాల్లో చిత్తడి నేలల్లోనూ, సముద్ర అలల ప్రభావిత నేలల్లోనూ పెరుగుతాయి. ఉప్పునీటికీ, సముద్ర అలల ప్రవాహానికీ అనుగుణంగా ఈ చెట్లు పెరుగుతాయి (సముద్ర అలలు ఈ ప్రాంతాలను రోజులో కొన్ని గంటలపాటు ముంచెత్తి తరవాత వెనక్కి తగ్గుతాయి, అంటే కొన్ని గంటలపాటు ఉప్పునీటితోనూ, కొన్ని గంటలపాటు నీళ్లు లేకుండానూ ఉంటుంది). ఈ అడవులను మడ అడవులు అంటారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో బతకటానికి ఈ చెట్లు కొన్ని ప్రత్యేక అంశాలను అలవరచుకున్నాయి. ఉప్పు పొన్న, బొడ్డుపొన్న, ఉరడ, మడ, తెల్ల మడ, గుండు మడ, కదిలి,

బెల్ల వంటివి ఈ ప్రాంతంలో ఉండే ప్రధానమైన చెట్లు.

- సముద్రతీరంలోని ప్రత్యేక పరిస్థితులకు మడ చెట్లు ఎలా మలుచుకున్నాయో కనుక్కోండి.

L1N4F5

## ఆంధ్రప్రదేశ్‌లో అడవులు

మన రాష్ట్రంలోని ముఖ్య మైన అడవుల గురించి తెలుసుకున్నారు. అయితే, మన అడవులు ఎంత పెద్దవి? అవి పెరుగుతున్నాయా? తగ్గుతున్నాయా? తెలుసుకుందాం రండి.

రాష్ట్రంలో 64,000 చదరపు కిలోమీటర్ల మేర అడవులు ఉన్నాయని ప్రభుత్వం ప్రకటించింది.





*చిత్రం 5.5 : మడ అడవులు – తూర్పు గోదావరి జిల్లాలోని కోరింగ.*

- నైజీరియాలోని భూమధ్యరేఖా ప్రాంత అడవుల గురించి చదివింది గుర్తుండి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అడవులకూ, భూమధ్యరేఖా ప్రాంత అడవులకూ మధ్య ముఖ్యమైన తేడాలు ఏమిటి?
- ఆంధ్రప్రదేశ్‌లో అడవులను చూపించే పటం (పక్క పేజీలో) చూడండి. మీ జిల్లాలో అడవులు ఉన్నాయా? ఉంటే, అవి ఎటువంటి అడవులు?

రాష్ట్రంలోని మొత్తం భూవిస్తీర్ణంలో ఇది 23 శాతం, అయితే ఇది మొత్తం అడవి కాదు. కేవలం 16 శాతం విస్తీర్ణంలో అడవి అనగల చెట్లు ఉన్నాయి. అంటే 7 శాతం అడవులు వాస్తవానికి చాలా తక్కువ చెట్లతో, ఖాళీ ప్రదేశాలతో ఉన్నాయి. ఉన్న కొద్ది అడవి కూడా చెట్లు నరకటం వల్ల, ఆక్రమణల వల్ల, గనుల తవ్వకం వల్ల తగ్గిపోతూ ఉంది. మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం వంద చదరపు కిలో మీటర్ల మేర అడవి తగ్గిపోతూ ఉంది.

- ఈ పరిస్థితి సరైనదేనా? తరగతిలో చర్చించండి.


అడవులు
ఒడిషా
తెలంగాణ
శ్రీకాకుళం
విశాఖపట్నం
కాకినాడ
యానాం (పాండిచ్చేరి)
రాజమండ్రి
ఏలూరు
విజయవాడ
గుంటూరు
తెనాలి
మచిలీపట్నం
ఆంధ్ర ప్రదేశ్
కర్నూలు
ఒంగోలు
బంగాళాఖాతం
అనంతపురం
కడప
పెన్నా నది
నెల్లూరు
కర్ణాటక
చిత్తూరు
తమిళనాడు
అడవుల రకాలు
ఆర్ద్ర ఆకురాల్చు అడవులు
శుష్క ఆకురాల్చు అడవులు
చిట్టడవులు
SCALE:
1:26,84,500 appx
1Cm = 26.8 Km
Designed and Compiled By Kaarto India, Hyderabad
FOOT NOTE:- The details shown in this map are based on Survey of India & AP state Maps. All administrative boundaries are only informative, unauthorised and approximate.
The responsibility of the details in the map is with the publisher only.

## గిరిజన ప్రజలు, అడవులు

అడవులను ఉపయోగించుకుంటూ, అడవుల్లోనే నివసించే మనుషులు లేకుండా మన దేశంలో అడవులను ఊహించుకోవటం కష్టం. మన రాష్ట్రంలో అత్యంత పేదల జీవనానికి అడవులు కీలకమైన వనరులను అందిస్తున్నాయి. ఉదాహరణకు ఉత్తర కోస్తా ప్రాంతంలో 20 శాతం ప్రజలు అడవుల నుంచి కట్టెలు కొట్టి, నెత్తిమీద మోపులుగా మోసుకొచ్చి బజారులో అమ్మి జీవనం కొనసాగిస్తున్నారు. రాయలసీమ జిల్లాలలో చాలామంది ప్రజలు అడవులలో గొర్రెలు, మేకలు మేపి బతుకుతున్నారు. కోస్తా ప్రాంతంలో కూడా అటవీ ఉత్పత్తుల సేకరణపై 50 శాతం ప్రజలు ఆధారపడి ఉన్నారు. ప్రజలు సేకరించే అటవీ ఉత్పత్తుల జాబితాను మీరు తయారుచేసి ఉంటారు. అయితే ప్రజలు సేకరించే ఉత్పత్తుల జాబితా చాలా పెద్దది, దాంట్లో అరవై దాకా వస్తువులు ఉన్నాయి.

జీవనోపాధి కోసం అడవులపై ఆధారపడిన వాళ్లలో గిరిజనులు అందరికంటే ముఖ్యమైన వాళ్లు. గిరిజన ప్రజలు వేల సంవత్సరాలుగా అడవుల్లో ఉంటూ వాటిని కాపాడుతూ, వాటిని తమ జీవనోపాధికి వినియోగించుకుంటున్నారు. వీళ్ల గురించి ఇంతకు ముందు తరగతుల్లో మీరు చదివారు.

ఈనాటికి కూడా ఆంధ్రప్రదేశ్‌లో 60 శాతం మంది గిరిజనులు అడవులలో నివసిస్తున్నారు. గిరిజనులు అడవులను ఎలా ఉపయోగించుకుంటారు? కూనవరం కొండల్లోని కొండరెడ్లు అడవులను పోడు వ్యవసాయానికి, ఆహార పదార్థాల సేకరణకు, అమ్మకానికి పనికొచ్చే బీడీ ఆకులు, మూలికలు, వెదురు, చింతపండు వంటి వాటి సేకరణకు ఉపయోగించుకుంటారు.

L1VDRY

మైదాన ప్రాంత గ్రామాలలో మాదిరి గిరిజన ప్రజలలో భూమి వ్యక్తిగత ఆస్తి అన్న భావన లేదు. గ్రామ పెద్దల అనుమతితో తెగలోని సభ్యులందరూ అడవిని ఉపయోగించుకుంటారు. ప్రతి కుటుంబానికి కొంత మేర భూమి మీద సంప్రదాయ హక్కు ఉంటుంది. పోడు వ్యవసాయం, అంటే ప్రతి కొద్ది సంవత్సరాలకు సాగుచేసే భూమి మారుతూ ఉంటుంది కాబట్టి భూ యాజమాన్యానికి సంబంధించి స్థిరమైన రికార్డులు ఏమీ ఉండవు. అంతేకాకుండా జనాభా పెరిగి కొత్త కుటుంబాలు ఏర్పడినప్పుడు కొత్తగా అడవిని నరికి సాగు చేయటానికి గ్రామ పెద్దలు వాళ్లకు అనుమతి ఇస్తారు. బ్రిటిష్ పాలనకు ముందు అడవులను గిరిజనులు తమవిగా భావించారు. అయితే అది వాళ్లకు పవిత్ర ప్రదేశం. అడవికీ, అడవి జంతువులకు నష్టం వాటిల్లకుండా అడవిని ఉపయోగించుకునేవారు. జంతువులను వేటాడినప్పుడు, పోడు కోసం అడవిని నరికినప్పుడు అవి పునరుద్ధరణ చెందేలా చూసేవారు. రైతు కుటుంబం పొలాల సంరక్షణ చేపట్టినట్లు గిరిజనులు అడవులను సంరక్షిస్తూ, వాటిని ఉపయోగించుకునేవారు.

- అడవులను ప్రజలు ఉపయోగించుకుంటూ, వాటిని సంరక్షించటం సాధ్యమేనా? చెట్లను కొట్టి, మార్కెట్టులో అమ్మి డబ్బు చేసుకోవచ్చని ఎవరైనా ఆశపెట్టి ఉంటే వాళ్లు ఏమి చేసి ఉండేవాళ్లు?

మన దేశంలో రెండు వందల సంవత్సరాల బ్రిటిషు పాలనలో గిరిజనులు క్రమేపీ అడవులపై తమ అధికారాన్ని, హక్కులనూ కోల్పోయారు. అప్పటినుంచి అడవులు వేగంగా అంతరించిపోసాగాయి. ఇది రెండు రకాలుగా జరిగింది. మొదటిది, రైలుమార్గాల నిర్మాణం, ఓడల తయారీ, కర్మాగారాలు, ఇళ్లు, చెక్క సామాను వంటి వాటి కోసం కలపకు గిరాకి గణనీయంగా పెరగటం. ఏడవతరగతిలో చదివినట్లు కాగితపు మిల్లు వంటి అనేక పరిశ్రమలకు గుజ్జునిచ్చే కలప పెద్ద

మొత్తంలో కావాలి. ఈ రకమైన ఒత్తిడి వల్ల చాలా విస్తీర్ణంలో అడవులను నరికేసి కలపను అమ్ముకున్నారు. అనేక ప్రాంతాలలో తేయాకు, కాఫీ, రబ్బరు వంటి తోటలు పెంచడానికీ, తరవాత కాలంలో వేగంగా పెరిగే నీలగిరి (యూకలిప్టస్), వెదురు చెట్లు పెంచటానికీ అడవులను నరికివేశారు. ఈ విధంగా అటవీ విస్తీర్ణం గణనీయంగా తగ్గింది.




- నీలగిరి చెట్లు, తేయాకు తోటలకూ అడవికీ మధ్య ఏమైనా తేడాలు ఉన్నాయా? తరగతిలో చర్చించండి.

రెండవది, బ్రిటిషు ప్రభుత్వం అధిక ప్రయోజనం పొందేలా అడవులు నరకటాన్ని నియంత్రించాలని అనుకుంది, మిగిలి ఉన్న అడవులను కాపాడాలని అనుకుంది. 1864, 1878లో చట్టాలు చేసి అటవీశాఖను ఏర్పాటు చేసి దానికి అడవులపై నియంత్రణను అప్పగించింది. తమ అధీనంలో ఉన్న ప్రాంతాలకు నిజాం ప్రభుత్వం ఇదే రకమైన చట్టాలను చేసింది. అడవులను 'రక్షిత', 'రిజర్వు' అడవులని వర్గీకరించటం ద్వారా గిరిజనులకు, అటవీ వినియోగదారులకు సంప్రదాయంగా వస్తున్న హక్కులను ఈ చట్టం అనుమతించలేదు. రిజర్వు అడవులలోకి ఎవరూ ప్రవేశించటానికి అనుమతి లేదు. 'రక్షిత' అడవులను ప్రజలు వినియోగించుకోవచ్చు. నెత్తిమీద కట్టెల మోపును తీసుకెళ్లవచ్చు, సొంత అవసరాలకు అటవీ ఉత్పత్తులు సేకరించవచ్చు, పశువులను మేపుకోవచ్చు. అయితే ఇక్కడ కూడా చెట్లు కొట్టటంపై అనేక షరతులు ఉన్నాయి, అటవీశాఖ విధించిన పరిమితులకి మించి పశువులను మేపకూడదు.

కానీ అడవులలో చాలా మంది వాటిపై ఆధారపడి జీవిస్తున్నారని మనకు తెలుసు. ఆ సమయంలో ప్రభుత్వం వాళ్ల గురించి పట్టించుకోలేదు. అటవీ ప్రాంతం అని నిర్ధారించే లేదా గుర్తించే సమయంలో గిరిజనులు వాడుకుంటున్న అడవిని ప్రభుత్వానికి చెందిన అడవిగా ప్రకటించింది. మైదాన ప్రాంతాల గ్రామాలలో మాదిరి కాకుండా గిరిజనులు ఎటువంటి యాజమాన్య పట్టాలు, రికార్డులు లేకుండా వాటిని సాగు చేస్తుండడం వల్ల ఇలా జరిగింది. తెలంగాణలోని ఉత్తర జిల్లాల్లో గోండులు స్థిర వ్యవసాయం చేసేవారు, కానీ కొలాంలు వంటి తెగలు కొండవాలుల మీద పోడు వ్యవసాయం చేసేవాళ్లు. స్థిర వ్యవసాయం చేసే గోండులు కూడా కొంత భూములను బీడుగా పెట్టి మార్చి, మార్చి రెండు సంవత్సరాలకు ఒకసారి సాగు చేసేవారు. రిజర్వు అడవులను గుర్తించే ప్రక్రియ వీటినన్నింటినీ పరిగణనలోకి తీసుకోలేదు. ఒక్క కలం పోటుతో గిరిజనుల హక్కులు చెల్లకుండా పోయాయి, వాళ్లని బలవంతంగా అడవుల నుంచి తొలగించసాగారు.

ఒక్క చర్య ఫలితంగా తమ సొంత ప్రాంతంలో గిరిజనులు నిరాశ్రయులైపోయారు! ఇంతటితో ఆగకుండా ప్రభుత్వం ఇతర ప్రాంత జమీందార్లకు, రైతులకు ఈ భూమిని వ్యవసాయానికి ఇచ్చి ఆదాయం పొందాలన్న ఆతృతలో ఉంది. ఏ హక్కులూ లేకుండా పోయిన గిరిజనులు ఇప్పుడు ఈ భూస్వాముల వద్ద

కూలీలుగా పనిచెయ్యాల్సి వచ్చింది. గిరిజనులు సాగు చేసుకోటానికి అనుమతి ఇచ్చిన భూములకు వాళ్లు పెద్ద మొత్తంలో శిస్తులు కట్టాల్సి వచ్చేది. ఈ మొత్తాలు చెల్లించటానికి వాళ్లు తరచు వ్యాపారస్తుల నుంచి అప్పు తీసుకోవాల్సి వచ్చేది. చివరికి తమ భూముల్ని ఆ వడ్డీ వ్యాపారస్తులకే అమ్ముకోవలసి వచ్చేది. ఆ విధంగా తమకు ఉన్న కొంచెం భూమిని సైతం చాలా మంది కోల్పోయారు.

ఆ కాలంలో ఏర్పడిన అటవీశాఖకు అడవుల రక్షణ, కొత్త చెట్లు నాటటం, 'అడవుల నుంచి పంట తియ్యటం', అంటే బాగా పెరిగిన చెట్లు నరికి, వాటిని అమ్మటం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చేయటం వంటి బాధ్యతలు ఉండేవి. అటవీశాఖ అధికారులుగా సాధారణంగా దూరప్రాంత ధనిక కుటుంబాలకు చెందినవాళ్లు ఉండేవాళ్లు. గిరిజనులకు ఏమీ తెలియదని, వాళ్లు చాలా ప్రమాదకరమైన వాళ్లని ఈ అధికారులు భావించేవాళ్లు. గిరిజనుల పట్ల ఏమాత్రం సానుభూతి ఉండేది కాదు. నిస్సహాయులైన గిరిజనులను వాళ్లు దోపిడీకి గురి చేసేవాళ్లు, మోసగించేవాళ్లు, నిత్యమూ వేధించేవాళ్లు. అటవీ సంరక్షణ పేరుతో 1920లలో అడవులనుంచి పెద్ద ఎత్తున గిరిజనులను తొలగించారు, ఈ చర్యలు 1940 వరకు కొనసాగాయి. దీనివల్ల గిరిజనులు అంతులేని అభద్రతకు గురయ్యారు.

L1HZGS

గిరిజనులు వీటికి వ్యతిరేకంగా మొదటినుంచి పోరాడారు. ఈశాన్యప్రాంతం వంటి వాటిలో ప్రభుత్వం నుంచి కొంత రక్షణను కూడా పొందగలిగారు.

- గత 200 సంవత్సరాలలో అడవులు తగ్గిపోతూ ఉండటానికి కారణాల జాబితా తయారు చేయండి. దీనికి పోడు వ్యవసాయం కూడా ఒక కారణమా? మీ వాదనలు పేర్కొనండి.
- అడవిని గిరిజనులు రక్షించటానికీ, అటవీ అధికారులు రక్షించటానికీ మధ్య తేడాలు ఏమిటి?


- ప్రభుత్వం విధించిన భూమి శిస్తును గిరిజనులు కట్టలేకపోవటానికి కారణాలు ఏమిటి?

స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో గిరిజన ప్రజలను అడవులలో తమ సంప్రదాయ జీవితాలు కొనసాగించటానికి వదిలేయాలా లేదా స్థిర వ్యవసాయం, ఆధునిక విద్య, పారిశ్రామిక పని అవలంబించేలా చేయాలా అని జాతీయ నాయకులు చర్చించారు.


- ఏ పద్ధతి అనుసరించి ఉంటే బాగుండేదో తరగతిలో చర్చించండి.

## 1988-90లలో వచ్చిన మార్పు

గిరిజనులకు అడవులపై ఎటువంటి హక్కులు ఇవ్వకుండా వాళ్ల అభివృద్ధి గురించి ఆలోచించలేమని, అదేవిధంగా వాళ్ల క్రియాత్మక భాగస్వామ్యం లేకుండా అడవులను సంరక్షించలేమని 1988 నాటికి ప్రభుత్వం గుర్తించింది. అడవుల రక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధిలలో గిరిజన ప్రజలను భాగస్వామ్యం చేయటం ప్రధాన కర్తవ్యంగా జాతీయ అటవీ విధానం, 1988 గుర్తించింది. అడవులలో, వాటి చుట్టుపక్కల నివసించే ప్రజలకు లాభసాటి ఉపాధి కల్పించాలని కూడా ఇది గుర్తించింది. అడవుల రక్షణలోనూ, క్షీణతకు గురైన అడవుల అభివృద్ధిలోనూ అడవులకు దగ్గరగా నివసిస్తున్న గ్రామ ప్రజలను భాగస్వాములుగా చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. క్షీణతకు గురైన అడవుల పునరుద్ధరణ, అభివృద్ధిలో అటవీశాఖ, అటవీ/పల్లె ప్రజల మధ్య క్రియాశీల సహకారానికి ఇది శ్రీకారం చుట్టింది. ఆ విధంగా 1988లో ఆచరణలోకి వచ్చిన కొత్త విధానం ఉమ్మడి అటవీ యాజమాన్యానికి (జె.ఎఫ్.ఎం.) దారి తీసింది. దీంట్లో భాగంగా అటవీశాఖ, స్థానిక ప్రజలు కలిసి చెట్లు నాటుతారు, క్షీణతకు గురైన అడవుల పునరుద్ధరణను చేపడతారు. గడ్డి ఇతర చిన్న చిన్న అటవీ ఉత్పత్తులను



1. ఒకానొకప్పుడు మనుషులు మా మధ్య ఉండేవాళ్లు.



2. ఆ తరవాత కంచె వేసుకుని మమ్మల్ని బయట ఉంచారు.



3. వాళ్లు మరిన్ని పల్లెలు, పట్టణాలు నిర్మించి అడవి అన్నది లేకుండా చెట్లను నరికి వేశారు, అయినా ఇంకా 'రిజర్వు అడవి' అంటారు.



4. మనుషుల నుంచి జంతువులకు రక్షణ ఉందా? ఏదైనా రక్షిత అడవి గురించి మీరు విన్నారా?

వినియోగించుకోటానికి అక్కడి ప్రజలను అనుమతించారు.

ఈ కార్యక్రమానికి ప్రజా అటవీ యాజమాన్యం (Community Forest Management - C.F.M.) అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేరు మార్చింది. అటవీశాఖ, స్థానిక ప్రజలు కలిసి పనిచేసేలా ఈ కార్యక్రమం సహాయపడింది. కానీ గిరిజనులు అంతకు ముందు నుంచి సాగుచేస్తున్న పోడు భూములను అటవీ పునరుద్ధరణ కోసం వదులుకోవాల్సి వచ్చింది. ఇదే సమయంలో అటవీ జంతువుల సంరక్షణకు పులుల అభయారణ్యాలు అనేకం ఏర్పాటయ్యాయి.

- సి.ఎఫ్.ఎం., ఇతర సామాజిక అటవీ పథకాలకు సంబంధించి మీ పెద్దవాళ్ల అనుభవాలను తెలుసుకోండి.

### అటవీ హక్కుల చట్టం, 2006

L259TL

ఈ మార్పులకు వ్యతిరేకంగా గిరిజనులు నిరసనలు వ్యక్తం చేస్తూ వచ్చారు, పోరాడుతూ వచ్చారు. వీళ్ల తరపున అనేక స్వచ్ఛంద సంస్థలు నిలబడి అడవులపై గిరిజనుల హక్కుల కోసం జాతీయస్థాయి ప్రచార ఉద్యమాన్ని చేపట్టాయి. సుదీర్ఘ చర్చల తరవాత 2006లో పార్లమెంటు అటవీ హక్కుల చట్టాన్ని చేసింది. గిరిజనులకు చెందిన అడవులలో వాళ్లకు సంప్రదాయంగా వస్తున్న హక్కులను తిరస్కరించి గత రెండు వందల సంవత్సరాలుగా గిరిజనులకు తీవ్ర అన్యాయం చేశామని మొదటిసారి అంగీకరించారు. గిరిజనుల హక్కులు పునరుద్ధరించకుండా అడవులను సంరక్షించటం అసాధ్యమని కూడా గుర్తించారు.

ఈ కొత్త చట్టం చేయటానికి మూడు ప్రధాన కారణాలను అది పేర్కొంది:

మొదటిది, అడవులను సంరక్షించటమే కాకుండా అదే సమయంలో అటవీవాసులకు జీవనోపాధినీ, ఆహార భద్రతను కల్పించాల్సి ఉండడం.

రెండవది, అడవుల సుస్థిరత, మనుగడలలో అంతర్భాగమైన అటవీ వాసులు తరతరాలుగా సాగుచేస్తున్న భూములపై, నివాస ప్రాంతాలపై హక్కులను వలసపాలనలో, స్వతంత్రం వచ్చిన తరవాత కూడా గుర్తించకపోవటం వల్ల జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిచేయాల్సి ఉండడం.

మూడవది, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వల్ల (ఆనకట్టలు, పులుల అభయారణ్యాలు వంటివి) నిర్వాసితులైన వారితో సహా అటవీ వాసుల భూమి హక్కులు, అడవిలోకి వెళ్లే హక్కుల విషయంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న అభద్రతను పరిష్కరించాల్సి ఉండటం.

ఈ చట్టం వల్ల అటవీవాసులకు, సంప్రదాయంగా అటవీ వస్తువులపై ఆధారపడిన వాళ్లకు అడవులపై తమ హక్కులు తిరిగి లభించాయి, సాగుచేస్తున్న భూములకు పట్టాలు వచ్చాయి. ఈ చట్టాన్ని సరిగా అమలు చేస్తే తరతరాలుగా గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని కొంతమేరకు సరిదిద్దవచ్చు.

- గత 200 సంవత్సరాలుగా గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని ఈ చట్టం ఎంతవరకు తీరుస్తుంది?

అడవుల సంరక్షణ కోసం పనిచేస్తున్న అనేకమంది ఈ చట్టం వల్ల అడవులను సంప్రదాయంగా వస్తున్న కుటుంబ అవసరాల కోసం కాకుండా ఇతర వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించుకుని అడవులు మరింతగా అంతరించిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఇందుకు విరుద్ధంగా కొంతమంది సంప్రదాయంగా అటవీ సంరక్షణ చేస్తున్న అటవీవాసులనే ప్రధాన రక్షకులుగా చేయటం ద్వారా అడవులను ఇంకా బాగా కాపాడవచ్చని భావిస్తున్నారు.

- ఈ విషయాన్ని తరగతిలో చర్చించండి – గిరిజన ప్రజలకు జరిగిన అన్యాయాలను సరిచేయడానికి ఇదే సరైన మార్గమా? అడవులను కాపాడటంలో ఇది ఎలా ఉపయోగపడుతుంది? దీనికి ఏ ఇతర చర్యలు చేపట్టాలి?

**ఉపాధ్యాయుల సహాయంతో చట్టంలోని దిగువ అంశాలను అర్థం చేసుకోటానికి ప్రయత్నించండి.**

అ. అడవులలో ఉంటున్న షెడ్యూల్డ్ తెగలు లేదా సంప్రదాయంగా అడవులలో ఉంటున్న ఇతర జాతులకు చెందిన వాళ్లు తమ జీవనోపాధికి స్వయంగా సాగు చేసుకునే భూమిపై, ఒక్కరిగా లేదా సమూహంగా నివసించటానికి ఏర్పరచుకున్న నివాస ప్రాంతంపై ఈ చట్టం ద్వారా హక్కు లభిస్తుంది (అక్కడ ఉండే హక్కు).

ఆ. నిస్తార్ వంటి సామూహిక హక్కులు.

ఇ. గ్రామ సరిహద్దుల లోపల లేదా బయట సంప్రదాయంగా సేకరిస్తూ వస్తున్న కలపేతర అటవీ ఉత్పత్తులను సేకరించే, ఉపయోగించుకునే, అమ్మే హక్కు, వాటిపై యాజమాన్యం.

ఈ. చేపలను పట్టటం, జలాశయాలు, పశువులను మేపుకోవటం వంటి సామూహిక వినియోగ హక్కులు.

ఉ. వ్యవసాయ పూర్వసమాజాలు, ఆదిమ (ప్రిమిటివ్) గిరిజన బృందాల నివాసం, సంచారానికి సంబంధించిన సామూహిక హక్కులు.

ఊ. అటవీ భూములపై స్థానిక లేదా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన కౌలుహక్కు, గ్రాంటు వంటి వాటిని పట్టాగా మార్చుకునే హక్కు.

ఎ. అటవీ గ్రామాలు, పురాతన నివాసాలు వంటి వాటిల్లో నివాస హక్కులు, అలా మార్చుకునే హక్కు.

ఏ. ఉమ్మడి అటవీ వనరుల రక్షణ, పునరుద్ధరణ, సంరక్షణ, యాజమాన్య హక్కులు.

ఐ. జీవవైవిధ్యతను ఉపయోగించుకునేహక్కు, జీవ వైవిధ్యత, సాంస్కృతిక వైవిధ్యతకు సంబంధించిన సంప్రదాయ విజ్ఞానం, మేధోసంబంధ ఆస్తులపై ఉమ్మడి హక్కు.

## కీలక పదాలు

1. అడవుల పునరుద్ధరణ
2. అడవులు నరికివేయటం
3. అటవీ యాజమాన్యం
4. అటవీ హక్కుల చట్టం
5. రిజర్వు అడవులు

L26VIF

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. కింది వాక్యాలను మీరు అంగీకరిస్తారా? అంగీకరించటానికీ, అంగీకరించకపోటానికీ కారణాలను పేర్కొనండి. $AS_1$
   - అడవులను సంరక్షించటానికి వ్యక్తిగత ఆస్తి అన్న భావన ముఖ్యమైనది.
   - అడవులన్నింటినీ మనుషులు కాపాడాలి.
   - గత కొద్ది శతాబ్దాలుగా భూమిమీద నివసిస్తున్న ప్రజలు తమ జీవనోపాధికి అడవులపై ఆధారపడటం తగ్గింది.
2. గత కొన్ని శతాబ్దాలలో అటవీ వినియోగంలో వచ్చిన ప్రధాన మార్పులతో ఒక పట్టిక తయారు చేయండి. గత తరగతుల పాఠ్య పుస్తకాలు చూడాల్సిన అవసరం రావచ్చు. $AS_3$

| అంశం | గిరిజన జీవనంపై ప్రభావం | అడవిపై ప్రభావం |
|---|---|---|
| వ్యవసాయ ఆవిర్భావం | | |
| వలస పాలకుల రాక | | |
| ప్రభుత్వ నియమాలు | | |

3. పైన ఇచ్చిన వాటి ఆధారంగా, లేదా అడవుల గురించి మీకు తెలిసిన దానిబట్టి మీరు నివసిస్తున్న ప్రదేశానికి దగ్గరలో ఉన్న అడవిని ఈ దిగువ అంశాలలో వివరించండి: $AS_4$

| చెట్ల సాంద్రత | కనిపించే చెట్లు | చెట్ల ప్రత్యేక అంశాలు |
|---|---|---|
| | | |

4. 'ఆంధ్రప్రదేశ్ – అడవులు' పటాన్ని పరిశీలించి ఏ జిల్లాలో/ జిల్లాల్లో అత్యధికంగా అడవులు ఉన్నాయో పేర్కొనండి. $AS_5$
5. ఒక పాఠశాలలో కొంతమంది విద్యార్థులు 'వన మహోత్సవ కార్యక్రమం'లో పాల్గొని కొన్ని మొక్కలు నాటారు. దీనికి మీరు ఎలా స్పందిస్తారు? $AS_6$
6. 'ఆంధ్రప్రదేశ్‌లో అడవులు' శీర్షిక కింద ఉన్న పేరాను చదివి కింది ప్రశ్నకు జవాబు రాయండి. మన రాష్ట్రంలో అటవీ విస్తీర్ణ అభివృద్ధికై మీరు సూచించే సలహాలు ఏమిటి? $AS_2$
7. ఈ పాఠంలో ఇచ్చిన వివిధ రకాలైన అడవుల చిత్రాలలో ఉన్న ప్రదేశాలను మీ దగ్గరున్న అట్లాస్‌లో గుర్తించండి. వాటి మధ్య ఉన్న పోలికలు, భేదాలను నీవు గుర్తించగలవా? $AS_5$
8. సతత హరిత అడవులకు, ఆకురాల్చే అడవులకు గల తేడాలేవి? $AS_1$
9. పేజీ నెం. 59లో ఉన్న చిత్రాలను పరిశీలించి ఒక వ్యాఖ్య రాయండి. $AS_2$
10. అటవీ హక్కుల చట్టం 2006 సారాంశాన్ని వివరించండి. $AS_1$

పాఠం 6

# ఖనిజాలు, గనుల తవ్వకం

L2E5V9

## మన ఇంట్లో ఖనిజాలు

మీ ఇల్లును మట్టితో చేసిన ఇటుకలు లేదా సిమెంటు, ఇసుక కలిపిన గోడలతో కట్టి ఉంటారు. గోడలకు తెల్లసున్నం వేసి ఉంటారు. గచ్చుకి కడప రాళ్లు వేసి ఉంటారు. స్తంభాలకి, ఇతర చోట్ల గ్రానైట్ రాళ్లు వాడి ఉంటారు. వీటిలో అనేకం – మట్టి, ఇసుక, సున్నం, నాపరాయి (కడపరాయి) లేదా గ్రానైటు రాయి భూమి నుంచి వచ్చే ఖనిజాలే. ఇంట్లో చూస్తే ఇనుము, రాగి, సీసం, క్రోమియం, అల్యూమినియం వంటి లోహాలతో చేసిన వస్తువులు కనపడతాయి. మీరు వెండి, బంగారంతో చేసిన ఆభరణాలు వేసుకుని ఉండవచ్చు. గనులనుంచి తవ్విన ఖనిజాల నుంచి ఈ లోహాలను వేరు చేస్తారు. మనం పెట్రోల్, డీజిల్, కిరోసిన్ వంటి ఇంధనాలను వాడుతున్నాం. ఖనిజనూనె నుంచి ముడి చమురు తీస్తారు. బొగ్గు, సహజవాయువు వంటి ఇతర ఇంధనాలు కూడా ఖనిజాల రూపాలే. ఇంకా చెప్పాలంటే సహజ సిద్ధంగా బావులు, బోరుబావుల నుంచి వెలికి తీసే భూగర్భ జలం కూడా ఖనిజమే. ఇంకోమాటలో చెప్పాలంటే భూమి లోపలినుండి పొందే ప్రతిదీ (మొక్కలు, జంతువుల రూపంలో లేనిది) ఖనిజమే అవుతుంది.

## పునరుద్ధరింపబడే, అంతరించిపోయే వనరులు

పర్యావరణవేత్తలు వనరులను రెండు రకాలుగా విభజిస్తారు – పునరుద్ధరింపబడేవి, అంతరించి పోయేవి. కలపలాగా మళ్లీ మళ్లీ పొందగల వనరులను పునరుద్ధరింపబడే వనరులని అంటారు. ఒక చెట్టును నరికితే మరొక చెట్టును నాటవచ్చు, కొన్ని సంవత్సరాల తరవాత అది కలపను ఇస్తుందని ఆశించవచ్చు. కానీ గుట్టల నుంచి గ్రానైటురాళ్లు తీసి, అమ్మివేస్తే మరొక రాయిని పాతవచ్చా, లేదా ఏదైనా విధంగా తిరిగి తయారు చేయగలమా? ఈ వనరుని తిరిగి తయారు చేయలేం కాబట్టి వీటిని అంతరించిపోయే వనరులు, లేదా పునరుద్ధరించటానికి వీలులేని వనరులు అంటారు. చాలా రకాల ఖనిజాలు పునరుద్ధరింపబడవు. వీటిని ఉపయోగించుకుంటూ వెళితే ఏదో ఒక దశలో ఇవి మనకిక మిగలవు. ఉదాహరణకు బంగారాన్ని తీసుకుందాం: ఇది పరిమితమైన మోతాదులలో చాలా లోతైన గనులలో మాత్రమే లభ్యమవుతుంది. భారతదేశంలోని ఏకైక బంగారు గని అయిన కోలార్ బంగారు గనిలో బంగారం అయిపోవటం వల్ల దానిని మూసివేశారు. అదేవిధంగా బొగ్గు, ముడిచమురు. భూమి మీద వీటి నిల్వలు పరిమిత మోతాదులలోనే ఉన్నాయి. వీటిని వాడేస్తే ఇక భవిష్యత్తు తరాలకు మిగలవు. వీటినే పునరుద్ధరించటానికి వీలులేని ఇంధనాలు అంటారు.

- రైళ్లు, కార్లు నడపటానికి వీలులేని ప్రపంచాన్ని మీరు ఊహించండి.
- తనకుతానుగా పునరుద్ధరింపబడే ఖనిజం ఒకటి చెప్పండి. ఈ ప్రక్రియలో మనం ఎలా సహాయపడగలం?
- మనం వాడుతున్నా తరిగిపోని, మనం ఏమీ చేయకపోయినా పునరుద్ధరింపబడే ఇంధన వనరు ఏదో చెప్పండి.

- కింద ఇచ్చిన సహజ వనరులను పునరుద్ధరింపబడేవి, అంతరించిపోయేవిగా వర్గీకరించండి.

ఖనిజం అయితే టిక్కు (√) పెట్టండి, కాకపోతే ఇంటూ (×) పెట్టండి: వెదురు, బొగ్గు, సముద్రపు నీరు, మట్టి, చీమలు, ఇసుక, ఇనప ఖనిజం, వజ్రాలు, చెట్లు, ముడి చమురు, గడ్డి, గాలి, పాలరాయి, చేపలు, బావినీళ్లు, సూర్యకాంతి.

| పునరుద్ధరింపబడే వనరు | అంతరించిపోయే వనరు | ఖనిజాలు |
|---|---|---|
| 1. వెదురు | | × |
| 2. | బొగ్గు | √ |
| 3. | | |
| 4. | | |

- కింద ఇచ్చిన ఖనిజాలను లోహాలు, లోహాలు కాని వాటిగా వర్గీకరించి, ఇంధన వనరులను పేర్కొనండి: ఇనప ఖనిజం, బాక్సైట్ (అల్యూమినియం ఖనిజం), బొగ్గు, రాగి ఖనిజం, సున్నపురాయి, జిప్సం, మైకా, భూగర్భ జలాలు, ముడి చమురు, సైంధవ లవణం, ఇసుక, వజ్రపురాళ్లు.

| లోహాలు | లోహాలు కానివి | ఇంధన వనరు |
|---|---|---|
| ఇనుప ఖనిజం | | |
| | | |
| | | |
| | | |
| | | |

## కొన్ని ముఖ్యమైన ఖనిజాలు, వాటి వినియోగాలు

ఇనప ఖనిజం, ఇసుక, ముడిచమురు, సున్నపురాయి, బొగ్గు మొదలైన ఖనిజాల ఉపయోగాలు మీకు తెలిసే ఉంటుంది. ఆధునిక పరిశ్రమలలో అనేక రకాల ఖనిజాలను ఉపయోగిస్తున్నాం. కాబట్టి ఈ ఖనిజాలు మన జీవితాల్లో చాలా ముఖ్యభాగం అయ్యాయి. కొన్ని ముఖ్యమైన ఖనిజాల ఉపయోగాల గురించి ఇక్కడ తెలుసుకుందాం. మీరు గ్రంథాలయం, లేదా ఇంటర్నెట్‌లలో చూసి వీటి గురించి మరింత సమాచారం సేకరించవచ్చు.

**బాక్సైట్:** బాక్సైట్ ఖనిజం నుంచి అల్యూమినియంను తయారు చేస్తారు. అల్యూమినియం చాలా తక్కువ బరువు ఉండటం వల్ల మన జీవితాల్లో చాలా ముఖ్యమైన ఖనిజంగా మారింది. విమానాలు, పాత్రలు, విద్యుత్తు తీగలు వంటివి తయారు చేయటంలో, ఆహార పదార్థాల ప్యాకేజింగ్‌లో దీనిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

**మైకా (అభ్రకం):** ఇది మెరిసే ఖనిజం. విద్యుత్తు, ఎలక్ట్రానిక్ పరిశ్రమలలో దీనిని విస్తృతంగా ఉపయోగిస్తారు. దీనికి ఉపయోగపడే అనేక గుణాలు ఉన్నాయి. ఇది సన్నటి పొరలలో లభ్యమవుతుంది. ఇది విద్యుత్ నిరోధకం.

**క్రోమియం:** 'స్టేన్‌లెస్‌స్టీల్' పాత్రలు తయారు చేయటానికి దీనిని ఉపయోగిస్తారు. (ఇనుము, రాగి లాగా) అది తుప్పు పట్టదు కాబట్టి దానిని అన్నం వండటానికి, ఆమ్లాల వంటి పారిశ్రామిక ద్రవాల నిల్వకు ఉపయోగిస్తారు.

**ఆస్బెస్టాస్:** ఇది వేడిని నిరోధించే పదార్థం, అందుకే పరిశ్రమలలోనూ, ఇళ్లకి పైకప్పుగానూ విస్తృతంగా వాడుతున్నారు. అయితే వాటిపై పనిచేసే వారి ఆరోగ్యం దెబ్బతీస్తుంది కాబట్టి దీనిని ప్రపంచమంతటా ప్రస్తుతం నిషేధిస్తున్నారు.

**బెరైటిస్:** ఇది కొన్ని ఖనిజాల సమూహం. వీటి నుంచి బేరియం అనే మూలకాన్ని వెలికితీస్తారు. పారిశ్రామిక, వైద్య అవసరాల కోసం బేరియంని ఉపయోగిస్తారు. ముడి చమురు, సహజవాయువుల కోసం చాలా లోతుగా తవ్వటానికి కూడా బెరైటిస్‌ని ఉపయోగిస్తారు.

**ఫెల్డ్‌స్పార్:** గాజు, (వాష్‌బేసిన్ వంటి) సెరామిక్ వస్తువులు తయారు చేయటానికి ఇది ముడి సరుకుగా ఉపయోగపడుతుంది.

## ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజ వనరులు

L2FRK3

మన రాష్ట్రంలో ఖనిజ వనరులు చాలా సమృద్ధిగా ఉన్నాయి. భవన నిర్మాణంలో ఉపయోగించే అనేక రంగుల గ్రానైటురాయి, కడప రాయిని పెద్ద మొత్తంలో మన రాష్ట్రం ఉత్పత్తి చేస్తుంది. సిమెంటు పరిశ్రమలో ఉపయోగించే సున్నపురాయి, డోలమైట్ కూడా ఉత్పత్తి చేస్తుంది. కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఖనిజనూనె, ఖనిజవాయు నిక్షేపాలు ఉన్నాయి.


ఆంధ్రప్రదేశ్ చారిత్రకంగా వజ్రపు గనులకు ప్రఖ్యాతిగాంచింది. గుంటూరు జిల్లా కొల్లూరులోను, అనంతపురం జిల్లా వజ్రకరూర్‌లోను వజ్రాల గనులు ఉన్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద వజ్రం అయిన కోహినూరు వజ్రం. అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్‌లో దొరికింది.

ఇవే కాకుండా ఆస్బెస్టాస్, బెరైటిస్, మైకా, ఫెల్డ్‌స్పార్ వంటి ఖనిజాల విస్తార నిక్షేపాలు ఉన్నాయి.

**ఆంధ్రప్రదేశ్ ఖనిజాల పటం చూసి కింది పట్టిక నింపండి:**

| జిల్లా | ఖనిజం |
|---|---|
| | |
| | |
| | |
| | |
| | |
| | |

*పటం 1 : ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజాలు*



## ఖనిజాలను వెలికి తీయటం




భూమిని తవ్వటం, లేదా గనుల తవ్వకం అనే ప్రక్రియ ద్వారా ఖనిజాలను మానవ వినియోగానికి వెలికి తీస్తారు. గనులు తవ్వటానికి అనేక పద్ధతులు ఉన్నాయి. పెద్ద గొయ్యి తవ్వి, ఖనిజాలను వెలికితీస్తూ ఉండవచ్చు. గుట్టలను పేల్చి, తొలిచి గ్రానైటు రాళ్లు వంటివి తీస్తారు. ఇటువంటి వాటిని 'ఓపెన్ కాస్ట్ మైనింగ్' అంటారు. భూమి చాలా లోతుల్లో ఉండే ఖనిజాలను వెలికి తీయటానికి భూగర్భ సొరంగాలను నిర్మించవచ్చు. దీనిని భూగర్భ మైనింగ్ అంటారు. భూగర్భ జలాలను వెలికి తీయటానికి బోరుబావులు తవ్వినట్లే ముడిచమురు, సహజవాయువులను వెలికి తియ్యటానికి లోతుగా బావులు తవ్వుతారు. ముంబయి దగ్గరలోని బాంబే హై లో మాదిరిగా చాలా ప్రదేశాలలో సముద్రపు అడుగు భాగంలో డ్రిల్లింగ్ చేస్తారు.

గనుల తవ్వకంలోని అనేక పద్ధతుల వల్ల ఉపరితల ప్రదేశం దెబ్బతింటుంది – అంటే అడవులను నరికి వేయటం కావచ్చు లేదా పెద్ద పెద్ద గోతులతో నివాస ప్రాంతాలు, వ్యవసాయ భూములను నాశనం చేయటం కావచ్చు. ఖనిజాలను కడగటానికి గనుల వద్ద పెద్ద మొత్తంలో నీళ్లు కావాలి. దీని కారణంగా దగ్గరలోని నదులు, నీటి వనరులు కలుషితం అవుతాయి. దీని వల్ల భూమిని మునుపటి ప్రయోజనాల కోసం వాడటం సాధ్యంకాదు, అక్కడ నివసించే గిరిజనులు, రైతులు ఆ భూమిని వదిలి వెళ్లాల్సి వస్తుంది. గనుల తవ్వకం వల్ల చుట్టుపక్కల నివసించే ప్రజలు కూడా సమస్యలు ఎదుర్కొంటారు. అదే సమయంలో గనులు చాలా మందికి ఉద్యోగం కల్పిస్తాయి. వీళ్లకోసం చుట్టుపక్కల కొత్తగా కాలనీలు నిర్మిస్తారు. గనుల ద్వారా భారతదేశంలో సుమారు పది లక్షలమందికి, ఆంధ్రప్రదేశ్‌లో లక్షకు పైగా మందికి ఉపాధి దొరుకుతోంది. గని కార్మికుల జీవితాలు చాలా ప్రమాదకరంగా ఉంటాయి – వాళ్లు నిరంతరం ప్రమాదాల ముప్పును ఎదుర్కొంటారు, విషపూరిత వాయువులను పీల్చటం వల్ల దీర్ఘకాలంలో వాళ్ల ఆరోగ్యం దెబ్బతింటుంది.

- కింద చిత్రాలు చూసి వాటిల్లో ఏది ఓపెన్ కాస్ట్ గనుల తవ్వకమో, భూగర్భ తవ్వకమో, చమురు కోసం బోరుబావుల తవ్వకమో చెప్పండి.


చిత్రం 6.1


చిత్రం 6.2


చిత్రం 6.3

● మీ ప్రాంతంలో గనుల తవ్వకం జరుగుతూ ఉంటే అక్కడ పనిచేసే, నివసించే ప్రజల గురించి తెలుసుకోండి. చుట్టుపక్కల వాతావరణాన్ని గనుల తవ్వకం ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోండి. గనుల తవ్వకం వల్ల ఎంతమంది ప్రయోజనం పొందుతున్నారో తెలుసుకోండి.

## ఖనిజాలు ఎవరికి చెందుతాయి?

ఖనిజాలు సాధారణంగా భూమి లోపలి పొరల్లో ఉంటాయి. ఇవి ఏ ఒక్క వ్యక్తికో చెందవు. ఇవి దేశ ప్రజలందరికీ చెందుతాయి, వీటిని అందరి ప్రయోజనం కోసం ఉపయోగించాలి. అందుకే దేశంలోని యావత్తు ఖనిజ సంపదను ఆ దేశ ప్రభుత్వ ఆస్తిగా భావిస్తారు. దేశంలోని ప్రజలందరి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆ ఖనిజాలను వినియోగిస్తుంది.

● ఖనిజాలను ప్రభుత్వం ఎలా వినియోగించుకుంటుంది?

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో గనులు చాలా వరకు ప్రైవేటు కంపెనీలు, వ్యక్తుల చేతుల్లో ఉండేవి. వాళ్లు అతి తక్కువ సమయంలో అతి ఎక్కువ లాభాలపై ఆసక్తి చూపించినంతగా గనులను సక్రమంగా అభివృద్ధి పరచటంపైనా, కార్మికుల భద్రతపైనా దృష్టి నిలపలేదు. 1970లలో గనులన్నింటినీ ప్రభుత్వం జాతీయం చేసింది. ప్రస్తుతం చాలా గనులు ప్రభుత్వ అధీనంలో ఉన్నాయి. గనుల తవ్వకాన్ని కూడా ప్రభుత్వమే చేపట్టి ఖనిజాలను వివిధ కర్మాగారాలకు లేదా వ్యాపారస్తులకు అమ్మేది, లేక ఎగుమతి చేసేది. దీని ద్వారా గనుల తవ్వకాన్ని నియంత్రించగలిగి అవి దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం చూడగలిగింది. అదేవిధంగా ప్రజలకు, ప్రత్యేకించి గని కార్మికులకు ప్రమాదకరం, హానికరం కాని పద్ధతులను అవలంబించేలా చూడగలిగింది. అంతేకాకుండా ఇంధనాలు, విలువైన లోహాలు వంటివి కేవలం లాభాపేక్షతో పనిచేసే ప్రైవేటు కంపెనీల చేతుల్లో లేకుండా ప్రజల ప్రయోజనం కోసం ఉపయోగించేలా చూసింది. అయితే గనుల తవ్వకానికి ప్రభుత్వం ఆధునిక, సంక్లిష్ట సాంకేతిక విజ్ఞానాన్ని ప్రవేశపెట్టలేకపోయింది, సర్వేచేసి ఖనిజాల కొత్త నిక్షేపాలను కనుగొనలేకపోయింది. ఫలితంగా ఖనిజ సంపద వెలికితీతలో ఎదుగుదల లేకుండా పోయింది. అందుకని ప్రభుత్వ నియంత్రణలకు లోబడి ఖనిజాల తవ్వకం, వాటి అమ్మకాలకు ప్రైవేటు కంపెనీలను అనుమతించాలని అనుకున్నారు. 1993లో కొత్త జాతీయ ఖనిజ విధానాన్ని ప్రకటించారు. ప్రభుత్వం గనులను ప్రైవేటు కంపెనీలకు కౌలుకి ఇచ్చి వాటిని నిర్వహించమంది. ప్రైవేటు కంపెనీలు తవ్వి, అమ్మిన ఖనిజాలకు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. ఈ విధంగా గనుల తవ్వకం మీద ప్రభుత్వానికి నియంత్రణాధికారం ఉంటూనే కొంత ఆదాయం సమకూరుతోంది. అదే సమయంలో పెట్టుబడులు పెట్టి కొత్త సాంకేతిక విజ్ఞానం తీసుకురావటానికి ప్రైవేటు కంపెనీలకు ప్రోత్సాహం లభిస్తోంది. అణు ఇంధనాలకు సంబంధించిన గనుల తవ్వకం మొత్తం ఇప్పటికీ ప్రభుత్వం చేతుల్లోనే ఉంది.

ఈ విధాన ఫలితంగా గత ఇరవై సంవత్సరాలలో గనుల తవ్వకం ఊపందుకుంది. గనుల సంఖ్య, తవ్వి తీసే ఖనిజాలు, ఈ రంగంలో ఉపాధి గణనీయంగా పెరిగింది.

అయితే పర్యావరణ, భద్రతా అంశాలు పట్టించుకోకుండా, ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల కంటే ఎంతో ఎక్కువ మొత్తంలో ప్రైవేటు కంపెనీలు అడ్డూ అదుపూ లేకుండా గనులను తవ్వేస్తున్నాయి. ఎక్కువ మొత్తంలో గనుల తవ్వకం వల్ల దీర్ఘకాల సుస్థిరతకు భంగం కలుగుతుంది. అంతేకాకుండా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా ప్రైవేటు కంపెనీలు ఖనిజాలను తరలించి వేస్తున్నాయి. అంటే నిజంగా ఖనిజాలు ఎవరికైతే చెందాలో ఆ ప్రజలకు ఎటువంటి మేలు జరగటం లేదు. అంతేకాకుండా

పర్యావరణ రీత్యా ఇది ఎంతో నష్టం కలిగించవచ్చు. ఉదాహరణకు వాగులు, నదుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇసుక తవ్వేస్తే, అది నదీ ప్రవాహాన్ని ప్రభావితం చేసి వరదలకు దారి తీయవచ్చు లేదా తొందరగా ఎండిపోవచ్చు. అదేవిధంగా భూగర్భ గనుల తవ్వకానికి ఎక్కువ ఖర్చు అవుతుంది కాబట్టి కొత్త కంపెనీలు ఈ విధానాన్ని చేపట్టకుండా ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో గనుల తవ్వకానికి మొగ్గు చూపుతున్నాయి. ఈ పద్ధతిలో గనుల తవ్వకానికి చాలా తక్కువ ఖర్చు అవుతుంది. తవ్వి పోసిన గుట్టలు, తవ్వగా ఏర్పడిన గోతులను సరి చేయకపోతే నదీ ప్రవాహానికి అడ్డు పడటం వంటి తీవ్ర పర్యావరణ సమస్యలు ఎదురవుతాయి.

- మన ఖనిజాలను తవ్వటానికి ప్రైవేటు కంపెనీలను అనుమతించటంలోని లాభ నష్టాలను చర్చించండి. వాటిని ఎలా నియంత్రించవచ్చు? పర్యావరణ సమస్యలు తలెత్తకుండా ఏమి చేయవచ్చు?
- ప్రజలందరూ ఖనిజ వనరుల అసలైన యజమానులు అయితే వాళ్లందరి మేలుకోసం వీటిని ఉపయోగించుకోవడం ఎలా?
- రానున్న తరాలకు, అంటే మన పిల్లలు, వాళ్ల పిల్లలకు కూడా ఈ వనరులు ఉండాలా, వద్దా? ఈ వనరులు అంతరించిపోకుండా వాళ్లకి కూడా అందేలా ఎలా చూడగలం?

## సింగరేణి బొగ్గు గనులు (SCCL)

ఖమ్మం, కరీంనగర్, అదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో విస్తార బొగ్గు గనులు ఉన్నాయి. ఈ బొగ్గును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (SCCL) వెలికి తీస్తుంది. దీనిని మొదట 1886లో ఒక ప్రైవేటు బ్రిటిషు కంపెనీ నెలకొల్పింది. 1920లో దీనిని హైదరాబాదు నిజాం కొన్నాడు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత భారత ప్రభుత్వం దీనిని జాతీయం చేసింది. ప్రస్తుతం ఎస్‌సిసిఎల్ భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కంపెనీ. తెలంగాణాలో పైన పేర్కొన్న నాలుగు జిల్లాలలో ఈ కంపెనీ ప్రస్తుతం 15 ఓపెన్ కాస్ట్ గనులలో, 35 భూగర్భ గనులలో తవ్వకాలు చేపడుతోంది. ఈ కంపెనీలో 65,000 ఉద్యోగులు ఉన్నారు (2012).

చిత్తూరు జిల్లాలోని వి.కోట మండలానికి చెందిన కొంగాటం ఉన్నత పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు ప్రఖ్యాతిగాంచిన సింగరేణి బొగ్గుగనులలోని ఒక గనిని సందర్శించారు. వారి సందర్శనను వారి మాటల్లోనే వినండి.

*చిత్తూరు నుండి హైదరాబాదు చేరుకున్నారు. హైదరాబాదు బస్‌స్టాండ్‌లో కొత్తగూడెం వెళ్లే బస్సు ఎక్కాం. కొత్తగూడెంలో దిగి ఎన్‌సిసిఎల్ కార్యాలయానికి వెళ్లి గనులను సందర్శించటానికి అనుమతి పొందాం. కొత్తగూడెం నుంచి పశ్చిమంగా 40 కిలోమీటర్లు ప్రయాణించి ఇల్లందు చేరుకున్నాం. ఇక్కడ కూడా ఎస్‌సిసిఎల్ కార్యాలయానికి వెళ్లి నెం. 21 ఇంక్లైన్‌లోకి వెళ్లటానికి అనుమతి తీసుకున్నాం. చిత్రం 6.4 చూడండి.*




*చిత్రం 6.4 : నెం. 21 ఇంక్లైన్ గని ప్రవేశ ద్వారం*

గూడ్సు బండి నిలిచి ఉన్న రైల్వే పట్టాల మీద ఉన్న ఇనప వంతెన *(over bridge)*ను దాటాం. గని ప్రవేశం వద్ద భద్రతా అధికారి మాకు కలిశాడు. భూమిలోపల పొరల్లో బొగ్గు దొరుకుతుందని అతడు వివరించాడు. పైనుంచి తవ్వటం మొదలుపెడితే ముందుగా మట్టి వస్తుంది. ఆ తరవాత రాళ్లు, నీళ్లు ఉంటాయి. 200–300 అడుగుల లోతు వరకు వెళితే బొగ్గు పొరలు తగులుతాయి. ఒక ప్రాంతంలో రాళ్లు లేదా మట్టితో వేరు చేయబడిన అనేక బొగ్గు పొరలు ఉండవచ్చు అని తెలిపాడు.

## ప్రమాదాలు, భద్రతా చర్యలు

ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది కాబట్టి గనిలోకి ప్రవేశించటం ఎప్పుడూ ముప్పుతో కూడుకున్నదని భద్రతా అధికారి వివరించాడు. ఒక సొరంగం కూలిపోవచ్చు, లేదా నీటితో నిండిపోవచ్చు. విషవాయువులతో నిండి గాలి ఆడకపోవచ్చు, అగ్ని ప్రమాదం సంభవించవచ్చు. ఇటువంటి ప్రమాదాలు నివారించడానికి యాజమాన్యం విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేసిందని అతడు మాకు వివరించాడు, మనం కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పాడు. ప్రమాదాలు జరిగినప్పుడు భద్రతా పెట్టెలోని పరికరాలతో ఎలా ఎదుర్కోవాలో వివరించాడు. భద్రతా పరికరాలు తీసుకుని గనిలోకి దిగటానికి మేం సిద్ధమయ్యాం. మస్టర్ పాయింట్ దగ్గర హాజరయి కంప్యూటరులో నమోదు చేసుకున్నాం.



చిత్రం 6.5 : భద్రతా పరికరాలు

- ఈ పరికరాలు ఏమిటో చెప్పండి.
- కర్ర ఉపయోగం ఏమిటి?
- హెల్మెట్‌పై దీపం ఎందుకు ఉంది?
- చిత్రంలోని లాంతరును గుర్తించారా? ఇది ఎందుకు ఉపయోగపడుతుంది?
- కింద ఇచ్చిన హామీ పత్రం చూడండి. ఏఏ షరతులకు మేం అంగీకరించవలసి వచ్చింది.




చిత్రం 6.6 : గంట సంజ్ఞలు సూచించే బోర్డు

ఇప్పుడు మేం గని ముఖద్వారం చేరుకున్నాం. మనుషులను లోపలికి, బయటికి చేరవేయటానికి అక్కడ ఒక లిఫ్టు ఉంది. ముగ్గురు గని కార్మికులు, భద్రతా అధికారితో పాటు మేం అందరం లిఫ్టులోకి ప్రవేశించాం. లిఫ్టు ఇన్‌చార్జి తలుపులు వేసి కింద ఉన్న లిఫ్టు ఇన్‌చార్జి గంట మోగించటం ద్వారా సంకేతమిచ్చాడు.

## గని లోపల

మా లిఫ్టు భూగర్భంలోకి 500 అడుగుల వరకు వెళ్లింది. ఒక లోతైన బావిలోకి దిగుతున్నట్టు ఉంది. లిఫ్టు వేగంగా కిందికి దిగుతుండటం, బయట ఎక్కడో నీళ్లు పడుతున్న చప్పుడు వినపడటంతో మేం కొంచెం భయానికి లోనయ్యాం. "గనులు తవ్వినప్పుడు నీళ్లు వస్తాయి. నీటిని బయటకు

పంపించకపోతే గనులు నీటితో నిండిపోతాయి. నీటినంతటినీ ఒక మడుగులోకి చేర్చి అక్కడి నుంచి పంపుతో బయటకు తోడేస్తారు. మడుగులోకి చేరుతున్న నీటిచప్పుడు మీరు విన్నారా,'' అంటూ వివరించాడు భద్రతా అధికారి. గనులలో ఈ అంశాలను పట్టించుకోటానికి కంపెనీలో ప్రాజెక్టు, ప్రణాళికా తయారీ విభాగం ఉందని కూడా అతడు చెప్పాడు. లిఫ్టు ఆగిన తరవాత 'మైన్ షాఫ్ట్' అనే సన్నటి సొరంగంలోకి ప్రవేశించాం. నడుస్తున్న మాకు విద్యుత్తు తీగలు, నీటిపైపులు, సన్నటి రైలుమార్గం వంటివి కనపడ్డాయి. బొగ్గు తవ్విన తరవాత చిన్న చిన్న బళ్లల్లో నింపి ఈ పట్టాలమీద లిఫ్టు వరకు లాక్కెళతారు. అక్కడి నుంచి లిఫ్టు ద్వారా పైకి తీసుకెళతారు. నిజానికి మేం ఒక బొగ్గు పొర (దీనినే 'కోల్ సీమ్' అని కూడా అంటారు) గుండా వెళుతున్నామని మార్గదర్శి చెప్పాడు. అంటే మాకు రెండువైపులా, పైనా, కిందా బొగ్గేనన్నమాట! గోడలు నల్లగా కాక ప్రకాశిస్తూ ఉండటం మాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. బొగ్గు క్షీణతకు గురి కాకుండా, ఆక్సీకరణ చెందకుండానూ, కాంతిని పరావర్తనం చేసి వెలుతురు ఇవ్వటానికీ గోడలకు డోలమైట్ పూస్తారని మా మార్గదర్శి చెప్పాడు.



చిత్రం 6.7 : డోలమైట్ పూసిన బొగ్గుగని గోడ

## బొగ్గును పేల్చటం

ఆ తరవాత మేము బొగ్గు తవ్వే ప్రాంతాన్ని చేరుకున్నాం. దీన్నే 'ముఖం' (ఫేస్) అంటారు. ప్రతిరోజూ సూపర్‌వైజర్లు బొగ్గు పొరను పరిశీలించి ఆరోజు తవ్వకాలకు సూచనలు ఇస్తారు – ఎక్కడ తవ్వాలో, ఎటువంటి భద్రతా చర్యలు చేపట్టాలో చెబుతారు. వేరు వేరు బృందాలకు వేరు వేరు పనులు అప్పగిస్తారు. న్యూమాటిక్ గాలి వత్తిడి పరికరంతో కొంతమంది పేలుడు కడ్డీలు ఉంచటానికి రంధ్రాలు చేస్తున్నారు. అవి జారిపోకుండా ఉండటానికి రెసిన్ పొట్లాలు ఉంచుతున్నారు. ఒక విద్యుత్ పరికరంతో పేలుడు జరిగేటట్లు చేస్తారు. ఈ పేలుడుకి రాయిలాగా ఉండే బొగ్గు ముక్కలవుతుంది. ఆవిధంగా ముక్కలైన బొగ్గును చిన్న పరిమాణంలో కోసి రవాణా చేస్తారు. ఈ పద్ధతిని 'పేల్చటం' (బ్లాస్టింగ్) అంటారు. ఇది ప్రమాదంతో కూడుకున్నది. ఒక్కొక్కసారి పేలుడు వల్ల బొగ్గు పొరలు కూలిపోయి కార్మికులు చనిపోవచ్చు. కాబట్టి ఈ పనిని ఎంతో జాగ్రత్తగా, పద్ధతిగా చెయ్యాలి. గని కార్మికులపై కప్పు కూలిపోకుండా మరొక బృందం కార్మికులు ఇనుము, చెక్క దుంగలను ఉంచుతున్నారు. ఇంకొక బృందం డ్రిల్లింగ్ యంత్రంతో సిద్ధంగా ఉంది. దీనిని ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకెళ్లవచ్చు. పేలుడు తరవాత దీనితో బొగ్గును కోస్తారు. పేలుడు రంధ్రం తయారయ్యింది, దీనిని చిత్రం 6.8లో చూడవచ్చు.

పేలుడికి అంతా సిద్ధమైన తరవాత అందరూ ప్రమాదం లేని ప్రదేశాలకు వెళ్లారు. అప్పుడు హెచ్చరికగా ఒక ఈల వేసి డిటొనేటర్ నొక్కారు.



చిత్రం 6.8 :
(ఎడమ) డిటొనేటర్
(కుడి) బ్యాటరీ
(కింద ఎడమ) పేలుడు పదార్థాలతో రంధ్రం నింపటం
(కింద కుడి) పేలుడు పదార్థాలు







ఉన్నట్టుండి గని అంతా పేలుడు శబ్దంతో ప్రతిధ్వనించింది. భూకంపం వచ్చినట్లు నేల, గోడలు కూడా అదిరాయి. అంతటా దుమ్ము, పొగ అలముకుంది. కొంతసేపటికి మళ్లీ ఈల వినిపించిన తరవాత మేమంతా ముఖద్వారం వైపుకి వెళ్లాం. దుమ్ము మెల్లగా తగ్గుతోంది. ఇద్దరు, ముగ్గురు గని కార్మికులు దగ్గుతూ దుమ్ము కమ్ముకున్న ప్రాంతంలోకి ప్రవేశించారు. కింద పడిన బొగ్గుపై నడుస్తూ కడ్డీలతో బొగ్గు పేల్చిన ప్రదేశాలను పరిశీలిస్తున్నారు. ఒకచోట పైకప్పు బలహీనంగా ఉంది. చెక్క పలకలు, దుంగలతో అక్కడ ఊతం ఇచ్చారు.

### బొగ్గు రవాణా

ఈ గనిలో బొగ్గుని కన్వేయరు బెల్టులతో రవాణా చేస్తారు. అంతకుముందు గని కార్మికులు బొగ్గుని చిన్న బళ్లల్లో నింపి తీసుకెళ్లేవారు. ఇప్పుడు యంత్రపరికరాలు బొగ్గును కన్వేయరు బెల్టుల మీదకి ఎత్తితే అవి బొగ్గును పైకి తీసుకెళతాయి. అక్కడ బొగ్గును నాణ్యత ప్రకారం వేరు చేసి ట్రక్కులు, రైల్వే వ్యాగన్లలోకి ఎత్తుతారు. ప్రధానంగా ప్రభుత్వ థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాలకు బొగ్గును సింగరేణి సరఫరా చేస్తుంది. అదనంగా ఉన్న బొగ్గును ఇతర కంపెనీలు కొనుగోలు చేస్తాయి.

### సంక్షేమం

రోడ్లు, మంచినీళ్లు వంటి సౌకర్యాలతో సింగరేణి కాలరీస్ గృహ వసతులను కల్పిస్తుంది. నామమాత్రపు రుసుముపై విద్యుత్తు సరఫరా చేస్తుంది. బడులు, ఆసుపత్రులు స్థాపిస్తుంది.

## భద్రత, ఆరోగ్య పరీక్ష

L2HWYJ

*గనుల భద్రతకు డైరెక్టర్ జనరల్ స్థాయిలో ఒక అధికారి ఉంటాడు. భద్రతా అంశాలు, కార్మికులకు జరిపే వైద్య పరీక్షలను అతడు పర్యవేక్షిస్తుంటాడు. గనుల లోపల పనిచేసే కార్మికులు ప్రమాదాల ముప్పును ఎదుర్కోవటమే కాకుండా నిరంతరం బొగ్గు ధూళిని పీలుస్తుంటారు. దీని వల్ల భయంకరమైన 'ఊపిరితిత్తులు నల్లబారడం' (Black Lungs) అనే ఒక రకమైన క్షయ జబ్బు వచ్చే అవకాశం ఉంది. గని కార్మికుల వైద్య పరీక్షలు, చికిత్సకు సంబంధించి వివరణాత్మక మార్గదర్శకాలు ఉన్నాయి. 45 సంవత్సరాలలోపు ఉద్యోగస్తులకు ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి పూర్తి వైద్య పరీక్షలు చేస్తారు. 45 సంవత్సరాలు పైబడిన ఉద్యోగస్తులకు ఈ పరీక్షలు ప్రతి మూడు సంవత్సరాలకు చేస్తారు. నల్ల ఊపిరితిత్తుల రోగం వచ్చిన గని కార్మికులను సాధారణంగా గనులలో కాకుండా వేరే విభాగాలకు బదిలీ చేస్తారు.*

## గనుల పరిశ్రమ, గనులు తవ్వే వాళ్లల్లో కొత్త ధోరణులు

ఇటీవలి కాలంలో, ప్రత్యేకించి థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలనుంచి బొగ్గుకి బాగా గిరాకి పెరుగుతోంది. అయితే తక్కువ ఉత్పాదకత వల్ల మన గనులు ఈ గిరాకీకి తగినట్టుగా సరఫరా చేయలేకపోతున్నాయి. కాబట్టి ఓపెన్ కాస్ట్ గనుల తవ్వకానికి మారటం ద్వారా ఉత్పత్తి పెంచటానికి ఎస్‌సిసిఎల్ ప్రణాళికలు చేస్తోంది. ప్రస్తుతం ఇది 15 ఓపెన్ కాస్ట్ గనులను నిర్వహిస్తోంది, ప్రైవేటు గుత్తేదారుల ద్వారా పూర్తిగా స్వయంచాలిత యంత్రాలను ప్రవేశపెట్టింది. వీటి ద్వారా ఎక్కువ బొగ్గు ఉత్పత్తి అవుతుంది, కానీ తక్కువ మందికి ఉపాధి దొరుకుతుంది. ఓపెన్ కాస్ట్ తవ్వకం చేపట్టిన ప్రాంతాలలో బొగ్గు నిల్వలు 10-15 సంవత్సరాలలో అయిపోతాయి. ఆ తరవాత అక్కడ తవ్వడానికి ఏమీ ఉండదు.

***2009 జూన్ 29న ప్రచురితమైన ఈ వార్తను చదవండి.***

### సింగరేణి ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల వల్ల తలెత్తిన సమస్యలు

*మా ప్రతినిధి:*

వరంగల్, జూన్ 28: బొగ్గుకి ఉన్న గిరాకీని దృష్టిలో ఉంచుకుని ఓపెన్‌కాస్ట్ గని తవ్వకం చేపట్టాలని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, SCCL నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల 200 గ్రామాలు ప్రభావితం కావచ్చు, 20,000 మంది నిరాశ్రయులు కావచ్చు. ఈ గనుల వల్ల 3000 హెక్టార్ల అడవులు కూడా ప్రభావితం అవుతాయని అంచనా.

"భూగర్భ గనుల ద్వారా రోజుకి 1500 టన్నుల బొగ్గు తవ్వగలిగితే, ఓపెన్ కాస్ట్ ద్వారా రోజుకి పదివేల టన్నుల బొగ్గు తియ్యవచ్చు. దీనికి ఖర్చు కూడా చాలా తక్కువ అవుతుంది," SCCLలో ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ఇది ఇలా ఉండగా, ఓపెన్‌కాస్ట్ గనుల తవ్వకం వల్ల వేలాది కుటుంబాలు నిర్వాసితమవుతాయి, పదుల సంఖ్యలో గ్రామాలు దెబ్బతింటాయి, స్థానికుల జీవనోపాధులు దెబ్బ తింటాయి. కంపెనీ అధికారి ప్రకారం అడవులు నరికివేసినంత విస్తీర్ణంలో కొత్తగా అడవులను వృద్ధి చేస్తారు, దానికి అయ్యే ఖర్చును భరిస్తారు. ఒక హెక్టారుకు 4.38 నుంచి 10.43 లక్షల రూపాయలు ఇందుకు చెల్లిస్తారని ఆ అధికారి చెప్పాడు. ఈ గనుల వల్ల తవ్విన మట్టి, రాళ్లు గుట్టలుగా ఏర్పడి వాగులు, నదుల ప్రవాహానికి ఆటంకం కల్పిస్తున్నాయని, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, తాగునీటికి కూడా కొరత ఏర్పడుతోందని స్థానిక ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు.



*చిత్రం 6.9 : వై.యస్.ఆర్. కడప జిల్లా మంగంపేటలోని బైరైటీస్ గని వల్ల ఏర్పడిన మట్టి కొండలు*

- ఈ సమస్యను ఎలా పరిష్కరించవచ్చు? పర్యావరణం, భూములను నష్టపరుస్తూ జీవనోపాధులు నష్టపోయేలా చేస్తూ తక్కువ ఖర్చుతో బొగ్గు తవ్వకం చేపట్టటం సమంజసమైనదేనా?

## మంగంపేట బైరైటీస్ ఓపెన్ గనులు

మంగంపేట వై.యస్.ఆర్. కడప జిల్లాలో ఉంది. ప్రపంచంలోకెల్లా అత్యధిక బైరైట్ ఖనిజ నిల్వలు కడప జిల్లాలోనే ఉన్నాయి. ఇక్కడ బైరైటీస్ నిల్వలను 1960లో కనుగొన్నారు, 1967 నుంచి దీని తవ్వకం కొనసాగుతోంది. ఈ గ్రామంలో 1200 కుటుంబాలు ఉండేవి. వీరిని కొత్త ప్రాంతానికి తరలించి ఆంధ్రప్రదేశ్ ఖనిజ అభివృద్ధి కార్పొరేషన్ (ప్రభుత్వరంగ కంపెనీ- ఎన్ఎండిసి) వారికి పునరావాసం కల్పించింది. ఈ గనులు ఈ కంపెనీకి చెందుతాయి, వాటి తవ్వకాన్ని అది చేపడుతోంది. ఖనిజ అభివృద్ధి కార్పొరేషన్ ఈ గనుల ద్వారా అధిక మొత్తంలో లాభాలు సంపాదిస్తోంది కాబట్టి వీటిని తలమానికంగా భావిస్తోంది.

- 64వ పేజీలో ఇచ్చిన బాక్స్ ఆధారంగా బైరైటీస్ ఉపయోగాలు ఏమిటో తెలుసుకోండి. బైరైటీస్‌కు గిరాకీ ఎందుకు పెరుగుతోంది?

ఇక్కడ భూగర్భ గనుల ద్వారా కాకుండా గొయ్యి తవ్వి ఖనిజాన్ని తీస్తారు. చిత్రం 6.9 చూడండి.

తవ్వకుండా వదిలేసిన ఒక భాగం మీకు చిత్రంలో కనపడుతుంది. ఇది ఈ గనికి కీర్తిస్తంభం లాంటిది, దీని వల్ల ఎంత లోతువరకు తవ్వారో తెలుస్తుంది. పై పొరలలో దొరికే బైరైటీస్ నాణ్యత తక్కువగానూ, లోపలి పొరల్లో దొరికే దాని నాణ్యత ఎక్కువగాను ఉంటుంది. బైరైటీస్ రాయి పరిమాణాన్ని బట్టి దాని నాణ్యతను నిర్ణయిస్తారు. పై పొరలలో దొరికే బైరైటీస్ బూడిద రంగులో ఉంటుంది, లోపలి పొరలలో దొరికేది మీగడ తెలుపులో ఉంటుంది. ఈ ఖనిజ నిల్వలను గుర్తించిన తరవాత ప్రయోగశాలలో దీనిని పరీక్షించి నాణ్యత బాగా ఉన్నదిగా నిర్ధారించారు. ఇది చాలా పెద్ద మొత్తంలో దొరుకుతుందని సర్వేలలో తేలింది. గ్రామంలోని బైరైటీస్ తవ్వకానికి ప్రణాళిక తయారు చేసి అక్కడి ప్రజలకు పునరావాసం కల్పించారు.

L2YIND

గొయ్యిగా తవ్వే గనులలో అన్ని పనులు యంత్రాలతో చేస్తారు. పైన ఉన్న పనికిరాని మట్టిని బుల్‌డోజర్లు, పారలతో తొలగిస్తారు. పది మీటర్ల వెడల్పు ఉండే రోడ్డు పక్కన ఆరు మీటర్ల ఎత్తు గదులు గుర్తిస్తారు, ఈ గదులనుంచి ఖనిజాన్ని తీస్తారు. ఇలా అన్ని గదులను కలుపుతూ రోడ్డు కిందికల్లా వెళుతుంది. ఖనిజాన్ని, పనికిరాని రాళ్లను పక్కలనుంచి బ్లాస్టింగ్ ద్వారా తీస్తారు. పది టన్నుల టిప్పర్ ట్రక్కులలోకి ఖనిజాన్ని యంత్రాలతో ఎత్తి పోస్తారు. ఈ విధంగా మంగంపేటలో ఒక నెలలో ఒక లక్ష టన్నుల బెరైటీస్ ఖనిజాన్ని తవ్వి తీస్తారు.



*చిత్రం 6.10 : బెరైటీస్‌ను ట్రక్కుల్లో నింపటం*

- చిత్రం 6.10 లో ఏం జరుగుతోందో చెప్పండి. ఈ పనులలో ఎంత మందికి పని దొరుకుతుంది?

- ఈ చిత్రం ఎడమ పై మూలలో భూగర్భ జలాలు చేరిన మడుగును చూశారా? ఈ నీరు ఏమవుతుంది?

ప్రతి రోజూ 16,000 టన్నుల వ్యర్థ పదార్థాలు, 3000 టన్నుల బెరైటీస్ తవ్వి, రవాణా చేస్తారు. పర్యావరణానికి మరీ ఎక్కువ నష్టం కలగకుండా వ్యర్థ పదార్థాలను పారవెయ్యటం అనేది ఒక పెద్ద సమస్య.



*చిత్రం 6.11 : పేల్చడానికి రంధ్రాలు చేస్తున్న మహిళలు*



*చిత్రం 6.12 : బైరైటీస్‌ను పొడి చేసి బస్తాలలో నింపే యంత్రం*

6.9 చిత్రంలో ఉన్న చిన్న భవనం వెనక్కి తెల్లటి పెద్ద కొండ గమనించి ఉంటారు. గనిలోంచి తవ్విన వ్యర్థ పదార్థాల గుట్టపై పెరుగుతున్న వృక్షజాలాన్ని పోల్చండి. ఈ రకమైన పరిస్థితులను తట్టుకునే మొక్కలు, గడ్డి పెంచి వ్యర్థపదార్థాలు చెల్లాచెదురు కాకుండా చూడాలి.

గనులలో పనిచేస్తున్న మహిళలను చిత్రం 6.11 చూడండి. పేలుడు పదార్థాలతో పేల్చటానికి వాళ్లు రంధ్రాలు చేస్తున్నారు. డిటొనేటర్ తీగలను కూడా మీరు చూడవచ్చు. ఆడవాళ్లు చేతులకు ఏమైనా తొడుగులు, కాళ్లకు బూట్లు వేసుకుని ఉన్నారా? తలకు ఏం పెట్టుకున్నారు?

ఖనిజాన్ని ట్రక్కులలో పైకి చేరుస్తారు. అక్కడ దానిని మెత్తటి పొడిగా చేసి పెద్దపెద్ద సంచులలో నింపుతారు. తర్వాత దీనిని ట్రక్కులు, రైల్వే వాగన్ల ద్వారా రవాణా చేస్తారు. బైరైటీస్‌ను పొడి చేసి బస్తాలు నింపే యంత్రాన్ని చిత్రం 6.12లో చూడండి.

ఇది బైరైటీస్‌ను పొడి చేసి, సంచులలో నింపి కుట్టే కర్మాగారం. ఈ గనిలో 600 కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో 152 మంది ఆంధ్రప్రదేశ్ ఖనిజ అభివృద్ధి కార్పొరేషన్ కింద రెగ్యులర్ ఉద్యోగస్తులు. ప్రభుత్వ నియమాల ప్రకారం వీరికి జీతం, ఇతర ప్రయోజనాలు అందుతాయి. మిగిలిన వాళ్లందరూ కాంట్రాక్టు కార్మికులే, వీరికి కనీస కూలీ మాత్రమే దొరుకుతుంది.

- బొగ్గు గనుల తవ్వకాన్నీ, మంగంపేటలో గనుల తవ్వకాన్నీ పోల్చండి. పోలికలు, తేడాలు ఏమిటి?

విలువైన వనరుల తవ్వకం ఎలా జరుగుతుందో, దీని నుంచి ప్రజలకు ఎటువంటి ఉపాధి దొరుకుతోందో, గనుల త్వవకం వల్ల పర్యావరణానికి జరిగే నష్టాన్ని తగ్గించాల్సిన అవసరం ఏమిటో మీరు తెలుసుకున్నారు.

L36T17

## కీలక పదాలు

1. ఖనిజాలు 2. ఓపెన్ కాస్ట్ గనుల తవ్వకం 3. భూగర్భ గనుల తవ్వకం
4. పునరుద్ధరింపబడే వనరులు 5. అంతరించిపోయే వనరులు 6. బొగ్గు
7. బైరెటీస్

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. భూగర్భ గని సందర్శనని చూపించే ఫ్లో చార్ట్ తయారు చేయండి. $AS_1$
2. గనులలో పని చేస్తున్నప్పుడు ఉద్యోగులు ఎదుర్కొనే ప్రధాన ఆరోగ్య సమస్యలు, ముందు జాగ్రత్తలు, గని కార్మికుల రక్షణకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు అన్న శీర్షికతో పట్టిక తయారుచేయండి. $AS_3$
3. జానకి ప్రస్తుతం వ్యవసాయకూలీగా పని చేస్తోంది. ఆమెకు గని కార్మికురాలు కావాలని ఉంది. ఆమె పనిలో ఎటువంటి మార్పులు వస్తాయో, ఉపాధి రంగ చిత్రం, ఆరోగ్య సమస్యలు వంటివి ఆమెకు వివరించండి. $AS_1$
4. గనులలో యంత్రాలు, మానవ శ్రమ వినియోగించేటప్పుడు కార్మికుల అవసరంలో తేడాలను పేర్కొనండి. $AS_1$
5. దేశ ఆర్థిక పరిస్థితికి గనుల తవ్వకం దోహదం చేసిన దానిని ఈ అధ్యాయంలో ఎలా గుర్తించారు? $AS_1$
6. "ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజాలు" పటాన్ని చూసి మీ జిల్లాలో ఏ ఖనిజాలు ఉన్నాయో గుర్తించండి. $AS_5$
7. "ఖనిజాలు ఎవరికి చెందుతాయి" అనే పేరాను చదివి కింది ప్రశ్నకు సమాధానం రాయండి. $AS_2$
   "ఖనిజ వనరులు ఏ ఒక్కరికీ చెందినవి కావు. ఇవి అందరి సంపద." దీనిని ఏవిధంగా మీరు సమర్థిస్తారు?
8. ఈ కింది చిత్రాన్ని గమనించండి. ఇద్దరు వ్యక్తులు రెండు రకాలుగా వ్యాఖ్యానాలు చేస్తున్నారు. వాళ్లు గనుల తవ్వకంలో ఏ విషయంపై మాట్లాడుతున్నారు? $AS_1$




9. ఖనిజాలు దేశాభివృద్ధికి ఏ రకంగా తోడ్పడుతున్నాయి? $AS_6$
10. వివిధ ఖనిజాలు, వాటి ఉపయోగాలను తెలిపే పట్టికను తయారుచేయండి. $AS_3$


పాఠం 7

# ద్రవ్యం - బ్యాంకింగ్

## డబ్బు లేకుండా వ్యాపారం

మోహన్ రాగులు తీసుకుని శ్యామల వద్ద మామిడిపళ్లు కొందామని వచ్చాడు. శ్యామల రాగులను రెండు సమకుప్పలుగా చేసింది. ఒక కుప్పలోని రాగుల బరువుకు సమానంగా మోహన్‌కి కొన్ని మామిడిపళ్లు ఇచ్చింది. మోహన్ మామిడిపళ్లను ఇంటికి తీసికెళ్లాడు, రెండు కుప్పల రాగులను శ్యామల ఉంచేసుకుంది. మామిడి పండ్ల మారక విలువ మొత్తం రాగులకు రెట్టింపు. రెట్టింపు ధాన్యానికి మామిడిపళ్ల మార్పిడి జరిగింది. ఇతర రకాలుగా కూడా మార్పిడి జరగవచ్చు. ఉదాహరణకు 'ధాన్యంతో సమానంగా'.


శ్రీకాకుళం జిల్లాలో కొన్ని గ్రామాలలో పిల్లలు బియ్యమిచ్చి వెదురుతో చేసిన బొమ్మలు తీసుకుంటారు. ఈ రకంగా డబ్బులు లేకుండా ఒక వస్తువును ఇచ్చి మరొక వస్తువును తీసుకోవటాన్ని వస్తుమార్పిడి అంటారు.



కమ్మరివాళ్లు రైతులకు నాగలి కర్రులు, బండి చక్రాలు, కొడవళ్లు వంటివి తయారు చేసి ఇచ్చేవాళ్లు. అయితే ఈ పనులకు డబ్బు కాకుండా ప్రతి సంవత్సరం పంట వచ్చిన తరవాత కొంత ధాన్యం తీసుకునే వాళ్లు. ఒక బండికి లేదా ఒక నాగలి తయారీకి రైతు ఇంత చొప్పున ఇవ్వాలనే అంగీకారం ఉండేది. డబ్బు అడగకుండా రైతులకు కావలసిన పనులను కమ్మరి చేసే సాంప్రదాయం కొనసాగుతుందని ప్రజలకు తెలుసు.

- డబ్బులు లేకుండా జరిగే మార్పిడులు ఏమైనా మీకు తెలుసా?
- పాతబట్టలు, ప్లాస్టిక్ సామాను, దిన పత్రికలు, వెంట్రుకలు, ధాన్యం ఇచ్చి ఏమైనా వస్తువులు మీరు కొని ఉండవచ్చు. ఈ లావాదేవీలు ఎలా జరిగాయో చర్చించండి.

మరొక ఉదాహరణ తీసుకుందాం. రామయ్య దగ్గర బియ్యం ఉన్నాయి, అతడికి బంగాళదుంపలు కావాలి. రామయ్య బంగాళదుంపలు పండించే వీరయ్య దగ్గరకు వెళ్లాడు. వీరయ్యకు బియ్యం కావాలి, బంగాళదుంపలు ఇచ్చి బియ్యం తీసుకోటానికి అతడు సిద్ధంగా ఉన్నాడు. దాంతో ఇద్దరూ వస్తువులను మార్చుకున్నారు. వారిద్దరు తృప్తి చెందారు, దీనినే వస్తు మార్పిడి పద్ధతి అంటారు. ఈ రకమైన వస్తుమార్పిడిలో డబ్బు లేకుండానే వస్తువులను నేరుగా ఒకదానితో మరొకటి మార్చుకుంటారు.



L38EQ1

మరొక ఉదాహరణలో గోపాల్ దగ్గర మేక ఉంది, అతడికి బియ్యం కావాలి. గోపాల్, శీను దగ్గరకు వెళ్లాడు. అతడికి మేక కావాలి, కాని అతని దగ్గర బియ్యం కాక గోధుమలు ఉన్నాయి. బియ్యం పండించే రాముని గోపాల్ కలిశాడు. కానీ తన బియ్యానికి బదులుగా మేకని తీసుకోవాలని అతడికి లేదు, అతడికి గోధుమలు కావాలి.



- ఈ పట్టిక పూరించండి:

| | గోపాల్ | శీను | రాము |
|---|---|---|---|
| కొనాలని ఉంది | | | |
| అమ్మాలని ఉంది | | | |

- పై పట్టిక నుంచి మీరు ఏ నిర్ధారణకు వస్తారు?
- గోపాల్‌కు, శీనుకు మధ్య వస్తుమార్పిడికి ఎందుకు వీలుకాదో మీ సొంతమాటల్లో వివరించండి.
- డబ్బు వినియోగం దీనికి సహాయపడుతుందా?

ఖాళీలు పూరించండి.

గోపాల్ తన మేకను ............. ఇచ్చి ............. తీసుకుంటే అప్పుడు గోపాల్ ఈ డబ్బును ఉపయోగించి ............... నుంచి బియ్యం కొంటాడు. ఇప్పుడు ............. ఈ డబ్బుతో శీను నుంచి ............. కొంటాడు.

- గ్రామాలలో, పట్టణాలలో బట్టలు ఉతికేవాళ్లు, జుట్టు కత్తిరించేవాళ్లు, నీరటి (చెరువు నీటిని కావలి కాసేవారు) మొదలైన వారి పనికి తగిన వేతనం చెల్లిస్తారా? మీ తల్లిదండ్రులను అడిగి తెలుసుకోండి.

## డబ్బుతో మార్పిడి

డబ్బు వినియోగిస్తే సరుకుల మార్పిడిలో సమస్యలు ఉండవు. అప్పుడు ఏదైనా వస్తువులు అదనంగా ఉన్న వ్యక్తి వాటి అవసరం ఉండి, తనకు కావలసినవి ఉన్న వ్యక్తి కోసం వెతకాల్సిన పనిలేదు. డబ్బు మాధ్యమంగా పనిచేస్తుంది. ఈ మార్పిడికి డబ్బును వినియోగిస్తే ఆ డబ్బును మళ్లీ ఉపయోగించుకోవచ్చు. ఈ పరిస్థితిని పై ఉదాహరణల్లో చూశాం. డబ్బు అందరికీ ఆమోదయోగ్యం అయినప్పుడు ఇది సాధ్యమవుతుంది. అంటే ఏదైనా అమ్మేవాళ్లు తమ వస్తువులకు బదులుగా డబ్బు తీసుకుంటారు, ఏదైనా కొనాలనుకునే వాళ్లు అందుకు డబ్బు చెల్లిస్తే సరిపోతుంది. ఏ సరుకునైనా, సేవనైనా డబ్బు ఇచ్చి పొందవచ్చు. అంటే డబ్బును సరుకు, సేవలతో మార్చుకోవచ్చు. డబ్బుకి దానంతట దానికి ఎటువంటి ఉపయోగం ఉండకపోవచ్చు. మార్పిడిలో డబ్బు పోషించే పాత్రవల్ల అందరికీ డబ్బు కావాలి. డబ్బు రూపంలో అప్పు తీసుకుని, తిరిగి చెల్లించవచ్చు కూడా.

- గోపాల్, శీను, రాముల మధ్య లావాదేవీలో డబ్బు ఎలా ఉపయోగపడుతుంది? ఫ్లో చార్ట్ సహాయంతో వివరించండి.
- పైన వివరించిన విధంగా డబ్బు పాత్ర మార్పిడి మాధ్యమంగా పని చేయటం అంటే దానితో

మీరు ఏకీభవిస్తారా? కారణాలతో వివరించండి.

- తన మేకను గోపాల్ ఎంత బియ్యంతో మార్చుకోవాలి?
- వస్తు మార్పిడి వ్యవస్థలో మీ జుట్టు కత్తిరించిన వ్యక్తికి ఎలా చెల్లిస్తారు? చర్చించండి.

వస్తుమార్పిడికి మరొక సమస్య ఉంది.

గోపాల్ : ఈ మేకకు ఎన్ని బస్తాల బియ్యం ఇస్తావు?

సీతయ్య : రెండు బస్తాలు.

గోపాల్ : పక్క ఊరిలో దీనికి 4 బస్తాలు ఇస్తామన్నారు.

సీతయ్య : వేరే ఊరిలో ఒక బస్తాకే నాకు మేక దొరుకుతుంది.

గోపాల్ : ............................................

సీతయ్య : ............................................

గోపాల్‌కు తన మేకకి 6 బస్తాల బియ్యం కావాలి. ఏ రేటున వాటిని మార్చుకోవాలి? ఇంకో మాటలో చెప్పాలంటే బియ్యం లెక్కలో మేక విలువ ఎంత? వస్తు మార్పిడిలో ఒక వస్తువు విలువను మరొక వస్తు విలువతో నిర్ణయించాలి. అనేక సరుకులతో మార్పిడి చేయాల్సి ఉంటే, ఇది చాలా కష్టమవుతుంది. దీని వల్ల మార్పిడి, లేదా వ్యాపారం చాలా సంక్లిష్టం అవుతుంది. ఇది అంత వీలుగా ఉండదు. అందుకే ఇతర మార్పిడి విధానాలు ఏర్పడ్డాయి. వాటి గురించి తరవాత చదువుదాం. అయితే ఈనాటికీ, ప్రత్యేకించి పల్లెటూళ్లలో వస్తుమార్పిడిని ఇంకా ఉపయోగిస్తున్నారు.

- పైన ఇచ్చిన ఉదాహరణలో లావాదేవీలు పూర్తయ్యేలా సంభాషణను పూర్తిచేయండి.
- మీరు, సంతలలో వ్యాపారస్తులు డబ్బు వినియోగించకపోతే ఏమవుతుంది? ఒక పేరాలో వివరించండి.
- సరుకులు, సేవల విలువను డబ్బుతో అంచనా వేయవచ్చా? వివరించండి.

- హరి టమాటాలు, బెండకాయలు, ఆకుకూరలు వంటి కూరగాయలు పండిస్తాడు. మూడు నెలల తరవాత అతడు ఎరువులు కొనుక్కోవాలి. కూరగాయలు ఇచ్చి ఎరువులు తీసుకోటానికి అప్పటిదాకా వాటిని నిలవ ఉంచలేడు. డబ్బు ఉపయోగించకపోతే ఎరువులు సరఫరా చేసే వ్యక్తితో హరి ఎటువంటి ఒప్పందం చేసుకుంటాడు? మీ చుట్టుపక్కల గ్రామాల్లో ఇటువంటి ఏర్పాట్లు ఇంకా ఉన్నాయా? ఇటువంటి ఏర్పాట్లు చాలాసార్లు రైతులకు లాభసాటిగా ఉండకపోవచ్చు. చర్చించండి.

గోపాల్ దగ్గర మేక ఉంది, అతడు అగ్గిపెట్టె కొనుక్కోవాలి. ఇది న్యాయమైన మార్పిడి అవుతుందా? మేకను విభజించలేడు కాబట్టి దాంట్లో కొంత భాగమిచ్చి అగ్గిపెట్టె తీసుకోలేడు. కానీ డబ్బుతో మీరు చిన్న చిన్న వస్తువులు కూడా కొనగలుగుతారు. డబ్బును విభజించవచ్చు – రూపాయలు, పైసలు ఉన్నాయి. కూరగాయల వంటి సరుకులు పాడైపోతాయి కాబట్టి వాటిని వెంటనే మార్చుకోవాలని మీకు తెలుసు. సరుకులను డబ్బుకి అమ్మటం ద్వారా ఇటువంటి సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. డబ్బు చాలా కాలం ఉంటుంది. భవిష్యత్తులో వినియోగానికి డబ్బును దాచుకోవచ్చు. గొర్రెలు, మేకలు, బియ్యం వంటి సరుకులు నిల్వ చేయటానికి చాలా చోటు కావాలి. అంతేకాకుండా మీ వస్తువులను మార్చుకోటానికి వాటిని బజారుకి బండి లేదా లారీలో తీసుకెళ్లాలి. అయితే డబ్బుకి అంత చోటు అవసరం ఉండదు. సంచి లేదా పర్సులో దానిని ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చు. అది రవాణాకి అనువైనది.

### పరిణామ క్రమంలో డబ్బు

ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు వస్తుమార్పిడి విధానాన్ని అవలంబించారు, దాంట్లో ఇబ్బందులను కూడా ఎదుర్కొన్నారు. వ్యాపారం విస్తరించినప్పుడు అనేక సరుకులను కొని, అమ్మేవారు. వాటిని దూరప్రాంతాలకు రవాణా కూడా చేసేవారు.



*చిత్రం 7.1 : వివిధ కాలాల, రాజ్యాల నాటి నాణాలు*

ఇటువంటి పరిస్థితుల్లో అన్ని సమాజాలలో ఏదో ఒక రూపంలో డబ్బు చెలామణిలోకి వచ్చింది. ఉదాహరణకు చాలా పురాతన కాలంలో ధాన్యం, పశువులను సంపదగా ఉపయోగించేవారు. అయితే వీటి నిల్వ, రవాణాలు కష్టంగా ఉండేవి. వాటికి రోగాలు వంటివి సోకే అవకాశం ఉంది కాబట్టి వాటి మన్నిక కూడా సమస్యగా ఉండేది.

కాలక్రమంలో అరుదైన, ఆకర్షణీయమైన లోహాలను మార్పిడి మాధ్యమంగా ప్రజలు ఉపయోగించటం మొదలుపెట్టారు. రాగి, ఇత్తడి, వెండి, బంగారం వంటివి పాడవ్వకుండా చాలా కాలం ఉంటాయి, చిన్న భాగాలుగా చేయవచ్చు, తేలికగా రవాణా చేయవచ్చు. ఇది కొరత వస్తువు కాబట్టి అందరూ దీనిని ఆమోదిస్తారు. ప్రజలు తమ చేతిలో ఉన్న డబ్బు విలువైనదని, ఇతరులు కోరుకొనేది అనే నమ్మకంతో అమ్మడం, కొనడం చేసేవారు. ఈ డబ్బుకి విలువ ఉందని, ఇతరులు దానిని ఆమోదిస్తారని ప్రజలకు తెలుసు కాబట్టి తమ సరుకులను డబ్బుకి అమ్ముకునేవారు. ధాన్యం, పశువుల విలువ పడిపోయినట్టు డబ్బు విలువ పడిపోతుందని వాళ్లు భయపడాల్సిన అవసరం లేదు. అయితే వస్తు మార్పిడిలోని అన్ని సమస్యలు ఈ రకమైన డబ్బు వల్ల పరిష్కారం కాలేదు, కొత్త సమస్యలు కూడా వచ్చాయి. లోహాలతో మార్పిడి చేసేటప్పుడు ప్రతిసారీ దానిని తూకం వేయాల్సి వచ్చేది. తరవాత లోహాల నాణ్యత పట్ల వ్యాపారస్తులకు అనుమానం కలిగేది. మార్పిడిలో స్వచ్ఛమైన వెండి, బంగారం లభించక పోవచ్చు. కొంత కాలం తరవాత మార్పిడికి ఉపయోగించిన లోహ నాణ్యతలో నమ్మకం పెద్ద సమస్యగా మారింది.

L3FP2U

ఈ పరిస్థితులలో కొంతమంది రాజులు పైన పేర్కొన్న సమస్యలను కొన్నింటిని పరిష్కరిస్తూ వాళ్లకి అనుకూలమైన విధానాలను రూపొందించారు. ప్రామాణికమైన ఆకారం, బరువు, నాణ్యతలు కలిగిన నాణాలను రాజుగారి టంకశాలలో తయారు చేయటం మొదలయింది. ప్రతిసారీ వీటిని తూకం వేయాల్సిన పనిలేదు, నాణ్యతకు సంబంధించి భరోసా ఏర్పడింది, వాటిని తీసుకెళ్లటం తేలిక. రోమన్ల కాలంలో 'బీసెంట్' అనే బంగారు నాణెం ప్రామాణికంగా ఉండేది, మౌర్యుల కాలంలో 'పాణా' అనే వెండి నాణెం ప్రామాణికంగా ఉండేది. వ్యాపారస్తులు, ప్రజలు నాణాలను డబ్బు రూపంగా ఆమోదించసాగారు.

- డబ్బుగా లోహాలను ఎందుకు ఎంచుకున్నారు?
- నాణాలను ముద్రించటం మంచి ఆలోచనేనా?
- నాణాలను ముద్రించటం వల్ల పాలకులకు ఎటువంటి ప్రయోజనం ఉంటుంది? మూడు విభిన్న కారణాలను పేర్కొనండి.

## కాగితం డబ్బు, బ్యాంకుల ఆవిర్భావం

పెద్ద మొత్తంలో సరుకులు కొని, అమ్మేవాళ్లు ఈ లావాదేవీల కోసం పెద్ద మొత్తంలో వెండి, బంగారు నాణాలను జాగ్రత్తపరిచే ప్రదేశాల కోసం వెదకటం మొదలు పెట్టారు. వారు డబ్బుకు రక్షణ కల్పించే స్వర్ణకారుల దగ్గరకు వెళ్ళారు. స్వర్ణకారుడు తగిన రుసుము తీసుకొని వాటిని భద్రపరిచి వారు కోరినప్పుడు వాటిని అందుబాటులో ఉంచేవాడు. ఈ విధానం ప్రాచుర్యం పొందినది. స్వర్ణకారుల మీద, షరాఫ్ (అకౌంటెంట్) మీద నమ్మకం పెరిగింది. స్వర్ణకారులు రుణాలను కూడా ఇచ్చేవారు. వీరికి అనేక ప్రసిద్ధిచెందిన పట్టణాలలో శాఖలు ఉండేవి. ఈ

విధానం “కాగితపు డబ్బు” లేదా హుండీలనే కొత్త విధానానికి దారి తీసింది. ఉదాహరణకు సోము విజయవాడకు చెందిన యంత్ర పరికరాల వ్యాపారి. హైద్రాబాద్‌లోని చందు దగ్గర యంత్రాలను కొనడానికి వెళ్ళాలి. హైద్రాబాద్‌లో చెల్లించడానికి బంగారు నాణాలు తీసుకెళ్ళడం ప్రమాదం కాబట్టి తన పది బంగారు నాణాలను స్వర్ణకారుడి వద్ద ఉంచి అతని వద్ద నుండి తన పేరుతో ఒక రశీదును పొందాడు. నేను 10 బంగారు నాణాలను చెల్లిస్తానని ప్రమాణం చేస్తున్నాను అని ఆ రశీదు చెబుతుంది. ఇప్పుడు చందూ నుంచి సోము యంత్రాలు కొన్నాడు. స్వర్ణకారుడు ఇచ్చిన రశీదుని చందుకి ఇచ్చి వాళ్ల శాఖనుంచి పది నాణాలు తీసుకొమ్మని సోము చెప్పాడు. ఆ శాఖకు ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్లి 10 నాణాలు తీసుకోవచ్చని చందుకి తెలుసు. అయితే అతడు నాణాలు తీసుకోటానికి వెళ్లలేదు. ఇనుము, ఉక్కు అమ్మే సయ్యద్ దగ్గరకు వెళ్లి వాటిని కొనుక్కున్నాడు, అందుకు బదులుగా సోము ఇచ్చిన పది నాణాల రశీదు ఇచ్చాడు. ఆ స్వర్ణకారుడి నుంచి పది నాణాలు తీసుకొమ్మని సయ్యద్‌కి చెప్పాడు. ఆ స్వర్ణకారుడు అందరికీ తెలుసు కాబట్టి, రశీదు చూపించిన వాళ్లకి నాణాలు ఇస్తాడన్న నమ్మకం ఉంది కాబట్టి సయ్యద్ ఎటువంటి అభ్యంతరాలు పెట్టకుండా ఆ రశీదును తీసుకున్నాడు. సోము మొదటగా తీసుకున్న రశీదు ఆర్థిక వ్యవస్థలో ఒకరినుంచి మరొకరికి చెలామణి అవుతూ, చెల్లింపులకు మాధ్యమంగా అందరి అంగీకారం పొందింది. ఇటువంటి రశీదులపై ఉన్న నమ్మకం కారణంగా కొత్తరకం డబ్బుగా ఇది పని చేస్తుంది.

భారతదేశంలో తొలి బ్యాంకర్లు అయిన బెంగాల్‌కి చెందిన జగత్‌సేఠ్‌లు, పాట్నాకి చెందిన షా, సూరత్‌కి చెందిన అరుణ్‌జీనాథ్‌జీ, మద్రాసుకి చెందిన చెట్టియార్ మొదలైన వారు ఎంతో డబ్బును, పరపతిని అనుభవించారు. వారి రశీదులను, హుండీలనే కాగితపు డబ్బులను దేశమంతటా, విదేశాలలో కూడా అంగీకరించేవారు.

బ్యాంకులు ఆవిర్భవించటానికి మరొక భిన్న కథనాన్ని చూద్దాం. 1606లో యూరపులో ఆమ్‌స్టర్‌డాం ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉండేది. ఇక్కడ మార్పిడికి ప్రభుత్వం ఆమోదించిన 846 రకాల బంగారు, వెండి నాణాలు ఉండేవి. అయితే వ్యాపారస్తులు ఒకరినొకరు అనుమానిస్తూ ఉండే వాళ్లు – ఈ నాణాల బరువు, నాణ్యతల పట్ల ఎవరికీ నమ్మకం ఉండేది కాదు. ఆమ్‌స్టర్‌డాం వర్తకులందరూ సమావేశమై ఈ సమస్యకు ప్రత్యేక పరిష్కారాన్ని కనుగొన్నారు. ఆ నగర యాజమాన్యంలో ఉండే ఒక బ్యాంకును వాళ్లు స్థాపించారు. ఒక వర్తకుడు తన నాణాలను బ్యాంకుకు తీసుకెళ్లి ఇస్తే బ్యాంకు అతడు ఇచ్చిన నాణాల బరువు తూచి, నాణ్యతను పరిశీలించి ఒక రశీదు ఇచ్చి అతని పేరున ఒక ఖాతా తెరుస్తుంది. ఆ వ్యాపారి తనకు కావలసినప్పుడు స్వచ్ఛమైన బంగారం పొందవచ్చు, అవసరమైతే దీంట్లో కొంత మొత్తం ఇంకొక వ్యక్తికి బదిలీ చేయవచ్చు. ఇది వర్తకులకు సౌకర్యంగా మారింది.

### ప్లాస్టిక్ లేదా పాలిమర్ బ్యాంక్ నోట్లు

కాగితపు నోట్లకు కూడా కొన్ని లోపాలు ఉన్నాయి. అది మురికి అవుతుంది, చిరిగిపోతుంది. దాంతో నోట్లకు ప్లాస్టిక్‌ను ఉపయోగించాలన్న భావన ఏర్పడింది. ప్లాస్టిక్ లేదా పాలిమర్ నోట్లు పాడవ్వకుండా చాలా కాలం మన్నుతాయి. వీటిలో నకిలీ నోట్లను కూడా తేలికగా గుర్తించవచ్చు. ఇది నీటికి తడవదు, పర్యావరణానికి హాని చెయ్యదు (దీంతో తిరిగి నోట్లు తయారు చేయవచ్చు). లోహాల వాడకం నుండి కాగితపు డబ్బు వాడకం, కాగితపు డబ్బు నుండి ప్లాస్టిక్ డబ్బు వాడకంలోకి రావచ్చు. డబ్బుకు వాడే పదార్థాల వల్ల దాని విలువ ప్రభావితం అవుతుందని భావిస్తున్నారా?




*చిత్రం 7.2 : భారతదేశంలో డబ్బును ముద్రించి పంపిణీ చేసే బాధ్యత భారతీయ రిజర్వు బ్యాంక్‌ది*

బ్యాంకు నిజాయితీగా పని చేసేది, దానిని వ్యాపారస్తులందరూ నమ్మేవాళ్లు. నాణాలకు బదులు బ్యాంకు రశీదులను అడిగేవారు, లేదా తమ ఖాతాలో బదిలీ చేయమనేవాళ్లు. అడిగినప్పుడు బ్యాంకు తమకు స్వచ్ఛమైన బంగారం ఇస్తుందని వ్యాపారస్తులకు నమ్మకం ఉండేది. బ్యాంకులో జమచేసిన మొత్తం కొత్త రకం డబ్బుగా మారింది. ఈ బ్యాంకు వ్యాపారం పెరిగి అది రెండు శతాబ్దాలపాటు విజయవంతంగా పనిచేసింది.

- స్వర్ణకారులు ఇచ్చిన రశీదులు డబ్బుగా ఎందుకు పని చేస్తాయి?

- స్వర్ణకారులపై నమ్మకం విఫలమయ్యే సందర్భాలు ఏమిటి?
- ఆమ్‌స్టర్‌డాంలో వర్తకులు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నారు? వాటికి వాళ్లు ఏ పరిష్కారం కనుగొన్నారు?
- రెండు శతాబ్దాల తరవాత ఈ బ్యాంకు కుప్పకూలిపోయింది. దానికి కారణాలు ఏమై ఉంటాయి? చర్చించండి.
- ప్రస్తుత కాలంలో రూపాయల నోట్ల మీద ఉండే హామీని చదవండి. ఎవరు హామీ ఇస్తున్నారు? ఎవరికి? ఇది ఎందుకు ముఖ్యం? చర్చించండి.

# బ్యాంకింగ్

## ఆధునిక బ్యాంకులు

- మీరు ఎప్పుడైనా బ్యాంకు లోపలకు వెళ్లారా? మీకు తెలిసిన కొన్ని బ్యాంకుల పేర్లు చెప్పండి.
- మీరు బ్యాంకు లోపలికి వెళితే వివిధ కౌంటర్ల దగ్గర ఖాతాపుస్తకాలు/ కంప్యూటర్ల సహాయంతో ఖాతాదారులతో వ్యవహరించే ఉద్యోగస్తులు కనపడతారు. కొన్ని కౌంటర్ల దగ్గర ఖాతాదారులు డబ్బులు జమ చేయటం, కొన్నింటి దగ్గర డబ్బు తీసుకోవటం కూడా చూసి ఉంటారు. ఒక క్యాబిన్‌లో బ్యాంకు మేనేజరు కూర్చుని ఉంటారు. ఈ బ్యాంకు ఉద్యోగస్తులు ఏం చేస్తారు?

## వాణిజ్య బ్యాంకులు

వాణిజ్య లావాదేవీలను నిర్వహించేది బ్యాంకింగ్. దీంట్లో ప్రజల దగ్గరనుంచి డబ్బు జమ చేసు కుంటారు. ఈ డబ్బును ఒక వ్యక్తినుంచి మరొక వ్యక్తికి బదిలీ చేయవచ్చు. వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు, రైతులు, వ్యక్తులకు బ్యాంకులు అప్పులు కూడా ఇస్తాయి. ఇటువంటి బ్యాంకులను వాణిజ్య బ్యాంకులు అంటారు. ఈ రెండు రకాల అంశాలను పరిశీలిద్దాం.

## డబ్బు జమ

ప్రజలు బ్యాంకులలో దాచుకునే డబ్బును జమ అంటారు. బ్యాంకులో డబ్బు జమ చేయటంలో అనేక విధానాలు ఉన్నాయి. వీటిల్లో కొన్నింటి గురించి ఇక్కడ తెలుసుకుందాం.

## పొదుపు ఖాతాలు, జమలు:

గీత తన జీతంలోంచి 5,000 రూపాయలు పొదుపు చేసింది, ఆ మొత్తాన్ని భద్రంగా దాచాలని అనుకుంది. ఆమె తన ఇంటికి దగ్గరగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు శాఖకు వెళ్లి అక్కడ ఒక పొదుపు ఖాతా తెరిచింది. ఆ డబ్బుపై ఆమెకు కొంత వడ్డీ వస్తుంది. డబ్బు క్షేమంగా ఉంటుంది. అన్నింటికన్నా ముఖ్యమైనది ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆమె తన డబ్బు తీసుకోవచ్చు. అడిగినప్పుడు డబ్బు చెల్లిస్తానన్న హామీ బ్యాంకు ఇస్తుంది.

**తెలుసుకోండి**


- గీత ఎ.టి.ఎం.కి వెళ్లి డబ్బు ఎలా తీసు కోవచ్చు?
- ఆమె తన ఖాతా ఉన్న బ్యాంకుకు వెళితే ఏమి చేస్తుంది?

## బ్యాంకులోనే డబ్బును ఎందుకు పొదుపు చేయాలి?

- ద్రవ్యంను ఇంటిలో దాచుకున్నట్లయితే ఎలాంటి వడ్డీ లభించదు. అదే బ్యాంకు ఖాతాలో దాచుకున్నట్లయితే మన డబ్బుకు వడ్డీ లభించి ద్రవ్యంలో పెరుగుదల కనిపిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజల ఆదాయాలు క్రమంగా ఉండకపోవడమేగాక, వీరి ఆదాయాలను సరిగ్గా అంచనా కూడా వేయలేం. అదేవిధంగా, పంటలు సరిగ్గా పండని కాలంలో, ఉపాధి దొరకని సమయంలో, కుటుంబంలో అనుకోని మరణాలు సంభవించినప్పుడు, పెళ్లిళ్లకోసం, పండుగల సమయాల్లో ప్రజలు డబ్బు కోసం ఇబ్బందులకు గురి అవుతారు. ఇలాంటి పరిస్థితులలో బ్యాంక్ ఖాతాలో ముందుచూపుగా దాచుకున్న డబ్బు వారి అవసరాలకు పనికి వస్తుంది. అంతేకాకుండా బ్యాంకులో డబ్బుకు రక్షణ ఉంటుంది.

### ప్రాథమిక పొదుపు ఖాతా (BSBDA):

కనీస నిల్వ అసలు లేకుండా ('జీరో' బ్యాలెన్స్), లేదా అతి తక్కువ ఉండవచ్చు. వ్యక్తులకు, ఖాతాతెవరడానికి, వయస్సు, ఆదాయం, జమ చేయవలసిన కనీస మొత్తం వంటి షరతులు లేవు. నెలకి నాలుగుసార్లు (ATM నుండి తీసుకొన్న వాటితో కలిపి) నగదు తీసుకోవడం అనుమతించబడుతుంది. నగతు తీసుకొనుట/డిపాజిట్ చేయుట; ఎలక్ట్రానిక్ చెల్లింపు మార్గాలు/చెక్(cheque)ల ద్వారా వచ్చిన సొమ్ము జమ చేయబడుట వంటి సేవలు పొందవచ్చు.




చిత్రం 7.3 : బ్యాంక్‌లో జమలు, చెల్లింపులు జరిగే ప్రదేశం

**చిన్న ఖాతా (Small Account)** : ఒకవేళ, ప్రాథమిక పొదుపు ఖాతా, సులభంచేసిన "KYC" షరతులతో గనుక తెరిచినట్లయితే, ఇది చిన్న ఖాతావలె కూడా పరిగణించబడుతుంది. చిన్న ఖాతాలకు ఈ క్రింది సూచించిన షరతులు వర్తిస్తాయి. ఈ ఖాతాల్లో మొత్తం జమ, ఒక సంవత్సరంలో, లక్ష రూపాయిల కన్నా ఎక్కువ ఉండకూడదు. ఏ సమయంలో కూడా, కనీస నిల్వ ఏభైవేల రూపాయిలు మించి ఉండరాదు. నగదు రూపంలో గాని, ఇతర బదిలీల రూపంలో గాని తీసుకొన్న మొత్తం, ఒక నెలలో, పదివేల రూపాయిలు మించి ఉండకూడదు. చిన్న ఖాతాలు మొదట 12 నెలల వరకు అమలులో ఉంటాయి. ఆ తరువాత ఖాతాదారు అధికారికంగా సమ్మతించిన పత్రాల కోసం దరఖాస్తు చేసినట్లు రుజువు సమర్పిస్తే, దీన్ని మరో 12 నెలలు పొడిగించవచ్చు.

### చెక్కులు

ప్రస్తుతం డబ్బులు చెల్లించటానికి, తీసుకోటానికి చెక్కులను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఎవరికైనా డబ్బులు ఇవ్వాలంటే ఆ వ్యక్తి పేరుతో చెక్కు ఇస్తారు. వేరే ఊళ్లో ఉన్న వ్యక్తికి డబ్బు పంపించాలంటే ఆవ్యక్తి



చిత్రం 7.4 : మాదిరి చెక్కు

పేరుమీద చెక్కు రాసి దానిని పోస్టులో పంపించవచ్చు. బ్యాంకు ద్వారా మరొకరి ఖాతాలోకి డబ్బుని బదిలీ చేయటానికి కూడా చెక్కును ఉపయోగించవచ్చు. వ్యాపారాలలో డబ్బులు తీసుకోవటం, చెల్లించటానికి సంబంధించి అనేక లావాదేవీలు ఉంటాయి, ఈ లావాదేవీలలో మాధ్యమంగా చెక్కులు ముఖ్యపాత్ర పోషిస్తాయి.

చెక్కు ఎలా రాయాలో ఉదాహరణ (పేజి 83) చూడండి.

ఆంధ్రాబ్యాంక్‌లో సురేష్ ఒక ఖాతాదారుడు. అతడు కంచర్ల సుజాతకు రూ. 1,75,000 లు చెల్లించాలి. అతడు కంచర్ల సుజాత పేరు మీద క్రాస్ చెక్కు ఇస్తాడు.

- మీ నోట్ పుస్తకంలో బ్యాంక్ చెక్కు చిత్రాన్ని గీసి మీ పక్కన కూర్చున్న స్నేహితుని పేరు మీద 1,50,000 రూపాయలకు ఒక చెక్కు రాయండి.
- క్రాస్ చేసిన చెక్కు ఇవ్వటం ఎందుకు మంచిది? చర్చించండి.
- కంచర్ల సుజాత ఖాతాకు సురేష్ 1,75,000 రూపాయలను ఎలక్ట్రానిక్ పద్ధతిలో డిపాజిట్ చేయాలి. అది ఎలా జరుగుతుంది? అందుకు అతనికి ఏ సమాచారం అవసరం బ్యాంక్‌ను సందర్శించి వివరాలు రాయండి.
- చెక్కు ఉపయోగించకుండా ఎలక్ట్రానిక్ పద్ధతిలో బ్యాంకు ద్వారా నేరుగా ఏఏ చెల్లింపులు చేస్తారో చర్చించి, వాటి జాబితా తయారు చేయండి.

## కరెంటు ఖాతా జమలు

చాలామంది వ్యాపారవేత్తలు, దుకాణదారులు, కంపెనీలకు రోజువారీ ఆదాయం, ఖర్చులు పెద్ద మొత్తంలో ఉంటాయి. సరుకులు కొనటం, వేతనాలు చెల్లించటం వంటి వాటి కోసం అనేకమార్లు బ్యాంకు నుంచి డబ్బు తీసుకోవలసి ఉంటుంది. అదేవిధంగా పెద్ద పెద్ద వ్యాపార సంస్థలకు తమ సరుకులు, సేవలు కొనుగోలు చేసేవాళ్లనుంచి రోజూ డబ్బులొస్తాయి, తమకు వివిధ వస్తువులు సరఫరా చేసిన వాళ్లకు, పనులు చేసిన వాళ్లకు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఈ రకమైన డబ్బు అవసరాలకు బ్యాంకులు కరెంటు ఖాతా అనే ప్రత్యేక ఖాతాలను కలిగి ఉంటాయి. కరెంటు ఖాతా నుంచి ఎన్నిసార్లయినా డబ్బులు తీసుకోవచ్చు, జమ చేయవచ్చు, వీటిపై పరిమితి ఏదీ లేదు. చెక్కు ద్వారా లావాదేవీలు చేపట్టవచ్చు. కాబట్టి పెద్ద మొత్తంలో నగదుతో వ్యవహరించాల్సిన ప్రమాదం ఉండదు. అయితే కరెంటు ఖాతాలో ఉన్న మొత్తంపై బ్యాంకు ఎటువంటి వడ్డీ చెల్లించదు, అదనంగా సేవా రుసుము వసూలు చేస్తుంది.

- పొదుపు, కరెంటు ఖాతాల మధ్య తేడాలేమిటి?

## బ్యాంకు వ్యవస్థ ఎలా పని చేస్తుంది?

ఒక బ్యాంకు ఖాతాలో జమచేసిన చెక్కు ద్వారా ఇంకొక ఖాతాలోకి డబ్బు బదిలీ చేయవచ్చు. బ్యాంకింగ్ వ్యవస్థ నిర్వహించే ఈ విధానం వల్ల బ్యాంకులో చేసిన జమ డబ్బులాగా పనిచేస్తుంది. అంటే బ్యాంకు జమలు డబ్బుతో సమానం.

అనేక పట్టణాలు, నగరాల్లో అన్ని బ్యాంకుల ప్రతినిధులు ప్రతిరోజూ సమావేశమై ఆ రోజు ప్రతి బ్యాంకుకీ ఇతర బ్యాంకుల నుంచి రావలసిన మొత్తాలను, అలాగే ఇతర బ్యాంకులకు చెల్లించాల్సిన మొత్తాలను నిర్ధారించుకుంటారు. సరిచూసిన చెక్కులు ఒకరికొకరు మార్చుకుంటారు. ఒక బ్యాంకు 'క్లియరింగ్ బ్యాంకు'గా పని చేస్తుంది, ఆ బ్యాంకులో మిగిలిన బ్యాంకులన్నింటికీ ఖాతాలు ఉంటాయి. బ్యాంకుల మధ్య వసూళ్లు, చెల్లింపులను ఈ క్లియరింగ్ బ్యాంకు నిర్వహిస్తుంది.

కొత్త విధానంలో అన్ని బ్యాంకులు, వాటి అన్ని శాఖలూ కంప్యూటర్ల ద్వారా అనుసంధానమై ఉన్నాయి. అన్ని బ్యాంకు ఖాతాలను, వారి సంతకాలను ఎక్కడ ఉన్న శాఖలోనైనా సరిచూసుకోవచ్చు. కాబట్టి బ్యాంకు ప్రతినిధులు కలవాల్సిన పనిలేదు, అదే విధంగా వేరే ఊళ్లో ఉన్న శాఖలకు బ్యాంకులు చెక్కులు పంపించాల్సిన అవసరం లేదు. ఒక బ్యాంకు మరొక బ్యాంకు మధ్య లావాదేవీలను అనుసంధానం చేయబడిన కంప్యూటర్ల ద్వారా నిర్వహిస్తారు. దీని వల్ల పనులు చాలా తేలికగానే కాకుండా చాలా తొందరగా కూడా పూర్తవుతాయి.

## ఇంటర్నెట్ బ్యాంకింగ్

ప్రస్తుతం కంప్యూటర్లు, ఇంటర్నెట్‌లను అంతటా వాడుతున్నారు. అనేక బ్యాంకులలో ఉద్యోగులు, యంత్రాలు నిర్వహించే టెల్లర్ కౌంటర్ల స్థానాన్ని **'ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్లు'** (ATM) తీసుకుంటున్నాయి. బ్యాంకింగ్ కార్యకలాపాలను ఇంటర్నెట్ ఉన్న కంప్యూటర్లతోనూ, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలతోనూ నిర్వహిస్తున్నారు. దీనినే ఎలక్ట్రానిక్ లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్ అంటున్నారు. అనేక బ్యాంకులు డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్, ఫోన్ బ్యాంకింగ్ వంటి వాటి ద్వారా తమ ఖాతాదారులకు ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నాయి.

ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా ఒక వ్యక్తి తన బ్యాంకు ఖాతానుంచి మరొక వ్యక్తికి చెందిన మరొక బ్యాంకు ఖాతాకు డబ్బులు బదిలీ చేయవచ్చు, వస్తువులు కొనవచ్చు, అమ్మవచ్చు, పెట్టుబడులు పెట్టవచ్చు, అప్పులు తిరిగి చెల్లించవచ్చు, కరెంటు, ఫోను వంటి ఇతర బిల్లులు చెల్లించవచ్చు.

ఇంటర్నెట్ బ్యాంకింగ్ వల్ల ఖాతాదారునికి తన బ్యాంకుకు వెళ్లవలసిన పని, కాగితాలు నింపవలసిన పని వంటి ఇబ్బందులు తప్పుతాయి. ఒక క్లిక్ ద్వారా ఎవరైనా వారి డబ్బును బదిలీ చేయడం, బిల్లులు చెల్లించడం లాంటివి సులభంగా చేయవచ్చు. పని ఎక్కువగా ఉన్నవారు ఇంటర్‌నెట్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యత ఇస్తారు. రఘుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సికింద్రాబాద్ శాఖలో ఖాతా ఉంది. అతను ఆన్‌లైన్ బ్యాంకింగ్‌కై పేరు నమోదు చేసుకున్నాడు. రఘు తన ఫోన్ బిల్లు చెల్లించటానికి ఎస్‌బిఐ వెబ్‌సైట్‌లోకి తన యూజర్ పేరు, పాస్‌వర్డ్ ఉపయోగించి ప్రవేశిస్తాడు. అందులో ఆన్‌లైన్ ద్వారా ఫోన్ బిల్లు చెల్లింపు అన్న దానిని ఎంచుకుంటాడు, తన ఫోను నంబరు, చెల్లించాల్సిన మొత్తాన్ని టైప్ చేస్తాడు. ఆ మొత్తం అతని ఎస్‌బిఐ ఖాతాలో తగ్గించబడి, ఇన్‌వాయిస్ తయారవుతుంది. ఆన్‌లైన్



చిత్రం 7.5 : ATM నుండి డబ్బు తీసుకుంటున్న వ్యక్తి

L3PK4H

సేవల ద్వారా బిల్లులు చెల్లించటం వల్ల సమయం, శ్రమ ఆదా అవుతాయి, అంతేకాకుండా సకాలంలో బిల్లులు చెల్లించ వచ్చు.

## మైనర్ల కోసం బ్యాంకు ఖాతాలు

- ఏ వయస్సులో ఉన్న మైనరయినా, అతడు/ఆమె యొక్క, సహజ సంరక్షకుని లేదా చట్టం ద్వారా నియమింపబడిన సంరక్షకుని ద్వారా, పొదుపు/ఫిక్స్‌డ్/రికరింగ్ బ్యాంక్ డిపాజిట్ ఖాతా తెరువవచ్చు.
- బ్యాంకులో అమలులో ఉన్న, నష్టనివారణ వ్యవస్థని బట్టి (risk management systems), పది ఏళ్ళు దాటిన మైనర్లు, స్వంతంగా పొదుపు ఖాతాలు తెరిచి, లావాదేవీలు జరపడానికి అనుమతించవచ్చు.
- ఇంటర్నెట్ బ్యాంకింగ్, ATM/డెబిట్ కార్డ్, చెక్‌బుక్ మొదలైన అదనపు బ్యాంకింగ్ సదుపాయాలు అనుమతించవచ్చు. కానీ, ఈ మైనర్ల ఖాతాల నుండి, నిల్వకు మించి సొమ్ము తీసుకోనియరాదు. ఖాతా ఎల్లప్పుడూ 'జమ' లోనే ఉండాలి.

- వరస ఎలో ఉన్న వాటిని వరస బిలోని వాటితో జతపరచండి

| వరస ఎ | | వరస బి |
|---|---|---|
| (అ) మనం నగదు తీసుకువెళ్లాల్సిన అవసరం లేకుండా మన ఖాతాలోంచి చెల్లింపులు చేయటానికి వీలు కల్పించే బ్యాంకింగ్ సౌకర్యం | ( ) | (i) ఎ.టి.ఎం. |
| (ఆ) రోజులో 24 గంటలలో ఎప్పుడైనా డబ్బులు జమ చేయటానికి, తీసుకోటానికి వీలు కల్పించే బ్యాంకింగ్ సౌకర్యం | ( ) | (ii) ఫోన్ బ్యాంకింగ్ |
| (ఇ) ఇంటర్నెట్ ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించటానికి సహాయం చేసే సౌకర్యం | ( ) | (iii) క్రెడిట్ కార్డ్ |
| (ఈ) ఈ సౌకర్యం ఉపయోగించి మొబైల్ ఫోను ద్వారా మన ఖాతాలో ఎంత సొమ్ము ఉందో తెలుసుకోవచ్చు | ( ) | (iv) డెబిట్ కార్డ్ |
| (ఉ) ఈ సౌకర్యం ఉపయోగించి రకరకాల చెల్లింపులు చేయవచ్చు | ( ) | (v) నెట్ బ్యాంకింగ్ |


## ఫిక్స్‌డ్ డిపాజిట్లు

L3R6TB

మనస్విని వాళ్ల తాతయ్య ఆమెకు ఒక బహుమతి ఇవ్వాలని అనుకున్నాడు. అతడు ఆమెకు పదివేల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రం ఇచ్చాడు. "అయిదు సంవత్సరాలు పూర్తయ్యేటప్పటికి నీ కళాశాల విద్యకు సరిపోయేటంతగా ఈ మొత్తం పెరుగుతుంది," అని తాతయ్య చెప్పాడు. ఆ డబ్బు ఎలా పెరుగుతుంది?

ఫిక్స్‌డ్ డిపాజిట్ లేదా టర్మ్ డిపాజిట్ అన్న దానిని అది వేసిన కాలంలోపు డబ్బు తీసుకోటానికి లేదు, అది ఒక సంవత్సరం, రెండు సంవత్సరాలు, అయిదు లేదా ఏడు సంవత్సరాలు కావచ్చు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై ఎక్కువ వడ్డీ లభిస్తుంది.

- పొదుపు కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను ఎప్పుడు ఎంచుకోవాలి?
- వడ్డీ 8 శాతం అయితే, 5 సంవత్సరాల తరవాత మనస్వినికి ఎంత డబ్బు వస్తుంది?
- వైద్య ఖర్చుల కోసం ఆమెకు అత్యవసరంగా డబ్బులు అవసరమయ్యాయని అనుకుందాం. బ్యాంకులో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్ నుంచి ఆ మొత్తాన్ని ఆమె తీసుకోవచ్చా? ఏమవుతుంది?




చిత్రం 7.7 : బ్యాంక్ పనిచేసే విధానం

### అప్పులు

బ్యాంకు అనేది ఒక వాణిజ్య సంస్థ. డబ్బులు జమ చేసిన వారికి అది వడ్డీ ఇవ్వాలి, ఉద్యోగస్తులకు జీతాలు ఇవ్వాలి, పరికరాలు కొని, నిర్వహించాలి, అద్దెలు చెల్లించాలి, బ్యాంకు నడపటానికి అయ్యే ఇతర ఖర్చులు భరించాలి. అంతిమంగా లాభాలు సంపాదించాలి. మరి దానికి ఆదాయం ఎలా వస్తుంది?

ప్రజలు పొదుపు చేసిన డబ్బు జమల రూపంలో బ్యాంకులోకి వస్తుంది. అడిగినప్పుడు తమ డబ్బు తమకు లభిస్తుందన్న నమ్మకం ఉన్నంతవరకు డబ్బు జమ చేసినవాళ్లు దానిని తిరిగి తీసేసుకోవాలని అనుకోరు. చాలా మంది నెల మొదట్లో డబ్బు తీసుకుంటారు. డబ్బులు జమ చేసింది రైతులు అయితే వాళ్లకు కొన్ని ప్రత్యేక సమయాల్లో (వానా కాలంలో) డబ్బులు అవసరమవుతాయి. తమ వద్ద జమ అయిన డబ్బులో కొంత మొత్తమే నగదుగా పెట్టుకుంటే అడిగిన వాళ్లందరికీ డబ్బులు ఇవ్వవచ్చని అనుభవం మీద బ్యాంకులు గ్రహించాయి. కావలసినప్పుడు డబ్బులు తీసుకోగలిగి, తమ ఖాతాలోని డబ్బుని చెల్లింపులకు ఉపయోగించుకోగలిగినంత కాలం బ్యాంకులపై ప్రజల నమ్మకం కొనసాగుతుంటుంది.

ఇంకొక వైపున బ్యాంకులు ప్రజలకు అప్పులు ఇస్తాయి. ఈ అప్పులను వాళ్లు వడ్డీతో తిరిగి ఇస్తారు. బ్యాంకులు ప్రభుత్వానికి కూడా అప్పులిచ్చి కొంత వడ్డీ పొందుతాయి. బ్యాంకులు ఇచ్చిన అప్పుపై వచ్చే వడ్డీ వాటి ఆదాయమవుతుంది.

- బ్యాంకు నుంచి అప్పు తీసుకునే వాళ్లందరి నుంచి ఒకే రకమైన వడ్డీ వసూలు చేస్తారా?
- అప్పు తీసుకున్నవాళ్లు ఎవరైనా తిరిగి బ్యాంకుకు చెల్లించకపోతే ఏమవుతుంది?

### అప్పుల రకాలు

వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు (విద్యా ఋణాలు), రైతులు, చేతివృత్తుదారులు వంటి అనేకమందికి బ్యాంకులు అప్పులిస్తాయి. వీటిల్లో కొన్నింటిని చూద్దాం.

*రహీం చిన్న రైతు. అతడికున్న 4 ఎకరాల భూమిలో వరి పండిస్తాడు. నారుమడి సమయంలో విత్తనాలకు, ఎరువులకు అతడికి డబ్బు అవసరం అయ్యింది. అతడు 10,000 రూపాయల అప్పు చేశాడు. అతడు తన పంటను తాకట్టు పెట్టాడు (హామీగా చూపించాడు). పంట అమ్మిన తరవాత సంవత్సరంలోపే రహీం తన అప్పు తీర్చేస్తాడు.*

*లీల ఒక ఫ్లాటు కొనుక్కోవాలని అనుకుంది. ఆ ఫ్లాటు తాకట్టు పెట్టి బ్యాంకునుండి 8 లక్షల రూపాయల గృహ రుణం తీసుకుంది. నెలనెలా ఆమె జీతం నుంచి కొంత మొత్తాన్ని వాయిదా కింద బ్యాంకుకి జమ చేస్తుంది. బ్యాంకు అప్పు మొత్తం తీర్చిన తరవాతనే ఫ్లాటుకి సంబంధించిన పత్రాలు ఆమె చేతికి అందుతాయి.*

*శాంత స్వయం సహాయక సంఘం (SHG)లో సభ్యురాలు. ఆమె ఇంటి మరమ్మతు కోసం బ్యాంకునుంచి అప్పు తీసుకుంది. ఆమె హామీ కింద ఎటువంటి ఆస్తులు చూపించాల్సిన అవసరం లేదు. తమ సభ్యులు అప్పులు తిరిగి చెల్లించేలా చూసే బాధ్యత సంఘం తీసుకుంటుంది.*

L3YG65



*చిత్రం 7.8 : S.H.G. సభ్యుల సమావేశం*

రకరకాల వ్యక్తులు, రకరకాల అవసరాల కోసం బ్యాంకు నియమ, నిబంధనలకు లోబడి అప్పులు తీసుకోవచ్చు. వడ్డీ శాతం, హామీ, ఇవ్వాల్సిన పత్రాలు, తిరిగి చెల్లించే విధానం వంటివన్నీ ఈ రుణ షరతులలో భాగంగా ఉంటాయి.

- బ్యాంకులు అప్పు ఇచ్చేటప్పుడు హామీ ఎందుకు తీసుకుంటాయి?
- అప్పు తీసుకోటానికి బ్యాంకులు మంచివా, వడ్డీ వ్యాపారస్తులా? ఎందుకు?
- వ్యక్తిగతంగా తీసుకునే అప్పుకు, స్వయం సహాయక సంఘంగా తీసుకునే అప్పుకు తేడా ఏమిటి?

**మీ ప్రాంతంలో ఉన్న వాణిజ్య బ్యాంకును సందర్శించి ఈ పట్టికను నింపండి.**

| క్రమ సంఖ్య | అప్పు రకం | అప్పు మొత్తం | తిరిగి చెల్లించే కాలం | కావలసిన పత్రాలు | వడ్డీ శాతం | తిరిగి చెల్లించే విధానం | హామీ, అవసరమైతే విధానం |
|---|---|---|---|---|---|---|---|
| 1 | వాహన రుణం | | | | | | |
| 2 | | | | | | | |
| 3 | | | | | | | |

## కీలక పదాలు

1. వస్తుమార్పిడి
2. డబ్బు రూపాలు
3. జమలు
4. పొదుపు
5. అప్పు/ రుణం
6. వడ్డీ
7. చెక్కు

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. కొన్ని లావాదేవీల ఉదాహరణలతో కింది పట్టిక నింపండి. $AS_1$

| రూపాయినోట్లు, నాణాలతో జరిగే లావాదేవీలు | రూపాయలు, నాణాలు లేకుండా జరిగే లావాదేవీలు |
|---|---|
| | |
| | |
| | |

2. బ్యాంకులో డబ్బు పెట్టడం వల్ల ఏమైనా నష్టాలు, సమస్యలు ఉంటాయా? ఆలోచించి రాయండి. $AS_1$
3. డబ్బు మార్పిడిని చెక్కులు ఏవిధంగా సులభతరం చేశాయి? $AS_1$
4. బ్యాంకు తన దగ్గర కొంత డబ్బును మాత్రమే నగదుగా ఉంచుకుంటుంది. ఇలా ఎందుకు జరుగుతుంది? దీని వల్ల బ్యాంకుకు లాభం ఏమిటి? $AS_1$
5. ఖాతాదారులలో చాలామంది బ్యాంకులో డబ్బు ఉంచాలని అనుకోకపోతే అది బ్యాంకు పనితీరును ఏరకంగా ప్రభావితం చేస్తుంది? $AS_1$

6. అప్పులలో చాలా వాటిని మాఫీ చేస్తే (అంటే అప్పు తీసుకున్న వాళ్లు తిరిగి డబ్బు కట్టాల్సిన అవసరం లేదు) అది బ్యాంకు పని తీరును ఏ రకంగా ప్రభావితం చేస్తుంది? $AS_1$

7. ఒక కాలానికి చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్టుపై ప్రజలకు లభించే వడ్డీ కంటే అదే కాలానికి తీసుకున్న అప్పుపై ఎక్కువ వడ్డీ చెల్లించాలి. ఇలా ఎందుకు ఉండాలి? $AS_1$

8. ఈ సంవత్సరం వర్షాలు ఆశించినంతగా కురవలేదు. ఇలా జరిగినప్పుడు రైతులు తీసుకున్న అప్పులో సగమే తిరిగి చెల్లించాలని కొంతమంది అంటారు. వచ్చే సంవత్సరం పంటను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న అప్పు మొత్తం తిరిగి చెల్లించాలని కొంతమంది అంటారు. మీ అభిప్రాయం ప్రకారం బ్యాంకులు ఏం చేయాలి? మీ కారణాలు పేర్కొనండి. $AS_4$

9. "అప్పులు రకాలు" శీర్షిక కింద ఉన్న పేరాను చదివి దిగువ ప్రశ్నకు సమాధానం ఇవ్వండి. మీ ప్రాంతంలో తీసుకున్న రుణాల రకాలను పేర్కొనండి. $AS_2$

10. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొందిన సభ్యులకు రుణాలు ఉపయోగకరంగా ఉన్నాయా? ఎలా? $AS_6$

**కృత్యం:** మీకు రెండు వేల రూపాయలు అవసరం ఉందనుకోండి. ఒక చెక్కు రాసి మీ చెల్లెలికిచ్చి నగదు తీసుకురమ్మని పంపించండి.

**ప్రాజెక్టు:**

1. బ్యాంకుకు వెళ్లండి, లేదా బ్యాంకు అధికారిని మీ బడికి ఆహ్వానించి ఈ కింది విషయాలు తెలుసుకోండి:

(అ) మీ పేరుతో పొదుపు ఖాతా తెరిచే విధానం

(ఆ) బ్యాంకులు చెక్కుల మొత్తాలను ఎలా చెల్లిస్తాయి?

(ఇ) నెఫ్ట్ (NEFT) బదిలీలను బ్యాంకులు ఎలా చేస్తాయి? (National Electronic Funds Transfer)

(ఈ) ఎటిఎం పని చేయటానికి భద్రతాపరంగా ఎటువంటి జాగ్రత్తలు అవసరం? కంప్యూటరు ఏమి సరి చూస్తుంది?

(ఉ) చెక్కుల ద్వారానే కాకుండా డ్రాఫ్టులు / ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా కూడా డబ్బులు బదిలీ చేయవచ్చు. ఆ వివరాలు తెలుసుకోండి.

(ఊ) డబ్బులు పొందవలసిన వ్యక్తికి చెక్కుతో పోలిస్తే ఆన్‌లైన్ లావాదేవీ వల్ల ప్రయోజనం ఏమిటి?

(ఋ) వివిధ రకాల అప్పులకు వర్తించే వడ్డీ.

| | |
|---|---|
| పొదుపు డిపాజిట్లపై చెల్లించే వడ్డీ | |
| ఫిక్స్‌డ్ డిపాజిట్టుపై చెల్లించే వడ్డీ | |
| రైతులకు ఇచ్చే అప్పులపై వడ్డీ | |
| గృహ రుణాలపై వసూలు చేసే వడ్డీ | |
| విద్యా రుణాలపై వసూలు చేసే వడ్డీ | |

L412UY

2. www.rbi.org.in లో కామిక్స్, థీమ్స్, ఆర్థిక కార్యకలాపాల కొరకు అంతర్జాలంను సందర్శించండి.

పాఠం 8

# జీవనోపాధులు - సాంకేతిక విజ్ఞాన ప్రభావం

## సాంకేతిక విజ్ఞానంలో మార్పులు

L48C7S

సాంకేతిక విజ్ఞానాన్ని మనం రోజూ చూస్తున్నాం, వినియోగించు కుంటూ ఉన్నాం. టీవి పెట్టినా, మొబైల్ ఫోన్‌లో మాట్లాడినా, కంప్యూటర్‌పై పని చేస్తున్నా మీరు అత్యంతాధునిక సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించు కుంటున్నారు. ఇది కొత్త ఉత్పత్తులకు దారితీస్తుంది. ఏదైనా పని విధానం మెరుగుపరచటం లేదా ఏదైనా జ్ఞానాన్ని రోజువారీ జీవితావసరాలకు ఉపయోగించుకుంటే అది సాంకేతిక విజ్ఞానం అవుతుంది. పెన్సిలు చెక్కినా, కూరగాయలు తరిగినా, కోసినా, వేరువేరు పాత్రలలో వంట చేసినా మీరు సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నారు అని అర్థం. మనం వాడే చిన్న చిన్న పరికరాల నుంచి, సంక్లిష్ట యంత్రాల వరకు అన్నీ సాంకేతిక విజ్ఞానంలో భాగమే. ఇది ఇంటిలో కావచ్చు, కర్మాగారంలో కావచ్చు లేక ప్రసార సాధనాలకు కావచ్చు, రవాణాకు కావచ్చు.

ప్రస్తుతం అంతరిక్ష పరిశోధన, పరిశ్రమలు, రవాణా వంటి వాటిల్లో వినియోగంలో ఉన్న అన్ని రకాల సంక్లిష్ట యంత్రాల గురించి ఆలోచించండి. ఇవి కాలక్రమంలో అభివృద్ధి చెందాయి. పారిశ్రామిక విప్లవం గురించి, 18వ, 19వ శతాబ్దాలలో ఉత్పత్తి విధానంలో వచ్చిన పెనుమార్పుల గురించి మీరు ఇంతకు ముందు తరగతుల్లో చదివారు.


L49XHL

- ఈ పారిశ్రామిక విప్లవానికి దోహదం చేసిన వాళ్లు ఎవరు?

ఆవిరియంత్రం వల్ల కర్మాగారంలో పని విధానం పూర్తిగా మారిపోయింది. ఆ తరవాత విద్యుత్తు వంటి కొత్త ఇంధన వనరుల వల్ల ఈనాడు మనం చూస్తున్న కర్మాగారాలు ఆవిర్భవించాయి. ఒక కొత్త యంత్రాన్ని, లేదా ఉత్పత్తి విధానాన్ని తొలిసారిగా కనుక్కొన్నప్పుడు దానిని ఆవిష్కరణ అంటారు. అయితే ఈ ఆలోచనలు రోజువారీ ఉపయోగంలోకి రావటానికి ఎంతో సమయం పడుతుంది. ఇది అనేక అంశాల మీద ఆధారపడి ఉంటుంది: ఇవి సాంకేతిక విజ్ఞానం మెరుగుపరచటంకావచ్చు, కొత్త విధానాలు, ఖర్చు తగ్గించటం కావచ్చు లేదా కొత్త ఉత్పత్తులకు, విధానానికి ఆమోదం లభించటం కావచ్చు. సాంకేతిక విజ్ఞానంలో అభివృద్ధి లేదా పెరుగుదల పూర్తిగా కొత్త యంత్రాల వల్ల (ఎక్స్‌రే యంత్రాలు, మర మగ్గాలు) రావచ్చు, ముడిసరుకులలో (రబ్బరుకు బదులు ప్లాస్టిక్) మార్పు వల్ల రావచ్చు, లేదా ఉత్పత్తి ప్రక్రియల పునః వ్యవస్థీకరణ వల్ల రావచ్చు.



*చిత్రం 8.1: నేతనేసే స్త్రీ*





చిత్రం 8.2 : (ఎడమ) తాటికాయను వత్తుతున్న కోయ స్త్రీ, పురుషులు; (కుడి) హైదరాబాదులో తివాచి నేతగాళ్లు

ఉదాహరణకు అమెరికాలో కార్ల ఉత్పత్తిని వేగవంతం చేయటానికి హెన్రీ ఫోర్డు 'అసెంబ్లీ లైన్' విధానాన్ని ప్రవేశపెట్టాడు. దీనివల్ల కర్మాగారాలలో ఉత్పత్తి పెరిగి, పెద్ద సంఖ్యలో సరుకులు తయారు కాసాగాయి. రోజువారీ జీవితాల వినియోగంలోకి వచ్చిన వాటిల్లో అంతర్గత దహన ఇంజను, కొత్త పదార్థాలు, రసాయనిక ఉత్పత్తులు, రేడియో వంటి ప్రసారసాధనాలు, కంప్యూటర్ మొదలైన వాటిని పేర్కొనవచ్చు. సాంకేతిక విజ్ఞానంలో మార్పు ఒక కొత్త ఉత్పత్తికి దారితీయవచ్చు, లేదా అదే సరుకు లేదా సేవను కొత్త విధంగా ఉత్పత్తి చేయవచ్చు/ అందించవచ్చు. ఈ కొత్త పరికరాల తయారీకి ముడి సరుకులు అందించటానికి (ఉదా: ఇనుము, బొగ్గు వంటివి) కొత్త ఉద్యోగాలు ఏర్పడతాయి. ఈ యంత్రాల వినియోగం కూడా కొత్త ఉద్యోగాలకు దారితీస్తుంది. ఉదాహరణకు ఉక్కు, ఇనుము ఉపయోగించి కార్లు, బస్సులు తయారు చేస్తారు, వీటివల్ల డ్రైవర్లు, మెకానిక్కులు, పెట్రోల్ బంకులు వంటి వాటికి గిరాకి పెరుగుతుంది.

- మీ చుట్టుపక్కల జీవితాలను కంప్యూటర్లు ఎలా మార్చివేశాయి?
- వినోదాన్ని సాంకేతిక విజ్ఞానం మార్చివేసిందా? ఎలా?
- మొదటి ఆవిరి యంత్రం ఆవిర్భావం గురించి తెలుసుకోండి. భారతదేశంలో రైల్వేమార్గాల నిర్మాణానికి ఇది ఎలా దారి తీసింది?
- మీ చుట్టుపక్కల ప్రాంతాల్లో, పట్టణాల్లో, నగరాల్లో సౌరశక్తిని దేనికైనా వినియోగించటం మీరు చూశారా? వాటి జాబితా తయారు చేయండి. ఈ ఇంధనాన్ని ఇంకా ఎక్కువగా ఎందుకు వినియోగించుకోవటం లేదు? చర్చించండి.

సాంకేతిక విజ్ఞానాన్ని అన్నివేళలా స్వాగతించరు. కొత్త యంత్రాల వల్ల తమ ఉద్యోగాలు పోతాయని ప్రజలు భయపడతారు. ఉదాహరణకు 19వ శతాబ్దంలో ఇంగ్లాండులో తమ ఉపాధిని మరమగ్గాలు తీసేసుకుంటాయని చేతివృత్తి కళాకారులు వాటిని తీవ్రంగా వ్యతిరేకించారు. వ్యవసాయంలో (వరి) కోత యంత్రాల పట్ల కూడా ప్రజల ప్రతిస్పందన ఇదేవిధంగా

ఉంది. భారతదేశంలో మొదట కంప్యూటర్లను ప్రవేశపెట్టినప్పుడు తమ ఉద్యోగాలు పోతాయని ప్రజలు భావించారు.

కొన్ని ఉద్యోగాలు పోయేమాట నిజమే, కాని కొత్త ఉద్యోగాలు కూడా కల్పించబడతాయి. అయితే సాంకేతిక విజ్ఞానం సమాజంలో వివిధ వర్గాలను వేరువేరుగా ప్రభావితం చేస్తుంది. ఈ పరిస్థితికి పరిష్కారం ఉందా? మొత్తంగా ప్రయోజనాలు ఉన్నాయా? వీటిని విశ్లేషించటానికి భారతదేశంలో మూడు భిన్న రంగాలను పరిశీలిద్దాం.

## వ్యవసాయంలో సాంకేతిక మార్పులు

L4H89F

స్వాతంత్ర్యం నాటికి వ్యవసాయం సంప్రదాయ పద్ధతిలో జరిగేది. రైతులు వరి, గోధుమ, కూరగాయలు, పత్తి వంటి పంటలు సాగు చేసేవారు. వ్యవసాయం ప్రధానంగా వర్షాధారంగా ఉండేది, కొన్ని ప్రాంతాలలో చెరువులు, నదుల నుంచి సాగునీరు లభించేది. అధిక శాతం రైతులు సంవత్సరంలో ఒక పంట మాత్రమే పండించగలిగేవారు. కొయ్యనాగలి, కొడవలి, పార, గునపం వంటి సాధారణ పరికరాలను పంటల సాగులో ఉపయోగించేవారు. మరుసటి సంవత్సరానికి రైతులు సొంతంగా విత్తనాలు దాచుకునేవారు. సరుకులు రవాణా చేయటానికి, పొలాలు దున్నటానికి, ఇతర వ్యవసాయ పనులకు ఎడ్లను ఉపయోగించేవారు. వ్యవసాయ ఉత్పత్తి ప్రధానంగా సొంత వినియోగానికి ఉండేది, కొద్ది మొత్తం మాత్రమే మార్కెట్టులో అమ్మేవారు.

స్వాతంత్ర్యం తరవాత ప్రభుత్వం ఆనకట్టలు కట్టి సాగునీటి సౌకర్యాలు మెరుగుపరచసాగింది. బోరుబావుల వాడకాన్ని ప్రోత్సహించసాగింది. నీళ్లు తోడటానికి విద్యుత్తు లేదా డీజిలుతో నడిచే మోటారు పంపులు వాడసాగారు. వ్యవసాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే కొత్త సాంకేతిక విజ్ఞానం ఎంతో చోటు చేసుకుంది: దేశంలో కొన్ని ప్రాంతాల్లో పొలాలకు సంవత్సరమంతా సాగు నీరు అందించసాగారు. పరిశోధనా కేంద్రాలలో రూపుదిద్దుకున్న అధిక దిగుబడినిచ్చే రకాలు అందుబాటులోకి వచ్చాయి. రసాయనిక ఎరువులు, పురుగుమందులను సహకార సంఘాలు లేదా మార్కెట్లో అమ్మటం మొదలుపెట్టారు. వివిధ పనులకు ట్రాక్టర్ల వంటి కొత్త యంత్ర పరికరాలను కొని, వినియోగించేలా రైతులను ప్రోత్సహించసాగారు.


## సాంకేతిక విజ్ఞాన ప్రభావం

**ఉత్పత్తిలో పెరుగుదల:** వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి రైతులు అధిక మొత్తంలో ఆహార ధాన్యాలు, ఇతర ఉత్పత్తులు పండించసాగారు. సాగు చేస్తున్న అదే విస్తీర్ణం నుంచి రైతులు ఎక్కువ మొత్తం ఉత్పత్తి చేయసాగారు. కింద ఉన్న పట్టిక చూడండి. వరి, గోధుమ, గింజధాన్యాలు, పప్పుధాన్యాల వంటి వాటి ఉత్పత్తిలో గత నాలుగు దశాబ్దాల కాలంలో భారతదేశ ఉత్పత్తి రెండు రెట్లు పెరిగింది. 1990 కాలంలో, 21వ శతాబ్దపు

*పట్టిక : భారతదేశంలో ఆహార ధాన్యాల వార్షిక ఉత్పత్తి సంవత్సరానికి మిలియన్ టన్నులలో*

| కాలం | ఉత్పత్తి |
|---|---|
| 1961-75 | 101 |
| 1976-90 | 157 |
| 1991-2009 | 229 |

*గ్రాఫ్ 1 : భారతదేశంలో ఆహారధాన్యాల వార్షిక ఉత్పత్తి*



ప్రారంభంలో రైతులు ప్రతి సంవత్సరం 200 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేశారు.

### ఉత్పత్తి ప్రక్రియలో మార్పులు:


వ్యవసాయక యంత్రాలను ఉపయోగించటం కూడా ఉత్పత్తి ప్రక్రియను గణనీయంగా మార్చింది. కొన్ని ప్రాంతాలలో రైతులు సంవత్సరంలో రెండు పంటలు పండించటం మొదలుపెట్టారు. దీని వల్ల కూలీలకు ఉపాధి అవకాశాలు పెరిగాయి.

వ్యవసాయక యంత్రాలు వినియోగంలోకి రావటంతో వ్యవసాయ కూలీలు సంవత్సర కాల జీతగాళ్లుగా పని చేయటం కంటే రోజువారీ కూలీగా పని చేయటానికి మొగ్గు చూపసాగారు. రోజువారీ కూలీగా ఉంటే ఏ రైతు ఎక్కువ కూలీ ఇస్తే ఆ రైతు దగ్గర పని చేసే స్వేచ్ఛ ఉంటుంది. అయితే సంవత్సరం పొడవునా పని దొరుకుతుందన్న హామీ ఏదీ లేదు. వ్యవసాయ పనులకు బాగా వత్తిడి ఉండే వరినాట్లు, వరి కోతల సమయాల్లో మాత్రమే కూలీలు ఎక్కువ కూలీ అడిగే వీలుంటుంది. అయితే, ఇటీవల కాలంలో పెద్ద రైతులు ఈ పనులను యంత్రాలతో చేయించుకోటానికి మొగ్గు చూపుతున్నారు. కూలీలకు ఒక వైపున పని పెరిగింది కానీ మరో వైపు సంప్రదాయంగా చేసే పనులు కోల్పోసాగారు.

### పశువుల వినియోగంలో తగ్గుదల:

రవాణాకు, అనేక ఇతర వ్యవసాయ పనులకు ట్రాక్టర్లను ఉపయోగించటం మొదలుపెట్టారు. దున్నటం, విత్తటం, కలుపు తీయటం, కోత వంటి పరికరాలలో సైతం గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. కాలక్రమంలో వ్యవసాయంలో పశువుల వినియోగం తగ్గుతోంది. ఈ విషయం కింద గ్రాఫ్ 2లో చూడవచ్చు.

గ్రాఫ్ 2 : భారతదేశంలో వ్యవసాయ పనులలో పశువుల వినియోగం (శాతంలో)




పెద్ద పెద్ద కమతాలలో మాత్రమే ఆధునిక వ్యవసాయ పద్ధతులను వినియోగించటం సాధ్యం అవుతుంది కాబట్టి చిన్న రైతులు వీటిని ఉపయోగించలేకపోతున్నారు. దీంతో వీళ్లు సంవత్సరంలో కొంత సమయంలో ఇతరుల పొలాల్లో లేదా పట్టణాలలో పని చేయసాగారు.

### వరికోత యంత్రం వల్ల ఉపాధి నష్టం

వరికోత యంత్రాన్ని ఇటీవల కాలంలో ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఈ యంత్రం వరిని కోస్తుంది, ధాన్యం నూర్పిడి చేస్తుంది, పోత పోసి గింజ–పొల్లును వేరు చేస్తుంది. ఈ మూడు పనులను చేయటం వల్ల దీనిని 'కంబైన్డ్ హార్వెస్టర్' అంటారు.



*చిత్రం 8.3 : వరికోత యంత్రం*

వరికోత యంత్రాన్ని వినియోగించటం వల్ల సకాలంలో వరిని కోయటం వీలవుతుంది. దీనితో వరికోతకు తక్కువ సమయం పడుతుంది, పంట నష్టం కాదు. దీని వల్ల రైతులు పని వత్తిడి సమయంలో కూలీల కొరతను ఎదుర్కోగలుగుతారు. ఆంధ్రప్రదేశ్, ఒడిషా తీరప్రాంతాలలో వాతావరణ అనిశ్చితిని ఎదుర్కోటానికి కూడా ఇది సహాయపడుతుంది. దీని వల్ల ఆలస్యం కాకుండా రైతులు రెండో పంటను నాటగలుగుతున్నారు. రైతులు కూలీలపై ఆధారపడటం కూడా తగ్గింది.

2003 లో వరికోత యంత్ర వినియోగంపై అధ్యయనం ఈ కింది విషయాలను వెల్లడి చేసింది: రైతులకు ఎకరానికి ఒక క్వింటాలు ధాన్యం అదనంగా వస్తోంది, కూలీలతో పంట కోస్తే ఈ మేర పంట రాలిపోయి నష్టమవుతుంది. వరికోత యంత్రంతో గంటకు 1100-1400 రూపాయలు తీసుకుంటున్నారు. పెద్ద రైతులు తమ వరికోత యంత్రాన్ని అద్దెకు ఇచ్చి అదనంగా సంపాదించగలుగుతున్నారు.

వరికోత యంత్రంతో ఒక గంటలో ఒక ఎకరం వరిని కొయ్యవచ్చు. ఇదే కూలీలతో చేస్తే అయిదుగురు వ్యక్తులు 4 రోజులపాటు పనిచేయాల్సి ఉంటుంది. పదిమంది కూలీలను పెట్టుకుంటే వాళ్లు రెండు రోజుల్లో ఈ పనులు పూర్తి చేస్తారు. ఉదాహరణకు వెయ్యి ఎకరాల వరి సాగు ఉన్న గ్రామంలో 250 మంది కూలీలు ఉన్నారనుకుందాం. వరికోత యంత్రాన్ని ఉపయోగిస్తే అది రోజుకి 18 గంటలు పని చేసి 55 రోజుల్లో పని పూర్తిచేస్తుంది. అయితే దీనివల్ల 250 మంది కూలీలు 80 రోజుల ఉపాధి కోల్పోతారు.

వ్యవసాయ యంత్రాలను విస్తృతంగా వాడటం వల్ల కూలీలకు పని లేకుండా పోతోంది. వ్యవసాయ కూలీలకు, ఇతర పొలాల్లో పనిచేసే చిన్న రైతులకు పనులు దొరకటం లేదు. గ్రామాలలో తగినంత ఉపాధి దొరకనప్పుడు ప్రజలు ఎక్కడికి వెళ్లాలి? పట్టణాలలో కూడా ఉపాధి అవకాశాలు అంతగా లేవు.

- వ్యవసాయ ఉత్పత్తిలో వరికోత యంత్రాన్ని ఉపయోగించటం వల్ల లాభాలు ఏమిటి? పైన పేర్కొన్న దానినుంచి ఒక జాబితా తయారు చేయండి.
- అనేక గ్రామాలలో వ్యవసాయ కూలీలు, ప్రత్యేకించి మహిళా కూలీలు వరికోత యంత్రం వినియోగంతో ఆందోళన చెందుతున్నారు. ఎందుకు?
- వరికోత యంత్రాన్ని ఉపయోగించటం వల్ల వ్యవసాయ కూలీలు కోల్పోయే పనులను రాయండి.

- భారతదేశంలో చాలామంది పేద వ్యవసాయ కూలీలు ఉన్నారు, గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగం తీవ్రంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వరికోత యంత్రాన్ని వినియోగించటం సరైనదేనా?

యంత్రాల వినియోగం వల్ల వ్యవసాయ కూలీల పనుల్లో కూడా మార్పు వచ్చింది. వివిధ వ్యవసాయ పనులకు ట్రాక్టరు నడపటం, పంపుసెట్లు ఉపయోగించి నీళ్లు పెట్టటం, పిచికారీ పరికరాలు ఉపయోగించటం, రసాయనిక ఎరువులు చల్లటం, వరికోత యంత్రాలు, నూర్పిడి యంత్రాలతో పనిచేయటం వంటి పనులు వచ్చాయి. అనేక చిన్న పట్టణాలలో వ్యవసాయ పరికరాల మరమ్మతులకు మెకానిక్ షెడ్డులు ఏర్పడ్డాయి. దీనివల్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడ్డాయి. అయితే వీటి వల్ల పెద్ద సంఖ్యలో పని దొరకదు.

- మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పనులు కల్పించవచ్చన్న వాదన ఉంది. కూలీలు అవసరమయ్యే పథకాల ద్వారా లింకు రోడ్లు, చెరువులు, కట్టలు వంటి నిర్మాణాత్మక క్రియల ద్వారా పని కల్పించవచ్చు. మీరు గ్రామీణ ప్రాంతంలో ఉంటున్నట్లయితే ఇటువంటి పనులు ఏమైనా జరుగుతున్నాయేమో తెలుసుకోండి, అక్కడి ప్రజల జీవనోపాధికి సరిపోతాయేమో తెలుసుకోండి.



*చిత్రం 8.4 : ఫోర్డ్ 'అసెంబ్లీ లైన్' ఫోటో*

## సాంకేతిక విజ్ఞానం, పరిశ్రమ

ఏడవ తరగతిలో ఇక్కత్ చీరలు నేసే జగతయ్య కుటుంబాన్ని గుర్తుకు తెచ్చుకోండి. వస్త్ర పరిశ్రమలో బట్ట తయారీలో అనేక పనులు ఉన్నాయి. ఈనాడు వస్త్ర పరిశ్రమలోని వివిధ విభాగాలలో 10 కోట్ల మంది పని చేస్తున్నారు. భారతదేశంలో వ్యవసాయం తరవాత వస్త్ర పరిశ్రమ ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తుంది.

**నూలుమిల్లుల ప్రభావం:** భారతదేశంలో మిల్లుల ద్వారా ఉత్పత్తిని బ్రిటిష్‌వాళ్లు ప్రవేశపెట్టారు. మిల్లులు బట్ట తయారు చేయడం మొదలుపెట్టడంతో చేనేత వస్త్రాలకు గిరాకి తగ్గిపోయింది. తరవాత కాలంలో చిన్న చిన్న షెడ్లలో పనిచేసే మరమగ్గాల నుంచి నూలు మిల్లులు పోటీని ఎదుర్కోసాగాయి.

మరమగ్గం కేంద్రానికి, నూలు మిల్లుకు తేడా ఉత్పత్తి స్థాయిలో ఉంటుంది. నూలు మిల్లులో పెద్ద ప్రదేశంలో వందల మగ్గాలు ఉంటాయి, ఇది కర్మాగారంలాగా ఉండి వివిధ విభాగాలలో వందల మందికి ఉపాధి కల్పిస్తుంది.

మరమగ్గం కేంద్రంలో కొన్ని మగ్గాలు మాత్రమే ఉంటాయి. దీంట్లో కొంతమంది మాత్రమే పనిచేస్తారు. వీటిని ఇంటి దగ్గర, లేదా చిన్న చిన్న షెడ్లలో నిర్వహిస్తారు.


చాలావరకు మిల్లులు నాణ్యమైన బట్టను ఉత్పత్తి చేస్తాయి. మరమగ్గాల మీద నేసే బట్ట నాణ్యత ఓమాదిరిగా ఉంటుంది. చొక్కాలు, ప్యాంటులు, చీరలు, పంచెలు, దుప్పట్లు, తువ్వాళ్లు, ఇతర అవసరాలకు బట్టను మరమగ్గాలు నూలు, సింథటిక్, బ్లెండెడ్, ఉన్ని, పట్టు వంటి దారాలతో తయారుచేస్తాయి.

**మరమగ్గాల ప్రభావం:**


L4ITY9

1940లలో 40,000 మరమగ్గాలు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం మన దేశంలో 5 లక్షల మరమగ్గాల కేంద్రాలలో 23 లక్షల మరమగ్గాలు పనిచేస్తున్నాయి. చాలా కేంద్రాలు చిన్నవి, వీటిల్లో 1-8 మరమగ్గాలు ఉంటాయి. తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్‌లలో మరమగ్గం కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో 50,000 మరమగ్గాలు ఉన్నాయి.

1988-89లో వస్త్ర ఉత్పత్తి




2010-11లో వస్త్ర ఉత్పత్తి



ముందు పేజీలోని 'పై' (pie diagrams) చిత్రాలను చూడండి. 1980ల నుంచి భారతదేశంలో వస్త్ర ఉత్పత్తిలో మరమగ్గాల వాటా ఎక్కువగా ఉంది. అప్పటినుంచి ప్రతి సంవత్సరం ఇది పెరుగుతూ ఉంది.

మరమగ్గాలు పెద్ద మిల్లుల నుంచి చిన్న షెడ్లకు, ఇళ్లకు మారాయి. దీనివల్ల వస్త్ర పరిశ్రమలో గణనీయమైన మార్పులు వచ్చాయి. మరమగ్గాలలో 60 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది.

## చేనేత క్షీణత

చేనేతలో క్షీణత అనేది స్పష్టంగా కనిపించే ఒక ప్రధానమైన మార్పు. ఉదాహరణకు 1988లో వివిధ రాష్ట్రాలలో 33 లక్షల చేనేత మగ్గాలు పని చేస్తుండేవి, 2009–10లో ఇది 24 లక్షలకు తగ్గిపోయింది. గత రెండు దశాబ్దాల కాలంలో వివిధ రాష్ట్రాలలో చేనేత ఎలా తగ్గిపోయిందో తెలియచేసే దిగువ పట్టికను చూడండి. అయితే సంప్రదాయ బట్ట, డిజైన్లలో చేనేతకు కొత్త మార్కెట్లు దొరికింది. ప్రభుత్వ మద్దతు, సబ్సిడీల సహాయంతో మరమగ్గాల నుంచి పోటీని తట్టుకుని, నిలబడగలుగుతున్నారు.

**చేనేత యూనిట్లలో మార్పు**

| రాష్ట్రం | 1988 | 2009 |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 5,29,000 | 1,24,700 |
| గుజరాత్ | 24,000 | 3,900 |
| కర్నాటక | 1,03,000 | 40,500 |
| మహారాష్ట్ర | 80,000 | 4,500 |
| మధ్యప్రదేశ్ | 43,000 | 3,600 |
| పంజాబ్ | 22,000 | 300 |
| తమిళనాడు | 5,56,000 | 1,55,000 |




చిత్రం 8.5 : పోచంపల్లి చీర నేయటం

గ్రాఫ్ 3 చూడండి. యాంత్రిక విజ్ఞానాన్ని వినియోగించటం వల్ల ప్రతి కార్మికునికి చేనేతలో కంటే మర మగ్గాల మీద ఆరు రెట్ల బట్ట ఎక్కువ ఉత్పత్తి అవుతుంది. భారతదేశంలో గత అయిదు దశాబ్దాల కాలంలో మరమగ్గాలు పుట్టగొడుగుల్లా ఎందుకు పుట్టుకు వచ్చాయో ఇది తెలియచేస్తుంది.

అయితే మరమగ్గాలలో పనిచేసే కార్మికులకు కొన్ని సమస్యలు ఉన్నాయి. మిల్లులతో పోలిస్తే మరమగ్గాలలో చాలా తక్కువ జీతం దొరుకుతుంది. మిల్లుల్లో కార్మికులకు నెలవారీ జీతాలు లభిస్తే మరమగ్గాలలో

గ్రాఫ్ 3 : చేనేత, మరమగ్గాలలో కార్మికుల ఉత్పాదకత



ఉత్పత్తి చేసిన బట్టను బట్టి కూలీ చెల్లిస్తారు. వైద్య సదుపాయాలు, పెన్షను, ఇతర సామాజిక భద్రతలు కల్పించాలన్న బాధ్యత మరమగ్గ కేంద్రాలకు లేదు. విద్యుత్తు కోత ఉంటే మరమగ్గ కార్మికులకు ఎటువంటి జీతమూ లభించదు. మిల్లుల్లో కార్మికులు సంఘాలుగా ఏర్పడతారు, కూలి రేట్లు నిర్ణయించడానికి యజమానులు ఈ సంఘాలతో సంప్రదించవలసి ఉంటుంది. అనేక మరమగ్గ కేంద్రాలలో కార్మిక సంఘాలు లేవు. 2008లో మరమగ్గ కేంద్రాలపై జరిపిన ఒక అధ్యయనం ఈ విషయాలు వెల్లడి చేసింది: 'మరమగ్గ కేంద్రాల కార్మికులు ఆహార అభద్రత, పోషకాహారలోపం, రక్తహీనత, క్షయ, ఆస్తమా, మహిళలలో గర్భసంచి సంబంధిత వ్యాధులు వంటి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. గృహ వసతి లేకపోవటం, పిల్లల్లో ఎక్కువ శాతం మధ్యలో బడి మానుకోవటం వంటివి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి.'

- వస్త్ర ఉత్పత్తిని నాలుగు ప్రధాన వర్గాలుగా విభజించారు, మిల్లు, చేనేత, ......................, ........................



చిత్రం 8.6 : రాజస్థాన్‌లో గ్రామీణ కళాశాలలో కమ్యూనిటీ రేడియో మరమ్మతు చేస్తున్న మహిళలు, (కుడి) టెలిఫోన్ అసెంబ్లీ లైన్ – చైనా

- 1988లో ...................... రాష్ట్రంలో చేనేత మగ్గాలు అత్యధికంగా ఉన్నాయి, 2009 ...................... రాష్ట్రంలో ఇవి ఎక్కువగా ఉన్నాయి. 2009లో అతి తక్కువ చేనేత మగ్గాలు ఉన్న రాష్ట్రం ఏది?
- మిల్లు కార్మికులకు నెల జీతం ఇస్తే ...................... కార్మికులకు ...................... బట్టి కూలీ చెల్లిస్తున్నారు.

## సేవారంగంలో సాంకేతిక విజ్ఞాన మార్పులు

సాంకేతిక విజ్ఞాన మార్పులు సేవారంగాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. వ్యవసాయం, పరిశ్రమలకు మద్దతు ఇచ్చేవి కూడా సేవారంగంలోకి వస్తాయి. ఉదాహరణకు పత్తి పండిస్తే దానిని అమ్మటానికి దగ్గరలోని పట్టణానికి రవాణా చేయాలి. లేదా మరమగ్గ కేంద్రంలో బట్ట ఉత్పత్తి చేయాలంటే నూలుకేంద్రాల నుంచి నూలు రవాణా చేయాలి. అన్ని వ్యాపార కార్యకలాపాలు కూడా సేవారంగం కిందకు వస్తాయి. నేరుగా ఉత్పత్తికి దోహదం చేయని అత్యవసర కార్యక్రమాలు కూడా సేవారంగం కిందకు వస్తాయి.




ఉదాహరణకు మనకు టీచర్లు, డాక్టర్లు, లాయర్లు, వ్యక్తిగత సేవలు అందించే బట్టలు ఉతికే వాళ్లు, జుట్టు కత్తిరించేవాళ్లు, చెప్పులు తయారు చేసేవాళ్లు కావాలి. అదేవిధంగా జమ, ఖర్చు లెక్కలు చూసేవాళ్లు, పరిపాలన సంబంధ పనులు చేసేవాళ్లు, బ్యాంకులలో పని చేసేవాళ్లు కావాలి. వ్యాపారాన్ని వేగంగా, బాగా చేయటంలో ప్రసారసాధనాలు ఎలా సహకరిస్తాయో చూద్దాం. సాంకేతిక విజ్ఞానంలో మార్పు వల్ల సమాచారం వేగంగా అందుతుంది, అందరికీ తేలికగా అందుబాటులోకి వస్తుంది.

## మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం: సమాచార రంగం – అందరికీ సులభంగా, వేగంగా అందుబాటు

*దారం వినోద్ కాకినాడలో నివసిస్తున్న వయసుమళ్లిన వ్యాపారి. అతడు గత 35 సంవత్సరాలుగా ఒక ఆటోమొబైల్ దుకాణాన్ని నడుపుతున్నాడు. అన్ని రకాల విడి భాగాలను అతడు అమ్ముతాడు. అతడికి ఒక ల్యాండ్‌లైన్ ఫోను ఉండేది. బయటి పట్టణాల ప్రజలతో మాట్లాడాలంటే ఒకప్పుడు ట్రంక్‌కాల్ బుక్ చేయాల్సి వచ్చేది. కనెక్షన్ దొరికే వరకు తాను వేచి ఉండాల్సి వచ్చేది. ఒక్కొక్కసారి తనకు కావలసిన వ్యక్తి దొరికేవాడు కాదు. పరికరంలోగానీ, టెలిఫోన్ తీగలలోగానీ ఏదైనా సమస్య ఉంటే అవి బాగు కావడానికి కొన్ని వారాలపాటు వేచి ఉండాల్సి వచ్చేది.*

*ఇప్పుడు పరిస్థితులు మారాయి. మొబైల్ ఫోన్లు వినియోగంలోకి వచ్చాయి. తనకు కావలసిన వ్యక్తితో వెంటనే, తేలికగా మాట్లాడ గలుగుతున్నాడు. వస్తువుల కొనుగోలుకు, సరుకు అందుబాటులో ఉందీ, లేనిదీ, వాటి ధరలు తెలుసుకోటానికి, సరుకులు అందివ్వటానికి అతడు మొబైల్ ఫోనును వినియోగిస్తున్నాడు. ఇప్పుడు అతడికి తన వ్యాపార విషయాలు తేలికగా తెలుస్తున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల నుంచి వ్యక్తిగత విషయాలకే కాకుండా ఫలానా విడిభాగం ఉందో లేదో తెలుసుకోటానికి మెకానిక్కులు అతడికి ఫోను చేస్తుంటారు. ఒకప్పుడు హైదరాబాదు నుంచి ఏదైనా సరుకు తెప్పించాలంటే అది ఎన్ని రోజులకు వస్తుందో తెలిసేది కాదు. ఇప్పుడు ఆ సరుకు రవాణా అవుతున్న లారీ డ్రైవరుకు ఫోను చేసి ఎక్కడిదాకా చేరుకున్నారో కనుక్కుంటూ ఉంటాడు.*




భారతదేశంలో టెలీ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ప్రపంచంలో మూడవ అతి పెద్దదన్న విషయం మీకు తెలుసా? ప్రస్తుతం ఫోను ద్వారా ఎవరితోనైనా తేలికగా మాట్లాడవచ్చు – ఇందుకోసం లాండ్‌లైన్ ఫోను కానీ, మొబైల్ ఫోను కానీ వినియోగించవచ్చు. కానీ 1990ల వరకు పరిస్థితి ఇలా లేదు. అప్పుడు కేవలం లాండ్‌లైన్ ఫోనులు ఉండేవి, వాటిని కూడా ప్రభుత్వమే ఇచ్చేది. భారతదేశంలో మొబైల్ ఫోనుల సంఖ్య 2001లో 50 లక్షల నుంచి 2012 మే నాటికి 92.9 కోట్లకు చేరింది. ల్యాండ్‌లైన్ ఫోనుల కంటే మొబైల్ ఫోనులు 20 రెట్లు ఎక్కువ. టెలిఫోన్ సాంకేతిక

L4R4B3

విజ్ఞానంలో మార్పువల్ల సమాచారం అందుకునే ఖర్చు ఎంతో తగ్గిపోయింది. 1995లో మొదటిసారి మొబైల్ ఫోనులు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి 2002 వరకు ఫోను చేసిన వాళ్లు, ఫోను అందుకున్న వాళ్లు కూడా డబ్బులు చెల్లించాల్సి వచ్చేది. దాంతో మొబైల్ ఫోనులు కొనటానికి చాలా తక్కువమంది ఆసక్తి కనబరిచారు. ఈ విధానం 2003లో మారింది. ఇప్పుడు ఫోను చేసిన వాళ్లకే ఖర్చవుతుంది. 1994లో ఒక వ్యక్తి లాండ్‌లైన్ ఫోనులో 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో వ్యక్తితో 3 నిమిషాల పాటు మాట్లాడటానికి ఆ వ్యక్తికి 28 రూపాయల ఖర్చు అయ్యేది. 2003 నాటికి దీనికి 2.40 నుంచి 4.80 రూపాయలు మాత్రమే అవుతోంది.



*చిత్రం 8.7 : సౌర ఇంజనీరింగ్ యూనిట్‌లో శిక్షణ ఇస్తున్న మహిళ. ఈ పాఠంలో సాంకేతిక అంశాల్లో నిమగ్నమైన అనేక మహిళల చిత్రాలున్నాయి. పై చిత్రంలో వలె అనేక మంది మహిళలు ఇంజనీరింగ్ డిగ్రీ లేనివాళ్లే. మహిళలు ఇంజనీరింగ్ విద్య చదవటంపట్ల గల భిన్నాభిప్రాయాలపై తరగతి గదిలో చర్చించండి. ఉంటుందో అనే అంశంపై చర్చను తరగతి గదిలో నిర్వహించండి.*

- ప్రస్తుత రేట్లు ఎలా ఉన్నాయో కనుక్కోండి. ఒక కంపెనీకి మరో కంపెనీకి రేట్లలో తేడాలు ఎందుకున్నాయో, అవి ఎందుకు తగ్గుతున్నాయో తెలుసుకోండి.

## కొత్త నైపుణ్యాలు, కొత్త ఉద్యోగాలు

ప్రభుత్వ కంపెనీయే కాకుండా అనేక ప్రైవేటు కంపెనీలు లాండ్‌లైన్, మొబైల్ ఫోను సేవలను అందిస్తున్నాయి. టెలికమ్యూనికేషన్ సేవలలో ప్రైవేటు కంపెనీల వాటా పెరుగుతూ ఉంది. మొబైల్ ఫోనులు తయారుచేసే అనేక కంపెనీలు భారతదేశంలో నెలకొల్పబడుతున్నాయి. ఈ కంపెనీలు వీటిని ప్రపంచవ్యాప్తంగా 80 దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. టెలిఫోను మొబైల్ సాంకేతిక విజ్ఞానానికి కొత్త నైపుణ్యాలు కూడా అవసరం. బహుళజాతి కంపెనీలలో, మొబైల్‌ఫోనుల తయారీలో, టెలిఫోన్ బూత్‌లలో, మొబైల్‌ఫోన్ల అమ్మకాలలో, మరమ్మతులలో, రీచార్జ్/ టాప్-అప్ సేవలలో యువతకు కొత్త ఉపాధులు ఏర్పడ్డాయి.

### కీలక పదాలు

1. సాంకేతిక విజ్ఞానం 2. ఆవిష్కరణ 3. సాగునీటి సౌకర్యాలు
4. రసాయనిక ఎరువులు, పురుగు మందులు 5. వ్యవసాయ పనులు 6. సేవలు

L4SPZH

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. సాంకేతిక విజ్ఞానం అవసరం లేని పనులు అంటూ నరహరి కింద ఇచ్చిన జాబితా తయారుచేశాడు. మీరు అతడితో ఏకీభవిస్తారా? ఏకీభవించకపోతే అతడు తప్పు అని నిరూపించండి. $AS_1$

అ) పాటలు పాడడం ఆ) ఇడ్లీలు చేయడం

ఇ) రంగస్థలం మీద నాటకం వేయడం ఈ) అమ్మకానికి దండ తయారు చేయడం

2. నూలు మిల్లులు, మరమగ్గాలలో కార్మికుల పరిస్థితి ఎలా మారిందో వివరించండి. ఈ మార్పువల్ల కూలీలకు మేలు జరిగిందా లేదా యజమానులకా? మీ సమాధానానికి కారణాలు ఇవ్వండి. $AS_1$
3. వరికోత యంత్రాలు వినియోగించటంలో ప్రయోజనాలు ఏమిటి? ఎవరికి ఎక్కువ ప్రయోజనం? వరికోత యంత్రాలను రైతులు ఎందుకు వినియోగిస్తున్నారు? $AS_1$
4. సాంకేతిక విజ్ఞానంలో మార్పుల వల్ల ఉపాధి అవకాశాల్లో మార్పులు వస్తాయి. ఈ వాక్యంతో మీరు ఏకీభవిస్తారా? ఎందుకు? $AS_4$
5. టెలిఫోనులో సాంకేతిక విజ్ఞానం మారిందని ప్రభావతి భావిస్తోంది. కొత్త ఉద్యోగాలు చదువుకున్న వాళ్లకే వస్తాయని ఆమె అభిప్రాయం. భారతదేశంలో నిరక్షరాస్యులు ఎక్కువమంది ఉన్నారని, ఆధునిక సాంకేతిక జ్ఞానం చదువుకున్నవాళ్లకే ఎక్కువ ప్రయోజనకరంగా ఉందని ఆమె అంటుంది. మీరు ఆమెతో ఏకీభవిస్తారా? మీ కారణాలను పేర్కొనండి. $AS_4$
6. ఈ అధ్యాయంలో మూడు రంగాలలో వచ్చిన మార్పులను చర్చించాం. కింద పట్టికలో ప్రతి ఒక్కదానికి పుస్తకంలో ఇచ్చింది కాకుండా ఒక కొత్త ఉదాహరణను పేర్కొనండి. $AS_3$

| క్రమ సంఖ్య | రంగం | పాత సాంకేతిక విజ్ఞానం | కొత్త సాంకేతిక విజ్ఞానం | ఉపాధి/ ఉత్పత్తి/ మానవ శ్రమ తగ్గటం లేదా పెరగటం పై ప్రభావం |
|---|---|---|---|---|
| 1 | వ్యవసాయం | | | |
| 2 | పరిశ్రమ | | | |
| 3 | సేవారంగం | | | |

7. కొత్త నైపుణ్యాలు, కొత్త ఉద్యోగాలు అనే పేరాను చదివి క్రింది ప్రశ్నకు జవాబు ఇవ్వండి. మీ ప్రాంతంలో యువతకు కొత్తగా సృష్టించబడిన ఉద్యోగాలు ఏవి? $AS_2$
8. ప్రపంచ పటంలో కింది వాటిని గుర్తించండి. $AS_5$

   ఎ) ఇంగ్లాండ్ బి) అమెరికా సి) ఇండియా
9. అడవులు, అడవుల చుట్టు పక్కల నివసించేవారు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించలేని స్థితిలో ఉంటారు. అలాంటి వారి మెరుగైన జీవనానికి మీరిచ్చే సలహాలు ఏమిటి ? $AS_6$

**ప్రాజెక్టు:**

శ్రీపురం అనే గ్రామంలో మల్లయ్య ఒక రైతు. ఆ గ్రామంలో 100 ఇళ్లు ఉన్నాయి. ప్రస్తుతం నాటటం, కలుపుతీయటం, పంటకోయటం, రసాయనిక ఎరువులు వేయటం, పురుగుమందులు చల్లటం వంటి అన్ని పనులు యంత్రాలతో జరుగుతున్నాయి. గతంలో ఈ పనులన్నింటినీ మనుషులు చేసేవారు. ఆ గ్రామంలో 33 ట్రాక్టర్లు, 15 వరికోత యంత్రాలు ఉన్నాయి. వాటిల్లో కొన్నింటిని అద్దె (బాడుగ)కు ఇస్తారు. పొలం దున్నటానికి ట్రాక్టరు యజమానులు గంటకు 300 రూపాయలు తీసుకుంటున్నారు. తమ పొలాల్లో ఈ యంత్రాలను ఉపయోగించే వాళ్ల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఈ సమాచారం ఆధారంగా చిత్రాలతో, గ్రామంలోని వివిధ వర్గాల మధ్య జరిగే చర్చలతో ఒక గోడ పత్రిక తయారు చేయండి.

పాఠం 9

# ప్రజారోగ్యం - ప్రభుత్వం

ప్రజల ప్రాథమిక అవసరాలను ప్రభుత్వం తీరుస్తుందని దేశ పౌరులుగా మీరు ఆశిస్తారు. స్వచ్ఛమైన నీరు, సరియైన పరిశుభ్రత, కనీస ఆహారం, విద్య, ఆరోగ్య సౌకర్యాలు అందరికి అవసరం. ఎవరినీ మినహాయించకూడదు. వారు ధనికులా లేదా పేదవారా అనే దాని మీద ఆధారపడకూడదు. పౌరులందరూ సమానమే అని భావిస్తున్నాం కాబట్టి ఈ ప్రాథమిక అవసరాలు అందరికీ అందుబాటులో ఉంచాలి. ఆరోగ్యరంగ అధ్యయనం ద్వారా మన దేశంలో రాజ్యాంగం కల్పించిన సదుపాయాలు ఎంతవరకు సంతృప్తికరంగా ఉన్నాయో ఈ పాఠంలో మనం పరిశీలిద్దాం.

L4ZZCQ

**తెలుసుకోండి**

- మలేరియా నివారణకు ఏ చర్యలు తీసుకోవాలి?
- గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్లు పని చేయటానికి ఇష్టపడక పోవటానికి కారణాలు ఏమిటి?
- మీరు పాఠశాలలో త్రాగేనీరు శుభ్రంగా ఉన్నాయా?
- అంగన్‌వాడీలలో పిల్లలకు ఆహారం ఎందుకు ఇస్తున్నారు? మీ ప్రాంతంలోని అంగన్‌వాడీలలో వాళ్లకి తగినంత ఆహారం దొరుకుతోందా?

రోగాలను నివారించటానికి, వైద్యం చేయటానికి ఆరోగ్యకేంద్రాలు, ఆసుపత్రులు, రోగ నిర్ధారణకు పరీక్షా కేంద్రాలు, అంబులెన్స్ సదుపాయాలు, రక్త నిధి వంటివి అవసరం అవుతాయి. అర్హతలున్న ఆరోగ్య కార్యకర్తలు, నర్సులు, డాక్టర్లు, పరీక్షా కేంద్రాల టెక్నీషియన్లు వంటివాళ్లు సలహాలు ఇవ్వటానికి, రోగాలను నిర్ధారించటానికి, చికిత్స చేయటానికి కావాలి. రోగులకు అవసరమయ్యే మందులు, వైద్యపరికరాలు కూడా కావాలి. రోగాలను నివారించటానికి టీకాలతోపాటు తగినంత ఆహారం, శుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్యం (మలాన్ని సరిగా తొలగించటం), శుభ్రమైన వాతావరణం కావాలి.

భారత దేశంలో పెద్దసంఖ్యలో డాక్టర్లు ఉన్నారు, అధిక సంఖ్యలో ఆసుపత్రులు, చికిత్సా కేంద్రాలు ఉన్నాయి. ప్రజా ఆరోగ్య వ్యవస్థను నడిపే విజ్ఞానమూ, అనుభవమూ భారత దేశానికి ఉన్నాయి. లక్షకి పైగా ఉన్న గ్రామాల్లోని కోట్లాది ప్రజల కోసం ప్రభుత్వం చికిత్సా కేంద్రాలు, ఆసుపత్రులను నిర్వహిస్తోంది. సాంకేతిక విజ్ఞానంలోనూ, చికిత్సా విధానాలలోనూ వైద్యశాస్త్రం గణనీయమైన ప్రగతిని సాధించింది.

ఔషధాలు తయారు చేయడంలో ప్రపంచంలో భారతదేశం నాల్గవ పెద్ద దేశం. ఔషధ ఎగుమతులలో కూడా భారతదేశం ముందుంది. ప్రపంచంలోకెల్లా భారతదేశంలోనే అధికంగా వైద్య కళాశాలలున్నాయి. ప్రతి సంవత్సరం 15,000 మంది డాక్టర్లు అర్హత పొందుతున్నారు. ప్రతి సంవత్సరం క్రమంగా ఆరోగ్య సౌకర్యాలు పెరుగుతున్నాయి. భారతదేశంలో 1950లో 2717 ఆసుపత్రులు ఉండేవి. 1991 నాటికి అవి 11,174 ఆసుపత్రులుగా పెరిగాయి. 2000 సంవత్సరం నాటికి వాటి సంఖ్య 18,218కి పెరిగింది.

కొంతమందికి మంచి సదుపాయాలు అందుబాటులో ఉండగా, మరికొందరు కనీస ఆరోగ్య సేవలను పొందలేకపోతున్నారు. దేశంలోని ప్రజలందరి అవసరాలు తీర్చాలనే మన రాజ్యాంగ ఆకాంక్షకు ఇది విరుద్ధం. ఈ పరిస్థితిని మార్చడానికి కావలసిన డబ్బు, జ్ఞానం, అనుభవం మనకు ఉన్నాయి. వైద్య సేవలు ఎలా అందించాలో ఈ పాఠంలో చర్చిద్దాం.


### ఆరోగ్య సేవలు

కాకినాడలో కిరణ్, సరితలు ఒకే తరగతిలో చదువుతున్నారు. వాళ్లు మంచి మిత్రులు. సరిత సంపన్నుల కుటుంబం నుండి వచ్చింది. కిరణ్ తల్లిదండ్రులు కుటుంబాన్ని నడపటానికి ఎంతో కష్టపడుతుంటారు. వానాకాలం అప్పుడే ముగిసింది. ఊళ్లో అంతటా విషజ్వరాలు (వైరల్) వ్యాపించాయి. ఇద్దరూ ఒకే సమయంలో జబ్బు పడ్డారు. పాఠశాలకు తిరిగి వచ్చిన తరవాత వాళ్లు తమ అనుభవాలు పంచుకున్నారు.

సరితకు జబ్బుచేసిన వెంటనే వాళ్ల ఇంటి దగ్గర ఆసుపత్రికి వాళ్ల నాన్న తీసుకెళ్లాడు. సరిత వాళ్ల నాన్న 100 రూపాయలు కట్టి పేరు నమోదు చేయించాడు. వాళ్లకు ఒక కార్డు ఇచ్చి వేచి ఉండమన్నారు. కొంచెం సేపటికి ఒక డాక్టరు వచ్చి రక్త పరీక్షలు, ఛాతీ ఎక్స్‌రే చేయించమని చెప్పాడు. ఆ పరీక్షలు చేసే చోటుకు వాళ్లు వెళ్లారు. అన్ని చోట్లా చాలా తేలికగా, చాలా తొందరగా పనులు జరిగి పోయాయి. అందరూ వాళ్లతో ఎంతో మర్యాదగా ప్రవర్తించి ఏ ఇబ్బందీ లేకుండా చూశారు. పరీక్షలు చేయించుకుని డాక్టరు దగ్గరకు తిరిగి వెళ్లిన వాళ్లకు కొన్ని మందులు రాసిచ్చి పరీక్షల రిపోర్టులతో మరునాడు మళ్లీ రమ్మన్నాడు. మరునాడు డాక్టరు పరీక్షల రిపోర్టులను పరిశీలించి, అంతా బాగానే ఉందన్నాడు. సరితకు వైరల్ ఇన్‌ఫెక్షన్ సోకిందనీ, ఆందోళన పడవలసింది ఏమీ లేదని అతడు



చెప్పాడు. తరవాత చాలా మందులు రాసిచ్చాడు. మందులు వాడిన తరవాత ఆమెకు బాగా అనిపించసాగి బడికి రావటం మొదలుపెట్టింది.



కిరణ్‌కు కూడా జ్వరం, ఒళ్లు నొప్పులు ఉన్నాయి. అతని తండ్రి పనిమానుకోలేక ఆసుపత్రికి తీసుకెళ్లలేక పోయాడు. రెండు రోజుల తరవాత కిరణ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ఆ రోజు వాళ్లు చాలా ముందుగానే వెళ్లారు కానీ అప్పటికే చాలామంది వరుసలో వేచి ఉన్నారు. కిరణ్‌కు చాలా నీరసంగా ఉండి నిలబడే ఓపిక కూడా లేదు. కానీ ఏం చేస్తాడు? మూడు గంటల తరవాత వాళ్ల వంతు వచ్చి డాక్టరు అతడిని చూశాడు. రక్త పరీక్ష చేయించుకోమని డాక్టరు చెప్పాడు. ఆ పరీక్ష చేయించుకోటానికి మరో రెండు గంటలు పట్టింది. పరీక్ష నివేదిక కోసం మరుసటి రోజు రమ్మన్నారు. ఆ రోజు కూడా డాక్టరు చూడటానికి చాలా సమయం పట్టింది. ఈ పరీక్ష నివేదికను చూసిన డాక్టరు ఊళ్లో చాలామందికి మాదిరిగానే కిరణ్‌కు కూడా వైరల్ జ్వరం వచ్చిందని చెప్పాడు. జ్వరానికి కొన్ని మందులు రాసిచ్చి కిరణ్‌ను చాలా ద్రవాలు (Fluids) తాగమని, బాగా విశ్రాంతి తీసుకొమ్మని చెప్పాడు. జ్వరం తగ్గి కిరణ్ బడికి వచ్చాడు.

వైద్యం కోసం కిరణ్ అన్ని ఇబ్బందులు పడాల్సి రావటం సరితకు బాధ కలిగించింది. పనులు చాలా తేలికగా, తొందరగా అయిపోయిన ఆధునిక, ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగలగటం తన అదృష్టంగా భావించింది.

ఆమె వైద్యానికి ఎంత ఖర్చు అయ్యింది అన్న ప్రశ్నకు సరిత మందులు, ఆసుపత్రి రుసుము కలిపి 3500 రూపాయలు అని చెప్పింది. "మాకు వంద రూపాయలే ఖర్చయ్యింది," అన్నాడు కిరణ్.

- సరిత అంత డబ్బు ఎందుకు ఖర్చు పెట్టాల్సి వచ్చింది? కారణాలు ఇవ్వండి.
- ప్రభుత్వ ఆసుపత్రిలో కిరణ్ ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నాడు? ఆ ఆసుపత్రి ఇంకా మెరుగ్గా ఎలా పనిచేయవచ్చు? చర్చించండి.
- ప్రైవేటు ఆసుపత్రులలో ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటాం? తరగతిలో చర్చించండి.
- మీకు జబ్బు చేసినప్పుడు మీరు ఎక్కడికి వెళతారు? మీరు ఎదుర్కొనే సమస్యలు ఏమైనా ఉన్నాయా? మీ అనుభవం ఆధారంగా ఒక పేరా రాయండి.

పైన ఇచ్చిన కథనాలను బట్టి ఆరోగ్య సదుపాయాలను అ) ప్రజా ఆరోగ్య సేవలు, ఆ) ప్రైవేటు ఆరోగ్య సేవలు అంటూ ప్రధానంగా రెండుగా విభజించ వచ్చని మీకు అర్థమయ్యి ఉంటుంది.

## ప్రజా ఆరోగ్య సేవలు

ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులతో కూడిన ప్రజా ఆరోగ్య సేవలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సాధారణ జబ్బులనుంచి అన్ని రకాల సమస్యలకు, అందరికీ ప్రత్యేక సేవలను ప్రభుత్వం అందిస్తోంది. గ్రామస్థాయిలో ఒక 'ఆశ' (ASHA– Accredated Social Health Activist) కార్యకర్త ఉంటారు. ప్రజలకు వైద్య సదుపాయాలు అందటంలో అతడు/ ఆమె సహాయం చేస్తారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు పోషకాహారంతోపాటు టీకాలు కూడా అందిస్తారు. పిల్లల బరువు తూస్తూ వయసుకు తగిన బరువుతో వాళ్లు పెరుగుతున్నారో లేదో చూస్తారు. మన రాష్ట్రంలో ప్రతి 5000 మందికి ఒక ఆరోగ్య ఉపకేంద్రం




చిత్రం 9.1 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అందుబాటులో ఉంది. గ్రామీణ ప్రాంతాలలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఆవాసాలు ఒక ఉపకేంద్రం కింద ఉంటాయి. ఈ కేంద్రంలో బహుళ ఉద్దేశ ఆరోగ్యసహాయకులు (మల్టిపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌లు-ఎంపిహెచ్‌ఎలు) (స్త్రీ, పు) ఉంటారు. సాధారణ రోగాలతో వ్యవహరించటంలో, చిన్న పిల్లలకు టీకాలు వేయటంలో, గర్భవతుల సంరక్షణలో, విరేచనాలు, మలేరియా వంటివి నివారించటంలో వాళ్లు శిక్షణ పొంది ఉంటారు. ఈ ఉపకేంద్రాలు మండలస్థాయిలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సిల) ఆధ్వర్యంలో పని చేస్తాయి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింద 30,000 జనాభా (సుమారుగా 5 ఉపకేంద్ర ప్రాంతాలు) ఉంటుంది. ప్రతి 4-5 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఒక ప్రజా ఆరోగ్య కేంద్రం ఉంటుంది. ఇది 30 పడకల ఆసుపత్రి, ఇక్కడ కొంతమంది ప్రత్యేక వైద్య నిపుణులు ఉంటారు. ఇక్కడ కొన్ని ఆపరేషన్లు కూడా చేస్తారు. డివిజన్ స్థాయిలో 100 పడకలతో ప్రాంతీయ ఆసుపత్రి ఉంటుంది. జిల్లా స్థాయిలో జిల్లా ఆసుపత్రి ఉంటుంది. పెద్ద పట్టణాలలో ప్రభుత్వ ఆసుపత్రులు చాలా ఉంటాయి. అటువంటి వాటిల్లో ఒకదానికే కిరణ్ వెళ్లాడు.

దీనిని 'ప్రజా' ఆరోగ్యసేవలు అనటానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. పౌరులందరికీ వైద్యసేవలు అందించాలన్న తన లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఆరోగ్యకేంద్రాలు, ఆసుపత్రులను నెలకొల్పింది. ఈ సేవల నిర్వహణకు అవసరమైన నిధులు మనం (ప్రజలు) ప్రభుత్వానికి చెల్లించే పన్నులనుండి వస్తున్నాయి. ప్రజా ఆరోగ్య వ్యవస్థ ముఖ్య ఉద్దేశాలలో ఒకటి పేదలు కూడా వైద్యం పొందేలా తక్కువ ఖర్చుకు లేదా ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలు అందించటం. క్షయ, మలేరియా, కామెర్లు, కలరా, విరేచనాలు, చికున్‌గున్యా వంటి వ్యాధులను, వాటి వ్యాప్తిని నివారించటం ప్రజా ఆరోగ్య వ్యవస్థ మరొక ముఖ్య ఉద్దేశం. ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం దీనిని నిర్వహించాలి, లేకపోతే అది సమర్థవంతంగా పని చేయదు. ఉదాహరణకు వాటర్ కూలర్లలో ఇంటి పై కప్పుపై, నీరు నిలబడే ప్రాంతాలలో దోమలు వృద్ధి చెందకుండా ప్రజల్ని చైతన్య పరచాలి. గ్రామాలలో అందరిని భాగస్వాముల్ని చేసి నీటి కుళాయిలు/ చేతి పంపుల దగ్గర నీళ్లు నిలబడి దోమలు వృద్ధికాకుండా చూడాలి.



*చిత్రం 9.2 : ఆసుపత్రిలో ఒక వార్డు*

- ప్రజా ఆరోగ్య వ్యవస్థ కింద ప్రతి గ్రామంలో ఏమేమి అందుబాటులో ఉండాలి?
- మీకు దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల జాబితా రాయండి. (వీటిల్లో ఏదో ఒకదానికి వెళ్లి) మీ అనుభవంలో అక్కడ లభ్యమయ్యే సదుపాయాలు, దానిని నిర్వహించే వాళ్ల గురించి రాయండి.

## ప్రైవేటు ఆరోగ్య సేవలు

మన దేశంలో ప్రైవేటు రంగంలో అనేక రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో నమోదు చేసుకున్న వైద్య సేవకులు (ఆర్ఎంపిలు) ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నాటువైద్యులు కూడా ఉన్నారు. పట్టణ ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో డాక్టర్లు ఉన్నారు. వాళ్లలో చాలామంది తమ ప్రైవేటు ఆసుపత్రులలో ప్రత్యేక సేవలు అందిస్తున్నారు. రక్తం, మల, మూత్రాల పరీక్షలు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ వంటి ప్రత్యేక పరీక్షలు చేసే అనేక ప్రైవేటు పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం అనేక పెద్ద పెద్ద కంపెనీలు ఆసుపత్రులతోపాటు మందుల తయారీ, అమ్మకాలను కూడా చేపడుతున్నాయి. దేశంలో అన్నిచోట్లా మందుల దుకాణాలు ఉన్నాయి.

పేరు సూచిస్తున్నట్లుగానే ప్రైవేటు ఆరోగ్యసేవలు ప్రభుత్వానికి చెందినవి కావు, ప్రభుత్వ నియంత్రణలో ఉండవు. ప్రజా వైద్యసేవలలో మాదిరి కాకుండా ఇక్కడకు వెళ్లే రోగులు ప్రతీ సేవకు పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించాలి. ప్రైవేటు సదుపాయాలను లాభాలకోసం నడుపుతారు. కాబట్టి ప్రతిదానికీ (ఉదాహరణకు మందులు, పరీక్షలకు) వాస్తవంగా అంత ఖర్చు కాకపోయినప్పటికీ పెద్ద మొత్తంలో రుసుములు వసూలు చేస్తారు.

- ప్రైవేటు ఆరోగ్య సేవలు అంటే అనేకం ఉండవచ్చు. మీ ప్రాంతంలో ఉన్న కొన్నిటిని ఉదాహరణలతో వివరించండి.
- గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు నాటువైద్యుల దగ్గరకు, వాళ్లకు సరైన వైద్యంరాదని తెలిసీ, ఎందుకు వెళుతుంటారు? మీ చర్చలో ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోండి – శిక్షణ పొందిన డాక్టర్లు పల్లెల్లో లేరు. ప్రజలకు ఇంజెక్షన్‌లపై నమ్మకం ఉంది. నాటు వైద్యులకు డబ్బులు తర్వాత కూడా ఇవ్వవచ్చు. వాళ్లకు ధాన్యం, కోడి వంటి వాటి రూపంలో చెల్లింపులు చెల్లించవచ్చు.

## ఆరోగ్య బీమా

దీర్ఘకాలిక వ్యాధులచే ఇబ్బందిపడే ప్రజలకు వైద్యం అత్యంత ఖర్చుతో కూడుకుంది. వీరు 'ఆరోగ్య బీమా' కలిగి ఉన్నట్లయితే వాని ద్వారా నాణ్యమైన వైద్య సేవలను పొందవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వం, ప్రైవేటు బీమా సంస్థలు జారీ చేసిన అనేక బీమా సదుపాయాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

## వైద్య సేవలు, సమానత్వం

భారతదేశంలో ప్రైవేటు సేవలు విస్తరిస్తుండగా, ప్రజా వైద్యసేవలు విస్తరించటం లేదు. ప్రైవేటు సేవలు ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్నాయి. ఇవి లాభాల కోసం నడుస్తాయి కాబట్టి వీటి ఖర్చులు ఎక్కువ.

కాని ప్రస్తుతం ప్రజాసేవలో '108', '104' సేవల వల్ల పరిస్థితి కొంత వరకు మెరుగైంది. 108 వాహన సేవలు అత్యవసర సమయాల్లో ఫోన్ చేయగానే చేరుకొని ప్రథమ చికిత్స అందించడమేకాక బాధితుల (రోగుల)ను తదుపరి వైద్య సేవల నిమిత్తం దగ్గరలోని ఆసుపత్రికి చేరుస్తుంది. 104 వాహనంలో ఆరోగ్య సిబ్బంది మందులతో సహా ప్రతి గ్రామానికి నెలనెలా వెళ్లి ఆరోగ్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేస్తున్నారు.

L59VED

వాస్తవం ఏమిటంటే దేశ జనాభాలో 20 శాతం మంది మాత్రమే వాళ్లు జబ్బుపడినప్పుడు అవసరమైన మందులు కొనగల స్థితిలో ఉన్నారు. పేదలు కాని వాళ్లు కూడా వైద్య ఖర్చుల వల్ల కష్టాల పాలవుతున్నారు. ఏదైనా జబ్బు, లేదా గాయం కారణంగా ఆసుపత్రిలో చేరినవాళ్లలో 40 శాతం మంది వైద్య ఖర్చులు భరించటానికి తమకున్నదాంట్లో ఎంతో కొంత అమ్ముకోవాల్సి వస్తోంది, లేదా అప్పు చేయాల్సి వస్తోందని ఒక అధ్యయనంలో వెల్లడయ్యింది.

కుటుంబంలో ఏ ఒక్కరు అనారోగ్యంపాలైనా పేదలు ఆందోళనకు గురవుతారు. విషాదం ఏమిటంటే ఇటువంటి పరిస్థితి మళ్లీ, మళ్లీ ఎదురవుతూ ఉంటుంది. తాగునీళ్లు, సరైన గృహవసతి, శుభ్రమైన పరిసరాలు వంటి మౌలిక సదుపాయాలు పేదలకు అందుబాటులో లేని కారణంగా రోగాలబారిన పడే అవకాశాలు ఎక్కువ.

ఈ కుటుంబాలు తినవలసినంత ఆహారం తినకపోవటం వల్ల పోషకాహార లోపానికి గురి అవుతున్నాయి. రోగాలకు అయ్యే ఖర్చు వల్ల వాళ్ల పరిస్థితి మరింత దిగజారుతుంది, లేదా ఉన్న ఆస్తులను అమ్ముకోవలసి వస్తోంది. జబ్బుపడిన మనిషిని ఆసుపత్రికి తీసుకెళ్లటమంటే ఆ రోజుకి మరొక వ్యక్తి కూలీ కోల్పోవటమే అవుతుంది, ఆసుపత్రిలో చేర్పించాల్సి వస్తే ఎన్నో రోజుల కూలీ నష్టపోతారు.

## మౌలిక ప్రజా సౌకర్యాలు

జీవనానికి, మంచి ఆరోగ్యానికి నీళ్లు తప్పని సరి. మన రోజువారీ అవసరాలకు నీళ్లు కావాలి. రక్షిత మంచి నీటిద్వారా అనేక రోగాలను నివారించవచ్చు. నీళ్ల వల్ల వ్యాపించే విరేచనాలు, కలరా వంటి రోగాలు భారతదేశంలో చాలా ఎక్కువగా ఉన్నాయి. మన దేశంలో ప్రతిరోజూ నీటి సంబంధిత వ్యాధుల కారణంగా 1600 మంది చనిపోతూ ఉంటే, అందులో చాలామంది 5 సంవత్సరాల లోపు పిల్లలే. ప్రజలకు రక్షిత మంచినీరు అందుబాటులో ఉంటే ఇలాంటి మరణాలు నివారించవచ్చు.

నీటి లాగానే ప్రతి ఒక్కరికి అందించాల్సిన ఇతర మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఆరోగ్యసేవలు, పారిశుద్ధ్యం, విద్యుత్తు, ప్రజా రవాణా, పాఠశాలలు కూడా ఈ జాబితాలోకి వస్తాయి. వీటిని ప్రజా సదుపాయాలు అంటారు.

ప్రజా సదుపాయాల ముఖ్య లక్షణం ఏమిటంటే ఒకసారి దానిని కల్పిస్తే దాని ప్రయోజనాలను ఎంతోమంది పొందవచ్చు. ఉదాహరణకు ఒక బడి స్థాపిస్తే ఎంతోమంది పిల్లలు అందులో చదువుకోవచ్చు. అదేవిధంగా ఒక ప్రాంతానికి విద్యుత్తుతో సౌకర్యం

కల్పిస్తే ఎంతోమందికి ఉపయోగకరంగా ఉంటుంది: రైతులు తమ పొలాలకు సాగునీరు అందించటానకి పంపులు వాడుకోవచ్చు, విద్యుత్తుతో నడిచే చిన్న చిన్న వర్క్‌షాపులు నడపవచ్చు, యంత్రాలు నడపటానికి కర్మాగారాలకు విద్యుత్తు కావాలి, విద్యార్థులు చదువుకోటం తేలిక, ఇంకా చాలా మంది ఏదో ఒక రకంగా ప్రయోజనం పొందుతుంటారు.

## ప్రభుత్వ పాత్ర

ప్రజా సదుపాయాలు చాలా ముఖ్యమైనవి కాబట్టి వాటిని ప్రజలకు అందించే బాధ్యత ఎవరో ఒకరు చేపట్టాలి. అది ప్రభుత్వమే అవుతుంది. ఈ ప్రజా సౌకర్యాలన్నీ ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చూడటం ప్రభుత్వ ముఖ్యమైన కర్తవ్యాలలో ఒకటి. ఈ బాధ్యతను ప్రభుత్వమే ఎందుకు చేపట్టాలో అర్థం చేసుకోటానికి ప్రయత్నిద్దాం.

ప్రైవేటు కంపెనీలు మార్కెట్టులో లాభాలకోసం పనిచేస్తాయని తెలుసుకున్నాం.. అనేక ప్రజా సదుపాయాల కల్పనలో ఎటువంటి లాభాలు ఉండవు. ఉదాహరణకు మురుగుకాల్వలు శుభ్రం చేయటంలో, మలేరియా వ్యతిరేక ప్రచారం నిర్వహించటంలో ప్రైవేటు కంపెనీలకు ఏం లాభాలు ఉంటాయి? ఇటువంటి పనులు చేపట్టటానికి ప్రైవేటు కంపెనీలు సుముఖత చూపించక పోవచ్చు. పాఠశాలలు, ఆసుపత్రులు వంటి ఇతర ప్రజా సదుపాయాల కల్పనలో ప్రైవేటు కంపెనీలకు ఆసక్తి ఉండవచ్చు. ఇటువంటివి, ప్రత్యేకించి పెద్ద పట్టణాలలో చాలా కనపడతాయి. అదేవిధంగా మీరు పట్టణాల్లో నివసిస్తుంటే బాటిళ్లలో మంచినీళ్లు సరఫరా చేస్తున్న ప్రైవేటు కంపెనీలను చూసి ఉండవచ్చు. ఇటువంటి సందర్భాలలో ప్రైవేటు కంపెనీలు అందించే సదుపాయాల ధరలు కొంతమంది మాత్రమే భరించగలిగేటట్లు ఉంటాయి. ఈ సౌకర్యాల ధరలు భరించలేని చాలామంది గౌరవప్రదమైన జీవితం నుంచి వంచితులు అవుతుంటారు. అందరికీ సమాన అవకాశాలు, గౌరవప్రద జీవన హక్కును కల్పిస్తామన్న రాజ్యాంగ హామీకి ఇది విరుద్ధంగా ఉంటుంది.

ప్రజా సదుపాయాలు ప్రజల మౌలిక అవసరాలకు సంబంధించినవి. ప్రజల అవసరాలు తీరేలా ఈ సదుపాయాలు కల్పించటం ప్రతి సమాజానికి అవసరం. జీవించే హక్కు రాజ్యాంగం అందరికీ కల్పిస్తోంది. కాబట్టి మౌలిక సదుపాయాలు అందరికీ కల్పించే బాధ్యతను ప్రభుత్వం చేపట్టాలి. సైనిక అవసరాలపై ఖర్చుపెడుతున్న దానితో పోలిస్తే ఆరోగ్యంపై ప్రభుత్వం పెడుతున్న ఖర్చు చాలా తక్కువ. వైద్య సదుపాయాల కోసం ప్రజలు సొంతంగా పెద్ద మొత్తాలు ఖర్చు చేయాల్సిన దేశాలలో భారతదేశం ఒకటి. తీర్చలేని అప్పుల ఊబిలో ప్రజలు కూరుకుపోవటానికి వైద్య ఖర్చులు కూడా ఒక కారణం.

- ఈ పాఠంలో వారు ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలకు, ప్రజల ఆరోగ్యానికి మధ్య సంబంధాలను సూచించే వాక్యాల కింద గీత గీయండి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ వైద్య సదుపాయాల కల్పనకు బాధ్యత వహిస్తున్నాయి. పక్కపేజిలో ఇచ్చిన చార్టు ద్వారా కేంద్ర ప్రభుత్వ సంస్థల పనితీరును అర్థం చేసుకోవచ్చు.

## ఆంధ్రప్రదేశ్‌లో పౌష్టికాహార పరిస్థితి

ఆరోగ్యకరమైన జీవనానికి సరిపోయేటంత ఆహారం, రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం, రోగ నివారణ చర్యలు కీలకమైనవి. ఆరోగ్య సేవలంటే రోగాలు వచ్చినప్పుడు చికిత్స చేయటం మాత్రమే కాదు, ఈ మౌలిక అవసరాలను కూడా అందించాలి. మనం ఇది చేయగలుగుతున్నామా? మన పరిస్థితి ఏమిటో తెలుసుకుందాం. దేశంలో ప్రజల పోషకాహారస్థాయి చాలా తక్కువగా, ఆందోళన కలిగించే రీతిలో ఉందని ఇటీవలి కాలంలో అధ్యయనాలు సూచిస్తున్నాయి.

జనాభాలో అధిక భాగం అన్నివేళలా పోషకాహార లోపానికి గురవుతున్నారని కూడా గమనించడానికి సాధ్యం కాని స్థితిలో జీవిస్తున్నారు. అందరికీ సరిపోయేటంత ఆహార నిల్వలు ఉన్నా అందరికీ అందడం లేదు. ఈ ప్రజలకు తమ కుటుంబానికి సరిపోయేటంత ఆహారం కొనుగోలు చేసే శక్తి లేదు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన

**ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ**

- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖవారు జాతీయ స్థాయిలో ఆసుపత్రులలోను, ఔషధశాలలోను (డిస్పెన్సరి), వైద్య విద్యలోను వ్యాధినిరోధక కార్యక్రమాలు చేపడుతున్నారు.
- ఆయుష్ శాఖా వారు స్థానిక వైద్యమైన, ఆయుర్వేద, హోమియోపతి, సిద్ధ, యునాని, మొదలైన వాటిపై పరిశోధనలు చేస్తున్నారు.
- ఆరోగ్య-పరిశోధన శాఖ వారు ఆరోగ్య సంబంధ కార్యక్రమాలు, ఔషధాలపై పరిశోధనలు చేస్తున్నారు.
- ఎయిడ్స్ నియంత్రణా శాఖ వారు ఎయిడ్స్, హెచ్.ఐ.వి. నియంత్రణకై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పోషకాహార అధ్యయనాల ద్వారా ఈ విషయం వెల్లడవుతుంది.

మనందరం ఆరోగ్యంగా ఉండటానికి, రోజువారీ పనులు చేయటానికి, రోగాలబారిన పడకుండా ఉండటానికి ప్రతి ఒక్కళ్లకీ శరీరంలో కొంత కొవ్వు పదార్థం అవసరం. పోషకాహారలోపం ఉన్నవాళ్లు/ తగినంత ఆహారం తినని వాళ్లల్లో రోజువారీ శారీరక శ్రమకు అవసరమయ్యే కొవ్వు పదార్థం వాళ్ల ఆహారం నుంచి అందటం లేదు. వాళ్లు రోగాల బారిన పడకపోవచ్చు, కాని తరచు బలహీనంగా, అలసటగా అనిపిస్తుంటుంది. రోగాల బారిన పడటానికి వీళ్లకు అవకాశాలు ఎక్కువ. ఈ పరిస్థితిని అధిగమించటానికి సరిపడా ఆహారం కావాలి కాని మందులు కాదు. ఇది కనపడని ఆకలి వంటిది. వాళ్లకి తినటానికి ఆహారం దొరుకుతుంది కానీ సరిపడేటంత దొరకదు కాబట్టి దీనిని కనపడని ఆకలి అంటారు. పేజి 196 లోని కృత్యం బాక్స్‌లో ఇవ్వబడిన శరీర పదార్థ సూచిక (BMI) ను చదవండి.

*ఆంధ్రప్రదేశ్ మానవ అభివృద్ధి నివేదిక 2007 ఆధారంగా మన రాష్ట్రంలో పరిస్థితి ఏమిటో తెలుసుకుందాం. "ఆకలి, పోషకాహారలోపం నుంచి స్వేచ్ఛ అన్నది ప్రాథమిక హక్కులలో ఒకటి. మానవ జాతి పురోభివృద్ధికి ఇది ఎంతో అవసరం. మెరుగైన పోషకాహారం ఉంటే రోగనిరోధక శక్తి బాగా ఉంటుంది, రోగాలు తక్కువగా ఉండి, ఆరోగ్యం బాగా ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాలలో అయిదేళ్లలోపు పిల్లల్లో అంటువ్యాధుల కారణంగా మరణాలలో రెండింట ప్రతి ఒకదానికి (53 శాతానికి) పోషకాహారలోపమే కారణం. ఆంధ్రప్రదేశ్‌లో అయిదు సంవత్సరాల లోపు పిల్లల్లో వయస్సుకు తగ్గ బరువులేని వాళు 33 శాతం ఉన్నారు... 31 శాతం మహిళలు, 25 శాతం పురుషులు పోషకాహారలోపానికి గురవుతున్నారు," అని ఈ నివేదిక పేర్కొంటోంది.*

L5BH47

**ఏం చేయవచ్చు?**

**(నలుగురు లేదా ఐదుగురు విద్యార్థులతో కూడిన చిన్న బృందాలలో పనిచేయాలి. ప్రతి బృందం తాము తెలుసుకున్న దాని ఆధారంగా అందరి ఫలితాలను సమగ్రపరచాలి.)**

- మీ ఊరు లేదా పట్టణంలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాల గురించి క్లుప్తంగా రాయండి. మీ చుట్టుపక్కల ఉంటున్న వాళ్లు ప్రభుత్వ/ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లినప్పుడు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు?
- ప్రజా, ప్రైవేటు వైద్య సేవలలో అనేకం పట్టణాలలో ఉన్నాయి. 2003లో ఎంపిక చేసిన ప్రాంతాలలో చేపట్టిన నమూనా సర్వే ఆధారంగా అర్హులైన ప్రైవేటు డాక్టర్లలో ఎక్కువమంది (73 శాతం) పట్టణాలలో ఉంటున్నారని వెల్లడయ్యింది. కొంతమంది డాక్టర్లను గ్రామీణ ప్రాంతాల్లో నియమించినప్పటికీ ఉద్యోగాలకు సరిగా వెళ్లకపోవడం వల్ల వాళ్ల అందుబాటు నామమాత్రంగానే ఉంది. ఈ పరిస్థితికి కారణాలను చర్చించండి. ఈ సమస్య గురించి మీ ప్రాంతంలో పెద్దవాళ్లతో మాట్లాడండి, దీనిని ఎలా పరిష్కరించవచ్చో చర్చించండి.
- మీ ప్రాంతంలో చిన్న పిల్లలకు టీకాలపై (రెండు సంవత్సరాలలోపు పిల్లలున్న కనీసం 5 కుటుంబాలలో) దిగువ ఇచ్చిన ప్రశ్నావళి ఆధారంగా ఒక చిన్న సర్వే చేపట్టండి.

అ. మీ పిల్లలకు టీకా కార్డు ఉందా?

ఆ. మీ పిల్లలకు ఎడమ చెయ్యిపై మచ్చ మిగిలే టీకా వేశారా? (వీలైతే మీరు స్వయంగా చూడండి.)

ఇ. నడుము కింద మీ పిల్లలకు టీకా వేశారా?

ఈ. మీ పిల్లలకు పోలియో చుక్కలు వేశారా? ఎన్ని సార్లు?

ఉ. తొమ్మిది నెలలప్పుడు మీ పిల్లలకు తొడ మీద టీకాతోపాటు ఒక చెంచా మందు ఇచ్చారా?

ఊ మీ పిల్లలకు 18 నెలలప్పుడు (పిల్లలకు ఆ వయసు ఉంటే) ఏమైనా టీకా వేశారా? వాళ్లకి ఆ సమయంలో తాగటానికి కూడా ఏమైనా మందు ఇచ్చారా?

ప్రతి ప్రశ్నకు అవును/ కాదు (వర్తించే చోట) అని నింపి ఎన్ని డోసులో రాయండి. తెలియదు/ వర్తించదు వంటి సమాధానాలతో నింపండి (ఉదాహరణకు 'ఊ' అన్న ప్రశ్నకు బిడ్డ వయసు ఒక సంవత్సరం అయితే సమాధానం వర్తించదు అవుతుంది). మీ ఫలితాలను చర్చించండి.

**గమనిక:**

*క్షయ నివారణకు బిసిజి టీకా ఎడమ చెయ్యిమీద వేస్తారు, దీనివల్ల ఒక మచ్చ పడుతుంది. డిపిటి (మూడు రోగాల నివారణకు) నడుముకిందగానీ, తొడమీదగానీ వేస్తారు, దానితోపాటు నోటిలో రెండు పోలియో చుక్కలు వేస్తారు. సాధారణంగా దీనిని 1½ , 2½, 3½ నెలలప్పుడు ఇస్తారు, ఆ తర్వాత కూడా ఇవ్వచ్చు.*

*అమ్మవారికి (మీజిల్స్‌కి) టీకా తొమ్మిది నెలలప్పుడు తొడమీద వేస్తారు, అదే సమయంలో 1 మి.లీ విటమిన్-ఎ నోట్లో వేస్తారు.*

*18 నెలలప్పుడు డిపిటి బూస్టర్ డోసు, ఒపివి ఇస్తారు. దానితోపాటు మరొక డోసు విటమిన్-ఎ ఇస్తారు (ఈసారి ఒక మి.లీ కాకుండా 2 మి.లీ ఇస్తారు).*

- తెల్లకార్డు ఉన్న కుటుంబాలకు ఆరోగ్య బీమా పథకంగా ఆరోగ్యశ్రీని మొదలుపెట్టారు. ఆసుపత్రిలో చేరాల్సిన వైద్యానికి అయ్యే ఖర్చులను దీని కింద చెల్లిస్తారు. ఈ పథకం కింద అనేక రకాల రోగాలకు వైద్యం చేయించుకోవచ్చు, చాలా ప్రైవేటు ఆసుపత్రులలో కూడా ఈ సౌకర్యాన్ని పొందవచ్చు. మీ చుట్టుపక్కల వాళ్లతో మాట్లాడి ఈ పథకం ఎంత బాగా పని చేస్తోందో రాయండి.
- మీ బడిలో పెట్టే మధ్యాహ్న భోజనంలో చెయ్యదగిన ముఖ్యమైన మార్పు ఏమిటి?
- గర్భధారణలో సమస్యల వల్ల ప్రతి సంవత్సరం భారతదేశంలో లక్షమంది మహిళలు చనిపోతున్నారు. తల్లి ఆరోగ్యం, పోషకాహారస్థాయి సరిగా ఉండకపోవటం, కాన్పు సమయంలో సరైన సేవలు అందించకపోవటం వల్ల శిశు మరణాలు అధికంగా సంభవిస్తున్నాయి. పై పరిస్థితిలో 104, 108 సేవలు ఏమైనా మార్పులు తెచ్చాయా? చర్చించండి.

## కీలక పదాలు

| | | |
|---|---|---|
| 1. ప్రజా ఆరోగ్య సేవలు | 2. ప్రాంతీయ ఆసుపత్రి | 3. ప్రజాసదుపాయాలు |
| 4. పోషకాహారం | 5. ఆరోగ్యశ్రీ పథకం | |

L5IRG1

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. తప్పు వాక్యాలను సరిచేయండి: $AS_1$

   అ. గ్రామీణ ప్రాంతాలలో చాలా వాటిల్లో అర్హులైన డాక్టర్లు ఉన్నారు.

   ఆ. ప్రభుత్వ ఆసుపత్రులలో కంటే ప్రైవేటు ఆసుపత్రులలో ఎక్కువ సేవలు అందుబాటులో ఉన్నాయి.

   ఇ. ఆరోగ్య స్థితిని మెరుగుపరచటంలో పోషకాహారం దోహదం చేస్తుంది.

   ఈ. డబ్బులు సంపాదించటానికి కొంతమంది డాక్టర్లు అనవసరమైన చికిత్సలు చేయవచ్చు.

2 జయమ్మ ఈ కింది వాటిని ఉపయోగిస్తుంది. వీటిల్లో ఏవి మౌలిక ప్రజా సదుపాయాల కిందకు వస్తాయి: $AS_1$

   అ. బడికి స్కూటరు వేసుకుని వెళుతుంది.

   ఆ. అంగన్‌వాడికి తన బిడ్డను పంపుతుంది.

   ఇ. ఇంట్లో టివి ఉంది.

   ఈ. ఆమెకు మొబైల్ ఫోన్ ఉంది. ఉ. పోస్టాఫీసు ద్వారా ఉత్తరం పంపిస్తుంది.

3. ఈ పాఠంలో ప్రజా ఆరోగ్యంలో ప్రభుత్వ పాత్ర గురించి చర్చించే వాక్యాలను గుర్తించండి. $AS_3$

4. ఈ పాఠంలో కింద వాటిల్లో ఏవి ప్రజా ఆరోగ్యాన్ని మెరుగుపరిచే చర్యలుగా భావిస్తున్నారో, ఏవి అటువంటి చర్యలు కాదని భావిస్తున్నారో రాయండి. మీ సమాధానానికి కారణాలు రాయండి. $AS_1$

   అ. క్షయ రోగులకు ఉచితంగా మందులు ఇస్తారు.

   ఆ. కొన్ని గ్రామాలలో రక్షిత మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు.

ఇ. జలుబు, జ్వరం, వంటినొప్పులు వంటి వాటికి దుకాణదారులు మందులు అమ్ముతున్నారు.

ఈ. చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం ఆహార ధాన్యాలను అందిస్తోంది.


5. ప్రియంవద ఒక ప్రైవేటు ఆసుపత్రి నడుపుతోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో కంటే ఇక్కడ ఎక్కువ సౌకర్యాలు ఉన్నాయి. మండల ప్రభుత్వ ఆసుపత్రిలో సత్యనారాయణ డాక్టరుగా పని చేస్తున్నాడు. వాళ్లిద్దరి మధ్య వైద్య సేవలు ప్రజలకు అందటంపై జరిగే చర్చను ఊహించి రాయండి. $AS_4$

6. మందులు మాత్రమే ఇవ్వటం వల్ల ఆరోగ్యం సమకూరదు. ఈ అధ్యాయంలో ఆరోగ్యానికి సంబంధించి ఇతర అంశాలు (ఉదా: శుభ్రమైన తాగునీరు వంటివి) పేర్కొన్నారు. వాటన్నిటిని ఒకచోటకు తెచ్చి వాటి గురించి వ్యాఖ్యానించండి. $AS_2$

7. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు వైద్యంపై పెట్టే ఖర్చులను కింది చిత్రం వివరిస్తుంది. పేదరికంలో ఉన్నవారిలో 65 శాతం దాకా ప్రజలు అప్పు చేయవలసి వస్తోంది. చిత్రంలో దీనికి రంగు వేయబడిన బాగాన్ని గుర్తించి, శాతాన్ని కూడా గుర్తించండి. పేదరికానికి ఎగువన ఉన్నవారిలో ఆసుపత్రి ఖర్చులో 45 శాతం వరకు తమ పొదుపులోంచి భరిస్తున్నారు. దీనిని కూడా పటంలో గుర్తించండి. పేదరికానికి ఎగువన ఉన్న వారిలో 35 శాతం మంది మాత్రమే అప్పు చేయాల్సి వస్తోంది. దీనిని, ఆ శాతాన్ని పటంలో గుర్తించండి.

కింద చూపించిన పట్టికల ఆధారంగా ఆసుపత్రి ఖర్చులు ఏ విధంగా సమకూర్చుకుంటున్నారో, అందులో సుమారుగా ఎంత శాతం ప్రజలు ఉన్నారో చెప్పండి. $AS_3$

**ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికస్థాయి బట్టి ఆసుపత్రి ఖర్చులను సమకూర్చుకునే మార్గాలు**




8. మీ ప్రాంతంలో ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై సర్వేచేసి లబ్ధి పొందుతున్న వారి జాబితా తయారుచేయండి. $AS_3$

9. అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవడానికి మీ ప్రాంత ఆరోగ్య కార్యకర్తను ఏయే ప్రశ్నలు అడుగుతావు? $AS_4$

10. “108 సేవలు” అత్యవసర సమయాల్లో ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తుంది? $AS_6$

పాఠం 10


# బ్రిటిష్, నిజాంల పాలనలో భూస్వాములు, కౌలుదార్లు



జమీందార్ల నుండి శిస్తు వసూలు చేసుకునే రాజు



ప్రజల నుండి శిస్తు వసూలు చేసి రాజుకు చెల్లించే జమీందారు




జమీందార్ల స్వంత భూముల్లో పనిచేస్తున్న కూలీలు




స్వంత భూమి కలిగి శిస్తు చెల్లించే రైతు

## మొఘల్ కాలంలో జమీందారులు, రైతాంగం

L5KD5U

మొఘల్ చక్రవర్తుల పాలనలో రైతాంగం నుంచి జమీందారులు శిస్తు వసూలు చేసి మొఘల్ అధికారులకు అందచేసేవారు. శిస్తు వసూలు చేసినందుకు జమీందారులకు అందులో కొంత వాటా, ఒక్కొక్కసారి స్థానికంగా చిన్న చిన్న పన్నులు వసూలు చేసే అధికారం ఇవ్వబడింది. గుర్రాలు, తుపాకులతో కూడిన చిన్నదైన సైనికుల బృందం కూడా ఉండేది. వీళ్ల ఇళ్లు చిన్న కోటల మాదిరిగా ఉండేవి. తెలంగాణలో వీటిని గడీలనేవారు. ఇక్కడి నుంచి చుట్టుపక్కల గ్రామాలను నియంత్రించేవాళ్లు. జమీందారులు శిస్తు వసూలు చేసేవాళ్లుగా రైతాంగానికీ, ప్రభుత్వానికీ మధ్య మధ్యవర్తులుగా ఉండేవాళ్లు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి తెలియచేసేవాళ్లు. అదే సమయంలో ప్రభుత్వ నిబంధనలు రైతాంగం పాటించేలా చూసేవాళ్లు.

జమీందారులకు సొంత భూమి కూడా ఉండేది, దీంట్లో కూలీలతో పని చేయించేవాళ్లు. వీటిని 'ఖుద్‌ఖాస్త్' అంటే సొంతంగా సాగు చేసుకునే భూములనేవారు. తమ భూములను వాళ్లు రైతాంగానికి ఇచ్చి పంటలో కొంత భాగం కానీ, ముందుగా నిర్ణయించిన కౌలుకి కానీ ఇచ్చేవారు. ఈ రకంగా భూమి ఉన్న వాళ్లను భూస్వాములంటారు. వీరి భూములను సాగుచేసే వాళ్లను కౌలుదార్లు అంటారు. అంటే జమీందారులకు రెండు పార్శ్వాలు ఉండేవి – ఒకటి శిస్తు వసూలు చేయటం, రెండు భూమి కలిగి ఉండటం. రైతాంగంలో రెండు రకాలు ఉండేవారు – మొదటిది సొంతంగా భూమి కలిగి ఉండి, దానిని సాగుచేస్తూ జమీందారు ద్వారా శిస్తు చెల్లించేవాళ్లు, రెండవది భూస్వాముల కింద కౌలుదార్లుగా భూమి సాగుచేసేవాళ్లు. భారతదేశ గ్రామాల్లో చాలామంది చేతివృత్తుల వాళ్లు, వివిధ సేవలను అందించే కులాల వాళ్లు ఉండేవాళ్లు. వీళ్ళు శారీరక శ్రమ, నైపుణ్యంతో కూడిన పనులు చేసేవాళ్లు. వీరిలో చాలామందిని తక్కువకులాల వాళ్లుగా, అంటరానివాళ్లుగా భావించేవాళ్లు. కొంతమందికి కొద్దిగా భూమి ఉండేది కానీ ప్రధానంగా భూస్వాములకు, రైతులకు సేవలు అందించటం ద్వారా జీవనోపాధిని పొందేవారు.

- మొఘల్ కాలంలో గ్రామాల్లోని భూములన్నీ జమీందారుల కింద ఉండేవా?
- మొఘల్ ప్రభుత్వానికి జమీందారులు ఏం చేసేవాళ్లు, దానికి ప్రతిఫలంగా వాళ్లకు ఏం లభించేది?

- జమీందారులు చిన్న కోటల్లాంటి ఇళ్లల్లో ఉంటూ, సైన్యాన్ని ఎందుకు కలిగి ఉండేవాళ్లు?
- స్వంతంగా వ్యవసాయం చేసుకుంటున్న వాళ్లకు జమీందారులు ఏవిధంగానైనా సహాయపడి ఉంటారా? మీ సమాధానానికి కారణాలు ఇవ్వండి.

### శాశ్వత శిస్తు ఒప్పందం : బ్రిటిష్ పాలకులు ప్రవేశపెట్టిన మార్పులు


భారతదేశంపై బ్రిటిష్‌వాళ్ళు ఆధిపత్యం పొందిన తరవాత యుద్ధాలకు, వాణిజ్యానికి డబ్బులు సమకూర్చుకోటానికి భూమి శిస్తును సాధ్యమైనంత వరకు పెంచాలని అనుకున్నారు. ఇటువంటి పరిస్థితులలో రైతులు భూమిని సాగు చేయలేకపోవటంతో వ్యవసాయం దెబ్బతింది. అనేక కరువుకాటకాలు సంభవించటం వల్ల వేలాది ప్రజలు చనిపోయారు. భూమి శిస్తు విధానం వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ఉండాలని బ్రిటిష్ పాలకులు గుర్తించారు. రైతాంగం సాధ్యమైనంత ఎక్కువ భూమిని సాగులోకి తేవాలని, ఇంగ్లాండ్‌కు ఎగుమతి చేయగల పత్తి, నీలిమందు, చెరుకు, గోధుమ వంటి డిమాండ్ ఉన్న వాణిజ్య పంటలు సాగుచేయాలని వాళ్లు కోరుకున్నారు. వ్యవసాయాన్ని మెరుగు పరచాలని, అందులో పెట్టుబడులను ప్రోత్సహించాలని కంపెనీ అధికారులు భావించారు. కాని దీనిని ఆచరణలోకి తేవటం ఎలా?



జమీందార్ల నుండి శిస్తు వసూలుచేసే కంపెనీ అధికారి



అధిక శిస్తు వసూలుచేసే అధికారం గల జమీందారు




పంటను పండించే, శిస్తును నిర్ణయించే జమీందారు

ఈ అంశంపై రెండు దశాబ్దాలపాటు చర్చలు జరిగిన తరవాత కార్న్‌వాలిస్ గవర్నర్ జనరల్‌గా ఉన్న సమయంలో కంపెనీ శాశ్వత శిస్తు నిర్ణయ ఒప్పందను 1793లో ప్రవేశపెట్టింది. ఈ విధానంలోని నిబంధనల ప్రకారం వేలం ద్వారా అంగీకరించిన శిస్తులను వసూలుచేసే అధికారం జమీందారులకు ఇవ్వబడింది. అందుకే దీనిని జమీందారీ పద్ధతి అని కూడా అంటారు. వసూలుచేసిన శిస్తులో 90% ప్రభుత్వానికి చెల్లించి వసూలు చేసినందుకుగాను 10% వాళ్లు ఉంచుకోవచ్చు. శిస్తు మొత్తాన్ని శాశ్వతంగా నిర్ణయించారు, అంటే భవిష్యత్తులో దానిని పెంచటానికి వీలులేదు. దీనివల్ల కంపెనీకి క్రమం తప్పకుండా ఆదాయం వస్తుందనీ, అదే సమయంలో భూములను అభివృద్ధిపరచటానికి జమీందారులు పెట్టుబడులు పెడతారని భావించారు. ప్రభుత్వానికి కట్టే శిస్తు పెరగదు కాబట్టి ఎక్కువ పంట పండితే భూస్వాములు లాభపడతారు. అయితే వేలంలో అంగీకరించిన దానికంటే ఎక్కువ శిస్తును జమీందారులు వసూలు చేయసాగారు. వాళ్లు నిరంతరం శిస్తు పెంచుతూ అందుకు సిద్ధంగా లేని సాగుదారులను తొలగిస్తూ ఉండేవాళ్లు. ఈ సెటిల్‌మెంటు వల్ల రైతాంగం కాస్తా కౌలుదారులుగా మారిపోయింది. జమీందారులు భూమిశిస్తు కాకుండా కౌలు వసూలు చేయసాగారు. శిస్తుకంటే కౌలు చాలా ఎక్కువగా ఉండటం వల్ల రైతులు ఆ మొత్తాలు చెల్లించలేక కొన్ని సందర్భాలలో భూములు వదిలి పారిపోయేవాళ్లు.




భూసారంతో సంబంధం లేకుండా అధిక శిస్తు చెల్లిస్తూ, జమీందారు కోరిక మేరకు ఉత్పత్తి చేయని పక్షంలో భూమి నుండి వైదొలగాలి.




కొన్ని సంవత్సరాల తరవాత భూమిపై సర్వాధికారాలు పొందిన జమీందారు

దీర్ఘకాలంలో జమీందారులు కూడా ప్రభుత్వానికి కట్టవలసిన శిస్తు కట్టలేక రుణగ్రస్తులై బాధలు అనుభవించారు.

- అనేక తరాలుగా భూమిని సాగు చేస్తున్న రైతు స్థితిని ఈ మార్పులు ఎలా ప్రభావితం చేశాయి?
- శిస్తుకు, కౌలుకు మధ్య తేడా ఏమిటి?
- శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం, జమీందారులు, రైతాంగాల్లో ఎవరు ఎక్కువ లాభపడ్డారు? కారణాలు పేర్కొనండి.

**ఫలితాలు:** భూమిని అభివృద్ధిపరచటానికి జమీందారులు పెట్టుబడులు పెట్టడం లేదని అనతికాలంలోనే కంపెనీ అధికారులు గుర్తించారు. శిస్తు చాలా ఎక్కువగా ఉండి జమీందారులకు రైతులు ఆ మొత్తం చెల్లించటం కష్టంగా ఉండేది. పంట నష్టపోయినప్పుడు, కరువు సమయంలో శిస్తులో ఎటువంటి మినహాయింపులు ఉండేవి కాదు. శిస్తు చెల్లించకపోతే జమీందారీని కోల్పోవలసి వచ్చేది. కంపెనీ నిర్వహించే వేలంలో వీటిని తిరిగి అమ్మేవారు. దీనివల్ల గ్రామాల్లో అస్థిరత్వం నెలకొనేది. పాత జమీందారులు వేగంగా మారుతూ వాళ్ల స్థానంలో కొత్త జమీందారులు వచ్చేవాళ్లు.

1820ల నాటికి ఈ పరిస్థితి మారింది. మార్కెట్టులో ఆహార ధాన్యాల ధరలు పెరుగుతుండటంతో సాగు మెల్లగా విస్తరించసాగింది. దీనివల్ల జమీందారులకు ఆదాయం పెరిగింది కానీ కంపెనీకి ఎటువంటి లాభం లేదు. భూమి శిస్తును శాశ్వతంగా నిర్ణయించటం వల్ల దానిని పెంచే వీలు లేకపోయింది.

అయినప్పటికీ భూమిని అభివృద్ధిపరచటంలో జమీందారులకు ఆసక్తి కలగలేదు. సెటిల్‌మెంటు తొలి సంవత్సరాలలో కొంతమంది జమీందారులు తమ భూములను కోల్పోయారు. ఇప్పుడు ఎటువంటి పెట్టుబడులు, ముప్పు లేకుండా సంపాదించటానికి లభించిన అవకాశాన్ని మరి కొంతమంది వినియోగించుకున్నారు. కౌలుదారులకు సాగు చేయటానికి భూమి ఇచ్చి, కౌలు పొందుతూ ఉన్నంతకాలం భూమిని అభివృద్ధిపరచడానికి జమీందారులు ఆసక్తి కనబరిచేవారు కాదు.

జనాభా వేగంగా పెరుగుతున్నందున జమీందారులు కౌలుదారులను తొలగించి ఎక్కువ కౌలుకు కొత్తవాళ్లకు తేలికగా ఇవ్వగలిగారు. ఇంకోవైపు గ్రామాలలో పరిస్థితులు సాగుదారులను పీల్చి పిప్పిచేసేవిగా ఉండేవి. జమీందారుకు పెద్ద మొత్తంలో కౌలు చెల్లించినప్పటికీ, భూమి అతడికిందే ఉంటుందన్న నమ్మకం ఏమీ లేదు. కౌలు చెల్లించటానికి రైతు, వడ్డీ వ్యాపారస్తుని

వద్ద అప్పు తీసుకోవాల్సి వచ్చేది. ఒకవేళ కౌలు చెల్లించలేకపోతే తరతరాలుగా సాగుచేస్తున్న భూమినుంచి తొలగించేవాళ్లు.

- బ్రిటిష ప్రభుత్వం జమీందారీ వ్యవస్థను ప్రవేశపెట్టిన ఉద్దేశాలు ఎందుకు నెరవేరలేదు?
- భూమి మీద ఎటువంటి పెట్టుబడులు పెట్టకుండా తమ ఆదాయాలను పెంచుకోవటం జమీందారులకు ఎలా సాధ్యమయ్యింది?
- బ్రిటిష పాలనను జమీందారులు సమర్థించారా, వ్యతిరేకించారా? మీ కారణాలు పేర్కొనండి.

## రైత్వారీ పద్ధతి

L5SMHN

19వ శతాబ్దం ఆరంభంనాటికి శిస్తు విధానాన్ని మరొకసారి మార్చటం తప్పనిసరి అన్న అభిప్రాయానికి చాలామంది కంపెనీ అధికారులు వచ్చారు. పరిపాలనకు, వాణిజ్యానికి అయ్యే ఖర్చులకు మరింత ఆదాయం సమకూర్చు కోవాల్సిన పరిస్థితుల్లో శిస్తుని శాశ్వతంగా నిర్ణయిస్తే ఎలా కుదురుతుంది?

బ్రిటిష్ సైనికుల నిర్వహణకు చెల్లించాల్సిన మొత్తాలను బాకీ పడినందువల్ల నిజాం రాజు బళ్లారి, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలను బ్రిటిష్‌పరం చేశాడు, వీటినే 'సీడెడ్' జిల్లాలంటారు. ఈ ప్రాంతాన్నే రాయలసీమ అంటారు. 1800 నవంబరులో ఈ జిల్లాలకు థామస్ మన్రో ప్రధాన కలెక్టరుగా నియమితుడయ్యాడు. ఆ సమయంలో సీడెడ్ జిల్లాల్లో పూర్తి అరాచకత్వం నెలకొని ఉంది. ఈ ప్రాంతం ఎనిమిది మంది పాలెగార్ల పాలనలో ఉండేది. వీరు బ్రిటిష పాలనను వ్యతిరేకిస్తూ నిరంతరం దాడులు, దోపిడీలు కొనసాగిస్తూ ఉండేవారు. ముందుగా మన్రో ఈ పాలెగార్లను లొంగదీసుకుని వాళ్ల సాయుధ అనుచరులను చెల్లాచెదురు చేశాడు. శాంతిభద్రతలను నెలకొల్పిన తరవాత మన్రో తన దృష్టిని భూమి సర్వే, శిస్తు స్థిరీకరణపై నిలిపాడు. ఉత్తర భారతదేశంలోమాదిరి దక్షిణాదిన జమీందారులు లేరని మన్రో గుర్తించాడు. అందుకు భిన్నంగా ఆంధ్ర, తమిళ ప్రాంతాలలో చిన్న చిన్న రైతాంగ సమూహాలు భూమిని కలిగి, దానిని సాగుచేస్తూ, శిస్తు చెల్లించేవి. రైతుల ప్రాముఖ్యతను గుర్తించిన అతడు 'రైత్వారీ స్థిరీకరణను' దక్షిణ, పశ్చిమ భారత దేశాలలో ప్రవేశపెట్టాడు.

రైతు అంటే భూమిని సాగు చేసేవాడు. 'రైత్వారీ' అంటే రైతులకు సాగుహక్కు ఇవ్వటం. భూమిని సొంతంగా సాగుచేసే, లేదా ఇతరులతో సాగు చేయించే భూమి వాస్తవ యజమానులు/ సాగుదారులనుంచి నేరుగా శిస్తు వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ స్థిరీకరణ కింద భూమిని సాగుచేసే రైతులను గుర్తించారు. వాళ్లు సాగుచేస్తున్న భూములను గుర్తించారు. ప్రతి భూఖండానికి సర్వే నంబరు



రైత్వారీ పద్ధతిలో నేను ఎక్కువ పంట పండించాను


స్థిరీకరించబడిన శిస్తును రైతు నుండి వసూలు చేసే కంపెనీ అధికారి



కౌలుదారులతో జమీందారు

ఇచ్చి దానికి చట్టబద్ధ యజమానులు ఎవరో నిర్ణయించారు. దిగుబడులు, ధరలు, మార్కెట్ పరిస్థితులు, సాగుచేసే పంటలు వంటివాటిని దృష్టిలో పెట్టుకుని ఎకరానికి చెల్లించాల్సిన శిస్తుని నిర్ణయించారు. 1801-02లో పంటలసాగు మొదలు కాకముందు విత్తనాలు, పరికరాలు, ఎడ్లు కొనటానికి, పాత బావులు మరమ్మతు చేయటానికి, కొత్తబావులు తవ్వటానికి రైతులకు మన్రో అప్పులు ఇప్పించాడు. రైతులకు రక్షణగా ఉండే తండ్రి స్థానంలో బ్రిటిషు ప్రభుత్వం ఉండాలని అతడు వాదించాడు. ఈ చర్యల వల్ల ఆ సంవత్సరం పంటలు బాగా పండి శిస్తు వసూళ్లు బాగా జరిగాయి. మన్రో అనుసరించిన విధానం సరయినదేనని ఇది నిరూపించింది.

### అభివృద్ధి కార్యక్రమాలు



చిత్రం : 10.1 ప్రకాశం బ్యారేజ్

భారీ నీటి సాగు పథకాలలో పెట్టుబడులు పెట్టటం ప్రభుత్వ విధి అని కొంతమంది బ్రిటిషు పరిపాలకులు భావించారు. వీటివల్ల రైతులు పొలాలను సాగుచేసి అధిక విలువైన వాణిజ్య పంటలు పండించటం వీలవుతుందని భావించారు. సర్ ఆర్థర్ కాటన్ అవిశ్రాంత కృషివల్ల 1849లో ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై ఆనకట్ట నిర్మాణం పూర్తయ్యింది. 1833లో తీవ్ర కరువుకు గురైన ఈ జిల్లాలో ఈ ఆనకట్ట వల్ల సంపద వెల్లివిరిసింది. అదేవిధంగా విజయవాడ వద్ద కృష్ణానదిపై 1854లో ఆనకట్ట కట్టారు. దీనివల్ల డెల్టాప్రాంతాలు సంపన్నమయ్యాయి. రాయల సీమలోని మెట్ట భూములకు నీళ్లు అందించటానికి 1857 తరవాత కర్నూలు-కడప (కెసి) కాలువలు నిర్మించారు. ఈ చర్యలు చెప్పుకోదగినవే అయినప్పటికీ వాటి వల్ల కొన్ని ప్రాంతాలు మాత్రమే లాభపడ్డాయి. దేశంలోని అధికశాతం భూమి ఇంకా వర్షాధారంగానే ఉంది. చిన్న చెరువులు, బావులు వంటి సాగునీటి పథకాలలో జమీందారులు, ధనిక రైతులు పెట్టుబడులు పెడతారన్న ఆశలు నెరవేరలేదు.

L5U97H

- 'శాశ్వత స్థిరీకరణ'ను ప్రవేశపెట్టినప్పుడు పెద్ద ఎత్తున భూసర్వే చేపట్టలేదు. 'రైత్వారీ స్థిరీకరణ' సమయంలో ఇది ఎందుకు అవసరమయ్యిందని మీరు భావిస్తున్నారు?
- రైత్వారీ స్థిరీకరణను ప్రవేశపెట్టేకంటే ముందు పాలెగార్లను ఎందుకు ఓడించాల్సి వచ్చింది?
- మీరు 'సీడెడ్ జిల్లాల్లో' నివసిస్తున్నట్లయితే బ్రిటిషు వాళ్లకి వ్యతిరేకంగా పోరాడిన పాలెగార్ల గురించి తెలుసుకోండి.
- బ్రిటిషు పాలన ఆరంభంలో వ్యవసాయంలో ప్రభుత్వం ఏ విధమైన పెట్టుబడులు పెట్టింది? ఈ పనిని రైతులు స్వయంగా చేయగలిగి ఉండేవాళ్లా?

- రైత్వారీ స్థిరీకరణ వల్ల రైతులు, భూస్వాములు, బ్రిటిషు పాలకులలో ఎవరు లబ్ధి పొందారు? మీ సమాధానానికి కారణాలు ఇవ్వండి.

**ఫలితం:** రైత్వారీ ప్రాంతాలలో కూడా భూమి శిస్తుని చాలా ఎక్కువగా నిర్ణయించారు. జమీందారీ ప్రాంతాలలో మాదిరి కాకుండా దీనిని 20, 30 సంవత్సరాలకు ఒకసారి నిర్ణయిస్తారు. ఈ కాలం ముగిసిన తరవాత మారిన పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకుని శిస్తును తిరిగి నిర్ణయించేవాళ్లు. భూమి శిస్తు చాలా ఎక్కువగా ఉండి మొదట్లో దానిని బలవంతంగా వసూలు చేయాల్సి వచ్చేది. అయితే కొంతకాలానికి భూమి శిస్తు కంటే ధరలు వేగంగా పెరగటంతో 'రైతులు' తమ భూములను సాగు చేయటానికి కౌలుదారులకు ఇచ్చి వారినుంచి పంట వసూలు చేయటం సైతం లాభసాటిగా ఉండేది. అనతికాలంలోనే రైత్వారీ ప్రాంతాలలో కూడా భూస్వాములు ఏర్పడి తమ భూములను నిస్సహాయులైన కౌలుదారులకు అధిక మొత్తం కౌలుకు ఇవ్వసాగారు. 'రైతులు' ప్రభుత్వానికి చెల్లించే భూమి శిస్తు కంటే కౌలుదారులు మూడునుంచి ఏడు రెట్లు ఎక్కువ కౌలు చెల్లించేవాళ్లు. (అంటే రైతు కొంత భూమికి వందరూపాయలు భూమి శిస్తుగా ప్రభుత్వానికి చెల్లిస్తుంటే, అదే భూమినుంచి కౌలుగా 300 నుంచి 700 రూపాయలు కౌలుగా లభించేది.) ఫలితంగా వాళ్లకు కూడా వ్యవసాయాన్ని మెరుగుపరచటానికి పెట్టుబడులు పెట్టటంలో ఆసక్తి లేకుండా పోయింది, ఎక్కువ మొత్తాలకు భూమిని కౌలుకు ఇవ్వటంపైనే దృష్టి పెట్టారు.

- మీరు ఊహించిన దానినీ, వాస్తవంగా జరిగిన దానినీ పోల్చండి. మీ అంచనాలు ఎంతవరకు నిజమయ్యాయి?
- వ్యవసాయాన్ని విస్తరించటంలోగానీ, మెరుగుపరచటంలోగానీ రైతులు పెట్టుబడులు ఎందుకు పెట్టలేదు?

- భూమిలేని కౌలురైతుల స్థితిగతులను ఊహించి ఒక వ్యాసం రాయండి.

## వాణిజ్యీకరణ, వడ్డీవ్యాపారస్తులు

భూమినుంచి ఆదాయాన్ని పెంచాలన్న కోరికతో భూమి శిస్తును రెవెన్యూ అధికారులు గణనీయంగా పెంచేశారు. ఆ శిస్తులను రైతాంగం చెల్లించలేక ఊళ్లు విడిచి పారిపోసాగారు. ఆ విధంగా అనేక ప్రాంతాల్లో ఊళ్లు నిర్మానుష్యంగా మారాయి. కొత్త విధానం వల్ల రైతులు ధనిక భూస్వాములుగా మారతారని ఆశావహులైన అధికారులు భావించారు. కాని అధిక భూ శిస్తులవల్ల ఇది జరగలేదు.

శిస్తులు కట్టటానికి రైతులు వడ్డీవ్యాపారస్తుల నుంచి చాలాసార్లు అప్పులు చేయాల్సి వచ్చేది. అయితే, వాళ్లు సకాలంలో అప్పులు చెల్లించకపోతే వడ్డీ వ్యాపారస్తులు కోర్టుకు వెళ్లి భూములు వేలం వేయించి తమ అప్పులు వసూలు చేసుకునేవాళ్లు. శిస్తు వసూలుకు బ్రిటిషు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త విధానం వల్ల అనేకమంది రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు.

రైతుల అప్పులు పెరగటానికి మరొక కారణం కూడా ఉంది. వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి అవుతుండటం వల్ల వాటి ధరలు అంతర్జాతీయ మార్కెట్లో నిర్ణయింపబడేవి. ఉదాహరణకు 1861లో అమెరికాలో అంతర్యుద్ధం తలెత్తడం వల్ల పత్తి సరఫరా కోసం బ్రిటిషు కర్మాగారాలు భారతదేశంపై ఆధారపడ్డాయి, దాంతో ధరలు గణనీయంగా పెరిగాయి. 1865లో అమెరికాలో అంతర్యుద్ధం ముగియటంతో భారత పత్తికి గిరాకి తగ్గి దాని ధరలు పడిపోయాయి. 1864లో కిలోకి 12 అణాల ధర ఉండగా 1865లో అది 6 అణాలకి పడిపోయింది. తీసుకున్న అప్పులు తిరిగి తీర్చలేక రైతులు చాలా కష్టాలపాలయ్యారు. తమ పట్టులోకి వచ్చే రైతుల సంఖ్య

పెరుగుతుండటంతో వడ్డీ వ్యాపారస్తుల సంపద కూడా పెరుగుతూ వచ్చింది. పత్తి పంటతో ఇబ్బడి ముబ్బడిగా లాభాలు సంపాదించవచ్చనుకున్న గంజాం రైతులు ఉన్నట్టుండి బికారులుగా మారారు. అంతేకాదు, అంతకుముందు వరి పండించే పొలాల్లో పత్తి సాగు చేయటం వల్ల బియ్యానికి కొరత ఏర్పడింది. దీనివల్ల అన్నివర్గాల ప్రజలు ప్రభావితులయ్యారు. గంజాం కరువుగా పేర్కొనే ఆ కరువు వల్ల ఆకలితో వేలాదిమంది చనిపోయారు. అనేకమంది దక్షిణాఫ్రికా, మారిషస్, ఫిజి, ఇతర దూర ప్రాంతాలకు కూలీలుగా వలస వెళ్లారు.

- అధిక శిస్తు రేట్ల వల్ల భూస్వాములు, రైతులు వ్యవసాయాన్ని అభివృద్ధి చేసే పనులను ఎందుకు చేపట్టలేకపోయారు?
- భూమి శిస్తు వల్ల రైతుల భూములు ఏ విధంగా వడ్డీ వ్యాపారస్తుల పరం చేయబడ్డాయి? వడ్డీ వ్యాపారస్తులు ఆ భూమితో ఏమి చేసి ఉంటారు?
- ఎగుమతి కోసం ఉత్పత్తి చేపట్టినందువల్ల అంతిమంగా ఎవరు లాభపడ్డారు? వాళ్లు ఏ విధంగా లాభపడ్డారు?
- అమెరికాలో యుద్ధం వల్ల భారతదేశంలో పత్తి ధరలు ఎందుకు పెరిగాయి?
- ప్రస్తుత కాలంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు వేగంగా పెరిగి, పడిపోయిన సందర్భం గురించి విన్నారా? దాని ప్రభావం రైతులపై ఎలా ఉంటుంది.

## రైతాంగాన్ని దోచుకున్న జమిందారులు

వలస పాలనలో భూస్వాములు వారి సొంత భూములలో రైతాంగంతో బలవంతంగా, డబ్బులు ఇవ్వకుండా పని చేయించుకునేవాళ్లు. దీనినే వెట్టి అంటారు. ఒకవేళ ఎవరైనా అందుకు నిరాకరిస్తే సైనికులతో బలప్రయోగం చేసేవాళ్లు. రోడ్డుమీద వెళ్లుతున్న వాళ్లను కూడా సైనికులు పట్టుకొచ్చి జమీందారుల భూముల్లో వెట్టి చేయించేవాళ్లు.

ఈ విధంగా జమీందారుల భూముల్లో పనిచేయాల్సి రావటం వల్ల రైతులు తమ సొంత పొలాల్లో సరిగా పనిచేయలేక పోయేవాళ్లు. తమ భూములను బాగుచేసుకోలేక పోయేవాళ్లు. 1878లో వెలువడిన ఒక ప్రభుత్వ నివేదిక ఆధారంగా వాళ్ల దీనస్థితి తెలుస్తుంది. రైతులు తమ పొలాల్లో బావులు తవ్వరు, వాటికి సాగునీళ్లు అందించరు, మురుగుకాల్వలు తీయరు, గట్లు వేయరు, ఎరువులు వేయరు అని ఈ నివేదిక తెలియచేసింది. "ఏ క్షణంలో తమ భూమినుంచి వెళ్లగొడతారోనన్న భయంతో తమ భూములను బాగుపరిచే పని ఏదీ వాళ్లు చేసేవాళ్లు కారు. వాళ్లు తమ భూమి బాగుపరచిన మరుక్షణం వాళ్లనుంచి తీసుకునే కౌలును జమిందారు వెంటనే పెంచేస్తాడు. అంతేకాదు రైతులు తమ భూములు బాగుచేసుకుంటే తమ హక్కుల కోసం పోరాడతారన్న భయంతో కూడా ఆ పనులు చేయకుండా జమీందార్లు వాళ్లకు అడ్డుపడతారు."

## అంతులేని వసూళ్లు, శిస్తులు, చెల్లింపులు

రకరకాల సాకులతో రైతులనుంచి సాధ్యమైనంత డబ్బు వసూలు చేయటానికి జమీందారులు ప్రయత్నించారు. జమీందారు ఇంటికి నెయ్యి, పాలు, కూరగాయలు, బెల్లం, గడ్డి, పిడకలు వంటివి రైతులు ఉచితంగా నిత్యం సరఫరా చేయాలి. భారతదేశంలోని అనేక రాష్ట్రాలలో ఇదే పరిస్థితి ఉండేది. బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో పెద్ద పెద్ద భూస్వాములు చాలామంది ఉండేవాళ్లు. ఒక్కొక్కరి కింద డజన్లు, వందల గ్రామాలు ఉండేవి. జమీందారుల ఆగడాలను ప్రతిఘటించటానికి రైతులు ప్రయత్నించేవాళ్లు.

## హైదరాబాదు రాష్ట్రంలో దొరలు, రైతులు

నిజాం పాలనలోని హైదరాబాదు రాష్ట్రంలో జాగీర్‌దారులు, సంస్థానాలు, ఇనాందారులు వంటి మధ్యస్థాయి పెత్తందారులు చాలా మంది ఉండేవాళ్లు.

వీళ్లకింద ఉన్న ప్రాంతానికి వీళ్లే స్వతంత్ర అధిపతులు. వీళ్లు భూమి శిస్తు వసూలు చేసి అందులోంచి కొంతమొత్తం 'పేష్‌కష్' గా నిజాంకి చెల్లించి మిగిలిన మొత్తం తాము ఉంచేసుకునేవాళ్లు. తమ ప్రాంతాల పరిపాలనకు వాళ్లే బాధ్యత వహించేవారు. హైదరాబాదు రాష్ట్రంలో 6535 గ్రామాలతో 1500 జాగీర్లు, 497 గ్రామాలతో 14 సంస్థానాలు ఉండేవి. నిజాం సొంత జాగీరు కింద (దీనిని సర్ఫ్-ఎ-ఖాస్ అంటారు) 1400 గ్రామాలు ఉండేవి. మిగిలిన ప్రాంతంలో పాలన కింది విధంగా సాగేది:

L62IJB

హైదరాబాదును పాలించిన నిజాంలు బ్రిటిషు వారి నియంత్రణలో ఉండడం వలన వాళ్ల విధానాలను అనుసరించాల్సి వచ్చేది. 19వ శతాబ్దపు తొలి సగంలో దేశ్‌ముఖ్‌ల ద్వారా సాధ్యమైనంత ఎక్కువ భూమిశిస్తు వసూలు చేయటానికి ప్రయత్నించారు. దీని వల్ల వ్యవసాయం కుంటుపడింది. రైతులు భూమి వదిలి పారిపోసాగారు. ఈ పరిస్థితి దృష్ట్యా నిజాం ప్రభుత్వం భూమి శిస్తు వసూళ్లకు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనికింద జిల్లాలో నియమితులైన అధికారుల ద్వారా నేరుగా శిస్తు వసూలు చేయసాగారు. పాత భూస్వాములకు నష్టపరిహారంగా 'రుసుం' అనే వార్షిక మొత్తాలు ఇచ్చేవాళ్లు. వాళ్ల భూములకు, చుట్టుపక్కల ఉన్న బంజరు, అటవీ భూములకు పూర్తి హక్కులతో పట్టాలు ఇచ్చారు. ఆముదం, వేరుశనగ వంటి పంటలకు పెద్ద ఎత్తున ఎగుమతి మార్కెటు ఉందని తెలుసుకున్న భూస్వాములు ఈ పంటలు పండించటానికి మరిన్ని బంజరు భూములను సాగులోకి తెచ్చారు. అయితే ఈ భూములమీద పని ఎవరు చేయాలి? భూస్వాములు 'వెట్టి' పరిధి పెంచి తమ భూములపై మామూలు రైతులు, చేతివృత్తులవాళ్లు, సేవలు అందించే కులాలవాళ్లు వేతనం లేకుండా పనిచేసేలా బలవంతం చేశారు. ఈ పెద్ద పెద్ద భూస్వాములను 'దొర'లని వ్యవహరించే వారు. వీళ్లు 'గడీ'లనే కోటల్లాంటి పెద్ద పెద్ద ఇళ్లల్లో, పెద్ద సంఖ్యలో సేవకులు, సైనికులతో ఉండేవారు. వాళ్లకింద కౌలుదార్లు సాగుచేసే భూములు, బలవంతపు చాకిరితో నేరుగా సాగుచేసే భూములు విస్తృతంగా ఉండేవి. గ్రామంలో వడ్డీ వ్యాపారస్తులు కూడా వీళ్లే. మొత్తం గ్రామం మీద తీర్పులుచెప్పే హక్కు వీళ్లకు ఉండేది. గ్రామంలోని తగాదాలన్నింటినీ వాళ్లు పరిష్కరించేవారు. ఇటువంటి సందర్భాలలో పై కులాలపట్ల పక్షపాతం చూపేవారు. పట్వారీల వంటి ఇతర గ్రామస్థాయి అధికారులు, ఇతర చిన్న భూస్వాములు సైతం వాళ్ల ఆదేశాలను పాటించాల్సిందే. తక్కువ కులాలకు చెందిన శ్రామికులు పైకులాల వాళ్లకు, ప్రత్యేకించి భూస్వాములకు ఉచితంగా పనిచేసేలా చూసేవాళ్లు. కింది కులాలకు చెందిన వ్యక్తులు చొక్కా వేసుకోకూడదు, తలపాగా పెట్టుకోకూడదు, చెప్పులు వేసుకోకూడదు వంటి నియమాలను అమలు చేసే వాళ్లు. దొరల ముందు వీళ్లు వంగి వంగి నిలబడి, 'దొర' అని సంబోధించాలి.

తెలంగాణ ప్రాంతంలో మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో వెయ్యి ఎకరాలకు పైగా భూమి ఉన్న దొరలు 550 మంది ఉన్నారు. విస్నూరు రామచంద్రారెడ్డి, జన్నారెడ్డి ప్రతాపరెడ్డి మాదిరి లక్ష ఎకరాలు ఉన్న భూస్వాములు ఉండేవారు.

- రైతులు తమ భూములపై పెట్టుబడులు పెట్టటానికి ఎందుకు ఆసక్తి చూపే వారు కాదు?
- కౌలుదారులు ఉత్పత్తులను జమీందారులు ఏయే రూపాలలో కొల్లగొట్టేవారు?
- గ్రామ కళాకారులు, సంప్రదాయ చేతి వృత్తిదారుల జీవితాల్లో వస్తున్న మార్పుల గురించి చర్చించండి.

- నిజాం రాష్ట్రంలో శిస్తు వసూలు చేసేవాళ్ల పరిస్థితి ఎలా మారుతూ వచ్చింది?
- వివిధ దోపిడీలలో రైతాంగం 'వెట్టి'ని తీవ్రంగా ద్వేషించేవాళ్లు. కారణాలు పేర్కొనండి.
- 'దొర'కు, మామూలు భూస్వామికీ తేడా ఏమిటి?

## కరువులు

బ్రిటిషు పాలనలో కరువులు, తీవ్ర ఆహార కొరతల వల్ల తరచు సంక్షోభాలు తలెత్తేవి. అధిక శిస్తులు, కౌళ్లవల్లగానీ, పంటలు పండనప్పుడు గానీ ఏర్పడే క్లిష్ట పరిస్థితులను తట్టుకోటానికి రైతాంగం వద్ద తగినంత నిల్వలు ఉండేవి కావు. మరోవైపు ఆహారధాన్యాలు ఇతర దేశాలకు ఎగుమతి అవుతూ ఉండేవి. ఆహార ధాన్యాలను అక్రమంగా నిలువచేసి వ్యాపారస్తులు కృత్రిమ కొరత సృష్టించినప్పుడు కూడా ప్రభుత్వం జోక్యం చేసుకోటానికి నిరాకరించేది.

మిగిలిన ప్రాంతాల మాదిరిగానే 19, 20వ శతాబ్దాలలో ఆంధ్రప్రాంతం తీవ్ర కరువులతో కుదేలయ్యింది. అన్నింటిలోకి తీవ్రమైన కరువు 1865-66లో గంజాంలో సంభవించింది. దీని గురించి ఇంతకు ముందే మీరు చదివారు. సాగునీటి సౌకర్యాలులేని రాయలసీమ ప్రాంతంలో కరువులు తరచుగా సంభవించేవి. 19వ శతాబ్దం ద్వితీయార్థంలో 11 కరువులు వచ్చాయి. వీటివల్ల వేలాది ప్రజలు చనిపోయారు. ఆంధ్రా జిల్లాల్లో పలుచోట్ల ప్రజలు ఆహార లూటీలకు పాల్పడ్డారు. ఈ దౌర్జన్యాలను అరికట్టడానికి సైనికులను పంపించారు.

## రైతాంగ ఉద్యమాలు

L64595

అధిక భూమి శిస్తులు, భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తుల దోపిడీల కారణంగా రైతాంగం తీవ్ర ఇబ్బందుల పాలయ్యిందని పైన చూశాం. వలస పాలనలో దేశంలోని వివిధ ప్రాంతాలలోని రైతులు, భూస్వాములు, వ్యాపారస్థులు, అధికారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. వీటిల్లో ముఖ్యమైనవి 1860ల నాటి దెక్కన్ తిరుగుబాటు, రంపా ఫితూరీలు, మొప్లా పోరాటం. ఇవి సంఘటిత రూపాన్ని సంతరించు కున్నాయి. 19వ శతాబ్దంలో రైతాంగ ఉద్యమాలు తిరుగుబాటు రూపం తీసుకోగా, 20వ శతాబ్దంలో రైతులు పెద్ద ఎత్తున జాతీయ ఉద్యమ శ్రేణుల్లో చేరారు. 1920-22లో ఉత్తరప్రదేశ్‌లోని అవధ్ ప్రాంతంలో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న జమీందారులకు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. అనేకమంది జమీందారులను సామాజికంగా బహిష్కరించి గ్రామాలనుంచి తరిమి కొట్టారు. ఎక్కువ కౌలు వసూలు చేయటానికి లేదా కౌలుదారులను తొలగించటానికి ప్రయత్నించిన జమీందారుల భూములను సాగు చేయటానికి రైతాంగం తిరస్కరించింది. తమ ఆందోళనను కొనసాగించటానికి రైతులు 'కిసాన్ సభ'లుగా సంఘటితమయ్యారు. భూస్వామ్య వ్యవస్థ రద్దు చేయాలనీ, భూమి శిస్తు తగ్గించాలనీ, వడ్డీ వ్యాపారస్తులను నియంత్రించాలనీ వీళ్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ తిరుగుబాట్లను అణచివేయటంలో జమీందారులకు బ్రిటిషు ప్రభుత్వం సహాయం చేసింది. తరవాత అధ్యాయాలలో మీరు తెలంగాణ రైతాంగ పోరాటం గురించి చదువుతారు.

### కీలక పదాలు

| | | |
|---|---|---|
| 1. భూస్వాములు | 2. వడ్డీ వ్యాపారస్తులు | 3. జాగీర్లు |
| 4. సంస్థానం | 5. ఇనాందారులు | 6. పట్టా |
| 7. రైత్వారీ | 8. దేశ్‌ముఖ్ | |

L6BEKY

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. అధ్యాయంలోని ఒక్కొక్క భాగం ఆధారంగా చిన్న చిన్న ప్రశ్నలు తయారుచేసి ఒకరినొకరు అడగండి. సమాధానాలు సరిగానే ఉన్నాయేమో చూడండి. $AS_4$
2. స్వాతంత్ర్యానికి ముందు కౌలు రైతుల పరిస్థితిని నేటి రైతుల పరిస్థితితో పోల్చండి. ఏయే తేడాలు, పోలికలు ఉన్నాయి? $AS_1$
3. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో జమీందారులు సాధారణంగా బ్రిటిషు ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారు. కారణాలు ఏమై ఉంటాయో తెలియచేయండి. $AS_1$
4. రైతాంగ జీవితాలలో వడ్డీ వ్యాపారస్తుల పాత్ర ఏమిటి? వాళ్లకు బ్రిటిషు ప్రభుత్వం ద్వారా ఏ విధమైన మద్దతు లభించింది? $AS_1$
5. తెలంగాణ దొరలు, అవధ్ జమీందారుల మధ్య తేడాలు, పోలికలు ఏమిటి? $AS_1$
6. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటానికి బ్రిటిషువాళ్లు ఎటువంటి చర్యలు తీసుకున్నారు? వాళ్లు ఆశించిన ఫలితాలు వచ్చాయా? మీ కారణాలు తెలియచేయండి. $AS_1$
7. రైత్వారీ వ్యవస్థ కూడా భూస్వామ్యానికి ఎలా దోహదం చేసింది? $AS_1$
8. బ్రిటిషు పాలనలో కరువులు ఎందుకు సంభవించాయి? అవి వరదలు లేక వర్షాలు పడకపోవటం వల్ల వచ్చాయని మీరు భావిస్తున్నారా? $AS_1$
9. పంటలు పండనప్పుడు కూడా కరువు రాకుండా ప్రభుత్వం ఎలా సహాయపడగలదు? $AS_1$
10. బ్రిటిషు ప్రభుత్వ విచారణ సంఘానికి ఒక వినతి పత్రాన్ని ఇవ్వబోతున్నారని ఊహించుకోండి. కౌలు రైతుల సమస్యలను పేర్కొంటూ ఒక వినతి పత్రాన్ని తయారు చేయండి. $AS_6$
11. భారతదేశ పటంలో కింది వానిని గుర్తించండి. $AS_5$

    1. గంజాం 2. అవధ్ 3. హైద్రాబాద్ 4. గోదావరి నది
12. "అంతులేని వసూళ్లు, శిస్తులు, చెల్లింపులు" శీర్షిక కింద గల పేరాను చదివి కింది ప్రశ్నకు జవాబు రాయండి. ప్రస్తుత రోజులలో శిస్తును ఏవిధంగా చెల్లిస్తున్నారు? $AS_2$

### ప్రాజెక్టులు:

1. అయిదుగురు విద్యార్థులతో ఒక బృందంగా ఏర్పడండి. గ్రామంలో అయిదుగురు పెద్దవాళ్లను ఇంటర్వ్యూ చేసి బ్రిటిషు కాలంలో పరిస్థితులు ఎలా ఉండేవో తెలుసుకోండి. వీరిలో కనీసం ఇద్దరు మహిళలు ఉండాలి, కనీసం ఒకరు చేతివృత్తులకు చెందిన వాళ్లై ఉండాలి. వాళ్లతో సుదీర్ఘంగా మాట్లాడి, వాళ్లు చెప్పిన దాని ఆధారంగా ఒక నివేదిక తయారు చేయండి.
2. మీ ప్రాంతంలో సంభవించిన కరువుల గురించి తెలుసుకోండి. ఆ సమయంలో ప్రజలు ఏం చేశారు?
3. మీ ప్రాంతం నుంచి కువైట్, సౌదీ అరేబియా వంటి దూరప్రాంతాలకు వలస వెళ్లిన కుటుంబాల గురించి తెలుసుకోండి.

పాఠం 11 ఎ

# జాతీయోద్యమం : తొలి దశ 1885 - 1919

భారతదేశంలో జాతీయోద్యమం ఒక చారిత్రక ఘటన. ఇది సమాజంలోని విభిన్న ప్రజలు, వర్గాలను ఒక్క తాటికిందకు తెచ్చి బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా ఒక నూతన దేశ నిర్మాణానికి కృషి సలిపేలా చేసింది.

## తొలి సంఘాలు

7వ తరగతిలో మీరు 1857 తిరుగుబాటు గురించి చదివారు. దీంట్లో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా సైనికులు, సాధారణ రైతులు, చేతివృత్తుల వాళ్ళు, రాజులు సైతం చేతులు కలిపారు. ఈ తిరుగుబాటు బ్రిటిషు పాలనను వ్యతిరేకించింది కానీ దేశానికి ఒక కొత్త దార్శనికతను అది ఇవ్వలేకపోయింది. వాస్తవానికి అది పాతకాలపు రాజులు, రాణుల పాలనను, కుల ఆధారిత సమాజాన్ని కోరుకుంది.

19వ శతాబ్దపు అంతిమ దశలో కలకత్తా, మద్రాసు, బొంబాయి వంటి పెద్ద నగరాలలో ఆంగ్ల విద్యా వ్యాప్తితో ఒక కొత్త చైతన్యం రూపుదిద్దు కోసాగింది. కొత్తగా వచ్చిన మేధావులు పాత సామాజిక వ్యవస్థలోని అన్యాయాలను, అసమానతలను వ్యతిరేకించసాగారు. వాళ్ళు ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థను కోరుకోసాగారు. అదే సమయంలో బ్రిటిషు పాలనవల్ల జరుగుతున్న అన్యాయాలు, దోపిడీలను ఎత్తి చూపుతూ దానిని అంతం చేయుటానికి పోరాడసాగారు. ఇది భారతదేశంలో కొత్త జాతీయోద్యమానికి దారి తీసింది.

L6D1AS

19వ శతాబ్దపు ద్వితీయార్థంలో కొత్త చైతన్యానికి పునాదులు పడ్డాయి. చదువుకున్న భారతీయులు బ్రిటిషు పాలన స్వభావాన్ని, భారతదేశం మీద దాని ప్రభావాన్ని అర్థం చేసుకున్న తరవాత భారతదేశంలో బ్రిటిషు విధానాలను తీవ్రంగా విమర్శించసాగారు. వాళ్ళందరూ ఒకచోట చేరి ఈ అంశాల మీద చర్చించసాగారు. దీనికోసం వాళ్ళు సంఘాలను కూడా ఏర్పాటు చేశారు. భారతదేశ సమస్యను చర్చించటానికి దాదాభాయి నౌరోజి 1866లో లండన్‌లో 'ఈస్ట్ ఇండియా అసోసియేషన్'ని ఏర్పాటు చేశాడు. 1866 నుంచి 1885 మధ్య సురేంద్రనాధ్ బెనర్జీ, జస్టిస్ ఎం.జి. రనడే, బద్రుద్దిన్ త్యాబ్జి, కె.సి. తెలంగ్, జి.సుబ్రహ్మణ్యం లాంటి వాళ్ళు కలకత్తా, పూనా, బొంబాయి, మద్రాసు వంటి నగరాలలో వివిధ సంఘాలను ఏర్పాటుచేసి ఆయా రాష్ట్రాలలో భారతీయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించసాగారు. ఈ సంఘాలు జాతీయ స్ఫూర్తితో పని చేశాయి. మేధావులందరినీ ఒక గొడుగు కిందకు తీసుకు రావటానికి ఇవి ప్రయత్నించాయి. ఈ సంఘాలలో అనేకం దేశంలోని ఒక ప్రత్యేక ప్రాంతంలో పనిచేసినా వాళ్ళ లక్ష్యాలు ఏ ఒక్క ప్రాంతానికో, సమాజానికో, వర్గానికో చెందినవిగా కాక మొత్తం


సురేంద్రనాథ బెనర్జి


గోపాలకృష్ణ గోఖలే


దాదాభాయి నౌరోజి



చిత్రం 11ఎ.1 : సూరత్ సమావేశం

భారత ప్రజలకు చెందినవిగా పేర్కొన్నారు. ప్రజలు సార్వభౌమాధికారం కలిగి ఉండాలన్న భావనతో వాళ్లు పని చేశారు – ఆధునిక చైతన్యం, జాతీయవాదంలో ఇది కీలక అంశం. ఇంకో మాటలో చెప్పాలంటే తమ వ్యవహారాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవటంలో ప్రజలు సాధికారత పొందాలని వాళ్లు నమ్మారు. నూలుబట్టపై పన్నులు, భారతీయుల పట్ల జాతి వివక్షత, భారతీయ దినపత్రికలకు వ్యతిరేకంగా నిర్బంధకర చట్టాలు చేయడం వంటి బ్రిటిషు విధానాలకు వ్యతిరేకంగా అనేకమంది మేధావులు పోరాడారు. ప్రభుత్వ విధానాల గురించి చర్చించటం, వాటిని మార్చటానికి ఉద్యమాల ప్రాముఖ్యతను వాళ్లు గుర్తించారు.

- మీ ఊళ్లో, లేదా పట్టణంలో (ఒక కులం, లేదా ఒక మతానికి సంబంధించికాక) మొత్తం అందరి సమస్యల గురించి మాట్లాడే ఏదైనా సంఘం గురించి తెలుసా? వాళ్లు ఏం చర్చిస్తారు? ఈ సమస్యల పరిష్కారానికి వాళ్ల సలహాలు ఏమిటి? కొన్ని ఉదాహరణలను మీ తరగతిలో చర్చించండి.

## భారత జాతీయ కాంగ్రెసు : మితవాద దశ 1885–1905

L6KAHL

వివిధ రాష్ట్రాలలో ఉన్న జాతీయవాద మేధావులు 1885 డిసెంబరులో బొంబాయిలో భారత జాతీయ కాంగ్రెసు సమావేశపు తొలి రోజు కార్యక్రమంలో కలిశారు. దీనికి డబ్ల్యు. సి. బెనర్జీ అధ్యక్షత వహించారు. భారతదేశ వివిధ ప్రాంతాలనుంచి 72 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. తొలికాలపు నాయకులలో కొందరైన దాదాభాయి నౌరోజి, ఫిరోజ్‌షా మెహతా, బద్రుద్దీన్ త్యాబ్జి, డబ్ల్యు.సి. బెనర్జీ, సురేంద్రనాథ్ బెనర్జీ, రమేష్ చంద్ర దత్ (ఆర్.సి.దత్), ఎస్.సుబ్రహ్మణ్యం అయ్యర్ వంటి వాళ్లు ప్రధానంగా బొంబాయి (ముంబయి), మద్రాసు (చెన్నై), కలకత్తా (కోల్‌కతా) వంటి నగరాలనుంచి వచ్చారు. కాంగ్రెస్‌ను స్థాపించటంలో పదవీ విరమణ చేసిన బ్రిటిషు అధికారి అయిన ఏ ఓ హ్యూమ్ కూడా ప్రధానపాత్ర పోషించాడు. కాంగ్రెసు నాయకులు తమ ముందున్న ప్రధాన కర్తవ్యం భారతదేశపు ప్రజలందరిలో జాతీయతా భావాన్ని కలిగించి, వాళ్లని సమైక్యపరచటమని గుర్తించారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాల, వివిధ మతాల ప్రజల ప్రత్యేక అవసరాలకు చోటు కల్పించటం ద్వారా



*చిత్రం 11ఎ.2 : భారత జాతీయ కాంగ్రెసు, 1885 మొదటి సమావేశానికి హాజరైన ప్రతినిధులు*

మాత్రమే ఈ ఐక్యతను సాధించగలమని వాళ్లు గుర్తించారు. దీనికోసం ప్రతి సంవత్సరం జరిగే కాంగ్రెసు సమావేశాలను దేశంలోని వివిధ ప్రాంతాలలో జరప తలపెట్టారు. ఏ ఒక్క మత బృందం వ్యతిరేకించినా సరే ఆ తీర్మానాన్ని ఆమోదించగూడదని నిర్ణయించారు.

కాంగ్రెసు రెండవ లక్ష్యం దేశంలోని వివిధ ప్రాంతాల రాజకీయ కార్యకర్తలు అందరూ పాల్గొనగలిగే ఉమ్మడి రాజకీయ వేదిక లేదా కార్యక్రమం తయారు చేయటం. తద్వారా వాళ్లు అఖిల భారత ప్రాతిపదికన ప్రజలను సమీకరిస్తూ, వాళ్లకు అవగాహన కల్పించాలి, రాజకీయ కార్యక్రమాలు చేపట్టాలి. పాలకుల పట్ల భారతీయులకు ఉన్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని వాటిని పరిష్కరించటానికి, హక్కులు సాధించుకోటానికి పోరాటాలు చేయటం ద్వారా దీనిని సాధించదలుచు కున్నారు. వాళ్లు ప్రజల సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి ప్రభుత్వాలకు అర్జీలు రాసేవాళ్లు. ప్రజలకు వారి రాజకీయ హక్కుల పట్ల అవగాహన కల్పించటానికి ఈ అర్జీలను ఉపయోగించుకునే వాళ్లు.

భారతదేశంలో ప్రజాస్వామిక భావనలు, పని విధానాన్ని ప్రోత్సహించటం కాంగ్రెసు మూడవ ప్రధాన లక్ష్యంగా ఉంది. భారత జాతీయ కాంగ్రెసు ప్రజాస్వామిక పద్ధతుల్లో పని చేసేది. అన్ని విషయాలను చర్చించి ఏకాభిప్రాయం సాధించటానికి ప్రయత్నించే వాళ్లు, అవసరమైతే ఓటింగు కూడా చేపట్టేవాళ్లు.

భారతదేశ ప్రజల మధ్య విభజన ఏర్పడుతుందన్న ఉద్దేశంతో సామాజిక సంస్కరణల జోలికి పోవద్దని ఈ దశలో భారత జాతీయ కాంగ్రెసు నిర్ణయించుకుంది. ఇతర వేదికల ద్వారా సంస్కరణల కోసం ప్రయత్నాలు జరిగేవి.

1886లో కాంగ్రెసుకు వివిధ స్థానిక సంస్థలు 436 ప్రతినిధులను ఎన్నుకున్నాయి. ఒక సంవత్సరంలో భారత జాతీయ కాంగ్రెస్ ఎంత ప్రజాదరణ పొందిందో ఇది తెలియచేస్తుంది. అప్పటినుంచి ప్రతి సంవత్సరం డిసెంబరులో దేశంలో ఏదో ఒక ప్రాంతంలో సమావేశాలను కాంగ్రెసు నిర్వహించసాగింది. అనతికాలంలోనే ప్రతినిధుల సంఖ్య వేలకు పెరిగింది. కాంగ్రెసు ప్రతినిధులలో ప్రధానంగా న్యాయవాదులు,

పాత్రికేయులు, వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు, ఉపాధ్యాయులు, భూస్వాములు ఉండేవాళ్లు. ప్రతినిధులలో చాలా తక్కువమంది మహిళలు ఉండేవాళ్లు. కలకత్తాకు చెందిన కాదంబరి గంగూలి మొదటి మహిళా గ్రాడ్యుయేట్ ప్రతినిధి. ఈ సమావేశాలకు ఉన్నత సామాజిక నేపథ్యానికి చెందిన పురుషులు అధిక సంఖ్యలో హాజరయ్యేవాళ్లు.

మొదటి 20 సంవత్సరాలు మితవాద జాతీయ వాదులనబడే నాయకులు కాంగ్రెసును నడిపారు. సంస్కరణలు చేపట్టవలసిందిగా ప్రభుత్వానికి మితవాదులు అనేక అర్జీలు ఇచ్చేవాళ్లు. ప్రభుత్వం, పరిపాలనలో భారతీయులకు మరింత చోటు ఉండాలని వాళ్లు కోరసాగారు.

ఇంపీరియల్ విధాన సభలలో మరింత మందికి ప్రాతినిధ్యం ఉండాలని, వాటికి మరిన్ని అధికారాలు ఉండాలని, అవి లేని రాష్ట్రాలలో వాటిని నెలకొల్పాలని వాళ్లు కోరసాగారు. ప్రభుత్వంలో ఉన్నతాధికార స్థానాలలో మరికొంతమంది భారతీయులకు స్థానం కల్పించాలని కోరసాగారు. దీనికోసం సివిల్ సర్వీస్ పరీక్షలు లండన్‌లోనే కాక భారతదేశంలో కూడా నిర్వహించాలని కోరసాగారు. ముఖ్యమైన ఉద్యోగాలలో ప్రధానంగా యూరోపియన్లే ఉండేవాళ్లు కాబట్టి, ఈ రకమైన జాతి వివక్షతకు వ్యతిరేకంగా పరిపాలనలో భారతీయులను తీసుకోవాలని కోరసాగారు.

నౌరోజీ, ఆర్ సి దత్, రనడే వంటి నాయకులు బ్రిటిషు పరిపాలన ఆర్థిక ప్రభావాన్ని అధ్యయనం చేసి పన్నులు, ఇతర మార్గాల ద్వారా బ్రిటిషువాళ్లు భారతదేశ సంపదను దోచుకుంటున్నారనీ, భారతదేశం నానాటికీ పేద దేశంగా మారుతోందనీ నిర్ధారణకు వచ్చారు. అధిక భూమి శిస్తు, ఆహార ధాన్యాల ఎగుమతి వంటి బ్రిటిషు విధానాల వల్లనే కరువు, పేదరికం వంటి సమస్యలు ఎదురౌతున్నాయని ఆరోపించసాగారు. ఉప్పుపై పన్ను, విదేశాలలో భారతీయ కూలీలతో వ్యవహరిస్తున్నతీరు, అటవీశాఖ జోక్యం కారణంగా ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెసు ఎన్నో తీర్మానాలు చేసింది. భారతదేశంలో పేదరికాన్ని అంతం చేయటానికి జాతీయ పారిశ్రామిక అభివృద్ధి తప్పనిసరి అనే నిర్ధారణకు తొలి తరం నాయకులు వచ్చారు. అయితే భారతదేశ సంపదను ఇంగ్లాండుకు దోచిపెట్టడమే కాకుండా, బ్రిటిషు సరుకులను భారతదేశంలో చవకగా అమ్మటం ద్వారా, భారతీయ చేతివృత్తులు, పరిశ్రమలు క్షీణించాయి. తద్వారా భారతదేశ అభివృద్ధికి బ్రిటిషు పరిపాలన ఆటంకంగా నిలిచింది.

ఉపన్యాసాలు, సమావేశాలు, యాత్రల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలతో మితవాద నాయకులు సంబంధాలు ఏర్పరచుకున్నారు. బ్రిటిషువాళ్లు స్వేచ్ఛ, న్యాయాలకు కట్టుబడి ఉన్నారనీ, సరిగా వ్యక్తపరిస్తే తమ కోరికలను తీరుస్తారని వారు నమ్మారు. దినపత్రికలు, ఉపన్యాసాలు, తీర్మానాలు, ప్రభుత్వానికి వినతి పత్రాలివ్వటానికి ప్రతినిధి బృందాలు వంటి వాటి ద్వారా వాళ్లు తమ ఉద్యమం కొనసాగించారు. క్లుప్తంగా చెప్పాలంటే వారు విన్నపాలు, అర్జీలు, ఆందోళనలు అన్న విధానాలను అవలంబించారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకునేలా చేయటంలో తరచూ విఫలమైనప్పటికీ ముఖ్యమైన అంశాల మీద భారతదేశ అభిప్రాయాన్ని వీళ్లు తెలుపగలిగారు. భవిష్యత్తులో భారత జాతీయ ఉద్యమం బలోపేతం కావడంలో ఇది చాలా ముఖ్య పాత్ర పోషించింది.

- భారతదేశంలో పేదరికం, కరువులకు బ్రిటిషు పాలకులు కారణమని తొలి జాతీయవాదులు ఎందుకు విశ్వసించారు?
- భారతదేశపు పురాతన రాజుల పాలనను తిరిగి స్థాపించాలని తొలి జాతీయవాదులు ఎందుకు అనుకోలేదు? బ్రిటిషు పాలనకంటే అది మెరుగ్గా ఉండేది కాదా?

## అతివాద దశ (స్వదేశీ ఉద్యమం) 1905-1920

L6LWCF

1903 ప్రాంతంలో స్వదేశీ ఉద్యమం ప్రారంభించటంతో భారత జాతీయ ఉద్యమం ఒక పెద్ద ముందడుగు వేసింది. దేశంలో మొట్టమొదటి సారిగా బెంగాల్, ఇతర ప్రాంతాల నుంచి పట్టణ, పల్లె ప్రజలలో అధికభాగం, మహిళలు, విద్యార్థులు రాజకీయాలలో చురుకుగా పాల్గొన సాగారు. 1903లో బెంగాల్‌ను తూర్పు, పశ్చిమ బెంగాల్‌గా విభజించాలని కర్జన్ చేసిన ప్రతిపాదన జాతీయ భావాలను పెద్ద ఎత్తున రగిల్చింది. బెంగాలీ ప్రజలను విడదీసి, జాతీయోద్యమాన్ని బలహీనపరిచే ప్రభుత్వ రాజకీయ కుట్రగా జాతీయవాదులు బెంగాల్ విభజనను నిరసించారు. బెంగాల్‌లో సాధారణ ప్రజానీకం సైతం ఈ ప్రతిపాదనతో ఆగ్రహం చెంది దానికి వ్యతిరేకంగా ఉద్యమించింది. పెద్ద ఎత్తున సామూహిక నిరసనలు, అభ్యర్థనలు, ప్రచారం జరిగాయి. కానీ ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకుండా 1905లో బెంగాల్‌ను విభజించింది. దానికి నిరసనగా అనేక సమావేశాలు జరిగాయి. విదేశీ వస్త్ర, ఉప్పు బహిష్కరణకు పిలుపునిచ్చారు. ఈ పిలుపుతో ప్రజలు పెద్ద ఎత్తున స్పందించారు. దేశమంతటా ప్రధాన పట్టణాలు, నగరాలలో, బెంగాల్ మారుమూల ప్రాంతాల్లో విదేశీ వస్త్ర బహిష్కరణ, దహనం, విదేశీ వస్తువులు అమ్మే దుకాణాల ముందు పికెటింగ్ వంటివి సర్వసాధారణమై పోయాయి. విదేశీ గాజులు వేసుకోటానికీ, విదేశీ వంట పాత్రలను ఉపయోగించటానికీ మహిళలు నిరాకరించారు. విదేశీయుల బట్టలను ఉతకటానికి బట్టలు ఉతికే వాళ్ళు నిరాకరించారు. విదేశీ పంచదార ఉన్న నైవేద్యాన్ని తీసుకోటానికి పూజారులు కూడా నిరాకరించారు. ఇలా వివిధ సామాజిక బృందాలు ఐక్యకార్యాచరణకి పూనుకోవటం జాతీయవాదానికి పునాదిగా నిలిచింది. ఈ భావనను నెలకొల్పటంలో తొలి తరం జాతీయ నాయకులు సఫలమయ్యారు.

ప్రభుత్వ సంస్థలయిన పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాలు వంటి వాటిని బహిష్కరించమని కూడా పిలుపునిచ్చారు. ప్రజలు స్వదేశీ పాఠశాలలు, కళాశాలలు స్థాపించారు, తమ తగాదాలను పరిష్కరించుకోటానికి సమాంతర న్యాయస్థానాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పనిలో సహకరించకుండా దానిని బలహీన పరచాలన్నది వారి ఉద్దేశం. స్వదేశీ ఉద్యమం వల్ల భారతీయ పరిశ్రమలకు మంచి ప్రోత్సాహం లభించింది. స్వదేశీ ఉప్పు, పంచదార, అగ్గిపెట్టెలు, ఇతర వస్తువులను పెద్ద ఎత్తున తయారు చేయటానికి పూనుకున్నారు. ఈ ఉద్యమం ఫలితంగా ప్రఫుల్ల చంద్ర రే (పి.సి. రే) కి చెందిన బెంగాల్ కెమికల్ వర్క్స్‌కు మంచి ఆదరణ లభించింది. ఈ స్ఫూర్తితోనే బొంబాయికి చెందిన జంషెడ్జీ టాటా బీహార్‌లో ఉక్కు కర్మాగారం స్థాపించాడు. దేశీయ వస్తువులకు ఈ ఉద్యమం కారణంగా ఎంతో గిరాకీ ఏర్పడింది. స్వదేశీ ఉద్యమం వల్ల ప్రత్యేకించి భారతదేశంలోని వస్త్ర పరిశ్రమ ఊపందుకుంది.

### మితవాదులు, అతివాదులు

మరుసటి సంవత్సరం కాంగ్రెసు సమావేశంలో అతివాద జాతీయ నాయకులైన తిలక్, బిపిన్ చంద్ర పాల్, లజ్‌పత్ రాయ్ వంటి వాళ్లు, బెంగాల్ విభజన రద్దు చేయమనే కాకుండా సంపూర్ణ స్వాతంత్ర్యం, అంటే 'స్వరాజ్యం' కోరుతూ ఉద్యమాన్ని మిగిలిన ప్రాంతాలకు కూడా విస్తరింప చేయాలని భావించారు. 'స్వరాజ్యం నా జన్మ హక్కు, దానిని సాధించి తీరతాను' అనే ప్రఖ్యాత నినాదాన్ని బాలగంగాధర్ తిలక్ ఇచ్చాడు. ఇంతకు ముందులాగా ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వటం కాకుండా బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి దేశం విడిచి వెళ్లిపోయేలా చేయాలని వాళ్లు అనుకున్నారు. అంతకు ముందు చేపట్టిన విధానాన్ని 'భిక్షం అడుక్కోవటం'గా పేర్కొన్నారు. ఈ కారణాల వల్ల వాళ్లని 'అతివాద జాతీయవాదులు' అని పిలవసాగారు. ఇందుకు

## బెంగాల్ విభజన రోజున


బంకించంద్ర చటర్జీ

బెంగాల్ విభజింపబడిన 1905 అక్టోబరు 16ను విషాద దినంగా పాటించారు. ఆ రోజు బెంగాల్‌లో ఎవరూ వంట చెయ్యలేదు, దుకాణాలు అన్నింటిని మూసివేశారు. కలకత్తాలో హర్తాళ్ ప్రకటించారు. ప్రజలు గంగానదిలో స్నానం చేసి 'వందేమాతరం' పాడుతూ వీధుల్లో ఊరేగారు. బెంగాల్ రెండు భాగాల ఐక్యతకు చిహ్నంగా ప్రజలు ఒకరికొకరు రాఖీ కట్టుకున్నారు. ఆ రోజు సాయంత్రం 75,000 మంది ప్రజలు హాజరైన రెండు బహిరంగ సభలలో ఆనందమోహన్ బోస్, సురేంద్రనాథ్ బెనర్జీ ఉపన్యసించారు.

విరుద్ధంగా 'మితవాద జాతీయవాదులు'గా పేరుబడ్డ ముందుతరం నాయకులు స్వాతంత్ర్యం, స్వపరిపాలనకు పూర్తిస్థాయి ఉద్యమానికి ప్రజలు ఇంకా సిద్ధంగా లేరని, దానిని మంద స్థాయిలోనే కొనసాగించాలని భావించారు. ఈ రెండు వర్గాల నాయకుల మధ్య విభేదాలు పెరిగి అంతిమంగా 1907 సూరత్ సమావేశంలో కాంగ్రెసు రెండుగా చీలింది. తిలక్ వంటి అతివాద నాయకులు కాంగ్రెసును వదిలిపెట్టాల్సి వచ్చింది.

అతివాద నాయకులపైనా, స్వరాజ్య ఉద్యమకారుల కార్యకర్తలపైనా ప్రభుత్వం ఉక్కుపాదంతో విరుచుకు పడింది. తిలక్ వంటి చాలామంది నాయకులను ఖైదు చేశారు, దేశం నుంచి బయటకు పంపించారు. క్రమేపీ ఈ ఉద్యమం నీరుగారిపోయింది. ఈ పరిణామాలతో నిరుత్సాహ పడిన స్వరాజ్య యువ ఉద్యమ కారులు ప్రజలు ద్వేషించే బ్రిటిషు అధికారులపై తీవ్రవాద దాడులకు పూనుకున్నారు. ఈవిధంగా బ్రిటిషు వాళ్లు చేపట్టిన అణచి వేతను తగ్గించవచ్చని ఆశించారు. ఇందులో వాళ్లు విజయం సాధించలేదు. చాలామంది పట్టుబడి జైళ్లపాలయ్యారు, ఉరి తీయబడ్డారు. కానీ జాతీయతా భావాన్ని సజీవంగా ఉంచటంలో, దాని కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడేలా చేయటంలో వీళ్ల సఫలమయ్యారు.

L6U6P9

1915లో తిలక్ జైలు నుండి వచ్చిన తరవాత జాతీయ ఉద్యమం మళ్లీ ఊపందుకుంది. అతడు అనిబిసెంట్‌తో కలిసి 'హోం రూల్' కోసం ఉద్యమం ప్రారంభించాడు. 1916లో లక్నో ఒప్పందం ద్వారా కాంగ్రెసులోని రెండు వర్గాలు తిరిగి ఐక్యమయ్యాయి.

- విదేశీ బట్టలు తగులబెడుతున్న దాంట్లో పాల్గొంటున్న విద్యార్థిగా మిమ్మల్ని మీరు ఊహించుకోండి. ఆ రోజు ఏమి జరిగి ఉంటుంది, అప్పుడు మీ ఉద్వేగాలు ఎలా ఉంటాయో వివరించండి.
- ప్రజల న్యాయమైన కోరికలకు అధికారులు ఒప్పుకోకపోతే ప్రజలు ఏం చేయాలి?


లాలాలజపతి రాయ్


బాలగంగాధర తిలక్


బిపిన్ చంద్రపాల్


అనిబిసెంట్

### మచిలీపట్నం నుంచి కృష్ణా పత్రిక


ముట్నూరి కృష్ణారావు

కృష్ణా పత్రికను 1902లో మచిలీపట్నంలో స్థాపించారు. దాని స్థాపకులలో ముట్నూరి కృష్ణారావు ఒకరు. అతను 1902లో ఆ పత్రికలో ఉపసంపాదకుడిగా చేరాడు. 1907లో దాని సంపాదకుడై 1945లో అతడు చనిపోయేవరకు ఆ పత్రిక కోసం పని చేశాడు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమం అన్ని దశలలో అంటే వందేమాతరం ఉద్యమం, హోం రూల్ ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి వాటిని పత్రిక ప్రచారం చేసింది. పట్టణాల్లో విద్యావంతులనే కాకుండా పల్లెటూళ్లలో సామాన్య జనాన్ని కూడా కృష్ణా పత్రిక ప్రభావితం చేసింది. పత్రిక, దాని సంపాదకుడు బ్రిటిషు పాలకుల ఆగ్రహానికి పలుమార్లు గురయ్యారు.

L6VSE3

### మొదటి ప్రపంచ యుద్ధం: 1914–1919

1914లో మొదటి ప్రపంచ యుద్ధం మొదలైంది. ఇందులో బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా ఒకవైపు, జర్మనీ, దాని మిత్ర దేశాలు మరొకవైపు మోహరించాయి. ఈ యుద్ధం అయిదేళ్లపాటు జరిగింది. ఇందులో అంతిమంగా జర్మనీ ఓడిపోయింది. ఈ యుద్ధం కారణంగా అంతకు ముందు కనీ, వినీ ఎరుగని విధ్వంసం జరిగింది, ప్రజలు ఎన్నో కష్టాల పాలయ్యారు. యుద్ధం ముగిసిన తరవాత యూరపులో విప్లవాల యుగానికి తెర లేచింది. రష్యాలో సామ్యవాద విప్లవంలో విజయం సాధించింది. కమ్యూనిస్టుల నేతృత్వంలో రైతాంగం, కార్మిక వర్గం, సైనికులు చక్రవర్తిని తొలగించారు. భూస్వామ్యాన్ని, భూములు, కర్మాగారాలు వ్యక్తిగత ఆస్తిగా ఉండటాన్ని రద్దు చేశారు. వాళ్లు అన్ని దేశాల మధ్య సమానత్వం ఉండాలని కోరుకున్నారు. వలసపాలనలో మగ్గుతున్న దేశాల స్వాతంత్ర్యానికి మద్దతు ఇచ్చారు. భారతదేశంలో పన్నులు పెంచటం ద్వారా యుద్ధానికి కావలసిన వనరులను సమకూర్చుకోటానికి, సైన్యానికి కావలసిన ఆహారం, ఇతర వస్తువుల ఎగుమతికి బ్రిటన్ పూనుకోవటం వల్ల ఇక్కడి ప్రజలు ఎన్నో కష్టాలకు గురయ్యారు.

దీనివల్ల బ్రిటిషు పాలన పట్ల ప్రజల అసంతృప్తి మరింత పెరిగింది. రష్యా విప్లవం గురించి ప్రజలకు తెలియటంతో పీడిత పాలకులను తొలగించవచ్చనీ, అందరికీ సమానత్వం, న్యాయం అందించే సమాజాన్ని నిర్మించ వచ్చని భావించారు. భారతదేశంలో ప్రజాస్వామిక పాలనకోసం చేస్తున్న న్యాయమైన కోరికలను బ్రిటిషు ప్రభుత్వం అంగీకరించి, సంస్కరణలు చేస్తుందని అందరూ భావించారు. అయితే ఇలా జరగలేదు. ఇందుకు విరుద్ధంగా బ్రిటన్ మరిన్ని తీవ్ర చట్టాలు చేసింది. బ్రిటిషు అణచివేత ధోరణి కారణంగా ప్రజలలో అసంతృప్తి రగులుతున్న ఈ తరుణంలో మహాత్మా గాంధీ దక్షిణాఫ్రికా నుంచి తిరిగి వచ్చి భారత స్వాతంత్రోద్యమంలో భాగమయ్యాడు.

- మొదటి ప్రపంచ యుద్ధం గురించి, సామాన్య ప్రజలపై దాని ప్రభావం గురించి మరింత తెలుసుకోండి.
- ఆ సమయంలో యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, ఇతర దేశాలతో శాంతిని పునరుద్ధరించమని తమ ప్రభుత్వాన్ని కోరుతూ ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించారు. అలా చేయటం సరైనదేనా?

### కీలక పదాలు

L75NFQ

1. సార్వభౌమాధికారం
2. జాతి వివక్షత
3. తీర్మానం 4. మితవాదులు
5. వినతి పత్రాలు/ అర్జీలు
6. స్వదేశీ 7. బహిష్కరణ
8. పికెటింగ్ 9. స్వరాజ్యం
10. నిరసన 11. అతివాదం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. తప్పు వాక్యాలను సరిచేయండి: $AS_1$

    అ. భారత జాతీయ కాంగ్రెసు తొలిరోజుల్లో బొంబాయి ప్రజలు మాత్రమే పాల్గొనేవారు.

    ఆ. దేశంలో వివిధ ప్రాంతాలలో భారత పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు నెలకొల్పసాగారు.

    ఇ. మొదటి ప్రపంచ యుద్ధం తరవాత భారతదేశం ప్రజాస్వామిక దేశంగా మారుతుందని ఇక్కడి ప్రజలు ఆశించారు.

2. భారత జాతీయ కాంగ్రెసు మితవాద, అతివాద నాయకుల మధ్య అ) ప్రధాన కోరికలు, ఆ) ప్రజల సమీకరణల దృష్ట్యా జరిగే సంభాషణ ఊహించి రాయండి. $AS_1$

3. ఈ అధ్యాయం చదివిన తరవాత జాతీయోద్యమం తొలి దశలో ఎక్కువగా చదువుకున్న భారతీయులు పాల్గొన్నారని మరియమ్మ అభిప్రాయ పడింది. వాళ్ల భావాలు చాలావరకు పాశ్చాత్య ప్రభావం వల్ల ఏర్పడ్డాయి అని కూడా అనుకుంటోంది. ఆమెతో మీరు ఏకీభవిస్తారా? మీ కారణాలు పేర్కొనండి. $AS_2$

4. భారతదేశంపై బ్రిటిషు పాలన ఆర్థిక ప్రభావాన్ని ఎందుకు అర్థం చేసుకోవాలి? $AS_1$

5. 'స్వదేశి' అంటే మీరు ఏం అర్థం చేసుకున్నారు? దానివల్ల ప్రభావితమైన ముఖ్యమైన రంగాలు ఏమిటి? $AS_1$

6. బెంగాల్ విభజనకు దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఎలా స్పందించారు? $AS_1$

7. భారతదేశ పటంలో కింది వాటిని గుర్తించండి: $AS_5$

    1. కలకత్తా (కోల్‌కతా) 2 మద్రాసు (చెన్నై) 3. బొంబాయి (ముంబాయి) 4. లక్నో

8. ప్రపంచ పటంలో కింది వాటిని గుర్తించండి. $AS_5$

    1. బ్రిటన్ 2. ఫ్రాన్స్ 3. రష్యా 4. జర్మనీ

9. మన దేశం కోసం తిలక్, భగత్ సింగ్, గాంధీజీ, సుభాష్ చంద్ర బోస్ వంటి నాయకులు జీవితాలను త్యాగం చేసారు. వారు తమ జీవితాలను దేశం కోసం త్యాగం చేయకుండా ఉన్నట్లయితే ఏమి జరిగేది? $AS_6$

10. ఈ మధ్యకాలంలో మీ ప్రాంతంలో ఏవైనా ఉద్యమాలు జరిగాయా? అవి ఎందుకు జరిగాయి? $AS_4$

### ప్రాజెక్టు పని :

భారత జాతీయోద్యమంలో పాల్గొన్న జాతీయ నాయకుల చిత్రాలను సేకరించి ఆల్బమ్ తయారు చేయండి. దానిపై ఒక నివేదిక తయారుచేసి ప్రదర్శించండి.


పాఠం 11 బి

# జాతీయోద్యమం : మలి దశ 1919-1947

## మహాత్మా గాంధీ రాక

1915లో గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి భారత దేశానికి తిరిగి వచ్చాడు. అక్కడ జాతి వివక్షతకు వ్యతిరేకంగా అహింసాయుత నిరసనలలో భారతీయ ప్రజలను నడిపించి గౌరవప్రదమైన నాయకుడుగా అంతర్జాతీయ గుర్తింపు పొందాడు. దక్షిణ ఆఫ్రికాలో అతడు నడిపిన ఉద్యమాల కారణంగా అన్ని వర్గాల భారతీయులతో హిందువులు, ముస్లింలు, పార్శీలు, క్రిస్టియన్లు, గుజరాతీలు, తమిళులు, ఉత్తర భారతీయులు ధనిక వ్యాపారస్తులు, న్యాయవాదులు, కార్మికులతో అతడికి పరిచయాలు ఏర్పడ్డాయి.

భారతదేశంలో మహాత్మా గాంధీ దేశం మొత్తం తిరుగుతూ, ప్రజలను, వాళ్ల పరిస్థితులను, అవసరాలను అర్థం చేసుకుంటూ మొదటి సంవత్సరం గడిపాడు. మొదట అతడు చంపారన్, ఖేడాలలో అధిక పన్నులు, దోపిడిచేసే విధానాలకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించాడు. అహ్మదాబాదులో 1918లో మిల్లుకార్మికుల సమ్మెకు విజయవంతంగా నాయకత్వం వహించాడు. జీవితాంతం అతడితో కలిసి పనిచేసిన రాజేంద్ర ప్రసాద్, వల్లభాయ్ పటేల్ వంటి నాయకులతో గాంధీజీకి ఈ ఉద్యమాలతో పరిచయం ఏర్పడింది. 1919-1922 మధ్య గాంధీ నిర్వహించిన ఉద్యమాలపై ప్రస్తుతం దృష్టి కేంద్రీకరిద్దాం.


గాంధీజి

## రౌలట్ చట్టం, జలియన్ వాలాబాగ్ మారణకాండ


L7EJHD

మహాత్మా గాంధీ కాంగ్రెసులో ఏ వర్గంలో చేరకుండా సొంతంగా రాజకీయ కార్యక్రమాలను రూపొందించుకొన్నాడు, జాతీయ రాజకీయాలలో తనకంటూ ఒక స్థానం ఏర్పరచుకున్నాడు. ఈ క్రమంలో అతడు 1917లో చంపారన్ ఆందోళన, 1918లో ఖైరా నిరసనలు, 1918 అహ్మదాబాదు నూలు మిల్లు కార్మికుల సమ్మె వంటి కార్యక్రమాలను చేపట్టాడు. అనతికాలంలోనే అతడు అత్యంత జనాదరణ పొందిన వ్యక్తిగా, రాజకీయ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారాడు. 1919లో బ్రిటిషు ప్రభుత్వం చేసిన రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా సత్యాగ్రహానికి పిలుపు ఇచ్చాడు. భావ ప్రకటన స్వేచ్ఛవంటి మౌలిక హక్కులను కాలరాసే విధంగా పోలీసులకు అధికారాలను ఈ చట్టం కల్పించింది. ఎవరినైనా ఉగ్రవాది అని పోలీసులు అనుమానిస్తే వాళ్లను అరెస్టు చేసి ఎటువంటి విచారణ లేకుండా జైల్లో పెట్టవచ్చు. ఒకవేళ విచారణ జరిగినా అది చాలా రహస్యంగా సాగి తనకు వ్యతిరేకంగా రుజువులు ఏమున్నాయో ఆరోపణలకు గురైన వ్యక్తికి కూడా తెలియదు. ప్రజల మౌలిక స్వేచ్ఛను హరించే హక్కు ప్రభుత్వానికి లేదని మహాత్మా గాంధీ, మహమ్మద్ అలీ జిన్నా, ఇతర నాయకులు భావించారు. ఇది చాలా నిరంకుశత్వ, 'రాక్షస' చట్టమని వాళ్లు విమర్శించారు. 1919 ఏప్రిల్ 6న ఈ చట్టానికి వ్యతిరేకంగా అహింసాత్మకంగా హర్తాళ్ పాటించి, 'ప్రార్థన, గౌరవ భంగ' దినంగా నిర్వహించమని భారత ప్రజలను గాంధీజీ కోరాడు. ఈ ఉద్యమాన్ని ఆరంభించటానికి సత్యాగ్రహ సభలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పట్టణాలకు పరిమితమైనప్పటికీ బ్రిటిషు ప్రభుత్వానికి

### మతతత్వం, మతతత్వ సంస్థలు

అందరి ప్రయోజనాల గురించి కాక ఒక ప్రత్యేక మతస్తుల ప్రయోజనాలను మతతత్వం ప్రోత్సహిస్తుంది. ఆ మతస్తుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని రాజ్యాన్ని, ప్రభుత్వాన్ని నడపాలని అది నమ్ముతుంది. ఇందుకు విరుద్ధంగా చిన్న సమూహాలకంటే జాతి పెద్దదని, ఏ మతమూ లేనివాళ్లతో సహా అందరి ప్రయోజనాలను జాతీయతావాదం కోరుకుంటుంది. ఈ దృక్పథాన్ని 'లౌకిక' దృక్పథం అంటారు. మతసంబంధ వ్యవహారాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోగూడదు, అలాగే ప్రభుత్వంలో మతాలు జోక్యం చేసుకోగూడదని ఇది భావిస్తుంది. ఏ ఒక్క మతానికో ప్రాధాన్యతను ఇవ్వకుండా అన్ని మతాలను సమానంగా చూడాలి. ఈ విధంగా లౌకిక దృక్పథం, మతతత్వం విరుద్ధ అభిప్రాయాలు కలిగి ఉన్నాయి. ఇంతకుముందు చెప్పుకున్నట్టు మతతత్వం ఒక ప్రత్యేక మత ప్రయోజనాలకోసం పాటుపడుతుంది, ఆ మతం అవసరాల ప్రకారం ప్రభుత్వం కూడా నడుచుకోవాలని కోరుతుంది.

ఒకవైపున జాతీయతాభావాలు పెంపొందుతుండగా 20వ శతాబ్దం ఆరంభంలో భారతదేశంలో మతతత్వ సంస్థలు కూడా పుట్టుకొచ్చాయి. 1906లో ఢాకాలో ముస్లిం భూస్వాములు, నవాబులు కలిసి అఖిల భారత ముస్లిం లీగ్‌ను ఏర్పాటు చేశారు. ఇది బెంగాల్ విభజనను సమర్థించింది. ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు కావాలని కోరుకుంది. 1909లో ప్రభుత్వం దీనికి సమ్మతించింది. విధానసభలో కొన్ని సీట్లను ముస్లింలకు రిజర్వు చేశారు, ముస్లిం ఓట్ల ద్వారా వీళ్లు ఎన్నికవుతారు. తమ మత బృందాలకు కొన్ని ప్రయోజనాలను సమకూర్చటం ద్వారా రాజకీయ నాయకులు అనుచర వర్గాన్ని ఏర్పరచుకునేలా ఇది ప్రేరేపించింది.

హిందువులను ఏకం చేసే ఉద్దేశంతో, ఇతర మతాలకు మారిన వాళ్లని తిరిగి హిందువులుగా మార్చే ఉద్దేశంతో 1915లో హిందూ మహాసభ ఏర్పడింది. పండిత్ మదన్ మోహన్ మాలవీయ వంటి నాయకులు దీనికి నేతృత్వం వహించారు. భారతదేశంలో ముస్లిం లీగ్, ఇతర మత బృందాలకు జవాబుగా వీళ్లు దీనిని ఏర్పాటు చేశారు.

వ్యతిరేకంగా చేపట్టిన అఖిల భారత పోరాటంగా రౌలట్ సత్యాగ్రహాన్ని పేర్కొనవచ్చు. 1919 ఏప్రిల్ 6న దేశవ్యాప్తంగా అనేక ప్రదర్శనలు, హర్తాళ్‌లు జరిగాయి. వీటిని అణచివేయటానికి ప్రభుత్వం హింసకి కూడా వెనకాడలేదు. ఏప్రిల్ 13న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జరిగిన జలియన్‌వాలాబాగ్ మారణకాండ ప్రభుత్వ అకృత్యాలకు పరాకాష్ఠ, ప్రజలు నిర్వహిస్తున్న శాంతియుత సమావేశంపై జనరల్ డయ్యర్ కాల్పులకు ఆదేశించాడు. ఈ కాల్పుల్లో సుమారు 400 మంది చనిపోయారు, వేలాదిమంది గాయపడ్డారు. ఈ మారణకాండ గురించి తెలుసుకున్న రవీంద్రనాథ్ ఠాగూర్ దేశ ప్రజల బాధను, ఆక్రోశాన్ని తెలియచేయటానికి తనకిచ్చిన 'నైట్‌హుడ్'ని పరిత్యజించాడు.

రౌలట్ సత్యాగ్రహంలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా హిందువులు, ముస్లింలు కలిసి పోరాడేలా కృషి చేశారు. మహాత్మా గాంధీ కూడా ఇదే పిలుపునిచ్చాడు – భారతదేశం అంటే అక్కడ నివసిస్తున్న – హిందువులు, ముస్లింలు, ఇతర మతాల వాళ్లందరిది అని ఎప్పుడూ అంటూ ఉండేవాడు. న్యాయమైన కోరికలకు హిందువులు, ముస్లింలు ఒకరికొకరు మద్దతు ఇవ్వాలని అతడు భావించాడు.

**రౌలట్ చట్టం :** ఇది 1919 మార్చి, 18లో బ్రిటీష్ వారు భారతదేశంలో ప్రవేశపెట్టిన చట్టం. దీని ప్రకారం ప్రభుత్వం ఎలాంటి విచారణ లేకుండా అనుమానితులను, ఉద్యమాలలో పాల్గొనే వారిని నిర్బంధించేలా చట్టం తెచ్చారు. దీనిని భారతీయులందరూ ముక్త కంఠంతో వ్యతిరేకించారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించారు.

- తీవ్రవాదాన్ని అణిచివేయటానికి పోలీసులకు ఇటువంటి అధికారాలు ఇవ్వటం సరైనదేనా?
- స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఇటువంటి చట్టాలను ప్రజలు అంతగా ఎందుకు వ్యతిరేకించారు?


## ఖిలాఫత్ ఆందోళన, సహాయ నిరాకరణోద్యమం

ఇటువంటి వాటిలో ఖిలాఫత్ సమస్య ఒకటి. బ్రిటన్ 1920లో కఠినమైన ఒప్పందాన్ని టర్కీ సుల్తానుపై రుద్దింది. టర్కీ సుల్తాన్‌ను ఖలీఫా అంటారు. జలియన్‌వాలాబాగ్ హత్యాకాండ మాదిరిగానే ప్రజలు దీని పట్ల తీవ్ర వ్యతిరేకతను వ్యక్తపరిచారు. మునుపటి ఒట్టోమాన్ సామ్రాజ్యంలోని ముస్లిం పవిత్ర స్థలాలపై నియంత్రణ ఖలీఫాకే ఉండాలని భారతీయ ముస్లిలు కోరుకున్నారు. ఖిలాఫత్ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న మహమ్మద్ ఆలి, షౌకత్ ఆలిలు పూర్తిస్థాయి సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టాలని భావించారు.

గాంధీజీ వాళ్ల పిలుపుకి పూర్తి మద్దతు ఇచ్చాడు. "పంజాబ్ తప్పులు" (జలియన్‌వాలా మారణకాండ), ఖిలాఫత్ తప్పులకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టి స్వరాజ్యం కోరాలని కాంగ్రెసుపై అతడు వత్తిడి తెచ్చాడు. 1920లో నాగపూర్‌లో జరిగిన కాంగ్రెసు సమావేశంలో గాంధీజీ కాంగ్రెసు నాయకుడుగా గుర్తింపబడ్డాడు. ఈ సమావేశంలో కాంగ్రెసు ఉద్దేశం శాంతియుత, చట్టబద్ధ మార్గాల ద్వారా స్వరాజ్యం సాధించటంగా పేర్కొన్నారు. స్వరాజ్య స్థాపనకు సహాయ నిరాకరణను మార్గంగా ఆమోదించారు.

1921-22 నాటికి సహాయ నిరాకరణ ఉద్యమం ఊపందుకుంది. ప్రభుత్వం నడుపుతున్న పాఠశాలలు, కళాశాలలను వేలాదిగా విద్యార్థులు విడిచిపెట్టారు. మోతిలాల్ నెహ్రూ, సి ఆర్ దాస్, సి రాజగోపాలాచారి, అసఫ్ ఆలి వంటి ఎంతోమంది న్యాయవాదులు తమ వృత్తిని వదిలిపెట్టారు. బ్రిటిషువాళ్లు ఇచ్చిన బిరుదులను తిరిగి ఇచ్చేశారు, శాసనసభలను బహిష్కరించారు. విదేశీ బట్టలను బజారులో కుప్పలుగా వేసి ప్రజలు తగలబెట్టారు. 1920-22 మధ్య విదేశీ వస్త్ర దిగుమతి గణనీయంగా తగ్గిపోయింది. ప్రజలు చరఖాపై నూలు వడకాలని (దీనినే ఖాదీ అంటారు) గాంధీ ఉద్యమం చేపట్టాడు. దేశాన్ని స్వావలంబన దిశగా నడపాలన్న కోరిక ప్రతి ఇంటా వ్యాపించింది.

L7NFJ1



*చిత్రం 11బి.1 : భారత జాతీయోద్యమ మలి దశలో చరఖాను స్వదేశీకి చిహ్నంగా గాంధీజీ ఎన్నుకున్నాడు.*

అయితే ఇదంతా కొండలో శిఖర భాగమంతే. దేశంలో అనేక ప్రాంతాలు తిరగబడటానికి సిద్ధంగా ఉన్నాయి. ఉదాహరణకు ఆంధ్రాప్రాంతంలో ఏం జరుగుతోందో చూద్దాం.

జాతీయతా కార్యక్రమాలకు గుంటూరు జిల్లా కేంద్రంగా మారింది. ఇందులో విద్యార్థులే కాకుండా వ్యాపారస్తులు, పల్లెటూళ్లలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనసాగారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో చెప్పుకోదగింది చీరాల-పేరాల ఉద్యమం. ఈ పట్టణాన్ని నగరపాలికగా మార్చి ప్రభుత్వం ప్రజల మీద భారీగా పన్నులు వేసింది. దుగ్గిరాల గోపాల కృష్ణయ్య నాయకత్వంలో 15,000 మంది ప్రజలు పన్ను కట్టటానికి నిరాకరించి ఊరు వదిలి పెట్టారు. ఊరి బయట రాంనగర్ పేరుతో కొత్త నివాసం ఏర్పాటు చేసి పదకొండు నెలలు అక్కడే ఉండిపోయారు. రైతులు భూమి శిస్తులు కట్టకుండా సహాయ నిరాకరణ

ఉద్యమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. అధిక సంఖ్యలో గ్రామ అధికారులు రాజీనామా చేశారు. *"గాంధీజీ స్వరాజ్యం వస్తోంది, ఈ ప్రభుత్వానికి పన్నులు కట్టం,"* అని ప్రజలు ప్రకటించారు.

మరొక ముఖ్యమైన పరిణామం గుంటూరు జిల్లా పల్నాటి తాలూకాలోనూ, కడపజిల్లా రాయచోటి తాలూకాలోనూ జరిగిన అటవీ సత్యాగ్రహం. దీనిని పుల్లరి సత్యాగ్రహం అని కూడా అంటారు. అటవీ శాఖకు పుల్లరి (అడవులలో పశువులు మేపడంపై వేసే పన్ను) చెల్లించకుండానే రైతులు పశువులను అడవిలో మేపటానికి పంపించసాగారు. పల్నాడులోని అనేక గ్రామాలలో ప్రజలు గాంధి రాజ్యాన్ని ప్రకటించి పోలీసు బృందాలపై దాడులు చేయసాగారు. వలస పాలన అంతం అవుతోందని, అడవులు తిరిగి గ్రామప్రజల ఆధీనంలోకి వస్తాయని ప్రజలు నమ్మారు. ఈ రెండు తాలూకాలలో ఆందోళన జరుగుతున్న సమయంలో అటవీశాఖ పనిచేయటం దాదాపుగా సాధ్యం కాలేదు.

- పల్నాడు ప్రాంతంలో కన్నెగంటి హనుమంతు పుల్లరి సత్యాగ్రహం గురించి మీ ఉపాధ్యాయుల ద్వారా అడిగి తెలుసుకోండి?

పైన పేర్కొన్న సంఘటనలు చూస్తుంటే తమ పేదరికం, కష్టాల నుంచి గాంధీజీ విముక్తి కల్పిస్తాడని ప్రజలు విశ్వసించారని తెలుస్తుంది. గాంధీజీ వర్గ వైరుధ్యాన్ని కాకుండా వర్గ ఐక్యతను కోరుకున్నాడు. అయినప్పటికీ, భూమిలేని వ్యవసాయ కూలీలు గాంధీజీ తమకు భూమి ఇప్పిస్తాడనీ, జమీందారులకు వ్యతిరేకంగా పోరాటంలో తమకు సహకరిస్తాడనీ రైతులు భావించారు. కొన్ని సందర్భాలలో తాము సాధించిన విజయాలను సాధారణ ప్రజలు గాంధీజీకి ఆపాదించసాగారు. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్‌కి చెందిన ప్రజలు ఒక పెద్ద ఉద్యమం చేసి కౌలుదారులను అన్యాయంగా తొలగించటాన్ని ఆపివేయగలిగారు. అయితే గాంధీజీ నాయకత్వంలో తమ కోరికలు సాధించబడ్డాయని భావించారు. మరికొన్ని సందర్భాలలో గాంధీజీ పేరు చెప్పి ఆదివాసీలు, రైతాంగం గాంధీజీ ఆదర్శాలకు విరుద్ధమైన చర్యలు చేపట్టేవారు.

- చీరాల-పేరాల ఉద్యమం గురించి, అటవీ సత్యాగ్రహం గురించి మరిన్ని వివరాలు తెలుసుకోండి. వాటిపై ఒక నాటిక తయారుచేసి తరగతిలో ప్రదర్శించండి.

## 1922-29 మధ్య ఘటనలు

మహాత్మా గాంధీ హింసాత్మక ఉద్యమాలకు వ్యతిరేకి అని మీకు తెలుసు. 1922లో చౌరి చౌరాలో (గొరఖ్‌పూర్, ఉత్తరప్రదేశ్) రైతుల గుంపు పోలీసు స్టేషనుకు నిప్పు పెట్టినందుకు సహాయ నిరాకరణ ఉద్యమాన్ని అతడు అర్ధాంతరంగా ఆపేశాడు. ఆ రోజు ఘటనలో 22 మంది పోలీసులు చనిపోయారు. శాంతియుతంగా జరుగుతున్న ప్రదర్శనపై పోలీసులు కాల్పులు జరపటంతో ప్రజలు ఆగ్రహావేశాలకు గురయ్యారు.

సహాయ నిరాకరణోద్యమం అయిపోయిన తరవాత గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెసు నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టాలని గాంధీజీ అనుచరులు భావించారు. సి.ఆర్.దాస్, మోతిలాల్ నెహ్రూ వంటి ఇతర నాయకులు కాంగ్రెసు ఎన్నికల్లో పోటీచేసి, విధాన సభలలోకి ప్రవేశించి ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయాలని వాదించారు. 1920ల మధ్య కాలంలో గాంధేయవాదులు గ్రామాలలో చేపట్టిన సామాజిక కార్యక్రమాల ద్వారా తమ మద్దతును విస్తృత పరుచుకోగలిగారు. 1930లో శాసనోల్లంఘన ఉద్యమాన్ని ప్రారంభించటానికి ఇది ఎంతో ఉపయోగపడింది.

1920ల మధ్యకాలంలో రెండు ముఖ్యమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి: ఒకటి, హిందూ

సంస్థ అయిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) ఏర్పడటం, రెండు, భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడటం. భారతదేశం ఎలా ఉండాలో ఈ రెండు పార్టీలకు పూర్తి భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. మీ ఉపాధ్యాయుల సహాయంతో వాటి భావాలను తెలుసుకోండి. ఈ కాలంలోనే విప్లవ జాతీయతావాది భగత్ సింగ్ ఉద్యమించాడు.


### శాసనోల్లంఘన ఉద్యమం : ఉప్పు సత్యాగ్రహం (1930-32)

జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షుడిగా భారత జాతీయ కాంగ్రెసు 1929లో లాహోర్‌లో సమావేశమయింది. ఈ సమావేశంలో 'సంపూర్ణ స్వరాజ్యం' సాధించటం తన లక్ష్యమని కాంగ్రెసు ప్రకటించింది. దానిని సాధించటానికి శాసనోల్లంఘన ఉద్యమం మొదలు పెట్టాలని తీర్మానించింది. కాంగ్రెసులోని వామపక్ష భావాలు కలిగిన వాళ్లు క్రియాశీలక పాత్ర వహించి జాతీయ లక్ష్యాన్ని, కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ ఉత్సాహంతో కాంగ్రెసు కార్యవర్గం జనవరి 26ను సంపూర్ణ స్వరాజ్య దినంగా జరుపు కోవాలని నిర్ణయించింది.

ఉప్పు తయారీపై ప్రభుత్వం పన్ను విధించటం వల్ల సామాన్య ప్రజలు కొనలేనంతగా దాని ధరలు పెరిగి పోయాయి. గుజరాత్ సముద్ర తీరంలో ఉన్న దండి అనే చిన్న ఊరిలో ఉప్పు తయారు చేయడం ద్వారా ఈ చట్టాలను ఉల్లంఘించాలని 1930, మార్చి 12న అహ్మదాబాదులోని సబర్మతి ఆశ్రమంలో గాంధీజీ నిర్ణయం తీసుకున్నాడు. ఆ మరునాడు 78 మంది అనుచరులతో గాంధీజీ దండియాత్ర మొదలుపెట్టాడు.

సబర్మతి ఆశ్రమం నుంచి దండి వరకు ఉన్న 375 కిలోమీటర్ల దూరాన్ని 24 రోజులలో నడిచారు. దండియాత్రలో గాంధీజీ ఉపన్యాసాల గురించి, ప్రజల స్పందన గురించి దినపత్రికలు రోజూ వార్తలు ప్రచురించేవి. యాత్ర మార్గంలో వందలాదిగా గ్రామ అధికారులు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. 1930 ఏప్రిల్ 6న దండికి

L7XBKN




*చిత్రం 11బి.2 : స్వాతంత్ర్య ఉద్యమానికి సంబంధించి రెండు చిత్రాలు : 1. దండి వద్ద ఉప్పు తీస్తున్న గాంధీజీ 2. దర్శన ఉప్పు కర్మాగారం ముందు కవాతు చేస్తున్న సరోజినీ నాయుడు.*

చేరుకున్న గాంధీజీ పిడికెడు ఉప్పు తీసి బ్రిటిషు పాలనలో, బ్రిటిషు చట్టాలను ఉల్లంఘించి భారత ప్రజల తిరస్కరణను తెలియ చేశాడు.

దేశమంతటా నూతనోత్తేజం రగిలింది. దేశంలో పలుప్రాంతాలలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించారు. శాసనోల్లంఘన ఉద్యమంలో మహిళలు కూడా పాల్గొన్నారు. ఒక్క ఢిల్లీలోనే 1600 మహిళలు జైలుపాలయ్యారు. ఈ ఉద్యమం కేవలం ఉప్పు సత్యాగ్రహానికే పరిమితం కాలేదు. విదేశీ వస్త్ర, మద్యం దుకాణాల వద్ద పికెటింగ్ చేశారు, ఆ వస్తువులను తగులబెట్టారు. బ్రిటిషు పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగాలను కూడా బహిష్కరించారు. ఈ ఉద్యమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వం తీవ్ర అణచివేతతో, నిరాయుధులైన స్త్రీ, పురుషులపై లాఠీలు ఝుళిపించటం, కాల్పులు జరపటం వంటి వాటితో విరుచుకుపడింది. గాంధీజీ, ఇతర కాంగ్రెసు నాయకులతోపాటు 90,000కు పైగా సత్యాగ్రహులు చెరసాల పాలయ్యారు. పోలీసుల కాల్పుల్లో 110 మంది చనిపోయారు, 300కు పైగా గాయపడ్డారు. పత్రికలపై ప్రభుత్వం అనేక పరిమితులు విధించింది. ముస్లింలు, జమీందారులు, ఇతర మైనారిటీలను తమ వైపుకి తిప్పుకోవటం ద్వారా భారతీయులను విడదీయటానికి బ్రిటిషు పాలకులు ప్రయత్నించారు. ఖద్దరు బట్టలు వేసుకోవటం, అంటరానితనాన్ని నిర్మూలించటం వంటి నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టటం ద్వారా దేశమంతటా సామాజిక ఐక్యతను సాధించటానికి నాయకులు కృషిచేశారు. గాంధీజీ పిలుపుకి స్పందిస్తూ మహిళలు అసంఖ్యాకంగా పరదా వదిలి ఉద్యమంలో పాల్గొన్నారు.

భారత ప్రజలందరూ కలిసి పోరాడిన దానికి ప్రతిఫలంగా 1935లో భారత ప్రభుత్వ చట్టం ఏర్పడింది. దీని ప్రకారం రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి లభిస్తుంది. రాష్ట్రాల శాసనసభలకు 1937లో ఎన్నికలు నిర్వహించారు. 11 రాష్ట్రాలకు ఏడింటిలో కాంగ్రెసు ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కాంగ్రెసు ప్రభుత్వాలు రెండేళ్లు పూర్తి చేసుకున్న తరవాత, 1939లో రెండవ ప్రపంచ యుద్ధం మొదలైంది. హిట్లర్‌ని వ్యతిరేకిస్తున్న కాంగ్రెసు నాయకులు యుద్ధంలో బ్రిటన్‌కి సహాయ పడటానికి సిద్ధమయ్యారు. అయితే యుద్ధం తరవాత భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలని కోరుకున్నారు. ఈ కోరికను బ్రిటన్ తిరస్కరించింది. దీనికి నిరసనగా కాంగ్రెసు ప్రభుత్వాలు రాజీనామా చేశాయి.

L8G3NY

## క్విట్ ఇండియా ఉద్యమం-1942: చేయండి లేదా చావండి

భారతదేశ ప్రజలను, సంపదను రెండవ ప్రపంచ యుద్ధానికి ఉపయోగించుకోవాలని బ్రిటన్ అనుకుంది. యుద్ధంలో మద్దతుకు బదులుగా భారతదేశానికి స్వయం పాలనా అధికారాన్ని ఇవ్వాలని కాంగ్రెసు కోరుకుంది. ఈ కోరికను అంగీకరించటానికి బ్రిటన్ ఎంత

### రెండవ ప్రపంచ యుద్ధం (1939-1945)

హిట్లర్ నేతృత్వంలో నాజీపార్టీ ప్రపంచ మంతటినీ తన ఆధీనంలోకి తెచ్చుకోవాలన్న ఉద్దేశంతో బ్రిటన్, ఫ్రాన్స్, సోవియట్ రష్యా, ఇతర దేశాలపై యుద్ధం ప్రకటించింది. ఇంగ్లండ్, ఫ్రాన్స్, రష్యాలతో అమెరికా చేతులు కలిపింది (వీటిని మిత్ర కూటమి అంటారు). జర్మనీకి జపాన్, ఇటలీ దేశాలు మద్దతు ఇచ్చాయి. మానవ చరిత్రలోనే అతి దారుణమైన ఈ యుద్ధం 1939లో మొదలయ్యి 1945లో రష్యా సైన్యాలు బెర్లిన్‌ని చేజిక్కించుకోవటంతో, జపాన్‌లోని హిరోషిమా, నాగసాకీలపై అమెరికా అణుబాంబు వేయడంతో ముగిసింది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛలపక్షాన ఉన్న ప్రజలందరూ హిట్లర్‌ని వ్యతిరేకించి మిత్ర కూటమికి మద్దతు పలికారు. అయితే భారతదేశంలో అదే సమయంలో బ్రిటిషు పాలకులకు వ్యతిరేకంగా పోరాటం సాగుతుండటంతో భారతీయులలో ఇది సందిగ్ధతలను నెలకొల్పింది.

L877MB

మాత్రమూ సిద్ధంగా లేదు. 1942 ఆగస్టు 8న బొంబాయిలో కాంగ్రెసు కార్యవర్గం సమావేశమయ్యి 'భారత దేశంలో బ్రిటిషు పాలన వెంటనే అంతం కావాలని' స్పష్టంగా పేర్కొంటూ తీర్మానం చేసింది. 'క్విట్ ఇండియా' తీర్మానం చేసిన తరవాత దేశ ప్రజలను ఉద్దేశించి గాంధీజీ ఎంతో విలువైన సందేశమిచ్చాడు: *"ఈ క్షణంనుంచి ప్రతి ఒక్క స్త్రీ, పురుషుడు తమను తాము స్వతంత్రులుగా పరిగణించాలి, స్వతంత్రులైనట్లు వ్యవహరించాలి... సంపూర్ణ స్వాతంత్ర్యం తప్పించి మరి దేనికీ నేను సిద్ధంగా లేను. అందరం ఉద్యమించి భారతదేశాన్ని విముక్తం చేద్దాం లేదా ఆ ప్రయత్నంలో చనిపోదాం."*

1942 ఆగస్టు 9 ఉదయానికే గాంధీజీ, పటేల్, నెహ్రూ, మౌలానా అజాద్, ఆచార్య కృపలానీ, రాజేంద్ర ప్రసాద్ వంటి అనేక మంది కాంగ్రెసు నాయకులను ప్రభుత్వం జైలుపాలు చేసింది. దేశవ్యాప్తంగా హర్తాళ్‌లు, సమ్మెలు, ప్రదర్శనల రూపంలో ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేశారు. దురదృష్టవశాత్తు ఉద్యమం హింసాత్మక మలుపు తీసుకుంది. శ్రామికవర్గం కర్మాగారాలను బహిష్కరించింది. పోలీసుస్టేషన్లు, పోస్టాఫీసులు, రైల్వేస్టేషన్లు వంటి ప్రభుత్వ ఆస్తులపై విద్యార్థులు దాడులకు దిగారు. టెలిగ్రాఫ్, టెలిఫోన్ తీగలను కోసేశారు, రైల్వే పట్టాలను తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వాహనాలు, సైనిక వాహనాలు, రైల్వే బోగీలను తగలబెట్టారు. ఈ సమయంలో మద్రాసు, బొంబాయి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో బ్రిటిషు అధికారం కనపడకుండా పోయింది. 1942-44 మధ్యకాలంలో మిద్నాపూర్ ప్రజలు సమాంతర ప్రభుత్వాన్ని నెలకొల్పారు. ఈ ఉద్యమం ఫలితంగా 10 లక్షల పౌండ్ల విలువైన ఆస్తులు

### సుభాష్ చంద్ర బోస్, ఐఎన్ఏ

L8PYQL

సుభాష్ చంద్ర బోస్ స్వరాజ్య ఉద్యమకారుడు, విప్లవవాద జాతీయవాది. అతడు రాస్ బిహారీ బోస్ సహకారంతో బర్మా, అండమాన్‌లలో భారత జాతీయ సైన్యాన్ని (ఐఎన్ఏ) ఏర్పాటు చేశాడు. ఐఎన్ఏలో 60,000కు పైగా సైనికులు ఉండేవారు. ఈ పోరాటంలో జపాన్ అతడికి సహాయం చేసింది. 1943 అక్టోబరు 21న సింగపూర్‌లో స్వతంత్ర భారత (ఆజాద్ హింద్) తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 1944 మార్చి 18న 'ఢిల్లీకి పదండి' నినాదంతో ఐఎన్ఏ బర్మా సరిహద్దులు దాటి భారతదేశంలో ప్రవేశించింది.


1944 మార్చిలోనే నాగాల్యాండ్‌ని కోహిమాలో భారత జెండాను ఎగరవేశారు. అయితే యుద్ధ పరిస్థితులు మారి 1944-45 శీతాకాలంలో బ్రిటన్ ప్రతిఘటనకు దిగటంతో, రెండవ ప్రపంచ యుద్ధంలో అంతిమంగా జపాను ఓడిపోవటంతో ఐఎన్ఏ ఉద్యమం కుప్పకూలిపోయింది. బ్యాంకాక్ నుంచి టోక్యోకి 1945 ఆగస్టు 23న విమాన ప్రయాణం చేస్తుండగా జరిగిన ప్రమాదంలో సుభాష్ చంద్ర బోస్ చనిపోయాడని చెబుతారు.




*చిత్రం 11బి.3 : (ఎడమ) లొంగిపోయిన ఐఎన్ఏ సైనికులు, (కుడి పైన) తపాలా ముద్ర, (కుడి కింద) పోరాడుతున్న ఝాన్సీ దళం*


సుభాష్ చంద్ర బోస్


భగత్ సింగ్


జె.బి. కృపలాని


అబుల్ కలామ్ ఆజాద్

ధ్వంసమయ్యాయి. 30 మంది పోలీసులు, 10 మంది సైనికులు చనిపోయారు. ప్రభుత్వ అణిచివేతలో అనేకమంది ప్రజలు చనిపోయారు, వేలాదిమంది నిర్బంధానికి గురయ్యారు. 1943 చివరి నాటికి 90,000కి పైగా ప్రజలు జైలుపాలయ్యారు, పోలీసు కాల్పుల్లో వెయ్యి మందికి పైగా చనిపోయారు. అనేక ప్రాంతాలలో విమానాల నుంచి ప్రజలపై మెషీన్ గన్నులతో కాల్పులు జరపమని ఆదేశాలు ఇచ్చారు. అయితే అంతిమంగా ఉద్యమం ముందు బ్రిటిషు రాజ్యం మోకరిల్లక తప్పలేదు.

## స్వాతంత్ర్యం, విభజన దిశగా


ఈలోగా దేశ వాయవ్య, తూర్పు ప్రాంతాలలో ముస్లింలకు స్వతంత్ర రాష్ట్రాలు' కోరుతూ 1940లో ముస్లిం లీగ్ తీర్మానం చేసింది.

L8YUS9

భారత ఉప ఖండంలో ముస్లింలకు స్వయం ప్రతిపత్తి ఏర్పాటును ముస్లిం లీగ్ ఎందుకు కోరింది? 1930ల నుంచి హిందువులకు భిన్నంగా ముస్లింలను ప్రత్యేక 'జాతి'గా ముస్లిం లీగ్ పరిగణించసాగింది. 1920లు, 1930లలో హిందూ – ముస్లింల మధ్య

### విప్లవవాద సంస్థల యుగం

1940ల తరవాత కమ్యూనిస్టు పార్టీ, కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, కిసాన్ సభ, దళిత సంఘాల వంటి విప్లవవాద సంఘాల కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఇవి పేదలు, సన్నకారురైతులు, కార్మికులు, గిరిజనులు, దళితులను సమీకరించి బ్రిటిషు పాలనపైనే కాకుండా వడ్డీ వ్యాపారస్తులు, కర్మాగార యజమానులు, ఉన్నత కుల భూస్వాములు వంటి స్థానిక దోపిడీదారులకు వ్యతిరేకంగా సంఘటిత పరచసాగాయి. నూతన స్వతంత్ర భారతదేశంలో ఈ అణగారిన వర్గాల ప్రయోజనాలకు సరైన చోటు కల్పించాలని, తరతరాల వాళ్ల కష్టాలు అంతం కావాలని, సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలని ఈ సంస్థలు కోరుకున్నాయి. అప్పటివరకు ధనిక వర్గాలు అధికంగా ఉన్న స్వాతంత్రోద్యమం వీళ్ల చేరికతో కొత్త కోణాన్ని, శక్తినీ సంతరించుకుంది. బ్రిటిషు పాలకులు అంతిమంగా దేశం వదిలి వెళ్లటానికి ఇది సహకరించింది. పేదలు, ప్రత్యేకించి తూర్పు భారతదేశంలోని సంఘ బహిష్కృతులు, కార్మికులు ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1940లలో జరిగిన ఉద్యమాలలో మలబారు కౌలు రైతులు, తెభాగా కౌలురైతులు, తెలంగాణలోని వెట్టి కులాలు, పరాధీన సాగుదారులు క్రియాశీలంగా వ్యవహరించారు. రెండవ ప్రపంచ యుద్ధం తరవాత ఆహార కొరత వల్ల భూమిని కోరుతూ చారిత్రాత్మక పోరాటాలను చేపట్టారు. స్వాతంత్ర్యం కోసం సంప్రదింపులలో కాంగ్రెసు తలమునకలై ఉండటంతో ఈ ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లే స్థితిలో అది లేదు. అఖిల భారత కిసాన్ సభ వంటి రైతాంగ సంస్థలలో, అఖిల భారత ప్రజానాట్యమండలి, అఖిల భారత విద్యాసంఘం వంటి మేధావి, విద్యార్థి సంస్థలలో చురుకుగా ఉన్న కమ్యూనిస్టులు ఈ ఉద్యమాలను లోపలినుంచి నడిపించారు. ఈ ఉద్యమశక్తుల ప్రభావంతో బ్రిటిషు పాలకులు సంప్రదింపులు జరిపి, భారతదేశం వదిలి వెళ్లటాన్ని వేగిరపరిచింది.



*చిత్రం 11బి.4 : స్వాతంత్ర్యం తరవాత ఎర్రకోట నుంచి ప్రసంగిస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ*

జరిగిన ఘర్షణల దృష్ట్యా ముస్లిం లీగ్ ఈ అభిప్రాయానికి వచ్చి ఉండవచ్చు. అంతకంటే ముఖ్యంగా 1937లో రాష్ట్రాలకు జరిగిన ఎన్నికలలో తాము అల్ప సంఖ్యలో ఉన్నామని, ప్రజాస్వామిక దేశంలో తమది ఎప్పటికీ ద్వితీయ స్థానమే అవుతుందని ముస్లిం లీగ్‌కి అర్థమయ్యింది. ముస్లింలకు ఎటువంటి ప్రాతినిధ్యం కూడా లేకుండా పోతుందని అది భయపడింది. 1937లో ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్–లీగ్ కలిసి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న తమ కోరికను కాంగ్రెసు తిరస్కరించటం వల్ల కూడా ముస్లిం లీగ్ కినుక వహించింది.

1930లలో ముస్లిం ప్రజలను సమీకరించటంలో కాంగ్రెసు విఫలం కావటం వల్ల కూడా ముస్లిం లీగ్ బలపడింది. 1940లలో కాంగ్రెసు నాయకులు జైలులో ఉన్నప్పుడు మరింత ప్రజా మద్దతును కూడగట్టుకోటానికి ముస్లిం లీగ్ కృషి చేసింది. 1945లో యుద్ధం ముగిసిన తరవాత భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చే విషయంపై బ్రిటిషు ప్రభుత్వం కాంగ్రెసు, ముస్లిం లీగ్‌లతో సంప్రదింపులు మొదలుపెట్టింది. భారతదేశంలోని ముస్లింలకు తానే ఏకైక ప్రతినిధినని ముస్లిం లీగ్ చెప్పుకోవటంతో ఈ సంప్రదింపులు విఫలమయ్యాయి. చాలామంది ముస్లింలు తమకు ఇప్పటికీ మద్దతునిస్తున్నారంటూ కాంగ్రెసు ముస్లిం లీగ్‌తో విభేధించింది. 1946లో రాష్ట్రాలకు మరోసారి ఎన్నికలు జరిగాయి. 'సాధారణ' నియోజకవర్గాలలో కాంగ్రెసు చాలావరకు విజయాలు సాధించింది. అయితే ముస్లింలకు కేటాయించిన నియోజకవర్గాలలో ముస్లిం లీగ్ తిరుగులేని ఆధిక్యతను కనబరిచింది. ప్రత్యేక 'పాకిస్తాన్' కావాలంటూ ముస్లిం లీగ్ పట్టుబట్టింది. ఈ కోరికను పరిశీలించటానికి 1946 మార్చిలో బ్రిటిషు మంత్రివర్గం ఢిల్లీకి ముగ్గురు సభ్యుల (స్టాఫర్డ్ క్రిప్స్, పెతిక్ లారెన్స్, అలెగ్జాండర్) సంఘాన్ని

పంపించి, భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వటానికి తగిన రాజకీయ చట్రాన్ని సూచించమని కోరింది. భారతదేశం ఐక్యంగా ఉండాలని, ఫెడరల్ విధానంలో ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలకు కొంత స్వయం ప్రతిపత్తి ఉండాలని ఈ సంఘం సిఫారసు చేసింది. అయితే ఈ ప్రతిపాదనలలోని కొన్ని నిర్దిష్ట అంశాలపై కాంగ్రెసు, ముస్లిం లీగ్‌ల అంగీకారాన్ని ఈ సంఘం పొందలేకపోయింది. ఈ దశలో దేశ విభజన దాదాపుగా అనివార్యమైపోయింది.

బ్రిటిష్ క్యాబినెట్ సంఘ ప్రతిపాదనలు విఫలం అవ్వటంతో పాకిస్తాన్‌కి మద్దతుగా ముస్లిం లీగ్ ప్రజా ఉద్యమాన్ని చేపట్టదలిచింది. 1946 ఆగస్టు 16ను 'ప్రత్యక్ష కార్యాచరణ దినం'గా ముస్లిం లీగ్ ప్రకటించింది. ఆ రోజున కలకత్తాలో అల్లర్లు మొదలై చాలా రోజులపాటు కొనసాగాయి; వేలాది ప్రజలు చనిపోయారు. 1947 మార్చి నాటికి ఉత్తర భారతంలోని ఇతర ప్రాంతాలకు హింస వ్యాపించింది.

1947 ఆరంభంలో వైస్రాయిగా నియమితుడైన లార్డ్ లూయీ మౌంట్‌బాటన్ ముస్లిం లీగ్, కాంగ్రెసు పార్టీల మధ్య విభేధాలను పరిష్కరించలేకపోయాడు. ఫలితంగా దేశాన్ని ముస్లిం నియంత్రిత పాకిస్తాన్ గానూ, హిందువులు అధిక సంఖ్యలో ఉన్న భారత దేశంగానూ విభజించాలన్న నిర్ణయానికి వచ్చారు. 1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. ఆగస్టు 14ను పాకిస్తాన్ తన స్వాతంత్ర్య దినంగా జరుపుకుంటుంది. దేశ విభజన తరవాత కూడా జరిగిన అల్లర్లలో లక్షలాది ప్రజలు చనిపోయారు. అసంఖ్యాక మహిళలు అత్యాచారాలు, దాడులకు గురయ్యారు. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లు వదిలిపెట్టి పోవలసి వచ్చింది. వీళ్లు తమ జన్మ ప్రదేశాల నుంచి వేరు చేయబడి తమకి తెలియని దేశంలో కాందిశీకులు అయ్యారు. బ్రిటిషు పాలన నుంచి స్వాతంత్ర్యం పొందామన్న సంతోషం దేశ విభజనతో జరిగిన హింస, బాధలతో పలచనయ్యింది.

L98QTH

## కీలక పదాలు

1. జాతీయవాదం 2. లౌకిక 3. ఉగ్రవాది 4. అతివాదం 5. సత్యాగ్రహం
6. సహాయ నిరాకరణ 7. శాసనోల్లంఘనం 8. ఉపఖండం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. జాతీయ ఉద్యమంలోని వివిధ ప్రయత్నాలలో గాంధీజీ కృషిని తెలియచేసే పట్టిక తయారు చేయండి: $AS_3$

| సంఘటన | గాంధీ పాత్ర |
|---|---|
| | |
| | |

2. ప్రజలకు ప్రజాస్వామిక హక్కులు, స్వేచ్ఛ ఇవ్వటానికి నిరాకరించిన బ్రిటిష్ ప్రభుత్వ అన్ని ప్రయత్నాలను జాతీయోద్యమం వ్యతిరేకించింది. ప్రభుత్వం ఏ హక్కులను కాలరాయటానికి ప్రయత్నించిందో, దానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం ఏమిటో ఉదాహరణలు ఇవ్వండి. $AS_1$

3. ఉప్పు సత్యాగ్రహం తన ఉద్దేశాలలో ఏ మేరకు విజయవంతం అయ్యింది? మీ అంచనా ఏమిటి? $AS_2$

4. ఈ దిగువ పేర్కొన్న వాటిల్లో జాతీయోద్యమంలో భాగమైనవి ఏవి: $AS_1$

   అ. విదేశీ వస్త్రాలు అమ్మే దుకాణాల వద్ద పికెటింగ్.

   ఆ. బట్టలు నేయటానికి చేతితో నూలు వడకటం

   ఇ. దిగుమతి చేసుకున్న బట్టలను తగలబెట్టటం

   ఈ. ఖద్దరు వేసుకోవటం

   ఉ. పైన పేర్కొన్నవన్నీ

5. దేశ విభజనకు దారితీసిన వివిధ ఘటనలు ఏవి? $AS_1$

6. మన సరిహద్దు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లను పటంలో గుర్తించి రంగులు నింపండి. $AS_5$

7. 1922-29 మధ్య ఘటనలు మొదటి పేరాను చదివి కింది ప్రశ్నకు జవాబు రాయండి. $AS_2$
   హింసానంతరం గాంధీజీ ఉద్యమాన్ని అర్ధాంతరంగా ఆపివేశాడు. దీనిని మీరు ఎలా సమర్థిస్తారు?

8. సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా మన రాష్ట్రంలో జరిగిన సంఘటనలు ఏమిటి? $AS_1$

9. క్విట్ ఇండియా ఉద్యమం ఎందుకు ప్రాధాన్యత సంతరించుకుంది? $AS_1$

10. 1885-1947 మధ్య స్వాతంత్రోద్యమ ఘట్టాలను తెలిపే కాలమాన పట్టిక తయారు చేయండి. $AS_3$

11. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్యఫలాలు నేడు అందరికి అందాయా? దీనిపై మీ అభిప్రాయం తెలపండి. $AS_6$

పాఠం 12

# భారత ఎన్నికల వ్యవస్థ




L9HLVJ

మనది ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రజాస్వామ్యంలో అత్యున్నత అధికారం ప్రజలదే. నిర్ణయాలు తీసుకోవలసింది ప్రజలే. మరి భారతదేశం వంటి సువిశాలమైన దేశంలో నివశించే కోట్లాది మంది పౌరులు తమ అధికారాన్ని ఎలా వినియోగించు కుంటారు. ప్రజలందరూ సమావేశం కావడం, చర్చించడం, నిర్ణయాలు తీసుకోవడం ఎలా సాధ్యపడు తుంది. దీనికి పరిష్కారాన్ని ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం. పాలనా నిర్ణయాలు తీసుకోవడంలో, ప్రజా సంక్షేమ విధానాల రూపకల్పనలో ప్రజల తరపున ప్రజా ప్రతినిధులు పాల్గొనే వ్యవస్థను 'ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం' అంటారు. ఆధునిక ప్రజాస్వామ్యాలన్నీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాలే. అయితే ఈ ప్రజా ప్రతినిధులు ఎవరు? వీరిని ఎవరు ఎన్నుకుంటారు? ప్రజలకు ప్రాతినిధ్యం వహించడానికి ప్రతినిధుల ఎంపిక ప్రక్రియ ఎలా జరుగుతుంది? ఇందుకు గల యంత్రాంగం ఏమిటి? దానికి గల అధికారాలు ఏమిటి? ప్రజాస్వామ్యాన్ని విజయవంతంగా కొనసాగించడంలో ఈ యంత్రాంగం ప్రాధాన్యత ఏమిటి? ఈ అంశాలన్నిటి గురించి ఈ పాఠంలో చర్చిస్తాం.


## భారతదేశంలో ఎన్నికల వ్యవస్థ:

భారతదేశంలో పరిపాలన నిర్వహణకోసం ప్రజలు తమ ప్రతినిధులను ఎంపికచేసుకోవడానికి ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికలను నిర్వహించడానికి భారత రాజ్యాంగం ఎన్నికల వ్యవస్థను ఏర్పాటుచేసింది. దీనిని ఎన్నికల సంఘం అంటారు. ఇది స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, నిర్ణీత కాలవ్యవధులలో దేశంలో ఎన్నికలను నిర్వహిస్తుంది.

### ఓటుహక్కు:

L9RHX7

భారతదేశంలో ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎంపిక చేసుకోవడానికి ఎన్నికలసంఘం తోడ్పడుతుంది. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోవడానికి భారతదేశ రాజ్యాంగం ఓటు హక్కును ప్రసాదించింది. దీనిని సార్వత్రిక వయోజన ఓటుహక్కు అంటారు. జాతి, కుల, మతం, లింగం, విద్య, ఆర్థికస్థితి, వర్గం, ప్రాంతం వంటి ఏ అంశాలతోనూ సంబంధం లేకుండా, ఎలాంటి వివక్ష లేకుండా నిర్ణీత వయస్సు కలిగిన వయోజనులందరూ ఓటుహక్కును పొందవచ్చు. ఇలా ఓటుహక్కు కలిగిన ఓటర్ల సముదాయాన్ని ఎలక్టోరేట్




అంటారు.

భారత రాజ్యాంగం ప్రకారం 1988వ సంవత్సరానికి ముందు ఓటుహక్కును పొందడానికి కనీస వయస్సు 21 సంవత్సరాలుగా ఉండేది. 1988లో జరిగిన 61వ రాజ్యాంగ సవరణ ప్రకారం 18 సంవత్సరాలు నిండిన భారతీయ పౌరులందరూ ఓటుహక్కుకు అర్హులు.

2010 నాటికి భారతీయ ఎన్నికల సంఘం ఏర్పడి 60 సంవత్సరాలు అయింది. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీని 'జాతీయ ఓటర్ల దినోత్సవం'గా జరుపుకోవాలని భారత ప్రభుత్వం



ప్రకటించింది. కొత్తగా ఓటు పొందే వయసు వచ్చిన యువతరంలో చైతన్యం నింపడం దీని ఆశయం. ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేది నాటికి 18 సంవత్సరాల వయసు పూర్తయిన వారిని గుర్తించి, వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చి వారికి జనవరి 25న ఓటరు గుర్తింపు కార్డులను అందజేస్తారు.

- మీ కుంటుంబంలో ఎవరిదైనా ఓటరు గుర్తింపు కార్డును సేకరించి దానిలోని వివరాలను పరిశీలించండి.
- మీకు 18 సంవత్సరాల వయస్సు నిండిన తరువాత ఓటరుగా నమోదు కావడానికి అనుసరించవలసిన పద్ధతులను గురించి మీ ఉపాధ్యాయుణ్ణి అడిగి తెలుసుకోండి.
- సార్వత్రిక వయోజన ఓటుహక్కు మన ప్రజాస్వామ్యానికి ఏవిధంగా మేలు చేకూర్చింది? నిరక్షరాస్యులకు ఓటుహక్కు ఇవ్వడం మంచిది కాదని కొందరు భావిస్తారు. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటి? తరగతి గదిలో చర్చించండి.

### వివిధ స్థాయిల్లో ఎన్నికలు:


భారతదేశంలో ఎన్నికలను రెండు రకాలుగా నిర్వహిస్తున్నారు. అవి ప్రత్యక్ష ఎన్నిక విధానం మరియు పరోక్ష ఎన్నిక విధానం. భారత రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు పరోక్ష విధానంలో జరుగుతాయి.

పార్లమెంట్ దిగువ సభ అయిన లోక్‌సభలో 543 మంది సభ్యులుంటారు. వీరిని భారతదేశంలోని ఓటర్లు ప్రత్యక్ష ఎన్నికల విధానం ద్వారా ఎన్నుకుంటారు. వీరి కాలపరిమితి 5 సంవత్సరాలు. పార్లమెంటులో ఎగువ సభ అయిన రాజ్యసభలో 250 మంది సభ్యులుంటారు. వీరిలో 238 మంది సభ్యులు పరోక్ష ఎన్నికల ద్వారా ఎన్నికవుతారు. వీరి కాలపరిమితి 6 సంవత్సరాలు. రాష్ట్ర అసెంబ్లీకి కూడా ఎన్నికల సంఘమే ఎన్నికలు నిర్వహిస్తుంది. రాష్ట్ర శాసనసభ సభ్యులను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకుంటారు. శాసనమండలి సభ్యులను పరోక్ష పద్ధతిలో ఎన్నుకుంటారు. నగర పాలక సంస్థలకు, మునిసిపాలిటీలకు గ్రామపంచాయితీలకు కూడా ఎన్నికలు నిర్వహించి ప్రభుత్వాల ఏర్పాటుకు ఎన్నికల సంఘం కృషిచేస్తుంది.

జనవరి 25వ తారీఖున ఎన్నికల సంఘం ఏర్పడింది. దీని ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. భారత దేశంలో ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించే బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఓటర్ల జాబితాను రూపొందించి దేశంలో లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసన సభలు, రాష్ట్రపతి మరియు ఉప రాష్ట్రపతి ఎన్నికలు నిర్వహిస్తుంది.

### ఎన్నికల సంఘంలో ఎవరు ఉంటారు?

భారత రాజ్యాంగంలోని 324(2) నిబంధన ప్రకారం భారత రాష్ట్రపతి ప్రధాన ఎన్నికల అధికారినీ, ఇతర ఎన్నికల అధికారులను నియమిస్తాడు. ఎన్నికల సంఘం ఏర్పాటైన మొదటి కాలంలో ఇది ఏక సభ్య సంస్థగా ఉండేది. ఒకే ఒక్క ప్రధాన ఎన్నికల అధికారి




- స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్యం అత్యంత విలువైన అంశం. ప్రజలు తమకు నచ్చిన ప్రతినిధులను ఎన్నుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవడానికి భారత రాజ్యాంగంలోని 326వ అధికరణం లోక్‌సభకు, రాష్ట్రాల శాసన సభలకు సార్వత్రిక వయోజన జరగాలని నిర్దేశిస్తోంది.

### భారత ఎన్నికల సంఘం:

దేశంలో ఎన్నికలు నిర్వహించే బాధ్యతను భారత రాజ్యాంగం ఎన్నికల సంఘానికి అప్పగించింది. ఇది స్వతంత్ర ప్రతిపత్తిగలిగిన రాజ్యాంగ సంస్థ. 1950

ఉండేవారు. 1989 ఎన్నికలసంఘ సవరణ చట్టం ప్రకారం ఇది బహుళసభ్య సంస్థగా మారింది. అప్పటి నుండి ఒక ప్రధాన ఎన్నికల అధికారి, ఇద్దరు అదనపు ఎన్నికల అధికారులు ఉన్న త్రిసభ్య సంస్థగా కొనసాగు తోంది. ఈ సభ్యులు సాధారణంగా భారత సివిల్ సర్వీసు అధికారులై ఉంటారు. వీరి పదవీ కాలం 6 సంవత్సరాలు లేదా 65 సంవత్సరాల వయసు పూర్తి అయ్యేవరకు ఉంటుంది. సర్వోన్నత, స్వతంత్ర అధికారాలుగల ప్రధాన ఎన్నికల అధికారిని అభిశంసన తీర్మానం ద్వారా తొలగించాలంటే ఉభయ సభలలో

2/3 వ వంతు సభ్యుల అంగీకారం అవసరం. దీన్నిబట్టి ఎన్నికల సంఘం ఎంత శక్తివంతమైనదో మనం అర్థం చేసుకోవచ్చు.

### ఎన్నికల సంఘం ఏమి చేస్తుంది?

రాజ్యాంగంలోని 15వ భాగంలోని 324వ నిబంధన ఎన్నికల సంఘం నిర్మాణం, విధుల గురించి వివరిస్తుంది.

### ఎన్నికల సంఘం విధులు:

- నియోజకవర్గాల భౌగోళిక పరిధిని నిర్ణయించడం.
- ఓటర్ల జాబితాలను రూపొందించడం.
- ప్రతిసాధారణ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాలలో అవసరమైన సవరణలు చేయడం.
- నిర్ణీత కాలవ్యవధిననుసరించి ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం.
- ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించుటకు అవసరమైన నియమావళిని రూపొందించడం.
- వివిధ రాజకీయ పార్టీలకు గుర్తింపునివ్వడం, గుర్తులు కేటాయించడం.
- పోలింగ్ తేదీలను, ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడం, నామినేషన్‌ల స్వీకరణ, పరిశీలన చేయడం.
- దేశవ్యాప్తంగా ఎన్నికల యంత్రాంగాన్ని నియమించడం.
- ఎన్నికలలో జరిగే అక్రమాల పరిశీలనకు విచారణా అధికారులను నియమించడం.

### రాష్ట్ర ఎన్నికల సంఘం:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం 1994 జూన్‌లో ఏర్పడింది. రాష్ట్ర విభజన అనంతరం 31-1-2016వ తేదీని ఆంధ్రరాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటుచేశారు. రాష్ట్ర గవర్నర్‌చేత నియమించబడే

LA1DYU

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నాయకత్వంలో రాష్ట్ర ఎన్నికల సంఘం పనిచేస్తుంది. వీరి పదవీకాలం 5 సంవత్సరాలు. రాష్ట్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వ హిస్తుంది.

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఎన్నికల నిర్వహణకోసం ప్రత్యేక సిబ్బంది ఉండరు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(6) ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్ల అనుమతితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందిని ఎన్నికల నిర్వహణకోసం తీసుకుంటుంది. ఆ సమయంలో ఆ సిబ్బందిపై కేంద్ర ఎన్నికల సంఘానికే అధికారం ఉంటుంది. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి లేకుండా వారిని బదిలీ చేయడం లేదా పదోన్నతులు కల్పించడం వంటివి చేయకూడదు.



భారతదేశపు 10వ ప్రధాన ఎన్నికల అధికారిగా 1990-1996 కాలంలో పనిచేసిన T.N. శేషన్ ఎన్నికల చట్టాలను అత్యంత కఠినంగా అమలుచేసిన అధికారిగా ప్రసిద్ధులయ్యారు. ఆయన చేపట్టిన చర్యలు:

- ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ముందెన్నడూ లేనంత పటిష్టంగా పాటింపజేయడం.
- అర్హులయిన ఓటర్లందరికీ గుర్తింపుకార్డులు మంజూరుచేయడం.
- ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ఖర్చుమీద పరిమితులు విధించడం.

### రాజకీయ పార్టీలు:

ఉమ్మడి రాజకీయ విశ్వాసాలు, ఆసక్తులు కలిగి ఉండి రాజకీయ అధికారాన్ని సంపాదించడానికి సంఘంగా ఏర్పడిన వ్యక్తుల సముదాయాన్ని రాజకీయ

పార్టీ అంటారు. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు కీలకపాత్ర పోషిస్తాయి.

ఎన్నికలలో పొందిన ఓట్ల శాతాన్ని బట్టి పార్టీలను ప్రాంతీయ, జాతీయ పార్టీలుగా ఎన్నికల సంఘం గుర్తిస్తుంది. రాష్ట్రంలో జరిగే ఎన్నికలలో మొత్తం పోలైన ఓట్లలో మూడు శాతం ఓట్లను లేదా మూడు శాసన సభా స్థానాలను పొందితే ఎన్నికల సంఘం ఒక పార్టీని ప్రాంతీయ పార్టీగా గుర్తిస్తుంది. సాధారణ ఎన్నికల్లో కనీసం నాలుగు రాష్ట్రాల్లో మొత్తం పోలైన ఓట్లలో ఆరుశాతం ఓట్లు పొందినా, లేదా నాలుగు వేరు వేరు రాష్ట్రాల నుండి కనీసం పదకొండు లోక్‌సభ సీట్లను సాధించినా ఎన్నికల సంఘం ఒక పార్టీని జాతీయ పార్టీగా గుర్తిస్తుంది. గుర్తింపు పొందిన రాజకీయపక్షాల తరపున పోటీచేసే అభ్యర్థులను పార్టీ అభ్యర్థులంటారు. ఇతరులను స్వతంత్ర అభ్యర్థులంటారు. ఎన్నికల సంఘం వివిధ రాజకీయ పార్టీలకు గుర్తులను కేటాయిస్తుంది. స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల సంఘం వారి స్వేచ్ఛా సంకేతాల జాబితాలోంచి అందుబాటులో గల గుర్తులను ఎంచుకునే అవకాశం కల్పిస్తుంది.

- వార్తాపత్రికలను పరిశీలించి మన రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు, వాటి గుర్తుల జాబితా తయారుచేయండి. వాటిలో ప్రాంతీయ, జాతీయ పార్టీలను గుర్తించండి.

రాజకీయ పార్టీలు తమ విధి విధానాలను, ప్రాధాన్యతలను ఒక విధానపత్రం ద్వారా ఎన్నికల ముందే ప్రజలకు తెలియజేస్తాయి. దీన్ని 'మానిఫెస్టో' అంటారు. దీనిలో వివిధ అంశాలపట్ల తమ పార్టీ దృక్పథాలను, ఆశయాలను, తాము అధికారంలోకి వస్తే చేయబోయే పనులు, సేవలు, అభివృద్ధి ప్రణాళికలను పొందుపరుస్తారు. ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియలో మానిఫెస్టో ఓటర్లకు తోడ్పడుతుంది.

### ఉప ఎన్నికలు – మధ్యంతర ఎన్నికలు:

LAAA1H

5 సంవత్సరాలకు ఒకసారి సాధారణ ఎన్నికలు జరుగుతాయి. అయితే ఎన్నికయిన సభ్యులు పదవీ కాలం ముగియకముందే రాజీనామా చేసినప్పుడుగానీ, మరణించినప్పుడు కానీ, అభిశంసన తీర్మానం వల్లగానీ, ఇతర కారణాలవల్ల అనర్హమైనప్పుడు ఆ నియోజక వర్గానికి ఖాళీ ఏర్పడుతుంది. ఇలాంటి సంఘటనలు అరుదుగా జరుగుతాయి. ఇలా ఏర్పడిన ఖాళీలను ఎన్నికలసంఘం నిర్ణీత వ్యవధిలోపు ఎన్నికలు నిర్వహించి ఖాళీలను భర్తీచేస్తారు. పూర్తికాలం గడవక ముందే శాసనసభకు, లోక్‌సభకు ఎన్నికలు నిర్వహిస్తే వాటిని మధ్యంతర ఎన్నికలు అంటారు.

### ఎన్నికల ప్రవర్తనా నియమావళి:

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన రోజు నుండి ఎన్నికలు జరిగే రోజువరకు వివిధ రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, ప్రజలు పాటించవలసిన నియమ నిబంధనలను ఎన్నికల ప్రవర్తనా నియమావళి అంటారు. దీనిని ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. ఎవరైనా ఈ నియమాలను అతిక్రమిస్తే 'ఎన్నికల అనుచిత ప్రవర్తన'గా భావించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.

- అభ్యర్థులు తమ ఉపన్యాసాలలో జాతి, కుల, మత, ప్రాంతీయపరమైన విద్వేషాలను రెచ్చగొట్టరాదు.
- వ్యక్తిగత దూషణలకు పాల్పడరాదు.
- ఓటర్లను బెదిరించడంగానీ, ప్రలోభపెట్టడంగానీ చేయరాదు.
- పోలింగ్ స్టేషన్‌కు ఓటర్లను తీసుకురావడం, తిరిగి తీసుకెళ్ళడం వంటివి నిషిద్ధం.
- అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహించడం, ఇళ్ళపై జెండాలు ఎగురవేయడం,

గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం వంటివి చేయరాదు.

- ఒకరి ఓటును మరొకరు వేయరాదు.
- నిర్ధారిత సమయం తరువాత ప్రచారం చేయకూడదు.
- పాఠశాలలు, ప్రార్థనా మందిరాలలో ప్రచారం చేయరాదు.

పై నియమాలతోపాటు ఎన్నికల ప్రక్రియ జరుగుతున్నప్పుడు ప్రభుత్వాలు ఎటువంటి ఉద్యోగ నియామకాలను చేపట్టరాదు. రోడ్లు నిర్మించడం, త్రాగునీటి వసతి కల్పించడం, వివిధ పనులకు శంకుస్థాపనలు చేయడం వంటి సంక్షేమ కార్యక్రమాలను ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ప్రభుత్వం చేపట్టరాదు. అధికార దుర్వినియోగం చేయరాదు.

**చర్చించండి:**

- ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎందుకు అవసరం? దీనిలో ఇంకా ఏ యే నియమాలుండాలని మీరు భావిస్తున్నారు?
- పై నియమాలలో ఒక్కొక్క నియమాన్ని తీసుకుని ఆ నియమం యొక్క ఉపయోగాన్నీ, అది లేకుంటే సంభవించగల నష్టాన్ని చర్చించండి.
- రాజకీయ పార్టీలు సభలు సమావేశాల ద్వారా మాత్రమే కాకుండా ఇంకా ఏ యే పద్ధతులలో ప్రచారం చేయవచ్చు?

## ఎన్నికల నిర్వహణ:

చట్టసభల పదవీకాలం పూర్తికాగానే ఎన్నికల సంఘం లోక్‌సభకు, రాష్ట్రాల శాసన సభలకు ఎన్నికల తేదీలను, ఎన్నికల కార్యక్రమాన్ని ప్రకటిస్తుంది. రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఉంటారు. జిల్లా స్థాయిలో జిల్లాకలెక్టర్ ముఖ్య ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. నియోజకవర్గం స్థాయిలో ఒక ప్రభుత్వాధికారి రిటర్నింగ్ అధికారిగా ఎన్నికలను నిర్వహిస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు తమనామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తారు. రిటర్నింగ్ అధికారులు తమకు సమర్పించబడిన నామినేషన్ పత్రాలను పరిశీలిస్తారు. సరిగా ఉన్న నామినేషన్‌ల జాబితాను ప్రకటిస్తారు. నిర్ణీత గడువులో నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం కూడా అభ్యర్థులకు ఉంటుంది.

ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత తుది అభ్యర్థుల జాబితాను ప్రతి నియోజకవర్గంలో ప్రకటిస్తారు. అప్పుడు EVM (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్) లను సిద్ధం చేస్తారు. రాష్ట్రాల శాసనసభలకు, స్థానిక సంస్థలకు నిర్వహించే ఎన్నికలలో కూడా దాదాపు ఇవే విధివిధానాలు, నిబంధనలను పాటిస్తారు. ఉదాహరణకు అన్ని రాజ్యాంగబద్ధ సంస్థలకు నిర్వహించే ఎన్నికలకు ఒకే ఓటర్ల జాబితాలను ఉపయోగిస్తారు.



ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్‌లను భారతదేశంలో మొట్టమొదటగా 1989-90 దేశంలోని 16 శాసనభా నియోజకవర్గాలలో ప్రయోగాత్మకంగా వాడారు. EVM ల విశ్వసనీయత మీద అనేక మంది సందేహాలు లేవనెత్తారు. కానీ ఎవరూ నిరూపించలేకపోయారు. అయినప్పటికీ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి భారత ఎన్నికల సంఘం ఈ EVM లలో 'ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్' సౌకర్యం కల్పించడానికి నిర్ణయం తీసుకున్నది.

## ఓటింగ్ ప్రక్రియ:

పోలింగ్ కేంద్రంలో విధులను నిర్వర్తించడానికి ప్రిసైడింగ్ అధికారిని, పోలింగ్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి నియమిస్తారు. పోలింగ్ సామాగ్రిని తీసుకొని ఎన్నికల సిబ్బంది ముందురోజే పోలింగ్ కేంద్రానికి చేరుకుంటారు. పోలింగ్ రోజున ఓటర్ల జాబితాలో పేర్లున్న, తగిన గుర్తింపు కార్డు కలిగిన ఓటర్లందరినీ ఓటు వేయడానికి అనుమతిస్తారు. ఈ ప్రక్రియలో ఓటర్లను గుర్తించడానికి పోలింగ్ ఏజెంట్లు సహాయపడతారు.

**ఓటరు గుర్తింపుకార్డును పరిశీలించండి**


భారత ఎన్నికల సంఘము
గుర్తింపుకార్డు
ELECTION COMMISSION OF INDIA
IDENTITY CARD
UCG1239871
ఓటరు : శాంతి పెరుమాల
Elector's Name : Santhi Paramala
భర్త పేరు : సురేష్ కూనాటి
Husband's Name :Suresh Kunatih
లింగము / Sex : స్త్రీ / F
పుట్టిన తేది / Date of Birth 15/06/1975

చిరునామా : UCG1239871
16-251-15, AMARA JYOTHI PLAZA
బాలాజి కాలనీ,, పానగల్,
పానగల్, శ్రీకాళహస్తి,
చిత్తూరు,517644
Address:
16-251-15, AMARA JYOTHI PLAZA
Balaji Colony, Panagal , Panagal
Srikalahasti, Chittoor,517644
Date: 19/04/2014
ప్రతిరూప సంతకము
ఓటరు రిజిస్ట్రేషన్ అధికారి
287 శ్రీకాళహస్తి శాసనసభ నియోజక వర్గం
Facsimile Signature of
Electoral Registration Officer
287 - Srikalahasti Assembly Constituency
99 / 873

ప్రిసైడింగ్ అధికారి ఓటరు గుర్తింపును నిర్ధారించుకొని చూపుడు వేలిపై ఇండెలిబుల్ సిరాలో గుర్తుపెట్టి అభ్యర్థుల పేరు, గుర్తు వివరాలతో ఉన్న బాలెట్ పత్రాన్ని అందజేస్తాడు.



**ఎన్నికల ప్రక్రియ**

- ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ విడుదల
- ↓ నామినేషన్ పత్రాల స్వీకరణ
- ↓ నామినేషన్ పత్రాల పరిశీలన
- ↓ నామినేషన్ పత్రాల ఉపసంహరణ
- ↓ తుది జాబితా ప్రకటన
- ↓ గుర్తుల కేటాయింపు, EVM లను సిద్ధపరచడం
- ↓ పోలింగ్ అధికారుల నియామకం, శిక్షణ
- ↓ పోలింగ్ నిర్వహణ
- ↓ ఓట్ల లెక్కింపు
- ↓ ఫలితాల ప్రకటన
- ↓ ప్రభుత్వ ఏర్పాటు

### ఎన్నికల సిరా:




ఎన్నికలలో అక్రమాలు, ద్వంద్వ ఓటింగ్ నిరోధం చేందుకు చూపుడు వేలిపై చెరిగిపోని సిరాతో గుర్తుపెట్టే పద్ధతిని ప్రవేశ పెట్టారు. ఈ సిరాను ఎన్నికల కమిషన్ అన్ని పోలింగ్ కేంద్రాలకు సరఫరా చేస్తోంది. పంచాయితీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల దాకా ఈ సిరా లేనిదే ఎన్నికల తంతు ముగియదంటే అతిశయోక్తి కాదు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఈ ఇంక్ వాడకం అమల్లో ఉంది. థాయ్‌లాండ్, సింగపూర్, నైజీరియా, మలేసియా, దక్షిణాఫ్రికా వంటి దేశాలకు మనదేశంలో తయారయ్యే ఇండెలి బుల్ ఇంకును సరఫరా చేస్తున్నారు. మన దేశంలో మైసూరు, హైదరాబాద్ నగరాల్లో ఇండెలిబుల్ ఇంక్ తయారీకేంద్రాలు ఉన్నాయి.




ఓటరు తాను ఓటు వేయదలుచుకున్న గుర్తుపై స్వస్తిక్ ముద్రతో ఓటువేస్తాడు. బ్యాలెట్ పత్రాన్ని బ్యాలెట్‌బాక్స్‌లో వేస్తాడు. ఓటరు తాను ఎవరికి ఓటు వేసిందీ బహిరంగపరచకూడదు. ప్రస్తుతం బ్యాలెట్ బాక్స్‌ల స్థానంలో EVM ల ద్వారా ఎన్నికల నిర్వహిస్తు న్నారు.

పోలింగ్ పూర్తయిన తరువాత EVM లకు సీలు వేసి ఓట్ల లెక్కింపు కేంద్రాలకు తరలిస్తారు. అక్కడ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అత్యధిక ఓట్లు సాధించిన అభ్యర్థి ఎన్నికైనట్లుగా ప్రకటిస్తారు.

### తిరస్కరించే ఓటు (NOTA)

2013 లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుస రించి ఎన్నికలలో పోటీపడుతున్న అభ్యర్థులెవరూ తమకు నచ్చనప్పుడు ఓటరు ఆ విషయాన్ని తెలియ జేసేలా, ఓటింగ్ యంత్రాలలో None Of The Aboe (NOTA) ఐచ్ఛికాన్ని కూడా చేర్చారు.

**ఆలోచించండి:**

- NOTA అభ్యర్థి యొక్క గెలుపు / ఓటమిని ప్రభావితం చేయగలుగుతుందా? ఒకవేళ NOTA కు మెజారిటీ ఓట్లు వస్తే అప్పుడేం చేయాలి?
- మీ పాఠశాలలతో ఓ నమూనా ఎన్నికలు నిర్వహించి, మీ అనుభవాలను నమోదు చేయండి.

### స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఎన్నికలు నిర్వహించడంలో సవాళ్ళు:

1951-52లో భారతదేశంలో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల సందర్భంలో ఎన్నికలు నుండి ఇప్పటి వరకూ విజయవంతంగా ఎన్నికలను నిర్వహిస్తూ ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని మన ఎన్నికల వ్యవస్థ సగర్వంగా నిలబెడుతూనే ఉన్నది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి ఆధారభూతమైన ఎన్నికలు మరింత ఫలప్రదంగా జరగడానికి, అత్యుత్తమ ఫలితాలను ఇవ్వడానికి ఓటర్లు చైతన్యాన్ని కనబరచడమే కీలకం.

భర్త చెప్పాడనో, యజమాని చెప్పాడనో, కుల నాయకుడు లేదా మత గురువు ఆదేశించారనో లేదా ఎవరో డబ్బులు ఇచ్చారనో, కానుకలు ఇచ్చారనో, మద్యం పంచారనో కాకుండా సరైన అభ్యర్థి ఎవరో సక్రమంగా ఆలోచించుకుని ఓటు వేయాలి.

వాస్తవ ఆచరణలో దీనికి అనేక సవాళ్ళు ఎదురవు తున్నప్పటికీ సమర్థమయిన చర్యలతో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం కృషి చేస్తున్నది. దీనికి ప్రజల నిజాయితీ కూడా తోడవ్వాలి. రాజకీయ పక్షాలు నిజాయితీగా ఉత్తమ అభ్యర్థులతో పోటీపడాలి. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటర్లుగా నమోదుకావాలి. ఓటుహక్కుగల వారంతా తప్పనిసరిగా ఓటు వేయాలి. చైతన్యవంతమైన ప్రజల చేతుల్లోనే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుంది.

ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన మరిన్ని వివరాలకోసం ఈ కింది వెబ్‌సైట్‌లను సందర్శించండి.

LB2X6F

భారత ఎన్నికల సంఘం http://eci.nic.in/eci/html
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం: http://www.apsec.gov.in

## కీలక పదాలు

| | | |
|---|---|---|
| ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం | సార్వత్రిక వయోజన ఓటుహక్కు | ఎన్నికల సంఘం |
| ఎన్నికల ప్రవర్తనా నియమావళి | EVM | రిటర్నింగ్ అధికారి |
| ప్రిసైడింగ్ అధికారి | ప్రాంతీయపార్టీ, జాతీయపార్టీ | నోటా |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం యొక్క ఆవశ్యకతను వివరించండి (AS-1)
2. "ప్రజాస్వామ్యానికి ఎన్నికల వ్యవస్థ ఆధారభూతం" – ఈ వ్యాఖ్యతో మీరు ఏకీభవిస్తారా? వివవరించండి. (AS-2)
3. ఎన్నికల సంఘం విధులను వివరించండి. (AS-1)
4. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుపుతూ ఒక కరపత్రం తయారుచేయండి. (AS-6)
5. ఎన్నికల విధానాన్ని వివరించండి (AS-1)
6. ప్రస్తుత ఎన్నికల విధానంలో ఏవైనా లోపాలు గమనించారా? వాటిని అధిగమించడానికి కొన్ని సూచనలు తెల్పండి (AS-1)
7. ఓటుహక్కు దుర్వినయోగం కాకుండా ప్రజలను చైతన్యపరిచేందుకు నీవు ఏ ఏ కార్యక్రమాలను నిర్వహిస్తావు? (AS-6)
8. ఈ మధ్య కాలంలో జరిగిన ఎన్నికల గురించిన సమాచారాన్ని సేకరించి పాల్గొన్న పార్టీలు, అభ్యర్థులు, గుర్తులు, పోలైన ఓట్లు మొదలైన వివరాలను విశ్లేషించి మీ అభిప్రాయాలు రాయండి. (AS-3)
9. పోలింగ్ కేంద్రం నమూనా చిత్రాన్ని గీసి, ప్రిసైడింగ్ అధికారి చేసే పనులను గురించి రాయండి. (AS-5)
10. ప్రధాన ఎన్నికల కమీషనర్‌ను తొలగించడం కష్టతరం. కారణాలను విశ్లేషించండి. (AS-4)

### ప్రాజెక్టు పని:

1. మీ పాఠశాలలో నమూనా ఎన్నికలు నిర్వహించి, మీ అనుభవాలను నమోదుచేయండి.
2. వివిధ రాష్ట్రాలలో గల ప్రధాన రాజకీయ పార్టీలు, వాటి గుర్తులు, ఆయా పార్టీ నాయకులు మొదలగు వివరాలతో కూడిన ఆల్బమ్‌ను తయారుచేసి తరగతి గదిలో ప్రదర్శించండి.

పాఠం 13

# భారత రాజ్యాంగం

LBBT83

మన దేశంలోని వివిధ ప్రాంతాలు శతాబ్దాల పాటు రాజులు, రాణుల పాలనలో ఉన్నాయి. అయితే మన నాయకులు బ్రిటిషు వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు దేశ భవిష్యత్తు, ప్రభుత్వం రాచరిక పాలనలో కాకుండా ప్రజాస్వామికంగా ఉండాలని కోరుకున్నారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధుల ద్వారా ప్రజలు తమను తాము పరిపాలించుకోవాలని కోరుకున్నారు.

- స్వాతంత్ర్యం కోసం పోరాడిన నాయకులు భారతదేశం రాజులు, రాణులతో పాలించబడాలని ఎందుకు కోరుకోలేదో చర్చించండి.

వలస పాలన నుంచి భారతదేశం విముక్తి పొంది మనం నమ్మిన మౌలిక సూత్రాలను, దేశాన్ని పరిపాలించే విధానాలను, ఒక చోట పొందు పరచాలనుకున్నారు. వీటిని 'భారత రాజ్యాంగం' అనే పుస్తకంలో పొందుపరిచారు.




రాజ్యాంగం అన్నది దేశాన్ని ఎలా పరిపాలించాలి – చట్టాలు ఎలా చేయాలి, వాటిని ఎలా మార్చాలి, ప్రభుత్వం ఎలా ఏర్పడుతుంది, పౌరుల పాత్ర ఏమిటి, వాళ్ల హక్కులు ఏమిటి వంటి నియమాలను కలిగిఉంటుంది. అన్నిటికీ మించి రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి దేశం కృషి చేయాలి.

- దేశానికి అయిదు లక్ష్యాలు రూపొందించమని మిమ్మల్ని, మీ సహచర విద్యార్థిని అడిగారు అనుకోండి. అవి ఏమై ఉంటాయి? వీటిని నిర్ణయించే ప్రక్రియ ఏది? వాటిని చేరుకోవడానికి మీరేం చేస్తారు? తరగతిలో మీ టీచరు సహాయంతో చర్చించండి.

### భారత రాజ్యాంగ రూపకల్పన

చాలా క్లిష్ట పరిస్థితులలో భారత రాజ్యాంగానికి రూపకల్పన జరిగింది. మనల్ని 200 ఏళ్లపాటు బ్రిటిషువాళ్లు పాలించారు. వాళ్లకి అనుగుణంగా ఉండే సంస్థలను వాళ్లు రూపొందించుకున్నారు. మతకల్లోలాల వల్ల దేశ విభజన జరిగింది. దేశంలో అధిక భాగం (హైదరాబాదులో నిజాం మాదిరి) రాచరిక పాలనలో ఉండేది. సామాజిక, సాంస్కృతిక వైవిధ్యతలే కాకుండా ధనిక– పేద మధ్య, అగ్ర–కింది కులాల మధ్య, స్త్రీ–పురుషుల మధ్య చాలా తేడాలు ఉన్నాయి. దేశం మరిన్ని ముక్కలు కాకుండా ఒకటిగా ఉండటానికి నాయకులు కృషి చేశారు. దేశాన్ని నడపటంలో తమకు కూడా పాత్ర ఉందని అన్ని వర్గాల ప్రజలు భావించాలి. మన జాతీయోద్యమం కేవలం విదేశీ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటం కాదు. అసమానతలను, దోపిడీని, వివక్షతను సైతం మన సమాజం నుంచి నిర్మూలించాలని భావించింది. దేశంలో ఆనాడు అక్షరాస్యత స్థాయి, విద్య చాలా తక్కువగా ఉన్నాయి. తీవ్ర పేదరికం ఉంది, కరువు, కాటకాల్లో లక్షలాది ప్రజలు చనిపోయారు. మౌలిక అవసరాలైన ఆహార ధాన్యాల కోసం కూడా ఇతర దేశాలపై మన దేశం

ఆధారపడి ఉంది. కాబట్టి భవిష్యత్తు సమాజానికి ఒక లక్ష్యాన్ని ఇచ్చి, దానిని చేరుకోటానికి ఒక చట్రం కూడా అవసరమయ్యింది.

- స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఉన్న మీ తాత, అవ్వలనుంచి కానీ, మీ చుట్టుపక్కల ఉన్న వృద్ధులనుంచి కానీ అప్పుడు పరిస్థితులు ఎలా ఉండేవో, సమాజ భవిష్యత్తు గురించి వాళ్లు ఏమి భావించారో తెలుసుకోండి.

స్వాతంత్ర్యం తరవాత మెరుగైన సమాజాన్ని రూపొందించే విధానంపై జాతీయోద్యమ నాయకుల్లో తీవ్రమైన అభిప్రాయ భేదాలు ఉండేవి. అయినప్పటికీ స్వతంత్ర భారతదేశం ప్రజాస్వామిక సూత్రాల ప్రకారం నడవాలని చాలా మంది అంగీకరించారు, ఇందులో:

అ) చట్టం ముందు ప్రజలందరూ సమానులుగా ఉంటారు, అందరికీ కొన్ని ప్రాథమిక హక్కులు ఉంటాయి.

ఆ) 'సార్వజనీన వయోజన ఓటుహక్కు' అంటే లింగ, కుల, మత, జాతి, సంపద భేదం లేకుండా వయోజనులందరికీ ఎన్నికల్లో ఓటు వేసే హక్కు ద్వారా సాధారణ ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వం ఏర్పడుతుంది.

LBKP9Q

### రాజ్యాంగ తొలి ప్రతులు

స్వాతంత్ర్యం రాకముందే 1928లో మోతీలాల్ నెహ్రూ, భారత జాతీయ కాంగ్రెసుకి చెందిన మరో 8 మంది కలిసి భారతదేశ రాజ్యాంగాన్ని రాశారు. 1931లో కరాచి సమావేశంలో భారత రాజ్యాంగం ఎలా ఉండాలో భారత జాతీయ కాంగ్రెసు ఒక తీర్మానం చేసింది. ఈ రెండు పత్రాలు కూడా సార్వజనీన వయోజన ఓటుహక్కు, స్వేచ్ఛ, సమానత్వ హక్కు, అన్న వాటికి కట్టుబడి ఉన్నాయి.

- స్వాతంత్ర్యం వచ్చిన నాటికి మన దేశంలో ఉన్న అసమానతలు, వివక్షతలలో కొన్నింటిని పేర్కొనండి.
- ఇక్కడ జతలుగా కొన్ని వాక్యాలు ఉన్నాయి. కొన్నింటిలో తప్పుడు సమాచారం ఉంది. వాటిని సరిచేయండి.

అ) నమూనా రాజ్యాంగ ప్రతిని రాశారు – మోతీలాల్ నెహ్రూ.

ఆ) నిరక్షరాస్యులు ఓటు చేయకూడదని నాయకులు అంగీకరించారు.

ఇ) రాష్ట్రాల శాసన సభలు – వలస పాలన చట్టాలను కొన్నింటిని రాజ్యాంగం తీసుకుంది.

ఈ) దేశ విభజన – చాలామంది చంపబడ్డారు, కాందిశీకులు చేయబడ్డారు.



*చిత్రం 13.1 : భారతదేశం ప్రతి సంవత్సరం జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకుంటుంది. ఈ వేడుకలలో పాల్గొన్న ఎన్.సి.సి. విద్యార్థుల కవాతును పక్క చిత్రంలో చూడవచ్చు*



చిత్రం 13.2 : ఒకరికొకరు అభివాదం చేసుకుంటున్న రాజ్యాంగసభ అధ్యక్షులు డా॥ రాజేంద్ర ప్రసాద్, డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ డా॥బి ఆర్ అంబేద్కర్

ఉ) మహిళలకు ఓటు లేకుండా చేయటం + భారతదేశంలో సామాజిక సంస్కరణలకు కట్టుబడి ఉండటం.

- మన రాజ్యాంగాన్ని రూపొందించటంలో ఏఏ ఆలోచనలు, స్ఫూర్తిని ఇచ్చాయి?

ముందుగా భారతదేశంలో వివిధ రకాల ప్రజలు మెరుగైన సమాజాన్ని కోరుతూ చేసిన పోరాటాలు రాజ్యాంగ నిర్మాణానికి స్ఫూర్తినిచ్చాయి. ఈ ప్రజలందరి కలలు నిజం చేసే భారత దేశాన్ని నిర్మించటం తమ పవిత్ర కర్తవ్యంగా భావించారు. మహాత్మా గాంధీ, ఇతర జాతీయ నాయకుల ఆలోచనలతో వాళ్లు ప్రభావితమయ్యారు.

రెండవది, ఫ్రెంచి విప్లవం ఆదర్శాలతో, బ్రిటన్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యంతో, అమెరికాలో హక్కుల చట్టంతో మన నాయకులలో అనేకమంది ప్రేరణ పొందారు. రష్యా, చైనాలలో సోషలిస్టు విప్లవం భారతదేశాన్ని సామాజిక, ఆర్థిక సమానతలతో రూపుదిద్దేలా స్ఫూర్తినిచ్చింది. మన రాజ్యాంగాన్ని రూపొందించటంలో ఈ అంశాలన్నీ ప్రభావితం చేశాయి.

మూడవది, బ్రిటిషు వాళ్లు కూడా భారతదేశంలో ప్రజాస్వామిక పాలనకు కొన్ని సంస్కరణలను ప్రవేశపెట్టారు. అయితే ఎన్నికలలో కొన్ని వర్గాల ప్రజలు మాత్రమే ఓటు వేయగలిగేవాళ్లు. బ్రిటిషు వాళ్లు చాలా బలహీన శాసన సభలను ప్రవేశపెట్టారు. రాష్ట్రాల శాసనసభలకు, మంత్రివర్గాలకు బ్రిటిషు ఇండియా అంతటా 1937లో ఎన్నికలు జరిగాయి. ఇవి పూర్తిగా ప్రజాస్వామిక ప్రభుత్వాలు కావు. అయితే ఈ శాసనసభలలో పొందిన అనుభవం దేశం తన సొంత శాసనసభలను నెలకొల్పటంలో సహాయపడింది. ఈ కారణం వల్లనే వలస చట్టాలనుంచి అనేక విధానాలను, సంస్థాగత వివరాలను భారత రాజ్యాంగం తనకు అనువుగా మలుచుకుంది.






సరోజిని నాయుడు | దుర్గాబాయి దేశ్‌ముఖ్ | ఎన్.జి. రంగా | టి. ప్రకాశం

### రాజ్యాంగ సభ

ఎన్నికైన ప్రజాప్రతినిధులతో ఏర్పడిన రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని రాసింది. రాజ్యాంగ సభకు 1946 జులైలో ఎన్నికలు జరిగాయి. 1947 ఆగస్టులో దేశ విభజనతో రాజ్యాంగ సభను కూడా భారతదేశ, పాకిస్తాన్ రాజ్యాంగ సభలుగా విభజించారు. భారత రాజ్యాంగ సభలో 299 సభ్యులున్నారు. ఈ సభ 1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఆమోదించింది, అయితే ఇది 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. దీనికి గుర్తుగానే మనం ప్రతి సంవత్సరం జనవరి 26ను గణతంత్ర దినంగా జరుపుకుంటాం.

రాజ్యాంగ సభ సభ్యులను ప్రధానంగా బ్రిటిషు పాలనలో ఏర్పడిన రాష్ట్ర శాసనసభ నుంచి ఎన్నుకున్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాలను పాలిస్తున్న రాజులు కొంతమంది సభ్యులను నామినేట్ చేశారు. రాజ్యాంగ సభ సభ్యులు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చారు. దీంట్లో భారత జాతీయ కాంగ్రెసుకి చెందిన సభ్యులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఇతర పార్టీలకు చెందిన డా॥ బి.ఆర్. అంబేద్కర్ వంటివారు చాలా తక్కువమంది ఉన్నారు. అధిక సంఖ్యాకులు ఒకే పార్టీకి చెందిన వాళ్లైనప్పటికీ పలు అంశాలపై వాళ్ల దృక్పథాలలో ఎంతో తేడా ఉంది. మహిళలు చాలా తక్కువగా – కేవలం 15 మందే ఉన్నారు. వాళ్లలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఒకరు.

- రాజ్యాంగ సభకు సభ్యులను నామినేట్ చేయటానికి రాజులను ఎందుకు అనుమతించారు?
- మహిళా సభ్యులు చాలా తక్కువగా ఎందుకు ఉన్నారు? మహిళా సభ్యులు ఇంకా ఎక్కువ సంఖ్యలో ఉంటే బాగుండేదా?

LBUKBD

ముందుగా కొన్ని మౌలిక సూత్రాలను రూపొందించి, వాటిని అంగీకరించారు. వాటిలో భారతదేశం సర్వసత్తాక, గణ తంత్ర దేశంగా ఉంటుంది. స్వతంత్ర అధికారాలు కలిగిన అనేక రాష్ట్రాలు ఉంటాయి, ప్రజాస్వామికంగా ఉంటుంది. న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ పౌరులందరికీ ఇస్తుంది. అల్పసంఖ్యాక వర్గాల, గిరిజనుల, అణగారిన వర్గాల ప్రయోజనాలను కాపాడుతుంది. ప్రపంచశాంతి కోసం, మానవాళి అంతటి సంక్షేమం కోసం భారతదేశం పాటుపడుతుంది. దీనిని 'ఉద్దేశాల తీర్మానం' అంటారు. భారతదేశ మొదటి ప్రధాని అయిన జవహర్‌లాల్ నెహ్రూ దీనిని ప్రతిపాదించారు. రాజ్యాంగాన్ని రూపొందించటంలో ఇవి మార్గదర్శక సూత్రాలుగా పనిచేశాయి.



*చిత్రం 13.3 : రాజ్యాంగ సచిత్ర ప్రతిపై రాజ్యాంగసభ సభ్యులందరూ సంతకాలు చేశారు. ఇక్కడ జవహర్‌లాల్ నెహ్రూ రాజ్యాంగం మీద సంతకం చేస్తున్నారు*

తరవాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ చైర్మన్‌గా ఏర్పడిన డ్రాఫ్టింగ్ కమిటీ చర్చ నిమిత్తం రాజ్యాంగ ముసాయిదా ప్రతిని తయారుచేసింది. ఈ రాజ్యాంగ ముసాయిదా ప్రతిలోని ప్రతి అంశంపై అనేకసార్లు చర్చలు జరిగాయి. తీవ్రస్థాయిలో చర్చలు జరిగేవి. ముఖ్యమైన అన్ని అంశాలను అన్ని దృక్కోణాల నుంచి పరిశీలించారు. అధిక శాతం సభ్యుల ఓట్ల ఆధారంగా అంతిమ నిర్ణయాలు తీసుకున్నారు. ముసాయిదా ప్రతికి రెండు వేలకు పైగా సవరణలను పరిగణనలోకి తీసుకున్నారు. మూడు సంవత్సరాల కాలంలో 114 రోజులపాటు సభ్యులు చర్చలు జరిపారు. రాజ్యాంగ సభలో మాట్లాడిన ప్రతి మాటను నమోదుచేసి, భద్రపరిచారు. వీటిని 'రాజ్యాంగ సభ చర్చలు' అంటారు.

- ఉద్దేశాల తీర్మానంలోని ఏ మార్గదర్శక సూత్రం అన్నిటికంటే ముఖ్యమైనది? దానికి మీ కారణాలను ఇవ్వండి. దీనిపై ఇతర విద్యార్థులకు వేరే అభిప్రాయాలు ఉన్నాయా?

## రాజ్యాంగ ఆశయాలు, హామీలు

మన రాజ్యాంగ తాత్త్వికతను అర్థం చేసుకోటానికి ముందుగా ప్రయత్నిద్దాం. రాజ్యాంగంపై మన ప్రధాన నాయకుల దృక్పథాన్ని చదవటం ద్వారా దాని తాత్త్వికతను అర్థం చేసుకోవచ్చు. తన తాత్త్వికత గురించి రాజ్యాంగమే ఏం చెబుతోందో కూడా చదవాలి. రాజ్యాంగ పీఠిక ఇదే పని చేస్తుంది.

రాజ్యాంగ నిర్మాతల చిత్రాలలో ఒకరి చిత్రం లేకపోవటం మీలో కొందరు గమనించి ఉంటారు: మహాత్మా గాంధి. అతడు రాజ్యాంగ సభలో సభ్యుడు కాదు. అయితే అతడి దృక్పథాన్ని అనుసరించిన సభ్యులు అనేక మంది ఉన్నారు. 1931లో 'యంగ్ ఇండియా' అన్న పత్రికలో రాస్తూ రాజ్యాంగం నుంచి తాను ఏమి ఆశిస్తున్నాడో గాంధీజీ పేర్కొన్నాడు:

భారతదేశాన్ని అన్ని రకాల దాస్యం నుంచి, పోషణ నుంచి విముక్తం చేసే రాజ్యాంగం కోసం నేను కృషి చేస్తాను... అత్యంత పేదలు ఇది తమ దేశమనీ, దాని నిర్మాణంలో తమకూ పాత్ర ఉందని భావించే భారత దేశం కోసం, ఉన్నతవర్గ, నిమ్నవర్గ ప్రజలు లేని భారతదేశం కోసం. అన్ని మతాల వాళ్లు, జాతుల వాళ్లు సామరస్యతతో ఉండే భారతదేశం కోసం నేను కృషి చేస్తాను. ఇటువంటి భారతదేశంలో అంటరానితనం అనే శాపం, మత్తు పానీయాలు, మత్తుమందులు అనే శాపం ఉండవు. మహిళలకూ పురుషులతో సమానంగా హక్కులు ఉంటాయి... ఇంతకంటే తక్కువ దానితో నేను సంతృప్తి పడను.

– మహాత్మా గాంధీ

అసమానతలు లేని భారతదేశమన్న ఈ కల రాజ్యాంగ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించిన డా॥ అంబేద్కర్‌కి కూడా ఉంది. అయితే ఈ అసమానతలను ఎలా నిర్మూలించాలన్న దానిపై అతడికి భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. రాజ్యాంగ సభ ముగింపు ఉపన్యాసంలో అతడు తన ఆందోళనను చాలా స్పష్టంగా పేర్కొన్నాడు:

1950 జనవరి 26న మనం వైరుధ్యాలతో కూడిన జీవనంలోకి ప్రవేశించబోతున్నాం. రాజకీయాల్లో మనకి సమానత ఉంటుంది. కానీ సామాజిక, ఆర్థిక జీవితాల్లో అసమానత ఉంటుంది. రాజకీయాల్లో ఒక మనిషి ఒక ఓటు, ఒక ఓటు ఒకే విలువ అన్న సిద్ధాంతాన్ని అనుసరించబోతున్నాం. మన సామాజిక, ఆర్థిక జీవితాలలో మనకున్న సామాజిక, ఆర్థిక చట్రం కారణంగా ఒక మనిషి, ఒక విలువ అన్న సూత్రాన్ని అమలు చేయలేం. ఈ వైరుధ్య జీవనాన్ని ఎంత కాలం భరించాలి? సామాజిక, ఆర్థిక జీవితాలలో సమానత్వాన్ని ఎంతకాలం తిరస్కరించాలి? ఈ వైరుధ్యాలు ఎక్కువకాలం కొనసాగితే మన రాజకీయ ప్రజాస్వామ్యమే ముప్పులో పడుతుంది.

*– డా॥ బి.ఆర్. అంబేద్కర్*

చివరిగా 1947 ఆగస్టు 15, అర్ధరాత్రి సమయంలో రాజ్యాంగ సభను ఉద్దేశించి జవహర్‌లాల్ నెహ్రూ ఉపన్యాసాన్ని చూద్దాం:

మన భవిష్యత్తు విశ్రాంతి, సుఖాలతో ఉండబోవటం లేదు. గతంలో పలుమార్లు చేసిన ప్రతిజ్ఞలు, ఈ రోజు చేయబోతున్న ప్రతిజ్ఞను నిలుపుకోటానికి మనం నిరంతరం శ్రమించాల్సి ఉంటుంది. భారతదేశానికి సేవ చేయటమంటే, అందులో ఉంటున్న కోట్లాది వ్యధార్తులకు సేవ చేయటమే. దీని అర్థం పేదరికాన్ని, అజ్ఞానాన్ని, రోగాలను, అవకాశాలలో అసమానతలను అంతం చేయటం. ప్రతి వ్యక్తి కన్నీటి బిందువును తుడవాలని మన తరం మహా నాయకుడు కలగన్నాడు. అది మనకు సాధ్యం కాకపోవచ్చు. కానీ కన్నీళ్లు, కష్టాలు ఉన్నంతకాలం మన పని ఇంకా మిగిలే ఉంటుంది.

*– జవహర్‌లాల్ నెహ్రూ*

పైన ఇచ్చిన మూడింటిని జాగ్రత్తగా చదవండి.

- ఈ మూడింటిలో ఉన్న ఒకే భావనను గుర్తించండి.
- ఈ ఒకే భావాన్ని ముగ్గురూ వేర్వేరుగా, ఏ విధంగా వ్యక్తపరిచారు?

## రాజ్యాంగ పీఠిక

LC4GD1

స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తినిచ్చి, మార్గదర్శకంగా నిలిచిన విలువలే భారతదేశ ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలిచాయి. ఈ విలువలు భారత రాజ్యాంగ 'పీఠిక'లో పొందుపరిచి ఉన్నాయి. రాజ్యాంగ ఉద్దేశాలను, మౌలిక సూత్రాలను ఈ పీఠిక తెలియచేస్తుంది. భారత రాజ్యాంగంలోని అన్ని అంశాలకు ఇది మార్గదర్శకం చేస్తుంది.

రాజ్యాంగ పీఠికను జాగ్రత్తగా చదివి దాంట్లోని ప్రతి కీలక పదం అర్థాన్ని తెలుసుకుందాం. ఇక్కడ పేర్కొన్న ప్రతి దానికి దాని నేపథ్యంలో ఒక ఉదాహరణను ఆలోచించండి.

మీరు దాన్ని జాగ్రత్తగా చదివితే ఇక్కడొక ముఖ్యమైన వాక్యం ఉంది: "*భారతదేశ ప్రజలమైన మేము భారతదేశాన్ని గణతంత్రంగా ఏర్పాటు చేయటానికి తీర్మానించి దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత, సౌభ్రాతృత్వం ఇస్తూ మాకు మేము ఈ రాజ్యాంగాన్ని ఇచ్చుకుంటున్నాం.*"

- భారత ప్రజలు రెండు ఉద్దేశాలు సాధిస్తామని నిర్ణయించారు (తీర్మానించారు). ఈ రెండూ ఏమిటి?
- ఈ ఉద్దేశాలు నెరవేరటానికి వాళ్లు ఏం చేశారు?

**భారతదేశ ప్రజలమైన మేము**

**భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి; ఈ పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని; ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం ఆరాధనలలో స్వాతంత్ర్యాన్ని; అంతస్తుల్లోను, అవకాశాల్లోను సమానత్వాన్ని; చేకూర్చుటకు; వారందరిలో వ్యక్తి గౌరవాన్ని, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని; పెంపొందించడానికి; 1949 నవంబర్, 26న మన రాజ్యాంగ పరిషత్తులో ఎంపిక చేసికొని శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేమే ఇచ్చుకున్నాం.**

**భారతదేశ ప్రజలమైన మేము:** ఈ రాజ్యాంగాన్ని ప్రజలు తమ ప్రతినిధుల ద్వారా రాసి, చట్టంగా చేశారు, అంతేకానీ దానిని రాజులో, బయటి శక్తులో వాళ్లకి ఇవ్వలేదు. మన గణతంత్రపు ప్రజాస్వామిక స్వభావాన్ని ఇది చాటి చెపుతుంది.

**గణతంత్రం:** ఎన్నికైన వ్యక్తి దేశాధినేత అవుతాడు, అంతేకాని రాజ్యాలలో మాదిరి వారసత్వంగా అధికారం రాదు.

**సర్వసత్తాక:** అంతర్గత, విదేశీ వ్యవహారాలన్నింటిలో నిర్ణయాలు తీసుకోటానికి, చట్టాలు చేయటానికి భారతదేశానికి పూర్తి హక్కు ఉంటుంది. బయటి శక్తులు ఏవీ భారతదేశానికి చట్టాలు రూపొందించలేవు.

**సామ్యవాదం:** తమ పని ద్వారా ప్రజలందరూ సంపదను సృష్టిస్తారు. దానిని అందరూ సమానంగా పంచుకోవాలి. అన్ని రకాల అసమానతలను తగ్గించటానికి, అంతం చేయటానికి దేశం కృషి చేస్తుంది.

**లౌకికతత్వం:** ఏ మత ఆధారంగా ప్రభుత్వం నడవదు. ఏ మతాన్ని అనుసరించటానికైనా, ఏ మతాన్నీ అనుసరించక పోవటానికైనా ప్రతి ఒక్క పౌరునికి హక్కు ఉంటుంది. ప్రభుత్వం ఏ ఒక్క మతానికీ ప్రాముఖ్యతను ఇవ్వదు.

**ప్రజాస్వామ్యం:** ఇది ప్రజలందరికీ సమాన రాజకీయ హక్కులు ఉండే ప్రభుత్వ విధానం. చట్టాలు చేయటానికీ, ప్రభుత్వాన్ని నడపటానికీ ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకొంటారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉంటారు.

**న్యాయం:** ప్రతి పౌరునికి వారికి చెందింది దక్కాలి. వారికి ఏం చెందాలి అనేది నిర్ణయించటంలో వాళ్ల పుట్టుక (కులం, జాతి, మతం, లింగం), నమ్మకాలు (మత, రాజకీయ వంటి), సంపద (ధనిక, పేద), హోదాలను బట్టి వివక్షత చూపించరు. అయితే చారిత్రికంగా (కుల, లింగ, మత వివక్షత

కారణంగా) అన్యాయానికి గురైన ప్రజల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టవచ్చు.

**సమానత్వం:** మన రాజ్యాంగం అన్ని అంశాలలో (ఉదాహరణకు ఆదాయం, ఆస్తుల విషయంలో) సమానతను ఇవ్వటం లేదు, కానీ అందరికీ ఒకే హోదా ఉండేలా చూస్తుంది. దీని అర్థం ప్రతి ఒక్కరికీ ఒకే చట్టాలు వర్తిస్తాయి. రెండవది అది 'అవకాశాలలో' సమానత్వానికి హామీ ఇస్తోంది. దీని అర్థం ప్రభుత్వ అవకాశాలన్నీ కులం, మతంతో సంబంధం లేకుండా అందరికీ అందుబాటులో ఉంటాయి. ఒక పదవికి ప్రత్యేక అర్హతలు ఉండాల్సి వస్తే, ఆ అర్హతలు కూడా అందరికీ సమానంగా అందుబాటులో ఉండేలా చేస్తారు.

**స్వేచ్ఛ:** పౌరులు వాళ్లు ఆలోచించే దానిమీద, వాళ్లు అనుసరించే మతం, లేక మతాన్నే అనుసరించకపోవటం, తమ భావాలను వ్యక్తిపరిచే విధానం, లేదా భావాలను చర్యలలో చేపట్టటం, అందరూ కలిసి సంఘాలు, పార్టీలుగా ఏర్పడటం వంటి స్వేచ్ఛ అందరికీ ఉంటుంది. దేనిపైనా కారణాలు లేకుండా నియంత్రణ ఉండదు.

**సౌభ్రాతృత్వం:** ప్రజలందరి మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించాలి. తోటి పౌరులను పరాయివారిగా భావించకుండా, వారిని తక్కువ చేయకుండా ఉండాలి.

పీఠిక కాకుండా మన రాజ్యాంగంలో 'ప్రభుత్వ విధానానికి ఆదేశిక సూత్రాలు' అన్న విభాగం ఉంది. ఇది భారత ప్రభుత్వం ముందు కొన్ని నిర్దిష్ట కర్తవ్యాలను పేర్కొంది. ఉదాహరణకు సార్వజనీన అక్షరాస్యత, విద్య, పర్యావరణ పరిరక్షణ, ఆదాయ అసమానతలను తగ్గించటం మొదలైనవి. ఈ సూత్రాలు ప్రభుత్వానికి మార్గదర్శకంగా ఉంటాయి. అయితే ప్రభుత్వాలు వీటిని అనుసరించటం లేదనిపించినపుడు మనం న్యాయ స్థానంలో కేసులు వేయలేం.

ఈ ఆదర్శాలన్నీ ప్రజలందరికీ వర్తింపజేసేందుకు రాజ్యాంగంలో పౌరులందరికీ వర్తించే ప్రాథమిక హక్కులు అన్న అధ్యాయం ఉంది. వీటి గురించి మీరు 9వ తరగతిలో చదువుతారు. ఆదేశిక సూత్రాల మాదిరి కాకుండా ఈ ప్రాథమిక హక్కులు లభించనప్పుడు, లేదా వాటికి భంగం కలిగినపుడు న్యాయస్థానాల సహాయం తీసుకోవచ్చు.

## ప్రభుత్వ వ్యవస్థలు

LCDCEN

పై విలువలు, ఆదర్శాలకు అనుగుణంగా దేశాన్ని పరిపాలించటానికి రాజ్యాంగం వ్యవస్థాగత ఏర్పాట్లను కూడా ప్రస్తావించింది.

ఇది పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని మనకు ఇచ్చింది. ప్రజాప్రతినిధులతో కూడిన పార్లమెంటు చట్టాలు చేస్తుంది. ఈ చట్టాలను పార్లమెంటు సభ్యులతో ఏర్పడిన ప్రభుత్వం అమలు చేస్తుంది, ఇది పార్లమెంటుకి జవాబుదారీగా ఉంటుంది. దేశ పరిపాలనను ప్రధానమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గం (క్యాబినెట్) చేపడుతుంది. ప్రభుత్వం మొత్తానికి రాష్ట్రపతి అధినేతగా ఉంటాడు. (దీని గురించి మరింత వివరంగా తరవాత అధ్యాయంలో చదువుతారు.)

- ఎన్నికైన పార్లమెంటు చట్టాలను ఎందుకు చేయాలి? విద్యావంతులైన న్యాయవాదులు, న్యాయమూర్తులు ఎందుకు చేయకూడదు?
- ప్రధానమంత్రి, మంత్రివర్గం తమ నిర్ణయాలకు పార్లమెంటు ఆమోదాన్ని ఎందుకు పొందాలి? పార్లమెంటు సభ్యులు అడిగే ప్రశ్నలకు వాళ్లు సమాధానాలు ఎందుకు చెప్పాలి? కేవలం రాష్ట్రపతికే జవాబుదారీగా ఉంటే మెరుగ్గా ఉంటుందా?

రెండవది, మన దేశం సమాఖ్య వ్యవస్థను కలిగి ఉంది. చిన్న రాష్ట్రాల కలయికతో దేశం ఏర్పడింది. ప్రభుత్వ విధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజించారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకి, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర శాసనసభలకీ జవాబుదారీగా ఉంటాయి. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వం సైన్యం, రైల్వేలకు సంబంధించి చట్టాలు చేసి, వాటిని

నియంత్రిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసు, రోడ్డు రవాణా, పాఠశాలలు వంటి వాటికి సంబంధించి చట్టాలు చేస్తుంది.

కేంద్ర పార్లమెంటులో లోక్‌సభ, రాజ్యసభ అని రెండు సభలు ఉంటాయి. లోక్‌సభను భారతదేశ ప్రజలందరూ ఎన్నుకుంటారు. రాజ్యసభ సభ్యులను రాష్ట్ర శాసనసభలు ఎన్నుకుంటాయి. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు చేయటంలో రాష్ట్రాల పాత్ర కూడా ఉంటుంది.

- కొన్ని దేశాలలో భిన్నమైన వ్యవస్థ ఉంది. మొత్తం దేశానికీ, రాష్ట్రాలకూ కేంద్ర ప్రభుత్వం ఒక్కటే చట్టాలు చేస్తుంది. ఇటువంటి విధానం భారతదేశానికి అనువైనదని భావిస్తున్నారా? తరగతిలో చర్చించండి.


మూడవది, మన దేశంలో ప్రజాస్వామ్యం మూడు అంచెలలో ఉంది – దేశస్థాయిలో పార్లమెంటు, రాష్ట్రాల స్థాయిలో రాష్ట్ర శాసనసభలు, జిల్లాస్థాయిలో పంచాయితీ రాజ్ వ్యవస్థ అనే స్థానిక ప్రభుత్వం ఉన్నాయి. దేశ వ్యవహారాల్లో ప్రజలు పాల్గొనడానికి అత్యధిక అవకాశాలు కల్పించటానికి ఈ విధానాన్ని రూపొందించారు.

LCM8GB

నాల్గవది, రాజ్యాంగాన్ని సంరక్షించటానికి కొన్ని స్వతంత్ర సంస్థలను కూడా రాజ్యాంగం పొందుపరిచింది – న్యాయవ్యవస్థ (న్యాయస్థానాలు), ప్రభుత్వాల ఖర్చును పర్యవేక్షించే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించటానికి ఎన్నికల సంఘం ఉన్నాయి. ఇవి ప్రభుత్వంతో సంబంధం లేకుండా స్వతంత్రంగా పనిచేస్తూ రాష్ట్రపతికి నేరుగా నివేదించాలి.

- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు స్వతంత్రంగా న్యాయస్థానాలు, న్యాయమూర్తులు ఎందుకు ఉండాలో చర్చించండి.
- ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తితో ఎందుకు ఉండాలి?

అంతిమంగా, రాజ్యాంగం అన్నది మారుతూ, సజీవంగా ఉండే పత్రం. దానిని రూపొందించిన వాళ్లు అది సమాజంలో మార్పులకు, ప్రజల కోరికలకు అనుగుణంగా ఉండాలని భావించారు. దానిని పవిత్రమైనది, స్థిరమైనది, మార్చటానికి వీలులేనిదిగా చూడలేదు. కాబట్టి ఎప్పటికప్పుడు దాంట్లో మార్పులు చేయటానికి వీలు కల్పించారు. ఈ మార్పులను రాజ్యాంగ సవరణలు అంటారు. రాజ్యాంగాన్ని మార్చటానికి విధి విధానాలను రాజ్యాంగంలోనే పొందుపరిచారు. 2011 వరకు మన రాజ్యాంగానికి 97 సవరణలు చేశారు.



*చిత్రం 13.4 : ఫోటోలో (కుడి నుంచి ఎడమకు) జైరాం దాస్ దౌలత్‌రాం, ఆహార, వ్యవసాయ మంత్రి; రాజ్‌కుమారి అమ్రిత్ కౌర్, ఆరోగ్య మంత్రి; డా|| జాన్ మథాయ్, ఆర్థిక మంత్రి; సర్దార్ వల్లభభాయ్ పటేల్, ఉప ప్రధానమంత్రి; ఆయన వెనక జగ్జీవన్ రాం, కార్మిక మంత్రి ఉన్నారు*

## కీలక పదాలు

| | | | |
|---|---|---|---|
| 1. రాచరికం | 2. ప్రతినిధి 3. వివక్ష | 4. స్వయం ప్రతిపత్తి | |
| 5. రాజ్యాంగం | 6. సర్వసత్తాక 7. సమాఖ్య వ్యవస్థ | 8. రాష్ట్రం | |
| 9. ముసాయిదా | 10. గణతంత్రం | 11. లౌకిక | 12. సౌభ్రాతృత్వం |
| 13. సవరణ | | | |

LCH4HY

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. 'దమన పురాన్ని' పూజారులు, మంత్రులు రూపొందించిన నియమాల ఆధారంగా ఒక రాజు పరిపాలిస్తున్నాడు. అతడు తన రాజ్యాన్ని పదహారు ప్రాంతాలుగా చేసి ఒక్కొక్క ప్రాంతానికీ తన అధికారులను పరిపాలకులుగా నియమించాడు. ఇది ప్రజాస్వామిక దేశం అని చెప్పవచ్చా? ఇది రాజ్యాంగబద్ధ దేశమా? మీ సమాధానాలకు కారణాలు ఇవ్వండి. $AS_1$
2. దిగువ ఉన్న వాక్యాలలో సరైనది ఏది? $AS_1$
   అ. ప్రభుత్వం, ప్రజల మధ్య సంబంధాన్ని రాజ్యాంగం నిర్ణయిస్తుంది.
   ఆ. ప్రజాస్వామిక ప్రభుత్వాలకు సాధారణంగా ఒక రాజ్యాంగం ఉంటుంది.
   ఇ. భారతదేశం వంటి వైవిధ్యతతో కూడుకున్న దేశానికి రాజ్యాంగం తయారు చేయటం తేలిక కాదు.
   ఈ. పైవన్నీ.
3. కింది నాయకులను రాజ్యాంగాన్ని రూపొందించటంలో వారి పాత్రతో జతపరచండి: $AS_1$

| | |
|---|---|
| అ. మోతిలాల్ నెహ్రూ | i) రాజ్యాంగసభ అధ్యక్షులు |
| ఆ. బి.ఆర్. అంబేద్కర్ | ii) రాజ్యాంగసభ సభ్యులు |
| ఇ. రాజేంద్ర ప్రసాద్ | iii) డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ |
| ఈ. సరోజిని నాయుడు | iv) 1928లో భారతదేశానికి ఒక రాజ్యాంగాన్ని తయారుచేశారు |

4 నెహ్రూ ఉపన్యాసం నుంచి పొందుపరిచిన భాగాన్ని మరొకసారి చదివి ఈ దిగువ వాటికి సమాధానాలివ్వండి: $AS_2$
   అ. రాజ్యాంగ నిర్మాతలు ఏ ప్రతిజ్ఞ పూనాలని అతడు కోరాడు?
   ఆ. "ప్రతి వ్యక్తి కన్నీటి బిందువును తుడవాలని మనతరం మహా నాయకుడు కలగన్నాడు." అతడు ఎవరి గురించి చెబుతున్నాడు?
5. ఇక్కడ రాజ్యాంగంలోని కొన్ని మార్గదర్శక విలువలు, వాటి అర్థాలు ఉన్నాయి. వాటిని జత పరచండి. $AS_1$

| | |
|---|---|
| అ. సర్వసత్తాక | i) ప్రభుత్వం ఏ ఒక్క మతానికి ప్రాధాన్యతనివ్వదు |
| ఆ) గణతంత్ర | ii) నిర్ణయాలు తీసుకునే అంతిమ అధికారం ప్రజలకు ఉంటుంది |
| ఇ) సౌభ్రాతృత్వం | iii) దేశాధినేతగా ఎన్నికైన వ్యక్తి |
| ఈ) లౌకిక | iv) ప్రజలు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మాదిరి మెలగాలి |

6. భారత రాజ్యాంగ ప్రవేశికలో పొందుపరచిన ముఖ్యమైన భావనలు ఏవి? $AS_1$
7. 'చట్టం ముందు ప్రజలందరూ సమానమే' దీనిని ఉదాహరణలతో వివరించండి. $AS_1$

8. కింది వాటిల్లో సరైన వాక్యాలను గుర్తించండి: $AS_1$

అ. శాసనసభల అధికారాలను రాజ్యాంగం నిర్వచిస్తుంది.

ఆ. ఎట్టి పరిస్థితులలోనూ రాజ్యాంగాన్ని మార్చటానికి లేదు.

ఇ. పీఠికలో ఉన్న ఆదర్శాలు వ్యవస్థల నిర్మాణంలో వ్యక్తమవుతున్నాయి.

ఈ. దేశం మొత్తానికి సంబంధించిన చట్టాలను కేంద్ర ప్రభుత్వ స్థాయిలో చేస్తారు.

9. సమన్యాయం ఏయే సందర్భాలలో కనబడుతుంది? ఉదాహరణలతో తెలపండి. $AS_6$

## ప్రాజెక్టు

అమెరికా, భారతదేశం, దక్షిణాఫ్రికా దేశాల రాజ్యాంగాల పీఠికలను పోల్చండి.

అ. ఈ మూడు దేశాల పీఠికలో ఉన్న ఆదర్శాల జాబితా తయారుచేయండి.

ఆ. వీటి మధ్య కనీసం ఒక ప్రధానమైన తేడాను గుర్తించండి.

ఇ. ఈ మూడింటిలో గతాన్ని ఏది ప్రస్తావిస్తుంది?

ఈ. వీటిల్లో ఏది దేవుడిని ప్రస్తావించదు?

### అమెరికా రాజ్యాంగ పీఠిక

అమెరికాదేశ ప్రజలమైన మేము మరింత మెరుగైన సంయుక్త దేశంగా ఏర్పాటు చేయటానికి, న్యాయస్థాపనకు, దేశంలో శాంతి వెల్లివిరిసేలా చేయటానికి, ఉమ్మడి రక్షణకు, ప్రజల సంక్షేమాన్ని చేపట్టటానికి, మేము, రాబోయేతరాలు స్వేచ్ఛను అనుభవించటానికి ఈ అమెరికా రాజ్యాంగాన్ని ఏర్పాటు చేస్తున్నాం.

### దక్షిణ ఆఫ్రికా రాజ్యాంగ పీఠిక

దక్షిణ ఆఫ్రికా ప్రజలమైన మేము గతంలోని అన్యాయాలను గుర్తిస్తున్నాం. దేశంలో స్వాతంత్ర్యం, న్యాయం కోసం పోరాడిన వాళ్లను సన్మానిస్తున్నాం. దేశ నిర్మాణానికి, ప్రగతికి పాటుపడిన వాళ్లను గౌరవిస్తున్నాం. భిన్నత్వంలో ఏకత్వంగా ఇక్కడ నివసిస్తున్న వాళ్లందరికీ ఈ దేశం చెందుతుందని విశ్వసిస్తున్నాం. దీనికి అనుగుణంగా స్వేచ్ఛగా ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల ద్వారా ఈ రాజ్యాంగాన్ని అత్యున్నత చట్టంగా ఆమోదిస్తున్నాం. దీని ద్వారా గతకాలపు విభజనలను రూపుమాపి, ప్రజాస్వామిక విలువలు, సామాజిక న్యాయం, ప్రాథమిక మానవ హక్కుల ఆధారంగా సమాజాన్ని ఏర్పరుస్తాం. దీని ద్వారా ప్రజాస్వామిక, బహిరంగ సమాజానికి పునాదులు వేస్తున్నాం– దీంట్లో ప్రజల అభీష్టం మేరకు ప్రభుత్వం ఏర్పడుతుంది, చట్ట రక్షణ ప్రతి వ్యక్తికి సమానంగా లభిస్తుంది. పౌరులందరి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది, ప్రతి వ్యక్తి శక్తి సామర్థ్యాలు పూర్తిగా వికసించేలా చేస్తుంది. దేశాల కుటుంబంలో సర్వసత్తాక దేశంగా తనదైన చోటు పొందేలా దక్షిణాఫ్రికాని సంఘటిత, ప్రజాస్వామిక దేశంగా నిలబెడుతుంది.

దేవుడు ప్రజలను రక్షించుగాక.

దేవుడు దక్షిణాఫ్రికాను ఆశీర్వదించుగాక.

పాఠం 14

# పార్లమెంటు - కేంద్ర ప్రభుత్వం

రాజ్యాంగం దేశ పరిపాలనకు పార్లమెంటరీ తరహా విధానాన్ని రూపొందించింది. చట్టాలు చేసే అత్యున్నత సంస్థ పార్లమెంటు. ఏడవ తరగతిలో రాష్ట్ర శాసన చట్టాల తయారీ అనే పాఠంలో మనం రాష్ట్ర స్థాయిలో చట్టాలు చేసే సంస్థల గురించి తెలుసుకున్నాం. ప్రతి రాష్ట్రంలో శాసనసభ సభ్యులు ఆ రాష్ట్రాలకు కావలసిన చట్టాలు చేస్తారు. కొన్ని అంశాలపైన మాత్రమే రాష్ట్రాలు తమ సొంత చట్టాలు చేస్తాయి. శాసనసభలు చేసిన చట్టాలు, విధానాలు అమలు చేయటానికి రాష్ట్ర స్థాయిలో అధికారులు ఉంటారు. అదే విధంగా జాతీయ స్థాయిలో పార్లమెంటు పనిచేసే విధానం గురించి చదువుదాం.

## పార్లమెంటు పాత్ర

అనేక టీవీ చానళ్లల్లో లోకసభ టీవి చానల్ అనేదానిని మీరు చూడవచ్చు. కొత్త ఢిల్లీలో పార్లమెంటు భవనంలో సమావేశాల సమయంలో జరిగే చర్చలను ఇది ప్రసారం చేస్తుంది. పార్లమెంటు పనితీరును అర్థం చేసుకోటానికి ఎప్పుడైనా ఈ చానల్‌ని చూడండి.

LD5ZJL

మన పార్లమెంటుకి అనేక ముఖ్యమైన కర్తవ్యాలు ఉన్నాయి : వాటిల్లో దేశమంతటికీ చట్టాలు చేయటం అన్నిటికంటే ముఖ్యమైనది. అది దేశం మొత్తానికి మన అడవులు, సహజ వనరులైన గనుల వంటి వాటి వినియోగం గురించి, విద్య, ఇతర దేశాలతో సంబంధాలు, పరిశ్రమలు, వ్యవసాయం వంటి విషయాలకు సంబంధించిన విధి విధానాలను కూడా రూపొందిస్తుంది. ఈ విధానాలకు అనుగుణంగా ప్రభుత్వాలు కార్యక్రమాలను అమలు చేయాలి. ఉదాహరణకు 1986లో జాతీయ విద్యా విధానాన్ని పార్లమెంటు రూపొందించింది. విద్యకి సంబంధించిన కార్యక్రమాలకు అది ఈనాటికీ మార్గదర్శకంగా పనిచేస్తుంది. పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందేలా చూడటానికి 2009లో పార్లమెంటు 'ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యకు బాలల హక్కు' అనే చట్టాన్ని చేసింది.

- పార్లమెంటు చేసిన కొన్ని ముఖ్యమైన చట్టాలు, విధానాల గురించి తెలుసుకోండి. వాటి గురించి తరగతిలో వివరించండి.

- పార్లమెంటు అనగా లోక్‌సభ, రాజ్యసభ మరియు రాష్ట్రపతి.



*చిత్రం 14.1 : కొత్త ఢిల్లీలోని పార్లమెంటు భవనం*

ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి పార్లమెంటు చేసిన చట్టాలను ప్రభుత్వం (కార్యనిర్వాహక వర్గం) అమలు పరుస్తుంది. పార్లమెంటులో చర్చలు జరుగుతున్నప్పుడు ఏ అంశాలపైన అయినా స్పష్టత కోసం సభ్యులు ప్రశ్నలు అడగవచ్చు, ప్రభుత్వంలో దానికి సంబంధించిన సభ్యులు సమాధానాలు ఇస్తారు. ఈ విధంగా పార్లమెంటుకి ప్రభుత్వం జవాబుదారీగా ఉంటుంది. ప్రభుత్వ ఆదాయ, ఖర్చులను కూడా పార్లమెంటు ఆమోదిస్తుంది. ప్రతి సంవత్సరం పార్లమెంటు ఆమోదం నిమిత్తం ప్రభుత్వం వార్షిక బడ్జెటును సమర్పిస్తుంది.

- పార్లమెంటుకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వంతో కూడుకున్న పార్లమెంటరీ తరహా ప్రభుత్వ విధానం వల్ల ప్రయోజనాలు ఏమిటి?
- పార్లమెంటు చట్టాలు మాత్రం చేసి ప్రభుత్వాన్ని నియంత్రించకుండా ఉంటే సరిపోతుందా? తరగతిలో చర్చించండి.
- పార్లమెంటుకి కానీ, శాసనసభకు కానీ జవాబుదారీ కాని ఇతర ప్రభుత్వ రూపాలు ఉన్నాయేమో తెలుసుకోండి.

## పార్లమెంటు సభలు

పార్లమెంటులో రెండు సభలున్నాయి. అవి రాజ్యసభ, లోక్‌సభ. లోక్‌సభ సభ్యులు నేరుగా ప్రజల ద్వారా ఎన్నిక అవుతారు, రాజ్యసభ సభ్యులను రాష్ట్ర శాసనసభ సభ్యులు ఎన్నుకుంటారు. రాజ్యసభలో అత్యధికంగా 250 సభ్యులు ఉండవచ్చు. రాష్ట్రాల శాసనసభలు, కేంద్రపాలిత ప్రాంతాలు రాజ్యసభకు తమ ప్రతినిధులను ఎన్నుకుంటాయి. కేంద్రంలో శాసన ప్రక్రియతో రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధం కల్పించే మార్గాలలో ఇది ఒకటి. రాజ్యసభ సభ్యులు ఆరు సంవత్సరాల కాలానికి ఎన్నికవుతారు. ప్రతి రెండు సంవత్సరాలకు మూడింట ఒక వంతు సభ్యుల పదవీకాలం ముగుస్తుంది, వారి స్థానంలో కొత్త వాళ్లను ఎన్నుకుంటారు.


## సభల అధికారాలు

రాజ్యాంగం ప్రకారం అనేక విషయాలలో లోకసభకు అత్యున్నత అధికారాలు ఉన్నాయి. అది ఎలాగో చూద్దాం:

1. ఏ సాధారణ చట్టాన్నైనా ఉభయ సభలు ఆమోదించాలి. కానీ, రెండు సభల మధ్య తేడాలు ఉన్నప్పుడు అంతిమ నిర్ణయాన్ని ఉభయసభల ఉమ్మడి సమావేశంలో తీసుకుంటారు. లోకసభలో ఎక్కువ సభ్యులు ఉంటారు కాబట్టి ఇటువంటి సమావేశంలో వాళ్ల మాటే చెల్లుబాటు కావచ్చు.

2. ఆర్థిక విషయాలలో లోకసభకు ఎక్కువ అధికారాలున్నాయి. ప్రభుత్వ బడ్జెటుని కానీ, డబ్బుకి సంబంధించిన ఏ ఇతర చట్టాన్ని కానీ లోకసభ ఆమోదించిన తరవాత రాజ్యసభ దానిని తిరస్కరించటానికి వీలులేదు.

3. అన్నిటికంటే ముఖ్యమయినది మంత్రి మండలిని లోకసభ నియంత్రిస్తుంది. లోకసభలో అధికశాతం సభ్యుల ఆమోదం పొందిన వ్యక్తే ప్రధానమంత్రిగా నియమితులౌతారు. మంత్రివర్గం పట్ల లోకసభలో అధిక శాతం సభ్యులు 'అవిశ్వాసాన్ని' ప్రకటిస్తే ప్రధానమంత్రితో సహా మంత్రులందరూ రాజీనామా చేయాల్సిందే. రాజ్యసభకు ఈ అధికారం లేదు.




| రాష్ట్రం | సంఖ్య | రాష్ట్రం | సంఖ్య | రాష్ట్రం | సంఖ్య |
|---|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 25 | జమ్ము కాశ్మీర్ | 6 | నాగాలాండ్ | 1 |
| అరుణాచల్‌ప్రదేశ్ | 2 | జార్ఖండ్ | 14 | ఒడిషా | 21 |
| అస్సాం | 14 | కర్నాటక | 28 | పంజాబ్ | 13 |
| బీహార్ | 40 | కేరళ | 20 | రాజస్థాన్ | 25 |
| చత్తీస్‌గఢ్ | 11 | మధ్యప్రదేశ్ | 29 | సిక్కిం | 1 |
| గోవా | 2 | మహారాష్ట్ర | 48 | తమిళనాడు | 39 |
| గుజరాత్ | 26 | మణిపూర్ | 2 | తెలంగాణ | 17 |
| హర్యానా | 10 | మేఘాలయ | 2 | త్రిపుర | 2 |
| హిమాచల్‌ప్రదేశ్ | 4 | మిజోరాం | 1 | ఉత్తరాఖండ్ | 5 |
| | | | | ఉత్తరప్రదేశ్ | 80 |
| | | | | పశ్చిమబెంగాల్ | 42 |
| కేంద్రపాలిత ప్రాంతాలు | | | | | |
| అండమాన్, నికోబార్‌దీవులు | 1 | డామన్, డయ్యు | 1 | ఢిల్లీ | 7 |
| చండీగఢ్ | 1 | లక్షద్వీప | 1 | రాష్ట్రపతిచే నామినేట్ చేయబడే ఆంగ్లో ఇండియన్లు | 2 |
| దాద్రానగర్ హవేలి | 1 | పాండిచ్చేరి | 1 | | |

*పట్టిక : రాష్ట్రాల వారీగా లోకసభ నియోజక వర్గాలు*

- రాజ్యసభ, లోకసభల మధ్య మౌలిక తేడాలను గుర్తించండి.
- వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మేధావులు రాజ్యసభలో ఉంటారు కాబట్టి దానికి ఎక్కువ అధికారాలు ఉండాలని అజహర్ భావిస్తాడు. రాజ్యసభ సభ్యులను ప్రజలు నేరుగా ఎన్నుకోరు కాబట్టి వాళ్లకి అంతకంటే ఎక్కువ అధికారాలు ఇవ్వగూడదని ముంతాజ్ అంటుంది. మీరు ఎవరి వైపున వాదిస్తారు? వీరి భావనలపై మీ అభిప్రాయమేమిటి?

## లోకసభకు ఎన్నికలు


LD9M8I

ప్రజలతో నేరుగా ఎన్నుకోబడింది కాబట్టి లోకసభకు ఈ ప్రత్యేక అధికారాలు ఉన్నాయి. లోకసభకు ఎన్నికలు ఎలా జరుగుతాయో చూద్దాం.

సాధారణంగా లోకసభకు ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. 18 సంవత్సరాలు, అంతకు పైన వయసున్న పౌరులందరికీ ఓటు హక్కు ఉంటుంది. అయితే వాళ్లు నివసిస్తున్న నియోజక వర్గంలో తమ పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలి. 25 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి ఎన్నికల్లో పోటీచేసి లోకసభ సభ్యుడు కావచ్చు. లోకసభలో 545 సీట్లు (2 నామినేటెడ్ సీట్లతో సహా) ఉన్నాయి. రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను నియోజకవర్గాలుగా విభజిస్తారు, వీటినుంచి లోకసభ సభ్యులు ఎన్నిక అవుతారు. ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ నియోజక వర్గాలు ఉంటాయి. అందుకే ఉత్తరప్రదేశ్‌లో 80 నియోజకవర్గాలు ఉంటే, మేఘాలయలో 2 నియోజకవర్గాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 25 నియోజకవర్గాలు ఉన్నాయి, చండీఘడ్‌లో ఒకటి ఉంది.

పక్క పేజీలో పటం, పట్టిక చూసి కింది ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి:

- మీ రాష్ట్రంలో, పొరుగునున్న రెండు రాష్ట్రాలలో ఎన్ని నియోజకవర్గాలు ఉన్నాయి?
- 30 కంటే ఎక్కువ లోకసభ నియోజకవర్గాలు ఉన్న రాష్ట్రాలేవి?
- చాలా రాష్ట్రాలకు ఎక్కువ నియోజకవర్గాలు ఎందుకు ఉన్నాయి?
- కొన్ని నియోజకవర్గ ప్రాంతాలు చిన్నగా ఉండగా, కొన్ని పెద్దగా ఎందుకున్నాయి?
- షెడ్యూల్డు కులాలు/ తెగలకు రిజర్వు చేసిన నియోజకవర్గాలు దేశమంతా సమంగా విస్తరించి ఉన్నాయా, లేదా కొన్ని ప్రాంతాలలో ఎక్కువగా ఉన్నాయా?



*చిత్రం 14.2 : పై చిత్రంలో పార్లమెంట్ ఒకవైపు, ప్రజలు మరోవైపు ఎందుకు ఉన్నారో ఊహించగలరా?*

## లోకసభకు మొదటి ఎన్నికలు

మన ప్రస్తుత రాజకీయ జీవితాలలో ఎన్నికలు చాలా ముఖ్యమైనవి. మన ప్రతినిధులను మనం ఎంచుకునే సమయమిది. చాలా ఎక్కువ జనాభా ఉన్న మనలాంటి దేశాల్లో ఎన్నికల నిర్వహణ చాలా పెద్ద పని. దీనిని అర్థం చేసుకోటానికి 1951-52లో జరిగిన మొదటి ఎన్నికలను పరిశీలిద్దాం. ఈ ఎన్నికల నిర్వహణకు నాలుగు నెలలు పట్టింది.

సార్వజనీన ఓటు హక్కు ద్వారా ఈ ఎన్నికలు జరిగాయి కాబట్టి 21 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వాళ్లందరికీ ఓటు హక్కు ఉండేది. ఆ సమయంలో 17,30,00,000 మందికి ఓటు హక్కు ఉంది. ఇందులో చాలామంది మొదటిసారి ఓటు వేశారు. వారిలో చాలామంది నిరక్షరాస్యులు, పల్లెల్లో నివసించేవారు. "ఈ అవకాశానికి ప్రజలు ఎలా స్పందిస్తారు?" అన్న ప్రశ్న అందరి ముందు ఉంది.

"ఈ ఎన్నికలు 'చీకటిలో ముందుకు దూకటం' వంటిది. భారతదేశంలాంటి దేశానికి ఇది అనువైనది కాదు. భారతదేశం కుల ప్రాతిపదికన ఏర్పడిన సమాజం, అందరూ సమానమనే భావనను అధిక శాతం ప్రజలు ఒప్పుకోరు. కాబట్టి ప్రజాస్వామికంగా ఎన్నికలు జరపటం సాధ్యం కాదు," అని కొంతమంది అన్నారు.

ఆశాభావం వ్యక్తపరిచిన వాళ్లు కూడా ఉన్నారు. వాళ్లు, "బ్రిటిషు వాళ్లనుంచి విముక్తం చేయటానికి భారతీయులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. తమకు కావలసిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని వాళ్లనుకుంటున్నారు. అందరినీ సమానంగా చూసే సమాజం కోసం కృషి చేసే ప్రభుత్వాన్ని వాళ్లు కోరుకుంటున్నారు. ప్రజల జీవన ప్రమాణాలను ప్రభుత్వం మెరుగుపరచాలని కూడా వాళ్లు కోరుకుంటున్నారు. కాబట్టి తమకు కావలసిన ప్రభుత్వాన్ని ఎన్నుకోటానికి ప్రతి ఒక్కరికి సమాన అవకాశం ఉండాలి," అని అన్నారు. ఇటువంటివాళ్లకు ఎన్నికలు 'విశ్వాసంతో కూడిన చర్య' అవుతాయి.

- మీరు ఆ సమయంలో ఉండి ఉంటే పై వాదనలలో దేనితో ఏకీభవించి ఉండేవారు? అందరికీ ఓటు హక్కు ఉండి, ఎన్నికలు నిర్వహించటానికి భారతదేశం ప్రయత్నించటం సరైన ఆలోచన అని భావించేవారా? కారణాలు ఇవ్వండి.

స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించటానికి ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేశారు. మొదటి ఎన్నికలకు ఏర్పాట్లు చేయటం చాలా పెద్ద, సంక్లిష్టమైన పని. ముందుగా అర్హులైన ఓటర్లను నమోదు చేయటానికి ఇంటింటికి సర్వే చేశారు.

రాజకీయ పార్టీలకు చెందిన వాళ్లు, స్వతంత్రులు ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది. ఈ గుర్తులను ఓటు వేయాల్సిన బ్యాలెట్ పెట్టెలపై అతికించారు. ఎవరికైతే ఓటు వేయాలనుకుంటున్నారో ఆ వ్యక్తి గుర్తు ఉన్న బ్యాలెట్ పెట్టెలో ఓటరు బ్యాలెట్ పేపర్‌ను వేయాలి. ఈ ఓటింగు ప్రక్రియ రహస్యంగా ఉంచటానికి తెరలు ఏర్పాటు చేశారు.

దేశ వ్యాప్తంగా 2,24,000 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 25,00,000కు పైగా ఉక్కు బ్యాలెట్ పెట్టెలు చేశారు. సుమారు 62,00,00,000 బ్యాలెట్ పత్రాలు ముద్రించారు. ఇంచుమించు 10 లక్షల మంది అధికారులు ఎన్నికలను పర్యవేక్షించారు. దేశం మొత్తంమీద 17,500 అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. అంతిమంగా మొదటి లోకసభకు 489 సభ్యులు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను స్వేచ్ఛగా, స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా, చాలా క్రమశిక్షణతో నిర్వహించారు. హింసాత్మక ఘటనలు నామమాత్రంగా జరిగాయి.

కొత్త అవకాశానికి ప్రజలు పెద్ద ఎత్తున స్పందించారు. తమ ఓటు చాలా విలువైనదన్న అవగాహనతో ప్రజలు ఎన్నికల్లో పాల్గొన్నారు. చాలా ప్రాంతాల్లో ప్రజలు ఎన్నికలను ఒక పండగగా, సంబరంగా జరుపుకున్నారు. పండగమాదిరి మంచి బట్టలు వేసుకుని దీనికి తయారయ్యారు. మహిళలు తమ ఆభరణాలను ధరించారు. ఓటింగు విధానం సంక్లిష్టంగా ఉన్నప్పటికీ పేద, నిరక్షరాస్యులైన ప్రజలు తమ ఓటు హక్కును జాగ్రత్తగా వినియోగించుకోగలరని నిరూపించారు.

పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా పల్లెల్లో కూడా ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. దళితులు, ఆదీవాసీలు సైతం అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల్లో మరో ముఖ్యమైన అంశం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనటం – ఓటు హక్కు ఉన్న మహిళల్లో 40 శాతం మంది తమ హక్కును ఉపయోగించుకున్నారు. అనేక వర్గాలలో మహిళలు పరదా/ ఘోషా పద్ధతి పాటించి బయటకు రాని సంప్రదాయం ఉన్న నేపథ్యంలో ఇంతమంది మహిళలు ఓటు వేయడం ఎక్కువనే భావించారు.

ఈ ఎన్నికలకు సంబంధించి ముఖ్యమైన విషయమేమిటంటే అప్పటివరకు ఏ దేశం కూడా మహిళలు, నిరక్షరాస్యులు, పేదలలైన పౌరులందరికీ ఓటు హక్కు ఇచ్చి, ఇంత పెద్ద ఎత్తున ఎన్నికలు నిర్వహించలేదు. ఓటు ఉన్న వాళ్లల్లో 46 శాతం మంది తమ హక్కును ఉపయోగించుకున్నారు.

- మీ ప్రాంతం నుంచి ఎన్నికైన లోకసభ సభ్యులు ఎవరు? మీ రాష్ట్రం నుంచి, లేదా పొరుగు రాష్ట్రాల నుంచి ఎన్నికైన కొంతమంది లోకసభ సభ్యుల పేర్లు చెప్పండి.
- వాళ్లు ఏ రాజకీయ పార్టీలకు చెందిన వాళ్లో తెలుసుకోండి.

- కింది వాటి అర్థాలను మీ టీచరుతో చర్చించండి:

| | |
|---|---|
| 1. అభ్యర్థి | 2. నియోజకవర్గం |
| 3. బ్యాలెట్ | 4. ఈవిఎం |
| 5. ఎన్నికల ప్రచారం | 6. ఎన్నికల సంఘం |
| 7. ఓటర్ల జాబితా | 8. ఓటింగు విధానం |
| 9. స్వేచ్ఛగా స్వతంత్రంగా ఎన్నికలు | |

- ప్రస్తుత రాజకీయ పార్టీల ఎన్నికల గుర్తుల గురించి తెలుసుకోండి.
- మొదటి ఎన్నికలు నిర్వహించడం పెద్ద సంక్లిష్టమైన పనిగా ఎందుకు అయ్యింది?
- ప్రస్తుతం ఎన్నికలను ఎలా నిర్వహిస్తున్నారో మీ తల్లిదండ్రులు, టీచర్లతో చర్చించండి.
- మొదటి ఎన్నికలు, ప్రస్తుత ఎన్నికల మధ్య తేడాలు రాయండి – బ్యాలెట్ పెట్టె, బ్యాలెట్ పత్రాలు, ఓటు హక్కు వయసు.
- ఓటింగు రహస్యంగా ఎందుకుండాలి?

## స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఎన్నికలు నిర్వహించటంలోని సవాళ్లు

ఒక ఆదర్శ స్థితిలో వివిధ అభ్యర్థుల గురించి, వాళ్లు అనుసరించబోయే విధానాల గురించి ప్రతి ఓటరుకి తెలిసి ఏ విధానాలను తాము ఇష్టపడుతున్నారు, పార్లమెంటులో తమ ప్రయోజనాలకు ఎవరు బాగా ప్రాతినిధ్యం వహించగలరు అన్నవి ఆలోచించుకుని అప్పుడు ఓటెయ్యాలి. ఈ అభ్యర్థికి కానీ, ఆ అభ్యర్థికి కానీ ఓటు వెయ్యమని భర్త చెప్పాడనీ, లేదా యజమాని చెప్పాడని కానీ, లేదా కులనాయకుడు, లేదా మత గురువు ఆదేశించారనీ, లేదా ఎవరో డబ్బులు ఇచ్చారనీ ఒత్తిళ్లకు లోనుకాకుండా ఓటు వేయాలి. ప్రతి ఒక్కరూ ఎవరికి వాళ్లు నిర్ణయం తీసుకోవాలి.

అయితే, వాస్తవ ఆచరణలో ప్రజలు కులం, మతం, డబ్బు, ఇతర బహుమతులు వంటి ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఓటు వేస్తారు. తరచు స్థానికంగా బలవంతులైన వాళ్లు ఫలానా వ్యక్తికి

ఓటు వెయ్యమని ఇతరులను భయభ్రాంతులను చేస్తారు. ఓటర్లను ప్రభావితం చేయటానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని కొన్నిసార్లు అధికారంలో ఉన్న పార్టీ ఉపయోగించుకుంటుంది. ఇటీవల కాలంలో ఎన్నికల సంఘం ఇటువంటి చట్ట విరుద్ధ చర్యలను అరికట్టడానికి కఠిన చర్యలు చేపడుతోంది. ఈ చర్యల గురించి తెలుసుకోండి.

లోకసభకు ఇప్పటివరకు చాలాసార్లు ఎన్నికలు జరిగాయి. వివిధ ఎన్నికల్లో ఓటింగు శాతాన్ని పక్కన ఉన్న పట్టిక ఇస్తోంది. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి:

- లోకసభకు ఎన్నిసార్లు ఎన్నికలు జరిగాయి?
- ఎంత శాతం ఓటర్లు ఓటు వేశారో తెలుసుకోవటం ఎందుకు ముఖ్యం? ఇది మనకు ఏం చెబుతుంది?
- ఓటు ఉన్న వాళ్లల్లో చాలామంది తమ హక్కును ఎందుకు ఉపయోగించుకోవటం లేదు? కారణాలు ఏమై ఉండవచ్చో చర్చించండి.

- మొదటి ఎన్నికల సమయంలో వివిధ వ్యక్తులు వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఏమిటి?

**పట్టిక: 1952 నుంచి 2009 వరకు ఓటు హక్కు ఉపయోగించుకున్న ఓటర్ల శాతం**

| లోకసభకు ఎన్నికలు జరిగిన సంవత్సరం | ఓటుహక్కు ఉపయోగించుకున్న ఓటర్ల శాతం |
|---|---|
| 1952 | 46% |
| 1957 | 48% |
| 1962 | 55% |
| 1967 | 61% |
| 1971 | 55% |
| 1977 | 60% |
| 1980 | 57% |
| 1985 | 64% |
| 1989 | 62% |
| 1991 | 56% |
| 1996 | 58% |
| 1998 | 62% |
| 1999 | 59% |
| 2004 | 58% |
| 2009 | 58% |

**2009 లోకసభ ఎన్నికకు సంబంధించి కొన్ని ఆసక్తికరమైన వివరాలు**

| | |
|---|---|
| పార్లమెంటు నియోజకవర్గాల సంఖ్య | 543 |
| మొత్తం ఓటర్లు | 71,69,85,101 |
| పోటీ చేసిన అభ్యర్థుల సంఖ్య | 8,070 |
| పోటీ చేసిన పురుష అభ్యర్థులు (93.1%) | 7,514 |
| పోటీ చేసిన మహిళా అభ్యర్థులు (6.9%) | 556 |
| ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల సంఖ్య | 8,34,919 |
| స్థానిక పరిశీలకుల సంఖ్య | 1,39,284 |
| పోలింగ్ సిబ్బంది | 46,90,575 |
| నియమించిన వీడియోగ్రాఫర్ల సంఖ్య | 74,729 |
| నియమించిన డిజిటల్ కెమెరాల సంఖ్య | 40,599 |
| ప్రత్యేక రైళ్ల వినియోగం | 119 |
| హెలికాప్టర్ల వినియోగం | 55 |

- ఇటీవల 2014 లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని పై పట్టికలోని అంశాల ఆధారంగా తరగతి గదిలో ప్రదర్శించండి.

- 1996 ఎన్నికల్లో నిరక్షరాస్యులు, పేదలు అయిన ప్రజల్లో 61 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారని ఒక సర్వే ద్వారా తెలిసింది. అయితే పట్టభద్రులలో ఇది 53 శాతం మాత్రమే. ఈ తేడాకు కారణాలు ఏమై ఉంటాయి? చర్చించండి.

**చట్టాలన్నింటినీ పార్లమెంటులో చేయరు. ఈ పట్టిక చూస్తే ఈ కింది విషయం వెల్లడవుతుంది:**

LDEVL9

**కేంద్ర జాబితా:** ఈ విషయాలపై కేంద్రం మాత్రమే చట్టాలు చేయగలుగుతుంది. అనేక విషయాలపై పార్లమెంటు మాత్రమే చట్టాలు చేయగలదు. ఈ చట్టాలు దేశం అంతటికీ వర్తిస్తాయి. ఉదాహరణకు మన దేశమంతటికీ కరెన్సీ (రూపాయి) ఉంది. కాబట్టి డబ్బులు, బ్యాంకుకు సంబంధించిన ఏ చట్టమైనా పార్లమెంటు మాత్రమే చేస్తుంది. అదేవిధంగా మనకు టెలిఫోను, తపాలా వ్యవస్థకు ఉమ్మడి నియమ, నియంత్రణలు ఉండాలి. పార్లమెంటు పరిధిలో ఉన్న మరో విషయం దేశ రక్షణ. సైన్యం, రక్షణకి సంబంధించిన అన్ని చట్టాలను పార్లమెంటు మాత్రమే చేస్తుంది.

**రాష్ట్ర జాబితా:** రాష్ట్రాల శాసనసభలు మాత్రమే చట్టాలు చేయగల విషయాలు. రాష్ట్రాల శాసనసభలు మాత్రమే ఈ విషయాలకు సంబంధించి చట్టాలు చేయగలవు. అంటే, వివిధ రాష్ట్రాలకు వేరువేరు చట్టాలు ఉంటాయన్నమాట. ఉదాహరణకు రాష్ట్రంలో సరుకుల అమ్మకం, కొనుగోలుపై అమ్మకం పన్ను విధిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఇది ప్రధాన ఆదాయ వనరు. ఈ పన్ను వసూలు చేయటానికి ప్రతి రాష్ట్రం తమ సొంత చట్టాలు చేస్తుంది. కాబట్టి ఏ సరుకులు మీద పన్ను వేస్తారు, ఎంత పన్ను వేస్తారు అన్నదాంట్లో రాష్ట్రాల మధ్య తేడాలు ఉంటాయి.

తమ సరిహద్దులలోపు సరైన రోడ్డు రవాణా మార్గాలు ఉండేలా చూసే బాధ్యత రాష్ట్రాలదే. కాబట్టి జాతీయ రహదారులు మినహాయించి అన్ని రోడ్ల నిర్మాణం, నిర్వహణలను రాష్ట్రాలు చేపడతాయి. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించే ముఖ్యమైన విషయాలు: వ్యవసాయం, సాగునీరు, పోలీసు, వైద్యసేవలు. ఇవన్నీ రాష్ట్రాల జాబితాలోకి వస్తాయి, ఈ విషయాలపై రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేస్తాయి.

**ఉమ్మడి జాబితా:** పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలు రెండూ చట్టాలు చేయగల విషయాలు. కొన్ని విషయాలపై పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలు రెండూ చట్టాలు చేయవచ్చు. ఉదాహరణకు విద్యావిధానం అన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెండింటి బాధ్యత. ప్రతి రాష్ట్రంలో కేంద్రీయ విద్యాలయాల, వంటి కేంద్రం నడిపే బడులతోపాటు రాష్ట్రప్రభుత్వ విద్యాశాఖ నడిపే బడులు కూడా ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడా ఒకే విషయంపై చట్టాలు చేస్తాయి. అవి: కర్మాగారాలు లేదా పరిశ్రమలు, విద్యుత్తు, కార్మికులు వంటివి. అయితే ఒక విషయంపై పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ రెండూ పరస్పర విరుద్ధ చట్టాలుచేస్తే రాష్ట్ర శాసనసభ చేసిన చట్టం కాకుండా పార్లమెంటు చేసిన చట్టమే వర్తిస్తుంది.

- గత సంవత్సరం చదివిన చట్టాలను గుర్తు చేసుకోండి. రాష్ట్ర శాసనసభలలో లేదా పార్లమెంటు గత సమావేశంలో చర్చించిన కొత్త చట్టాల గురించి తెలుసుకోండి.

## రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి

అన్ని రాష్ట్రాల శాసనసభ్యులు, పార్లమెంటు ఉభయసభల సభ్యులు రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. పార్లమెంటు ఉభయసభల సభ్యులు ఉప రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. రాజ్యసభకు చైర్మన్‌గా ఉప రాష్ట్రపతి వ్యవహరిస్తారు, రాష్ట్రపతి లేని పక్షంలో ఆ బాధ్యతలు ఉపరాష్ట్రపతి నిర్వర్తిస్తారు. పార్లమెంటు చట్టం చేసిన తరవాత రాష్ట్రపతి వాటిపై సంతకం చేసి ఆమోదం తెలిపిన తరవాతే అది అమలులోకి వస్తుంది.

- **తప్పు వాక్యాలను సరిచేయండి**

1. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిని ఒకే రకం వ్యక్తులు ఎన్నుకుంటారు.
2. దేశంలో ప్రతి ఓటరు రాష్ట్రపతిని ఎన్నుకుంటారు.
3. రాష్ట్రపతి ఎన్నికలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యులు పాల్గొంటారు.
4. అన్ని శాసనసభల సభ్యులు (ఢిల్లీ, పాండిచ్చేరిలతో సహా), రాజ్యసభ, లోకసభ సభ్యులు రాష్ట్రపతిని ఎన్నుకుంటారు.

## మంత్రివర్గం, ప్రధానమంత్రి

LDIIA6

పార్లమెంటు (లోకసభ, రాజ్యసభల) నుంచి మంత్రివర్గ సభ్యులను, ప్రధానమంత్రిని రాష్ట్రపతి ఎంపిక చేస్తారు. పార్లమెంటు చట్టాలను చేస్తుంది. చట్టాలను అమలు చేయడానికి ప్రభుత్వ ఉద్యోగులను నియమిస్తుంది. కాబట్టి భారతదేశానికి పార్లమెంటరీ ప్రభుత్వ విధానం ఉందని అంటారు. ఈ రెండు పాత్రలు వేర్వేరు. మొదటిదానిని శాసన అధికారం అంటారు, అంటే చట్టాలు చేయటం. రెండవది కార్యనిర్వహణ అధికారం, దీంట్లో పార్లమెంటు చేసిన చట్టాలను, నిర్ణయాలను అమలు చేస్తారు. కార్యనిర్వాహక వర్గానికి అధిపతిగా రాష్ట్రపతి ఉంటారు.

ప్రధానమంత్రి, అన్ని మంత్రిత్వ శాఖలకు బాధ్యత వహిస్తారు. వాళ్లకింద పెద్ద సంఖ్యలో ప్రభుత్వ



*చిత్రం 14.3 : గణతంత్ర దినోత్సవంనాటి రాత్రి రాష్ట్రపతి భవనం*

**కింద పేర్కొన్న వారికి సంబంధించిన ప్రస్తుత ఫోటోలను సేకరించి ఆయా డబ్బాలలో అతికించండి.**

| **భారత రాష్ట్రపతి** | **ఉపరాష్ట్రపతి** | **ప్రధానమంత్రి** |
| --- | --- | --- |

ఉద్యోగులు ఉంటారు. మంత్రిమండలి మరియు ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వాన్ని నడిపే బాధ్యతను చేపడతారు. దీనిని ఎలా చేస్తారో చూద్దాం.

భారత ప్రభుత్వ నిర్ణయాలన్నీ దేశాధిపతియైన రాష్ట్రపతి పేరుమీద తీసుకుంటారు. అయితే ప్రధానమంత్రి, మంత్రివర్గ సభ్యుల సలహా ప్రకారం రాష్ట్రపతి నిర్ణయాలు తీసుకుంటారు.

శాసనసభ సభ్యులు ముఖ్యమంత్రిని ఎన్నుకున్న విధానం మీకు గుర్తుండి ఉంటుంది. అదే విధంగా ప్రధానమంత్రిని లోకసభ సభ్యులు ఎన్నుకుంటారు. లోకసభలో మెజారిటీ సీట్లు గెలుచుకున్న ఒక పార్టీ లేదా పలుపార్టీల (సంకీర్ణం) నేతను రాష్ట్రపతి ఆహ్వానించి ప్రధానమంత్రిగా నియమిస్తారు. అంటే ప్రధానమంత్రికి అధిక శాతం సభ్యుల మద్దతు ఉందన్నమాట, అతడు/ ఆమె మంత్రివర్గంలోని ఇతర మంత్రులను ఎంపిక చేస్తారు.

- ప్రస్తుత ప్రధానమంత్రి ఎవరు? అంతకు ముందు ప్రధానమంత్రుల నుంచి కొంతమంది పేర్లు చెప్పండి.
- మీ రాష్ట్రంనుంచి ప్రస్తుత కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నవాళ్ల పేర్లు చెప్పండి.
- కొన్ని ముఖ్యమైన మంత్రిత్వ శాఖలను, కేంద్ర ప్రభుత్వంలో వాటి మంత్రులను పేర్కొనండి.

ప్రభుత్వంలోని కార్యనిర్వాహక వర్గంగా మంత్రివర్గం (క్యాబినెట్) పనిచేస్తుంది. అది చట్టాలను అమలు చేస్తుంది, చట్టాలకు అనుగుణంగా దేశాన్ని పరిపాలిస్తుంది, అభివృద్ధికి పథకాలు తయారు చేసి వాటిని అమలు చేస్తుంది, కొత్త చట్టాలను, విధానాలను తయారుచేసి లేదా పాత చట్టాలు, విధానాలను సవరించి వాటికి పార్లమెంటు ఆమోదం పొందుతుంది. ప్రభుత్వ పని ఆర్థిక, విదేశాంగ వ్యవహారాలు, హోం (దేశ అంతర్గత భద్రత), రక్షణ, రైల్వేలు, పరిశ్రమలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి అనేక రకాలుగా విభజించి ఉంటుంది. ఒక్కొక్క రంగానికి ఒక మంత్రి నేతృత్వంలో మంత్రిత్వశాఖ ఉంటుంది. మంత్రితో పాటు ప్రతి మంత్రిత్వశాఖలో కార్యదర్శి కింద పనిచేసే అధికారులు పెద్ద సంఖ్యలో ఉంటారు. వీళ్లు మంత్రిత్వ శాఖకి సంబంధించి రోజువారీ పని చేస్తారు, వివిధ అంశాల మీద మంత్రి పూర్తి సమాచారంతో నిర్ణయం తీసుకోటానికి సహకరించటానికి వివిధ అంశాలను అధ్యయనం చేసి నోట్సు, ప్రతిపాదనలు తయారు చేస్తారు. ఈ నిర్ణయాలు అమలు చేసే బాధ్యత కూడా ఈ మంత్రిత్వ శాఖ అధికారులదే.

ప్రభుత్వ ఏర్పాటుకి సంబంధించి ఈ కిందివాటిల్లో సరైనది ఏది:

- రాష్ట్రపతి మద్దతు ఉన్న పార్టీ లేదా సంకీర్ణం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది.

- పార్లమెంటులో అధిక సీట్లు ఉన్న పార్టీ లేదా సంకీర్ణం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది.
- పార్లమెంటులో సగానికిపైగా సీట్లు ఉన్న పార్టీ లేదా సంకీర్ణం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది.
- ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పార్టీని ఎన్నికల కమిషన్ ఎంపిక చేస్తుంది.
- లోకసభ ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలిచిన వ్యక్తి ప్రధానమంత్రి అవుతారు.

కింద పట్టిక చూసి మొదటి లోకసభకు జరిగిన ఎన్నికల తరవాత ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఉంటుందో చెప్పండి:

**మొదటి లోకసభ ఎన్నికలు, 1952**

| పార్టీ | గెలిచిన సీట్లు |
|---|---|
| కాంగ్రెసు | 364 |
| కమ్యూనిస్టులు, మిత్రపార్టీలు | 23 |
| సోషలిస్టులు | 12 |
| కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ | 9 |
| జన సంఘ్ | 3 |
| హిందూ మహాసభ | 4 |
| రామరాజ్య పరిషత్ | 3 |
| ఇతర పార్టీలు | 30 |
| స్వతంత్రులు | 41 |
| మొత్తం | 489 |

## కీలక పదాలు

1. శాసనసభ 2. లోకసభ 3. రాజ్యసభ 4. ఎన్నికల సంఘం
5. మంత్రిమండలి 6. కేంద్ర జాబితా 7. రాష్ట్ర జాబితా 8. ఉమ్మడి జాబితా

LDK4YZ

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. మొదటి ఎన్నికలు నిర్వహించటం ఎందుకు కష్టమయ్యింది? సాధ్యమైనన్ని కారణాలు పేర్కొనండి. $AS_1$
2. ఎన్నికలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఎందుకుండాలి? $AS_1$
3. కింది విషయాలలో వేటికి పార్లమెంటు చట్టాలు చేస్తుంది, వేటికి రాష్ట్ర శాసనసభలు చేస్తాయి, వేటికి రెండూ చేయవచ్చు: వ్యవసాయం, రైల్వేలు, గ్రామ ఆసుపత్రులు, పోలీసు, తంతి తపాలా, విద్యుత్తు, కర్మాగారాలు. $AS_1$
4. పార్లమెంటు రెండు సభలను పేర్కొనండి. కింది విషయాలలో రెండింటికీ మధ్య తేడాలు/ పోలికలు చూపిస్తూ పట్టిక తయారుచేయండి: సభ్యత్వకాలం, సభ్యుల సంఖ్య, అధికారాలలో ఎక్కువ, తక్కువ, ఎన్నికయ్యే విధానం, రాష్ట్రపతికి ఎన్నికలో ఓటింగు. $AS_3$
5. 2009 పార్లమెంటు ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీకి మెజారిటీ రాలేదు. ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేశారు? మీ టీచరు సహాయంతో చర్చించి దాని గురించి కొన్ని వాక్యాలు రాయండి. $AS_1$
6. దేశం మొత్తానికి వర్తించే చట్టాలు చేసే బాధ్యత ఎవరిది? $AS_1$


7. కింద ఇచ్చిన పట్టికలో కొన్ని ఖాళీలు ఉన్నాయి. మీ టీచరుతో చర్చించి ఖాళీలను పూరించండి. $AS_3$

| **పదవి** | **ఎవరు ఎన్నుకుంటారు** | **పదవీకాలం** | **అర్హత (కనీస వయసు, నివాసం, మొ॥)** |
|---|---|---|---|
| శాసనసభ్యులు | | 5 సంవత్సరాలు | |
| లోకసభ సభ్యులు | | | కనీస వయసు: 25 సంవత్సరాలు |
| రాజ్యసభ సభ్యులు | | | |
| ముఖ్యమంత్రి | రాష్ట్ర శాసనసభలో మెజారిటీ ఉన్నపార్టీ | | |
| ప్రధానమంత్రి | | | పార్లమెంటు సభ్యులై ఉండాలి |
| రాష్ట్రపతి | | | కనీస వయసు: 35 సంవత్సరాలు |

8. ఎన్నికలలో రాజకీయ పార్టీలు ఇంకా ఎక్కువ మహిళా అభ్యర్థులను పోటీకి నిలిపేలా చేయాలా? ఎందుకు? $AS_1$

9. భారతదేశంతోపాటు మరికొన్ని దేశాల పార్లమెంటు సభలలో మహిళల ప్రాతినిధ్యంపై జరిగిన అధ్యయనం ఇది. $AS_3$

*ప్రపంచంలోని వివిధ ప్రాంతాల జాతీయ పార్లమెంట్లలో మహిళల సగటు సంఖ్య*




**నోర్డిక్ /స్కాండినేవియన్ దేశాలు :**

డెన్మార్క్
ఫిన్‌ల్యాండ్
ఐస్‌ల్యాండ్
నార్వే
స్వీడన్

**పై సమాచారం ఆధారంగా దిగువ అంశాలను విశ్లేషిస్తూ ఒక వ్యాసం రాయండి:**

- మన చట్ట సభలలో మహిళలకు తగినంత ప్రాతినిధ్యం ఉందా?
- ప్రజాస్వామ్య భావనకు ప్రాతినిధ్య భావన ఎందుకు ముఖ్యమైనది?
- మీరు పార్లమెంటు సభ్యులైతే ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారు? కొన్ని దేశాలు పార్లమెంటులో మహిళలకు అధిక ప్రాతినిధ్యాన్ని ఎలా సాధించగలిగాయి?

**ప్రాజెక్టు:**

పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు రేడియో లేదా టెలివిజన్‌లో వార్తలు విని, లేదా దినపత్రికలు చదివి జరిగిన ఘటనల జాబితా తయారుచేయండి. పార్లమెంటులో చర్చ జరిగిన అంశంపై ఒక వ్యాసం రాయండి లేదా దానిని చర్చిస్తున్నప్పుడు పార్లమెంటులోని దృశ్యాన్ని గీయండి.

పాఠం 15

# చట్టం, న్యాయం - ఒక సన్నివేశ అధ్యయనం

చట్టాలను ప్రభుత్వాలు చేస్తాయని గత సంవత్సరం మనం చదువుకున్నాం. చట్టాలు అమలు చేయటంలో కార్యనిర్వాహక వర్గం పాత్ర గురించి కూడా క్లుప్తంగా తెలుసుకున్నాం. కానీ చట్టాలను ఉల్లంఘించినప్పుడు ఏమౌతుంది? ఈ అధ్యాయంలో దీని గురించి తెలుసుకుందాం.



### ఆస్తి విషయంలో తగాదా

రవి ఇళ్ల స్థలాల వ్యాపారం చేస్తుంటాడు. భూమి కొని చిన్న చిన్న ప్లాట్లుగా చేసి వాటిని తిరిగి అమ్ముతుంటాడు. దినపత్రికలలో ప్లాట్ల గురించి రవి ప్రకటనలు ఇస్తుంటాడు. ప్లాట్లు కొనేవాళ్లు అయిదు సంవత్సరాల పాటు వాయిదాల పద్ధతిలో నెలకి 5,000 రూపాయలు చెల్లించాలి.

సాంబ సహకార సంఘంలో నౌకరుగా పని చేస్తున్నాడు. అతడు ఈ ప్రకటనను చూసి ఒక ప్లాటు కొనాలని అనుకున్నాడు. తన జీతంనుంచి డబ్బు పొదుపు చేసి అయిదు సంవత్సరాలపాటు వాయిదాలు కట్టాడు. అయిదు సంవత్సరాల తరవాత సాంబ వాయిదాల ద్వారా తాను కొన్న ప్లాటులో ఇల్లు కట్టుకుందామనుకున్నాడు. అయితే అదే ప్లాటుని కొంతకాలం కిందట సుశీల్ అనే వ్యక్తికి రవి అమ్మాడని అతడికి తెలిసింది.

సాంబ తన కొడుకు క్రాంతితో కలిసి రవి వాళ్ల ఇంటికి వెళ్లాడు. ప్లాటుకి తాను చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వమని రవిని అడిగాడు. ఈ విషయంలో వాగ్వాదం జరిగి రవి సాంబను కొట్టాడు. సాంబ చెయ్యి విరిగింది.

ఈ సంగతి తెలిసి అక్కడ ఒక గుంపు చేరింది. గ్రామ సర్పంచ్ కూడా వచ్చి సాంబ, రవిలను శాంత పరచటానికి ప్రయత్నించాడు. తన తండ్రి సాంబని క్రాంతి దగ్గరలోని పట్టణానికి తీసుకెళ్లాడు, అది మండల ప్రధాన కార్యస్థలం కూడా. సాంబని డాక్టరుకి చూపించి చేతికి కట్టు వేయించాడు. తరవాత డాక్టరు ఇచ్చిన ధృవీకరణ పత్రంతో ఫిర్యాదు చేయటానికి పోలీసు స్టేషనుకి వెళ్లారు.

LDNRMH

### ఫిర్యాదు చేయటం

పోలీసు స్టేషనులో రవిపై క్రాంతి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో కింద పేర్కొన్న వివరాలు ఉండాలి:

1. పోలీసు స్టేషను అధికారి (ఎస్‌హెచ్‌ఓ)ని సంబోధిస్తూ ఫిర్యాదు రాయాలి.
2. ఫిర్యాదు వివరాలు.



- ఎస్‌హెచ్ఓ/ ఎస్ఐ వచ్చే వరకు వాళ్లు ఎందుకు వేచి ఉన్నారు? ఇటువంటి నివేదిక మీరు రాయాల్సి వస్తే అందులో మీరు ఏమి రాస్తారు?
- పైన ఇచ్చిన దానిబట్టి రవి, సాంబల వివరాలు ఇవ్వండి.
- ఎఫ్.ఐ.ఆర్. ఇచ్చిన వ్యక్తి దాని ప్రతిని తీసుకోవడం ఎందుకు ముఖ్యం?

3. నేరం జరిగిన తేదీ, సమయం, స్థలం.
4. ఏం జరిగింది.
5. నిందితుల పేరు, లింగం, చిరునామా, మొ॥
6. సాక్షుల పేర్లు (నేరం ఎవరి సమక్షంలో జరిగింది).
7. విన్నపం (నిందితులను చట్టం ప్రకారం శిక్షించమని కోరటం, తెలిసి ఉంటే వర్తించే సెక్షన్ సంఖ్యను సూచించాలి).
8. ఫిర్యాదుదారు సంతకం, చిరునామా, ఇతర వివరాలు.

ఫిర్యాదులో ఇచ్చిన సమాచారం ప్రకారం పోలీసు స్టేషనులో రైటరు నివేదిక తయారు చేశాడు. దీనిని తొలి సమాచార నివేదిక (ఎఫ్.ఐ.ఆర్.) అంటారు. నివేదిక మీద క్రాంతి సంతకం పెట్టి, ''నివేదికను మీ రిజిస్టరులో నమోదు చేసుకుని మాకు కూడా ఒక ప్రతి ఇవ్వండి," అని అడిగాడు. "నివేదికను రిజిస్టరులో రాయటానికి ఎస్‌హెచ్ఓగారు వచ్చేవరకు ఆగాలి," అన్నాడు రైటరు. పోలీసు స్టేషను అధికారిని ఎస్‌హెచ్ఓ అంటారు. ఈ పోలీసు స్టేషనులో సబ్‌ఇన్‌స్పెక్టరు (ఎస్ఐ) ఎస్‌హెచ్ఓ. ఎస్‌హెచ్ఓ వచ్చి నివేదికను రిజిస్టరులో నమోదు చేసేవరకు క్రాంతి అక్కడే ఉన్నాడు.

- ప్రతి పోలీసు స్టేషను పరిదిలో కొంత ప్రాంతం ఉంటుంది. మీ ఇల్లు ఏ పోలీసు స్టేషను పరిధిలోకి వస్తుందో తెలుసుకోండి.


### తొలి సమాచార నివేదిక (ఎఫ్.ఐ.ఆర్.)

పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటే పోలీసు స్టేషనులో తొలి సమాచార నివేదిక (ఎఫ్.ఐ.ఆర్.) ఇవ్వాల్సి ఉంటుంది. ఎఫ్.ఐ.ఆర్ దాఖలు చేసిన తరవాత కేసుని పరిశోధించి, పరిష్కరించాల్సిన బాధ్యత పోలీసులది.

నివేదికలో రాసిన సమాచారాన్ని ఎస్‌హెచ్ఓ పైకి చదివి వినిపించాలి. దాంట్లో అన్ని విషయాలు సరిగ్గా ఉంటే ఫిర్యాదుదారు దానిమీద సంతకం చేయాలి. ఎఫ్.ఐ.ఆర్. ఆధారంగా పోలీసు స్టేషనులోని రిజిస్టరులో నేరం వివరాలను పొందుపరచాలి. ఫిర్యాదు చేసిన వ్యక్తి నుంచి ఎటువంటి రుసుము తీసుకోకుండా ఎఫ్ఐఆర్ ప్రతిని అతనికి ఇవ్వాలి.

ఒకవేళ కేసు తీసుకోటానికి ఎస్‌హెచ్ఓ తిరస్కరిస్తే నేరుగా డిఎస్‌పి లేదా మెజిస్ట్రేటు దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదును వాళ్లకు పోస్టు ద్వారా కూడా పంపించవచ్చు.

## విచారణ, అరెస్టులో పోలీసుల పాత్ర



నేరానికి సంబంధించి ఏ ఫిర్యాదునైనా విచారణ చేయటం పోలీసుల ముఖ్యమైన కర్తవ్యం. విచారణలో భాగంగా రకరకాల రుజువులు సేకరిస్తారు. సాక్షులు చెప్పింది నమోదు చేస్తారు. ఈ విచారణ ఆధారంగా పోలీసులు ఒక అభిప్రాయానికి రావాలి. నిందితుడు దోషి అని సాక్ష్యాలు తెలియ చేస్తున్నాయని పోలీసులు భావిస్తే వాళ్లు న్యాయస్థానంలో చార్జ్‌షీటు దాఖలు చేయాలి. నిందితుడిని శిక్షించే పని పోలీసులది కాదు. నిందితుడు దోషో, కాదో, ఒకవేళ దోషి అయితే ఏ శిక్ష విధించాలో న్యాయమూర్తులు లేదా న్యాయవర్గం నిర్ణయిస్తుంది.

ఈ కేసులో ఎస్.ఐ. ఆ ఊరికి వెళ్లి విచారణ మొదలుపెట్టాడు. ముందుగా సాంబకి అయిన గాయాలు చూశాడు. దెబ్బలు బాగానే తగిలాయని ఆసుపత్రి నివేదిక తెలుపుతోంది. తరవాత అతడు రవి ఇంటి చుట్టుపక్కల ఉంటున్న వాళ్లను విచారించాడు. జరిగిన ఘటన గురించి పూర్తి వివరాలను చుట్టు పక్కలవాళ్లు ఇచ్చారు. సాంబమీద రవి దాడి చేసి, గాయపరిచాడని ఎటువంటి అనుమానానికి తావు లేకుండా స్పష్టమయ్యింది.

అప్పుడు ఎస్.ఐ. రవి వాళ్ల ఇంటికి వెళ్లి సాంబ అనే వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన ఆరోపణపై అతడిని అరెస్టు చేస్తున్నామని ఎస్.ఐ. చెప్పాడు. అతడు రవిని అరెస్టు చేసి మండల పోలీసు స్టేషనుకి తీసుకెళ్లి అక్కడ అతన్ని ప్రశ్నించాడు. సాంబను కొట్టానని రవి ఒప్పుకోలేదు. రవితోటి అతడి నేరాన్ని అంగీకరింపచేయటానికి ఎస్.ఐ. ప్రయత్నించాడు కానీ అతడు ఒప్పుకోలేదు. మరునాడు మెజిస్ట్రేటు ముందు హాజరుపరచటానికి రవిని పోలీసు లాకప్‌లో నిర్బంధించారు.

- నేరాన్ని ఎవరు విచారించారు, ఎలా విచారించారు?
- 'నిందితుడు' అంటే ఏమిటి? ఈ కథలో నిందితుడు ఎవరు?
- నిందితుడిపై మోపిన ఆరోపణలు ఏమిటి?
- రవిని శిక్షించటానికి ఎస్ఐ అతడిని నిర్బంధించాడని సాంబ అనుకున్నాడు. అది నిజమేనా?

## సివిల్, క్రిమినల్ నేరాలు

మరుసటిరోజు ఎస్.ఐ.తో రవి ఇలా అన్నాడు, *"ప్లాటుకోసం సాంబ కట్టిన డబ్బులు నేను తిరిగి ఇచ్చేస్తాను. ఇక జరిగినదంతా మేము మరిచిపోతాం."*

*"డబ్బు ఎలాగూ తిరిగి ఇవ్వాలి. కానీ ఇప్పుడు నువ్వు సాంబని కొట్టినందుకు అరెస్టు చేశాం. ఇప్పుడు ఇది క్రిమినల్ నేరం అయ్యింది. నువ్వు సాంబని కొట్టి ఉండకపోతే పోలీసులు జోక్యం చేసుకుని ఉండేవాళ్లు కాదు. ప్లాటు ఇవ్వనందుకు నీ మీద సాంబ*

సివిల్ కేసు వేసి ఉండేవాడు. అప్పుడు అతనికి ప్లాటు తిరిగి ఇచ్చి, అతడికి జరిగిన నష్టానికి పరిహారం చెల్లించి ఉండేవాడివి. అప్పుడు జైలుకి వెళ్లి ఉండేవాడివి కాదు," అంటూ ఎస్ఐ బదులిచ్చాడు.

రవి, సాంబల విషయంలో రెండు రకాల వివాదాలు ఉన్నాయి. మొదటిది, సాంబపై రవి దాడి చేయటం. ఇది క్రిమినల్ నేరం. దొంగతనం, దోపిడీ, కల్తీ, లంచాలు ఇవ్వటం, కల్తీమందులు తయారు చేయటం వంటివి క్రిమినల్ నేరాలకు కొన్ని ఉదాహరణలు. వాళ్లిద్దరి మధ్య సివిల్ వివాదం కూడా ఉంది. సాంబకి రవి ప్లాటు కాని, డబ్బులు కాని ఇవ్వలేదు.

భూమి, ఆస్తి, ఆదాయాలపై ప్రజల హక్కులు, ప్రజల మధ్య ఉన్న సంబంధాలకు సంబంధించినవి సివిల్ వివాదాలు అవుతాయి. క్రిమినల్ వివాదాలలో సాధారణంగా దోషులకు జైలుశిక్ష విధిస్తారు. సివిల్ వివాదాలలో జైలుశిక్ష వేయకపోవచ్చు. క్రిమినల్ కేసులన్నింటిని పోలీసులు చేపడతారు. నేరానికి గురైన వ్యక్తి కాదు. ఇందుకు విరుద్ధంగా సివిల్ వివాదాలలో ఒప్పంద ఉల్లంఘన వల్ల లేదా మోసం వల్ల నష్టపోయామనుకున్న వ్యక్తే స్వయంగా సివిల్ కేసు దాఖలు చేస్తాడు.

క్రిమినల్ కేసులో ప్రభుత్వం చేసిన చట్టం ఉల్లంఘించబడింది కాబట్టి పోలీసులు జోక్యం చేసుకుంటారు. సివిల్ కేసులో ఇద్దరి వ్యక్తుల మధ్య ఒప్పందం ఉల్లంఘన జరుగుతుంది.

- సాంబ ప్లాటుని రవి మరొక వ్యక్తికి అమ్మినపుడు అది .........నేరం (క్రిమినల్ లేదా సివిల్).
- సాంబని రవి కొట్టినప్పుడు అది .........నేరం (క్రిమినల్ లేదా సివిల్).

**క్రిమినల్ (నేర), సివిల్ (పౌర) చట్టాలను అర్థం చేసుకోటానికి కింది పట్టికను చూడండి:**

| సంఖ్య | నేర చట్టం | పౌర చట్టం |
|---|---|---|
| 1 | ఇది నేరంగా పరిగణించే చర్యలకు సంబంధించినది. ఉదాహరణకు దొంగతనం, వరకట్నం తీసుకోవటం, హత్య. | ఇది మరొక వ్యక్తి ఒప్పందాన్ని ఉల్లంఘించటం వల్ల ఒక వ్యక్తికి జరిగే నష్టానికి సంబంధించినది. ఉదాహరణకు అద్దె, సరుకుల కొనుగోలు, విడాకులు. |
| 2 | సాధారణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, పోలీసు విచారణతో ఇది మొదలవుతుంది. ఆ తరవాత న్యాయస్థానంలో కేసు వేస్తారు. | నష్టానికి గురైన వ్యక్తి న్యాయస్థానంలో దావా వేయాలి, ఉదాహరణకు అద్దె వివాదంలో యజమాని, లేదా కిరాయిదారు. |
| 3 | దోషి అని రుజువయితే జరిమానాతో పాటు జైలుకి కూడా పంపించవచ్చు. | నష్టానికి గురైన వ్యక్తికి కోర్టు ఉపశమనాన్ని కలిగిస్తుంది, ఉదాహరణకు అద్దె ఇంటినుంచి కిరాయిదారుని ఖాళీ చేయించవచ్చు లేదా కిరాయిదారు నుంచి అద్దె బకాయిలు వసూలు చేయించవచ్చు. |

నేర, పౌర చట్టాల గురించి మీరు అర్థం చేసుకున్నదాని ఆధారంగా కింది పట్టికను పూరించండి.

| ఘటన వివరణ | ఏ చట్టం | అనుసరించే విధానం |
|---|---|---|
| బడికి వెళుతున్న దారిలో బాలికల బృందాన్ని ఒక బాలుర బృందం నిత్యం వేధిస్తూ ఉంది | | |
| ఖాళీ చేయమని బలవంతం చేయబడుతున్న కిరాయిదారు ఇంటి యజమానిపై కోర్టులో దావా వేయటం | | |

## బెయిలు (Bail)

రవిది క్రిమినల్ కేసు కాబట్టి నేరారోపణ పత్రం (చార్జిషీట్) దాఖలు చేసిన తరవాత లాకప్‌లో నిర్బంధించారు. క్రిమినల్ కేసులలో నిందితులను జైలులో ఉంచుతారు. అయితే ఇది శిక్షకాదు. ఇది నేర విచారణలో దోహదపడటానికి, లేదా నిందితుడు సాక్ష్యాలను కనుమరుగు చేయకుండా ఉండటానికి, లేదా సాక్షులను బెదిరించకుండా ఉండటానికి ఉద్దేశించినది. పోలీసు లాకప్‌లో కొన్ని రోజులు ఉన్న తరవాత రవి కుటుంబం బెయిలు కోసం న్యాయ స్థానంలో దరఖాస్తు చేసుకుంది. హత్య, లంచగొండితనం, దోపిడీ వంటి నేరాలు మోపబడిన వ్యక్తికి వెంటనే బెయిలు దొరకకపోవచ్చు. బెయిలు పొందటానికి న్యాయ స్థానంలో కొన్ని హామీలు ఇవ్వాలి. ఈ హామీ ఆస్తులు కావచ్చు లేదా పూచీకత్తుగా నిలబడే వ్యక్తి కావచ్చు, బాండు కావచ్చు. అడిగినప్పుడు న్యాయ స్థానంలో నిందితుడు హాజరు అవుతాడని బాండు హామీ ఇస్తుంది. బెయిలు మంజూరు చేయాలో, లేదా నిరాకరించాలో న్యాయస్థానంలో న్యాయమూర్తి నిర్ణయిస్తారు.

LDSEBT

### నిందితుని హక్కుగా బెయిలు

బెయిలు నిందితుని హక్కు, నేర తీవ్రతను బట్టి, సాక్షులను బెదిరించటానికి ఉన్న అవకాశాన్ని బట్టి దాన్ని మంజూరు చేస్తారు. అదే సమయంలో నిందితుడిని విడుదల చేస్తే సమాజానికి, సాక్షులకు, ఫిర్యాదుదారునికి ఏమైనా హాని జరుగుతుందేమో న్యాయస్థానం పరిశీలిస్తుంది. బెయిలు పొందగలిగిన నేరాలలో (Station House Officer-SHO) మాత్రమే బెయిలు మంజూరు చేస్తారు. బెయిలు లేని నేరాలలో నిందితుడు సంబంధిత న్యాయస్థానంలో బెయిలు కోసం దరఖాస్తు చేసుకోవాలి.

న్యాయస్థానంలో రవి లేదా సాంబల కేసును న్యాయవాదులు వాదిస్తారు. రవి సొంతంగా న్యాయవాదిని ఏర్పాటు చేసుకోవాలి. కానీ సాంబ తరఫున ప్రభుత్వ న్యాయవాది (పబ్లిక్ ప్రాసిక్యూటర్) వాదిస్తాడు. న్యాయ విధానాలు చాలా సంక్లిష్టమైనవి, వాటి గురించి చర్చించటానికి ప్రత్యేక అవగాహన ఉండాలి.

LDU11H

### ప్రభుత్వ న్యాయవాది పాత్ర

క్రిమినల్ నేరాన్ని ప్రజలపట్ల జరిగిన అపరాధంగా నమోదు చేస్తారు. అంటే ఈ నేరం అన్నది బాధితుల పట్లే కాకుండా సమాజంపట్ల జరిగిందని భావిస్తారు.

న్యాయస్థానంలో ప్రభుత్వ న్యాయవాది ప్రభుత్వ ప్రయోజనాలకు ప్రతినిధిగా ఉంటాడు. పోలీసులు

విచారణ చేసి న్యాయస్థానంలో నేరారోపణ పత్రం దాఖలు చేసిన తరవాత ప్రభుత్వ న్యాయవాది పాత్ర మొదలవుతుంది. విచారణలో ప్రభుత్వ న్యాయవాది పాత్ర ఏమీ ఉండదు. అతడు/ ఆమె ప్రభుత్వం తరఫున వాదనలు చేపట్టాలి. న్యాయస్థానం అధికారిగా అతడు/ ఆమె నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, సాక్షులను, రుజువులు/ ఆధారాలను న్యాయస్థానం ముందు ఉంచి కేసుపై నిర్ణయం తీసుకోటానికి సహకరించాలి.

## న్యాయమైన విచారణ

సాంబ, రవిల కేసు జ్యుడిషియల్ మెజిస్ట్రేటు న్యాయస్థానంలో విచారింపబడుతోంది. న్యాయస్థానం లోపల, బయట నల్లని దుస్తులు ధరించిన న్యాయవాదులు, విచారణకు సంబంధించిన ప్రజలు, ఇంకా ఇతరులు చాలామంది ఉన్నారు.

చట్టం ముందు అందరూ సమానులే అని చట్టం చెబుతోంది. ఒకరు దోషులో కాదో నిర్ణయించటానికి అతడు/ ఆమెపై న్యాయమైన, నిష్పాక్షికమైన బహిరంగ విచారణ జరుపుతారు. నేర విచారణ 'అమాయకులు అన్న భావన'తో మొదలవుతుంది, ఎటువంటి అనుమానానికి తావులేకుండా నేరం నిరూపింపబడాలి.

సాంబ గాయపడ్డాడు కాబట్టి రవి నేరస్తుడన్న నిర్ణయానికి న్యాయమూర్తి రాలేదు. రవి వల్లనే అతడికి గాయాలయ్యాయని నిరూపింపబడాలి.

- న్యాయమైన విచారణ అంటే ఏమిటి? అది అవసరమా? ఎందుకు? చర్చించండి.

## మొదటి వాయిదా, న్యాయవాది

జ్యుడిషియల్ మెజిస్ట్రేటు కోర్టులో సాంబ, అతడి కొడుకు క్రాంతి, రవి, ఎస్.ఐ. ఉన్నారు. రవి ఒక న్యాయవాదిని పెట్టుకున్నాడు. ఇంకొకవైపున ప్రభుత్వం తరఫున సహాయ ప్రభుత్వ న్యాయవాది (అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్) ఉన్నాడు.

చాలాసేపు వేచి ఉన్న తరవాత రవి, సాంబలను విచారణకు పిలిచారు. జ్యుడిషియల్ మెజిస్ట్రేటు ముందు ఇదే మొదటి వాయిదా.

ఎఫ్.ఐ.ఆర్. ప్రతిని, పోలీసుల నివేదికను రవి న్యాయవాదికి ఎస్.ఐ. ఇచ్చాడు. దీనివల్ల తన క్లయింటుపై మోపబడిన ఆరోపణలు ఏమిటో అతడికి తెలుస్తాయి. ఈ నివేదికల ద్వారా రవికి వ్యతిరేకంగా పోలీసులు సేకరించిన సాక్ష్యాలు ఏమిటో కూడా అతడికి తెలుస్తాయి. ఈ కేసులో నిందితుడైన రవి తరఫున అతని న్యాయవాది వాదించటానికి ఇదంతా దోహదపడుతుంది.

తీవ్రంగా గాయపరిచాడంటూ రవిపై జ్యుడిషియల్ మెజిస్ట్రేటు మొదటి వాయిదాలో నేరారోపణ చేశాడు. ఈ నేరం రుజువైతే 4 సంవత్సరాల దాకా జైలుశిక్ష పడవచ్చు. రవి నేరాన్ని అంగీకరించలేదు. దాంతో మెజిస్ట్రేటు తరవాత విచారణను 15 రోజులకు వాయిదా వేశాడు.



- రవి కేసును ఏ న్యాయస్థానం విచారిస్తోంది?
- మొదటి వాయిదాలో ఏమయ్యింది?
- ప్రభుత్వం తరపున వాదించే న్యాయవాదిని ఏమంటారు?

## న్యాయమూర్తి పాత్ర ఏమిటి?

న్యాయమూర్తి ఆటలో అంపైర్ వంటివాడు. అతడు విచారణను నిష్పక్షపాతంగా, బహిరంగంగా నిర్వహిస్తాడు. సాక్షులు అందరూ చెప్పేది, వాది, ప్రతివాది అందించే రుజువులను న్యాయమూర్తి పరిశీలిస్తాడు. తన ముందు ఉంచిన సాక్ష్యాల ఆధారంగా, నేరం ఆరోపించబడిన వ్యక్తి చట్టం ప్రకారం దోషో, కాదో న్యాయమూర్తి నిర్ణయిస్తాడు. నిందితుడు దోషి అని నిరూపింపబడితే శిక్ష విధిస్తూ తీర్పు వెలువరిస్తాడు. చట్టం ఏం చెబుతోంది అన్నదానిబట్టి అతడికి జైలుశిక్ష వేయవచ్చు లేదా జరిమానా విధించవచ్చు లేదా రెండూ విధించ వచ్చు.

## అధికారాల మధ్య విభజన, స్వతంత్రత

ఇంతకు ముందు అధ్యాయాలలో మనం భారతదేశ రాజ్యాంగం గురించి చదువుకున్నాం. రాజ్యాంగంలో ముఖ్యమైన అంశం కార్యనిర్వాహక, న్యాయ, శాసన అధికారాలను వేరుచేయటం. దీని అర్థం ఒక శాఖలో మిగిలిన శాఖలు – అంటే ఉదాహరణకు న్యాయ శాఖలో శాసన, కార్యనిర్వాహక శాఖలు జోక్యం చేసుకోలేవు. న్యాయస్థానాలు ప్రభుత్వ ఆధీనంలో లేవు. ప్రభుత్వం తరపున పని చేయవు.

పోలీసులు కూడా న్యాయశాఖలో భాగం కాదు. వాళ్లు కార్యనిర్వాహక శాఖకు చెందినవాళ్లు. గత సంవత్సరం మీరు జిల్లాస్థాయి పరిపాలన గురించి చదివారు. జిల్లాస్థాయిలో కలెక్టరు మాదిరిగా శాంతి, భద్రతల నిర్వహణకు జిల్లాస్థాయి ప్రభుత్వ పోలీసు అధికారి ఉంటాడు. రాష్ట్ర ప్రభుత్వంలోని హోం మంత్రిత్వశాఖ కింద పోలీసు శాఖ పనిచేస్తుంది.

పై విభజన బాగా పనిచేయటానికి హైకోర్టు, సుప్రీంకోర్టులకు చెందిన న్యాయమూర్తులను ప్రభుత్వంలోని ఇతర శాఖల జోక్యం లేకుండా నియమించాలి. ఒకసారి నియమించిన తరవాత న్యాయమూర్తిని తొలగించటం చాలా కష్టం.

- తీర్పును ప్రభావితం చేయడంలో రాజకీయ నాయకులకు ఏమైనా ఆస్కారం ఉందా? ఎందుకని?
- స్వతంత్ర న్యాయ వ్యవస్థ అంటే ఏమిటి?
- ఒక పెద్ద కంపెనీ అడవిని నరికివేస్తోందనీ, ఒక గిరిజనుడు కట్టెపుల్లల కోసం కొమ్మలు నరుకుతున్నాడని ఊహించుకోండి. నిష్పక్షపాతంగా వ్యవహరించటం మంచిదేనా? చర్చించండి.

## సాక్షుల రుజువులు

తన తరపున సాక్షులుగా రవి కొంతమంది మిత్రుల పేర్లు ఇచ్చాడు. సాంబ తరపున ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేసిన అతడి కొడుకు క్రాంతి కూడా కొంతమందిని సాక్షులుగా పేర్కొన్నాడు. ఎస్.ఐ. తన విచారణ సమయంలో రవి పక్క ఇళ్లల్లో ఉంటున్న ఇద్దరి పేర్లను సాక్షులుగా రాసుకున్నాడు. కేసు రెండవ వాయిదా నాటికి న్యాయస్థానంలో హాజరు కావలసిందిగా ఈ సాక్షులందరికీ మెజిస్ట్రేటు నుంచి సమన్లు అందాయి.

రెండవ వాయిదా నాటికి సంబంధిత వ్యక్తులందరూ న్యాయస్థానానికి వచ్చారు. చాలాసేపు వేచి ఉన్న తరవాత ఈ కేసు విచారణ మొదలయ్యింది. ముందుగా ప్రభుత్వం తరపున సాక్షిగా ఉన్న మహిళను పిలిచారు. నేరం జరిగిన రోజున ఘటనల క్రమాన్ని ఆమె వివరించింది. ప్రభుత్వ న్యాయవాది, రవి తరపున న్యాయవాది ఆమెను అనేక ప్రశ్నలు అడిగారు. మరో ముగ్గురు సాక్షులు చెప్పింది మెజిస్ట్రేటు విని వాళ్ల సాక్ష్యాలను నమోదు చేశాడు. తరవాత విచారణను మరో రోజుకి వాయిదా వేశాడు. ఈ విధంగా ప్రతిసారీ

విచారణలో ఒకరిద్దరు సాక్షులను విచారించి కేసును మరో రోజుకు వాయిదా వేసేవారు.


విచారణ అనేక నెలలపాటు కొనసాగింది. తన న్యాయవాదికి రవి డబ్బులు చెల్లించాల్సి వచ్చింది. న్యాయస్థానానికి వెళ్ళి, రావటానికి కూడా ఖర్చు అయ్యేది. అతడి వ్యాపారం కూడా దెబ్బతిన్నది. ఒక సంవత్సరం గడిచింది. చివరికి రవి దోషి అని న్యాయమూర్తి తీర్పు ఇచ్చి 4 సంవత్సరాల జైలుశిక్ష విధించాడు.

- ఏ కేసులోనైనా సాక్షులు చెప్పేవాటిని వినాల్సిన అవసరం ఏమిటో చర్చించండి.

## అప్పీలు విధానం

తీర్పు పట్ల రవి చాలా అసంతృప్తి చెందాడు. తాను జైలులో ఉంటే తన కుటుంబం ఏమైపోతుందోనని అతడు ఆందోళన చెందాడు. కిందిస్థాయి న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో ఎవరైనా అసంతృప్తి చెందితే పై న్యాయస్థానంలో అప్పీలు చేసుకోవచ్చు.

మన దేశంలో మూడు స్థాయిలలో న్యాయస్థానాలు ఉన్నాయి. కింది స్థాయిలో అనేక న్యాయస్థానాలు ఉన్నాయి. చాలా మంది ప్రజలు ఆశ్రయించే న్యాయస్థానాలను సబార్డినేట్ లేదా జిల్లా న్యాయస్థానాలు అంటారు. ఇవి సాధారణంగా జిల్లా లేదా డివిజనల్ స్థాయిలోనో లేదా పట్టణాల్లోనో ఉంటాయి. ఇవి అనేక రకాలైన కేసులను విచారిస్తాయి. ప్రతి రాష్ట్రంలో ఆ రాష్ట్రానికి అత్యున్నతమైన హైకోర్టు ఉంటుంది. దేశంలో అత్యున్నతమైన సుప్రీంకోర్టు కొత్త ఢిల్లీలో ఉంది. దీనికి అధిపతిగా భారత ప్రధాన న్యాయమూర్తి ఉంటారు. సుప్రీంకోర్టు తీసుకునే నిర్ణయాలను భారతదేశంలోని మిగిలిన అన్ని కోర్టులు కట్టుబడి ఉండాలి.



- మీ టీచరు సహాయంతో మీ ప్రాంతానికి సంబంధించి ఈ న్యాయస్థానాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోండి.
- కిందినుంచి పైవరకు న్యాయస్థానాల వ్యవస్థ పిరమిడ్ ఆకారాన్ని పోలి ఉంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని ఒక బొమ్మలో నింపండి.

## సెషన్స్ కోర్టులో అప్పీలు

జిల్లా ముఖ్యస్థానంలోని సెషన్స్ కోర్టులో అప్పీలు చేయమని రవికి అతడి తరపున న్యాయవాది సలహా ఇచ్చాడు: "*అప్పీలు చేసే పని నాకు వదిలిపెట్టండి. అయితే దీనికి అదనంగా నాకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కింది న్యాయస్థానం నిర్ణయాన్ని మార్చే అధికారం ఈ న్యాయస్థానానికి ఉంటుంది. నీ శిక్షను ఈ న్యాయస్థానం తగ్గించవచ్చు.*"

అయితే రవి ఆందోళన తగ్గలేదు. కేసులో తరచు హాజరు కావలసిన వాయిదాల గురించి అతడు ఆలోచిస్తున్నాడు. "*జిల్లా ప్రధాన కేంద్రం చాలా దూరంగా ఉంది. సాక్షులందరితో అంతదూరం వెళ్లి రావటం చాలా ఖర్చుతో కూడుకున్నది. అంత ఖర్చు భరించటం ఎలా?*" అని అతడు అన్నాడు. సెషన్స్ కోర్టులో రవి ఒకటి, రెండు వాయిదాలకు హాజరైతే సరిపోతుందని, మిగిలిన విచారణ అంతా దస్త్రం ఆధారంగా నడుస్తుందని అతని న్యాయవాది చెప్పాడు.

అతడి తరపున రవి న్యాయవాది సెషన్స్ కోర్టులో అప్పీలు వేశాడు. జ్యుడిషియల్ మెజిస్ట్రేటు ఇచ్చిన తీర్పును సెషన్స్ కోర్టు నిలుపుదల చేసింది. దీని అర్థం రవి వెంటనే జైలుకి వెళ్లాల్సిన అవసరం లేదు. సెషన్స్ కోర్టుకి రవి ఒక్కసారి హాజరైతే సరిపోయింది. సాంబ, అతడి తరపున సాక్షులు హాజరు కావలసిన పనిలేదు. మిగిలిన వాయిదాలను న్యాయవాది చూసుకున్నాడు. తీర్పు చెప్పటానికి సెషన్స్ కోర్టు రెండు సంవత్సరాలు తీసుకుంది. రవిని దోషిగా నిర్ధారించింది. కానీ శిక్షను సంవత్సరానికి తగ్గించింది.



*చిత్రం 15.1: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు*

- రవి శిక్షను సెషన్స్ కోర్టు తగ్గించటానికి కారణాలను ఊహించండి.

## హైకోర్టు

సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పుతో కూడా రవి సంతోషించలేదు. ఈ కోర్టులో నిర్ణయాలపై రాష్ట్రంలోని అత్యున్నతస్థాయి న్యాయస్థానమైన హైకోర్టులో అప్పీలు చేయవచ్చని న్యాయవాది సలహా ఇచ్చాడు. నిందితులను కానీ, సాక్షులను కానీ హైకోర్టు పిలవదు. కేసుకి సంబంధించిన దస్త్రం ఆధారంగా అది నిర్ణయాలు తీసుకుంటుంది. "నీకు పడిన శిక్షను ఇంకా తగ్గించుకోవడానికి హైకోర్టులో అప్పీలు చేసుకోవాలని కోరుకుంటే నేను ఈ కేసును హైకోర్టులో వేయగలను" అని న్యాయవాది చెప్పాడు.

రవి తన న్యాయవాదికి మరికొంత ఫీజు ఇచ్చి హైకోర్టులో అప్పీలు దాఖలు చేయమన్నాడు. అప్పీలు చేసి, కొన్ని నెలలపాటు విచారణ జరిగిన తరవాత సెషన్స్ కోర్టు నిర్ణయాన్ని నిర్ధారిస్తూ హైకోర్టు తన తీర్పును ఇచ్చింది. అంటే రవి హైకోర్టులో ఓడిపోయాడు, సెషన్స్ కోర్టు విధించిన శిక్షను అనుభవించాలి.

ఇప్పుడు రవి ముందు రెండు మార్గాలు ఉన్నాయి: మొదటిది జైలుశిక్ష అనుభవించటం, రెండవది సుప్రీం కోర్టులో అప్పీలు చేయటం. ఈ మొత్తం వ్యవహారంతో రవి బాగా అలసిపోయాడు, విసిగిపోయాడు. దాంతో రవి వ్యవహారం హైకోర్టుతో ముగిసింది.

- నిందితులను కానీ, సాక్షులను కానీ హైకోర్టు తన ముందుకు రమ్మని అడగదు. ఎందుకని?
- "మా నాన్నకి న్యాయం జరిగింది, కానీ చాలా ఆలస్యం అయ్యింది," అని క్రాంతి అన్నాడు. మీరు అతడితో ఏకీభవిస్తారా?

### కీలక పదాలు

LE2ADG

1. నిందితుడు
2. ఎఫ్ఐఆర్
3. నేరం
4. విచారణ
5. అరెస్టు
6. సమన్లు
7. సాక్షి
8. న్యాయవిచారణ
9. తీర్పు
10. అప్పీలు/ అభ్యర్థన
11. ఒప్పంద ఉల్లంఘన
12. వాజ్యదారు
13. ప్రభుత్వ న్యాయవాది
14. బెయిలు
15. మెజిస్ట్రేటు

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. తప్పు వాక్యాలను సరిచేయండి: $AS_1$
   - ఎఫ్ఐఆర్‌ను కోర్టులో దాఖలు చేస్తారు.
   - పోలీసులు అరెస్టు చేయటమంటే శిక్షింపబడటంతో సమానం.
   - హామీల ఆధారంగా బెయిలు మంజూరు చేస్తారు.
   - దేశంలో అత్యున్నత కోర్టు సుప్రీం కోర్టు.

2. రవి విషయంలో మొదటి విచారణ నుంచి హైకోర్టులో తుది తీర్పు వరకు ఏం జరిగిందో ఈ పట్టికలో వివరించండి. $AS_1$

| సాక్షుల పాత్ర | ఇచ్చిన శిక్ష | రవి హాజరుకావలసిన అవసరం |
|---|---|---|
| | | |
| | | |

3. క్రిమినల్, సివిల్ కేసుల మధ్య తేడాల దృష్ట్యా వీటి గురించి ఒక్కొక్క వాక్యం రాయండి: $AS_1$

(అ) శిక్ష, జైలు

(ఆ) ప్రభుత్వ న్యాయవాదులు

(ఇ) ఎఫ్.ఐ.ఆర్. నమోదు

4. హైకోర్టు నిర్ణయాన్ని సెషన్స్ లేదా జిల్లా కోర్టు మార్చగలవా? $AS_1$

5. సెషన్స్ కోర్టు, హైకోర్టు తీర్పులతో ఎవరైనా సంతృప్తి చెందకపోతే వాళ్లు ఏం చేయవచ్చు? $AS_1$

6. ఎస్.హెచ్.ఓ, మెజిస్ట్రేట్‌ల పాత్రలలో తేడాలు ఏమిటి? $AS_1$

7. మీ అభిప్రాయంలో రవి విషయంలో తీర్పు ఎలా ఉండాలి? $AS_2$

8. ఒక వ్యక్తి పోలీసు స్టేషనులో తన నేరాన్ని ఒప్పుకున్నాడు. పోలీసులు అతడిని ఆరు నెలలపాటు నిర్బంధంలో ఉంచారు. ఇది సరైన విధానమేనా? మీ సమాధానానికి కారణాలు పేర్కొనండి. $AS_1$

9. ఈ అధ్యాయంలో ఇచ్చిన కార్యనిర్వాహక, న్యాయశాఖల భిన్న పాత్రలను గుర్తించండి. $AS_1$

## ప్రాజెక్టు:

పీస్‌ల్యాండ్ అనే పట్టణం ఉంది. దానికి 40 కిలోమీటర్ల దూరంలోని ఆటస్థలంలో ఫియస్టా, జుబిలీ అనే ఫుట్‌బాల్ టీముల మధ్య తుది పోటీ జరగాల్సి ఉంది. అయితే మరునాడు మైదానాన్ని జుబిలీ బృందం మద్దతుదారులు పాడుచేశారని తెలిసింది. పీస్‌ల్యాండ్‌లో ఫియస్టా మద్దతుదారులు జుబిలీ మద్దతుదారుల ఇళ్లపై మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో 10 మంది పురుషులు చనిపోయారు, అయిదుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. చాలా ఇళ్లు ధ్వంసమయ్యాయి. 50 మందికి పైగా ప్రజలు గాయాల పాలయ్యారు.

మీరు, మీ మిత్రులు నేర న్యాయవ్యవస్థలో భాగమని ఊహించుకోండి. ముందుగా తరగతిలోని విద్యార్థులను ఈ కింది రకంగా విభజించండి.

1. పోలీసు
2. ప్రభుత్వ న్యాయవాది
3. నిందితులతరపు న్యాయవాది
4. న్యాయమూర్తి

| **పాత్రలు** | **విధులు** |
|---|---|
| పోలీసు | సాక్షులు చెప్పింది వింటారు |
| | సాక్షులు చెప్పింది నమోదు చేస్తారు |
| | కాలిపోయిన ఇళ్ల ఫోటోలు తీసుకుంటారు |
| | సాక్ష్యాలను నమోదు చేస్తారు |
| ప్రభుత్వ న్యాయవాది | ఫియస్టా అభిమానులను అరెస్టు చేస్తారు |
| | తీర్పు వెలువరిస్తారు |
| | బాధితుల తరపున వాదిస్తారు |
| నిందితుల తరపు న్యాయవాది | నిందితులు ఎన్ని సంవత్సరాల జైలుశిక్ష అనుభవించాలో నిర్ణయిస్తారు |
| | కోర్టులో సాక్షులను విచారిస్తారు |
| | తీర్పు వెలువరిస్తారు |
| న్యాయమూర్తి | దాడికి గురైన మహిళలకు వైద్యపరీక్షలు చేయిస్తారు |
| | న్యాయమైన విచారణ జరిపిస్తారు |
| | నిందితులను కలుస్తారు |

కుడివైపున ఉన్న నిలువు వరసలో కొన్ని విధులు ఉన్నాయి. వీటిని ఎడమవైపు ఉన్న పాత్రలతో సరిపోల్చండి. ఫియస్టా అభిమానుల హింసవల్ల ప్రభావితమైన వాళ్లకి న్యాయం చేకూర్చటానికి ఏమేమి చేయాలో ఒక్కొక్క బృందాన్ని ఎంచుకోమనండి. ఈ విధులు ఏ వరసక్రమంలో జరుగుతాయి?

- ఇదే పరిస్థితిని తీసుకుని ఫియస్టా అభిమానియైన ఒక విద్యార్థిని పైవిధులన్నీ నిర్వర్తించమనండి. నేర న్యాయవ్యవస్థలోని అన్ని విధులూ ఒక్కరే నిర్వర్తించినప్పుడు బాధితులకు న్యాయం జరుగుతుందా? మీ సమాధానానికి కారణాలు పేర్కొనండి.

- నేర న్యాయవ్యవస్థలో వివిధ పాత్రలను వివిధ వ్యక్తులు పోషించాలనటానికి రెండు కారణాలను పేర్కొనండి.

పాఠం 16

# జమీందారీ వ్యవస్థ రద్దు

## స్వాతంత్ర్యం వచ్చేనాటికి గ్రామీణ పేదరికం

స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారతదేశం ఎదుర్కొంటున్న ముఖ్యమైన సవాళ్ళలో కడు పేదరికం ఒకటి. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో ఇది మరీ ఎక్కువ. గ్రామీణ జనాభాలో సగానికంటే ఎక్కువ మంది (55 శాతం), అంటే 18.6 కోట్ల జనాభా తీవ్ర పేదరికంలో ఉందని అంచనా. వాళ్లకు భూమి వంటి వనరులు ఏవీ అందుబాటులో లేవు, కనీస ఉపాధి పొందటానికి ఉపయోగపడే చదువు లేదు. వాస్తవానికి ఉపాధి అవకాశాలు చాలా తక్కువగా ఉండేవి. చాలా తక్కువ కూలీ దొరికే వ్యవసాయ పని మాత్రమే వాళ్లకు దొరికేది. వ్యవసాయదారుల్లో అధిక శాతానికి ఎటువంటి సొంత భూమిలేదు. వాళ్లలో కొంతమంది భూస్వాములకు చెందిన భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసేవారు. భూస్వాముల పొలాల్లో వీళ్లు కూలీ లేకుండా పని చేయాల్సి వచ్చేది. కరువు కాటకాలు, రోగాలు తరచు సంభవిస్తూ వినాశనాన్ని సృష్టించేవి. ఆకలి ఎప్పుడూ వాళ్లని వెంటాడుతూనే ఉండేది.


స్వాతంత్ర్యం వచ్చినప్పుడు గ్రామీణ పేదరికాన్ని అంతం చేయాలంటే పేదలకు సాగు భూమి అందచేయటం ముఖ్యమన్న విషయాన్ని చాలామంది గుర్తించారు. జమీందారీ వ్యవస్థ లేదా భూస్వామ్య విధానాన్ని రద్దు చేయటం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది. రైతుకూలీల సమస్యలు వారి కోరికలు, ఆశలపై బ్రిటిషు కాలంలోని ఆందోళనలు దృష్టి కేంద్రీకరించాయి. ప్రభుత్వం పన్నులు తగ్గించాలని, వడ్డీ వ్యాపారస్తుల బంధాల నుంచి, జమీందారుల దోపిడీ నుంచి తమను విముక్తం చేయాలని వీళ్లు కోరుకున్నారు. భూమిని సాగుచేసే వాళ్లకే భూమి చెందాలని కోరారు. 'దున్నేవానికే భూమి' అని నినదించారు!

- గ్రామీణ పేదలకు ఆదాయం వచ్చే ఉపాధి కల్పించటానికి ఇంకా ఏమైనా మార్గాలు ఉన్నాయని మీరు భావిస్తున్నారా?
- మీ ప్రాంతంలో నలుగురు వ్యక్తులున్న ఒక కుటుంబం గౌరవ ప్రదమైన జీవితం గడపటానికి ఎన్ని ఎకరాల భూమి ఉంటే సరిపోతుంది? (సాగునీటి వసతి ఉన్న, లేని భూములకు వేరు వేరుగా ఇవ్వండి.)
- 'దున్నేవానికి భూమి' అన్న నినాదంతో కౌలుదారులకు భూమి లభిస్తుంది. మరి కూలికి పనిచేసే వ్యవసాయ కూలీల పరిస్థితి ఏమిటి?

## జమీందారీ, ఇతర మధ్యవర్తి వ్యవస్థల రద్దు

జమీందారీ వ్యవస్థను రద్దుచేసే చట్టాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు 1950లలో చేశాయి. బలవంతంగా చాకిరి చేయించే వెట్టి, బేగార్ వంటివన్నీ కూడా రద్దు చేశారు. దీనివల్ల గ్రామీణ ప్రజల ముఖ్యమైన సమస్య ఒకటి పరిష్కారమయ్యింది.

భూస్వాముల ఆధిపత్యం మూడు రకాలుగా ఉన్నదని గుర్తించారు:



భూ సంస్కరణ చట్టాలు వీటిని ఎలా పరిష్కరించాయో చూద్దాం.

LE3W3A

i. ముందుగా జమీందారులు భూమిశిస్తు వసూలు చేసే విధానాన్ని రద్దు చేస్తూ చట్టాలు చేశారు. అప్పటి నుంచి భూమి ఉన్న వాళ్లందరూ ప్రభుత్వానికి నేరుగా పన్నులు కట్టాలి. దీనివల్ల జమీందారులు ఆదాయం కోల్పోతారు కాబట్టి ప్రభుత్వం వాళ్లకు నష్టపరిహారాన్ని అధిక మొత్తంలో చెల్లించాలని నిర్ణయించింది. పన్నుల వసూలు వల్ల సంవత్సరంలో వారికి వచ్చే ఆదాయానికి 20 నుండి 30 రెట్ల అధిక మొత్తాన్ని జమీందారులకు చెల్లించింది.

ii. గుర్తింపు పొందిన కౌలుదారులు సాగుచేస్తున్న జమీందారుల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కౌలుదారులను భూయజమానులుగా ప్రకటించింది. వీళ్లు కూడా మధ్యదళారీల ద్వారా కాకుండా నేరుగా ప్రభుత్వానికి పన్నులు చెల్లించాలి. జమీందారులకు నష్ట పరిహారంగా చాలా మొత్తం ఖర్చుపెట్టవలసి వచ్చేది. దీనిని ప్రభుత్వం గుర్తించటంతో భూమికి కొంత వెల చెల్లిస్తేనే కౌలుదారులకు భూమి ఇస్తామన్న నియమాన్ని రూపొందించింది. ఈ మొత్తం చెల్లించగలిగిన వాళ్లు తాము సాగు చేస్తున్న భూములకు యజమానులై భూస్వామ్య వ్యవస్థ దోపిడీనుంచి బయట పడ్డారు. మొత్తంగా 2 నుంచి 2.5 కోట్ల కౌలుదారులు దీనివల్ల ప్రయోజనం పొంది తాము సాగు చేస్తున్న భూమికి హక్కుదారులయ్యారు. అయితే ఈ వెల చెల్లించలేని, లేదా కౌలుదారులుగా చట్టబద్ధంగా గుర్తింపులేని లక్షలాది పేదరైతులు ఎటువంటి ప్రయోజనం పొందలేదు. దాంతో వారు పెద్ద రైతులు, మాజీ జమీందారుల భూములలో పనిచేసే వ్యవసాయ కూలీలుగానే మిగిలిపోయారు.

iii. కూలీల ద్వారా, లేదా కౌలుదారుల ద్వారా సాగుచేస్తున్న జమీందారుల భూములకు (వీటిని ఖుద్ కాస్త్ అంటారు) వారే యజమానులుగా ఉంటారని చట్టం పేర్కొంటోంది. దీనివల్ల జమీందారులు చాలావరకు భూమి తమ సొంత సాగులోనే ఉందని చూపించి దానిపై యాజమాన్యం పొందగలిగారు. అంతేకాకుండా కౌలుదారులను పెద్ద ఎత్తున తొలగించి భూమి తమ సొంత సాగులోకి తెచ్చుకున్నారు. చట్టంలోని వివిధ లొసుగులను ఉపయోగించుకుని అధికశాతం భూమిపై నియంత్రణ సాధించారు. ఒక వ్యక్తి అత్యధికంగా ఎంత భూమి కలిగి ఉండాలని భూ సంస్కరణ చట్టాలు పేర్కొనకపోవటం వల్ల కూడా ఇలా జరిగింది.

iv. కొత్త చట్టాల ప్రకారం జమీందారుల ఆధీనంలో ఉన్న అటవీ, బంజరు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆ సమయంలో జమీందారులు చెట్లుకొట్టి అమ్ముకోవటం ద్వారా సాధ్యమైనంత సొమ్ము చేసుకోటానికి ప్రయత్నించారు. ఈ విధంగా విశాల పరిధిలో అడవులు నాశనం అయ్యాయి. ఏది ఏమైనా పెద్ద ఎత్తున బంజరు భూములు ప్రభుత్వం చేతిలోకి వచ్చాయి. వీటిని అభివృద్ధిపరచి, పేద ప్రజలకు పంచిపెట్టే అవకాశం ప్రభుత్వానికి లభించింది.

- భూ సంస్కరణ చట్టాలు భూస్వాములకు సహాయం చేయటానికి ప్రయత్నించాయని కొంతమంది అంటారు. మీరు వాళ్లతో ఏకీభవిస్తారా?
- భూ సంస్కరణ చట్టాలు భూమినీ, అధికారాన్ని సంపన్న కౌలురైతులకు మాత్రమే బదిలీ చేయటానికి ప్రయత్నించాయని కొంతమంది అంటారు. మీరు వాళ్లతో ఏకీభవిస్తారా?
- వివిధ గ్రామీణ వర్గాల ప్రయోజనాల మధ్య సమతౌల్యం సాధించటానికి అంతర్గత ఘర్షణలు తగ్గించే ఉద్దేశంతో ఈ చట్టాలు ప్రయత్నించాయని మరికొంత మంది అభిప్రాయం. మీరు వాళ్లతో ఏకీభవిస్తారా?
- ఈ చట్టాల వల్ల ఎవరు ఎక్కువ లాభపడ్డారు, ఎవరు అస్సలు లాభపడలేదు? భూస్వాములు చాలా నష్టపోయారని మీరు అను కుంటున్నారా?

## ఆంధ్ర ప్రాంతం

మద్రాసు ఎస్టేటు బిల్లు 1950లో అమలులోకి వచ్చింది (అప్పటికి ఆంధ్ర ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో ఉంది). ఈ చట్టం ప్రకారం జమీందారులు, ఇనాందారులకు మొత్తంగా 15.5 కోట్ల రూపాయలు నష్ట పరిహారంగా చెల్లించారు. వారి ఆధీనంలో ఉన్న భూమిని వాటిని సాగుచేస్తున్న కౌలుదారులకు ఇచ్చారు. ఆంధ్ర ప్రాంతంలో సాగు చేస్తున్న సంపన్న కులాలకు చాలా వరకు భూమి దక్కింది. కాలక్రమంలో వీళ్లు రాజకీయాలు, వ్యాపారాలలో శక్తిమంతులుగా ఎదిగారు. కాని కూలిచేసే ప్రజలు, వృత్తికులాల వాళ్లు భూ సంస్కరణల వల్ల అంతగా లబ్ధి పొందలేదు.

ఈ చట్టం రైత్వారీ హక్కుదారులను ప్రభావితం చేయలేదు, వాళ్లు భూస్వాములుగానే కొనసాగారు. కొన్ని ప్రాంతాలలో ఉన్న జమీందారీ వ్యవస్థను మాత్రమే ఇది రద్దు చేసింది.

## తెలంగాణలో జాగీరుదారీ వ్యవస్థ రద్దు

నైజాం రాజ్యం భారతదేశంలో విలీనమైన సమయంలో తెలంగాణ ప్రాంతంలో రైతాంగ పోరాటం ఉధృతంగా సాగుతోంది. స్వాతంత్ర్యానికి ముందే, 1927లోనే వెట్టిచాకిరిని నిర్మూలిస్తూ చట్టం చేశారు కానీ ఈ చట్టాన్ని అమలు చేయలేదు. అయితే తెలంగాణ సాయుధ పోరాటం బలంగా ఉన్న ప్రాంతాలలో 1948 నాటికి వెట్టి అంతమయ్యింది. 1945 సంవత్సరం నాటికి తెలంగాణ పోరాటం మొదలవుతున్న సందర్భంలో కౌలుదారులకు రక్షణనిచ్చే చట్టాలను నిజాం చేశాడు. దీనికింద కౌలుదారులను నమోదు చేసి వాళ్లకు శాశ్వత సాగు హక్కులు కల్పించాడు.

హైదరాబాదు స్టేటు భారతదేశంలో విలీనం అయిన వెంటనే రాష్ట్ర అధిపతిగా ఉన్న నిజాం తన సొంత ఆస్తిగా ఉన్న సర్ఫ్-ఎ-ఖాస్‌నీ, వెట్టి వంటి బలవంతపు చాకిరీలను రద్దు పరుస్తూ ఫర్మానాలు జారీ చేశాడు. 1949 ఆగస్టు 15న జారీ చేసిన మరొక ఫర్మానా ద్వారా (సంస్థానాలు, మక్తాలతో సహా) చిన్న చిన్న రాజ్యాలుగా ఉన్న జాగీర్లను రద్దు చేశాడు. ఈ జాగీర్లలో భూమిని సాగుచేస్తున్న ఆధిపత్య కులాలకు ఆ భూముల మీద పట్టాలు లభించాయి. హైదరాబాదు జాగీరుదారు నిషేధ చట్టం ప్రకారం కొన్ని రోజులలోనే పెద్ద పెద్ద జాగీర్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అందుకు నష్ట పరిహారంగా 18 కోట్ల రూపాయలు చెల్లించాలని నిర్ణయించారు. ఈ చట్టం ద్వారా 995 జాగీరుదారులను తొలగించి ఆ భూములను వాటిని సాగుచేస్తున్న రైతులకు ఇచ్చారు. అంతేకాకుండా భూమి శిస్తు తగ్గించారు.

కొత్త ప్రభుత్వం హైదరాబాదు వ్యవసాయ సంస్కరణల సంఘాన్ని ఏర్పాటు చేసింది. భూ కేంద్రీకరణ, ఉత్పత్తిని పెంచటం, అప్పుడున్న వ్యవస్థలో రైతులు, కౌలుదారుల కోర్కెలను అధ్యయనం చేయవలసిందిగా ఈ సంఘాన్ని కోరారు. ఈ సంఘం మధ్య దళారీలను తొలగించటం, భూ యాజమాన్యంపై పరిమితి, భూస్వాముల నుంచి అదనపు భూమిని తీసుకోవటం, కౌలుదారులకు రక్షణ వంటి ముఖ్యమైన సిఫారసులను చేసింది. అయితే ఈ సిఫారసులలో కొన్నింటిని మాత్రమే అమలు చేశారు.

అన్ని రకాల కౌలుదారులకు రక్షణ కల్పిస్తూ ప్రఖ్యాత హైదరాబాదు కౌలుదారీ చట్టాన్ని 1950లో చేశారు. భూస్వాములకు ఇష్టం వచ్చినప్పుడు మార్చివేసే కౌలుదారులను రక్షిత కౌలుదారులుగా చేశారు. ఆరు సంవత్సరాలకు పైగా కౌలు చేస్తున్న వాళ్లందరినీ రక్షిత కౌలుదారులుగా, లేదా నామమాత్రపు చెల్లింపుల ఆధారంగా పట్టాదారులుగా చేశారు. దీంతో కౌలుదారులను భూమినుంచి తొలగించటం అంత తేలిక కాదు, తరతరాలపాటు కౌలుదారులు ఆ భూమిని సాగు చేయవచ్చు. ఇదేవిధంగా 1955లో హైదరాబాదు ఇనాం భూముల రద్దు చట్టాన్ని చేశారు.

## భూదాన్ ఉద్యమం

తెలంగాణ భూస్వామ్య విధానం, సాయుధ రైతాంగ పోరాటంపట్ల దేశంలోని చాలామంది ఆందోళన వ్యక్తపరిచారు. భూ కేంద్రీకరణ సమస్యను శాంతియుత పద్ధతుల ద్వారా, అంటే భూదాన ఉద్యమం ద్వారా పరిష్కరించాలని సర్వోదయ నాయకుడు ఆచార్య వినోబా భావే భావించాడు. భూదానం అంటే భూమిలేని వాళ్లకి భూమి దానం ఇవ్వటం. అతడు భూస్వాముల నుంచి స్వచ్ఛందంగా భూమిని పొంది దానిని భూమిలేనివాళ్లకు దానం చేయాలని అనుకున్నాడు. 1951, ఏప్రిల్ 18న వినోబా భూదాన ఉద్యమాన్ని ప్రారంభించాడు. భూసంస్కరణల చరిత్రలో దీనిని ఒక మైలురాయిగా కొనియాడారు. సర్వోదయ ఉద్యమంలో భాగంగా వినోబాజీ హైదరాబాదు దగ్గర ఉన్న శివరాంపల్లికి వచ్చాడు. అక్కడినుంచి నల్గొండ జిల్లాలోని పోచంపల్లికి పాదయాత్ర చేశాడు. గ్రామంలో చెరువు దగ్గర జువ్విచెట్టు కింద ప్రార్థనా సమావేశాన్ని నిర్వహించాడు. ఆ సమావేశంలో షెడ్యూల్డు కులాలకు చెందిన 40 కుటుంబాలు తమకు భూమిని ఇప్పించమని కోరారు. ఆ సమావేశంలో తన తండ్రి జ్ఞాపకార్థం వెదిరె రామచంద్రారెడ్డి 250 ఎకరాలు దానంగా ఇచ్చాడు. భూమిని దానంగా పొందిన మొదటి వ్యక్తి మైసయ్య. ఈ ఘటనతో స్ఫూర్తి పొందిన వినోబాజీ భూదాన ఉద్యమాన్ని చేపట్టాడు. ఆ తరవాత దీనిని గ్రామదాన ఉద్యమంగా మార్చాడు. దేశ వ్యాప్తంగా 44 లక్షల ఎకరాల భూమిని దానంగా పొందాడు. అయినప్పటికీ, సారవంతమైన భూములు ఎక్కువ మోతాదులో భూస్వాముల ఆధీనంలోనే కొనసాగుతుండటం వల్ల ఈ ఉద్యమం దేశంలోని భూసమస్యను పెద్దగా ప్రభావితం చేయలేకపోయింది.


LE7IR7



వినోబాజీ



వెదిరె రామచంద్రారెడ్డి




మైసయ్య

1950లో చేసిన భూసంస్కరణల చట్టానికి 1954లో ఒక సవరణ చేశారు. దీని ద్వారా కొన్ని రకాల సాగుదారులకు రక్షిత కౌలుదారు హక్కు కల్పించకుండా భూ సంస్కరణల ఉద్దేశాన్నే నీరుకార్చారు. అంతేకాకుండా ఈ చట్టాలు భూస్వాములకు కోట్లాది రూపాయలు నష్ట పరిహారంగా చెల్లించమని సిఫారసు చేశాయి. దీనివల్ల ఫ్యూడల్ వ్యవస్థను రద్దుపరిచే భారాన్ని స్వతంత్ర భారతదేశం భరించాల్సి వచ్చింది. పెద్ద పెద్ద భవనాలు, పశువుల కొట్టాలు, వ్యవసాయ పరికరాలను గత కాలపు భూస్వాముల ఆధీనంలోనే ఉంచారు. భూకమతంపై పరిమితి లేకపోవటం వల్ల వేలాది ఎకరాల సారవంతమైన భూములు 'ఖుద్‌ఖాస్త్' కింద భూస్వాముల ఆధీనంలోనే ఉండి పోయాయి.

అనేక చట్టాలను సరిగా అమలు చేయలేదు. వీటి అమలులో జాప్యం వల్ల ఎక్కువ మంది భూస్వాములు వీటిని తమ ప్రయోజనానికి వాడుకున్నారు. కౌలుదారీ చట్టాలలోని లొసుగులను ఆధారంగా చేసుకుని జమీందారులు కౌలుదారుల నుంచి భూములను తిరిగి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. జమీందారీ వ్యవస్థ రద్దు తరవాత వాళ్ళు ఆ భూములన్నీ తమవేనంటూ పెద్ద పెద్ద భూస్వాములుగా మిగిలారు. ఈ భూములను పరిశ్రమలు నెలకొల్పటానికి మళ్లించారు. ఉదాహరణకు చల్లపల్లి జమీందారు పంచదార కర్మాగారం కింద 2650 ఎకరాలు చూపించాడు. కాలక్రమంలో ఈ భూస్వాములు ఆంధ్రలో పారిశ్రామికవేత్తలుగా మారారు. తెలంగాణలో భూస్వాములు 21వ శతాబ్దంలో సైతం తమ పెత్తనాన్ని కొనసాగించారు.

- వివిధ సంస్కరణల వల్ల తెలంగాణలో ఏ వర్గాల రైతాంగం లబ్ధి పొందింది? ఏ రకంగా లబ్ధి పొందింది?
- భూమిలేని వృత్తికులాలవారికి ఈ సంస్కరణల వల్ల ఏ మేరకు ప్రయోజనం కలిగింది?
- భూస్వాములు ఎంత నష్టపోయారు, తమ ప్రయోజనాలను ఎంత వరకు కాపాడుకోగలిగారు?

## భూ పరిమితి చట్టం 1972-75

జమీందారీ వ్యవస్థ రద్దు వల్ల భూ కేంద్రీకరణ సమస్య పరిష్కారం కాలేదు. పట్టిక 1 చూస్తే 1955-56 భూ సంస్కరణలు పూర్తి అయిన తరవాత సగానికి పైగా రైతాంగ కుటుంబాలకు 5 ఎకరాల కంటే తక్కువ భూమి ఉందని తెలుస్తుంది. రాష్ట్రంలో సాగులో ఉన్న భూమిలో 38 శాతం ఇంకా భూస్వాముల అధీనంలోనే ఉంది. పెద్ద సంఖ్యలో ఉన్న భూమిలేని దళితులు భూమికోసం ఉద్యమిస్తున్నారు. మరిన్ని భూ సంస్కరణలు చేయాలంటూ కిసాన్ సభలు ఆందోళనలు చేపట్టాయి. ప్రభుత్వం భూకమతాలకు పరిమితి విధించి, అదనంగా ఉన్న భూమిని స్వాధీనం చేసుకుని భూమిలేని కూలీలకు, సన్నకారు రైతులకు తిరిగి పంచాలని వారు కోరుతున్నారు.

LEB6F4

### పట్టిక 1 : ఆంధ్రప్రదేశ్‌లో భూకమతాలు, 1956-2006

| | 1955-56 | | 1980-81 | | 2005-06 | |
|---|---|---|---|---|---|---|
| | భూకమతాలలో వాటా | సాగు భూమిలో వాటా | భూకమతాలలో వాటా | సాగు భూమిలో వాటా | భూకమతాలలో వాటా | సాగు భూమిలో వాటా |
| సన్నకారు రైతులు: 5 ఎకరాలలోపు | 58% | 18% | 73% | 29% | 83% | 48% |
| చిన్న రైతులు: 5-25 ఎకరాలు, | 32% | 44% | 25% | 52% | 16% | 46% |
| పెద్దరైతులు: 25 ఎకరాలకు మించి | 10% | 38% | 2% | 19% | 1% | 6% |
| మొత్తం | 100% | 100% | 100% | 100% | 100% | 100% |

*మూలం: ఆర్థిక అంశాలు, గణాంకాల సంచాలకులు (డిఇఎస్), హైదరాబాదు*

*పట్టికను చదవటం:*

1955-56కు సంబంధించిన గణాంకాలను జాగ్రత్తగా చదవండి. భూ సంస్కరణల తరవాత 5 ఎకరాలకంటే తక్కువ ఉన్న సన్నకారు రైతులు 58 శాతంగా ఉన్నారు. రైతుల సంఖ్యలో సగం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ వాళ్ల కింద 20 శాతం కంటే తక్కువ సాగుభూమి ఉంది. ఇంకొకవైపున 10 శాతంగా ఉన్న పెద్ద రైతులు, భూస్వాముల కింద మొత్తం సాగుభూమిలో 38 శాతం ఉంది.

భూ సంస్కరణలు అమలు జరిపిన తరువాత 1970 దశకంలో చాలా మార్పులు వచ్చాయి. సన్నకారు రైతులు .....% నుండి .....% వరకు పెరిగారు. చిన్న రైతులు .....% నుండి .....% కు తగ్గారు. కాని వారు గతం కంటే కొంచెం ఎక్కువ భూమిని కల్గిఉన్నారు. పెద్ద రైతులు .....% నుండి .....% కు తగ్గారు. వారి ఆధీనంలోని భూమి కూడ .....% నుండి .....% కి తగ్గింది.

దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం భూకమతాలకు పరిమితి విధిస్తూ, పేదలకు భూ పంపిణీ చేయటానికి రెండవ దశ భూ సంస్కరణలు చేపట్టింది. 1972 తరవాత

దీనికోసం చాలా రాష్ట్రాలలో భూ పరిమితి చట్టాలను చేశారు. భూ పరిమితి చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి 1972 సెప్టెంబరులో ఆమోదించాయి. ఈ చట్టం 1975 జనవరి నుంచి అమలులోకి వచ్చింది.

అయిదుగురు సభ్యులు ఉన్న కుటుంబాన్ని ఒక యూనిట్‌గా చట్టం ప్రకటించింది. అయిదుగురు సభ్యులున్న కుటుంబానికి గరిష్ఠంగా 10-27 ఎకరాలు నీటి వసతి ఉన్న భూమి, 35-54 ఎకరాల మెట్ట భూమి ఉండవచ్చు. దానికి అదనంగా ఉన్న భూమిని మిగులు భూమిగా ప్రకటించి ప్రభుత్వం తీసుకుంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో 8 లక్షల ఎకరాలను మిగులు భూమిగా ప్రకటించారు. వీటిల్లో 6,41,000 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది, అందులో 5,82,000 ఎకరాలను 5,40,000 మంది భూమిలేని, పేద సన్నకారు రైతులకు పంచిపెట్టింది. అవసరమైనదానికీ, చెయ్యదగినదానికీ పోలిస్తే ఇది చాలా తక్కువ. భూస్వాముల పన్నాగాల వల్ల, ప్రభుత్వానికి అంతగా రాజకీయ నిబద్ధత లేనందువల్ల ఈ చట్టం సరిగా అమలు కాలేదు.

అనేకమంది భూస్వాములు అధికారుల ముందు తప్పుడు ధృవీకరణలు చేసి, అదనపు భూమిని వెల్లడి చేయలేదు. చట్టం వస్తుందని ముందుగానే తెలిసిన అనేకమంది భూస్వాములు తమ భూములను దగ్గర బంధువులు, స్నేహితులు, జీతగాళ్ల పేరుమీద కూడా బదిలీ చేశారు. భార్యాభర్తలను వేరు వేరు కుటుంబాలుగా చూపించటానికి కోర్టుల ద్వారా ఉత్తుత్తి విడాకులు పొందిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ విధంగా చట్టం ప్రకారం అదనపు భూమి ఉన్న రైతులు కూడా తమ భూములను కాపాడుకుని మిగులు భూమిని చూపించలేదు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న మిగులు భూమిలో చాలావరకు సాగుకు పనికిరానిదిగా ఉంది. పట్టిక 1లో 2005-06కి సంబంధించిన గణాంకాలు చూస్తే అధికశాతం (83 శాతం) రైతులు సన్నకారు రైతులని, వాళ్లకింద సాగుభూమిలో సగం ఉందని అర్థం అవుతుంది. ఇందుకు విరుద్ధంగా ఒక శాతం మాత్రమే ఉన్న భూస్వాముల అధీనంలో 6 శాతం భూమి ఉంది. పెద్ద భూస్వాములు తమ భూములను చిన్న కమతాలుగా విభజించి వాటిని అక్రమంగా స్నేహితులు, జీతగాళ్ల పేరుమీద మార్చినందువల్ల కూడా గణాంకాలు ఇలా ఉన్నాయి.

భూ పరిమితి చట్టాలను సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలలో పశ్చిమ బెంగాల్ ఒకటి. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కృతనిశ్చయంతో వ్యవహరించి సన్నకారు రైతులు, భూమిలేని పేదలను సమీకరించి భూ పరిమితి చట్టాలు అమలు అయ్యేలా చూసింది. ఫలితంగా ప్రభుత్వం 12,94,000 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని అందులోనుంచి 10,64,000 ఎకరాల భూమిని 26,51,000 కుటుంబాలకు పంచిపెట్టింది. రాజకీయ నిబద్ధత ఉంటే ఈ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయవచ్చునీ, పేదలకు ఆస్తులు, భూ వనరులు దక్కేటట్లు చేయవచ్చునీ ఇది నిరూపిస్తుంది.

- భూ పరిమితి చట్ట అవసరం ఎందుకు ఏర్పడింది?
- ఈ చట్టాన్ని 1950లలోనే అమలు చేసి ఉండాల్సిందని కొంతమంది భావిస్తారు. అయితే దీనివల్ల చాలా వ్యతిరేకత వచ్చి ఉండేదని కొంత మంది అభిప్రాయం. ఈ రెండు అభిప్రాయాల గురించి తరగతిలో చర్చించండి. మీరు దేనితో ఏకీభవిస్తారు?
- భూ పరిమితి చట్టం ఆంధ్రప్రదేశ్‌లోనూ, పశ్చిమ బెంగాల్‌లోనూ అమలు అయిన విధానాన్ని పోల్చండి. చట్టాన్ని సమర్థవంతంగా ఎలా అమలు చేయాలో చర్చించండి.

## కీలక పదాలు

1. భూ పరిమితి
2. జాగీరుదారీ వ్యవస్థ
3. ఫర్మానా
4. కౌలుదారీ చట్టం
5. భూదాన ఉద్యమం
6. సర్ఫ్-ఎ-ఖాస్
7. మక్తాలు
8. భూకమతం
9. బేగార్/ వెట్టి
10. నష్టపరిహారం
11. ఖుద్‌కాస్త్

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. శాసనసభలో చట్టాలు చేసేటప్పుడు దానిపై వివిధ దృష్టికోణాలనుంచి ఎంతో చర్చ జరుగుతుంది. 1950లలో భూ సంస్కరణల చట్టంపై వివిధ అభిప్రాయాలు ఏమై ఉంటాయి? ఏ దృష్టికోణం బలంగా ఉండి ఉంటుంది? $AS_1$
2. 1970లలో భూ పరిమితి చట్టాలు చేసినప్పుడు ఎటువంటి అభిప్రాయాలు ఉండి ఉంటాయి? $AS_1$
3. ఈ సంస్కరణల వల్ల రైతాంగ మహిళలు ఏమైనా లబ్ధి పొందారా? కారణాలు పేర్కొనండి. $AS_1$
4. అన్ని వర్గాల రైతాంగానికి వెట్టి ఎందుకు సమస్యగా ఉండింది? భూస్వాములు తమ భూములను సాగు చేయటానికి ప్రస్తుతం ఏం చేస్తూ ఉండి ఉంటారు? $AS_4$
5. మీరు ఒక కౌలుదారు. భూ సంస్కరణ చట్టాల వల్ల మీకు భూమి లభించింది. అప్పుడు మీ అనుభవాలను గురించి రాయండి. $AS_4$
6. భూ సంస్కరణల చట్టం సమయంలో మీరు ఒక భూస్వామి అని ఊహించుకోండి. అప్పుడు మీ భావాలు, చర్యలు ఎలా ఉంటాయో రాయండి. $AS_4$
7. రైతులు ఇష్టం వచ్చినప్పుడు తొలగించగల కౌలుదార్లకు భూ సంస్కరణల వల్ల వాస్తవానికి నష్టం జరిగిందని చాలామంది అభిప్రాయపడతారు. దీనితో మీరు ఏకీభవిస్తారా? మీ కారణాలు తెల్పండి. $AS_1$
8. ప్రభుత్వం సమర్థవంతమైన చట్టాలు చేసినా భూ పరిమితి చట్టాన్ని సమర్థంగా ఎందుకు అమలు చేయలేదు? $AS_1$
9. భూదాన ఉద్యమస్ఫూర్తి "భూస్వామ్యాన్ని అంతం చేయటం"లో, "దున్నేవానికే భూమి ఇవ్వటం"లో ఎందుకు విఫలమయ్యింది? $AS_1$
10. ఆంధ్రప్రదేశ్ పటంలో నల్గొండ జిల్లాలోని పోచంపల్లి గ్రామాన్ని గుర్తించండి. $AS_5$
11. "స్వాతంత్ర్యం వచ్చే నాటికి గ్రామీణ పేదరికం" అనే శీర్షిక కింద మొదటి పేరా చదివి ఈ క్రింది ప్రశ్నకు సమాధానం రాయండి.

    ప్రస్తుత పరిస్థితులు మెరుగుపడ్డాయా? ఎలా? $AS_2$

### ప్రాజెక్టు:

అయిదుగురు విద్యార్థులు బృందంగా ఏర్పడి, మీ ప్రాంతంలోని కొంతమంది పెద్దలతో భూ సంస్కరణల అమలులో వాళ్ల అనుభవాల గురించి అడగండి. ఈ పాఠంలో పేర్కొన్న అంశాలు మీ ఊళ్లో కూడా జరిగాయేమో తెలుసుకోండి. దీనిపై ఒక నివేదిక తయారుచేసి తరగతిలో చర్చించండి.


పాఠం 17

# పేదరికం - అవగాహన

## గ్రామీణ ప్రాంతాల్లో దుస్థితి

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలోని ఒక గ్రామంలో రామాచారి వడ్రంగిగా పని చేసేవాడు. గ్రామంలోని రైతుల కోసం పరికరాలు, పనిముట్లు తయారుచేసేవాడు. అతడికి భూమికానీ, పశువులు కానీ లేవు. రామాచారి రైతు కాకపోయినప్పటికీ అతడి జీవనోపాధి గ్రామంలోని వ్యవసాయ పనుల మీద ఆధారపడి ఉంది.

కొన్ని సంవత్సరాల క్రితంవరకు రామాచారి వద్ద పని చేయించుకోటానికి 40 మంది దాకా వచ్చేవాళ్లు, వాళ్లల్లో ఎక్కువ మంది రైతులు. అతడు చేసిన పనులకు ప్రతిఫలంగా రైతులు ధాన్యం రూపంలో చెల్లించేవాళ్లు. ఒక్కొక్క రైతు సంవత్సరానికి 70 కిలోల ధాన్యం ఇచ్చేవాళ్లు. అలా వచ్చిన 2,800 కిలోల ధాన్యంలో కుటుంబానికి కావలసినంత ఉంచుకుని, మిగిలినది మార్కెటులో అమ్మేవాడు. 70 కిలోల ధాన్యం 375 రూపాయలకు అమ్మేవాడు. కొన్ని సంవత్సరాల క్రితంవరకు ఈ విధంగా కుటుంబానికి సరిపడా బియ్యంతోపాటు సంవత్సరానికి 8,000 రూపాయలు పొందేవాడు. దీనితోనే కుటుంబాన్ని గుట్టుగా నడుపుకొచ్చేవాడు.



వ్యవసాయ పనులలో మార్పులు రావటంతో సమస్య మొదలయ్యింది. ఊళ్లోకి 12 ట్రాక్టర్లు రావటంతో అతడికి పని తగ్గింది. ముందు అధ్యాయాల్లో చదివినట్లు చిన్న, పెద్ద రైతులు ట్రాక్టర్లు సొంతంగా కానీ, బాడుగకి కానీ ఉపయోగించటంతో ఎడ్ల వినియోగం తగ్గింది. అంతేకాదు, ఊళ్లోని సన్నకారు రైతులకు రానురాను వ్యవసాయం చేయటం కష్టమై పోసాగింది. కాలువ ఎండిపోవటంతో సాగునీరు లేకుండాపోయింది. బోరుబావులు తవ్వటానికి, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనటానికి రైతులు అధిక వడ్డీలకు అప్పు చేయాల్సి వచ్చేది. ఈ అప్పులు తిరిగి చెల్లించటం, ప్రత్యేకించి పంటలు నష్టపోయినప్పుడు కష్టమైపోయేది. రామాచారి వాళ్ల ఊరిలో అప్పులపాలైన రైతులు 30కి పైగా ఎడ్లను అమ్ముకోవలసి వచ్చింది. అంటే వాటికి అనుబంధంగా రకరకాల పనులు చేసే రామాచారికి పని తగ్గిందన్న మాట. రామాచారి తయారుచేసే పరికరాలకు గిరాకీ లేకుండాపోయింది. ఒకప్పుడు వచ్చే 40 మందికి బదులు ఇప్పుడు ముగ్గురో, నలుగురో వచ్చి పని చేయించుకుంటున్నారు.

ఊళ్లో పని తగ్గటం వల్ల రామాచారి భార్య అరుణ విజయవాడలోని చెప్పుల కంపెనీలో పని చేయ సాగింది. "నాకు మరోదారి లేకుండా పోయింది," అని ఆమె చెప్పింది. "అంతకు ముందు నేనెప్పుడూ పనికి వలస పోలేదు. కానీ ఊళ్లో పని దొరికే అవకాశాలు పూర్తిగా అడుగంటిపోయాయి." తన ముగ్గురు పిల్లల్ని భర్త దగ్గర వదిలిపెట్టి ఆమె నెల రోజులపాటు పనికి వెళ్లింది. ఇంటి దగ్గర ముసలి వాళ్లు, పిల్లల్ని వదిలిపెట్టి

*ఆ ఊరినుంచి 250 మందిదాకా పని వెతుక్కుంటూ వలస వెళ్లారు.*

*అరుణ వలసకి వెళ్లినప్పుడు ఆమె కుటుంబం చాలాసార్లు ఆకలితో గడపాల్సి వచ్చేది. నూకలు కొనటానికి కూడా రామాచారి పొరుగిళ్లల్లో అప్పు చేయాల్సి వచ్చేది. రామాచారి ఆరోగ్యం సరిగా ఉండేది కాదు, అతడు తరచూ రోగాల బారిన పడేవాడు. అంతకు ముందు మాదిరిగా పని చేయలేక పోయేవాడు.*

- రామాచారి జీవనోపాధి గ్రామంలోని వ్యవసాయంతో ఏవిధంగా ముడిపడి ఉంది?
- రామాచారి కుటుంబం కష్టాలు ఎదుర్కోటానికి కారణం:
  - (అ) రామాచారి సరైన ప్రయత్నాలు చేయకపోవటం, తగిన అవగాహన లేకపోవటం, లేక
  - (ఆ) గ్రామంలో జీవనోపాధుల పరిస్థితి.
- రామాచారి కుటుంబానికి రోజూ రెండు పూటలా భోజనం లభించాలంటే ఏం చేయాలి? ఆలోచించండి.
- రామాచారి, గ్రామంలోని రైతులకు మధ్య మార్పిడి/ లావాదేవీని ఎలా వర్ణిస్తారు?
- సాధారణంగా సంవత్సరానికి రామాచారి తన కుటుంబ అవసరాలకు ఎన్ని కిలోల ధాన్యం ఉంచుకునేవాడు?
- (ఆహార ధాన్యాలు కాకుండా) కుటుంబ ఖర్చులకు సంవత్సరానికి 8000 రూపాయలు సరిపోతాయా?

చంద్రయ్య పట్టణ మార్కెట్‌లో బండి లాగుతూ పట్టణ మురికి వాడల్లో ఉంటాడు. అతని కుటుంబం ఊళ్లో ఉంటుంది. ఒక్కొక్క రోజు అతడు వంద రూపాయల వరకు సంపాదిస్తాడు, ఒక్కొక్కసారి 40 రూపాయలకు మించి రాదు. పగటిపూట మార్కెట్లో బండిమీద అమ్మే రొట్టె, పప్పు కొనుక్కొని తినేవాడు. కొంత డబ్బు ఇంటికి కూడా పంపించాలి కాబట్టి అతడు చేసే శారీరక పనికి తగ్గట్టుగా కాకుండా చాలా తక్కువ తినేవాడు. సాయంత్రం అయ్యేసరికి అతడికి నీరసం కమ్ముకునేది. రాత్రి మురికివాడలో ఉంటున్న బండి వాళ్లంతా వంతుల ప్రకారం అన్నం వండి అందరూ తినేవారు. ఈ విధంగా సరైన ఆహారం లేకుండా ఇరవైఏళ్లు గడిపిన చంద్రయ్య వంట్లో శక్తి అంతా ఉడిగిపోయింది. అతడు తన వయసు కంటే చాలా ముసలివాడుగా కనిపించేవాడు.

- చంద్రయ్య, రామాచారి జీవితాలలో పోలికలను చర్చించండి.

## తీవ్ర ఆకలి కూడా పేదరికమే

పస్తులతో గడపటం చాలా విస్తృతంగా వ్యాపించి ఉంది. రామాచారి, చంద్రయ్య లాగా భారతీయ



*చిత్రం 17.1: పై పట్టణ దృశ్యంలోని జీవన విధానాలలో తేడా గురించి చర్చించండి*

గ్రామాలు, పట్టణాలలో అనేకమంది ఆరోగ్యంగా ఉండటానికి, రోజువారీ చురుకుగా పని చేయటానికి తగినంత ఆహారం తినే పరిస్థితుల్లో లేరు. వీధుల్లో మనం చూసే అనాథలు, వృద్ధుల మాదిరి వాళ్ల పరిస్థితి అంత దారుణంగా అనిపించక పోవచ్చు. వీళ్లు మనకి బాగానే ఉన్నట్టు కనపడతారు, కానీ వాళ్లు ఆకలికి, అలసటకి గురవుతారు. వాళ్లకి తినటానికి సరిపోయేటంత ఆహారం దొరకదు. వాళ్లు తినవలసిన దానికంటే తక్కువ తింటారు. ఈ పరిస్థితి చాలాకాలం కొనసాగడాన్ని దీర్ఘకాలిక పేదరికం లేదా తీవ్ర ఆకలి అంటారు. అందువలన వాళ్లు బలహీనంగా ఉండి తరచు రోగాల బారిన పడుతుంటారు.

కండరాలను కదిలించటానికి, నడవటానికి, మాట్లాడటానికి, రోజువారీ పనులు చేయటానికి మనకు శక్తి కావాలి. ఈ శక్తి మనం తినే ఆహారం నుంచి వస్తుంది. ఈ శక్తిని కిలోకాలరీలలో కొలుస్తారు. ఉదాహరణకు ఒక చెంచా చక్కెర నుండి 40 కిలోకాలరీల శక్తి వస్తుంది, ఒక చెంచా నూనెనుంచి 90 కిలోకాలరీల శక్తి లభిస్తుంది. అట్టపెట్టెలలో ఉన్న ఆహారం కొన్నప్పుడు అది తింటే వచ్చే శక్తి వివరాలు దానిపై ఉంటాయి.

పల్లె ప్రాంతాలలో వాళ్లకి 2,400, పట్టణంలో వాళ్లకి 2,100 కిలోకాలరీలు శక్తిని ఇచ్చే ఆహారం ప్రతిరోజూ అవసరమని జాతీయస్థాయిలో ప్రామాణికంగా నిర్ధారించారు. ఒక మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే సగటున రోజుకి కనీసం 2,100 కిలో కాలరీల శక్తినిచ్చే ఆహారాన్ని తీసుకోవాలి. శారీరకశ్రమ ఎక్కువగా చేసేవాళ్లకి రోజుకి కనీసం 2,400 కిలో కాలరీల శక్తి కావాలి.

భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలలోని 80 శాతం దాకా ప్రజలు కనీస కాలరీలు ఇచ్చే ఆహారాన్ని తినటంలేదంటే ఆశ్చర్యం కలుగుతోందా? అంటే ప్రతి అయిదుగురిలో నలుగురు సరిపడా కాలరీలు లేని ఆహారాన్ని తింటున్నారు. ఈ కాలరీల లోపం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమై లేదు. పట్టణ ప్రాంతాలలో కూడా ప్రతి అయిదుగురిలో ముగ్గురు తక్కువ కాలరీలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటున్నారు.

సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ అత్యంత పేదల ఆహారంలో కాలరీల పరిమాణం తగ్గుతూ ఉండటం చాలా ఆందోళనను కలిగిస్తోంది. 1980లతో పోలిస్తే ప్రస్తుతం మన దేశం మొత్తంగా సంపద పెరిగినట్లు అనిపిస్తుంది, మునుపటికంటే ఎక్కువ వస్తువులు, సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ, అత్యంత పేదలలో మాత్రం ఆకలికి గురికావటం పెరిగింది. వాస్తవానికి వాళ్లకి 25 సంవత్సరాల క్రితం కంటే ఇప్పుడు తక్కువ కాలరీలు అందుతున్నాయి!

- దేశంలో అత్యంత సంపన్నులైన 25 శాతం ప్రజలు సగటున రోజుకి ఎన్ని కాలరీలను తీసుకుంటున్నారు?
- దేశంలో అత్యంత పేదలైన 25 శాతం ప్రజలు రోజూ తీసుకోవాల్సిన కాలరీల కంటే సగటున వాళ్లు తీసుకుంటున్న కాలరీలు ఎంత శాతం తక్కువ?
- పేద ప్రజలు చాలా తక్కువ కాలరీలు తీసుకోటానికి కారణాలు ఏమిటి?


ఆకలిని భరించటం చాలా బాధాకరంగా ఉండటమే కాదు, దానివల్ల ఎంతో హాని కూడా జరుగుతుంది. తీవ్ర ఆకలికి గురయ్యే ప్రజలకు తగినంత పోషకాలు ఉన్న ఆహారం దొరకదు. సరైన మోతాదులో ఆహారం తీసుకోకపోతే కాలరీల లోపానికి గురవుతారు. పోషకాహారలోపం ఉంటే చదవటం, పనిచేయటం, శారీరక పనులు చేయటం కష్టమవుతుంది. పోషకాహారలోపం ఉండే పిల్లలు ఆరోగ్యంగా ఉండే పిల్లలంత వేగంగా పెరగరు. మానసికంగా కూడా అంత బాగా వృద్ధి చెందరు. నిత్యం ఆకలితో ఉండటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గి వాళ్లు తేలికగా జబ్బుల పాలవుతారు. తీవ్ర ఆకలికి గురైన తల్లులు సాధారణంగా బరువు తక్కువ, బలహీనంగా ఉండే పిల్లలకు జన్మనిస్తారు.

## ఆహార అసమానత

శాస్త్రజ్ఞులు పరిశోధనా కేంద్రాలలో ప్రయోగాలు చేసి గణాంకాలు సేకరించినట్లు సామాజిక శాస్త్రవేత్తలకు సర్వేలు విలువైన గణాంకాలను, విశ్లేషణకు రుజువులను అందిస్తాయి. ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుసుకోటానికి భారత ప్రభుత్వం ప్రతి నాలుగు లేదా ఐదు సంవత్సరాలకు ఒకసారి జాతీయ నమూనా సర్వే (National Sample Survey)ని నిర్వహిస్తుంది. దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కుటుంబాల నుంచి ఇంటర్వ్యూల ద్వారా సర్వే చేసి కావలసిన సమాచారాన్ని సేకరిస్తారు. ప్రజల ఉపాధి, వాళ్లు చేసేఖర్చు, పాఠశాల విద్య, ఆరోగ్యం, తాగునీటి అందుబాటు వంటి విషయాల్లో ఏమవుతోందో తెలుసుకోటానికి పరిశోధకులు ఈ గణాంకాలను ఉపయోగిస్తారు. ప్రభుత్వ విధానాలు సరైన దిశలోనే ఉన్నాయో లేదో తెలుసుకోటానికి ఈ గణాంకాలు ప్రత్యేకంగా ఉపయోగపడతాయి.

2004లో జరిపిన జాతీయ నమూనా సర్వేలోని సమాచారం ఆధారంగా కాలరీల వినియోగం తెలియచేసే రేఖాపటం 1 తయారు చేశారు. సగటున ప్రతి వ్యక్తి ఎన్ని కాలరీలు తీసుకుంటున్నారో తెలుసుకోటానికి పరిశోధకులు ప్రయత్నించారు. ఈ విషయంలో ధనికులకూ పేదలకూ మధ్య చాలా అంతరం ఉందని తెలుసుకున్నారు. చాలా తక్కువ ఆదాయం ఉండి, చాలా తక్కువ ఖర్చు చేయగలిగిన వాళ్లు (అత్యంత పేదలు) సగటున ప్రతి రోజూ 1624 కిలోకాలరీల ఆహారం తీసుకుంటున్నారు. ఆదాయం, ఖర్చుతోపాటు తీసుకునే కాలరీలు కూడా పెరుగుతుంటాయి. పేదవాళ్లు తీవ్ర శారీరక శ్రమ చేస్తుంటారు కాబట్టి వాళ్లు ఇంకా ఎక్కువ కాలరీలు తీసుకోవాలి కానీ జనాభాలో అత్యంత పేదవాళ్లు అత్యంత ధనికుల కంటే చాలా తక్కువ కాలరీలు తీసుకుంటున్నారు.

అధిక శాతం ప్రజలలో వాళ్లు రోజూ తింటున్న ఆహారం నుంచి వాళ్లకి అవసరమైనన్ని కాలరీలు అందటం లేదు. ప్రామాణిక స్థాయిలో కాలరీలు తీసుకోని వాళ్లనందరినీ పేదలుగా పరిగణించవచ్చు.




రేఖా పటం 1 : గ్రామీణ భారతంలో సగటున ప్రతి వ్యక్తి, ప్రతిరోజూ తీసుకుంటున్న కాలరీలు

**గమనిక :** ఇక్కడ చేస్తున్న ఖర్చు అంటే ఆహారం, బట్టలు, పాదరక్షలు, చదువు, వైద్యం, ఇంధనం, విద్యుత్తు, ఇంటి అద్దె వంటివి వస్తాయి. 2004లో అత్యంత పేదలైన పాతిక శాతం ప్రజలలో ప్రతి వ్యక్తీ ఈ అంశాలపై నెలకి 340 రూపాయలు ఖర్చు చేస్తున్నారు, అంటే ఈ నిత్యావసర వస్తువులకు రోజుకు 12 రూపాయల కంటే తక్కువన్నమాట! రెండవ పాతిక శాతంలోని వాళ్లు కొంచెం ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. ఎక్స్ అక్షంపై ముందుకు వెళుతున్నకొద్దీ వాళ్లు చేస్తున్న ఖర్చు పెరుగుతుంది.

**కృత్యం**

- పెద్దవాళ్లు పోషకాహారలోపానికి గురైనదీ, లేనిదీ తెలుసుకోవాలంటే పోషకాహార శాస్త్రజ్ఞులు చెప్పే శరీర పదార్థ సూచిక (Body Mass Index) లెక్కకట్టాలి. దీనిని లెక్కకట్టటం తేలిక. వ్యక్తి బరువు ఎంతో కిలోల్లో తీసుకోండి. ఆ వ్యక్తి ఎత్తును మీటర్లలో తీసుకోండి. బరువును ఎత్తు వర్గంతో భాగించాలి. ఫలితంగా వచ్చిన సంఖ్య 18.5 కంటే తక్కువ ఉంటే ఆ వ్యక్తి పోషకాహార లోపానికి గురైనట్టు. శరీర పదార్థ సూచిక 25 కంటే ఎక్కువ ఉంటే ఆ వ్యక్తిది ఊబకాయం అన్నట్టు. ఈ నియమం ఎదుగుతున్న పిల్లలకు వర్తించదని గుర్తుంచుకోండి.

  భిన్న ఆర్థిక నేపథ్యాలకు చెందిన (ఉదాహరణకు శ్రామికులు, పనివాళ్లు, వ్యాపారస్తులు) ముగ్గురు పెద్దవాళ్ల బరువు, ఎత్తులను ప్రతి ఒక్క విద్యార్థి సేకరించండి. అందరు విద్యార్థులు తెచ్చిన వివరాలను ఒక పట్టికలో పొందుపరచండి. శరీర పదార్థ సూచిక (BMI) లెక్కకట్టండి.



*చిత్రం 17.2 : ఎత్తు కొలవడం*

- వ్యక్తి ఆర్థిక స్థాయికీ, వాళ్ల పోషకాహారస్థాయికీ మధ్య ఏమైనా సంబంధం కనబడుతోందా?

## పేదరికం ఎందుకు ఉంది? దానిని ఎలా నిర్మూలించవచ్చు?

పేదరికానికి ప్రధాన కారణం క్రమం తప్పకుండా పని దొరకకపోవటం అని మీరు ఈపాటికి గ్రహించి ఉంటారు. ఉపాధి అవకాశాలు లేకపోతే మౌలిక అవసరాలు తీర్చుకునే ప్రజల కొనుగోలు శక్తి (ఆదాయం) తగ్గుతుంది. కనీస కొనుగోలు శక్తి లేనప్పుడు వాళ్లు తీవ్ర ఆకలికి గురవుతారు.

## జీవనోపాధిగా వ్యవసాయం

భారతదేశంలో ఇప్పటికీ 50 శాతం కంటే ఎక్కువ ప్రజలు తమ జీవనోపాధికి వ్యవసాయ పనులపై ఆధారపడుతున్నారు. వీళ్లల్లో సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు ఎక్కువ. అంతేకాక వడ్రంగి రామాచారిలాగా వ్యవసాయంతో ముడిపడి ఉన్నవారు కూడా ఉన్నారు. గ్రామాల్లో కుండలు చేసేవారు, తోలుపని చేసేవారు, చిన్న చిన్న పరిశ్రమలు పెట్టుకున్నవారి బాగు కూడా వ్యవసాయ స్థితిపై ఆధారపడి ఉంటుంది. గ్రామంలో వ్యవసాయం కుంటుపడినప్పుడు రామాచారి కుటుంబం కష్టాలపాలైన విధం చూశాం. రామాచారి తయారు చేయగలిగిన పరికరాలకు గిరాకీ లేకుండా పోయింది. ఫలితంగా రామాచారికి పనీ, ఆదాయమూ లేకుండా పోయాయి. ఇతర పేద కుటుంబాల మాదిరిగానే వీరికి కూడా పొలాలు కాని పశువులు కాని లేవు. ఆ సంవత్సరం పొలాల్లో వ్యవసాయ కూలీలకు కూడా అంతగా పనిలేదు. వ్యవసాయేతర పనులు కూడా లేవు.

చాలామంది ప్రజల జీవనోపాధి, సంక్షేమం వ్యవసాయంపై ఆధారపడి ఉంది కాబట్టి వ్యవసాయం చక్కటి ప్రగతి సాధించటం ముఖ్యం. వ్యవసాయం వృద్ధి చెందితే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి,

ఆదాయాలను సమకూరుస్తుంది. అంతేకాకుండా వ్యవసాయ ఉత్పత్తి బాగుంటే ఆహార ధరలు ఎక్కువ మందికి అందుబాటులో ఉండే అవకాశం ఉంది.

ప్రస్తుతం వ్యవసాయం అనేక సమస్యలను ఎదుర్కొంటూ ఉంది. ఆరవ తరగతిలో 'నేటి వ్యవసాయం' అన్న అధ్యాయంలో సాగునీటి వసతిలేక, తక్కువ వడ్డీకి అప్పులు అందక, పంటలకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందక చిన్నరైతులు ఎలా ఇబ్బంది పడుతున్నారో తెలుసుకున్నారు. (ఈ పాఠం ఒకసారి చదివి వెంకటాపురంలో రవి, రాముల పరిస్థితి పునఃశ్చరణ చేయండి.) ఉత్పాదకాల ఖర్చులు పెరగటం, తక్కువ దిగుబడులు రావటం, తరచు పంటలు విఫలమవ్వటం వంటివాటి వల్ల రైతులు తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. కుటుంబం గడవటానికి చాలా మంది చిన్న రైతులు వ్యవసాయ కూలీలుగా కూడా పనిచేయాల్సి వస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో అయిదింట నలుగురు రైతుల పరిస్థితి రవి, రాముల మాదిరే ఉంది.

వ్యవసాయ అభివృద్ధికి, వ్యవసాయంపై ఆధార పడిన వారికి మద్దతుగా ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు ఈ కింద ఉన్నాయి. ప్రతి దాని గురించి కొన్ని వాక్యాలు రాయండి. అది ఎందుకు ముఖ్యమో తెలియ చేయండి. మీ నేపథ్యం నుంచి కొన్ని ఉదాహరణలు ఇవ్వండి.

1. రైతులు వ్యాపారస్తులు/ దళారులపై ఆధార పడకుండా ప్రభుత్వం సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలి. ఇవి నాణ్యతగా ఉండేటట్టు, సరసమైన ధరలకు దొరికేటట్టు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
2. చిన్నతరహా సాగునీటి పథకాలు.
3. న్యాయమైన వడ్డీకి సకాలంలో బ్యాంకు ద్వారా రుణాలు.
4. ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధర దొరికేలా మార్కెటింగ్ సౌకర్యాలు.
5. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు, రవాణా సౌకర్యాలు మెరుగుపరచటం.
6. పంటలు నష్టపోయినప్పుడు రైతులకు సహాయం అందించటం.

### ఇతర జీవనోపాధి అవకాశాలు

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ కుటుంబాలలో 40 శాతం ప్రధానంగా వ్యవసాయ కూలీలు. ఈ కుటుంబాలకు భూమి లేదు, లేదా చాలా కొద్దిభూమి మాత్రమే ఉంది. వీళ్లకి పని అవకాశాలు చాలా తక్కువ. సాధారణంగా సంవత్సరంలో వ్యవసాయ కూలీకి 120-180 రోజుల పని దొరుకుతుంది. పొలాల్లో చాలా రోజులపాటు వరసగా పని దొరకని సందర్భాలు ఉంటాయి.

కరువు, వరదలు, చీడలు, ఇతర వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయినప్పుడు వ్యవసాయ పని దినాలు మరింతగా తగ్గిపోతాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వెళతారు. ఈ సంక్షోభ కాలంలో ప్రజలు ఆకలి, అనారోగ్యాలపాలవుతారు. ఇటువంటి పరిస్థితుల్లో జీవనోపాధులు కల్పించటానికి ఏమి చేయవచ్చు?

ప్రాథమిక అవసరాలు సమకూర్చుకోటానికి ప్రతి వ్యక్తికి పని కల్పించాలని 'పని హక్కు' చెపుతోంది. భారత రాజ్యాంగంలో 'ఆదేశిక సూత్రాలలో' పని హక్కు పొందుపరిచి ఉంది. అధికరణం 41 ఇలా పేర్కొంటోంది: "తన ఆర్థిక సామర్థ్యం, అభివృద్ధి పరిమితులకు లోబడి పని హక్కు కల్పించటానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలి..." అయితే ప్రజలు ఈ హక్కులను ఉపయోగించు కోలేకపోయారు. ప్రభుత్వం తనకి ఇష్టం వచ్చినపుడు పనులు చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించేది. కానీ ప్రజలు తమకు అవసర మైనప్పుడు, తమ నివాస ప్రాంతానికి దగ్గర పని చూపించమని అడగలేక పోయేవాళ్లు.

ప్రజా సంఘాలు సంవత్సరాల తరబడి జరిపిన పోరాట ఫలితంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MNREGA), 2005 తయారయ్యింది. గ్రామీణ ప్రాంతాలలో ప్రజల జీవనోపాధుల రక్షణలో ఇది పెద్ద ముందడుగని చెప్పవచ్చు.

### మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం [Mahatma Gandhi National Rural Employment Guarantee Act (MNREGA)]

LELN6K

బీహార్‌లోని అరేరియా జిల్లాకి చెందిన బాలేశ్వర్ మహతో తన కుటుంబ పోషణకు ప్రతి సంవత్సరం పని వెతుక్కుంటూ పంజాబ్‌కి వెళ్ళేవాడు. ఈ జూన్‌లోనూ అతడు అక్కడికి వెళ్లాలనుకున్నాడు. అయితే అతనికి ఉపాధి హామీ చట్టం కింద తన గ్రామంలోనే పని దొరకటంతో ఊళ్లోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నాడు.

స్థానికంగా పని దొరకటం కష్టం కాబట్టి అరేరియా ప్రాంత ప్రజలు దూరంగా ఉన్న పంజాబ్, ఢిల్లీ, గుజరాత్‌లలో పని వెతుక్కుంటూ వెళ్లాల్సి వస్తోంది. స్థానికంగా దొరికే కొద్ది పని దినాలకు కూలిరేట్లు చాలా తక్కువ. పంట కోతల సమయంలో రోజుకి 40–60 రూపాయలు ఇస్తారు, మిగిలిన సమయాల్లో ఇది మరీ తక్కువ (రోజుకి 25–50 రూపాయలు). కుటుంబంలో ఎవరైనా జబ్బుపడి తాను ఊళ్లోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు బాలేశ్వర్ ఇటువంటి పనికే వెళతాడు.

పట్టణాలలో వలస కార్మికులు చాలా దారుణ పరిస్థితుల్లో జీవిస్తూ ఉంటారు. ఆవాసం, తాగటానికి శుభ్రమైన నీళ్లు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు ఏవీ వాళ్లకి ఉండవు. ఊళ్లలోనే ఉండిపోయే మహిళలు, పిల్లలు, భద్రతారాహిత్యానికి గురవుతారు, తరచు కుటుంబ సంబంధాలు దెబ్బతింటాయి.

ఉపాధి హామీ చట్టం వల్ల బాలేశ్వర్‌కి మూడు విధాలుగా లాభం: స్థానికంగా ఉపాధి దొరకటమే కాకుండా అతడు తన కుటుంబంతో ఉంటూ ఉన్న కొద్దిపాటి భూమినీ సాగు చేసుకోవచ్చు.

ఈ ఉపాధి హామీ చట్టం ప్రకారం నైపుణ్యం అవసరంలేని శారీరక శ్రమ చేయటానికి సిద్ధంగా ఉండి, పని అడిగిన పెద్దవాళ్ల (18సం॥లు నిండిన)కు ప్రభుత్వం పని కల్పించాలి. ఈ విధంగా ప్రతి గ్రామీణ కుటుంబం ఒక సంవత్సరకాలంలో కనీసం వంద రోజులపాటు ఉపాధి పొందవచ్చు. ఈ పనికి కనీస కూలీకి తక్కువ కాకుండా కూలీ చెల్లించాలి.

❖ నీటి నిల్వ, సంరక్షణ
❖ కరువుకు తట్టుకునే పనులు (అడవుల వృద్ధి, చెట్ల పెంపకం)
❖ షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన భూములకు సాగునీటి సౌకర్యాలు కల్పించటం
❖ చెరువుల పూడికతీతతో సహా సంప్రదాయ నీటి మడుగుల పునరుద్ధరణ

- మీ ఉపాధ్యాయుల సహాయంతో పైన ఇచ్చిన పనులు ఏమి సూచిస్తాయో తెలుసుకోండి.
- మీ ఊరు/ పట్టణానికి దగ్గరలో ఉపాధి హామీ చట్టం కింద జరుగుతున్న పని స్థలాన్ని సందర్శించండి. అక్కడ వాళ్లతో మాట్లాడి దాని గురించి రాయండి.
- షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన భూములకు సాగునీటి సౌకర్యం కల్పించటానికి ఉపాధి హామీ చట్టం ఎందుకు ప్రాధాన్యతను ఇస్తోంది?
- గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధుల రక్షణలో ఉపాధి హామీ చట్టాన్ని ఒక పెద్ద ముందడుగుగా ఎందుకు పేర్కొంటున్నారు?

### సామాజిక తనిఖీలో ఒక నివేదిక

2009 ఫిబ్రవరిలో అనంతపురం జిల్లా, రాచానపల్లెలో సామాజిక తనిఖీ బృందం ఇచ్చిన నివేదికలోని అంశాలు:

- చెల్లింపులు సరిగానే జరిగాయి,
- ఫీల్డ్ అసిస్టెంట్ తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాడు,
- పని ప్రదేశం వద్ద కాంట్రాక్టర్లు లేరు,
- కానీ, పనిలో నాణ్యత లోపించింది.

ఇవి కాకుండా తనిఖీ ద్వారా వెల్లడైన మరికొన్ని విషయాలు:

దున్నటం, చెట్లు పెంచటం పని 5.6 ఎకరాలలోనే జరిగింది, కానీ ఈ పనికి సంబంధించిన కొలతల పుస్తకంలో దున్నటం, చెట్లు పెంపకం పని 15 ఎకరాలలో జరిగిందని పేర్కొని ఉంది. అంటే 9.04 ఎకరాలకు అదనంగా చెల్లింపులు జరిగాయి. దీనికి పాత టెక్నికల్ అసిస్టెంట్ రాంమోహన్ బాధ్యుడు.

రికార్డుల ప్రకారం సిండికేట్ నగర్‌కి చెందిన రమాదేవికి గులకరాళ్ల కట్టలు వేసినందుకుగాను 6 రోజులకు 400 రూపాయలు చెల్లించాలి, కానీ ఆమెకు ఈ మొత్తం ఇంకా చెల్లించలేదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గ్రామీణాభివృద్ధి శాఖలో సామాజిక తనిఖీ, జవాబుదారీతనం, పారదర్శకత సంఘం సామాజిక తనిఖీకి బాధ్యత వహిస్తోంది. ఈ సంఘం వెబ్‌సైట్‌లో మీ గ్రామానికి సంబంధించిన సామాజిక తనిఖీ సమాచారాన్ని పొందవచ్చు:

http://125.17.121.162/socialaudit/login.jsp

## సరసమైన ధరలకు అందుబాటులో ఆహారం

*"తన ధాన్యాగారంలో సగం మొత్తాన్ని రాజుగారు కష్టకాలంలో ఉన్న గ్రామీణ ప్రజల కోసం ఉంచి మిగిలిన సగం వాడుకోవాలి. ప్రతి సంవత్సరం పాత సరుకు వాడుకుని కొత్త సరుకు నిల్వచేయాలి."*

*అర్థశాస్త్రం (2-15. 22-23)*
*కౌటిల్యుడు, క్రీ.పూ 4వ శతాబ్దం*

ఉపాధి కల్పించటంతోపాటు ప్రభుత్వం ప్రతి ఒక్కరికి సరసమైన ధరలలో ఆహారం అందుబాటులో ఉండేలా చూడాలి. నిత్యావసర సరుకుల ధరలు ఎక్కువగా ఉంటే ఉపాధి, ఆదాయాల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. మౌలిక అవసరాలు సరసమైన ధరలకు అందించటానికి ప్రభుత్వం చేసే ప్రయత్నాలలో చౌకధరల దుకాణాల ద్వారా ఆహార ధాన్యాలను తక్కువ ధరకు అందించటం ఒకటి. ప్రభుత్వం రైతులనుంచి ఆహారధాన్యాలను కొని వాటిని చౌక ధరల దుకాణాలకు సరఫరా చేస్తుంది. ఈ దుకాణాలు ఆహారధాన్యాలను (వీటితోపాటు పంచదార, పప్పులు, వంటకి కిరసనాయిలు వంటి అత్యవసర వస్తువులను) ప్రజలకు అమ్ముతాయి. బజారులో ఉండే ధరల కంటే చౌక ధరల దుకాణంలో ధరలు తక్కువగా ఉండాలి.

చౌక ధరల దుకాణాల ద్వారా ఆహారధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువులు సరఫరా చేయటాన్ని ప్రజా పంపిణీ వ్యవస్థ [Public Distribution System (PDS)] అంటారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ఈ పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. పట్టణ, పల్లె ప్రజలందరికీ ఆహార ధాన్యాలను చేర్చటంలో ఇది కీలక పాత్ర వహించింది. దీని పనితీరులో కొన్ని సమస్యలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో ఈ దుకాణాలను సమయానికి, లేదా క్రమం తప్పకుండా తెరవరు. ఎవరూ కొనగూడదన్న ఉద్దేశంతో ఆహార ధాన్యాలను కల్తీ చేసే సందర్భాలు ఉన్నాయి. ప్రజలకి కాకుండా ఇతర దుకాణాలకు సరుకులు అమ్మే చౌకధరల దుకాణాదారులు ఉన్నారు. దీంతో పేద ప్రజలతో సహా చాలామందికి ఆహారధాన్యాలు అందవు. భారతదేశంలోని పేద రాష్ట్రాలు, పేద ప్రాంతాలలో సాధారణంగా వీటి పని తీరు ఆశించిన మేరకు లేదు.

LEQAUH

- 'నగదు బదిలీ పథకం' ప్రజాపంపిణీ పథకానికి సరైన ప్రత్యామ్నాయమని మీరు భావిస్తున్నారా?

## ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక తనిఖీ

LETXIE

ప్రభుత్వ ఉపాధి పథకాలకు సంబంధించి అవినీతి ఆరోపణలు తరచు వినిపిస్తుంటాయి. ఈ పథకాల ప్రయోజనాలు చెప్పినదాంట్లో చాలా తక్కువ మాత్రమే పేద ప్రజలకు అందుతున్నాయి. గుత్తేదారులు, అధికారం ఉన్న వాళ్లే ఎక్కువ లబ్ధి పొందుతున్నారని చెబుతారు. అవినీతిని తగ్గించటానికి మహాత్మా గాంధి జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం (MNREGA)లో సామాజిక తనిఖీ తప్పనిసరి చేశారు.

సామాజిక తనిఖీ ద్వారా గ్రామ ప్రజలు కార్యక్రమాన్ని, దాని అమలు తీరును పరిశీలిస్తారు. పథకం/కార్యక్రమం ప్రయోజనాలు ఎవరికైతే ఉద్దేశించబడ్డాయో వారికి అందాయో, లేదో ఇది తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ అనుభవం చెప్పుకోదగినది. పౌర సమాజ చొరవకు మద్దతునివ్వటంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రియాశీలక పాత్ర పోషించింది.



1. సాధారణంగా ఉపాధి హామీ చట్టం వల్ల లబ్ధిపొందే కుటుంబాలకు చెంది, చురుకుగా ఉండే యువతకు ముందుగా సామాజిక తనిఖీ ప్రక్రియలో శిక్షణ ఇస్తారు.



2. ఈ యువత బృందాలుగా ఏర్పడి ఇంటింటికి వెళతారు, మస్టరు/ హాజరు జాబితాలను సరిచూస్తారు, పని జరుగుతున్న ప్రదేశాలను తనిఖీ చేస్తారు, కార్మికులు చేసే వ్యాఖ్యలను నమోదు చేస్తారు, ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహిస్తారు.




3. తరవాత మండల హెడ్‌క్వార్టర్స్‌లో పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తారు. ఈ సభకు అన్ని గ్రామాలనుంచి ప్రజలు, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, పత్రికలు/ టీవీల విలేకరులు, ఉపాధి హామీ చట్ట అధికారులలో సంబంధించినవాళ్లు, సీనియర్ ప్రభుత్వ అధికారులు పాల్గొంటారు.



4. ఈ సమావేశంలో గ్రామాల వారీగా సామాజిక తనిఖీలో కనుగొన్న విషయాలను చదువుతారు. కార్మికులు తమ వాంగ్మూలం ఇస్తారు. లేవనెత్తిన అంశాలకు, చేసిన ఫిర్యాదులకు సంబంధిత అధికారులు సమాధానం ఇస్తారు, తీసుకున్న చర్యలు వివరిస్తారు.



5. ఫిర్యాదులకు సంబంధించి ఎటువంటి చర్యలు, ఎన్ని రోజులలోపు తీసుకుంటారో కూడా అధికారులు వివరించాలి.

6. మండలంలో బహిరంగ సభ జరిగిన తరవాత సామాజిక తనిఖీ బృందాలు ప్రతి 15 రోజులకు ఒకసారి తమ గ్రామాలకు వెళ్లి ఆ సభలో తీసుకున్న నిర్ణయాలు అమలు అయ్యేలా చూస్తారు.

ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక తనిఖీ ద్వారా అక్రమంగా మళ్లించిన నిధులలో చాలావరకు తిరిగి రాబట్టగలిగారు. అనేక సందర్భాలలో తప్పుచేసిన అధికారులు బహిరంగ సభలలోనే కార్మికులకు చెందాల్సిన డబ్బులను 'స్వచ్ఛందంగా' తిరిగి ఇచ్చేసిన సందర్భాలు ఉన్నాయి. తప్పు చేసిన అధికారులపై చర్యలు ఈ సభలోనే మొదలయ్యేవి. ఈ క్రమంలో ఉపాధి హామీ చట్టంలోని అంశాల గురించి కూలీలలో అవగాహన గణనీయంగా పెరిగింది.

ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS)లో కావలసినదల్లా దానిని మెరుగ్గా అమలు చేయటం. కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలలో ఇది బాగా పని చేస్తోంది కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తే దానిని మెరుగుపరచటం సాధ్యమే.

అయితే భారత ప్రభుత్వానికి వేరే ఆలోచనలు ఉన్నాయి. చౌక ధరల దుకాణాలు ప్రధానంగా పేదవాళ్లకే సరుకులు సరఫరా చేయాలని 1997లో నిర్ణయించాయి, మిగిలిన వాళ్లు అధిక ధరలకు మార్కెట్ నుంచి ఆహారధాన్యాలను కొనుక్కోవాలి.

ప్రజా పంపిణీ వ్యవస్థలో ఈ కొత్త విధానాన్ని అమలు చేయటానికి ప్రభుత్వానికి పేదవాళ్లు ఎవరో తెలియాలి. కాబట్టి దారిద్ర్య రేఖకు దిగువన [Below Poverty Line (BPL)] ఉన్న వాళ్లను గుర్తించడానికి సర్వే చేయమని పంచాయితీలను కోరింది. కుటుంబ ఆదాయం, జీవనోపాధి మార్గాలు, రోజూ తింటున్న ఆహారం, బట్టలు, గృహవసతి, వలస, అప్పు వంటి అంశాలను ఈ సర్వే సేకరించి ఒక కుటుంబం పేదరికంలో ఉందో (BPL) లేదో నిర్ణయిస్తుంది. సర్వే ఫలితాల ఆధారంగా మూడు రకాల కార్డులు జారీ చేశారు.

అత్యంత పేద కుటుంబాలకు అంత్యోదయ కార్డులు జారీ చేశారు. వాళ్లకంటే పరిస్థితి కొంత మెరుగైనప్పటికీ పేదవాళ్లుగా పరిగణించబడే వాళ్లకు (BPL) (తెల్ల) కార్డులు ఇచ్చారు. మిగిలిన వాళ్లకి ఎపిఎల్ (గులాబీ) కార్డులు ఇచ్చారు.

LEVJ88

ఒక్కొక్కరికి చౌకధరల దుకాణం నుంచి లభించే సరుకుల మొత్తం, వాటి ధరలు వేర్వేరుగా ఉంటాయి. ఉదాహరణకు అంత్యోదయ కార్డు ఉన్న వాళ్లకి నెలకి కుటుంబానికి 35 కిలోల ఆహారధాన్యాలు (బియ్యం, గోధుమ) ఇస్తారు. BPL కార్డు ఉన్నవాళ్లకి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి వ్యక్తికీ నెలకు 4 కిలోల చొప్పున కుటుంబం మొత్తానికి 20 కిలోలు మించకుండా ఆహార ధాన్యాలు ఇస్తారు. అన్నపూర్ణ పథకం కార్డు కలిగి ఉండి, వయసుమళ్లిన అతి పేదవారికి 10 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తారు.

- కొత్త విధానం వల్ల పేదవాళ్లకు మేలు జరుగుతుందా? మీ సమాధానానికి కారణాలు ఇవ్వండి.
- ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరచటానికి మరికొన్ని సూచనలు చేయండి.



*చిత్రం 17.3 : పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న బాలికలు*

## జీవించే హక్కు కోసం పోరాటం

ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) కొత్త విధానంపై ఎంతో చర్చ జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి అయిదు మందిలో నలుగురు అవసరమైన కనీస కాలరీల కంటే తక్కువ ఇచ్చే ఆహారం తీసుకుంటున్నారని మనకు తెలుసు. 2004 జాతీయ నమూనా సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పది కుటుంబాలలో మూడు కుటుంబాలకు కూడా అంత్యోదయ, BPL కార్డులు లేవు. అంటే అంతకుముందు ప్రజా పంపిణీ వ్యవస్థ వల్ల ప్రయోజనం పొందినవాళ్లు ఇప్పుడు పొందటం లేదు. భూమిలేని కూలీల కుటుంబాలలో చాలా వాటికి BPL కార్డులు లేవు. ఇందుకు విరుద్ధంగా కొన్ని సంపన్న కుటుంబాలకు BPL కార్డులు ఉన్నాయన్న వార్తలొచ్చాయి.

ఈ కొత్త ప్రజా పంపిణీ వ్యవస్థ విధానంలో ఇతర వైరుధ్యాలు కూడా ఉన్నాయి. భారత ప్రభుత్వం వద్ద (రైతుల దగ్గర నుంచి కొన్న) ఆహారధాన్యాలు గుట్టలుగా పడి ఉన్నాయి. ఈ ఆహారధాన్యాలను ఎలకలు తినేసిన, కుళ్ళిపోయిన సందర్భాలు ఉన్నాయి. చౌకధరల దుకాణాలు సరసమైన ధరలకు ఆహార ధాన్యాలను BPL, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులు ఉన్న వాళ్ళకే అమ్ముతాయి కాబట్టి అక్కడ కూడా ఆహారధాన్యాలు నిల్వ ఉండిపోతాయి. ఇంకోవైపున అందరి ఆకలి తీర్చలేకపోతున్నామనే భావన కూడా ఉంది.

భారత రాజ్యాంగం 21వ అధికరణంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కైన జీవించే హక్కు స్పష్టంగా భంగమవుతోంది. ఆహారం లేకుండా జీవించడం ఎలా సాధ్యమవుతుంది? ప్రభుత్వం ఎందుకు బాధ్యత తీసుకోకూడదు? ఆహారధాన్యాలను కుళ్ళబెట్టే బదులు ఉచితంగా ఎందుకు పంపిణీ చేయకూడదు? ఇది న్యాయమైన పరిస్థితేనా? ఇటువంటి ప్రశ్నలు ప్రజలు వేయసాగారు. కొంత కాలానికి ఆహారానికి హక్కు కోసం ప్రజా ఉద్యమం రూపుదిద్దుకుంది. ప్రజలు కోర్టును ఆశ్రయించారు. ఆహారానికి హక్కులో భాగమైన జీవనానికి హక్కును ఉల్లంఘించినందుకు భారత ప్రభుత్వంపై సుప్రీం కోర్టులో పౌరహక్కుల బృందాలు దావాలు వేశాయి. చౌకధరల దుకాణాల వద్ద అన్ని కుటుంబాలకు ఆహార ధాన్యాలు అందించాలని ఈ బృందాలు కోరుతున్నాయి. ప్రస్తుతం లభిస్తున్న దానికంటే ఎక్కువ మోతాదులో ఆహారధాన్యాలు ప్రతి కుటుంబానికీ అందాలని కోరుతున్నాయి.

సుప్రీంకోర్టు తీర్పులు, సాధారణ ప్రజలనుంచి నిరంతర ఒత్తిడి వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థతో సహా అనేక కార్యక్రమాలలో చిన్నవే అయినప్పటికీ కీలకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మారవలసింది ఇంకా ఎంతో ఉంది.

- రేషను దుకాణాలను చౌక ధరల దుకాణాలని కూడా అంటారు. ఎందుకో తెలుసా?

భారతదేశంలో ఆకలి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పనికి హక్కు, ఆహారానికి హక్కు గురించి ఈ అధ్యాయంలో చదివాం. పేదరికం, ఆకలి నుంచి తప్పించుకోవాలంటే పనికి హక్కు, ఆహారానికి హక్కు రెండూ తప్పనిసరిగా ఉండాలి. అయితే పేదరికంనుంచి బయటపడటం, గౌరవప్రదమైన జీవనం గడపటం అంటే ఇంకా ఎన్నో ఉన్నాయి: ఆరోగ్యం, విద్య, గుడ్డ, ఆవాసం, నీరు, పారిశుద్ధ్యం, కాలుష్యంలేని గాలి, ఇంధనవనరులు, మౌలిక సదుపాయాలు, వివక్షకు గురి కాకుండా ఉండటం, ప్రజాస్వామ్యంలో పాల్గొనటం. ఈ ఆర్థిక, సామాజిక హక్కులు కూడా జీవించే హక్కులో భాగమే. ఈ విస్తృతమైన అవగాహన దిశగా సమాజం ముందుకు వెళ్లాలి.

## కీలక పదాలు

1. పోషకాహార లోపం 2. వ్యవసాయాభివృద్ధి 3. ఆదేశిక సూత్రాలు
4. ప్రజాపనులు 5. సామాజిక తనిఖీ 6. దారిద్ర్యరేఖకు దిగువన
7. ప్రజాపంపిణీ వ్యవస్థ

LEZ6H5

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. తీవ్రమైన ఆకలిగా పేదరికం అన్న నేపథ్యంలో కింద వాక్యాలలో సరైనవి ఏవి? $AS_1$

   అ. రోజుకి ఒకసారే ఆహారం తీసుకోవటం

   ఆ. అవసరమైనన్ని కాలరీలు కంటే తక్కువ ఉన్న ఆహారం తీసుకోవటం

   ఇ. నాగలితో దున్నే వ్యక్తికీ, వరికోత యంత్రం నడిపే వ్యక్తికీ ఒకే మోతాదులో కాలరీలు ఉన్న ఆహారం అవసరం.

   ఈ. దుకాణదారుడు కంటే పొలం దున్నే వ్యక్తికి ఎక్కువ కాలరీలు కావాలి.

   ఉ. ఆకలితో ఉన్న కారణంగా వ్యక్తి రోగనిరోధక శక్తి తగ్గుతుంది.

2. ఈ అధ్యాయంలో పేదరికానికి పేర్కొన్న ప్రధాన కారణాలను గుర్తించండి. $AS_1$
3. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థ వంటి పథకాలలోని ప్రధానమైన అంశాలు ఏమిటి? పేదరికంలోని ఏ అంశాలను అవి పరిష్కరించటానికి పూనుకుంటున్నాయి? చౌకధరల దుకాణాలు ఎందుకు అవసరం? $AS_4$
4. ఉపాధి లేని ప్రజలకే భూమి, పశువులు, దుకాణాలు వంటి ఆస్తులు సాధారణంగా ఉండవు. ఎందుకు? $AS_1$
5. పేజి నెం. 202లో "జీవించే హక్కు కోసం పోరాటం" శీర్షికలోని మొదటి రెండు పేరాలు చదివి వ్యాఖ్యానించండి. $AS_2$
6. మీ గ్రామంలో PDS పథకం నిర్వహణపై జిల్లా కలెక్టర్‌కు ఒక లేఖ రాయండి. $AS_6$

### ప్రాజెక్టు:

**మీ ప్రాంతంలోని చౌకధరల దుకాణాన్ని సందర్శించి ఈ దిగువ విషయాలు తెలుసుకోండి:**

- చౌకధరల దుకాణం ఎప్పుడు తెరిచి ఉంటుంది?
- చౌక ధరల దుకాణంలో ఏ సరుకులు అమ్ముతున్నారు?
- రకరకాల కార్డులు ఉన్న విధానం మీకు కనపడిందా?
- (పేదరికంలోని కుటుంబాలకు) చౌక ధరల దుకాణాలలో బియ్యం, పంచదారల ధరలను కిరాణా దుకాణాలలో ధరలతో పోల్చండి (కిరాణా దుకాణంలో సాధారణ రకం బియ్యం ధర అడగండి).
- చిత్రం 17.3 చూశారు కదా! మీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు గురించి మీ అభిప్రాయం రాయండి.

పాఠం 18

# హక్కులు - అభివృద్ధి

LF3TK2

## మానవ హక్కుల భావన

గత 300 సంవత్సరాలలో ప్రజాస్వామ్యం మాదిరిగా 'మానవ హక్కులు' అనే భావన ప్రపంచమంతటా చోటు చేసుకుంది. మానవులందరికీ వాళ్ల కులం, మతం, దేశం వంటి వాటితో సంబంధం లేకుండా, ఆడా, మగా అన్న భేదం లేకుండా, వాళ్లు చట్టాన్ని గౌరవిస్తున్నారా నేరస్తులా అన్నదానితో సంబంధం లేకుండా ఏ ఒక్కరు ఉల్లంఘించగూడని కొన్ని మౌలిక హక్కులు ఉన్నాయి. పేదరికం నేపథ్యంలో ఈ హక్కులలో ముఖ్యమైనవి గౌరవ ప్రదంగా జీవనం గడిపే హక్కు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యపు హక్కు. జీవించే హక్కు అంటే మానవ గౌరవానికి భంగం కలగకుండా జీవించే హక్కు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యపు హక్కు అంటే తమకు నచ్చినది (ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించకుండా) ఎటువంటి భయమూ లేకుండా మాట్లాడటం, నమ్మటం, చేయటం తాము ఎంచుకున్న విధంగా జీవించటం.



*చిత్రం 18.1 : "ఇది వర్షాలు కురవని సంవత్సరం".*

*13 సంవత్సరాల పవన్ అనే బాలుడు వాళ్ల అమ్మతో కలిసి ఎంతోమంది భక్తులు సందర్శించే ఒక పుణ్యస్థలంలో ఉంటాడు. పవన్ గుడిబయట నిలబడి భక్తుల కాళ్లమీద పడి అడుక్కుంటాడు. అతడికి కొంతమంది మిగిలిపోయిన పాచి పదార్థాలు తినటానికి ఇస్తారు. కొన్నిసార్లు అతడు బరువైన సామాను మోస్తాడు, అందుకు వాటి యజమానులు కొంత డబ్బు ఇస్తారు.*

*అతడి తల్లి వేరొకరి ఇంటిలో పని చేస్తుంది. ఆమె రోజుకి 12 గంటలపాటు, నెలలో 30 రోజులూ పనిచేస్తుంది. యజమానురాలే కాకుండా, చిన్న పిల్లలు సైతం ఆమెను ఇది చెయ్యి, అది చెయ్యి అని చెబుతుంటారు. అందరూ తిన్న తరవాత మిగిలిన ఆహారం ఆమెకు పెడతారు. యజమానుల ముందు ఆమె కూర్చోటానికి వీలు లేదు. వాళ్లతో భయభక్తులతో మాట్లాడాలి. చిన్న చిన్న తప్పులకు, ఆలస్యానికి ఆమెను తరచు అవమానిస్తుంటారు. ఆమె కన్నీళ్లతోపాటు కోపాన్ని కూడా దిగమింగుకోవాలి. లేదంటే పని నుంచి తీసేస్తారు.*

- పై ఉదాహరణలోని పవన్, అతడి తల్లి గౌరవప్రదమైన జీవనం గడుపుతున్నారా?
- దేని ద్వారా వాళ్లకి గౌరవప్రదమైన జీవనం దొరుకుతుంది?
- తమకు కావలసింది చేసే స్వేచ్ఛ పవన్‌కు కానీ, అతడి తల్లికి కానీ ఉందా?
- పవన్, అతడి తల్లి ఈ విధమైన జీవితం గడపటానికి ఎవరు కారణం? వాళ్ల పరిస్థితికి వాళ్లనే నిందించాలా?
- గౌరవప్రదమైన, స్వేచ్ఛతో కూడిన జీవితం పవన్, అతడి తల్లి జీవించగలిగేలా చూడాల్సిన బాధ్యత ఎవరిది?

గత అధ్యాయాల్లో మనం పేదరికానికి సంబంధించిన కొన్ని అంశాలను చూశాం. పేదరికం అంటే ఆకలిగొనటం ఒక్కటే కాదు. జీవనోపాధికి భూమి వంటి వనరులు లేదా చదువు లేకపోవటం, లాభసాటియైన ఉపాధి లేకపోవటం, జీవితానికి మౌలిక అవసరాలైన ఆరోగ్య సేవలు, విద్య, ఆహారం వంటివి లేకపోవటం, తమ సమస్యలు వినిపించే అవకాశం లేకపోవటం, ప్రభుత్వ కార్యక్రమాలను, విధానాలను ప్రభావితం చేయలేకపోవటం.

ప్రజలు పేదరికం నుంచి ఎలా బయటపడగలరు? పేదరికం నుంచి బయట పడటానికి కావలసిన వనరులు, సౌకర్యాలను ఎలా సమకూర్చుకోగలరు?

వాళ్ల తరపున ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. ప్రభుత్వంలో ఉన్నవాళ్లు పేద ప్రజల సంక్షేమానికి నిధులు కేటాయించడం అంటే దాతృత్వం చూపటం అనుకుంటారు. వనరులు కేటాయించటం అంటే ప్రభుత్వంపై భారమని అనుకుంటారు. అయితే ఇది ప్రజలందరి ప్రాథమిక హక్కు అన్న విషయం మనం గుర్తించినపుడే, ఈ హక్కులు అందేలా చూడటం ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యం అవుతుంది. అంతేకాకుండా వీటిపై ఖర్చు చేసే వనరులను దాతృత్వంగానో, వృథాగానో పరిగణించటంగా కాకుండా భారతదేశ భవిష్యత్తుకు అవసరమైన పెట్టుబడిగా భావిస్తారు. అందుకే ప్రజలందరికీ ఆర్థిక, సంక్షేమ హక్కులను ఇచ్చే చట్టాలు చేయటం ముఖ్యమవుతుంది.

1945లో ఐక్యరాజ్యసమితి ఏర్పడినప్పుడు స్వేచ్ఛ, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన హక్కులు మానవులందరి ప్రాథమిక హక్కులుగా పరిగణించారు. చాలా దేశాలు స్వేచ్ఛకు సంబంధించిన హక్కులకు హామీ ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాయి కానీ ఆర్థిక సంక్షేమానికి సంబంధించి ఉపాధి, న్యాయబద్ధమైన కూలీ, అందుబాటులో విద్య, ఆరోగ్య సేవలు, వసతి, ఆహారం వంటివి హక్కులుగా ఇవ్వటానికి సిద్ధంగా లేవు. 1993లో రెండు రకాల హక్కులు ముఖ్యమని అన్ని దేశాలు అంగీకరించాయి.

ప్రజలకు ఆహారం, విద్య, వైద్యసేవలు, వసతి, ఉపాధి వంటి వాటికి హక్కు ఉందని అన్నామంటే ఏమిటి? దేశంలో ఉంటున్న ప్రజలందరికి వాటిని అందించే బాధ్యత ప్రభుత్వానిది అని దాని అర్థం. పౌరులందరికీ వీటిని ప్రభుత్వం అందించాలి. ఒకవేళ అవి అందకపోతే ప్రజలు కోర్టుకు వెళ్లి తమ హక్కులు పొందేలా చేయవచ్చు. పవన్ వంటి వాళ్లు తమకు ఆహారం, ఇతర అవసరాలు తీరటం వంటివి ఉన్నవాళ్ల దయాదాక్షిణ్యాలుగా కాక తమ ప్రాథమిక హక్కుగా చూడగలుగుతారు. ఆహారం, విద్య, వసతి, వైద్యం వంటివి తమ హక్కుగా వాళ్లు కోరగలుగుతారు.

ఈ భావనలకు అనుగుణంగా ప్రభుత్వం చట్టాలు చేసినప్పుడే ఇది సాధ్యమవుతుంది. గత కొద్ది సంవత్సరాలుగా భారత ప్రభుత్వం వీటికి సంబంధించి అనేక చట్టాలు చేసింది. ఈ చట్టాలు సమాచార హక్కు, ఉపాధి, పాఠశాల విద్యకు సంబంధించినవి. అందరికీ ఆహార హక్కును ఇచ్చే చట్టం రూపుదిద్దుకునే క్రమంలో ఉంది. వీటిల్లో కొన్ని చట్టాల గురించి మరింత వివరంగా తెలుసుకుందాం.

## అవినీతిని ఎదుర్కోటానికి సమాచారం అవసరం

ప్రభుత్వ వ్యవస్థ చాలా పెద్దది, సంక్లిష్టమయినది. విధానాలు, పథకాలు సక్రమంగా అమలు అయ్యేలా చూడటం చాలా కష్టం. పేదల ప్రయోజనాల కోసం, పేదరికం నిర్మూలన కోసం రూపొందించిన కార్యక్రమాలు సాధారణంగా వాళ్లకు చేరవు, నిధులు మళ్లింపబడతాయి. దీనికి ప్రధాన కారణం అవినీతి. ప్రభుత్వ కార్యక్రమాల గురించి, అవి అమలు అయ్యే తీరు గురించి ప్రజలకు సరైన సమాచారం లేకపోవటం అవినీతి ప్రబలటానికి ఒక ప్రధాన కారణమవుతోంది.

ప్రభుత్వ, స్థానిక సంస్థలు డబ్బులు ఎలా ఖర్చు చేశాయో తనిఖీ చేసే అవకాశం ప్రజలకు లేదు. ఉదాహరణకు పురపాలక సంస్థ లేదా పంచాయతీ ఏదైనా కట్టడం నిర్మిస్తే గుత్తేదారుని ఎంపిక చేసిన విధానం, ఉపయోగించిన సిమెంటు, ఇటుకల నాణ్యత, ఎన్ని రోజులపాటు కూలిపని జరిగింది వంటి వివరాలు తెలుసుకోవటం సాధ్యమయ్యేది కాదు. ఈ సమాచారాన్ని ప్రజలతో పంచుకునేవాళ్లు కాదు. కానీ ప్రజాస్వామ్యంలో ప్రజల సంక్షేమానికి ప్రజల సొమ్మే ఉపయోగిస్తున్నారు, కాబట్టి ఈ డబ్బు ఎలా వినియోగం అవుతోందో తెలుసుకునే హక్కు వాళ్లకు ఉంది. అంతకు ముందు శాసనసభలలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు మాత్రమే ఈ సమాచారాన్ని అడిగి అవినీతిని అరికట్టాలని భావించేవాళ్లు.

- ఒక రోడ్డు లేదా ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన సమాచారాన్ని గుత్తేదారులు ఎలా నిర్వహిస్తున్నారో చర్చించండి.
- ఈ సమాచారాన్ని సరిచూడటం ద్వారా జవాబుదారీతనాన్ని ఎలా పెంచవచ్చు?

## ఉద్యమం ఎలా మొదలైంది

LF5F9V

రాజస్థాన్‌లో కొంతమంది మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన (MKSS) పేరుతో సంఘటితమై వనికి ఆహార వథకానికి సంబంధించి సమాచారం అడగసాగారు. ప్రభుత్వం నుంచి ప్రజలు సమాచారం పొందటానికి ఎటువంటి చట్టబద్ధ హక్కు లేదు. మొదట్లో కొంతమంది అధికారుల సహాయంతో సంబంధిత పత్రాలను సేకరించి బహిరంగ సమావేశాల్లో ప్రజలు వీటిని తనిఖీ చేయటం మొదలుపెట్టారు. కొంతకాలం తరవాత ఈ వివరాలు ఇవ్వటానికి అధికారులు నిరాకరించారు. ఫలితంగా ఈ విషయమై మూడు సంవత్సరాల పాటు ప్రదర్శనలు, ఊరేగింపులతో ఉద్యమించారు. ఈ సమాచారం తమ సంక్షేమానికి కీలకమైనది కాబట్టి దానిని వెల్లడి చేయాలని ప్రజలు అడిగారు. వాళ్ల వాదనలు ఇలా ఉన్నాయి:

- మానవ అభివృద్ధి, ప్రజాస్వామిక హక్కులకు సమాచారం కీలకమైనది. అధికారిక పత్రాల రూపంలో తగినంత సమాచారం ఉన్నప్పుడే ప్రజలు పాలనలో భాగస్వాములై, న్యాయమైన అభివృద్ధి జరిగేలా చూడగలుగుతారు.
- సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండటం వల్ల ప్రభుత్వాలు తమ పనితీరులో మరింత జవాబుదారీగా ఉంటాయి. దీనివల్ల వాటి పనితీరును పర్యవేక్షించటం, అవినీతి జరగకుండా చూడటం సాధ్యమవుతుంది – పేదల మనుగడకు సమాచారం కీలకమైనది.
- సమాచారాన్ని వెల్లడి చేయాల్సి ఉన్నప్పుడు ఎన్నికైన ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ఇష్టం వచ్చినట్లు నిర్ణయాలు తీసుకోవటాన్ని అరికట్టవచ్చు.

ఎన్నో సంవత్సరాల పోరాటం తరవాత అధికారిక సమాచారాన్ని వెల్లడి చేయటాన్ని తప్పనిసరిచేస్తూ 1995లో రాజస్థాన్‌లో ఒక చట్టం చేశారు. ఆతరువాత కాలంలో అనేక రాష్ట్రాలు ఇటువంటి చట్టాలు చేశాయి. జాతీయ స్థాయిలో పార్లమెంటు 2005లో సమాచార హక్కు చట్టం (స.హ.చ.) చేసింది. ప్రస్తుతం సమాచార హక్కును రాజ్యాంగం రెండు ప్రాథమిక హక్కుల కింద – భావప్రకటన స్వేచ్ఛ, జీవించే హక్కుగా గుర్తిస్తున్నారు.

## సమాచార హక్కు చట్టంలోని అంశాలు

సమాచార హక్కు చట్టంలోని కొన్ని అంశాలను తెలుసుకుని అవి ప్రజల సాధికారీకరణకు ఎలా దోహదం చేస్తున్నాయో తెలుసుకుందాం. చట్టం ప్రకారం ఏ వ్యక్తి అయినా ప్రభుత్వ ఆదేశాలు,

**ప్రజా విచారణ:** 'జన్ సున్‌వాయి' (అంటే ప్రజా విచారణ) పేరుతో MKSS (మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్) సమావేశాలు నిర్వహించేది. పేదలలో చాలామంది ప్రభుత్వ పత్రాలను తమంతట తామే చదవలేరన్నది వాస్తవం. ఊరిలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆ పత్రంలో ఏమి ఉందో తెలుసుకోవాలని ఉంటుంది. కాబట్టి వీటిని పైకి చదివి వినిపించేవాళ్లు, వివరించేవాళ్లు. చేతిపంపు వేయటానికి ఎవరెవరికి కూలీ చెల్లించారో మస్టర్/హాజరు జాబితా తెలియచేస్తుంది. మస్టర్ జాబితాలో పేర్లు ఉన్నవాళ్లు ఆ సమయంలో ఊళ్లో ఉన్నారో, లేక వలస వెళ్లారో ప్రజలు చెప్పగలుగుతారు, లేదా మస్టర్‌లో పేర్కొన్న మొత్తం వాళ్లకు చెల్లించారో లేదో చెప్పగలుగుతారు. దీని ద్వారా ఏదైనా అవినీతి జరిగి ఉంటే అది వెల్లడవుతుంది. ఇటువంటి సమావేశాల ద్వారా ప్రజలు కార్యాచరణకు పూనుకునేవాళ్లు. పత్రాలలో ఉన్న సమాచారం గురించి వివరించటానికి, సమర్థించుకోటానికి అధికారులకు కూడా అవకాశం ఇచ్చేవాళ్లు. ఈ సమావేశాల్లో జిల్లా పాలనా యంత్రాంగం, పంచాయితీ అధికారులు కూడా పాల్గొనేవాళ్లు. అవినీతిని గుర్తించినపుడు సంబంధిత వ్యక్తులమీద కేసులు నమోదు చేసేవాళ్లు.



*చిత్రం 18.2 : MKSS సమావేశంలో పాల్గొంటున్న మహిళలు*

నివేదికలు, సలహాలు, లాగ్‌పుస్తకాలు, నియమ, నిబంధనలు, హాజరు పట్టికలు, ఉత్తరాలు వంటివి పొందవచ్చు. ఈ సమాచారం కావాలనుకుంటున్న వ్యక్తి ఆ పత్రాల నకలు తయారుచేయటానికయ్యే ఖర్చుకోసం కొద్ది మొత్తం చెల్లించాల్సి రావచ్చు. అయితే ఈ సమాచారం కోరుకుంటున్న వ్యక్తి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లయితే ఈ మొత్తాన్ని చెల్లించనవసరం లేదు.

చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలు అడిగే సమాచారానికి స్పందించే ఒక అధికారి ఉండాలి. అతనిని/ ఆమెను సమాచార అధికారి అంటారు. ఈ సమాచార అధికారిపైన అప్పిలేట్

అధికారి ఉంటాడు, సమాచార అధికారి చర్య తీసుకునేలా ఈ పై అధికారి చూడాలి. అదేవిధంగా రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో స్వతంత్ర సమాచార కమిషన్లు ఉండాలి.

అడిగిన సమాచారం ఎంత సమయంలోపు అందచేయాలో చట్టం సూచించింది. దీనివల్ల సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేసే వీలు ప్రభుత్వ శాఖలకు ఉండదు. ఒకవేళ సమయంలోపు సమాచారం ఇవ్వకపోతే అడిగిన వ్యక్తి అతని పై అధికారికి ఫిర్యాదు చేసి తరవాత రాష్ట్ర లేదా కేంద్ర సమాచార కమిషన్ల వద్ద కేసు నమోదు చేయవచ్చు.




*చిత్రం 18.3 : స.హ.చ-2005 ప్రకారం అధికారుల సమాచారం*

- గత సంవత్సర కాలంలో మీ ఉపాధ్యాయులకు విద్యాశాఖనుంచి వచ్చిన ఆదేశాలు, నివేదికలు, సలహాలు, లాగ్ పుస్తకాల వంటివాటి జాబితా తయారు చేయండి. విద్యాశాఖకు అందచేయటానికి పాఠశాల ఎటువంటి రికార్డులు నిర్వహిస్తుంది? మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి రికార్డులు ఎలా నిర్వహిస్తారు?
- రాష్ట్ర సమాచార కమిషన్ సందర్భంలో 'స్వతంత్ర' అన్న పదం ఎందుకు కీలకమైనది?
- ఆరోగ్య శాఖలో సమాచార అధికారిని అడగటానికి ప్రశ్నల జాబితా తయారు చేయండి. (అవసరమైతే 9వ పాఠం చదవండి.)

సమాచార హక్కు చట్టం కింద ప్రజలు ఎవ్వరూ అడగకపోయినా ప్రతి ప్రభుత్వ కార్యాలయం తనంతట తాను కొంత సమాచారాన్ని వెల్లడి చేయాలి. ఈ సమాచారాన్ని ఆయా కార్యాలయ గోడల మీద చూడవచ్చు. మీకు ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్‌లో కూడా సమాచార హక్కు కింద ఆ సంస్థకు సంబంధించి సమాచారం ఉంటుంది. ఈ ప్రభుత్వ శాఖలకు నేరుగాగాని, వెబ్‌సైట్‌కుగాని వెళ్లి ఆ సమాచారాన్ని చూడండి.

### జీవన ప్రమాణాలు మెరుగుపరచటానికి హక్కుల విధానం

గత అధ్యాయంలో ఉపాధి హక్కు, ఆహార హక్కు గురించి చదివాం. వీటిని సాధించటానికి ప్రజా ఉద్యమాలు జరిగాయి. హక్కుల దృష్టికోణం నుంచి వాదించేవాళ్లు ప్రజలు గౌరవప్రదమైన జీవితాలు గడపటానికి ఈ హక్కులు తోడ్పడతాయంటారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరగటానికి ఉపాధి అవకాశాలు కల్పించటం, సరసమైన ధరలకు ఆహారం అందించటం వంటివి ప్రభుత్వం చేపట్టటం, పేదలపట్ల జాలి చూపటం కాదు. అది ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడటానికి, సమాజసంక్షేమాన్ని పెంపొందించటానికి తోడ్పడుతుంది. అయితే ఎన్నికైన ప్రజాప్రతినిధులు మాత్రమే కాకుండా ప్రభుత్వ వ్యవస్థ పనితీరును క్రమం తప్పకుండా పర్యవేక్షించటంలో (గత అధ్యాయంలోని ఉపాధి హామీ పథకంలో మాదిరి) ప్రజలు చురుకైన పాత్ర పోషించాలి.

## ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం (విహచ)

స్వాతంత్ర్య ఉద్యమం గురించి, మితవాదులైన గోపాలకృష్ణ గోఖలే వంటి వాళ్ల గురించి మీరు చదివారు. దేశంలోని పిల్లలందరికి ఉచిత, నిర్బంధ విద్య పొందేవిధంగా చట్టం చేయమని బ్రిటిషు వలస ప్రభుత్వాన్ని 1911లో గోఖలే కోరాడు. కానీ బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించలేదు. దురదృష్టవశాత్తు స్వాతంత్ర్యం వచ్చిన తరవాత కూడా ఇటువంటి చట్టాన్ని చేయలేదు. చివరికి 2002లో విద్యను ప్రాథమిక హక్కుగా పార్లమెంటు గుర్తించింది. విద్యను ప్రాథమిక హక్కుగా చేసిన 86వ రాజ్యాంగ సవరణ 2002లో జరిగింది. 86వ సవరణ ఇలా చెబుతోంది: "ప్రభుత్వం చేసే చట్టం ద్వారా 6 నుంచి 14 సంవత్సరాల మధ్య పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్యను ప్రభుత్వం అందించాలి." 'ఉచిత, నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం, 2009' అనే ఈ చట్టాన్ని అంతిమంగా 2009లో చేశారు.

### విద్యాహక్కు చట్టం–2009

LF92XS

6 నుండి 14 సంవత్సరాల పిల్లలందరికి ఉచిత నిర్బంధ ఎలిమెంటరీ విద్యనందించడానికి ఉద్దేశించబడినది. ఇది ఏప్రిల్ 1, 2010 నుండి అమల్లోకి వచ్చింది.

**చట్టంలోని ముఖ్యాంశాలు:**

- పిల్లలందరికి అందుబాటులో పాఠశాలలను ఏర్పాటు చేయాలి.
- పాఠశాలలకు మౌలిక వసతులను కల్పించాలి.
- పిల్లలందరిని వయస్సుకు తగిన తరగతిలో చేర్పించాలి.
- వయస్సుకు తగ్గ తరగతిలో చేర్చిన తరవాత తోటి వారితో సమానంగా ఉండటానికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి.
- ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సాధారణ పిల్లలతోపాటు విద్య కొనసాగించడానికి తగు వసతులు ఏర్పాటు చేయాలి.
- బడిలో చేర్చుకోవడానికి ఎలాంటి పరీక్షలు నిర్వహించరాదు. ఎటువంటి రుసుము, చార్జీలు వసూలు చేయరాదు.
- బడిలో చేరిన పిల్లల పేరు తీసివేయడం, అదే తరగతిలో కొనసాగించడం చేయరాదు.
- పిల్లల్ని శారీరకంగా, మానసికంగా హింసించరాదు.
- వయస్సు నిర్ధారణ పత్రం, ఇతర ధృవీకరణ పత్రాలు లేవనే కారణం చేత పిల్లలకు బడిలో ప్రవేశాన్ని నిరాకరించరాదు.
- తగిన అర్హతలున్న వారిని మాత్రమే ఉపాధ్యాయులుగా నియమించాలి.
- పిల్లలు నిర్దేశించిన సామర్థ్యాలు సాధించేలా బోధనాభ్యసనం, మూల్యాంకనం ఉండాలి.
- ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పిల్లలకు ఎలాంటి బోర్డు పరీక్షలు నిర్వహించరాదు.
- పద్నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికినీ, ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పాఠశాలలో పిల్లలు కొనసాగవచ్చును.
- బలహీనవర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు ఏవిధమైన వివక్షతకు గురికాకుండా చూడాలి.
- రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలకు అనుగుణంగా, విద్యార్థులను భయం, ఆందోళనకు గురిచేయని రీతిలో వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే పాఠ్య ప్రణాళిక, మూల్యాంకన విధానాలను రూపొందించాలి.

6 నుంచి 14 సంవత్సరాల మధ్య పిల్లలందరికీ ఉచిత విద్యను పొందే హక్కు ఉందని విద్యాహక్కు చట్టం తెలియచేస్తుంది. పిల్లల పరిసరప్రాంతాలలో తగినన్ని పాఠశాలలు నిర్మించటం, సరైన అర్హతలున్న టీచర్లను నియమించటం, అవసరమైన సౌకర్యాలన్నింటినీ కల్పించటం వంటి పనులను ప్రభుత్వం

చేయాలి. విద్య పిల్లల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడాలని, చదువు పిల్లలను కేంద్రంగా చేసుకుని కృత్యాల ద్వారా, అన్వేషణ, పరిశోధన, ఆవిష్కరణ పద్ధతుల ద్వారా సాగాలని చట్టం చెబుతోంది. పిల్లలు మాతృభాషలో చదువు నేర్చుకోవాలని, వాళ్లు భయం, విచారం, ఆందోళనలు లేకుండా తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచాలని కూడా చట్టం చెబుతోంది.

పరిసర ప్రాంతాలలో పాఠశాలలు అందుబాటులో లేకపోయినా, పాఠశాలల్లో బోధనకు తగినంతమంది టీచర్లు లేకపోయినా, బోధన-అభ్యసన పరికరాలు తగినన్ని అందుబాటులో లేకపోయినా, పిల్లలను కొట్టినా, భయభ్రాంతుల్ని చేసినా అటువంటి సందర్భాలలో అధికారులపై పిల్లలు లేదా పెద్దవాళ్లు ఫిర్యాదు చేయవచ్చు.

- మీ బడి ఈ ప్రామాణికాలకనుగుణంగా ఉందా?
- అవసరమైతే మీ బడి పనితీరుపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలుసుకోండి.

LFCPLP

### కీలక పదాలు

1. మానవ హక్కులు
2. సమాచార హక్కు చట్టం
3. విద్యాహక్కు చట్టం
4. స్వేచ్ఛ

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. తప్పు వాక్యాలను సరిదిద్దండి. $AS_1$

   అ) ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించాలి.

   ఆ) పథకాల అమలును కేవలం ఎన్నికైన ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించేలా ప్రజలు చూడాలి.

   ఇ) సమాచార అధికారులు ఇష్టం వచ్చినంత కాలం సమాచారాన్ని వెల్లడి చేయకుండా ఉండవచ్చు.

   ఈ) వివిధ పత్రాలు చూడటం ద్వారా కార్యక్రమాలు అవినీతి లేకుండా జరుగుతున్నాయని గుర్తించవచ్చు.

2. "అవినీతిని ఎదుర్కోవడానికి సమాచారం అవసరం" శీర్షిక కింద గల పేరా చదివి దిగువ ప్రశ్నకు జవాబివ్వండి. $AS_2$

   అ) మీ ప్రాంతంలోని ఒక ప్రభుత్వ కార్యక్రమం అమలుతీరును పరిశీలించి నివేదికను తయారు చేయండి.

3. సమాచార హక్కు చట్టం (స.హ.చ.) ద్వారా సాధించిన విజయాలను వార్తాపత్రికల నుండి సేకరించి మీ తరగతిలో చెప్పండి. $AS_3$
4. విద్యాహక్కు చట్టం బాలలకు వరం వంటిది. వివరించండి. $AS_1$
5. మీకు ఇంకా ఏమైనా హక్కులు అవసరమని భావిస్తున్నారా? అవి ఏమిటి? ఎందుకు? $AS_4$
6. సమాచార హక్కు చట్టం ప్రకారం మీ పాఠశాల గురించి ప్రధానోపాధ్యాయుడిని ఏ సమాచారం అడుగుతారు? $AS_4$
7. అవినీతిని ఎదుర్కోవడానికి సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుందని ఎలా చెప్పగలవు? $AS_6$

పాఠం 19

# సాంఘిక, మత సంస్కరణోద్యమాలు

ఏడవ తరగతిలో మీరు చదివిన భక్తి ఉద్యమంలోని ముఖ్య అంశాలను గుర్తుకుతెచ్చుకోండి. హిందువులు, ముస్లింలలోని సనాతనత్వాన్ని విమర్శిస్తూ భక్తి సాధువులు దేవుడు ఒక్కడేనని, మనుషులంతా సమానమని చాటారు. ఈ భావనలు 18, 19వ శతాబ్దాలలో మరింత బలపడ్డాయి.

ప్రస్తుతం ఈ పుస్తకాలు అందరూ చదువుకోటానికి అందుబాటు లోకి వచ్చాయి.

LFEBBI



విలియం జోన్స్



మాక్స్ ముల్లర్

## క్రైస్తవ ప్రచారకులు, ప్రాచ్య పండితులు

యూరోపియన్ కంపెనీలతో పాటు అనేకమంది క్రైస్తవ మతప్రచారకులు భారతదేశంలో క్రైస్తవ మతాన్ని బోధించటానికి వచ్చారు. అప్పటి స్థానిక మత ఆచారాలను, నమ్మకాలను వాళ్లు తీవ్రంగా విమర్శించి క్రైస్తవ మతం పుచ్చుకోమని ప్రజలకు బోధించసాగారు. అదే సమయంలో వాళ్లు అనేక విద్యాసంస్థలు, ఆసుపత్రులు నెలకొల్పారు. పేదలు, అవసరమున్న ప్రజలకు సేవ చేసే ఉద్దేశంతో దాతృత్వపనులు చేపట్టారు. ఇది ప్రజలలో కొత్త ఆలోచనలు రేకెత్తడానికి దోహదపడింది.

అనతికాలంలోనే ఈ మత ప్రచారకులకూ, హిందు, ఇస్లాం మతనాయకులకూ మధ్య తమతమ మత భావనలను సమర్థించుకునే చర్చలు మొదలయ్యాయి. ఈ చర్చల వల్ల ప్రజలకు ఎదుటివాళ్ల ఆలోచనలు తెలియటమే కాకుండా తమతమ మతాలలోని మౌలిక సూత్రాలను తరచి చూసేలా చేసింది. అనేక యూరోపియన్ పండితులు భారతదేశ ప్రాచీన సాహిత్యాన్ని చదివి, అనువదించి, పుస్తకాలుగా ప్రచురించారు. (ప్రాచ్య దేశాల పుస్తకాలు చదివారు కాబట్టి వాళ్లను 'ప్రాచ్య పండితులు' అనేవారు.)


సంస్కృత, తమిళ, తెలుగు, పర్షియన్, అరబిక్ పురాతన పుస్తకాలు ఐరోపా భాషలలోకి అనువదించడంతో దేశ సంపన్న, వైవిధ్యభరిత సాంస్కృతిక వారసత్వాన్ని అందరూ గుర్తించారు. వారి మతాలలోని తమ భావనలను కొత్తగా వ్యాఖ్యానించటానికి వీలు కలిగింది.

యూరోపియన్లు భారతదేశంలో అచ్చు యంత్రాన్ని ప్రవేశపెట్టారు. దీనివల్ల ఎన్నో వార్తాపత్రికలు, ఇతర పత్రికలు ప్రచురించబడ్డాయి. అనేక భారతీయ భాషలలో సైతం పుస్తకాల ప్రచురితమయ్యాయి. దీని ఫలితంగా అనేకమందికి చాలా తక్కువ ధరకు పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ వార్తాపత్రికలు, పుస్తకాలు ప్రజలలో చర్చలకు, వాదోపవాదాలకు దోహదపడ్డాయి. పత్రికలు, పుస్తకాలు అధిక సంఖ్యాక ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

## బ్రహ్మసమాజం, బెంగాల్‌లో మతపర ఉద్యమాలు

LFHXZF

రాజా రాంమోహన్ రాయ్ బెంగాల్‌లో 1772లో పుట్టాడు. అతడు సంస్కృతం, పర్షియన్, ఇంగ్లీషు భాష లలో పండితుడు. అతడికి అరబిక్, లాటిన్, గ్రీకు భాషలు కూడ తెలుసు.



రాజా రాంమోహన్

అతడు హిందూ, ఇస్లాం, క్రైస్తవ, సూఫి వంటి అనేక మత సిద్ధాంతాలను చదివాడు. అనేక పుస్తకాలు చదవటం వల్ల అతడికి దేవుడు ఒక్కడే అన్న నమ్మకం కలిగింది. విగ్రహారాధన, బలులు ఇవ్వటం సరికాదని అతడికి అనిపించింది. అన్ని ప్రముఖ మతాలు ఒకే నమ్మకాన్ని కలిగి ఉన్నాయని, ఇతరుల మతాలను విమర్శించటం సరికాదని అతడు భావించాడు. హేతుబద్ధంగా ఉన్నప్పుడు, ప్రజలకు ప్రయోజనకరంగా ఉన్నప్పుడు మాత్రమే మత భావనలను అంగీకరించాలని కూడా అతడు భావించాడు. పూజారుల అధికారాన్ని తిరస్కరించి తమ మతంలోని మూల గ్రంథాలను చదవమని ప్రజలను అతడు కోరాడు. ముద్రణలోని కొత్త సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకుని అధిక సంఖ్యలో ప్రజలకు చేరటానికి అతడు తన భావాలను పత్రికల్లో, పుస్తకాలుగా ప్రచురించాడు.

1828లో రాంమోహన్ రాయ్ బ్రహ్మ సమాజాన్ని ఏర్పాటు చేశాడు. దేవుడు ఒక్కడే అన్న సిద్ధాంతంపై ఆధారపడిన విశ్వజనీన మతంలో నమ్మకమున్న వాళ్లందరితో కలిసి దీనిని స్థాపించాడు. 1833లో రాంమోహన్ రాయ్ చనిపోయిన తరవాత ఈ ఉద్యమానికి దేవేంద్రనాథ్ టాగూర్, కేశవ చంద్రసేన్ వంటి వాళ్లు నాయకత్వం వహించారు. వీళ్లు దేశమంతటా తిరుగుతూ, ఉపన్యాసాలు ఇస్తూ తమ భావాలను ప్రచారం చేశారు.

కేశవసేన్ మహారాష్ట్రలో తిరుగుతూ ఉపన్యసించిన ఫలితంగా 1867లో బొంబాయిలో ప్రార్థనా సమాజం ఏర్పడింది. బ్రహ్మ సమాజంలాంటి భావనలు ఉన్న దీనిని ఆర్ జి భండార్కర్, ఎం జి రణడేలు స్థాపించారు. దక్షిణ భారతదేశంలో సంస్కరణ ఉద్యమాన్ని ప్రారంభించిన కందుకూరి వీరేశలింగంపైన కూడా సేన్ ప్రభావం చాలా ఉంది.



రామకృష్ణ పరమహంస

అయితే బ్రహ్మ సమాజంలో భేదాభిప్రాయాలు ఏర్పడి చిన్న చిన్న సంస్థలుగా విడిపోయింది. ఇవి తరచు ఒకదానితో ఒకటి ఘర్షణ పడుతుండేవి.

కేశవసేన్ చివరికి కాళీమాత పట్ల భక్తిని ప్రచారం చేసిన రామకృష్ణ పరమహంసకి శిష్యుడయ్యాడు.

స్వామి వివేకానంద కూడా రామకృష్ణ శిష్యుడే. అతడు రెండు ఉద్దేశాలతో రామకృష్ణ మఠాన్ని స్థాపించాడు – సంస్కరణలతో కూడిన హిందూమత పునరుద్ధరణ, జాతి పునఃనిర్మాణానికి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనటం.



స్వామి వివేకానంద

హిందూమతం ఇతర మతాలకంటే గొప్పదని వివేకానంద భావించాడు. అతడు ఉపనిషత్తుల బోధనలకు ప్రాధాన్యతను ఇచ్చాడు. ఇవి అనువాదం అయ్యి, పెద్ద సంఖ్యలో ముద్రింపబడ్డాయి. అదే సమయంలో హిందూమతం మౌఢ్యం, మూఢాచారాలను వదిలిపెట్టి యూరోపియన్ సంస్కృతిలో మంచి అంశాలైన స్వేచ్ఛ, మహిళలపట్ల గౌరవం, పనితత్వం, సాంకేతిక విజ్ఞానం వంటి వాటిని

అవలంబించాలని అతడు కోరుకున్నాడు. ఆసుపత్రులు, పాఠశాలలు, అనాథ శరణాలయాలు వంటి వాటిని ఈ మిషన్ స్థాపించాలనీ, వరదలు, కరువులు వంటి కష్టకాలంలో సహాయ కార్యక్రమాలను అందచేయాలని అతడు కోరుకున్నాడు.

- రాంమోహన్ రాయ్, స్వామి వివేకానందల దృక్పథాలలో పోలికలు, తేడాలు ఏమిటి?
- యూరోపియన్ సంస్కృతి, క్రైస్తవ మతం వల్ల తొలితరం సంస్కర్తలు ఏ విధంగా ప్రభావితమయ్యారు?
- ఈ కొత్త భావాల వ్యాప్తిలో ముద్రణ ఏ విధంగా సహాయపడింది?

## పంజాబ్‌లో ఆర్యసమాజ్

స్వామి దయానంద సరస్వతి (1824-1883) ఒక సాంఘిక సంస్కర్త. అతడు సనాతన, సంప్రదాయాలతో కూడిన హిందూమతాన్ని తిరస్కరించి సన్యాసిగా మారి దేశమంతటా తిరగసాగాడు.

అతడు వేదాలను చదివి నిజమైన మతం వాటిలోనే ఉందనినమ్మాడు. ఆ తరవాత హిందూ మతంలోకి వచ్చి చేరిన అనేక దేవుళ్లు, దేవతలను, గుడిలో, విగ్రహాల ఆరాధనను, బ్రాహ్మణ పూజారులను, కులవ్యవస్థను అతడు తిరస్క రించాడు.


స్వామి దయానంద సరస్వతి

సాధారణ పూజా విధానాలతో, వేద మంత్రాలతో ఒక్కడే దేవుడిని పూజించాలని అతడు ప్రచారం చేశాడు. మిగిలిన అన్ని మతాలను అతడు తప్పు మతాలుగా తిరస్కరించి ఇతర మతాలకు మారిన హిందువులు వేదాల ఆధారంగా ఉన్న హిందూమతంలోకి తిరిగి రావాలని భావించాడు. ఈ భావాల ప్రచారానికి అతడు 1875లో ఆర్యసమాజాన్ని స్థాపించాడు, 'సత్యార్థ ప్రకాశ్' అన్న పుస్తకాన్ని రాశాడు. ఈ పుస్తకం అధిక సంఖ్యలో ముద్రితమయ్యింది. విద్యావంతులలో చాలామంది దీనిని చదివారు.

1883లో అతడు చనిపోయిన తరవాత అతడి అనుచరులు పంజాబ్‌లో దయానంద్ ఆంగ్లో వేదిక్ (DAV) పాఠశాలను స్థాపించారు. పిల్లలకు ఆధునిక విషయాలు నేర్పుతూనే వారి మతం, సంస్కృతి గురించి తెలియచేయటం ఈ పాఠశాల ఉద్దేశం. కొన్ని సంవత్సరాల తరవాత ఆర్యసమాజ్ ఉద్యమంలోనూ అభిప్రాయ బేధాలు ఏర్పడ్డాయి. ఆధునిక విషయాలు కాకుండా వేద మతాన్ని మాత్రమే బోధిస్తూ ఇతర మతాల ప్రభావాలను తిప్పికొట్టాలని కొంతమంది భావించారు. వీళ్లు హరిద్వార్‌లో గురుకుల కాంగ్రి విశ్వ విద్యాలయాన్ని స్థాపించారు.

- రాంమోహన్ రాయ్, వివేకానంద, దయానందల మత దృక్పథాలను పోల్చి వాటి మధ్య తేడాలు, పోలికలను ఎత్తి చూపండి.
- మీరు DAV పాఠశాల, గురుకుల పాఠశాల, ప్రభుత్వం నడిపే పాఠశాలల్లో ఒక దానిని ఎంచుకోవాల్సి వస్తే దేనిని ఎంచుకుంటారు? కారణాలు తెల్పండి.

## ముస్లింలలో సంస్కరణలు, విద్య

సంస్కరణవాద హిందువులు సనాతనవాదులతో ఘర్షణ పడాల్సివచ్చినట్లే సంస్కరణవాద ముస్లింలు కూడా వారి సనాతన మతాచారాలతో తలపడాల్సి వచ్చింది. 1857 తిరుగుబాటు అణచివేత ముస్లింలు ఆంగ్లేయుల మధ్య తీవ్ర విభేదాలు సృష్టించింది. ఇస్లామిక్ సూత్రాలకు విరుద్ధంగా ఉ న్నాయి కాబట్టి ఆధునిక విజ్ఞాన శాస్త్రం, తత్వశాస్త్రాలను బోధించే ఇంగ్లీషు విద్యను చాలా మంది మౌల్వీలు తిరస్క రించారు.

అయితే సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ (1817-1898) వంటి అనేక ముస్లింలు, ముస్లింలకూ బ్రిటిషువాళ్లకూ మధ్య శత్రుత్వం అంతం కావాలని భావించారు. ప్రగతి సాధించటానికి ముస్లింలు ప్రభుత్వంలో పాల్గొంటూ ప్రభుత్వ ఉద్యోగాలలో పెద్ద వాటా పొందాలని భావించారు.

ఆధునిక విద్య ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది. ముస్లిం ప్రజలు ఆధునీకరణ చెందటానికి సర్ సయ్యద్ కృషి చేశాడు, ఒక పత్రికలో రచనల ద్వారా అతడు తన భావాలను ప్రచారం చేశాడు.


సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్

ముస్లింలలో సాంఘిక సంస్కరణలకు, ఆధునిక విద్యా వ్యాప్తికి సర్ సయ్యద్ అలిగఢ్ ఉద్యమాన్ని ప్రారంభించాడు. మహిళలు చదువుకోవాలని, పరదాను రద్దు చేయాలని అతడు భావించాడు. ఇస్లాంని పునఃవ్యాఖ్యానించి మతానికీ, ఆధునిక విజ్ఞానశాస్త్రం, తత్వశాస్త్రాలకూ మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చాలని అనుకున్నాడు. 1864లో సర్ సయ్యద్ ఒక విజ్ఞానశాస్త్ర సంఘాన్ని ఏర్పాటు చేశాడు. అనేక విజ్ఞానశాస్త్ర ప్రచురణలను ఈ సంఘం ఉర్దూలోకి అనువదించి, ప్రచురించింది. 1875లో అలిగఢ్‌లో మహ్మడన్ ఆంగ్లో ఓరియంటల్ (MAO) కళాశాలను స్థాపించటం అతడు చేసిన వాటిల్లో ప్రముఖమైనది. అది ఇస్లామిక్ వాతావరణంలో ఇంగ్లీషు, విజ్ఞానశాస్త్రాలను బోధించటానికి ప్రయత్నించింది. కాలక్రమంలో ఇది భారతీయ ముస్లింలకు అత్యంత ప్రధానమైన విద్యాసంస్థగా ఎదిగింది. ఆ తరవాత ఇది అలిగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం అయ్యింది.

- తమ సంస్కరణ భావాలను సమర్థించుకోటానికి సంస్కర్తలందరూ తమ తమ ప్రాచీన మతగ్రంథాలను కొత్త కోణంలో చూడటానికి ప్రయత్నించారన్న విషయాన్ని మీరు గమనించి ఉంటారు. ప్రముఖ సంస్కర్తల ఉదాహరణలను చూసి దీనిని వాళ్లు ఎలా చేశారో తెలుసుకోండి.
- 1857 తరవాత ముస్లింలు - బ్రిటిషు మధ్య శత్రుత్వం ఎందుకు ఏర్పడింది?
- DAV పాఠశాలలు, MAO కళాశాల మధ్య ఏమైనా తేడాలు ఉన్నాయా?
- భక్తి ఉద్యమంలో భాగంకాని మత భావనలను పైన పేర్కొన్న సంస్కర్తలు ప్రచారం చేశారా?

## సాంఘిక సంస్కరణలు, మహిళలు

ప్రస్తుతం మధ్యతరగతికి చెందిన అనేకమంది ఆడపిల్లలు బడికి వెళుతూ మగ పిల్లలతో పాటు చదువుకుంటున్నారు. ఆ తరవాత వాళ్లల్లో చాలామంది కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదివి, ఉద్యోగాలు చేస్తున్నారు. మగవాళ్లలాగానే ఆడవాళ్లకు కూడా రకరకాల ఉద్యోగాలను చేపట్టే స్వేచ్ఛ ప్రస్తుతం ఉంది. వాళ్లు దూరప్రాంతాలకు కూడా వెళ్లి ఉద్యోగాలు చేస్తున్నారు.

చట్టం ప్రకారం మహిళలు వయోజనులు (మేజరు) అయితే వాళ్లకి ఇష్టమైన వాళ్లను ఏ కులం నుంచి అయినా, ఏ మతం నుంచి అయినా పెళ్లి చేసుకోవచ్చు లేదా అసలు పెళ్లి చేసుకోకుండా ఉండవచ్చు. వితంతువులు మళ్లీ పెళ్లి చేసుకోవచ్చు. పురుషులందరిలాగానే మహిళలందరూ ఓటు వేయవచ్చు, ఎన్నికలలో పోటీ చేయవచ్చు, ప్రజా జీవనంలో పాల్గొనవచ్చు. మహిళలు ఇప్పటికీ వివక్షతను ఎదుర్కొంటున్నప్పటికీ దానికి వ్యతిరేకంగా వాళ్లు పోరాడవచ్చు, తమ హక్కులను సాధించుకోవచ్చు.

రెండు వందల సంవత్సరాల క్రితం పరిస్థితులు చాలా భిన్నంగా ఉండేవి. చాలామంది పిల్లలకు అయిదు, ఆరు సంవత్సరాలకు పెళ్లిళ్లు జరిగిపోయేవి. హిందూ, ముస్లిం పురుషులు ఒకరికంటే ఎక్కువ భార్యలను కలిగి ఉండవచ్చు. దేశంలోని కొన్ని

ప్రాంతాలలో ఉన్నత కుల మహిళలను చనిపోయిన భర్త శవంతోపాటు సజీవంగా దహనం చేసేవారు. దీనిని 'సతి' అంటారు. సతీ సహగమనం చేయని వితంతువుల పరిస్థితి చాలా దారుణంగా ఉండేది. వాళ్లని చూడటం శుభ సూచకం కాదంటూ, రక్షణలేని కారణంగా వాళ్లను ఎన్నో రకాలుగా హింసించే వాళ్లు. వాళ్లు గుండు చేయించుకుని, తెల్లచీర కట్టుకోవలసి వచ్చేది,శుభకార్యాలలో పాల్గొననిచ్చే వాళ్లు కాదు. మహిళలకు ఆస్తి హక్కు కూడా ఉండేది కాదు. చాలామంది మహిళలకు చదువుకునే అవకాశం ఉండేది కాదు. దేశంలోని చాలా ప్రాంతాలలో ఆడపిల్ల చదువుకుంటే ఆమె భర్త, అత్తమామల అదుపాజ్ఞలలో ఉండదని భావించేవాళ్లు.

అయితే అన్ని వర్గాల ప్రజలలో ఈ పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితి ఎక్కువగా ఉన్నత కులాలలోనూ, బలమైన వర్గాలలోనూ ఉండేది, గిరిజన సమాజాలలో, శ్రామిక ప్రజలలో ఇది తక్కువ.

LFVGPZ

### వివాహానికి కనీస వయస్సు

1846లో పది సంవత్సరాలలోపు ఆడపిల్లలకు పెళ్లి చేయటాన్ని నిషేధిస్తూ చట్టం చేశారు. 1891లో దీనిని 12 సంవత్సరాలకు పెంచారు. 1929లో శారదా చట్టం ద్వారా వివాహానికి కనీస వయస్సును 14 సంవత్సరాలకు పెంచారు. ఈ పరిమితిని 1978లో ఆడపిల్లలకు 18 సంవత్సరాలకు, మగపిల్లలకు 21 సంవత్సరాలకు పెంచారు.

ఇంటి పనిభారం, ఇంటికి, వంటింటికి పరిమితం కావటం, బయటకు వెళ్లనివ్వక పోవటం, చదువుకోనివ్వక పోవటం వంటి మహిళా సమస్యల గురించి రాంమోహన్ రాయ్ వంటి సంఘ సంస్కర్తలు రాశారు. అతడు 'సతి'కి వ్యతిరేకంగా ప్రచారం చేశాడు, మత గ్రంథాలలో వితంతువులను కాల్చి చంపటానికి ఎలాంటి ఆమోదం లేదని చూపటానికి ప్రయత్నించాడు. 19వ శతాబ్దం ఆరంభం నాటికి బ్రిటిషు అధికారులలో చాలామంది కూడా భారతీయ సంప్రదాయాలు, ఆచారాలను విమర్శించసాగారు. రాంమోహన్ రాయ్ వాదాన్ని వాళ్లు ఆలకించారు. ఆ విధంగా 1829లో సతి అధికారికంగా నిషేధింపబడింది. మరొక బెంగాలీ సంస్కర్త అయిన ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వితంతువుల, ప్రత్యేకించి బాలికా వితంతువుల పునర్వివాహానికి పోరాడాడు. చివరకు వితంతువుల పునర్వివాహాన్ని అనుమతిస్తూ 1855లో చట్టం చేశారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, ఒక పురుషుడు అనేకమంది స్త్రీలను పెళ్లి చేసుకోటానికి (బహుభార్యత్వానికి) వ్యతిరేకంగా కూడా విద్యాసాగర్ పోరాడాడు. బాలికల విద్య కోసం అతడు ఉద్యమించాడు, తీవ్ర వ్యతిరేకత ఎదురైనప్పటికీ అతడు బాలికల కోసం పాఠశాలలు నెలకొల్పాడు.

1856లో కలకత్తాలో జరిగిన మొదటి వితంతు పునర్వివాహాన్ని ఒక ప్రేక్షకుడు ఇలా వివరించాడు:

"ఆ రోజును నేను ఎన్నటికీ మరిచిపోలేను. విద్యాసాగర్ తన మిత్రుడైన పెళ్లికొడుకుతోపాటు వచ్చినపుడు... ఇసక వేస్తే రాలనంతగా సందర్శకులు గుమిగూడి ఉన్నారు... ఆ పెళ్లి జరిగిన తరవాత బజార్లలో, దుకాణాల్లో, వీధుల్లో, బహిరంగ ప్రదేశాల్లో, విద్యార్థుల వసతిగృహాల్లో, ఇళ్లల్లో, మారుమూల గ్రామాల్లో – అంతటా, అందరి నోటా ఇదే చర్చ. మహిళలు కూడా ఈ విషయం గురించి తీవ్రంగా చర్చించారు."

**వితంతు పునర్వివాహాన్ని సమర్థించేవాళ్లు, వ్యతిరేకించే వాళ్ల మధ్య సంభాషణను ఊహించి రాయండి.**

- సంఘ సంస్కరణ కోసం ప్రభుత్వం చట్టాలు చేయటం ఎందుకు ముఖ్యమయ్యింది?

### కందుకూరి వీరేశలింగం (1848–1919)

కందుకూరి వీరేశలింగం ఆంధ్రప్రాంతానికి చెందిన సంఘ సంస్కర్త. అతడు సనాతన తెలుగు కుటుంబంలో రాజమండ్రిలో పుట్టాడు.

LFX3ET



కందుకూరి
వీరేశలింగం

వీరేశలింగం ఆంధ్ర ప్రదేశ్‌లో బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. అతడు తన పూర్తి శక్తి సామర్థ్యాలను వితంతువుల పునర్వివాహానికి, బాల్య వివాహాల నిషేధానికి ధారపోశాడు. ఆ రోజుల్లో నిషిద్ధమైన మహిళల చదువు కోసం అతడు పోరాడాడు. రాజమండ్రి దగ్గర ధవళేశ్వరంలో అతడు ఒక పాఠశాల తెరిచాడు.

సంఘ సంస్కరణలకు మద్దతుగా వీరేశలింగం తెలుగులో ఎన్నో పుస్తకాలు రాశాడు, ఎన్నో పత్రికలు స్థాపించాడు. అతడు రాసిన రచనలకు 'గద్య తిక్కన'గా ప్రసిద్ధిగాంచాడు.

పైన పేర్కొన్న దాంట్లో మహిళల హక్కుల కోసం పోరాడిన వాళ్లల్లో ఎక్కువగా పురుషులే ఉన్నారని గమనించి ఉంటారు. ఆ సమయంలో చాలా తక్కువమంది మహిళలు చదువుకుని ఉండటం, ప్రజా కార్యక్రమాలలో మహిళలు భాగస్వాములయ్యే అవకాశం లేకపోవటం వల్ల ఈ పరిస్థితి ఉంది. ఇటువంటి పరిస్థితిలో సైతం మహిళల హక్కుల కోసం పోరాడిన కొంతమంది సాహస మహిళామణుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

## సావిత్రిబాయి జ్యోతిరావు పూలే (1831-1897)

మహారాష్ట్రలో మహిళల హక్కులను సాధించటంలో భర్త జ్యోతిబా పూలేతోపాటు సావిత్రిబాయి పూలే ముఖ్యమైన పాత్ర పోషించింది.

LG5CRH

1848లో పూనేలో 'అంటరాని' కులాల బాలికల కోసం జ్యోతిబా ఒక పాఠశాల స్థాపించాడు. సావిత్రిబాయికి శిక్షణనిచ్చి మొదటి మహిళా ఉపాధ్యాయినిగా చేశాడు.

కింది కులాల బాలికలకు చదువు చెప్పటంపట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ సావిత్రిబాయి దానిని కొనసాగించింది. జ్యోతిరావు పూలే చని పోయిన తరవాత 'సత్య శోధక్ సమాజ్' బాధ్యతలను సావిత్రి బాయి చేపట్టింది. ఆమె సమావేశాలకు అధ్యక్షత వహించి, కార్యకర్తలకు మార్గదర్శకం చేసింది. ప్లేగు మహమ్మారి బారిన పడిన ప్రజల కోసం సావిత్రిబాయి అహర్నిశలు పని చేసింది, పేద పిల్లలకోసం శిబిరాలు నిర్వహించింది. ఈ మహమ్మారి కాలంలో ఆమె ప్రతి రోజూ రెండు వేలమంది పిల్లలకి అన్నం పెట్టింది.



సావిత్రిబాయి పూలే

మీకు మీ ప్రాణంమీద ఎంత ప్రేమో మహిళకు కూడా అలా ఉండదా?... ఒక స్త్రీ భర్త చనిపోతే... ఆమెకి జీవితంలో ఏం మిగిలి ఉంది? మంగలి వచ్చి మీ కళ్లు చల్లబరచటానికి ఆమె కురులు, జుత్తు పూర్తిగా గొరిగేస్తాడు... ఆమె పెళ్లిళ్లకు, శుభకార్యాలకు, సుమంగళులైన ఇతర మహిళలు వెళ్లే కార్యక్రమాలకు వెళ్లకూడదు. ఈ నిషేధాలన్నీ ఎందుకు? ఆమె భర్త చనిపోయినందుకు. ఆమె దురదృష్టవంతురాలా? ఆమె నుదుటి మీద కష్టాలు రాసి ఉన్నాయా? ఆమె దుశ్శకునమా? ఆమె ముఖమే చూడకూడదా? ఇది ఎంతటి అనాగరిక చర్య.

**– తారాబాయి షిండే**

స్త్రీ పురుష్ తుల్నా, 1882

(సావిత్రీబాయి పూలేతో కలిసి తారాబాయి పనిచేసింది)

## పండిత రమాబాయి సరస్వతి (1858-1922)

రమాబాయి మహారాష్ట్రలో జన్మించింది. సనాతనులు వ్యతిరేకించినప్పటికీ ఆమె తండ్రి ఆమెకు సంస్కృత గ్రంథాలు బోధించాడు.

తండ్రి చనిపోయిన తరవాత సోదరునితో కలిసి రమాబాయి దేశమంతా తిరిగింది. బెంగాల్‌లోని కోల్‌కతాకి కూడా వెళ్లింది.


పండిత రమాబాయి సరస్వతి

ఆమె పాండిత్యానికి గుర్తింపుగా ఆమె పండిత రమాబాయి సరస్వతిగా పిలవబడేది.

"పశువులతో ప్రవర్తించినట్లు పురుషులు స్త్రీలతో ప్రవర్తిస్తారు. మా పరిస్థితిని మెరుగుపరుచుకోటానికి ప్రయత్నిస్తుంటే మేం పురుషులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్నామని, అది పాపమని అంటారు. మగవాళ్ల దుష్కృత్యాలను భరిస్తూ వాటిని వ్యతిరేకించకపోవటమే పెద్దపాపం," అన్నారు రమాబాయి.

మహిళలకు, ప్రత్యేకించి వితంతువులకు సహాయపడటానికి రమాబాయి తన జీవితమంతా అంకితం చేసింది. ఇంగ్లాండ్, అమెరికా దేశాల మహిళా సంఘాల గురించి తెలుసుకోటానికి ఆమె ఒంటరిగా ఆ దేశాలకు వెళ్లింది. భారతదేశానికి తిరిగి వచ్చిన తరవాత ఆమె వితంతువులను విద్యావంతులను చేయడానికి ముంబయిలో శారదా సదన్ అన్న పాఠశాలను, ఆశ్రమాన్ని స్థాపించింది. ఈ పాఠశాలలో మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా అనేక వృత్తి విద్యలు, నైపుణ్యాలు నేర్పించేవాళ్లు. ఈ ఆశ్రమం వితంతువులు, అనాథలు, అంధులు మొదలైన వాళ్లకి వసతి సౌకర్యంతోపాటు చదువు, వృత్తి విద్య, వైద్యసేవలు అందించేది. పురుషులపై ఆధారపడి ఉంటారు కాబట్టి మహిళలు అన్ని దాష్టీకాలను మౌనంగా భరించాల్సి వస్తుందని, సొంత సంపాదన ఉంటేనే తమ హక్కులను సాధించుకోగలుగుతారని ఆమె తరచూ అంటూ ఉండేది.

LG6YGG

### ముస్లిం మహిళలలో చదువు

ఇరవయ్యవ శతాబ్దం ఆరంభం నుంచి భోపాల్‌కి చెందిన బేగంలు ముస్లిం మహిళల్లో విద్యావ్యాప్తికి కృషి చేశారు. పాట్నా, కోల్‌కతాలలో ముస్లిం బాలికలకు బేగం రోకియా సఖావత్ హుస్సేన్ పాఠశాలలు ప్రారంభించారు. అన్ని మతాల నాయకులు మహిళలకు తక్కువ స్థానాన్ని ఇచ్చారని వాదిస్తూ సనాతన భావాలను నిర్భయంగా విమర్శిస్తూ ఉండేది.

ఈ సంఘ సంస్కర్తల కృషి ఫలితంగా బాలికల కోసం పాఠశాలలు, కళాశాలలు స్థాపించారు. మహిళల్లో చాలామంది డాక్టర్లు, టీచర్లు కూడా అయ్యారు. అయితే, మహిళల్లో విద్యావ్యాప్తిని బలంగా వ్యతిరేకించిన వాళ్లు కూడా ఉన్నారు. ఆడపిల్లలకు చదువు వస్తే వాళ్లు భర్తల అదుపులో ఉండరనీ, ఇంటి పనులు చేయరనీ వాళ్లు భావించారు. తమ కూతుళ్లను బడికి పంపించే సాహసం చేసిన తల్లిదండ్రులను సాంఘికంగా బహిష్కరించారు. అయినప్పటికీ అనేక కుటుంబాలు సామాజిక మార్పును ఎంచుకున్నాయి. మెల్లగా ఆడపిల్లలు పాఠశాలల్లో, కళాశాలల్లో చదవడం మొదలుపెట్టారు.

- బాలుర మాదిరిగా బాలికల చదువులకు ఈనాడు సమాన ప్రాముఖ్యతను ఇస్తున్నారా? లేక బాలికలు వివక్షతకు గురవుతున్నారా?
- చదువుకోటానికి బాలురు ఎదుర్కోని ఏ కష్టాలను బాలికలు ఎదుర్కొంటున్నారు?
- వితంతువుల పట్ల వ్యవహరించే తీరు ఈనాడు ఎంత వరకు మారింది?
- ఈనాటికీ దళిత బాలికలు, ముస్లిం బాలికలు చదువుకోటానికి ప్రత్యేక సమస్యలను ఎదుర్కొంటున్నారా?

### సంఘ సంస్కరణలు, కుల వ్యవస్థ

గత తరగతులలో మీరు కులవివక్షత గురించి చదివారు. బ్రాహ్మణులు, క్షత్రియులు వంటి ఉన్నత

కులాల వాళ్లు సమాజంలోని అట్టడుగు వర్గాలైన శ్రామిక ప్రజలను శూద్రులుగా, 'అంటరానివాళ్లు'గా చూసేవాళ్లు. వాళ్లని దేవాలయాలలోకి రానిచ్చేవాళ్లు కాదు, ఉన్నత కులాల వాళ్లు ఉపయోగించే బావుల నుంచి నీళ్లు తోడుకోనిచ్చే వాళ్లు కాదు, చదవటం, రాయటం నేర్చుకోనిచ్చేవాళ్లు కాదు, మత గ్రంథాలు చదవనిచ్చేవాళ్లు కాదు. వాళ్లు తక్కువ వాళ్లనీ, ఉన్నత కులాలకు సేవ చేయటమే వాళ్ల పని అని భావించే వాళ్లు. ఆనాటి పాలకులు, రాజులు ఈ కుల నియమాలను పాటించని వాళ్లను శిక్షిస్తూ ఈ కుల వివక్షతను కొనసాగించేవాళ్లు.

భారతదేశంలో బ్రిటిషు పాలనతో ఈ పరిస్థితులు మారసాగాయి. బ్రిటిషు న్యాయస్థానాలు అందరికీ ఒకే చట్టాలు అమలుపరచసాగాయి. ప్రభుత్వం, క్రైస్తవ మత ప్రచారకులు బడులు తెరిచి కులంతో సంబంధం లేకుండా పిల్లలందరినీ చేర్చుకునేవాళ్లు. అప్పటివరకు చదువు అందకుండా చేయబడిన కింది కులాల పిల్లలకు చదువు చెప్పటంలో క్రైస్తవ మత ప్రచారకులు ప్రత్యేక పాత్ర పోషించారు. ప్రభుత్వ ఉద్యోగాలు అన్ని కులాలవాళ్లకి ఇవ్వటంతో ప్రత్యేకించి సైన్యంలో తక్కువ కులాలకు చెందిన వాళ్లు పెద్ద సంఖ్యలో చేరారు. కొత్తగా ఏర్పడుతున్న పట్టణాలలో కొత్త ఉద్యోగాలను వెతుక్కుంటూ చాలామంది అక్కడికి వెళ్లారు. వీటన్నిటివల్ల కింది కులాల పరిస్థితుల్లో మార్పు వచ్చి, కుల ఆధారిత వివక్షతను వాళ్లు ప్రశ్నించసాగారు. ఇది ఎలా జరిగిందో, కుల వ్యవస్థకు అంతం పలుకుతూ సమానత్వం కోసం ఉద్యమాలు నడిపిన నాయకులు ఎవరో తెలుసుకుందాం.

## తరగతి గదిలో చోటులేదు

1829లో కూడా బాంబే రాష్ట్రంలో కొంతమందిని అంటరానివాళ్లుగా పేర్కొంటూ ప్రభుత్వ పాఠశాల లోనికి రానిచ్చేవాళ్లు కాదు. కొంతమంది తమ హక్కు కోసం గట్టిగా అడిగినప్పుడు తరగతిలోని ఉన్నతకులాల పిల్లలు 'మైల' పడకుండా తరగతి గది బయట వరండాలో కూర్చుని, పాఠాలు వినమనేవాళ్లు.

1. వరండాలో కూర్చుని పాఠాలు వింటున్న పిల్లల్లో మీరు ఒకరని ఊహించుకోండి. మీ మనసులో ఎటువంటి ప్రశ్నలు రేగుతుంటాయి?
2. అంటరాని ప్రజలు అసలు చదువులేకుండా ఉండడంకంటే ఇది మెరుగని కొంతమంది భావించారు. మీరు వీళ్లతో ఏకీభవిస్తారా?


## జ్యోతిబా పూలే (1827-1890), సత్యశోధక్ సమాజ్

LGE8TA

జ్యోతిబా పూలే మహారాష్ట్రలో జన్మించాడు, క్రైస్తవ మత బోధకులు ప్రారంభించిన పాఠశాలల్లో చదువుకున్నాడు.

జ్యోతిబా తన బ్రాహ్మణ మిత్రుడి పెళ్లి ఊరేగింపులో పాల్గొన్నప్పుడు వాళ్ల కుటుంబ సభ్యులు చేసిన అవమానంతో అతడి జీవితం మలుపు తిరిగింది. పెద్దయిన తరవాత అతడు సమాజంలోని కుల వివక్షతపై తనదైన అభిప్రాయాలు ఏర్పరచుకుని తాము మిగిలిన వాళ్లకంటే ఉన్నతులమన్న బ్రాహ్మణుల వాదనను ఖండించసాగాడు. శూద్రులు (శ్రామిక కులాలు), అతిశూద్రులు (అంటరాని వాళ్లు) కలిసి కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలని అతడు కోరాడు.

సత్యం, సమానత్వం అన్న సూత్రాల ఆధారంగా నూతన సమాజాన్ని ఏర్పాటు చేయటానికి సత్య శోధక్ సమాజ్ అన్న సంస్థను జ్యోతిబా పూలే స్థాపించాడు. అంటరాని వాళ్లుగా భావించే మహర్, మాంగ్ కులాలకు చెందిన బాలికల కోసం అతడు, అతని భార్య సావిత్రిబాయి పూలే ఒక పాఠశాల తెరిచారు. తమ బంధువుల నుంచి సైతం వాళ్లు వ్యతిరేకతను ఎదుర్కొన్నారు.


జ్యోతిబా పూలే


కుల వ్యవస్థను బానిసత్వంగా పరిగణిస్తూ అతడు దానికి వ్యతిరేకంగా 'గులాంగిరి' వంటి ఎన్నో పుస్తకాలు రాశాడు. నిమ్నకులాల పిల్లల కోసం, నిమ్నకులాల టీచర్లే పాఠాలు చెప్పే ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల కోసం సత్య శోధక్ సమాజ్, పూలే ఉద్యమించారు. వ్యాసరచన, చర్చ, వక్తృత్వం వంటి అంశాల్లో పోటీలు పెట్టి నిమ్నకులాల వాళ్లల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెంపొందేలా చేశారు. బ్రాహ్మణులు లేకుండా వివాహాలను, కర్మకాండలను నిర్వహించమని 'నిమ్న' కులాలకు అతడు పిలుపునిచ్చాడు.

- ఈనాటికీ ఈ భావాలు అవసరమని మీరు భావిస్తున్నారా?
- నిమ్నకులాల విద్యార్థులకు ఆ కులాల ఉపాధ్యాయులే చదువు చెప్పాలని అతడు ఎందుకు అన్నాడు?

## నారాయణ గురు (1856-1928)

మనుషులందరికీ 'ఒకే కులం, ఒకే మతం, ఒకే దేవుడు' అన్న భావనను ప్రచారం చేసిన మత గురువు నారాయణ గురు.

అతని తండ్రి ఆయుర్వేద డాక్టరు. పిల్లల కోసం అతడు నడిపిన బడిలోనే నారాయణ కూడా చదువుకున్నాడు. 'ఈఝువా' కులస్థులను సారాయి కాయటం, జంతు బలులు వంటి వాటిని మానెయ్యమని నారాయణ గురు పిలుపునిచ్చాడు. అతడు కుల వివక్షతను పాటించని దేవాలయాలను స్థాపించాడు, వాటిలో బ్రాహ్మణ పూజారులు లేకుండా సామాన్యమైన పూజా విధానాలను అనుసరించే వాళ్లు. గుడులు కట్టటం కంటే బాలలకు బడులు కట్టటం ఎంతో ముఖ్యమని అతడు చెప్పేవాడు. అతడి పాండిత్యం, ఆధ్యాత్మికతలతో ప్రభావితులైన ఇతర కులాలవాళ్లు కూడా అతడి అనుచరులుగా మారారు. నారాయణ గురు కుల వ్యవస్థను తీవ్రంగా విమర్శించాడు, అన్ని రూపాలలో కుల వివక్షత అంతం కావాలని అతడు ఉద్యమించాడు.


నారాయణ గురు

- నారాయణ గురు, జ్యోతిబా పూలేల కృషిని పోల్చండి. వాళ్ల మధ్య పోలికలు, తేడాలు ఏమిటి?

## భాగ్యరెడ్డి వర్మ (1888-1939)

ఆంధ్రప్రదేశ్‌లో దళితులు తమ పరిస్థితిని గుర్తించి, హక్కుల కోసం పోరాడేలా చేయటానికి భాగ్యరెడ్డి వర్మ వంటి దళిత నాయకులు అవిశ్రాంతంగా కృషి చేశారు.

దళితులే ఈ ప్రాంతపు మూలవాసులనీ, ఉన్నత కులాలకు చెందిన ఆర్యులు దళితులను బలంతో అణచివేశారనీ చెబుతారు. కాబట్టి దళితులు తమను 'ఆది ఆంధ్రులు' అని పిలుచుకోవాలని వీళ్లు పిలుపునిచ్చారు. జనాదరణ పొందిన కళలను ఉపయోగించుకుని దళితులలో చైతన్యం కలిగించటానికి 1906లో 'జగన్ మిత్ర మండలి'ని భాగ్యరెడ్డి ప్రారంభించాడు. వాళ్లు పాఠశాలలను నెలకొల్పారు. దళితుల విద్యకు ప్రత్యేక నిధులు కేటాయించేలా నిజాంను ఒప్పించారు. ఆడపిల్లలను, ప్రత్యేకించి దళిత బాలికలను గుడులలో దేవదాసీలు, లేదా జోగినులుగా చేసి బలవంతంగా వేశ్యలుగా చేయటానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపి మంచి ఫలితాలు సాధించారు. హిందూ-కుల వ్యవస్థపై పోరాటంలో భాగంగా బుద్ధుని బోధనలలో ఆసక్తి కనబరచారు, దళితులు బౌద్ధమతాన్ని చేపట్టడాన్ని ప్రోత్సహించారు.


భాగ్యరెడ్డి వర్మ

- కులవ్యవస్థకు సంబంధించి బుద్ధుని బోధనలను గుర్తుకు తెచ్చుకోండి.
- ఆంధ్ర ప్రాంతంలో దళితులు మూలవాసులు అన్న భావన దళితుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించటానికి ఏ విధంగా దోహదపడింది?

## స్వాతంత్ర్య పోరాటంలో మహిళలు

సహాయ నిరాకరణ, సత్యాగ్రహ ఉద్యమాల్లో పాల్గొనవలసిందిగా మహిళలను గాంధీజీ ప్రోత్సహించాడు. ఉప్పు సత్యాగ్రహం, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమం, రైతాంగ ఉద్యమం వంటి వాటిలో మహిళలు పాల్గొనేలా చేయటం ద్వారా గాంధీజీ అనేకమంది మహిళలకు జనజీవనంలో గౌరవప్రదమైన స్థానంతోపాటు వాళ్లల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. జాతీయ ఉద్యమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు పురుషులతోపాటు మహిళలు సమాన హక్కులు పొందుతారని వాళ్లు ఆశించారు.

- స్వాతంత్ర్య పోరాటంలోని ముఖ్యమైన మహిళా నాయకుల గురించి తెలుసుకోండి – కల్పనా దత్, అరుణ అసఫ్ ఆలి, కెప్టెన్ లక్ష్మీ సెహగల్, సరోజిని నాయుడు, కమలా దేవిచటోపాధ్యాయ మొదలగువారు.
- స్వతంత్ర భారతదేశంలో మహిళలందరికీ ఓటు హక్కు లభించిందా?

## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ (1891–1956)

అంబేద్కర్ మహారాష్ట్రలో జన్మించాడు. సైన్యంలో పనిచేస్తున్న అతని తండ్రి పిల్లల్ని చదువుకోమనిప్రోత్సహించాడు.

LGFUI4

రోజువారీ జీవితంలో కుల వివక్షతకు గురి కావటం అంటే ఏమిటో అంబేద్కర్ బాల్యంలోనే అనుభవించాడు. బడిలో అంబేద్కర్, ఇతర అంటరాని పిల్లలను వేరుగా కూర్చోపెట్టేవాళ్లు. టీచర్లు వాళ్లపై శ్రద్ధ చూపేవాళ్లు కాదు. వాళ్లకి దాహం అయితే మంచినీళ్ల కుండను తాకగూడదు కాబట్టి ఉన్నత కులానికి చెందిన ఎవరైనా పైనుంచి నీళ్లు పోయాల్సి వచ్చేది. అనేక సామాజిక, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని భారతదేశంలో కళాశాల విద్య పూర్తిచేసిన మొదటి దళితులలో అంబేద్కర్ ఒకడయ్యాడు.

పై చదువులకు అతడు అమెరికా, ఇంగ్లండ్ దేశాలకు వెళ్లాడు. భారతదేశానికి తిరిగి వచ్చిన తరవాత న్యాయవాద వృత్తి చేపట్టాడు, టీచరుగా పనిచేశాడు. 1927లో దళితులు హిందూ దేవాలయాల్లో ప్రవేశం కోసం, ప్రభుత్వ తాగునీటి వనరుల నుంచి నీళ్లు ఉపయోగించుకొనే హక్కుల కోసం అతడు ఉద్యమాలు చేపట్టాడు.



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్

దళితులను చైతన్య పరచటంలో అతడు చేసిన కృషిని గుర్తించి, 'భారతదేశ రాజకీయ భవిష్యత్తు' అన్న అంశంపై 1932లో వలస ప్రభుత్వం నిర్వహించిన సమావేశానికి అతడిని ఆహ్వానించారు. శాసనసభలలో దళిత అభ్యర్థులకు దళితులు వేరుగా ఓటు వేయాలని అతడు వాదించాడు. బ్రిటిషు ప్రభుత్వం ఈ ప్రతిపాదనను అంగీకరించింది. కానీ, గాంధీజీ దానిని వ్యతిరేకించాడు. చివరికి దళితులకు కొన్ని సీట్లు రిజర్వు చేసి అందరు వాళ్లకు ఓట్లు వేసేలా అంగీకారానికి వచ్చారు.

దళితుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించటానికి అతడు 'ఇండిపెండెంట్ లేబర్ పార్టీ'ని స్థాపించాడు.

1932 ప్రాంతంలో అంటరానితనానికి వ్యతిరేకంగా గాంధీజీ ఉద్యమం ప్రారంభించాడు. 'అంటరాని' కులాల వాళ్లకు అతడు 'హరిజనులు' అంటే 'దేవుడి ప్రజలు' అని పేరు పెట్టాడు. దేవాలయాలు, నీటి వనరులు, పాఠశాలలు వంటి వాటిల్లో ప్రవేశహక్కులు, సమానహక్కులు కల్పించాలని ఆశించాడు. ఈ ఉద్యమాన్ని కాంగ్రెస్ పెద్ద ఎత్తున చేపట్టటంతో జాతీయ ఉద్యమంలో దళితులు లక్షల సంఖ్యలో చేరారు.

1947లో స్వతంత్రం వచ్చిన తరవాత దేశానికి మొదటి న్యాయశాఖ మంత్రిగా పదవి చేపట్టమని అంబేద్కర్‌ని ఆహ్వానించారు. భారతదేశానికి కొత్త రాజ్యాంగాన్ని రాసే రచనా సంఘానికి అంబేద్కర్‌ని చైర్మన్‌గా నియమించారు. అంబేద్కర్ రాసిన ముసాయిదాలో పౌరుల విస్తృత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, హక్కులకు రాజ్యాంగపరంగా హామీ లభించింది. ఉదా: మత స్వేచ్ఛ, అంటరానితనాన్ని నిషేధించటం, అన్ని రకాల వివక్షతను నిషేధించటం.

మహిళలకు విస్తృత సామాజిక, ఆర్థిక హక్కుల కోసం అంబేద్కర్ పోరాడాడు. షెడ్యూల్డు కులాలు, తెగలకు పాఠశాలలు, కళాశాలల్లో, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషను కల్పించేలా రాజ్యాంగ సభను అంబేద్కర్ ఒప్పించగలిగాడు. అంబేద్కర్ తన జీవిత చరమ దశలో బౌద్ధమతాన్ని స్వీకరించాడు.

- దళితుల పట్ల తమ దృక్పథంలో గాంధీజీ, అంబేద్కర్‌ల మధ్య పోలికలు, తేడాలు ఏమిటి?
- ఈనాడు దేవాలయాలు, నీటి వనరులు, పాఠశాలల్లో దళితులకు సమాన హక్కులు ఉన్నాయా? వాళ్లు ఇప్పటికీ ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి?

### కీలక పదాలు

1. సంస్కరణలు 2. సతి 3. పరదా
4. వితంతు పునర్వివాహం 5. అంటరానితనం

LGN4UX

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. "పాశ్చాత్యవిద్య, క్రైస్తవ మత ప్రచారాలు భారతదేశంలోని సామాజిక మత సంస్కరణ ఉద్యమాన్ని ప్రభావితం చేశాయి." దీనితో నీవు ఏకీభవిస్తావా? ఎందుకు? $AS_2$
2. సంస్కరణ ఉద్యమం బలోపేతం కావటంలో ముద్రణాయంత్రం ప్రాముఖ్యత ఏమిటి? $AS_1$
3. అనేక దేవుళ్లను ఆరాధించటం, విగ్రహారాధన, సంక్లిష్ట సంప్రదాయాలు వంటి వాటిని మాన్పించటానికి మత సంస్కరణలు ప్రయత్నించాయి. ఈ సంస్కరణలను ప్రజలు ఆమోదించారా? మీ సమాధానానికి కారణాలు పేర్కొనండి. $AS_2$
4. రమాబాయి వంటి వ్యక్తులు వితంతువుల పరిస్థితిపై ప్రత్యేక కృషి ఎందుకు చేశారు? $AS_1$

5. భారతదేశంలో, 19వ శతాబ్దంలో సంఘ సంస్కర్తగా రాజా రాంమోహన్ రాయ్ పాత్ర వివరించండి. $AS_1$

6. ఇంగ్లీషు విద్యను ప్రోత్సహించటంలో సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ప్రధాన ఉద్దేశం ఏమిటి? $AS_1$

7. 'అంటరాని' కులాలను మిగిలిన వాటితో సమానంగా చేయటానికి వివిధ నాయకులు వివిధ పద్ధతులను అనుసరించారు. ఫూలే, భాగ్యరెడ్డి వర్మ, నారాయణ గురు, అంబేద్కర్, గాంధీజీ వంటి నాయకులు సూచించిన చర్యల జాబితాను తయారుచేయండి. $AS_3$

8. ఈనాటికి కూడా కులం ఎందుకు వివాదాస్పద విషయంగా ఉంది? వలస పాలనలో కులానికి వ్యతిరేకంగా జరిగిన ముఖ్యమైన ఉద్యమం ఏది? $AS_4$

9. ఆలయ ప్రవేశ ఉద్యమం ద్వారా అంబేద్కర్ ఏమి సాధించదలుచుకున్నాడు? $AS_1$

10 భారత సమాజంలోని సామాజిక మూఢాచారాలు లేకుండా చేయటంలో సంఘ సంస్కరణ ఉద్యమాలు ఏ విధంగా దోహదపడ్డాయి. ఈనాడు ఎటువంటి సామాజిక మూఢాచారాలు ఉన్నాయి? వీటిని ఎదుర్కోటానికి ఎటువంటి సంఘ సంస్కరణలు చేపట్టాలి? $AS_4$

11. బాలికల విద్య ప్రాధాన్యతను తెలిపే ఒక కరపత్రం తయారుచేయండి. $AS_6$

12. సంఘ సంస్కర్తల్లో నీకు నచ్చిన గుణాలు ఏవి? అవి ఎందుకు నచ్చాయి? $AS_6$

పాఠం ౨౦

# లౌకికత్వం - అవగాహన

మీరు అమెరికాలో ఉంటున్న హిందువుగానో, ముస్లింగానో ఊహించుకోండి, అక్కడ క్రైస్తవ మతతత్వ ధోరణి బలంగా ఉందని ఊహించుకోండి. మీరు అమెరికా పౌరులైనప్పటికీ మీకు ఇల్లు అద్దెకు ఇవ్వటానికి ఎవ్వరూ సిద్ధంగా లేరు. అప్పుడు మీకు ఎలా అనిపిస్తుంది? అప్పుడు మీకు బాధ కలగదా? మీరు ఆ వివక్షత గురించి ఫిర్యాదు చేస్తే మిమ్మల్ని భారతదేశం వెళ్లిపొమ్మన్నారనుకోండి. అప్పుడు మీకు కోపం కలగదా? మీ కోపం రెండు రూపాలు తీసుకోవచ్చు. ఒకటి, మీపట్ల ప్రవర్తించినట్లే ముస్లింలు, హిందువులు అధిక సంఖ్యలో ఉన్నచోట క్రైస్తవుల పట్ల వ్యవహరించాలని కోరుకోవచ్చు. ఇది ప్రతీకారం తీర్చుకోవటం వంటిది. లేదా, అందరికీ న్యాయం జరగాలి అన్న దృక్పథాన్ని వ్యక్తపరచవచ్చు. తమ మతపర నమ్మకాలు, ఆచరణల ఆధారంగా ఏ వ్యక్తి వివక్షతకు గురికాకూడదని మీరు పోరాటం మొదలుపెట్టవచ్చు. మతపరమైన ఆధిపత్యాలన్నిటికీ అంతం పలకాలన్న ఆలోచన మీద ఇది ఆధారపడి ఉంది. లౌకికవాదం సారం ఇదే. భారతదేశ నేపథ్యంలో దీని అర్థం ఏమిటో ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

- ఈ అధ్యాయానికి పైన ఉన్న పరిచయాన్ని మరొకసారి చదవండి. ఈ సమస్యకు ప్రతీకార చర్య సరైనది ఎందుకు కాదు? వివిధ బృందాలు ఈ పద్ధతిని అనుసరిస్తే ఏమవుతుంది?

మతకారణంగా వివక్షత, వేధింపులు, సామాజిక కార్యక్రమాలలో పాల్గొననివ్వకపోవటం వంటివాటికి చరిత్రలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. జర్మనీలో యూదులను వేధించి, లక్షలాదిమందిని హిట్లర్ చంపటం మీరు చదివి ఉంటారు. అయితే ఇప్పుడు యూదు దేశమైన ఇజ్రాయిల్ తమ దేశంలోని ముస్లిం, క్రైస్తవ అల్పసంఖ్యాక వర్గాలను ఎన్నో వేధింపులకు గురి చేస్తోంది. సౌదీఅరేబియాలో ముస్లింలు కాని వాళ్లను దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు కట్టుకోటానికి అనుమతించరు, ప్రార్థనల కోసం బహిరంగ ప్రదేశంలో సమావేశం కావటానికి వీలులేదు.

పైన పేర్కొన్న ఉదాహరణల్లో ఒక మతవర్గ ప్రజలు మరొక మతవర్గ ప్రజల పట్ల వివక్షత చూపుతున్నారు, లేదా వేధింపులకు గురి చేస్తున్నారు. దేశ ప్రభుత్వం ఇతర మతాలకు తావులేకుండా ఒక మతానికి అధికారిక గుర్తింపు ఇచ్చినప్పుడు ఇటువంటి వివక్షత ఎక్కువగా ఉండే అవకాశాలు ఎక్కువ. తమ మతం కారణంగా వివక్షతకు గురికావడాన్ని ఎవరూ కోరుకోరు, ఇంకో మతం తమపై ఆధిపత్యాన్ని చలాయించటం ఇష్టపడరు. భారతదేశంలో మతకారణంగా ఒక వ్యక్తిపట్ల ప్రభుత్వం వివక్షత చూపే అవకాశం ఉందా?

## లౌకికవాదం అంటే ఏమిటి?

LGPQJR

గత అధ్యాయాల్లో మీరు రాజ్యాధికారం నుంచి, అధిక సంఖ్యాకుల వల్ల భయోత్పాతాలకు గురికావటం నుంచి వ్యక్తులను భారత రాజ్యాంగం లోని ప్రాథమిక హక్కులు ఎలా కాపాడతాయో చదివారు. తమ మత నమ్మకాలతో, తాము వాటిని అర్థం చేసుకున్నదానికి అనుగుణంగా జీవించటానికి వ్యక్తులకు భారత రాజ్యాంగం స్వేచ్ఛను ఇస్తోంది. అందరికీ మతస్వేచ్ఛ అన్న భావనకు అనుగుణంగా మతాన్నీ, ప్రభుత్వ అధికారాన్నీ భారతదేశం వేరు చేసింది. ప్రభుత్వం నుంచి మతాన్ని వేరు చేయటాన్నే లౌకికవాదం అంటారు.

## ప్రభుత్వం నుంచి మతాన్ని వేరు చేయటం ఎందుకు ముఖ్యం?

పైన చెప్పుకున్నట్లుగా లౌకికవాదంలో ముఖ్యమైన అంశం ప్రభుత్వ అధికారం నుంచి మతాన్ని వేరు చేయటం. ఒక దేశం ప్రజాస్వామికంగా పని చేయాలంటే ఇది ముఖ్యం. ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాల్లో ఒకటికంటే ఎక్కువ మతాల ప్రజలు నివసిస్తుంటారు. ఈ మతాలలో ఏదో ఒకటి అధిక ప్రజలను కలిగి ఉంటుంది. అధిక సంఖ్యలో ఉన్న మత బృందం ప్రభుత్వాధికారంలోకి వస్తే, ఈ అధికారాన్ని, ఆర్థిక వనరులను వినియోగించుకుని ఇతర మతాలకు చెందిన వ్యక్తులను వేధించవచ్చు, వివక్షతకు గురిచేయవచ్చు. అధిక సంఖ్యాకుల ఆధిపత్యం వల్ల ఈ అల్పసంఖ్యాక ప్రజలు వివక్షత, ఒత్తిడికి గురికావచ్చు, ఒక్కొక్కసారి చంపబడవచ్చు. అధిక సంఖ్యలో ఉన్నవాళ్లు తేలికగా తక్కువ సంఖ్యలో ఉన్నవాళ్లని వాళ్ల మతాన్ని పాటించకుండా చేయవచ్చు. మతంతో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తికీ ప్రజాస్వామిక సమాజం ఇచ్చే హక్కులు మత ఆధిపత్యం వల్ల ఉల్లంఘింపబడతాయి. అంటే అధిక సంఖ్యాకుల పెత్తనాన్ని అడ్డుకోవాలన్నా, ప్రాథమిక హక్కులు ఉల్లంఘింపబడకుండా చూడాలన్నా ప్రజాస్వామిక సమాజాలలో ప్రభుత్వాధికారంనుంచి మతాన్ని వేరు చేయటం చాలా ముఖ్యమవుతుంది.

వ్యక్తులకు వారి మతాన్ని విడిచిపెట్టి మరొక మతాన్ని స్వీకరించడానికి, మత బోధనలను భిన్నంగా విశ్లేషించడానికి, స్వేచ్ఛను కాపాడటానికి కూడా ప్రజాస్వామ్య సమాజంలో ప్రభుత్వాధికారం నుంచి మతాన్ని వేరుచేయటం ముఖ్యమవుతుంది.

- ఒకే మతంలో భిన్న దృక్పథాలు ఉండవచ్చా? తరగతిలో చర్చించండి.

## భారతదేశ లౌకికవాదం ఏమిటి?

భారత రాజ్యం లౌకికంగా ఉండాలని భారత రాజ్యాంగం నిర్దేశిస్తోంది. ఈ కింది ఉద్దేశాలను లౌకిక రాజ్యం మాత్రమే సాధించగలదని భారత రాజ్యాంగం భావిస్తోంది.

1. ఒక మతవర్గం మరొక మతవర్గంపై ఆధిపత్యం చెలాయించకూడదు.
2. ఒకే మతంలోని కొంతమందిపై మరికొంతమంది ఆధిపత్యం చెలాయించకూడదు.
3. ప్రభుత్వం ఏ ఒక్క మతాన్ని వ్యక్తులపై రుద్ద కూడదు. వ్యక్తుల మత స్వేచ్ఛను హరించ కూడదు.

పైన పేర్కొన్న ఆధిపత్యాలను నివారించటానికి భారత రాజ్యం వివిధ విధానాలను అవలంబిస్తుంది. మొదటగా అది మతానికి దూరంగా ఉంటుంది. భారత రాజ్యం ఒక మత బృందం ద్వారా పాలింపబడటం లేదు, అది ఏ ఒక్క మతాన్ని సమర్థించటం లేదు. భారతదేశంలో న్యాయస్థానాలు, పోలీసుస్టేషన్లు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు వంటి ప్రభుత్వ స్థలాల్లో ఏ ఒక్క మత చిహ్నాలనూ ప్రదర్శించకూడదు, ఏ మతాన్నీ ప్రోత్సహించకూడదు.

రెండవది, ఆధిపత్యాన్ని నివారించటానికి భారత లౌకికవాదం జోక్యం చేసుకోకుండా ఉండటం అన్న విధానాన్ని కూడా అనుసరిస్తుంది. అన్ని మతాల భావనలను గౌరవించటానికి, మత ఆచారాలలో జోక్యం చేసుకోకుండా ఉండటానికి కొన్ని మతాలకు భారత ప్రభుత్వం కొన్ని మినహాయింపులను ఇస్తుంది.

మూడవది, నిమ్న కులాల పట్ల వివక్షత, వెలివేత వంటి వాటిని నివారించటానికి భారత రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధిస్తోంది. అంటే ఈ దేశ పౌరులైన నిమ్న కులాల ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తూ, వాళ్లను వివక్షతకు, వెలివేతకు గురిచేసే సామాజిక ఆచారాలను అంతం చేయటానికి

భారత రాజ్యం మతంలో జోక్యం చేసుకుంటోంది. అదే విధంగా వారసత్వంలో సమాన ఆస్తి హక్కును కాపాడటానికి ప్రజల మత ఆధారిత 'పౌర చట్టాల'లో (personal law) రాజ్యం జోక్యం చేసుకోవలసి రావచ్చు.

ప్రభుత్వ జోక్యం మద్దతు రూపంలో కూడా ఉండవచ్చు. మతవర్గాలు తమ సొంత పాఠశాలలు, కళాశాలలు స్థాపించుకునే హక్కును భారత రాజ్యాంగం కల్పిస్తుంది. అటువంటి వాటికి ఆర్థిక మద్దతు కూడా అందిస్తుంది.

- ఇతర ప్రజాస్వామిక దేశాలతో పోలిస్తే భారత లౌకికవాదం ఏవిధంగా భిన్నమైనది?

పైన పేర్కొన్న ఉద్దేశాలు ప్రపంచంలోని ఇతర ప్రజాస్వామిక, లౌకికదేశాల రాజ్యాంగాలలో కూడా పొందుపరిచి ఉన్నాయి. ఉదాహరణకు శాసనసభ "ఒక మత ఏర్పాటుని" లేదా "మతాన్ని స్వేచ్ఛగా అవలంబించడాన్ని నిషేధించటాన్ని" అమెరికా రాజ్యాంగానికి చేసిన మొట్టమొదటి సవరణ నిషేధిస్తుంది. దీని అర్థం శాసనసభ ఒక మతాన్ని అధికారిక మతంగా ప్రకటించలేదు, ఒక మతానికి ప్రాధాన్యతను ఇవ్వకూడదు. అమెరికాలో ప్రభుత్వం నుంచి మతాన్ని వేరు చేయటమంటే ఒకదాని వ్యవహారాల్లో మరొకటి జోక్యం చేసుకోటానికి వీల్లేదు.



*చిత్రం : అమెరికాలోని ప్రభుత్వ రాజ్యాంగ పాఠశాలలో 'విధేయత ప్రతిజ్ఞ' చేస్తున్న విద్యార్థుల ఫోటో*

అమెరికాలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు 'విధేయత ప్రతిజ్ఞ'తో పాఠశాలను ప్రారంభిస్తారు. ఈ ప్రతిజ్ఞలో 'దేవుని కింద' అన్న పదం ఉంది. ఈ ప్రతిజ్ఞ ఎవరి మత భావనలనైనా భంగపరుస్తుంటే దానిని వల్లించనవసరం లేదని 60 సంవత్సరాల క్రితమే నిర్ణయించారు. అయినప్పటికీ 'దేవుని కింద' అన్న పదాలు అమెరికా రాజ్యాంగానికి చేసిన మొదటి సవరణ ప్రకారం ప్రభుత్వం, చర్చి వేరుగా ఉండటాన్ని ఉల్లంఘిస్తున్నాయని చాలా కేసులు వేశారు.

అమెరికాలో ఆచరణలో లౌకికవాదాన్ని అర్థం చేసుకున్నదానికీ భారతదేశ లౌకిక విధానానికీ మధ్య ఒక ముఖ్యమైన తేడా ఉంది. అమెరికాలోమాదిరి మతంలో ప్రభుత్వం ఏమాత్రం జోక్యం చేసుకోకుండా ఉండటం కాకుండా భారత లౌకిక విధానం మతాలలో జోక్యం చేసుకుంటుంది. అంటరానితనాన్ని నిషేధించటానికి భారత రాజ్యాంగం హిందూమత ఆచరణలలో జోక్యం చేసుకున్న విధానం గురించి మీరు చదివారు. భారత లౌకిక విధానంలో మతం నుంచి ప్రభుత్వం పూర్తిగా వేరు చేయబడనప్పటికీ మతాలనుంచి అది సూత్రబద్ధ దూరంలో ఉంటుంది. దీని అర్థం మతంలో రాజ్యం జోక్యం చేసుకోవటం అన్నది రాజ్యాంగంలోని ఆదర్శాలకు అనుగుణంగా ఉండాలి. ఈ ఆదర్శాల ఆధారంగా ప్రభుత్వం లౌకిక పంథాను అనుసరిస్తోందో లేదో అంచనా వేయాల్సి ఉంటుంది.

భారత రాజ్యం లౌకికరాజ్యం, మత ఆధిపత్యాన్ని నివారించటానికి అది అనేక రకాలుగా పని చేస్తుంది. లౌకిక సూత్రాలపై ఆధారపడిన ప్రాథమిక హక్కులకు భారత రాజ్యాంగం హామీ ఇస్తోంది. అయితే ఈ హక్కులకు భారతదేశంలో భంగం కలగటం లేదని కాదు. ఇట్లాంటి ఉల్లంఘనలు జరుగుతున్నాయి కాబట్టే వీటిని నివారించటానికి

రాజ్యాంగ విధానం కావాలి. ఇట్లాంటి హక్కులు ఉన్నాయని తెలియటం వల్ల అవి ఉల్లంఘించబడినప్పుడు స్పందించి, ఉల్లంఘనలను వ్యతిరేకిస్తూ చర్యలకు దిగుతాం.

- ఇటీవల కాలంలో భారతదేశంలో ఏ ప్రాంతంలోనైనా రాజ్యాంగంలోని లౌకిక ఆదర్శాలు ఉల్లంఘింపబడిన ఘటనలు విన్నారా? మతం కారణంగా వ్యక్తులు వేధింపబడి, చంపబడిన ఘటనలు విన్నారా?

2004 ఫిబ్రవరిలో ముస్లిం ఆడపిల్లలు కట్టుకునే తలగుడ్డ, యూదుల టోపీ, క్రైస్తవ శిలువలు వంటి మత, రాజకీయ చిహ్నాలను పాఠశాల విద్యార్థులు ధరించకుండా ఫ్రాన్స్ ఒక చట్టం చేసింది. ఫ్రాన్స్ కింద ఒకప్పుడు వలస దేశాలుగా ఉన్న అల్జీరియా, ట్యునీసియా, మొరాకో దేశాల నుంచి వచ్చి ఫ్రాన్స్‌లో నివసిస్తున్న వాళ్లు ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 1960లలో ఫ్రాన్స్‌లో కార్మికుల కొరత తీవ్రంగా ఉండటంతో ఆ దేశాలనుంచి వలస వచ్చి పనిచేయటానికి వీసాలు ఇచ్చింది. ఈ వలస కుటుంబాల ఆడపిల్లలు బడికి వెళ్లేటప్పుడు తలకి గుడ్డ కట్టుకుంటారు. ఈ చట్టం చేసిన తరవాత తలకి గుడ్డ కట్టుకున్నందుకు ఈ పిల్లలు బడినుంచి బహిష్కరించబడ్డారు.

LGYLLE

## కీలక పదాలు

| | |
|---|---|
| 1. ప్రాథమిక హక్కులు | 2. ప్రజాస్వామ్యం |
| 3. భయోత్పాతం | 4. పౌర చట్టాలు |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. మీ పరిసర ప్రాంతాలలో వివిధ మత ఆచారాల జాబితా తయారు చేయండి – రకరకాల ప్రార్థనలు, దేవుడిని కొలిచే విధానాలు, పవిత్ర స్థలాలు, భక్తిపాటలు, సంగీతం, మొదలైనవి. మత ఆచరణ స్వేచ్ఛను ఇది సూచిస్తోందా? $AS_3$
2. మా మతం శిశు హత్యలను అనుమతిస్తుంది అని ఒక మత ప్రజలు అంటే ప్రభుత్వం అందులో జోక్యం చేసుకుంటుందా? మీ సమాధానానికి కారణాలు పేర్కొనండి. $AS_1$
3. ఒకే మతంలో భిన్న దృక్పథాలకు సంబంధించి కొన్ని ఉదాహరణలను సేకరించండి. $AS_1$
4. భారత రాజ్యం మతానికి దూరంగా ఉంటుంది, మతంలో జోక్యం చేసుకుంటుంది. ఈ భావన గందరగోళం సృష్టించవచ్చు. ఈ అధ్యాయంలో ఇచ్చిన ఉదాహరణలతో పాటు మీకు అనుభవంలోకి వచ్చిన/ తెలిసిన ఇతర ఉదాహరణలతో దీనిని మరోసారి చర్చించండి. $AS_1$
5. 'లౌకికవాదం అంటే ఏమిటి?' అన్న భాగం చదివి దానిపై వ్యాఖ్యానించండి. $AS_2$

పాఠం 21

# ఆధునిక కాలంలో కళలు - కళాకారులు









- ప్రదర్శన కళల ఫోటోలు ఇక్కడ కొన్ని ఉన్నాయి. వాటిలో ఎన్నింటిని మీరు గుర్తించగలుగుతారు? ఫోటోల కింద వాటి పేర్లు రాయండి.
- వీటిలో ఏదైనా మీ ఊళ్లో ప్రదర్శింపబడటం చూశారా? మీ అనుభవాన్ని తరగతిలో పంచుకోండి.

ఈ అధ్యాయంలో 20వ శతాబ్దంలో ప్రదర్శన కళాకారుల గురించి తెలుసుకుందాం. పాటలు, నాట్యం, నాటకాలు వంటివి ప్రదర్శించే వాళ్లని ప్రదర్శన కళాకారులు అంటారు. చిత్ర కళాకారులు, శిల్ప కళాకారులు, రచయితలు వంటి కళాకారులకీ ఈ కళాకారులకీ తేడా ఉంది. ప్రదర్శన కళాకారుల పనిని భద్రపరచటానికి లేదు - ప్రతిసారీ వాళ్లు కొత్తగా ప్రదర్శించాల్సి ఉంటుంది.

చాలా వరకు జానపద కళలలో ప్రజలే పాల్గొంటారు. రైతాంగ, గిరిజన స్త్రీ, పురుషులు తమ పనిలో భాగంగా లేదా పండుగలు, తీరిక సమయాల్లో ఆడి, పాడతారు. తెలంగాణలో వ్యవసాయ కూలీల రోజువారీ శ్రమనుంచి 'చుట్టుకాముడు' అనే కళారూపం రూపు దిద్దుకుంది. పనిలో పాడుకునే పాటలే నాట్యం చేస్తూ పాడే పాటలుగా మారాయి. సాధారణంగా వెన్నెల రాత్రులలో మహిళలు చుట్టు కాముడు పాటలు పాడుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ ఆడతారు. అదే విధంగా గ్రామాల్లోని ఆడపిల్లలు చెట్లకు ఉయ్యాలలు కట్టి ఊగుతూ ఉయ్యాల పాటలుగా లక్ష్మి, గౌరీ దేవతలకు సంబంధించిన భక్తి కథలను తెలిపే పాటలు పాడేవాళ్లు. అనేక ఇతర కళారూపాలను ప్రత్యేక బృందాలు ప్రదర్శించేవారు.

LH6VY8

- ప్రత్యేక సందర్భాలలో కుటుంబ సభ్యులు పాడేపాటలు, చేసే నాట్యాల గురించి మీ తల్లిదండ్రులతో, తాత, అవ్వలతో మాట్లాడి తెలుసుకోండి. సందర్భం, నమూనా పాటలతో ఒక జాబితా తయారుచేయండి. ఇటీవల కాలంలో ఈ ప్రదర్శనల్లో ఎటువంటి మార్పులు వచ్చాయి? మీరు తెలుసుకున్న విషయాలు తరగతిలో మిగిలిన విద్యార్థులతో పంచుకోండి.
- మీలో ఎవరికైనా ఈ పాటలు, నాట్యాలు తెలిసి ఉంటే తరగతి గదిలో ప్రదర్శించండి.



చిత్రం 21.1 : థింసా నాట్యం

## వివిధ నాట్యరూపాలు

### థింసా

అరకులోయలో ఉండే గిరిజన సముదాయాలు థింసా నాట్యం చేస్తారు. పెళ్లిళ్లు, పండుగల సమయంలో ఈ సమూహాలు ఒక ఊరి నుంచి మరో ఊరికి ప్రయాణించి థింసా నాట్యం చేస్తారు. థింసా ఆడేవాళ్లతోపాటు మోరి, కిరిడి, తుడుం, డప్పు, కొమ్ములు వంటి వాద్యబృందాలు కూడా ఉంటాయి. ఈ థింసాలో ఎనిమిది రకాలు ఉన్నాయి: బోడ థింసా, గుందేవి థింసా, గూడి బేత థింసా, పోతర-తోల థింసా, భాగ్ థింసా, నటికరి థింసా, కుంద థింసా, బయ థింసా. నటికరి థింసా ఒక్కదానిని మాత్రమే బృందంగా ప్రదర్శించరు.

### గుస్సాడి

ఆదిలాబాద్‌కి చెందిన రాజగోండ్లు దీపావళిని పెద్ద ఎత్తున జరుపుకుంటారు. ఈ సందర్భంగా వీరు చేసే నాట్యాన్ని గుస్సాడి అంటారు. వీరు నెమలి ఈకలు, దుప్పి కొమ్ములు వంటి వాటితో చక్కగా అలంకరించుకుంటారు. దీనితో పాటు డప్పు, తుడుం, పిప్రి, కలికోం వంటి వాద్య పరికరాలతో సంగీతం వాయిస్తారు.

### లంబాడి

ఆంధ్రప్రదేశ్‌లో లంబాడీలు పాక్షిక సంచార జాతులు. విత్తటం, నాటటం, కోయటం వంటి రోజువారీ పనులతో ముడిపడిన కదలికల ఆధారంగా వీరి నాట్యాలు ఉంటాయి. పూసలు, అద్దాలతో కుట్టిన వాళ్ల బట్టలు చాలా అందంగా ఉంటాయి. దసరా, దీపావళి, హోలి వంటి పండుగలప్పుడు వాళ్లు ప్రదర్శనలు ఇస్తే ప్రజలు డబ్బులు ఇచ్చేవాళ్లు.

### సదిర్ నాట్యం

ఇది ఒక్కరు చేసే నాట్యం. శతాబ్దాలుగా దేవాలయాల్లో దేవదాసీలు ఈ నాట్యం చేసే వాళ్లు. దక్షిణ భారతంలో ప్రత్యేకించి తమిళనాడులో రాజదర్బారులో ప్రదర్శించేవాళ్లు.

### కురవంజి

మహిళలు చేసే బృందనాట్యం. ప్రత్యేకించి ప్రేమికుడి ప్రేమను పొందే అంశంతో అమ్మాయిలు సాహిత్యం లేదా కవితా రూపంలో ప్రదర్శించే బృందనాట్యం.

### కూచిపూడి

ఆంధ్రప్రదేశ్‌లోని కూచిపూడి గ్రామానికి చెందిన ఒక నృత్య నాటకం. ఇందులో పాత్రలన్నింటిని పురుషులే అభినయిస్తారు. ఇది పురాణాలకు సంబంధించిన కథాంశాలతో కూడినది.

శతాబ్దాలుగా నాట్య కళాకారులు, కథలు చెప్పేవాళ్లు, పాటలు పాడేవాళ్లు, నాటకాలు వేసే వాళ్లు ప్రజలకు వినోదం, రసాస్వాద అనుభూతులు అందించటమే కాకుండా ఆధ్యాత్మిక సందేశాలు ఇచ్చేవాళ్లు. సమాజంలోని దురాచారాలను విమర్శించి ప్రత్యామ్నాయాలను సూచించేవాళ్లు. విస్తృత సామాజిక లక్ష్యాల కోసం ప్రజలను సమీకరిస్తూ ఈ ప్రదర్శన కళాకారులు కీలకపాత్ర పోషించేవాళ్లు. ఫకీరు పాటలు, బైరాగి పాటలు, దండగానం, లత్కోరుసాబ్ మొదలైన వాటిని సంచార బైరాగులు, ఫకీర్లు పాడేవాళ్లు. అవి తెలుగులో, దెక్కనీ ఉర్దూలోనే కాకుండా రెండు భాషలూ కలగలిపి కూడా ఉండేవి.

*బుర్రకథ, గొల్లసుద్దులు* వంటి అనేక ఇతర కళా రూపాలకు పెద్ద బృందం అవసరం. మొదట ఒక ఊరినుంచి వేరొక ఊరు వెళ్లే గొర్రెల కాపరులు ఈ కళారూపాలను ప్రదర్శించేవాళ్లు. వీళ్లలో కొంతమంది వీరశైవం వంటి మత సాంప్రదాయాలకు చెందిన వాళ్లు కూడా ఉండేవాళ్లు.




*చిత్రం 21.2 : బైరాగి*

- ఊరూరూ తిరిగే కళాకారులు ప్రదర్శించేవాటిని మీరు ఏమైనా చూశారా? వాళ్లు ఎవరు, ఏం చేశారు, ప్రేక్షకులు వాళ్లపట్ల ఎలా వ్యవహరించారు వంటి వివరాలను తోటి విద్యార్థులతో పంచుకోండి.
- అటువంటి కళాకారులు దగ్గరలో నివసిస్తూ ఉంటే వాళ్లని కలుసుకుని వాళ్ల కళలు, జీవితాల గురించి తెలుసుకోండి.

ప్రదర్శన కళాకారులు తమ మనుగడ ఎలా సంపాదించుకునేవాళ్లు? కొంతమంది కళాకారులు ప్రదర్శనలు ఇస్తూ ఊరూరా తిరిగేవాళ్లు. ఇటువంటి కళాకారులను గ్రామపెద్ద లేదా భూస్వామితో పాటు సాధారణ ప్రజలు కూడా ఆదరించేవారు. గ్రామప్రజలు ఈ కళాకారులకు ధాన్యం ఇచ్చేవాళ్లు. వాళ్లని కళాకారులుగా ప్రజలు గౌరవించేవాళ్లు, వాళ్లు అందించే వినోదానికి ప్రజలు వాళ్లని స్వాగతించే వాళు ్ళ. గుడులలో జరిగే పండుగలలో, ఊరిలో జరిగే ఉ త్సవాల్లో వీళ్లు తప్పనిసరిగా పాల్గొనేవాళ్లు. వానలు కురుస్తాయని, చెడు దరిచేరకుండా ఉంటుందని నమ్మటం వల్ల ప్రజలు వీళ్లతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేసేవాళ్లు.

చాలామంది కళాకారులు ఊరూరు తిరగకుండా చక్రవర్తులు, రాజులు, జమీందార్ల పోషణలో ఉండే వాళ్లు. ఈ కళలను అభ్యసిస్తూ, ఇతరులకు నేర్పుతూ, దర్బారులో, మహల్లులో ప్రదర్శనలు ఇస్తూ వీళ్లు కాలం గడిపేవాళ్లు.

ముందుగా మనం బుర్రకథ, తోలుబొమ్మలాట మొదలైన సంచార కళాకారుల గురించి తెలుసుకుందాం.

LH8HN2

### బుర్రకథ

*బుర్రకథ* అనేది ఆంధ్రప్రదేశ్‌లో కథచెప్పే కళారూపం. కోస్తా ఆంధ్ర ప్రాంతంలో దీనిని *జంగమ కథ* అంటారు, తెలంగాణలో *తంబూర కథ*, రాయలసీమలో *తందాన కథ* అంటారు. 12, 13వ శతాబ్దంలో వీరశైవ ఉద్యమ నేపథ్యంలో బుర్రకథ ఏర్పడింది.



చిత్రం 21.3 : బుర్రకథ ప్రదర్శన

పరిచయం అయిన తరవాత ముగ్గురు కళాకారులు కథలోని వివిధ పాత్రలు పోషిస్తూ, వివిధ ఘటనలను కలుపుతూ ప్రదర్శన కొనసాగిస్తారు. బుర్రకథలో కథనం చాలా ముఖ్యమయినది. దీనికి ఆట, వాచ్యం, పాట, నటన తోడై కథనంలో ఆసక్తిని పెంపొందిస్తాయి. బుర్రకథ సాధారణంగా రెండు లేదా మూడు గంటలు ఉంటుంది. పెద్ద కథలు చెప్పేటప్పుడు మాత్రం కొన్ని రాత్రులు వరసగా చెబుతారు. బుర్రకథను ఎక్కువగా దసరా లేదా సంక్రాంతి పండుగ సందర్భాల్లో ప్రదర్శిస్తారు. సాధారణంగా రామాయణ, మహాభారతంలోని కథలు, కాంభోజరాజు కథ, బొబ్బిలి కథ, పల్నాటి కథ, కాటమరాజు కథ వంటి రాజుల కథలు చెబుతారు.

దీంట్లో ప్రధాన కథకుడు కుడి భుజం మీదగా వేసుకునే తంత్రి వాద్యమైన తంబురను 'బుర్ర' అంటారు. సాధారణంగా ఈ కళను పిచ్చుగుంట్ల లేదా జంగాలు వంటి కులాలు/ తెగలకు సంబంధించిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు లేదా ముగ్గురు ప్రదర్శిస్తారు. దీంట్లో కథకుడు అందెలు వేసుకుని ఆడుతూ, తంబుర మీటుతూ కథ చెబుతాడు. ఈ కథచెపుతూ అతడు రంగస్థలం మీద లయబద్ధంగా ముందుకీ వెనక్కీ కదులుతుంటాడు. కథకుడు కుడిచేయి బొటనవేలుకు అందెలు తొడుక్కొని పాటకు అనుగుణంగా తాళం వేస్తుంటాడు. ప్రధాన కథకుడికి ఒకరు లేదా ఇద్దరు వంతగాళ్లు ఉంటారు. వీళ్ల చేతిలో డక్కి లేదా బుడికె అనే మట్టితో చేసిన మృదంగంలాంటి పరికరం ఉంటుంది. కుడిచేతివైపున ఉండే వంతగాడు పౌరాణిక, జానపద కథలలో సైతం ప్రస్తుత సామాజిక, రాజకీయ అంశాలను చొప్పిస్తూ వ్యాఖ్యానిస్తుంటాడు. ఎడమ చేతివైపు ఉండే వంతగాడిది ప్రధానంగా హాస్యగాని పాత్ర.

'వినరా భారత వీర కుమార విజయం మనదేరా', 'తందాన తాన' అన్నది బుర్రకథలో తరచు వినిపించే పల్లవి. బుర్రకథ వివిధ దేవుళ్లను కీర్తిస్తూ సాయంత్రం మొదలవుతుంది. స్థల, కాల, సందర్భ వివరాలతో కథకుడు కథను పరిచయం చేస్తాడు, వంతగాళ్లు వంత పాడుతుంటారు.

**ప్రస్తుత కాలంలో బుర్రకథ:** స్వాతంత్ర ఉద్యమ కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో బుర్రకథను ప్రధాన స్రవంతిలోకి తెచ్చి రాజకీయ అవగాహన కోసం ఉపయోగించుకున్నారు. ప్రజలకు విషయం అర్థమయ్యేలా చేసి, వాళ్లలో చైతన్యం కలిగించటానికి బుర్రకథ సమర్థంగా ఉపయోగపడింది.

ప్రజలలో తిరుగుబాటు భావనలను ప్రేరేపిస్తున్నారన్న అనుమానంతో బుర్రకథ కళాకారులను బ్రిటిషు, నైజాం ప్రభుత్వాలు వేధింపులకు గురిచేశాయి. జాతీయతా వాదం, సామ్యవాదం వంటి కథలను బుర్రకథ కళాకారులు చేపట్టడం ఈ వేధింపులకు దారితీశాయి. బ్రిటిషు పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు వంటి తిరుగుబాటు వీరుల బుర్రకథలు ప్రజలలో జాతీయతా భావాన్ని రగిల్చాయి.

కమ్యూనిస్టు పార్టీకి మద్దతుదారులైన ప్రగతిశీల కళాకారులు 1943లో ప్రజానాట్య మండలిగా ఏర్పడ్డారు. తెలంగాణ గ్రామాలలో జాతీయతావాదం, సామ్యవాదం వంటి భావాలను ప్రచారం చేయటానికి బుర్రకథ వంటి జానపద కళారూపాలను ఆహ్వానించారు. కమ్యూనిస్టు పార్టీలో మహిళా సభ్యులైన మోటూరి ఉదయం, కోటేశ్వరమ్మ వంటి వాళ్లు బుర్రకథ ప్రదర్శనలు ఇచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో నాజర్ అనేక బుర్రకథ ప్రదర్శనలు ఇచ్చాడు. 'మాస్కో పొలిమేరలోన' అన్న అతడి బుర్రకథ ఎంతో జనాదరణ పొందింది. ఉద్యమం కోసం తెలంగాణ కళాకారులు కొత్త బుర్రకథలను రాసి ప్రదర్శించారు. వాటిల్లో తిరునగిరి రామాంజనేయులు 'తెలంగాణ వీరయోధులు', ఆదూరి అయోధ్య రామ 'నైజాం విప్లవం', ఎస్.కె. చౌదరి 'కాసిం రజ్వి', సుంకర సత్యనారాయణ 'కష్టజీవి' ఎన్నదగినవి. ఈ బుర్రకథలలో ప్రజల సామాజిక-ఆర్థిక సమస్యలు, ఉద్యమ నాయకుల సాహసగాథలు ప్రధానంగా ఉండేవి. ఉదాహరణకు సుంకర సత్యనారాయణ 1944లో 'తెలంగాణ' అన్న బుర్రకథ రాశాడు. విస్నూరి దేశ్‌ముఖ్ అనే భూస్వామి దౌర్జన్యాలు, అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన ముస్లిం పేదరైతు షేక్ బందగి సాహసాలను వివరించే కథ ఇది.

ప్రస్తుతం అక్షరాస్యత, ఎయిడ్స్ వంటి అంశాలపై ప్రజలలో అవగాహన కల్పించటానికి ప్రభుత్వం బుర్రకథ బృందాలను ఆదరిస్తోంది. బుర్రకథలు టీవీలో ప్రసారమవుతున్నాయి. అయితే గ్రామాలలో తమ స్థానాన్ని ఇతర వినోద సాధనాలు ఆక్రమించడం వల్ల ప్రజల ఆదరణను కోల్పోయిన సంప్రదాయ కళాకారులు ఈ కళను వదిలి వేశారు.

*బుర్రకథ అనగానే ఎవరికైనా గుర్తువచ్చే పేరు షేక్ నాజర్ వలి. అతడు బుర్రకథకు విస్తృత ప్రజాదరణ లభించేలా చేశాడు, దానివల్ల అతడు ఎంతో జనాదరణ పొందాడు. నాజర్ బుర్రకథను వినటానికి ప్రజలు ఎంతో దూరం ప్రయాణం చేసేవాళ్లు. నాజర్ 1920లో ఒక పేద దూదేకుల కుటుంబంలో పుట్టాడు. తెనాలిలో బాలరత్న నాటక సమాజంతో మొదలుపెట్టి నాలుగు దశాబ్దాలపాటు ప్రదర్శనలు ఇచ్చాడు. ఆంధ్ర కరువు, 1943 బెంగాల్ కరువుపై అతడి బుర్రకథలు ప్రజలను ఎంతగానో కదిలించివేసేవి. బుర్రకథలను నాజర్ స్వయంగా రాసి, పాడేవాడు. 1940లలో కమ్యూనిస్టు పార్టీని ప్రజలలోకి తీసుకెళ్లటానికి దాంట్లో కళాకారుడిగా పనిచేశాడు. అనేక సినిమాలలో నాజర్ బుర్రకథలు ఉన్నాయి. 1986లో 'పద్మశ్రీ'తో సహా అతడు ఎన్నో బహుమతులు పొందాడు. 'పింజారి' అన్న పేరుతో విడుదలైన అతని జీవిత చరిత్ర అతడు ఎదుర్కొన్న పేదరికం, సమస్యలను వివరిస్తుంది. ప్రజలకోసం ఇచ్చిన ప్రదర్శనల ద్వారా అతడి ప్రపంచం ఎంతో విశాలమయ్యింది. బుర్రకథను వృత్తిగా చేపట్టటంలో చాలామందికి నాజర్ స్ఫూర్తిగా నిలిచాడు. అయితే నాజర్ చివరికి తీవ్ర పేదరికంలో చనిపోయాడు.*

### తోలుబొమ్మలాట

LHFRZV

సంచార కళాకారులు తెరవెనక నుంచి ప్రదర్శించే తోలు బొమ్మలాట ఇది. తోలుబొమ్మలను జంతు చర్మంతో చేస్తారు. జంతుచర్మాన్ని శుద్ధిచేసి, కొంత మేరకు పారదర్శకంగా చేస్తారు. తరవాత రకరకాల ఆకారాలు, పరిమాణాలలో కత్తిరిస్తారు. పాత్ర వయసు, స్వభావాలను బట్టి తోలుబొమ్మలు 1 నుంచి 6 అడుగుల వరకు ఉంటాయి. రంగు రంగులతో ఉండే ఈ తోలుబొమ్మలు మెడ, భుజం, మోచేయి, తుంటి, మోకాలు వద్ద అతుకులతో ఉంటాయి. వీటికి ఉండే కట్టెపుల్లలతో అవి కదిలేటట్లు చేస్తారు.



చిత్రం 21.4 : తోలుబొమ్మలాట

## ప్రదర్శన

సంప్రదాయ తోలుబొమ్మలాటలో కథనం పాట లాగా ఉంటుంది. కథకుడుగానీ, గాయకులుగానీ ప్రేక్షకులకు కనపడరు. గొంతు మార్చటం ద్వారా ఒక్కొక్క పాత్రకి ఒక ప్రత్యేకతను కథకులు ఇస్తారు.

ఈ ప్రదర్శనలు సాధారణంగా రాత్రి 9 గంటలకు మొదలయ్యి రాత్రంతా కొనసాగుతాయి. తోలుబొమ్మలాట బృందంలో 8 నుండి 12 మంది కళాకారులు ఉంటారు. సాధారణంగా ఈ బృందంలో మహిళా పాత్రలకు గొంతు ఇచ్చే ఇద్దరు మహిళలు, పురుష పాత్రలకు ఇద్దరు పురుషులు, హార్మోనియం, శృతి, తప్పెట వంటి ముగ్గురు వాయిద్యకారులు, తోలుబొమ్మలను అందించటానికి, దీపాలను చూసుకోటానికి ఒక సహాయకుడు ఉంటారు.

ప్రదర్శనకు ఊరిలో బహిరంగ ప్రదేశాన్ని ఎన్నుకుంటారు. చతురస్రాకారంలో నాలుగు వెదురు బొంగులకు తెల్లని గుడ్డకట్టి తెరగా ఉపయోగిస్తారు. కథకుడు లేదా వ్యాఖ్యాత తెరవెనక ఉంటాడు. తెరకు ముందు ఉండే దీపాల వల్ల తోలుబొమ్మలు కనపడతాయి.

## తోలుబొమ్మలాటలో ప్రదర్శించే అంశాలు

ప్రధానంగా రామాయణ, మహాభారతం వంటి ఇతిహాసాలు, స్థానిక వీరగాథలకు సంబంధించిన అంశాలను ప్రదర్శనకు ఎంచుకుంటారు. పెద్దపెట్టున ఉండే హాస్యం, ప్రస్తుత పరిస్థితులపై చెణుకులు ఉంటాయి. ఇతిహాసాలలో అంశాన్ని తీసుకున్నప్పుడు స్థానికంగా ప్రచారంలో ఉన్న కథనాన్ని ఎంచుకుంటారు. కొత్త కథలు చాలా అరుదుగా రాస్తారు. ఈ ప్రదర్శకులు సాధారణంగా ఒక ఊరినుంచి మరొక ఊరికి తిరుగుతుంటారు. గ్రామస్తుల నుంచి డబ్బులు, ధాన్యం తీసుకుంటూ, ప్రదర్శనలు ఇస్తూ ఇలా సంవత్సరంలో తొమ్మిది నెలలపాటు సంచారం చేస్తుంటారు.

సినిమాలు, టెలివిజన్ వంటి ఆధునిక సమాచార, వినోద రూపాలు అందుబాటులోకి రావటంతో సంప్రదాయ ప్రదర్శన కళలకు ప్రజల ఆదరణ తగ్గిపోతూ ఉంది. అంతేకాకుండా గతంలో మాదిరి గ్రామ పెద్దలు, భూస్వాములు ఈ కళాకారులకు పోషకులుగా ఉండటం లేదు. ఈ కారణంగా జానపద కళలు క్షీణించిపోతున్నాయి, కళాకారులు జీవనోపాధి సమస్యను ఎదుర్కొంటున్నారు. వీళ్లు సంచార కళాకారులు కావటంవల్ల వాళ్ల పిల్లలు ఆధునిక పాఠశాలల్లో చదువుకునే అవకాశం లేదు. ఇక వాళ్లకు మిగిలింది నైపుణ్యంలేని కూలిపని చేయటమే.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయటానికి ఈ కళారూపాలను ఎంచుకోవటం ద్వారా ప్రభుత్వం కొంతమేరకు సహాయపడుతోంది. పారిశుద్ధ్యం, ఆరోగ్య సేవలు, ఆడపిల్లల చదువులు, కుటుంబ నియంత్రణ, పర్యావరణం వంటి అంశాలపై అనేక సంప్రదాయ బృందాలు ప్రదర్శనలు ఇస్తున్నాయి. ఇటువంటి ప్రదర్శనలలో చెప్పాల్సిన అంశాన్ని ఈ ప్రదర్శనలకు ప్రాయోజకులైన ప్రభుత్వమే అందచేస్తుంది.

తోలుబొమ్మలాట కళాకారుల్లో కొన్ని కుటుంబాలు తోలుతో చేసి గోడకు వేలాడదీసే బొమ్మలు, విద్యుత్తు

దీపాలకు అలంకరణలు వంటి ప్రత్యామ్నాయ జీవనోపాధులను చేపట్టారు. అనంతపురములో ఉన్న సహకార తోలుబొమ్మల తయారీకేంద్రం ఈ కళను ప్రోత్సహించటానికి కృషి చేస్తోంది.

- టీవి, సినిమాలు ప్రధాన వినోద సాధనాలుగా మారుతున్న పరిస్థితుల్లో సంప్రదాయ జానపద కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందా? కారణాలు పేర్కొనండి.
- జాతీయ ఉద్యమ కాలంలో కళాకారుల పరిస్థితుల్లో, వాళ్లు ఇచ్చే ప్రదర్శనల్లోని అంశాల్లో ఎటువంటి మార్పులు చోటు చేసుకున్నాయి?
- జాతీయవాదులు, కమ్యూనిస్టులు జానపద కళలను పునరుద్ధరించటానికి ఎందుకు ప్రయత్నించారు?

## భరతనాట్యం – క్షీణత, పునరుజ్జీవనం

భారతదేశంలోని సంప్రదాయ నృత్యాలలో అనేకం తమ మూలాలు భరతుడు రాసిన 'నాట్యశాస్త్రం'లో ఉన్నాయని పేర్కొంటాయి. ఏదేమైనా ఈనాడు భరతనాట్యం అన్నది తమిళనాడుకు చెందిన ఒక ప్రత్యేక నాట్యరూపాన్ని సూచిస్తుంది. వంద సంవత్సరాల క్రితం భరతనాట్యం అన్న పదం ఉపయోగంలో లేదు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో ఆనాడు ఉన్న సంప్రదాయ నృత్యాలను సదిర్, కురవంజి, కూచిపూడి అనేవాళ్లు.

మనకి ఈనాడు తెలిసిన భరతనాట్యం సదిర్ నాట్యంనుండి ఉద్భవించింది. సదిర్ నాట్యాన్ని దేవాలయాల్లో ఆరాధనలో భాగంగా దేవదాసీలు ప్రదర్శించేవాళ్లు.

LHHDPP

దేవాలయాలలో సేవలకు అంకితం చేసిన దాసీలను దేవదాసీలు అనేవాళ్లు. ఆలయ పూజలు, ఆచారాలలో దేవదాసీల నృత్యం ఒక భాగం. దేవునికి కానుకగా యుక్తవయస్సులోని ఆడపిల్లలను



*చిత్రం 21.5 : 'ఆంధ్రప్రదేశ్‌లోని ఒక ప్రదర్శన కళారూపం (ఒగ్గుకథ)*



చిత్రం 21.6 : "దక్షిణ భారతంలో అడుక్కునే నాట్యగాళ్లు", 1863లో ఇలస్ట్రేటెడ్ లండన్ న్యూస్‌లో ప్రచురితమైన ఫోటో

LHPN2I

తల్లిదండ్రులు అర్పించేవాళ్లు. ఇలాంటి ఆడవాళ్లు పెళ్లి చేసుకోకూడదు. పూజారులు, పెద్దమనుషుల చేతిలో వీళ్లు దోపిడీకి గురయ్యేవాళ్లు. దేవదాసీలకు పుట్టిన పిల్లలు వాళ్ల మాదిరే జీవించేవాళ్లు. సంగీత, నాట్య కళల్లో దేవదాసీలు నైపుణ్యాన్ని సాధించారు. నట్టువనార్ల (నాట్యంనేర్పే గురువులు, సాధారణంగా వీళ్లు దేవదాసీలకు పుట్టిన మగ సంతానం) సహాయంతో వీళ్లు తరతరాలుగా తమ సంప్రదాయాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు.

భారతీయ కళలు మొరటుగా ఉంటాయని, అనైతికమైనవని బ్రిటిషు పాలనలో పేర్కొంటూ పాశ్చాత్య నాగరికత భావనల దృష్ట్యా ఇవి చాలా నాసిరకంగా ఉంటాయని ప్రచారం జరిగింది. చదువుకున్న భారతీయులలో చాలామంది ఈ భావనలతో ప్రభావితమయ్యి సదిర్ వంటి కళల పట్ల చిన్నచూపు ప్రదర్శించసాగారు. దేవదాసీ బృందాలకు వ్యభిచారంతో సంబంధం ఉండటం వల్ల కూడా సదిర్‌కి చెడ్డపేరు వచ్చింది. ఈ నాట్యంతో సంబంధం ఉన్న పేర్లు సైతం సదిర్, 'నాచ్', దాసి అట్టం వంటివి కూడా అగౌరవంగా చూడబడ్డాయి. 19వ శతాబ్దం చివరలో, 20వ శతాబ్దం మొదట్లో కందుకూరి వీరేశలింగం వంటి సంఘ సంస్కర్తలు యాంటి-నాచ్, దేవదాసీ వ్యతిరేక ఉద్యమాలను చేపట్టారు. దేవదాసీలతో ముడిపడి ఉన్న వ్యభిచారాన్నే కాకుండా, కళను కూడా సామాజిక దురాచారంగా పేర్కొంటూ వ్యతిరేకించారు. బొంబాయి, మద్రాసు రాష్ట్రాలలో 1934-1947 మధ్య దేవదాసీ వ్యవస్థను (ఆలయాలకు / దేవుళ్లకు ఆడపిల్లలను అంకితం చేయటాన్ని) రద్దుచేస్తూ చట్టం చేశారు. దేవదాసీ విధానానికి వ్యతిరేకంగా హైదరాబాదు రాష్ట్రంలో భాగ్యరెడ్డి వర్మ ఉద్యమాన్ని నడిపి దేవదాసీ వ్యవస్థను అంతంచేయడానికి నైజాంను ఒప్పించాడు.

దేవదాసీ వ్యవస్థ నిషేధానికి ఈ నిరంతర వత్తిడి ఫలితంగా 20వ శతాబ్దం ఆరంభం నాటికి తమిళనాడులో సైతం ఈ సంప్రదాయ నృత్యరూపం దాదాపుగా తుడిచిపెట్టుకుపోయింది. తమను ఆదరించేవాళ్లను కోల్పోయి, జీవనోపాధిని కోల్పోయి దేవదాసి కళాకారులు ఎన్నో కష్టాలకు గురయ్యారు.

- దేవదాసీ వ్యవస్థను వ్యతిరేకించే వాళ్లు, సమర్థించేవాళ్ల మధ్య చర్చ జరుగుతోందని ఊహించుకోండి. ఇరువర్గాలు చేసే వాదనలను పేర్కొనండి. ఈ చర్చతో ఒక చిన్న రూపకం తయారు చేయండి.

- దేవదాసీ జీవితం గడపటం ఇష్టంలేని ఆ కుటుంబంలో పుట్టిన అమ్మాయి కష్టాలు ఊహించుకోండి. ఆమె తన మిత్రురాలికి తన వ్యధను వ్యక్తపరుస్తూ ఉత్తరం రాసినట్లు ఊహించుకుని ఆ ఉత్తరం మీరు రాయండి.

## పునరుద్ధరణ

అన్ని వ్యతిరేకతలను తట్టుకుని కొన్ని కుటుంబాలు ఈ సంగీత, నృత్య సంప్రదాయాన్ని కాపాడుతూ వచ్చాయి. వివిధ నేపథ్యాలకు చెందిన వ్యక్తులు దీని పునరుద్ధరణకు కృషి చేశారు: భారత జాతీయ ఉద్యమకారులు, భారతీయ కళలపట్ల ఆసక్తి ఉన్న పాశ్చాత్యులు, దేవదాసీలు కాకుండా భరతనాట్యం నేర్చుకున్నవాళ్లు, దేవదాసీలు. వీళ్లందరూ లేకుంటే భరతనాట్యం మనకు మిగిలి ఉండేది కాదు. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ముడిపడి ఉన్నవాళ్లందరూ పైన పేర్కొన్న వాళ్లకు రుణపడి ఉంటారు.

లాయరు, స్వాతంత్ర్య పోరాటయోధుడైన ఇ.కృష్ణ అయ్యర్ భరతనాట్యం నేర్చుకున్నాడు. దీనికున్న కళంకాన్ని తొలగించటానికి అతడు మహిళా వేషధారణలో నాట్య ప్రదర్శనలు ఇచ్చేవాడు. ఈ కళలో ప్రజలకు ఆసక్తి కలిగించటానికి ఉద్యమించాడు. మద్రాసు (ప్రస్తుత చెన్నై)లో సంగీత అకాడమీని స్థాపించటంలో కూడా అతడు పాత్ర పోషించాడు. ఈ వేదికపై నుంచి దేవదాసీల ద్వారా భరతనాట్య ప్రదర్శనలు ఇప్పించాడు. మొదటి ప్రదర్శన వివాదాస్పదం కావటంతో రెండవ ప్రదర్శనకు తండోపతండాలుగా ప్రజలు వచ్చారు. సంగీత అకాడమీ వేదికపై చోటు దొరకటం వల్ల ఈ కళను అందరూ గౌరవించటం మొదలుపెట్టారు.

దాంతో గౌరవప్రదమైన కుటుంబాల నుంచి కూడా యువ కళాకారులు సైతం భరతనాట్యం పట్ల ఆకర్షితులు కాసాగారు. ప్రజలు ముందుగా విభ్రాంతికి గురైనా గౌరవప్రదమైన కుటుంబాలు దీంట్లో భాగస్వాములు కావటంతో ఈ కళ పునరుద్ధరణకు అనుకూలంగా ప్రజామద్దతు కూడా తోడయ్యింది. ఇదే సమయంలో బ్యాలెరినా అన్నా పావ్‌లోవా వంటి పాశ్చాత్య కళాకారులు భారతీయ సాంస్కృతిక వారసత్వంపై ఆసక్తి కనబరచసాగారు. థియోసాఫికల్ ఉద్యమంలోని పాశ్చాత్యులు భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రచారం చేయసాగారు.



*చిత్రం 21.7 : రుక్మిణీదేవి*

అన్నా పావ్‌లోవా శిష్యురాలి వద్ద రుక్మిణీదేవి బ్యాలే నృత్యం నేర్చుకుంది. భారతీయ సంప్రదాయ నృత్యం నేర్చుకోమని రుక్మిణి దేవికి పావ్‌లోవా సలహా ఇచ్చింది. థియోసోఫిస్ట్ కుటుంబంలో పెరిగిన ప్రత్యేక నేపథ్యం వల్ల అప్పటి భరతనాట్యాన్ని సంస్కరించి దాంట్లోని ఆధ్యాత్మికతను వెలికి తీయటం రుక్మిణీదేవికి సాధ్యమయ్యింది.

భరతనాట్యం పునరుద్ధరణకు దేవదాసీల సంఘం ఒకటి చేతులు కలిపింది. రుక్మిణీదేవి గురువుతోపాటు బెంగుళూరు నాగరత్నమ్మ వంటి కళాకారులు, బాలసరస్వతి వంటి ప్రఖ్యాత నాట్యకళాకారులు ఉన్నారు. ఈ సాంప్రదాయాన్ని పునరుద్ధరించాలని, అది దేవదాసీల చేతుల్లోనే ఉండాలని వాళ్లు కోరుకున్నారు. వాళ్ల నుంచి వేరుచేస్తే ఆ కళ

అంతరించిపోతుందన్నది వాళ్ల వాదన. ఈ కళ బతకాలంటే దానిని గౌరవప్రదమైన చేతులకు బదిలీ చేయాలని చదువుకున్నవాళ్లు భావించారు. చివరికి రెండు వర్గాల వాళ్లు ఈ నాట్య పునరుద్ధరణకు దోహదపడ్డారు. ఇతర కులాల నుంచి వచ్చినవాళ్లకి దేవదాసీలు, నట్టువనార్లే శిక్షణ ఇచ్చారు.

1935లో రుక్మిణీదేవి ఇచ్చిన తొలి ప్రదర్శన ఒక మైలురాయి వంటిది. ఆమె ప్రయత్నాల వల్ల మద్రాసులోని సనాతన కుటుంబాలలో అధిక శాతం ఈ నాట్యానికి మద్దతు ఇచ్చాయి. ఆహార్యం, రంగస్థల అలంకరణ, ప్రదర్శనాంశాలు, వాద్య సహకారం మొదలైన వాటిలో ఆమె తెచ్చిన సంస్కరణల వల్ల భరతనాట్యం అసభ్యమైనదన్న సనాతన వర్గాల వ్యతిరేకత తొలగిపోయింది. ఆమె కళాక్షేత్ర అనే సంస్థను స్థాపించి గొప్ప కళాకారులను, వాయిద్యకారులను దానికి ఆకర్షింపజేసి వారితో కలసి నాట్యంలో కొన్ని తరాలకు ఆమె శిక్షణ ఇచ్చింది. కళాక్షేత్ర ఒక ఆధునిక సంస్థ. ఇది కళాకారులకు ఉద్యోగాలు ఇచ్చి వారు బోధించడానికి, ప్రదర్శనలు ఇవ్వడానికి డిగ్రీ, సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తుంది. ఏ విద్యార్థి అయినా నాట్య కుటుంబానికి చెందినా, చెందకపోయినా ఇక్కడ నాట్యం నేర్చుకోవచ్చు.

దేవదాసీల సంప్రదాయకళను బాలసరస్వతి ప్రోత్సహించారు. ఈ కళలో సంస్కరణలు అవసరం లేదని, దానివల్ల కళ పక్కదారులు పట్టే అవకాశం ఉందని ఆమె భావించారు. ఆమె తన దేవదాసీ వారసత్వానికి కట్టుబడి తన నృత్యకళకు ఎంతో గుర్తింపు సాధించారు.

భరతనాట్యం పట్ల భారత సమాజంలో తిరిగి ప్రారంభమైన అవగాహన, ఆసక్తి వల్ల ఎంతోమంది నట్టువనార్లు తమ శిక్షణ కార్యకలాపాలను మళ్లీ ప్రారంభించగలిగారు, ఈ సంప్రదాయ నృత్యంలోకి ఎంతో మంది కళాకారులు ప్రవేశించగలిగారు. నట్టువనార్ల గ్రామాలైన పాండనల్లూర్, వఝూవూర్, తంజావూర్ పేర్లతో ప్రఖ్యాతిగాంచిన వైవిధ్యభరిత నాట్యరీతులు గుర్తింపు పొందాయి. అనతికాలంలోనే భారతీయ సంప్రదాయ నృత్యాలలో భరతనాట్యం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుని, ఎంతో జనాదరణ పొందింది. భారతీయ సంపదగా అంతర్జాతీయ గుర్తింపు పొందటానికి దానికి ఎంతో సమయం పట్టలేదు.

- ఈ నాట్యాన్ని పునరుద్ధరించటానికి ఇతర కులాలవాళ్లు దాన్ని హస్తగతం చేసుకోవటం ఎందుకు ముఖ్యమయ్యింది?
- ఈ నాట్యాన్ని గౌరవప్రదమైనదిగా చేయటానికి అందులో ఎటువంటి మార్పులు చేసి ఉంటారు?
- ఒక వైపున సంప్రదాయంగా ఈ నాట్యం చేస్తున్నవాళ్లని దాంట్లో కొనసాగనివ్వలేదు, ఇంకోవైపున దానిని గౌరవప్రదంగా మార్చటానికి ఇతర కులాలవాళ్లు దానిని చేజిక్కించుకున్నారు. ఈ మార్పులలో ఏదైనా అన్యాయం జరిగిందా?

## ప్రస్తుత కాలంలో భరతనాట్యం

భరతనాట్యం పునరుద్ధరింప బడిన తరవాత 20వ శతాబ్దం చివరికాలం నాటికి అది ఎంతటి ఆదరణ పొందిందంటే భరతనాట్యం నేర్చుకోటానికి ముందుకు వచ్చిన వాళ్లకు సరిపోయేటంతగా శిక్షణా సదుపాయాలు, దాని ప్రమాణాలను కాపాడే పరిస్థితులు లేవు. ఈనాడు భరతనాట్యానికి ప్రేక్షకులు, ప్రాయోజకుల కంటే నేర్చుకునేవాళ్లు ఎక్కువగా ఉన్నారు కాబట్టి అది విస్తరిస్తోంది.

ఈ కళా రూపానికి నట్టువనార్లు కాకుండా నాట్యం చేసేవాళ్లు సంరక్షకులుగా మారారు. పునరుద్ధరణ కాలంలో నాట్యంలో శిక్షణనిచ్చిన నట్టువనార్లే ఆ వారసత్వానికి చెందిన ఆఖరి తరం. నాట్యం నేర్చుకోవాలని చాలామంది కోరుకుంటూ ఉండటం



చిత్రం 21.8 : బాలసరస్వతి

తొలి సంవత్సరాలలోనే దీనిని ఇతరులకు నేర్పటం మొదలు పెడుతున్నారు. ఇది వారి నాట్య నాణ్యతనే కాకుండా వారి బోధనను కూడా ప్రభావితం చేస్తుంది.

నట్టువనార్లు లేకుండా మరింతమంది నాట్యకారులు బోధకులుగా మారటంతో తరతరాలుగా సంప్రదాయంగా నాట్యరూపాన్ని కాపాడుతూ వచ్చిన వారసత్వానికి తెర పడింది. కొంతమంది శిక్షకుల చేతిలో కాకుండా అనేకమంది నాట్యకారులు భరతనాట్యాన్ని బోధించటం వల్ల దీంట్లో కొత్త కొత్త మార్పులు వచ్చే అవకాశాలు పెరిగాయి.

భరతనాట్యంలోని ఈ అనుభవాల మాదిరిగానే కథాకళి, యక్షగానం, ఒడిస్సి, మణిపురి, కథక్ వంటివి కూడా ఇలాంటి ఘర్షణలకు, అనుభవాలకు గురయ్యాయి. వాటి గురించి కూడా తెలుసుకోటానికి ప్రయత్నించండి.

వల్ల శిక్షణ ఇవ్వటం కేవలం నట్టువనార్లకు పరిమితం కాలేదు. కళాక్షేత్ర వంటి సంస్థలలో శిక్షకులుగా శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన నాట్యకారులు కొత్త తరాలకు దీనిని నేర్పిస్తున్నారు. అంతేకాదు చాలా మంది విద్యార్థులు నాట్యకారుల నుంచి వ్యక్తిగతంగా కూడా దీనిని నేర్చుకుంటున్నారు. ప్రదర్శనలలో నట్టువనార్లు పోషించిన పాత్రను ప్రత్యేక శిక్షణ పొందిన సంగీత వాయిద్యకారులు, నాట్యకారులు తీసుకున్నారు.

భరతనాట్య ప్రదర్శనలో ఖర్చులు తగ్గించటానికి చాలామంది రికార్డు చేసిన సంగీతాన్ని ఉపయోగించాల్సి వస్తోంది. ప్రదర్శనల ద్వారా నేడు నాట్యకారులు జీవనోపాధిని సాధారణంగా పొందలేరు. కొన్ని మినహాయింపులు తప్పించి భరతనాట్యం ఈనాడు కుటుంబ మద్దతు ఉన్నవారికి రెండవ ఉపాధిగానే ఉంది. కొంతమంది మాత్రమే ఈ నాట్యం నేర్చుకోటానికి, నాట్యకారులుగా ఎదగటానికి తమ జీవితమంతా అంకితం చేయగలుగుతున్నారు. డబ్బులు సంపాదించటానికి నాట్యకారులు తమ వృత్తిజీవిత

- నట్టువనార్ల ప్రత్యేక పాత్ర ఏమిటి? వాళ్ల పాత్రను నాట్యం చేసేవాళ్లే చేపడితే భరతనాట్యం నాట్యం మీద ఎటువంటి ప్రభావం ఉంటుంది?
- కళాక్షేత్ర వంటి ఆధునిక సంస్థలను ఏర్పాటు చేయటం వల్ల కళపైన, కళాకారులపైన ఎటువంటి ప్రభావం పడింది?
- భరతనాట్యానికి వచ్చిన విపరీత ప్రజాదరణ దానికి ఎలా తోడ్పడింది? ఏ కొత్త సమస్యలకు కారణమయ్యింది?

LHYJ46

## కీలక పదాలు

1. తప్పెటలు  2. అందెలు  3. భిక్షం
4. మూకాభినయం  5. తరంగం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. తప్పు వాక్యాలను సరిచేయండి: $AS_1$

   అ. అన్ని నృత్య రూపాలు భక్తిలో భాగంగా రూపుదిద్దుకున్నాయి.

   ఆ. చారిత్రికంగా కళాకారులను పెద్ద పెద్ద జమిందారులు పోషించారు.

   ఇ. ప్రజలను చైతన్యపరచటానికి బుర్రకథను ఉపయోగించుకున్నారు.

   ఈ. ప్రస్తుతం భరతనాట్యాన్ని ప్రధానంగా నట్టువనార్లు నేర్పుతున్నారు.

2. గత 50 సంవత్సరాలలో జానపద కళాకారుల జీవితాల్లో వచ్చిన మార్పులను చర్చించండి. $AS_1$

3. జానపద కళలు క్షీణతకు గురి అవుతున్నాయా? దీనివల్ల మన సంస్కృతికి ఎటువంటి నష్టం జరుగుతుంది? $AS_4$

4. ఆధునిక జీవితంలోని కొత్త అవసరాలకు అనుగుణంగా జానపద కళలను మలిచి వాటిని పునరుద్ధరించటం సాధ్యమవుతుందా? $AS_4$

5. సదిర్ నాటినుంచి భరతనాట్యంలో చోటుచేసుకున్న ముఖ్యమైన మార్పులు ఏమిటి? $AS_1$

6. కింద పేర్కొన్న వాళ్లల్లో దేవదాసీ వ్యవస్థను సమర్థించినవాళ్లు, వ్యతిరేకించినవాళ్లు, అందులో సంస్కరణలు చేయాలన్నవాళ్లు ఎవరు? $AS_1$

   బాలసరస్వతి, రుక్మిణీదేవి, వీరేశలింగం, భాగ్యరెడ్డి వర్మ, కృష్ణ అయ్యర్, బెంగుళూరు నాగరత్నమ్మ.

7. తమ కళద్వారా జీవనోపాధి పొందటం కళాకారులకు ఎప్పుడూ కష్టంగా ఉండేది. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి? $AS_1$

8. జానపద కళలను పునరుద్ధరించటానికి కళాక్షేత్ర వంటి సంస్థలు దోహదం చేయగలవా? $AS_1$

9. మీ ప్రాంతంలోని కళాకారులను కలిసి, వారు ప్రదర్శించే నాటకాలు, కళారూపాలతో పట్టిక తయారుచేయండి. $AS_3$

# పాఠం 22 సినిమా - ముద్రణా మాధ్యమాలు

లత వేసవి సెలవుల్లో వాళ్ల ముత్తాతగారి పట్టణానికి పోయింది. ముత్తాత రంగయ్యతో కలిసి కొత్తగా విడుదలైన సినిమా చూడాలని అనుకుంది. కాని రంగయ్యకు ఆరోగ్యం బాగుండకపోవటం వల్ల వాళ్లు అతని బాల్యం గురించి కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. తాతగారి బాల్యంలో సినిమాలు లేవని తెలుసుకుని లత ఆశ్చర్యపోయింది. ఆ కాలంలో నాటకాలు ఉండేవి. జానపద కళాకారులు హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలాట వంటివి ప్రదర్శించేవాళ్లు. నాటకాలలో పద్య నాటకాలు, గద్య నాటకాలు ఉండేవి. సుదీర్ఘ రాగాలకు పద్య నాటకాలు ఖ్యాతి గడించాయి. రాత్రంతా మెలకువగా ఉండి చూసిన సత్యహరిశ్చంద్ర నాటకం ఈనాటికీ రంగయ్యకు బాగా గుర్తుంది. భువన విజయం, కన్యాశుల్కం, బొబ్బిలి యుద్ధం, వరవిక్రయం వంటి నాటకాలు కూడా అతడు చూశాడు. తన పాఠశాల వార్షికోత్సవంలో లత కూడా ఒక నాటకంలో పాల్గొంది. ఆమె ఒక నాటక ప్రదర్శన కూడా చూసింది. ఆ కాలంలో ప్రధానంగా నాటకాలే వినోద మార్గాలుగా ఉండేవని తెలుసుకుని లత ఆశ్చర్యపోయింది.

- మీ తల్లిదండ్రులను వారి బాల్యంలోని నాటకాల గురించి అడిగి తెలుసుకోండి.
- కాల క్రమంలో నాటకాలలో ఎటువంటి మార్పులు వచ్చాయి?

LI15SZ





చిత్రం 22.1 : కెమెరా (ఎగువ), ప్రొజెక్టరు (దిగువ)

### సినిమా పుట్టుక

భారతదేశంలో సినిమా పుట్టుక 1896, జులై 7న ముంబయిలో వాట్సన్ హోటల్‌లో ల్యుమియర్ సోదరుల మొదటి బహిరంగ ప్రదర్శనతో జరిగిందని చెప్పవచ్చు. అంచులలో రంధ్రాలు ఉండే సెల్యులాయిడ్ ఫిలిం (చిత్రం 22.1) ఉపయోగించి సెకనుకు పది ఫోటోలు తీయగల కెమెరా 1887లో ఇంగ్లాండుకు చెందిన విలియం ఫ్రీస్-గ్రీన్ రూపొందించాడు. పొడవైన ఫిలిం రీళ్లను మధ్యలో అంతరాయం లేకుండా ప్రదర్శించగల సినిమా ప్రొజెక్టరును 1895లో ఉడ్‌విల్ లాథాం కనుగొన్నాడు.

### పరిణామ క్రమంలో సినిమా

కళాకారులు నాటకాన్ని సంగీత వాయిద్యాలన్నింటితో ప్రతిసారీ సజీవంగా ప్రదర్శించాలి. అయితే సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందటంతో కళాకారులు నటించిన దానిని చిత్రంగా తీసి ఒకేసారి అనేక ప్రదేశాలలో ప్రదర్శించటం

సాధ్యమయ్యింది, దానిని మళ్ళీ, మళ్ళీ ఎన్నిసార్లయినా ప్రదర్శించవచ్చు. అంతేకాకుండా సినిమాను కొంత కాలంపాటు చిత్రించవచ్చు. తీసిన రీళ్లను రకరకాలుగా కలపటం వల్ల, ఎడిటింగ్ వల్ల పూర్తిగా కొత్త అనుభూతిని కలిగించవచ్చు. జార్జ్ బెర్నాడ్ షా, షేక్స్‌పియర్ రాసిన నాటకాలను కెమెరాతో చిత్రించి, తెరపై సినిమాగా ప్రదర్శించేవాళ్లు. అదేవిధంగా తెలుగులో ప్రజాదరణ పొందిన వరవిక్రయం, సత్యహరిశ్చంద్ర, కన్యాశుల్కం వంటి నాటకాలను సినిమాగా తీశారు. సినిమాల్లో అవకాశాల కోసం రంగస్థల కళాకారులు స్టూడియోల చుట్టూ తిరగ సాగారు. ఈ పరిణామాలతో నాటకాల ప్రాధాన్యత తగ్గి సినిమాలకు ఆదరణ పెరగసాగింది. అయినప్పటికీ సినిమా నటులుగా ప్రఖ్యాతిగాంచి నప్పటికీ నాటకాల కోసం పని చేస్తున్న కళాకారులు గొల్లపూడి మారుతీరావు, నసీరుద్దీన్ షా లాగా ఎంతో మంది ఉన్నారు.

మొదట్లో సినిమాల్లో శబ్దం ఉండేది కాదని, ప్రదర్శనతోపాటు సంగీతకారులు వాయిద్యాలు వాయించటం లేదా సినిమా ప్రదర్శించే వ్యక్తి వ్యాఖ్యానం చేయటం జరిగేవని తెలుసుకుని లత ఆశ్చర్యపోయింది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన తరవాత మాత్రమే మాటలతో కూడిన సినిమాలు వచ్చాయి. వీటిని 'టాకీలు' అనేవాళ్లు.

తెలుగులో మొదటి మూకీ చిత్రం 'భీష్మ ప్రతిజ్ఞ'. మొదటి టాకీ చిత్రం 'భక్తప్రహ్లాద' 1931 లో విడుదల అయ్యింది. ఈ చిత్రాన్ని హెచ్.ఎం. రెడ్డి నిర్మించాడు.

- అయిదు నిమిషాలపాటు ఎటువంటి మాటలు లేకుండా మూకాభినయం చేయండి. ఒక అయిదు నిమిషాల నాటకం వేయండి. ఈ రెండింటిలో నటనలో సౌలభ్యం, ఎంచుకోగల అంశాలు, ప్రేక్షకులకు అర్థం కావటం వంటి విషయాలను పోల్చండి.



*చిత్రం 22.2 : షేక్స్‌పియర్ నాటక ప్రదర్శనలో ఒక దృశ్యం*

- నాటక ప్రదర్శనకు, సినిమాకు మధ్య తేడాలు ఏమిటి? పోలికలు, తేడాలతో ఒక పట్టిక తయారు చేయండి.
- నాటకాలనుండి సినిమాలకు మారటం వల్ల కళాకారులు జీవనోపాధి పొందే అవకాశాలలో ఎటువంటి మార్పులు వచ్చాయో మీ టీచరు సహాయంతో చర్చించండి.




*చిత్రం 22.3 : ఆలం ఆరా*

హిందీలో మొదటి టాకీ సినిమా 'ఆలం ఆరా' 1931లో విడుదలైంది. దీని నిర్మాత అర్దేషర్ ఇరాని.

తెలుగు చిత్ర పరిశ్రమకు రఘుపతి వెంకయ్యను ఆద్యుడుగా భావిస్తారు. అతడు బందరులో పుట్టాడు. మద్రాసులో కదలని ఫోటోలు తీసే వ్యక్తిగా స్థిరపడ్డాడు. మద్రాసులో 'గెయిటీ' పేరుతో సినిమా స్టూడియో నిర్మించాడు. సినిమా స్టూడియో, థియేటర్ల యజమానిగా, సినిమా



*రఘుపతి వెంకయ్య*

నిర్మాతగా తెలుగు చిత్ర పరిశ్రమకు అతడు ఎనలేని సేవలు చేశాడు. కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది బహుమతులతో పాటు తెలుగు చిత్ర పరిశ్రమకు గణనీయమైన సేవలు చేసిన వాళ్లకు ప్రతి సంవత్సరం రఘుపతి వెంకయ్య అవార్డును ఇస్తుంది.


చిత్రం 22.4 : నంది అవార్డు

### సినిమా – వినోదరూపం

సినిమా కంటే ముందు జానపద కళలు, జానపద నృత్యాలు, సాంప్రదాయ నృత్యాలు, సంగీతం, నాటకం వంటి అనేక వినోద రూపాలు ఉండేవి. కాలక్రమంలో వినోదానికి సినిమా ప్రధాన రూపంగా మారింది. సినిమాలో పాటలకు తగినంత ప్రత్యేక ప్రజాదరణ ఉంది. ఇంతకు ముందు రేడియో, ఇప్పుడు టీవి సినిమా పాటలను విడిగా ప్రసారం చేస్తున్నాయి. సినీనటులంటే ప్రజల్లో ఎంతో అభిమానముంది, అభిమాన సంఘాలు ఏర్పడ్డాయి. సినిమాల్లోని జనాదరణ పొందిన సంభాషణలు రోజువారీ జీవితంలో భాగమయ్యాయి. నటీనటుల వేషధారణ, కేశాలంకరణలను ప్రజలు అనుకరిస్తున్నారు. టెలివిజన్ రాకతో సినిమాలు చూడటానికి సినిమా హాళ్లకే వెళ్లవలసిన పనిలేకుండా పోయింది. సినిమాలు, సినిమా పాటలు, సినిమా వార్తలు ప్రసారం చేయటానికి ప్రత్యేక ఛానళ్లు లేదా ప్రత్యేక కార్యక్రమాలు ఉన్నాయి.

- మీ ఊళ్లో, పట్టణంలో గల వినోద సాధనాల జాబితా తయారుచేయండి. వాటి జనాదరణను ఎలా అంచనా వేస్తారు? కాలక్రమంలో వాటిలో వస్తున్న మార్పులు ఏమిటి?
- ఎక్కువగా చూసే కొన్ని టీవి ఛానళ్లను ఎంచుకోండి. 4–5 విద్యార్థులతో బృందాలుగా ఏర్పడండి. ఒక్కొక్క బృందం ఒక ఛానల్ తీసుకోవాలి, అవి మతం, వార్తలు, సినిమాలు, సీరియల్స్ వంటి వాటికి ఎంత శాతం సమయాన్ని కేటాయిస్తున్నాయో అంచనా వేయాలి. మీరు తెలుసుకున్న వివరాలు తరగతిలో మిగిలిన బృందాలతో పంచుకోండి.

### సినిమా, స్వాతంత్ర్య ఉద్యమం

LI8F5T

*1938, 1939లో విడుదలైన 'మాలపిల్ల', 'రైతుబిడ్డ' సినిమాల గురించి రంగయ్య మాటల్లో ఆనాటి ఉత్సాహం ఈనాటికీ కనపడుతోంది. అంటరానితనం, దళితుల ఆలయ ప్రవేశం 'మాలపిల్ల'లో ప్రధాన అంశం. దీంట్లోని కథానాయకుడు చౌదరయ్య గాంధేయవాది. అతడు ఉన్నత కులాల వాళ్లకు తమ పద్ధతులను మార్చుకోమనీ, నిమ్న కులాల వాళ్లకు తాగుడు మానెయ్యమనీ, చదువుకోమనీ చెబుతుంటాడు. పూజారి కొడుకు దళిత అమ్మాయితో ప్రేమలో పడతాడు. పూజారి భార్య మంటల్లో చిక్కుకుంటే ఒక దళితుడు ఆమెను కాపాడతాడు. ఈ ఘటనతో అంటరానితనం ఉండగూడదని పూజారి గుర్తిస్తాడు. దీంతో అతడు దళితులకు ఆలయ ప్రవేశం కల్పిస్తాడు. పూజారి కొడుకు, దళిత అమ్మాయి పెళ్లిని అందరూ ఆశీర్వదిస్తారు.*

*జమీందారీ వ్యవస్థలో రైతాంగ కష్టాలను 'రైతుబిడ్డ' చూపిస్తుంది. జమీందారు దగ్గర అప్పు తీసుకున్న ఒక రైతు ఎన్నికల్లో రైతు పార్టీకి ఓటు వేస్తాడు. దీనికి అతడిని వేధించి, కష్టాలపాలు చేస్తారు. జమీందారు కొడుకును అతడి సొంత తమ్ముడే అపహరించటంతో జమీందారులో హృదయ పరివర్తన కలుగుతుంది. ఆస్తికి మనం ధర్మకర్తలం అన్న గాంధీ ఆలోచనా విధానానికి అనుగుణంగా జమీందారు తన భూములను వాటిని దున్నే వాళ్లకు ఇస్తాడు.*

*వాళ్ల బడిలో 'గాంధీ' సినిమా చూపించారని లత తాతయ్యతో చెప్పింది. ఆ సినిమాని 1982లో రిచర్డ్ ఆటన్‌బరో తీశాడని తాతయ్య చెప్పాడు. ఆమె తెలుగులోకి డబ్బింగు చేసిన సినిమాను చూసింది. ఈ సినిమా హిందీ, ఇతర ప్రాంతీయ భాషలలోకి కూడా డబ్బింగ్ చేశారు.*

ఆ తరవాత కాలంలో జాతీయోద్యమంపై అనేక సినిమాలు తీశారు. వీటిల్లో 'అల్లూరి సీతారామరాజు', 'కొమురం భీం' గిరిజనుల పోరాటాలకు సంబంధించి ముఖ్యమైనవి.

LIA1UH

1882లో బ్రిటిషు వాళ్లు అటవీ చట్టం చేసి గిరిజనులు అడవులలో స్వేచ్ఛగా తిరగకుండా, పోడు వ్యవసాయం చేయకుండా అడ్డుకోసాగారు. బ్రిటిషు వాళ్ల వేధింపులకు వ్యతిరేకంగా గిరిజనుల ఆందోళన లకు సీతారామరాజు నాయకత్వం వహించాడు. 1922 రంపా తిరుగుబాటుగా ఖ్యాతిగాంచిన ఈ తిరుగుబాటులో పోలీసు స్టేషనులపై దాడి చేశారు. గిరిజనులు తమ సాంప్రదాయ ఆయుధాలతోనూ, స్వాధీనం చేసుకున్న ఆయుధాల తోనూ పోరాటం చేయసాగారు. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి బ్రిటిషు పాలకులు రూథర్‌ఫోర్డ్ నాయకత్వంలో అస్సాం రైఫిల్స్‌ను పంపించింది. గంటం దొర వంటి గిరిజన నాయకులందరినీ చంపేశారు. చివరికి సీతారామ రాజుని కూడా కాల్చి చంపేశారు. ఈ సినిమా వ్యాపార పరంగా ఎంతో లాభాలు ఆర్జించి పెట్టింది. దీంట్లోని 'తెలుగు వీర లేవరా...' పాటకి జాతీయ ఉత్తమ గీతం బహుమతి లభించింది. ఈ పాటని శ్రీశ్రీగా ప్రఖ్యాతిగాంచిన శ్రీరంగం శ్రీనివాసరావు రాశాడు.

'కొమురం భీం' సినిమా అది తీసిన 20 సంవత్సరాల తరవాత జులై 2010లో విడుదలైంది. ముకుందంగారి భూపాల్‌రెడ్డి దీంట్లో కథానాయకుడి పాత్ర పోషించాడు. చిత్ర దర్శకుడు అల్లాణి శ్రీధర్‌కు దర్శకుని తొలి ఉత్తమ చిత్రం శ్రేణిలో జాతీయ బహుమతి లభించింది. ఈ సినిమాకు జాతీయ సమగ్రతకు ఉత్తమ చిత్రం బహుమతితోపాటు రాష్ట్ర స్థాయిలో అనేక నంది బహుమతులు లభించాయి. కొమురం భీం ఆదిలాబాదుకు చెందిన గోండు జాతి ఆదివాసి. అతడు నిరక్షరాస్యుడు అయినప్పటికీ నైజాం ప్రభుత్వం సాగిస్తున్న గిరిజనుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాడు. అతడి పోరాటాలు న్యాయస్థానంలోనూ, ఆయుధాలతోనూ సాగాయి. బాబేఝరి వద్ద నైజాం ప్రభుత్వంతో పోరాటంలో కొమురం భీం 1940 అక్టోబరు 27న చనిపోయాడు.

జాతీయోద్యమంపైన తీసిన సినిమాలు తెలుగులో చాలా వచ్చాయి. అదేవిధంగా జాతీయోద్యమం, దేశభక్తిపై ఎన్నో సినిమా పాటలు ఉన్నాయి.

*ఉన్నట్టుండి రంగయ్య 'వెడలి పో తెల్ల దొర వెడలి పో...' అన్న పాట పాడటం మొదలుపెట్టాడు. ఇది 1949లో తీసిన 'మన దేశం' సినిమాలోది. గాంధీ జయంతి రోజున, ఇతర జాతీయ పర్వదినాలలో తమ బడిలో వినిపించే 'భలే తాత మన బాపూజీ...' అన్న పాటను లత పాడింది. ఈ పాట 1955లో తీసిన 'దొంగరాముడు' అన్న సినిమాలోనిది అని తాతయ్య ద్వారా లత తెలుసుకుంది.*

- జాతీయోద్యమానికి సంబంధించి తీసిన మరో రెండు సినిమాలు చెప్పండి.
- తెలుగు సినిమాలలోని దేశభక్తి గీతాలను సేకరించండి.

## సమాజంపై సినిమా ప్రభావం

సమాజం కళలను, తద్వారా సినిమాను ప్రభావితం చేస్తుంది. సినిమా తిరిగి సమాజాన్ని ప్రభావితం చేస్తుందన్నది కూడా నిజమే. సరికొత్త సినిమాలనుబట్టి బట్టలు, కేశాలంకరణ రీతులు మారుతుంటాయి. సంభాషణలు, పాటల, నటీనటుల హావభావాలను ప్రజలు అనుసరించి, అనుకరిస్తుంటారు. వివిధ కథానాయకులు, నాయికలకు అభిమానులు ఎక్కువ, అభిమాన సంఘాలు కూడా ఎక్కువ. ఇతర రంగాలలో వ్యక్తులకు, క్రీడాకారులకు ఇంతటి అభిమానులు లేరు.

- రెండు బృందాలుగా ఏర్పడి అభిమాన సంఘాల వల్ల ప్రయోజనాలు, సమస్యల గురించి చర్చించండి.

సినిమాలు సమాజంలోని వ్యక్తుల భావాలను, అభిప్రాయాలను ప్రభావితం చేయగలుగుతాయి. దేశభక్తి, భూమికోసం పోరాటాలు, ప్రతికూలతలకు ఎదురొడ్డి నిలిచిన నిజ జీవిత వ్యక్తులు, అవినీతిపై పోరాటం వంటి అంశంతో అనేక సినిమాలు ఉన్నాయి. అయితే సినిమాల వల్ల అనేక చెడు ప్రభావాలు కూడా ఉన్నాయి. సినిమాలలో మహిళలను చూపించే విధానం వల్ల సమాజంలో మహిళల పట్ల వివక్షత పెరుగుతుంది. పొగతాగటం, మద్యం సేవించటం సినిమాల్లో హీరోచిత దృశ్యాలుగా చూపించడం వల్ల యువ మనస్సులపై అవి ముద్ర వేస్తాయి. చాలా సినిమాల్లో హింస, అసభ్యకర దృశ్యాలు ఎక్కువవు తున్నాయి. దొంగతనం, హింసాత్మక చర్యలకు పాల్పడి పట్టుబడిన బాలనేరస్తులు ఫలానా సినిమా చూసి తాము ప్రభావితులమయ్యామని చెప్పిన సందర్భాలున్నాయి. హింస ఎక్కువ పాళ్లుగా ఉన్న సినిమాలు చూసే పిల్లలు హింసాత్మకంగా మారవచ్చు, లేదా సమాజంలోని హింసకు ఎటువంటి స్పందన లేకుండా ఉండవచ్చు.

సమాజంలోని రాజకీయ, సామాజిక అంశాలపై అనేక డాక్యుమెంటరీ సినిమాలు కూడా ఉన్నాయి.

- మీరు ఇటీవల చూసిన సినిమాలోని కథ, సన్నివేశాలు మీతోటి పిల్లలపై ఎటువంటి ప్రభావం చూపుతాయో విశ్లేషించండి.
- గత నెలలో వివిధ విద్యార్థులు చూసిన సినిమాల జాబితా తయారు చేయండి. వీటిల్లో హింసను బట్టి 0-5 మార్కులు వేయండి. ఏమాత్రం హింసలేని సినిమాలకు 5 మార్కులు, ఏహ్యత పుట్టించే తీవ్ర హింస ఉన్న సినిమాలకు 0 మార్కులు వేయాలి.

### సినిమా ఒక పరిశ్రమ

సంవత్సరంలో సగటున (డబ్బింగ్ సినిమాలతో సహా) 200 సినిమాలతో అత్యధిక సినిమాలు నిర్మించే ఘనత తెలుగు చిత్ర పరిశ్రమకే ఉంది. మొదట చెన్నైలో ఉన్న పరిశ్రమ ప్రభుత్వ ప్రోత్సాహంతో హైదరాబాదుకు మారింది. ఒక సినిమా తీయటానికి 5 నుంచి 35 కోట్ల రూపాయలవరకు ఖర్చు కావచ్చు. రాష్ట్రంలో 2000కు పైగా సినిమా హాళ్లు ఉన్నాయి. సినిమా తయారీలో నేరుగా, ప్రదర్శనలో పరోక్షంగా సినిమా రంగం వేలాదిమందికి ఉపాధి కల్పిస్తోంది.

## పత్రికా రంగం

LIHB7G

గత తరగతుల్లో మీరు ముఖ్యమైన పుస్తకాల గురించి తెలుసుకున్నారు. మొదట్లో ప్రజలు తాటి ఆకులు, బెరడు, గుడ్డ వంటి వాటిపై రాసేవారు. 11వ శతాబ్దంలో కాగితం, 15వ శతాబ్దంలో జాన్ గుటెన్‌బర్గ్



ముద్రణా యంత్రాన్ని కనుగొనటంతో పరిస్థితులు మారాయి. చదవటం, రాయటం ఒకప్పుడు కులీన వర్గాలకు పరిమితమయ్యుండేది. ప్రజలలో అక్షరాస్యత వ్యాప్తి చెందటానికి ముద్రణ దోహదపడింది.

వివిధ పుస్తకాల ప్రతులను అందుబాటులోకి తీసుకురావటమే కాకుండా రోజు, వారం, పక్షం, నెల వ్యవధితో ముద్రితమయ్యే వార్తాపత్రికలను, పత్రికల సంస్కృతిని ముద్రణ యంత్రం ప్రవేశపెట్టింది.

- వివిధ విషయాలపై రకరకాల పత్రికలు ఉన్నాయి. మీ ఊరు/పట్టణంలో దొరికే పత్రికల పాత సంచికల నుంచి ముఖచిత్ర పేజీలను సేకరించండి. వీటిని విషయాల వారీగా వర్గీకరించండి. వీటిని ఇంకే రకంగానైనా వర్గీకరించవచ్చా?

ముద్రణా మాధ్యమంలో వార్తా (దిన) పత్రికలు, వారపత్రికలు, నెలపత్రికలు ఇతర పత్రికలు ఉంటాయి. సమాచారం, విజ్ఞానం అందించటంలో ముద్రణా మాధ్యమం గణనీయమైన పాత్ర పోషిస్తోంది. ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలు వచ్చిన తరవాత కూడా ముద్రణా మాధ్యమం తన ప్రాధాన్యతను కోల్పోలేదు.

మన రోజువారీ జీవితంలో వార్తాపత్రికలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. చైనా నుంచి ప్రచురితమైన 'ది పెకింగ్ గెజెట్'ను చాలామంది పరిశోధకులు మొట్టమొదటి పత్రికగా పరిగణిస్తారు. ఇది 618 సంవత్సరంలో ముద్రితమయ్యింది. మొదట్లో దినపత్రికను చేతితో రాసేవారు. ఆ తరవాత దానిని ముద్రించటం మొదలుపెట్టారు. ఆధునిక భావనలో మొదటి దినపత్రిక 1655లో లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ నుంచి ప్రచురితమయ్యింది, దాని పేరు 'ఆక్స్‌ఫర్డ్ గెజిట్'. అమెరికాలోని మొదటి వార్తాపత్రిక అయిన 'పబ్లిక్ అక్కరెన్సెస్' 1690లో మొదలయ్యింది. భారతదేశంలోని మొదటి వార్తాపత్రిక కలకత్తానుంచి 1780లో ప్రచురితమయ్యింది, అది 'బెంగాల్ గెజెట్'. దానికి 'కలకత్తా అడ్వటైజర్' అన్న మరో పేరు కూడా ఉంది. భారతదేశ రెండవ, మూడవ, నాల్గవ వార్తా పత్రికలు అయిన ఇండియన్ గెజెట్, కలకత్తా గెజెట్, బెంగాల్ జర్నల్ కూడా కలకత్తానుంచే వెలువడ్డాయి. తెలుగులో మొదటి దినపత్రిక 'కృష్ణా పత్రిక'. దాని సంపాదకుడు ముట్నూరి కృష్ణారావు.

సాంకేతిక విప్లవం వల్ల ముద్రణా మాధ్యమంలో చాలా మార్పులు వచ్చాయి. చాలా కాలంపాటు దినపత్రికలు చేతితో కంపోజింగ్ ద్వారా ముద్రితమయ్యేవి. ఆ తరవాత దీని స్థానంలో మోనోటైప్, లీనోటైప్ వచ్చాయి. ఈ ప్రక్రియలో కీబోర్డుతో నడిచే యంత్రంతో అక్షరాలను కంపోజ్ చేసేవాళ్లు. ప్రస్తుతం దీనికి కూడా కాలంచెల్లి టైప్ సెట్టింగ్ కంప్యూటర్లు, ఆఫ్‌సెట్, లేజర్ ముద్రణ వచ్చాయి. పాతకాలంలో దినపత్రికలు నలుపు, తెలుపులో ముద్రితమయ్యేవి. ప్రస్తుతం దాదాపుగా అన్ని ప్రముఖ దినపత్రికలు రంగులలో అచ్చవుతున్నాయి.

ప్రస్తుత వ్యవహారాలు, వివిధ స్థాయిలలోని ఘటనలు, రాజకీయ వార్తలు, వ్యాపారం, క్రీడలు, సినిమాలు వంటివాటికి సంబంధించిన వివరాలను దినపత్రికలు అందిస్తున్నాయి.

- మీ ప్రాంతంలో దొరికే వివిధ రకాల దిన పత్రికలను తరగతికి తీసుకురండి. ఎన్ని పత్రికలు ఉన్నాయో అన్ని బృందాలుగా ఏర్పడండి. వార్తలు, విశేషాలు ఎలా పొందుపరిచారో (ఏ పేజీలో ఏముంది) విశ్లేషించండి.
- పైన పేర్కొన్న దిన పత్రికల సంచికలను వరసగా వారం రోజులపాటు సేకరించండి. పై బృందాలలో ఒక్కొక్క పత్రికలో ఏఏ రోజున ఏ ప్రత్యేక అంశాలు ప్రచురితమవుతాయో తెలుసుకోండి. ఆ వివరాలను తరగతి గదిలో పంచుకోండి. దినపత్రికలలో ఇటువంటి అంశాలు ఎందుకు ప్రచురిస్తున్నారో కారణాలను పేర్కొనండి.

## సాంస్కృతిక చైతన్యం, జాతీయోద్యమంలో దిన పత్రికల పాత్ర

బ్రిటిషు పాలనలో సంఘ సంస్కర్తలు సమాజంలో మార్పులకోసం ఉద్యమించారు. హిందూమతంలో సంస్కరణలు, 'సతి'ని నిషేధించటం, వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహించటం వంటివి ముఖ్యమైన సంస్కరణలు. ఈ సంస్కర్తలతో ప్రేరణపొంది దేశ వివిధ ప్రాంతాల నుంచి పలు పత్రికలు ప్రచురితం కాసాగాయి.

భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన అనేకమంది నాయకులు పత్రికా సంపాదకులు. 'అమృత్ బజార్ పత్రిక' (1868లో మొదలయ్యింది) సంపాదకుడు శిశిర్‌కుమార్ ఘోష్, 'బెంగాలీ' (1833లో మొదలు) సంపాదకుడు సురేంద్రనాథ్ బెనర్జీ, 'ది హిందూ' (1878లో మొదలు) సంపాదకుడు జి. సుబ్రహ్మణ్యం అయ్యర్, 'కేసరి' (1881లో మొదలు) సంపాదకుడు బాలగంగాధర తిలక్ ఇందులో చెప్పుకోదగిన వాళ్లు. ఈ పత్రికల సంపాదకులు తమ భావాలను, దృక్పథాలను ఈ పత్రికల ద్వారా ప్రచారం చేసేవారు. భారతీయులలో జాతీయతా భావాన్ని పెంపొందించటంలో వార్తాపత్రికలు ప్రముఖ పాత్ర పోషించాయి. ముట్నూరి కృష్ణారావు సంపాదకత్వంలోని కృష్ణా పత్రిక గురించి క్లుప్తంగా ఇంతకు ముందు అధ్యాయాలలో తెలుసుకున్నాం.

మహాత్మా గాంధీ 1918లో 'యంగ్ ఇండియా' అనే పత్రిక బాధ్యత చేపట్టాడు. ఆ తరవాత గుజరాతీలో 'నవజీవన్' అనే పత్రికను స్థాపించాడు. మహాదేవ్ దేశాయి సంపాదకత్వంలోని 'హరిజన్' అనే పత్రికకు విరివిగా వ్యాసాలు రాసేవాడు. ఇలా గాంధీగారు పత్రికలకు చాలా విస్తృతంగా రాసేవాడు.

### కీలక పదాలు

| | | |
|---|---|---|
| 1. ప్రొజెక్టరు | 2. వ్యాఖ్యానం | 3. కంపోజ్ |
| 4. గెజెట్ | 5. ప్రచురణ | |

LIIHWA

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. సినిమాలకు, నాటకాలకు ఉన్న మూడు తేడాలను పేర్కొనండి. $AS_1$
2. మీ తెలుగు పాఠ్యపుస్తకంలోని ఏదైనా కథను లేదా పాటను చిన్న సినిమాగా తీయవచ్చా? దీని ఆధారంగా సినిమా తీయటానికి ఎవరెవరు అవసరమో జాబితా తయారుచేయండి. $AS_1$
3. "సమాజాన్ని మార్చటానికి సినిమా ఒక బలమైన ఆయుధం," అని కొంతమంది వాదిస్తారు, "సినిమా ప్రభావం చెడుగా ఉంటుంది," అని మరికొంత మంది అంటారు. మీరు ఎవరితో ఏకీభవిస్తారు? ఎందుకు? $AS_4$
4. ముందుకాలం సినిమాల్లోని అంశాలు ఏమిటి? మీరు చూసిన సినిమాలు, గతంలోని సినిమాలలోని అంశాలకు తేడాలు, పోలికలు ఏమిటి? $AS_1$
5. స్వాతంత్ర్యోద్యమంలో దినపత్రికలు ప్రధాన పాత్ర ఎలా పోషించాయి? $AS_6$
6. తాజా అంశాలను తెలియచేసే వార్తలను దినపత్రికల నుంచి సేకరించి తరగతిగదిలో ప్రదర్శించండి. $AS_1$

### ప్రాజెక్టు:

ఏదైనా ఒక నాటకానికి స్క్రిప్ట్ తయారుచేయండి. దానిని తరగతిగదిలో ప్రదర్శించండి.

పాఠం 23

# క్రీడలు : జాతీయత, వాణిజ్యం

- మీకు ఆటలు ఆడటం అంటే ఇష్టమా?
- ఏ ఆటలు ఆడతారు?
- ఏ ఆట అంటే మీకు ఎక్కువ ఇష్టం?
- కేవలం ఆడపిల్లలు, లేదా కేవలం మగపిల్లలు ఆడే ఆటలు పేర్కొనండి.
- కొన్ని ఆటలను కేవలం పల్లెల్లోనే ఆడతారా?
- కొన్ని ఆటలను కేవలం బాగా డబ్బు ఉన్న వాళ్లే ఆడతారా?

LIR794

## మీరు ఎందుకు ఆడతారు?

కింద ఇచ్చిన కారణంతో మీరు అంగీకరిస్తే (✓) టిక్కు పెట్టండి, అంగీకరించకపోతే (×) గుర్తు పెట్టండి. మీకు అదనంగా తోచిన కారణాలను జాబితాకు చేర్చండి.

| | |
|---|---|
| ఆటలు ఆడటం తేలిక | |
| ఆటలు ఆడటం సరదాగా ఉంటుంది | |
| తల్లిదండ్రులు, టీచర్లు, స్నేహితులు మెచ్చుకుంటారు | |
| ఆటలు సవాళ్లను విసురుతాయి | |
| ఆటల వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది | |
| సచిన్, సానియా వంటి అభిమాన క్రీడాకారులను అనుకరించే అవకాశం | |
| చదువులకంటే ఆటలు తేలిక | |
| టెలివిజన్‌లో కనపడతాం | |
| ఆటలలో రాత పరీక్షలు, ఇతర పరీక్షలు ఉండవు | |
| అంతర్జాతీయ పోటీలలో పతకాలు పొందవచ్చు | |
| దేశానికి ఖ్యాతి తీసుకురావటానికి | |
| పేరు, డబ్బు, ఖ్యాతి గడించటానికి | |

*తరగతిలోని విద్యార్థులందరి అభిప్రాయాలను క్రోడీకరించి ఏ కారణాన్ని వారు ముఖ్యమైనదిగా భావిస్తున్నారో తెలుసుకోండి.*

అనేక కారణాల వల్ల ఆటలు ఆడతాం. అయితే మనం ఏ ఆటలు ఆడతాం, ఏ ఆటలు చూస్తాం అన్నది సమాజంలో జరుగుతున్న దానితో ప్రభావితం అవుతుంది. ఉదాహరణకు క్రికెట్‌ను తీసుకోండి. మన ఊరి ప్రజలు కబడ్డి ఆడినట్లు ఒకప్పుడు ఇంగ్లండులోని గ్రామస్తులు ఖాళీ మైదానాల్లో క్రికెట్‌ను ఆడేవాళ్లు. కానీ, ప్రస్తుతం భారతదేశమంతటా పల్లెల్లో, పట్టణాల్లో ఈ ఆటను ఆడుతున్నారు. ప్రత్యేకించి యువత ఈ ఆట అంటే విపరీతమైన మోజు, అభిమానం పెంచుకుంది. ప్రజలు తమ విలువైన సమయాన్ని వృథా చేస్తూ టెలివిజన్‌లో ఈ ఆటను చూస్తున్నారు. తమ అభిమాన పక్షం ఆటలో గెలవాలని పూజలు చేసేవారు కొంత

మంది ఉన్నారు. క్రికెట్ ఇంతటి ప్రజాదరణ పొందింది కానీ హాకీ, ఫుట్‌బాల్ వంటి ఇతర ఆటలకు, కబడ్డీ, ఖో ఖో వంటి సాంప్రదాయ ఆటలకు ప్రజలనుంచి మద్దతు, ప్రోత్సాహం కరువయ్యాయి, వీటిపట్ల ఎవరికీ ఆసక్తి ఉండటం లేదు. దీనికి కారణం ఏమై ఉండవచ్చు? ఇంగ్లాండ్‌లోని పల్లెల్లో ఆడిన ఆట మన దేశంలో ఇంతటి ఆదరణ పొందటానికి కారణం ఏమై ఉంటుంది? రండి, తెలుసుకుందాం.

క్రికెట్ ఇంగ్లాండ్‌లో పుట్టింది. ఇది 19వ శతాబ్దం చివరినాటికి పెద్దమనుషులు, అంటే బాగా భూమి ఉన్న సంపన్న పురుషుల ఆటగా మారింది. బ్రిటిష వాళ్లు ముఖ్యమైనవిగా భావించే న్యాయమైన ఆట, క్రమశిక్షణ, పెద్దమనిషి తరహా వంటి వాటికి ఈ ఆట ప్రత్యేకంగా నిలుస్తుందని భావించేవాళ్లు. శారీరక శిక్షణ ద్వారా బాలురను ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా దీనిని పాఠశాలల్లో ప్రవేశపెట్టారు. మగపిల్లలకు ఉద్దేశించిన ఆటలను ఆడపిల్లలను ఆడనిచ్చేవాళ్లు కాదు.

ఇంగ్లాండుకు చెందిన ఫుట్‌బాల్, హాకీ వంటి బృంద (జట్టు) ఆటలు ప్రపంచమంతా ఆదరణ పొందాయి. కానీ, క్రికెట్ మాత్రం బ్రిటిష పాలించిన దేశాల్లో మాత్రమే విస్తరించింది. తమ వలస ప్రాంతాలలో శ్వేతజాతి పాలకులు జనాదరణ గల ఆటగా దీనిని మలిచారు (ఉదా: దక్షిణాఫ్రికా, జింబాబ్వే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వెస్టిండీస్, కెన్యా) లేదా భారతదేశంలో మాదిరి వలస పాలకుల అలవాట్లను అనుకరించిన స్థానిక సంపన్నవర్గాల వల్ల ఈ ఆట ఆదరణ పొందింది.

- మీ అట్లాస్‌లో క్రికెట్ ఆడే దేశాలను గుర్తించండి.
- వెస్టిండీస్ అన్న పేరుగల ఒక దేశం ఏదీ లేదన్న విషయం గుర్తించారా? బాగా వేగంగా పరిగెత్తే క్రీడాకారుడు ఈ దీవులలో ఏ దీవినుంచి వచ్చాడో గుర్తించండి.

## భారతదేశంలో క్రికెట్

క్రికెట్ మ్యాచ్ చూడటం అంటే ఏదో ఒక పక్షానికి మద్దతు ఇవ్వటం అని అభిమానులకు తెలుసు. రంజీట్రోఫీలో ఢిల్లీ, ముంబయి తలపడుతుంటే అభిమానులు ఏ పట్టణం నుంచి వచ్చారు, దేనికి మద్దతునిస్తారు అన్నదాన్ని బట్టి ఒక పక్షం వహిస్తారు. భారతదేశం, ఆస్ట్రేలియాల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతుంటే హైదరాబాదు లేదా చెన్నైలో టీవీలో మ్యాచ్ చూస్తున్న వాళ్లు భారతీయులుగా తమ దేశం వైపున నిలబడతారు. అయితే భారతదేశ తొలి రోజులలో బృందాలు ప్రాంతీయ ప్రాతిపదికన ఏర్పడలేదు. 1932దాకా టెస్ట్ మ్యాచ్‌లలో భారతదేశ బృందానికి అవకాశం ఇవ్వలేదు. మరి బృందాలను ఎలా ఏర్పాటు చేసేవాళ్లు? ప్రాంతీయ, జాతీయ బృందాలు లేనప్పుడు అభిమానులు తమ మద్దతు తెలపటానికి బృందాన్ని దేని ప్రాతిపదికగా ఎంచుకునే వాళ్లు? వీటికి సమాధానాల కోసం మనం చరిత్రలోకి వెళ్లి భారతదేశంలో క్రికెట్ ఎలా అభివృద్ధి చెందిందో, బ్రిటిష పాలనలో ఈ ఆట అభిమానులను ఎలా విభజించిందో, ఎలా ఐక్య పరిచిందో తెలుసుకోవాలి.

భారతీయ క్రికెట్ అంటే భారతీయులు ఆడిన క్రికెట్టు బొంబాయిలో పుట్టింది. ఈ ఆటను మొదట చేపట్టిన వాళ్లు తక్కువ సంఖ్యలో ఉన్న పార్శీలు. తమ వ్యాపారాల వల్ల బ్రిటిషువాళ్లతో దగ్గరి సంబంధాలు పార్శీ సమాజానికి ఏర్పడ్డాయి. మొదట పాశ్చాత్యీకరణ చెందింది పార్శీలే. భారతదేశ మొదటి క్రికెట్ క్లబ్బును వీళ్లు 1848లో బొంబాయిలో స్థాపించారు, దానిపేరు ఓరియంటల్ క్రికెట్ క్లబ్. పార్శీ వ్యాపారస్తులైన టాటాలు, వాడియాలు పార్శీ క్రికెట్ క్లబ్బులకు నిధులు సమకూర్చారు, వాటికి ప్రాయోజకులుగా ఉన్నారు. అయితే భారతదేశంలోని శ్వేతజాతీయ కులీనులు ఈ ఆటలో ఆసక్తి కనబరుస్తున్న పార్శీలకు ఏవిధంగానూ సహాయపడలేదు. వాస్తవానికి తెల్లజాతివాళ్లకే పరిమితమైన బాంబే జింఖానాలో పార్కింగ్ ప్రదేశం

వినియోగించుకోవటంలో పార్శీ క్రికెటర్లతో తెల్లజాతి వాళ్లు గొడవపడ్డారు.

వలస పాలకులు శ్వేతజాతీయుల పట్ల పక్షపాతం వహిస్తారని నిర్ధారణ కావటంతో క్రికెట్ ఆడటానికి పార్శీలు తమ సొంత జింఖానా ఏర్పాటు చేసుకున్నారు. పార్శీలకు, జాతి వివక్షత ప్రదర్శించిన బాంబే జింఖానాకు మధ్య వైరుధ్యంలో భారతీయ తొలి క్రికెట్ ఆటగాళ్లకు తీయని విజయం లభించింది. 1885లో భారత జాతీయ కాంగ్రెసు ఏర్పడిన నాలుగు సంవత్సరాలకు అంటే 1889లో క్రికెట్టులో బాంబే జింఖానాని ఒక పార్శీ బృందం ఓడించింది.

పార్శీ జింఖానా ఏర్పాటు కావటంతో భారత దేశంలో మతం ఆధారంగా జింఖానాలు ఏర్పడటానికి బాట వేసింది. 1890 నాటికి హిందూ జింఖానా, ముస్లిం జింఖానాల ఏర్పాటు కోసం హిందువులు, ముస్లింలు నిధులు సమీకరించటంలో తలమునకలు అయ్యారు. ఈ జింఖానాల క్రికెట్ చరిత్ర కారణంగా మొదటిశ్రేణి క్రికెట్ పోటీలు మతం, జాతి ఆధారంగా ఉండేవి. ప్రస్తుత రంజీట్రోఫీలో బృందాలు రాష్ట్రాల వారీగా ఉన్నట్టు కాకుండా వలస పాలనలో క్రికెట్ బృందాలు మతాలవారీగా ఉండేవి. ఈ పోటీలో అయిదు బృందాలు ఉండేవి కాబట్టి 'పంచముఖ పోటీ' అనేవారు: యూరోపియన్లు, పార్శీలు, హిందువులు, ముస్లింలు, ఇతరులు. 1930ల చివర, 1940ల

### మహాత్మాగాంధీ, వలస పాలకుల క్రీడలు

శరీరం, మనసు మధ్య సమతుల్యానికి క్రీడలు అవసరమని మహాత్మాగాంధీ నమ్మాడు. అయితే క్రికెట్, హాకీ వంటి ఆటలు బ్రిటిషు వాళ్ల ద్వారా భారతదేశంలోకి దిగుమతి చేసుకోబడి సంప్రదాయ ఆటలను కనుమరుగు చేస్తున్నాయని అతడు తరచు విమర్శించేవాడు. ఇది వలస పాలిత మనస్తత్వాన్ని చూపిస్తోంది. చేనులో పనిచేయటం ద్వారా పొందే వ్యాయామంతో పోలిస్తే ఈ ఆటల వల్ల విద్యాప్రయోజనం చాలా తక్కువ.

'మీ బాలురకు ఎటువంటి ఆటలు లేవంటే నాకు బాధతో కూడిన ఆశ్చర్యం కలుగుతుంది. జాతీయ క్రీడలు, సంప్రదాయ ఆటలను పునరుద్ధరించటంలో మీ సంస్థ ముందు ఉండాలి. మనదేశంలో ఎన్నో సంప్రదాయ ఆటలు ఉన్నాయి. ఇవి ఆసక్తికరమూ, ఉత్సాహభరితంగా ఉండటమే కాకుండా వీటికి అయ్యే ఖర్చు చాలా తక్కువ.'

*– మహీంద్ర కళాశాలలో 1927 నవంబరు 24న ఇచ్చిన ఉపన్యాసం, మహాత్మా గాంధీ సంకలిత రచనలు.*

'ఆరోగ్యకరమైన శరీరం అంటే మనసుకి తగినట్టుగా ఉండి, ఎల్లప్పుడూ దాని సేవకు సిద్ధంగా ఉండేది. నా దృష్టిలో ఇటువంటి శరీరాలు ఫుట్‌బాల్ మైదానంలో తయారుకావు. అవి మొక్కజొన్న, పంటపొలాల్లో తయారవుతాయి. దీని గురించి ఆలోచిస్తే, ఇందుకు రుజువుగా మీకు అనేక ఉదాహరణలు దొరుకుతాయి. వలస పాలకుల మోజులో ఉన్న భారతీయులకు ఫుట్‌బాల్, క్రికెట్ పిచ్చి పట్టుకుంది. కొన్ని సందర్భాలలో ఈ ఆటలకు చోటు ఉండవచ్చు... శారీరకంగా, మానసికంగా చురుకుగా ఉండే మానవాళిలోని అధికశాతం రైతులకు ఈ ఆటలు తెలియవన్న వాస్తవాన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోవటం లేదు...?'

*– లాజారస్‌కి లేఖ, 1915 ఏప్రిల్ 17, మహాత్మా గాంధీ సంకలిత రచనలు, సంపుటి 14.*

ఆరంభం నాటికి ఈ పంచముఖ పోటీలను జాతి, మత పునాదులను పాత్రికేయులు (Journalists), క్రికెట్ ఆటగాళ్లు, రాజకీయ నాయకులు విమర్శించసాగారు.

- క్రికెట్టుకీ, పాశ్చాత్య సంస్కృతిని ప్రోత్సహించటానికీ మధ్య సంబంధం ఏమిటి?




ఇక్కడ ఆటలు ఆడటానికి వివిధ క్రీడా పరికరాలు ఉన్నాయి. మీకు స్థానికంగా దొరికే వాటితో పోలిస్తే వీటి నాణ్యత తేడాగా ఉందని మీరు గమనించి ఉంటారు. డబ్బుకోసం వృత్తి క్రీడాకారులు ఉపయోగించే ఈ పరికరాలను సరదా కోసం ఆడుకునే పిల్లలు కొనగలుగుతారా?

ఆధునిక క్రికెట్‌లో దేశాల మధ్య జరిగే అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్‌లు, ఒకరోజు మ్యాచ్‌లు ఎక్కువ. దేశం కోసం ఆడే ఆటగాళ్లు ఖ్యాతి గడిస్తారు, క్రికెట్ అభిమానుల జ్ఞాపకాల్లో నిలిచిపోతారు. భారతదేశం స్వాతంత్ర్యం పొందటానికి పదిహేను సంవత్సరాలకు ముందే, అంటే 1932లో టెస్ట్ క్రికెట్ ఆడే దేశం అయ్యింది. క్రికెట్ పుట్టిన 1877 నాటినుంచి అది స్వతంత్ర దేశాల మధ్య పోటీగా కాకుండా బ్రిటిషు సామ్రాజ్య వివిధ ప్రాంతాల మధ్య పోటీగా ఉండటం వల్ల ఇది సాధ్యమైంది. క్రికెట్ ఆడటం వలస పాలకులతో సమానులుగా భావించి వాళ్లని సవాలు చేయటంగా భావించే వాళ్లు.

## క్రికెట్టులో మార్పులు

1970ల దశకంలో క్రికెట్ మార్పులకు గురయ్యింది: మారుతున్న ప్రపంచానికి అనువుగా ఒక సంప్రదాయ ఆట మారిన సమయమది. అంతర్జాతీయ క్రికెట్ నుంచి దక్షిణ ఆఫ్రికాని 1970లో బహిష్కరించారు. 1971లో మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాల మధ్య మొదటి ఒకరోజు అంతర్జాతీయ పోటీ జరిగింది. అయిదు రోజులకు కాకుండా ఒక రోజుకి కుదించిన ఆట ఎంతో జనాదరణ పొందటంతో 1975లో మొదటి ప్రపంచ కప్ పోటీని విజయవంతంగా నిర్వహించారు. 1977లో

టెస్టు మ్యాచులు మొదలై 100 సంవత్సరాల సంబరాలు జరుపు కుంటున్న పరిస్థితుల్లో ఈ ఆట పూర్తి మార్పుకి లోనయ్యింది. ఈ మార్పులకు క్రికెట్ ఆటగాళ్లో, నిర్వాహకులోకాక ఒక వ్యాపారవేత్త కారకు డయ్యాడు. ఆస్ట్రేలియా టెలివిజన్ సామ్రాట్టు అయిన కెర్రి పాకర్ క్రికెట్‌ను టెలివిజన్‌లో ప్రసారం చేయటం ద్వారా డబ్బు చేసుకోటానికి గల అవకాశాన్ని చూసి జాతీయ క్రికెట్ బోర్డుల ఇష్టానికి వ్యతిరేకంగా 51 మంది ప్రపంచ ప్రముఖ క్రికెట్ ఆటగాళ్లతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. వరల్డ్ సిరీస్ క్రికెట్ పేరుతో రెండేళ్లపాటు అనధికారికంగా ఒకరోజు అంతర్జాతీయ పోటీలు నిర్వహించాడు. పాకర్ 'సర్కస్'గా పేర్కొనబడిన ఈ పోటీలు రెండు సంవత్సరాల్లో మూతబడినప్పటికీ టెలివిజన్ ప్రేక్షకులకు ఈ ఆటను ఆకర్షణీయంగా చేయుటానికి మార్పులు చేయడం ద్వారా ఆట స్వభావాన్ని మార్చివేసింది.

రంగు రంగుల బట్టలు, రక్షణ హెల్మెట్లు, క్షేత్ర రక్షణలో పరిమితులు, దీప కాంతులలో క్రికెట్టు వంటివి పాకర్ అనంతర ఆటలో ప్రామాణికంగా మారాయి. అన్నిటికీమించి క్రికెట్టును సొమ్ము చేసుకో గల ఆటగా, పెద్ద ఎత్తున ఆదాయాలు సమకూర్చే ఆటగా పాకర్ దానికి గుర్తింపు తెచ్చాడు. టెలివిజన్ కంపెనీలకు ప్రసార హక్కులు అమ్ముకోవటం ద్వారా క్రికెట్టుబోర్డులు విపరీతంగా డబ్బును సంపాదించాయి. టివికి అతుక్కుపోయిన క్రికెట్టు అభిమానులకు వాణిజ్య ప్రకటనలు జారీ చేయటానికి వివిధ కంపెనీలు పెద్ద ఎత్తున డబ్బును ఖర్చుచేయ సాగాయి. టెలివిజన్‌లో నిరంతర ప్రసారాల వల్ల క్రికెట్టు ఆటగాళ్లు హీరోలై పోయారు. క్రికెట్టు బోర్డు వీళ్లకి చెల్లించే మొత్తం గణనీయంగా పెరిగింది. అంతేకాదు టైర్లనుంచి శీతలపానీయాల వరకు వివిధ వస్తువులకు వాణిజ్య ప్రకటనలలో పాల్గొనటం ద్వారా క్రికెట్టు ఆటగాళ్లు ఇంకా ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించసాగారు. టెలివిజన్ ప్రసారాలు క్రికెట్టు ఆటను మార్చివేశాయి. చిన్న చిన్న పట్టణాలు, గ్రామాలలో సైతం ప్రసారం చేయటం ద్వారా క్రికెట్టు ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. క్రికెట్టు ఆడే వాళ్ల సామాజిక నేపథ్యాన్ని కూడా విస్తరింప చేసింది. పెద్ద పట్టణాల్లో అంతర్జాతీయ క్రికెట్టు మ్యాచులు చూసే అవకాశం లేని పిల్లలు ఇప్పుడు తమ అభిమాన క్రీడాకారులను అనుకరించి, ఆట నేర్చుకోగలిగారు. ఉపగ్రహ టెలివిజన్ సాంకేతిక విజ్ఞానం వల్ల, బహుళజాతి టెలివిజన్ కంపెనీల వల్ల, క్రికెట్టుకి అంతర్జాతీయ మార్కెట్టు ఏర్పడింది.

- టెస్టు క్రికెట్టు ప్రాముఖ్యత అంతరించటం వల్ల సంభవించిన మార్పుల జాబితా తయారు చేయండి.

### వాణిజ్యం, ప్రసార సాధనాలు, నేటి క్రికెట్

సిడ్నీలో జరిగే మ్యాచులు నేడు సూరత్‌లో ప్రత్యక్ష ప్రసారంగా చూడవచ్చు. ఈ చిన్న వాస్తవం క్రికెట్ ఆధిపత్యంలోని సమీకరణలను మార్చివేసింది. బ్రిటిషు సామ్రాజ్యం అంతరించిపోవటంతో మొదలైన ప్రక్రియ ప్రపంచీకరణతో దాని తార్కిక ముగింపుకి చేరుకుంది. క్రికెట్టు ఆడే దేశాలలో అత్యధిక ప్రేక్షకులు భారతదేశంలో ఉన్నందువల్ల, క్రికెట్‌కు ప్రపంచంలో అతి పెద్ద మార్కెట్ ఉన్నందువల్ల దీని కేంద్రం దక్షిణాసియాకు మారింది. ఐసిసి ప్రధాన కార్యాలయం లండన్ నుంచి పన్నులు విధించని దుబాయికి మారటం ఈ మార్పుకు సంకేతం.

పాత ఆంగ్ల–ఆస్ట్రేలియా అక్షం నుంచి క్రికెట్టు కేంద్రం మారిందనటానికి మరొక ముఖ్య సంకేతం. క్రికెట్ పద్ధతుల్లో వినూత్న ప్రయోగాలు ఉపఖండ దేశాలైన భారత, పాకిస్తాన్, శ్రీలంక వంటి క్రికెట్టు దేశాలనుంచి వచ్చాయి. బౌలింగ్‌లో రెండు గొప్ప పరిణామాలకు పాకిస్తాన్ బీజం వేసింది: 'దూస్‌రా', 'రివర్స్ స్వింగ్'. ఈ రెండు నైపుణ్యాలు కూడా ఉపఖండంలోని స్థితులకు అనుగుణంగా రూపొందాయి. బరువైన ఆధునిక బ్యాటులతో దుందుడుకు ఆటగాళ్లు 'ఫింగర్ స్పిన్'కి చరమగీతం పాడుతున్న పరిస్థితుల్లో 'దూస్‌రా' ముందుకొచ్చింది. నిర్మలమైన ఆకాశం కింద, వికెట్టుపడని దుమ్ము పరిస్థితులలో బంతిని కదిలించటానికి 'రివర్స్ స్వింగ్' వచ్చింది. మొదట్లో ఈ రెండు పద్ధతులను బ్రిటన్, ఆస్ట్రేలియా

వంటి దేశాలు అనుమానంతో చూశాయి. క్రికెట్టు నియమాలను అక్రమంగా మారుస్తున్నారని ఇవి ఆరోపించాయి. బ్రిటిషు, ఆస్ట్రేలియాలోని ఆట పరిస్థితులకు అనుగుణంగా మాత్రమే క్రికెట్టు నియమాలను రూపొందించటం సాధ్యం కాదని కాలక్రమంలో రుజువయ్యింది, ప్రపంచ వ్యాప్తంగా బౌలర్లు అందరూ ఉపయోగించే పద్ధతిగా ఇవి మారాయి.

నూటయాభై సంవత్సరాల క్రితం భారతదేశంలో మొదటి క్రికెట్టు ఆటగాళ్లైన పార్శీలు ఆడటానికి ఖాళీ ప్రదేశం కోసం పోరాడవలసి వచ్చింది. ఈనాడు ప్రపంచ మార్కెటు ఫలితంగా భారతీయ ఆటగాళ్లకు అత్యధికంగా డబ్బులు చెల్లిస్తున్నారు, అత్యధిక ప్రజాదరణ కూడా వీళ్లకే ఉంది. ప్రపంచమంతా వీళ్లకి వేదికగా మారింది. ఎన్నో చిన్నచిన్న మార్పుల కారణంగా ఈ చారిత్రిక మార్పులు సంభవించాయి. సరదా కోసం ఆడే పెద్దమనుషుల స్థానాన్ని, వృత్తిగా డబ్బు కోసం ఆడే క్రీడాకారులు తీసుకున్నారు. ప్రజాదరణలో టెస్టు మ్యాచుల స్థానాన్ని ఒకరోజు మ్యాచులు ఆక్రమించాయి, సాంకేతిక విజ్ఞానంలో, ప్రపంచ వాణిజ్యంలో గణనీయమైన మార్పులు వచ్చాయి. మారుతున్న కాలంతో మారటమే వ్యాపార చరిత్ర అవుతుంది. ఈ అధ్యాయంలో వలస పాలకుల ఆట పరిణామం చెందిన తీరుని చూశాం, ఈ ఆటను వలసానంతర ప్రపంచం ఎలా స్వీకరించిందో చూశాం.

- క్రికెట్టు గురించి కొంచెం సేపు ఆలోచించిన తరవాత వినాయక్ ఇంగ్లీషులోనే ఉన్న పదాలను కొన్నింటిని రాశాడు – 'బౌండరీ', 'ఓవరు', 'వికెట్'. వీటికి తెలుగు పదాలు ఎందుకు లేవో అతడికి వివరించండి.

***19 సంవత్సరాల లోపు ప్రపంచ కప్‌కి భారతీయ క్రికెట్ బృందంలో సభ్యుడు, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన జి. హెచ్. విహారితో ముఖాముఖి.***

**ప్రశ్న: ప్రపంచ కప్ తుది పోరులో మీ బృందం ఆస్ట్రేలియాని ఓడించినప్పుడు మీ అనుభూతుల గురించి చెప్పండి.**

సమాధానం: (నవ్వుతూ) ... మేం చాలా బాగా ఆడాం. చాలా అద్భుత ఆనందాన్ని ఇచ్చింది... 'కంగారూ'లను వాళ్ల దేశంలోనే ఓడించటం చాలా కష్టం. ఈ విజయం మా కిరీటంలో కలికితురాయి వంటిది.

**ప్ర: భారతదేశంలో క్రికెట్టు ఎందుకు ప్రాముఖ్యతను సంతరించుకుంటోంది?**

స: మన దేశంలో క్రికెట్టు అంటే ఎంతో అభిమానం ఉంది, ఎన్నో అవకాశాలు ఉన్నాయి. భారతదేశంలో పిల్లలు సందుల్లో సైతం ఈ ఆటను ఆడుతుంటారు. ఇది సాధ్యమైన ఆట... తమ అభిమాన ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనను చూడటం ప్రజలకు ఇష్టం. 1983లో భారతదేశం ప్రపంచకప్పు గెలుచుకున్న తరవాత చెప్పుకోదగిన రీతిలో ఈ ఆటను ఆడుతోంది... 2011లో తిరిగి ప్రపంచ కప్పును గెలుచుకున్నాం... ఇప్పుడు 19 సంవత్సరాల లోపు ప్రపంచ కప్పును గెలుచుకున్నాం... భవిష్యత్తులో కూడా ఇటువంటి విజయాలు ఎన్నో ఉంటాయి... దాంతో ఈ ఆటకి ప్రాముఖ్యత పెరుగుతూ ఉంటుంది...

**ప్ర: కబడ్డి, ఖో ఖో, హాకీ వంటి ఇతర ఆటలకు క్రికెట్టు ఆదరణ లేకుండా చేస్తోందా?**

స: అవును, కొంతవరకు ఇది నిజమే. అయితే ఇతర ఆటలకు కూడా ప్రోత్సాహమివ్వాలి. హాకీకి తగినన్ని నిధులు లేకపోవటం విచారకరం... ప్రాయోజకులు ముందుకు రావాలి. ప్రభుత్వం, ప్రజలు ఈ విషయాన్ని పరిశీలించాలి.

**ప్ర: ఆటలు జాతీయతావాదాన్ని ఎలా ప్రోత్సహిస్తాయి?**

స: ఆటలు, జాతీయతావాదం కలగలసే ఉంటాయి. ప్రోత్సాహముంటే, ప్రేక్షకుల నుంచి మద్దతు ఉంటే ఆటలు, క్రీడలు వికసిస్తాయి. క్రీడా మైదానంలో ఆటగాళ్లకు మంచి ప్రోత్సాహం లభిస్తోంది. దీని వెనకనున్న

సిద్ధాంతం... ఐక్యత, కృషి. జాతి నిర్మాణంలో కీలకాంశమైన ఐక్యతను ఆటలు పెంపొందిస్తాయి... దేశం తరపున ఆడటం జాతీయతా భావాన్ని కలిగిస్తుంది.

**ప్ర: ఇతర ఆటలకంటే క్రికెట్టుకి ఎక్కువ వాణిజ్య మద్దతు ఎందుకు ఉంది?**

స: టెలివిజను, ప్రసారసాధనాలు, ప్రాయోజకులు దీనికి కారణం. ఇతర ఆటలకు ప్రచారం, ప్రోత్సాహం ఇవ్వాలి.

**ప్ర: ఈ ఆటను వినోదంగా చూస్తున్నారా, వృత్తిగానా?**

స: ఊ.... పాఠశాల వరకు దీనిని సరదాగా భావించాను, ఇప్పుడు వృత్తిగా చూస్తున్నాను. ఈ ఆట ద్వారా మన దేశానికి పతకాలు సాధించాలని అనుకుంటున్నాను...

**ప్ర: ఇతర ఆటలను క్రికెట్టు కమ్మేస్తోందా?**

స: మనదేశంలో క్రికెట్టుకి చాలా ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారని చాలామంది భావిస్తున్నారు. కంపెనీలు ఆటకు ప్రాయోజకులుగా ఉంటున్నాయి. మ్యాచులను క్రీడల ఛానళ్లు ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నాయి. ఇది ఇతర ఆటల విషయంలో జరగటం లేదు. దాంతో కబడ్డి, ఖో ఖో, చదరంగం వంటి సంప్రదాయ ఆటలకు ప్రాముఖ్యత లభించటం లేదు. ఏదైనా ఒక ఆటలో ప్రతిభ కనబరచాలంటే క్రీడాకారులు బాగా కష్టపడాలి, పట్టు సడలకుండా అంకితం కావాలి. అద్భుతాలు ఎన్నడూ పనిచేయవు. కృతనిశ్చయం ఒక్కటే ఫలితాలను ఇస్తుంది.

### ఇతర ఆటలు, వాటి స్థాయి

LJ13AR

భారతదేశంలో జనాదరణ పొందిన మరొక ఆట హాకీ. వలస పాలనలో ఉన్నప్పుడే భారత బృందం ఎన్నో పోటీలలో గెలిచింది. 1980ల వరకు అంతర్జాతీయ హాకీ రంగంలో భారత్‌దే పైచేయి. అయితే, గత కొన్ని దశాబ్దాలుగా ఈ ఆట పరిస్థితి దిగజారుతోంది. క్రికెట్టు మాదిరి హాకీ వంటి ఆటలకు ప్రసార సాధనాలనుంచి, వ్యాపార రంగాలనుంచి అంత మద్దతు లభించటం లేదు. భారతదేశంలో ప్రజాదరణ పొందిన మరొక సంప్రదాయ ఆట కబడ్డీ. దీనిని అంతర్జాతీయ స్థాయిలో ఆడటం మొదలుపెట్టి పది సంవత్సరాలు కావస్తోంది. దీంట్లో మన దేశం విజేతగా నిలుస్తోంది. విలువిద్య, బాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, చదరంగం, టెన్నిస్ వంటి ఆటలలో భారతీయ క్రీడాకారులు అంతర్జాతీయ పోటీలలో పలు పతకాలు సాధించారు.

అయితే అథ్లెటిక్స్‌లో, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ వంటి అంతర్జాతీయంగా ఆదరణ పొందిన ఆటలలో మనం పెద్దగా విజయాలు సాధించలేకపోతున్నాం. పిల్లలు ఇష్టంగా ఆడుకునే ఆటలను పెద్దవాళ్లు ఆడటం మనం చూడం. ఈ చిత్రాలలోని ఆటలు మీరు ఏమైనా చూశారా? వాటి నియమాలను వివరించండి. ఈ ఆటలను పెద్ద వాళ్లు ఎందుకు ఆడరు?



క్రీడలు మానసిక వికాసంతోపాటు శారీరకాభివృద్ధిని పెంపొందిస్తాయి. పాఠశాల స్థాయి నుండే పిల్లల్లోని క్రీడాసక్తిని, అభిరుచిని గుర్తించి, ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తుంది. ప్రభుత్వం వ్యవస్థాపరంగా, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని క్రీడాశాఖ దేశంలో క్రీడారంగం అభివృద్ధికి, అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి క్రీడామండలుల ద్వారా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే క్రీడలతోపాటు స్థానిక క్రీడాంశాలు మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర,



జోనల్, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తూ విజేతలను ప్రోత్సహిస్తూ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా కోచ్‌లను ఏర్పాటు చేశారు. క్రీడల పట్ల అభిరుచిని పెంపొందించడంతో పాటు అంతర్జాతీయ అవగాహనకు, సాంస్కృతిక వికాసానికి తోడ్పడుతూ విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని క్రీడలు పెంపొందిస్తాయి. భిన్న సంస్కృతులు కలిగిన మన దేశంలో జాతీయ సమైక్యతను పెంపొందించడానికి క్రీడలు ఇతోధికంగా దోహదం చేస్తున్నాయి.

**కీలక పదాలు**

1. వలస పాలన  2. ప్రపంచ వాణిజ్యం  3. జాతీయవాదం  4. ప్రాయోజకులు

LJ2NZK

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. తప్పు వాక్యాలను సరిచేయండి: $AS_1$
   - తమ పాలనలో ఉన్న దేశాల మధ్య పోటీలు నిర్వహించటానికి క్రికెట్‌ను వలస పాలకులు ప్రోత్సహించారు.
   - పాశ్చాత్యీకరణ చెందటానికి ప్రజలు ఈ ఆటను నేర్చుకోసాగారు.
   - భారతీయ గ్రామస్తులు క్రికెట్ ఆడేవాళ్లు.
   - మంచి నడవడిక అలవాటు చేయటానికి ఈ ఆటను పాఠశాలల్లో ప్రవేశపెట్టారు.
2. క్రికెట్, ఇతర ఆటలపై గాంధీజీ దృక్పథం గురించి కొన్ని వాక్యాలు రాయండి. $AS_1$
3. పాఠం చదివి కింది వాటిని క్లుప్తంగా వివరించండి: $AS_2$
   - భారతదేశంలో క్రికెట్ క్లబ్ ఏర్పాటు చేయటంలో పార్శీలు మొదటివాళ్లు.
   - ఐసిసి ప్రధాన కార్యాలయం లండన్ నుంచి దుబాయికి మారటంలోని ప్రాముఖ్యత.
4. ఏదైనా ఒక స్థానిక ఆట చరిత్ర తెలుసుకోండి. మీ తల్లిదండ్రులను, తాతా, అవ్వలను వాళ్ల బాల్యంలో ఈ ఆటను ఎలా ఆడేవాళ్లో అడగండి. ఇప్పుడు కూడా ఆ ఆటను అలాగే ఆడుతున్నారా? మార్పులకు కారణమైన చారిత్రిక శక్తులు ఏవై ఉంటాయో ఆలోచించండి. $AS_3$
5. సాంకేతిక విజ్ఞానంలో, ప్రత్యేకించి టెలివిజన్ సాంకేతిక విజ్ఞానంలో మార్పులు ప్రస్తుత క్రికెట్‌ను ఏరకంగా ప్రభావితం చేశాయి? $AS_4$
6. క్రికెట్ వాణిజ్య క్రీడగా మారటం వల్ల సంభవించిన పరిణామాలపై ఒక కరపత్రం తయారు చేయండి. $AS_6$
7. ప్రపంచ పటంలో క్రికెట్ ఆడే ఐదు దేశాలను గుర్తించండి. $AS_5$

**ప్రాజెక్టు:** ఏదైనా ఒక క్రీడ గురించి సమాచారాన్ని సేకరించి, ఆ క్రీడా చరిత్రను నివేదిక రూపంలో రాయండి.

పాఠం 24

# విపత్తులు - నిర్వహణ

LJ9YCE

ప్రత్యేక భూ-భౌతిక పరిస్థితుల వల్ల, అధిక జనాభా వల్ల ప్రపంచంలో విపత్తులకు ఎక్కువ గురయ్యే దేశాల్లో భారతదేశం ఒకటి. తుఫానులు, భూకంపాలు, కరువు, వరదలు, కొండచరియలు విరిగి పడటం వంటి ప్రకృతి విపత్తులు దేశంలోని వివిధ ప్రాంతాలలో, వివిధ తీవ్రతలతో సంభవిస్తుంటాయి. భారతదేశంలో తూర్పు, ఆగ్నేయ ప్రాంతాలు తరచు తుఫానులకు గురి అవుతూ ఉంటాయి. పీఠభూమిలో, హిమాలయాల్లో భూకంపాలు సంభవిస్తూ ఉంటాయి. గంగ-బ్రహ్మపుత్ర మైదానంలో వరదలు తరచు సంభవిస్తూ ఉంటాయి. పశ్చిమాన రాజస్థాన్, దక్షిణ భారతంలో రాయలసీమ ప్రాంతాలు తీవ్ర కరువుకు గురవుతుంటాయి. అంటే అనేక రకాలైన ప్రమాదాలను మనం ఎంతో కొంత ఎదుర్కొనే 'ముప్పు' ఉంది. ఒక ప్రాంతంలో ఉంటున్న ప్రజలు ఒకటికంటే ఎక్కువ ప్రమాదాలకు గురికావచ్చు. ఉదాహరణకు కోస్తా ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు తరచు వరదలు, తుఫానులకు గురికావచ్చు, వారు ఉంటున్న ప్రాంతం భూ కంపాలకు గురికావచ్చు. ఇటువంటి ప్రాంతాలను 'బహుళ ప్రమాదాల ప్రాంతం' (Multi Hazard Zone) అంటారు.

ఈ 'విపత్తులను' ఎదుర్కోటానికి ప్రజలు సంసిద్ధంగా లేనప్పుడు దానివల్ల జరిగే నష్టం చాలా ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు వరద సంభవించినపుడు అది ప్రమాదమవుతుంది, దానిని ఎదుర్కోటానికి ప్రజలు సంసిద్ధంగా లేకపోతే ఇళ్లు, పశువులు, మనుషులు కొట్టుకుపోతారు. అప్పుడు వరద విపత్తు అవుతుంది.

## విపత్తులు - రకాలు

విపత్తులు ఏర్పడటానికి గల కారణాలనుబట్టి, అది సంభవించే వేగాన్ని బట్టి వీటిని అనేక రకాలుగా విభజించవచ్చు.

1. సంభవించే వేగాన్ని బట్టి నిదానంగా వచ్చే, వేగంగా వచ్చే విపత్తులను రెండుగా విభజించవచ్చు.

i) **నిదానంగా సంభవించే విపత్తులు:** అనేక రోజులు, నెలలు, ఒక్కొక్కసారి సంవత్సరాలపాటు సంభవించే కరువు, పర్యావరణ క్షీణత, చీడ పురుగుల తాకిడి, కాటకం వంటివి నిదానంగా సంభవించే విపత్తులకు ఉదాహరణలు.

ii) **వేగంగా సంభవించే విపత్తులు:** అనుకోకుండా సంభవించే విపత్తు విభ్రాంతికి గురిచేస్తుంది. ఇటువంటి విపత్తుల ప్రభావం కొద్దికాలం ఉండవచ్చు, లేదా ఎక్కువ రోజులు ఉండవచ్చు. భూకంపాలు, తుఫాను, ఆకస్మిక వరదలు, అగ్ని పర్వతాలు బద్దలవటం వంటివి వేగంగా సంభవించే విపత్తులకు ఉదాహరణలు.

2. కారణాలను బట్టి ప్రకృతి/ సహజ, మానవ నిర్మిత విపత్తులను రెండు రకాలుగా విభజించవచ్చు.

i) **ప్రకృతి విపత్తులు:** ప్రకృతి సహజ కారణాల వల్ల ఇటువంటి విపత్తులు ఏర్పడి మానవ, భౌతిక, ఆర్థిక, పర్యావరణ నష్టాలకు దారితీస్తాయి. ప్రకృతి విపత్తులలో రకాలు:

అ. భూకంపాలు

ఆ. తుఫానులు

ఇ. వరదలు

ఈ. కరువు

ఉ. సునామీ

ఊ. కొండ చరియలు విరిగి పడటం

ఎ. అగ్నిపర్వతాలు మొదలైనవి

ఏడవ తరగతిలో మీరు తుఫానులు, వరదలు, వాటి నష్ట నివారణ వంటి వాటి గురించి చదివారు. ఎనిమిదవ తరగతి విజ్ఞాన శాస్త్రం పుస్తకంలో మీరు భూకంపాలు వాటి ప్రభావం గురించి చదివారు.

ii) **మానవ జనిత విపత్తులు:** మానవ తప్పిదాల కారణంగా సంభవించే విపత్తుల వల్ల సాధారణ జీవితం అస్తవ్యస్తమవుతుంది. ప్రాణ, ఆస్తి, ఆర్థిక, పర్యావరణ నష్టం కలుగుతుంది. వీటికి గురయ్యే ప్రజలు ఈ సమస్యలను ఎదుర్కోగల స్థితిలో ఉండరు. 1984 భోపాల్ గ్యాస్ విషాదం, 1997లో ఢిల్లీలో ఉపహార్ సినిమాహాలులో అగ్నిప్రమాదం, 2002లో రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలుతప్పటం, 2003లో కుంభకోణం (తమిళనాడు)లో పాఠశాలలో అగ్నిప్రమాదం, 2008లో జైపూర్‌లో వరుస పేలుళ్ళు .... ఇతరములు వంటివి దీనికి ఉదాహరణలు.

### విపత్తుల నిర్వహణ అంటే ఏమిటి?

విపత్తులపై/ అత్యవసర పరిస్థితులపై నియంత్రణ సాధించటం, విపత్తుల ప్రభావాన్ని నివారించటానికి, తగ్గించటానికి లేదా వాటినుంచి కోలుకోటానికి దోహదం చేసే విధానాలను అందించే దానిని విపత్తుల యాజమాన్యం అంటారు.

ఈ కార్యక్రమాలు సంసిద్ధతకు, తీవ్రతను తగ్గించటానికి, అత్యవసర స్పందనకు, సహాయానికి, కోలుకోటానికి (పునర్నిర్మాణం, పునరావాసం) సంబంధించినవికావచ్చు. టీచర్లు, విద్యార్థులు ఒక ప్రాంత జనాభాలో సమగ్ర భాగం. విపత్తులకు సంసిద్ధంగా ఉండటంలో వీళ్లకు ముఖ్యమయిన పాత్ర ఉంది. తల్లిదండ్రులు, ఇతర ప్రజలలో అవగాహన కల్పించటంలో విద్యార్థులు ముఖ్యపాత్ర పోషించవచ్చు. ఈ విషయంలో విద్యార్థులకు మార్గదర్శనం చేయటం ఉపాధ్యాయుల గురుతరమైన బాధ్యత.

*చిత్రం 24.1 : విపత్తుల యాజమాన్యం గురించి తెలిసి ఉండటం*




## సునామీ (Tsunami)

- సునామీలు అంటే ఏమిటో మీకు తెలుసా? అవి ఎలా ఏర్పడతాయి? వాటిని ముందుగా ఎలా ఊహించవచ్చు? రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో నివసిస్తున్నట్లయితే సునామీ సంభవించినపుడు మిమ్మల్ని ఎలా రక్షించుకుంటారు?

జపాన్ భాషలో 'సు' అంటే రేవు, 'నామి' అంటే అలలు అని అర్థం. ఈ రెండూ కలిసి 'సునామీ' అన్న పదం ఏర్పడింది. సముద్రంలోని భూకంపాలు, అగ్నిపర్వతాలు పేలటం, లేదా కొండచరియలు విరిగి పడటం వల్ల పెద్ద పెద్ద అలలు చెలరేగి తీరప్రాంతాలను అతలాకుతలం చేయటాన్ని 'సునామీ' అంటారు. దగ్గరలోని భూకంపాల వల్ల ఉత్పన్నమైన సునామీ అలలు కొద్ది నిమిషాలలోనే తీరాన్ని తాకుతాయి. ఈ అలలు తక్కువలోతు నీటిని చేరినప్పుడు చాలా అడుగుల ఎత్తు, అరుదుగా పదుల అడుగుల ఎత్తు పైకెగసి తీరప్రాంతాన్ని విధ్వంసకర శక్తితో తాకుతాయి. ఒక పెద్ద భూకంపం తరవాత సునామీ ముప్పు చాలాగంటలపాటు ఉండవచ్చు.

LJBK28

- సునామీపై మరింత సమాచారం, చిత్రాలు సేకరించండి. తరగతి గదిలో చర్చించండి. సమాచారాన్ని నోటీస్ బోర్డులో ప్రదర్శించండి.




*చిత్రం 24.2: సునామీల ఆవిర్భావం*

### మీకు తెలుసా?

అ. సునామీలో అనేక అలలు ఉంటాయి, మొదటి అల అన్నిటికంటే పెద్దది కాకపోవచ్చు. మొదటి అల తరవాత అనేక గంటలపాటు పెద్ద అలలు తాకే ప్రమాదముంటుంది.

ఆ. మైదాన ప్రాంతంలో సునామీ మనిషికంటే వేగంగా, అంటే గంటకి 50 కి.మీ. వేగంతో పయనించగలదు.

ఇ. సునామీ పగలు కానీ, రాత్రి కానీ ఏ సమయంలోనైనా సంభవించవచ్చు.

### సునామీ ముందు ఏం చేయాలి?

1. సునామీ ముప్పుకి గురయ్యే ప్రాంతంలో మీ ఇల్లు, బడి, పని ప్రదేశం, తరచు సందర్శించే ప్రదేశాలు ఏవైనా ఉన్నాయేమో తెలుసుకోండి.
2. సునామీ సంభవించినప్పుడు మీరు ఉండటానికి అవకాశం ఉన్న మీ ఇల్లు, బడి, పని ప్రదేశం, ఇతర ప్రదేశాలనుంచి తప్పించుకునే మార్గం గురించి ముందే తెలుసుకుని ఉండండి.
3. తప్పించుకునే మార్గాల ద్వారా క్షేమంగా ఉండే ప్రాంతాలను చేరుకోటాన్ని సాధనచేస్తూ ఉండండి.
4. అత్యవసర పరిస్థితుల్లో ఉంచుకోవలసిన సామగ్రితో సిద్ధంగా ఉండండి.

5. సునామీల గురించి మీ కుటుంబంతో చర్చిస్తూ ఉండండి.

## సునామీల గురించి ముందుగా పసిగట్టడం

సునామీకి కారణమయ్యే భూకంపాల గురించి ఉపగ్రహ సాంకేతిక విజ్ఞానంతో దాదాపు వెనువెంటనే హెచ్చరికలు జారీచేయవచ్చు. సునామీ కేంద్రం నుంచి తీరం ఎంత దూరం అన్నదాన్నిబట్టి హెచ్చరిక ఎంత ముందుగా చేయవచ్చన్నది ఆధారపడి ఉంటుంది. హెచ్చరికలో ఏ ఏ తీర ప్రాంతాన్ని ఎంత సమయంలో సునామీ తాకవచ్చో చెబుతారు.

తీరప్రాంత అలల కొలతల పరికరాలు సునామీలను తీరం దగ్గరగా గుర్తించగలవు కానీ సముద్రంలోపల ఇవి ఉపయోగపడవు. సముద్రం లోపలి కేబుళ్ల ద్వారా భూమికి అనుసంధానం చేసిన సునామీ డిటెక్టర్లు సముద్రంలో 50 కి.మీ. లోపలికి ఉంటాయి. సునామీ మీటర్లు సముద్ర ఉపరితలంపై అలజడులను గుర్తించి వాటిని ఉపగ్రహాలకు ప్రసారం చేస్తాయి.

## సునామీ సమయంలో ఏం చేయాలి?

- మీరు ఇంటిదగ్గర ఉండి, సునామీ హెచ్చరిక వింటే కుటుంబంలో అందరికీ ఆ విషయం తెలియ చేయాలి. సునామీ తాకిడి ప్రాంతంలో ఉంటే కుటుంబమంతా ఇల్లు విడిచి వెళ్లాలి. ఎత్తుగా, భద్రంగా ఉండే ప్రాంతానికి వెళ్లాలి. ఇలా వెళ్లేటప్పుడు ప్రశాంతంగా, క్రమశిక్షణతో వ్యవహ రించాలి.
- విపత్తులలో అవసరమయ్యే సరుకులను మీతో పాటు తీసుకెళ్లాలి. ఇవి మీతో ఉంటే మీకు నిశ్చింతగా ఉంటుంది.
- మీరు సముద్ర తీరానికి దగ్గరగా ఉండి భూమి కంపించటం తెలిస్తే సునామీ హెచ్చరిక కోసం వేచి చూడకుండా వెంటనే ఎత్తైన ప్రదేశానికి బయలుదేరాలి. సముద్రంలో కలిసే వాగులు, వంకలకు దూరంగా ఉండండి.
- పల్లపు సముద్రతీర ప్రాంతాలలో పలు అంతస్తుల (హోటళ్ల వంటి) భవనాలు ఉంటే పై అంతస్తులు సునామీ నుంచి రక్షణనిస్తాయి.
- సముద్రంలోకి చొచ్చుకుపోయే కొండలు, లోతు తక్కువ ప్రాంతాలు సునామీ అలల తీవ్రతను తగ్గించవచ్చు. అయినప్పటికీ ఈ ప్రాంతాల్లో తీరప్రాంత వాసులకు పెద్ద అలల ముప్పు ఇంకా ఉంటుంది. సునామీ హెచ్చరిక జారీ అయినప్పుడు లోతట్టు తీరప్రాంతాలకు దూరంగా ఉండటమే మంచిది.
- ఎప్పటికప్పుడు రేడియో, టీవీల ద్వారా జారీ అయ్యే తాజాహెచ్చరికల గురించి తెలుసుకుంటూ ఉండండి.


## సునామీ తరవాత ఏం చేయాలి?

- రేడియో, టెలివిజన్ ద్వారా తాజా సమాచారం తెలుసుకుంటూ ఉండండి. సునామీ వల్ల రోడ్లు, వంతెనలు, ఇతర ప్రదేశాలు దెబ్బతిని ప్రమాదకారిగా ఉండవచ్చు.
- గాయపడిన లేదా చిక్కుకుపోయిన వ్యక్తులకు సహాయం చేసేముందు మీకు గాయాలు అయ్యాయేమో చూసుకోండి. అవసరమైతే ప్రథమ చికిత్స పొందండి. ఒకవేళ ఎవరైనా ప్రమాదంలో ఉంటే సహాయ సిబ్బందిని పిలవండి. వరదకు గురైన ప్రాంతాలలో ఇతరులకు సహాయపడే క్రమంలో గాయపడే, ప్రాణాపాయం జరిగే ప్రమాదముంది.
- ప్రత్యేక అవసరమున్న పిల్లలు, వృద్ధులు, అంగవైకల్యం ఉన్నవాళ్లు, రవాణా సదుపాయం లేని వాళ్లు, అదనపు సహాయం అవసరమయ్యే పెద్ద కుటుంబాల వాళ్లకు సహాయపడండి.
- ప్రమాద ప్రాంతాలకు వెళ్లవద్దు. మీరు వెళ్లటం వల్ల సహాయ చర్యలకు ఇతర అత్యవసర పనులకు ఆటంకంగా పరిణమించవచ్చు. కలుషిత నీళ్లు, మట్టిపెళ్లలు విరిగి పడటం, బురద ప్రవాహం, దెబ్బతిన్న రోడ్లు, ఇతర ప్రమాదాల వల్ల మీరు ఇబ్బందికి గురికావచ్చు.

- అత్యవసరంగా మాట్లాడటానికే టెలిఫోను ఉపయోగించండి. విపత్తు పరిస్థితిలో టెలిఫోన్ లైన్లపై ఒత్తిడి ఉంటుంది. అత్యవసర విషయాలు మాట్లడటానికి అవకాశం ఇవ్వండి.
- చుట్టూ నీళ్లు నిలబడిన ఇంటిలో ఉండవద్దు. వరదనీటిలాగానే సునామీ నీళ్లు పునాదులను బలహీనపరిచి భవనాలు కూలిపోవచ్చు, గచ్చులు బీటలు వారవచ్చు, గోడలు పడిపోవచ్చు.
- ఇళ్లల్లోకి తిరిగి వెళుతున్నప్పుడు జాగ్రత్తగా ఉండండి! సునామీ వరదనీటివల్ల మీరు ఊహించని చోట్లలో సైతం భవనం దెబ్బతిని ఉండవచ్చు. మీరు వేసే ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయండి.
- పొడుగు ప్యాంటు, పొడుగు చేతుల చొక్కా, గట్టి బూట్లు వేసుకోండి. ఇటువంటి విపత్తుల తరవాత కాళ్లు కోసుకుపోవటం తరచు జరిగే ప్రమాదం.
- భవనాలను పరిశీలించేటప్పుడు బ్యాటరీ దీపాలను ఉపయోగించండి. ఇది చాలా ప్రమాదరహితమైనది –వీటివల్ల అగ్ని ప్రమాదం సంభవించదు. కొవ్వొత్తులు ఉపయోగించవద్దు.
- గోడలు, గచ్చు, తలుపులు, మెట్లు, కిటికీలు వంటివి పరీక్షించి ఇల్లు పడిపోయే ప్రమాదం లేదని నిర్ధారించుకోండి.
- బీటలు లేదా ఇతర సమస్యలకు పునాదులను పరీక్షించండి. బీటలు, పగుళ్ళు ఉంటే ఉంటే ఇల్లు నివాసయోగ్యం కాకపోవచ్చు.
- అగ్ని ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయోమో చూడండి. గ్యాసుపైపులు విరిగి పగిలిపోయి ఉండవచ్చు, విద్యుత్తు సర్క్యూట్లు ఇతర విద్యుత్తు పరికరాలు నీటమునిగి ఉండవచ్చు. అంటుకునే, పేలే ప్రమాదమున్న వస్తువులు బయటినుంచి కొట్టుకుని వచ్చి ఉండవచ్చు. వరదల తరవాత ఎక్కువగా అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి.
- అడవి జంతువులు ఉన్నాయోమో గమనించండి. ప్రత్యేకించి నీటితోపాటు విషపు పాములు వచ్చి ఉండవచ్చు. వ్యర్థ పదార్థాలను పరిశీలించటానికి కర్ర ఉపయోగించండి. సునామీ వరద నీటివల్ల ఆశ్రయం కోల్పోయిన పాములు, జంతువులు వాటి నుండి బయటకు వస్తాయి.
- పడిపోయే ప్రమాదం ఉన్న గోడ, పైకప్పు పెచ్చులను గమనించండి.
- ఇల్లు ఆరటానికి కిటికీలు, తలుపులు తెరవండి.
- గట్టిపడకముందే బురద బయటకు తోడెయ్యండి.



*చిత్రం 24.3 : సునామీ తాకిడికి దెబ్బతిన్న పడవలు*




*పటం : భారతదేశ తూర్పు, దక్షిణ తీరాలను తాకిన సునామీ*

## కరువు

కరువు అన్నది వర్షపాత లోపం వల్ల ఏర్పడే ప్రకృతి వైపరీత్యం. ఒక ప్రాంతంలో సాధారణంగా పడవలసినంతగా వర్షం పడకపోతే దానిని అనావృష్టి (Meteorological drought) అంటారు. ఒక సంవత్సరంలో వర్షం సాధారణంగానే ఉండవచ్చు, కానీ రెండు వానల మధ్య వ్యవధి చాలా ఎక్కువగా ఉండి వర్షాధార పంటలు దెబ్బతినవచ్చు, దీనిని వ్యవసాయ కరువు (Agricultural drought) అంటారు. కాబట్టి ఎంత వర్షం అన్నదే కాకుండా, ఎప్పుడెప్పుడు పడిందన్నది కూడా ముఖ్యమవుతుంది. అధిక లేదా తక్కువ వర్షపాతం అన్నది (70–100 సంవత్సరాల) సగటు సాధారణ వర్షపాతంతో పోల్చి ఈ విధంగా చెబుతారు:

LJIUE2

| | | |
|---|---|---|
| అధిక | + | సగటు వర్షపాతం కంటే ఎక్కువ లేదా 20%. |
| సాధారణ | + | సగటు వర్షపాతం కంటే 19% ఎక్కువ నుంచి 19% తక్కువ వరకు. |
| తక్కువ | – | సగటు వర్షపాతం కంటే 20% నుంచి 59% తక్కువ వరకు. |
| బాగా తక్కువ | – | సగటు వర్షపాతం కంటే 60 శాతం కంటే తక్కువ. |

కొన్ని ప్రాంతాలలో అవి ఉన్న భౌగోళిక స్థితుల వల్ల తక్కువ వర్షపాతం పడటానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. వీటిని 'కరువు పీడిత'

ప్రాంతాలు అంటారు. ఉదాహరణకు రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలలో ప్రతి అయిదు సంవత్సరాలలో రెండు సంవత్సరాలు కరువు చోటుచేసుకునే అవకాశం ఉంది.

### కరువు ప్రభావం

కరువు ప్రభావం క్రమేణ తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది:

- భూగర్భజల నీటిమట్టం పడిపోవటం, తాగునీటి కొరత.
- పంటల విస్తీర్ణం తగ్గటం.
- వ్యవసాయం కుంటు పడటంతో వ్యవసాయ రంగంలో ఉపాధి తగ్గిపోవటం.
- వ్యవసాయ, అనుబంధ రంగాలలోని ప్రజల కొనుగోలుశక్తి పడిపోవటం.
- ఆహారధాన్యాల కొరత.
- పశుగ్రాస కొరత.
- పశువులు చనిపోవటం.
- పోషకాహారలోపం, ప్రత్యేకించి చిన్నపిల్లల్లో.
- అతిసారం, విరోచనాలు, కలరా వంటి రోగాలు, అనారోగ్యం విస్తరించటం, ఆకలికి గురికావటం వల్ల కంటిచూపులో లోపం ఏర్పడటం.
- భూమి, నగలు, ఆస్తులు వంటివి తప్పనిసరై తాకట్టు పెట్టటం లేదా అమ్మటం.
- పనికోసం వెతుక్కుంటూ ప్రజలు వలస వెళ్లటం.

### కరువును ఎదుర్కోవటం ఎలా?

ఒక్కసారిగా సంభవించే ప్రమాదం మాదిరి కాకుండా కరువు మెల్లగా సంభవిస్తుంది కాబట్టి మనం దానికి సంసిద్ధంగా ఉండటానికి, ప్రతిస్పందించటానికి, దాని ప్రభావాన్ని తగ్గించటానికి తగినంత సమయం ఉంటుంది. పర్యవేక్షణ, ముందుగా జారీచేసే హెచ్చరికలవల్ల అన్నిస్థాయిల్లో నిర్ణయాత్మక బాధ్యతలు ఉన్నవాళ్లు సకాలంలో స్పందించవచ్చు. కరువుకు గురయ్యే ప్రాంతాల్లో నీటి సంరక్షణ విధానాలు వంటి అంశాలపై అవగాహన కల్పించటానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక అధికారులు కృషి చేస్తున్నారు.

### వర్షపు నీటి నిల్వ

పట్టణ ప్రాంతాల్లో ఇంటిపైకప్పుపై పడే వర్షపునీటినంతా జాగ్రత్తగా నిలువ చేయాలి. ఈ వాన నీటినంతా ఇంకుడు గుంతలలోకి మళ్లించటం అన్నింటికంటే తేలికైన పని. ప్రత్యేకించి కట్టిన ట్యాంకులు, సంపు(sump)లలోకి వాననీటిని మళ్లించి రోజువారీ అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. కొన్ని ప్రాంతాల్లో తేలికైన వడపోత విధానాలతో తాగటానికి అత్యంత శుద్ధమైన నీటిని పొందవచ్చు.

### వాటర్‌షెడ్ అభివృద్ధి (Integrated Watershed Management Programme)

LJKG3V

కరువు ప్రభావాలను తగ్గించటానికి ప్రభుత్వం కరువు పీడిత ప్రాంతాలలో సమగ్ర వాటర్‌షెడ్ యాజమాన్య పథకాలను (IWMP) అమలు చేస్తోంది. దీని ప్రధాన ఉద్దేశం ప్రజలలో నైపుణ్యాలను పెంపొందించి ప్రకృతి వనరులను సరిగ్గా ఉపయోగించు కునేలా చేయటం. సామర్థ్యాన్ని బట్టి నేలను ఉపయోగించుకోవటం ద్వారా నేల, నీటి వనరులను అభిలషణీయంగా వినియోగించుకోవచ్చు, వాటి దుర్వినియోగాన్ని అరికట్టవచ్చు. వాటర్‌షెడ్ కార్యక్రమంలో చేపట్టే ముఖ్యమైన పనులు పొలాల్లో వాననీటి సంరక్షణ, అడవుల పెంపకం, తక్కువనీళ్లు అవసరమయ్యే చెట్లు/ పంటలను ప్రోత్సహించటం, ప్రత్యామ్నాయ జీవనోపాధులు మొదలైనవి.

### మీరు నీటిని ఆదా చేసేవారా, వృథా చేసేవారా?

కింది ప్రశ్నల ఆధారంగా మీరు నీటిని పొదుపు చేస్తున్నారో, వృథా చేస్తున్నారో తెలుసుకోండి. మీరు నీటి నాయకుడో (హీరో), ప్రతినాయకుడో (విలన్) తెలుసుకోండి.ఎంతనీటిని పొదుపు చేయవచ్చో తెలుసుకోండి.

| కృత్యం | వినియోగదారు 1 (లీటర్లు) | వినియోగదారు 2 (లీటర్లు) | మీ వాడకం (లీటర్లు) |
|---|---|---|---|
| పళ్లు తోముకోవటం | నల్లా వదిలిపెడితే (19) | బ్రష్ను తడుపుకుని నల్లా కట్టేసి వాడితే (2) | |
| కూరగాయలు కడగటం | నల్లావదిలి దానికింద (11) | పాత్రలో నీళ్లునింపి కడిగితే (2) | |
| అంట్లు కడగటం | నల్లావదిలి దానికింద (114) | కడిగి, పాత్రలో తొలిపితే (19) | |
| మరుగుదొడ్డికి వెళ్లిన తరవాత | ట్యాంకును బట్టి (20) | ట్యాంకులో సీసా ఉంచితే (15) | |
| గడ్డం చేసుకోవటం | నల్లా వదిలిపెడితే (18) | మగ్గుతో నీళ్లు (0.5) | |
| షవర్‌తో స్నానం | నీళ్లువదిలి ఉంచితే (95) | ఒళ్లు తడుపుకుని, సబ్బు వదిలేలాకడుక్కుంటే (15) | |
| కారు/మోటారుసైకిలు/ బట్టలు ఉతకటం (వాషింగ్ మెషిన్‌తో) | పైపుతో నీళ్లు వదిలి (400/50/20) సైకిలు కడగటం పూర్తిగా నీళ్లునింపి (227) | బక్కెట్టుతో (40/20/10) కనీస స్థాయికి నీళ్లు నింపి(102) | |
| గచ్చు కడగటం<br>చేతులు,ముఖంకడగటం<br>మొత్తం | 5 నిమిషాలపాటు పైపు వదిలి (200)<br>నల్లా వదిలిపెడితే (8)<br>– | బక్కెట్టుతో (40)<br>తడుపుకుని, కడుక్కుంటే (4)<br>– | |

మీరు వాడుతున్న నీటిని పట్టికలో నింపి మొత్తం కూడండి, మీరు ఏ స్థానంలో ఉన్నారో తెలుసుకోండి.

- 200 లీటర్ల కంటే తక్కువ – పర్యావరణ హీరో
- 201 – 400 లీటర్లు – నీటి పొదుపరి
- 401 – 600 లీటర్లు – నీటి ఖర్చుదారు
- 600 లీటర్ల కంటే ఎక్కువ – నీటి విలన్

LJSQFP

## కీలక పదాలు

1. పలు ప్రమాదాల ప్రాంతం 2. మానవ నిర్మిత ప్రమాదం 3. కరువు 4. పురుగుల సమస్య 5. పర్యావరణ క్షీణత

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. మీ ప్రాంతంలో సంభవించిన లేదా టీవీలో చూసిన ప్రకృతి వైపరీత్యాలను, జరిగిన నష్టాన్ని చెప్పండి. నష్టాన్ని తగ్గించాలంటే ఏ ఏ చర్యలు చేపట్టాలో తెల్పండి. $AS_4$
2. వైపరీత్యాలను ఎలా నివారించవచ్చు, ఎలా ఎదుర్కోవచ్చు? $AS_1$
3. వైపరీత్యాలకు సంబంధించి పెద్దవాళ్ల అనుభవాలు, వాటిని ఎలా ఎదుర్కొన్నారో తెలుసుకుని వాటి గురించి రాయండి. $AS_3$
4. ప్రజలు విపత్తులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను సూచించండి. $AS_4$
5. కరవు ప్రభావాలను పేర్కొనండి. $AS_1$
6. నీటి వృథా జరిగే సందర్భాలను పేర్కొని, దాని నివారణకు మార్గాలను సూచించండి. $AS_6$
7. ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన చిత్రాలతో ఆల్బమ్ తయారుచేయండి. $AS_3$

## విద్యా ప్రమాణాలు

**పాఠంలోని అంశాలు విద్యార్థులకు అర్థమయ్యేందుకు తగినంత సమయం వెచ్చించాలి. మధ్యమధ్యలో ఉన్న ప్రశ్నలు ఇందుకు ఉపయోగపడతాయి. ఇవి భిన్నమైన ప్రశ్నలు: హేతువు, కారణ-కార్యం, సమర్థన, మేథోపటం/ భావనల పటం, పరిశీలన, విశ్లేషణ, ఆలోచన, ఊహ, సమాలోచన, వ్యాఖ్యానం వంటి వాటికి సంబంధించినవి. ముఖ్యమైన భావనలను ప్రతి అధ్యాయంలోనూ ఉదాహరణలతో చర్చించారు, కీలక పదాలుగా కూడా ఇచ్చారు.**

**1) విషయావగాహన:** విచారణ, చర్చ, సమాలోచనలు, కేస్ స్టడీల ద్వారా ఉదాహరణలు, వ్యాఖ్యానం, పరిశీలనవంటి వాటి ద్వారా మౌలిక భావనల అధ్యయనాన్ని ప్రోత్సహించటం.

**2) పాఠ్యాంశాన్ని (ఇచ్చిన) చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించటం:** అప్పుడప్పుడూ నేరుగా భావనలను తెలియచేయని రైతుల, కార్మికుల కేస్ స్టడీలు, కొన్ని చిత్రాలు ఉంటాయి. వీటిని అర్థం చేసుకోవటానికి, చిత్రాలను వ్యాఖ్యానించటానికి విద్యార్థులకు తగినంత సమయం ఇవ్వాలి.

**3) సమాచార నైపుణ్యాలు:** సామాజిక శాస్త్రాల విధానాలన్నింటినీ కేవలం పాఠ్యపుస్తకాలు చర్చించలేవు. ఉదాహరణకు పట్టణ ప్రాంతంలో ఉన్న పిల్లలు తమ ఎన్నికైన ప్రజా ప్రతినిధుల గురించి, పల్లెప్రాంతాలలో ఉండే పిల్లలు తమ ప్రాంతంలోని చెరువు/ సాగునీటి సౌకర్యాల గురించి సమాచారం సేకరించవచ్చు. ఈ సమాచారమూ, పాఠ్యపుస్తకాలలో ఇచ్చినదీ ఒకటిగా ఉండకపోవచ్చు, దీనిని వివరించాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు సేకరించిన సమాచారాన్ని తెలియ చెప్పటం కూడా ముఖ్యమైన సామర్థ్యం అవుతుంది. ఉదాహరణకు చెరువుకు సంబంధించి సమాచారం సేకరిస్తే లిఖిత నివేదికతోపాటు చిత్రం లేదా పటం జోడించవచ్చు. సేకరించిన సమాచారాన్నే చిత్రాలు, గోడ పత్రికల రూపంలో ప్రదర్శించవచ్చు. సమాచార సేకరణ, క్రోడీకరణ, విశ్లేషణ వంటివి కూడా సమాచార నైపుణ్యాలు అవుతాయి.

**4) సమకాలీన (సామాజిక/ సాంఘిక) అంశాలపై ప్రతిస్పందన – ప్రశ్నించటం:** తమ జీవన ప్రమాణాలను వివిధ ప్రాంతాల, వివిధ కాలాల ప్రజల జీవన ప్రమాణాలతో పోల్చేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. ఈ పోలికల సందర్భంలో తలెత్తే ప్రశ్నలకు ఒకే సమాధానం ఉండకపోవచ్చు.

**5) పటనైపుణ్యాలు:** ఈ పాఠ్యపుస్తకంలో వివిధ రకాల పటాలు, చిత్రాలు ఉన్నాయి. ప్రదేశాలకు సంబంధించి పటాలు నైరూప్య చిత్రణలు అని అర్థం చేసుకుని దానికి సంబంధించి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి. దీంట్లో వివిధ దశలు ఉన్నాయి. గత తరగతుల్లో ఎత్తు, దూరాలను పటంలో ఎలా చూపించాలో తెలుసుకున్నాం. సమతల ఎత్తుల గురించి ఈ తరగతిలో తెలుసుకుంటాం. పాఠ్యపుస్తకంలో వివిధ చిత్రాలు, ఫోటోలు, గోడ పత్రికలు ఉన్నాయి. ఇవి కేవలం అందం కోసం పొందుపరచినవి కావు, పాఠానికి సంబంధించినవి. చిత్రాలకు సంబంధించి కూడా కొన్ని కృత్యాలు ఉన్నాయి.

**6) ప్రశంస/ అభినందన – సున్నితత్వం:** భాష, సంస్కృతి, కులం, మతం, స్త్రీ-పురుషుల విషయాలలో మన దేశంలో ఎంతో వైవిధ్యత ఉంది. సామాజిక శాస్త్రం ఈ వైవిధ్యతలను పరిగణనలోకి తీసుకుంటుంది, వీటి పట్ల సున్నితత్వం ప్రదర్శించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తుంది.

## విద్యా ప్రమాణాలు – నమూనా ప్రశ్నలు

### I. విషయావగాహన:

1. టాలమీ లేదా ఇద్రిసీ తయారు చేసిన పటాలకు బ్రిటిష్ వాళ్ళు తయారు చేసిన పటాలకు మధ్యగల తేడాలు ఏమిటి?
2. ఢిల్లీ, ముంబయి నగరాలు సముద్రమట్టం నుంచి 300 మీ॥ ఎత్తుకు దిగువనే ఉంటాయి. అయినా వాటి నెలసరి సగటు ఉష్ణోగ్రతలో తేడాలు ఎందుకు ఉంటున్నాయి? ఈ రెండు నగరాలలో ఏ నెలలో సగటు ఉష్ణోగ్రతలో తేడా ఉంది? ఎందుకు? ఈ రెండు నగరాలలో ఏ నెలలో సగటు ఉష్ణోగ్రతలు దాదాపు ఒకేవిధంగా ఉంటాయి? వాటి కారణాలు వివరించండి?
3. డబ్బు మార్పిడిని చెక్కులు ఏ విధంగా సులభతరం చేశాయి? సొంతమాటల్లో వివరించండి.
4. వరికోత యంత్రాలు వినియోగించడంలో గల ప్రయోజనాలు ఏమిటి? వీటివల్ల ఎవరికి ఎక్కువ ప్రయోజనం చేకూరుతున్నదని భావిస్తున్నారు?
5. స్వాతంత్ర్యోద్యమ సమయంలో జమిందారులు సాధారణంగా బ్రిటిషు ప్రభుత్వానికే మద్దతు ఇచ్చారు. దీనికి గల కారణాలు ఏమిటి? మీ అభిప్రాయాలు తెలుపండి.
6. ఒకే మతానికి చెందిన వారంతా ఒకే రకమైన దృక్పథాలను కలిగి ఉంటారా? ఒకవేళ భిన్న దృక్పథాలు కలిగి ఉంటారని మీరు భావిస్తే తగిన ఉదాహరణలతో వివరించండి.

### II. పాఠ్యాంశాన్ని (ఇచ్చిన) చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించటం:

1. పేజి నెం.18, 19లోని 'సూర్యుని కిరణాలు, సౌరశక్తి' అనే ఉప శీర్షిక కింద గల 'భూగోళంపై శక్తికి సూర్యుడు మూలవనరు ........................ దీనిని మనం చూడలేం, అనుభూతి చెందలేం' అనే పేరాను చదవండి. ఈ పేరాలోని విషయాన్ని సొంతమాటల్లో రాయండి.
2. పేజి నెం.33లోని 'మారుతున్న కాలాలు' అనే ఉప శీర్షిక కింద గల 'అనేక చెట్లు జంతువులతో ............................ వానలు పడుతూ ఉంటుంది.'

   పై పేరాలోని ముఖ్యమైన లేదా కీలకమైన ఐదు అంశాలను రాసి, వాటి గురించి వివరించండి.
3. పేజి నెం.99లోని 'కొత్త నైపుణ్యాలు, కొత్త ఉద్యోగాలు' అనే ఉప శీర్షిక కింద గల పేరాను చదవండి. ఈ పేరాను చదవడం ద్వారా మీరు గ్రహించిన మూడు ముఖ్యమైన అంశాలను రాయండి. ఈ అంశాలతో మీరు ఏకీభవిస్తున్నారా? విభేదిస్తున్నారా? ఎందుకో తెలపండి.
4. 148వ పేజిలోని తెలంగాణ పోరాటంలో మహిళలు అనే విషయాన్ని చదవండి. మహిళలు తెలంగాణ పోరాటంలో పాల్గొనడానికి గల కారణాలు ఏమై ఉంటాయో మీ సొంతమాటల్లో రాయండి.
5. 156వ పేజిలో ఇచ్చిన మన రాజ్యాంగం యొక్క పీఠికను చదవండి. దీనిలో పొందుపరచిన విలువలు ఏవి? ఒక్కొక్క విలువ గురించి మీ సొంతమాటల్లో వివరించండి.
6. పేజి నెం.165లోని మూడవ పేరా 'ఈ ఎన్నికలు చీకటిలో ముందుకు దూకటం వంటిది ........................ కాబట్టి ప్రజాస్వామికంగా ఎన్నికలు జరపటం సాధ్యం కాదు' ఈ విషయంతో మీరు ఏకీభవిస్తున్నారా? ఎందుకు? కారణాలు రాయండి.

## III. సమాచార నైపుణ్యాలు:

1. ప్రాచీన గ్రీకుల కాలం నాటికి, నేటికి పటాల వినియోగంలో మార్పులు వచ్చాయని భావిస్తున్నారా? అయితే వీటికి గల పోలికలు, తేడాలను పట్టిక రూపంలో వివరించండి.
2. పేజి నెం. 189లోని భూకమతాలు సమాచార పట్టికను పరిశీలించండి. 1956 నుండి 2006 వరకు వచ్చిన మార్పులను రాయండి.
3. మీ పరిసర ప్రాంతాలలో వివిధ మతాల వారున్నారా? అయితే వీరికి సంబంధించిన మతాచారాలను సేకరించండి. ఈ వివరాలను పట్టిక రూపంలో రాసి ప్రదర్శించండి.

## IV. సమకాలీన (సామాజిక/ సాంఘిక) అంశాలపై ప్రతిస్పందన - ప్రశ్నించటం:

1. మీ ప్రాంతంలో అటవీ చట్టాల అమలు తీరు ఎలా ఉంది? ఇలా చట్టాలు ఉన్నాకూడా అడవులు అంతరించిపోవడానికి గల కారణాలు ఏమైఉంటాయి?
2. మీ గ్రామంలో స్వయం సహాయక బృందాలు ఉన్నాయా? స్వయం సహాయక బృందాల ద్వారా నిజంగానే సభ్యులకు మేలు జరుగుతున్నదని భావిస్తున్నారా? సకారణంగా విశ్లేషించండి.
3. ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాకూడా ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఎందుకు ఆశ్రయిస్తున్నారు? దీనిపై మీ అభిప్రాయం తెలుపండి.
4. మన రాజ్యాంగంలో చాలా విలువలు పేర్కొనబడ్డాయి. ప్రతి ఒక్కరు వీటిని అలవరచుకోవలసి ఉంటుంది. అయితే నేటి కాలంలో ఇవి మన సమాజంలో ఏమేరకు చోటుచేసుకుంటున్నాయి? ఇందుకు గల కారణాలు ఏమై ఉంటాయి?

## V. పట నైపుణ్యాలు:

1. అట్లాస్‌లో ఏవైనా రెండు ప్రదేశాలను ఎంచుకోండి. ఆ రెండు ప్రదేశాలలోని ప్రజల జీవన విధానాలను పోల్చండి.
2. ప్రపంచ పటంలో టండ్రాప్రాంతాన్ని గుర్తించండి. ఆ ప్రాంతంలో గల ముఖ్యమైన దేశాలను రంగులతో గుర్తించండి.
3. భారతదేశ పటంలో కింది వానిని గుర్తించండి.

   అ) గంజాం ఆ) అవధ్ ఇ) హైద్రాబాదు ఈ) గోదావరి నది

4. పాఠంలోని హైదరాబాదు రాష్ట్రపటాన్ని పరిశీలించండి. నేటి మనరాష్ట్ర పటంతో దీన్ని పోల్చండి. తేడాలను రాయండి.

## VI. ప్రశంస/ అభినందన - సున్నితత్వం:

1. నేటి ఆధునిక కాలంలో పత్రికలు పోషించాల్సిన పాత్రను వివరిస్తూ పత్రికా సంపాదకునికి ఒక లేఖ రాయండి.
2. నీటి నిలువ ప్రాధాన్యం తెలుసుకున్నారు కదా! మీవాడ లేదా గ్రామంలో ప్రతి ఇంట్లో కూడా నీరును వృథా చేయకుండా నిలువ చేయాలని తెలియజేసేలా ఒక పోస్టరు తయారుచేయండి.
3. కళలు, కళాకారుల యొక్క గొప్పతనం ఏమిటి? వీరిని మనం ఏ విధంగా గౌరవించాలి?
4. రాజ్యాంగ పీఠికలోని విలువల ఆధారంగా ప్రతీ ఒక్కరు ఆచరించాల్సిన విలువల గురించి కొన్ని నినాదాలు తయారు చేయండి.
5. స్వాతంత్ర్యానికి పూర్వం మన రాష్ట్రంలో ఆంధ్రమహాసభ విద్యావ్యాప్తికి చేసిన కృషి గురించి తెలుసుకున్నారు కదా! నేటి కాలంలో విద్యావ్యాప్తి గురించి విద్యార్థులుగా ఏమేమి పనులు చేపట్టవచ్చో తెలపండి.

***